# విదేశగమ్మత్తు

కథాసంకలనం

తాటికొండ.కె.శివకుమార శర్మ



ప్రచురణలు

# విదేశ గమనే

(కథా సంకలనం)

తాడికొండ కె. శివకుమార శర్మ

అజో-విభో-కందాళం ఫౌండేషన్
A NOT - FOR - PROFIT - TRUST
ప్రచురణలు

**VIDESHA GAMANE**

First Edition : January 2016

© Author

*Illustration :*
Bali

*Cover Design:*
Pukkalla Ramakrishna

*Published by:*
Ajo Vibho Kandalam Foundation
3-3-24/1/A, First Floor,
Ekbote House, Opp: Vysya Hostel,
Kachiguda X Roads,
Hyderabad - 500 027
Ph: 040-64512224, 40179673

*For Copies:*
AVK Foundation
All Popular Book Shops

*DTP & Type Setting :*
V. Srihari

*Printed at :*
Karshak Printers, Vidya Nagar, Hyderabad

Price : Rs. **150/-**

# కొత్త వాకిళ్లను తెరచిన కథకుడు

అజో–విభో–కందాళం ఫౌండేషన్ చారిగారి మూలంగా శివకుమార్ పరిచయమయ్యారు. ఆయన తెచ్చి ఇచ్చిన 20 కథలను ఒక్కచోట, ఒక్కమారుగా చదవగలిగే అవకాశం దొరికింది. శివకుమార్ కథలను ఫౌండేషన్ ఒక సంపుటిగా వెలువరిస్తోందని చారిగారు తెల్పారు. కథలకు పరిచయ వాక్యాలు రాయమన్నారు. ప్రాచీన, ఆధునిక తెలుగు సాహిత్యాలకు వారధిగా నిలుస్తున్న అజో–విభో–కందాళం ఫౌండేషన్, శివకుమార్ కథలను వెలువరిస్తున్నందుకు అభినందించాలి. పరిచయం రాయమని అడిగినందుకు సంతోషం కలిగింది సంకోచంతో పాటుగా.

సంపుటిలో 20 కథలున్నాయి. ఇవి 2004 - 2015 మధ్య వచ్చినవి. తాను ఇంతవరకు రాసిన 40 కథలనుంచి ఎంపిక చేసిన మొదటి కథల సంపుటి ఇది. కథలను చదువుతున్నప్పుడు, భారతీయ వలస రచయితలు, తెలుగు అమెరికన్ వలస రచయితలు మనసులో మెదలుతూనే ఉన్నారు– శివకుమార్ కథల వస్తు శిల్పాలను గురించిన ఆలోచనలు, స్పందనలతో పాటుగా.

తమ పూర్వులో, తామో వచ్చిన మాతృభూమిపట్ల మమకారం, భావప్రేరణలు వలస రచయితలకు ఒకవైపు ఉంటాయి. మరొకవైపు స్వ / పర దేశంపట్ల గౌరవాభిమానాలు, పూర్తిగా ఇమిడీ ఇమడని తత్వం ఉంటాయి. వలస జీవితాల్లో ఎన్నెన్నో ఒడిదుడుకులూ, గజిబిజి మనస్తత్వం ఉండటం కూడా సహజం. భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక పరమైన ఒత్తిడులు ఉండటం కూడా అంతే సహజం. ప్రాదేశికపరమైన వైరుధ్యాలూ, అస్తిత్వగతమైన మానసిక ఘర్షణలూ వలస జీవితానికి తప్పనిసరి. గతం, వర్తమానం, భవిష్యత్తు ఈ మూడింటి లంకెలను వలస జీవనంలో ఏ రకంగా కూర్చుకోవాలో అనే విచికిత్స నిరంతరం ఉంటుంది. భావుకులైన రచయితలు ఈ సంవేదనను సృజనాత్మక వచన రచనలైన కథల్లో, నవలల్లో చిత్రించటానికి ప్రయత్నిస్తారు. ఈ ప్రయత్నం వల్ల తెలుగు సాహిత్యంలో ప్రవాస

జనజీవన చిత్రణ ఒక పాయగా ఏర్పడుతుంది. ఈ రకమైన స్పృహనూ, చింతననూ, శివకుమార్ కథలు పాఠకులకు కలుగచేస్తున్నందుకు సంతోషం. చాలామంది తెలుగు పాఠకులకు దరిచేరని కొత్త కథావస్తువులనూ, పాత్రలనూ, నేపథ్యాలనూ రచయిత తన కథల్లో చిత్రించాడు. శివకుమార్ అనుభవ రచనలు ఇవి. వీటివల్ల తెలుగునేల, అమెరికా గడ్డ తీరుతెన్నులు కొంతైనా అవగత మవుతాయి. రెండు ప్రదేశాల్లో జరిగిన, జరుగుతున్న సామాజిక పరివర్తన మూలాలు తెలిసివస్తాయి. ఈ పరివర్తనలోని ఘర్షణ తెలిసివస్తుంది.

శివకుమార్‌కు పౌరాణిక, ఐతిహాసిక, జానపద సాహిత్యధోరణుల, వారసత్వాల అవగాహన ఉంది. ప్రాచ్య, పాశ్చాత్య సంస్కృతుల్లోని భేదాల శాస్త్రీయ పరిశీలన ఉంది. తెలుగు భాషమీద గట్టి పట్టు ఉంది. ప్రకృతి, పర్యావరణం పట్ల ప్రేమ ఉంది. కథల్లో ప్రస్తావనకు వచ్చే అమరకోశం, భర్తృహరి సుభాషితాలు, స్తోత్రాలు, నామావళి, సూక్తులు, పూజావిధానాలు, శతకాలు, కావ్యాలలోని ఉల్లేఖనలు శివకుమార్ సంప్రదాయ ప్రీతినీ, తెలుగు భాషానురక్తినీ తెలియచేస్తాయి. ఇతివృత్త స్వీకరణలో, పాత్రచిత్రణలో కనిపించే వైవిధ్యం ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తుంది. ఇది ఒక పార్శ్వం మాత్రమే.

రెండు భిన్న ప్రపంచాల్లోని జీవిత సమస్యలను – అక్కడి, ఇక్కడి కుటుంబాల్లోని పిల్లలు, నవయవ్వనులు, యవ్వనులు, మధ్యవయస్కులు, వృద్ధుల ఆలోచనలనూ, అలవాట్లనూ, చదువులనూ, అందుబాట్లోని సాంకేతిక సదుపాయాలనూ, రకరకాల ఆటలనూ, వైవాహిక విధానాలనూ, ధర్మాలనూ, సహజీవన పద్ధతులనూ, పెంపకం పద్ధతులనూ, తరాల మధ్య అంతరాలనూ, ఉద్యోగాలనూ, సరికొత్త వృత్తిభృతులనూ శివకుమార్ తన కథల్లో చిత్రించడానికి ప్రయత్నించారు. “ఇట్ టేక్స్ ఎ విలేజ్” లోని పదమూడేళ్ల శారా / శారద అనుభవంలో కూచిపూడి టీచర్లున్నారు. అమెరికన్ ఆఫీసర్ జాన్సన్ ఉన్నాడు. ఆడపిల్ల మీద చెయ్యిచేసుకునే తండ్రులున్నారు. అయినా అమెరికా జీవనంలో శారాలాంటి పిల్లలకు ఇట్ టేక్స్ ఎ విలేజ్. “థాంక్స్ టు టెక్నాలజీ”, “స్టిల్ ఏన్ ఇండియన్”, “పెళ్లంటే” కథల్లోని జీవితచిత్రణ ఇప్పటి ప్రవాస తరాల్లోని వైజ్ఞానిక, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులనూ, సహజీవన సమస్యలనూ, జోడు తోడు మర్మాన్నీ తెలియపరుస్తాయి. ఇవి అచ్చమైన ప్రవాసి జీవితకథలు.

సమకాలిక తెలుగు రాజకీయాలు, చలన చిత్రాల్లోని దిగజారుడుతనాన్ని “ఊహాతీతం,” “టెల్గు సినిమా తీద్దాం రా”లో రచయిత వ్యంగ్యంలో చిత్రించాడు. ఇవి తన జన్మభూమిలో జరుగుతున్న పరిణామాలను insider - outsider దృష్టి నుంచి రాసినవి.

కథలన్నిటిని పరిచయం చేయడం లేదా సమీక్షించడం ఇక్కడ చేయడంలేదు. రచయితగా శివకుమార్ అంతస్తత్వమేమిటో తెలుసుకోడానికి ఒక పాఠకుడిగా చేస్తున్న ప్రయత్నం మాత్రమే ఇది.

ఈ సంపుటిలో విలక్షణంగా కనిపించే రెండు కథలు "రహస్యం," "స్వాభిమానాభివృద్ధి వ్రతకథ." "రహస్యం"లో అర్జునునికి తప్ప మిగిలిన వారందరికీ హ్రస్వదృష్టి ఉందనే విషయం ద్రోణుడు మాత్రమే గ్రహించాడు. ఇది మరెవరికీ తెలియదు. "స్వాభిమానాభివృద్ధి వ్రతకథ," "నేనే అందరికన్నా గొప్పవాణ్ణి, నామాటే అందరూ వినాలి" అనే తత్వాన్ని ఎండగట్టిన కథ. ఐతిహాసిక సన్నివేశాలను పునర్లిఖించిన కథలు ఇవి. భేతాళ కథలను జ్ఞాపకం చేస్తాయి. వివేచనకూ, తర్కబద్ధమైన ఆలోచనలకూ పురిగొల్పే రచనలు ఇవి. రచయిత సంగీతానురక్తిని తెలియచేసే కథ "ది లోన్ డ్రమ్మర్."

శివకుమార్ కథన వైవిధ్యాల్ని కూడా ఈ కథలద్వారా మనం పరిశీలించవచ్చు. ఉత్తమ పురుష, ప్రథమపురుష కథన పద్ధతుల్నీ, నాటక రచనా పద్ధతినీ రచయిత కథల్లో అనుసరించాడు. శైలీ భేదాల స్పృహ ఉండటంవల్ల కథల్లో సృజన వైవిధ్యం తేగలిగాడు. వర్ణనాత్మక శైలినీ, కవితాత్మక శైలినీ కొన్ని కథల్లో అనుసరించాడు. ప్రధానంగా సంవాదాత్మక రచనల్లోని పాత్రల సంభాషణల్లో చాతుర్యం, తర్కకౌశలం, నైపుణ్యం కనిపిస్తాయి. రచయిత స్వయంగా నటుడు, నాటక రచయిత కావడం కూడా ఇందుకు దోహదం చేశాయి. కథలకు పెట్టిన ఇంగ్లీషు పేర్లు, మూడు నాల్గు కథల్లోని ఇంగ్లీషు సంభాషణలు గమనిస్తే రచయిత మిశ్రశైలిని సన్నివేశాన్ని బట్టి ఉపయోగించాడని తెలుస్తుంది. శివకుమార్ కంఠస్వరంలో తాటస్థ్యం, పరివేదన, పరిహాసం, వ్యంగ్యం ఇతివృత్తాలను అనుసరిస్తూ సాగాయి. ఈ కథల్లో స్థూలంగా రచయిత ప్రాపంచిక దృష్టి ఏమిటి? అనే ప్రశ్న పాఠకులకు ఆయా కథలు చదివాక కలగవచ్చు. కథల్లో చిత్రించిన సామాజిక సాంస్కృతిక జీవితాన్ని బట్టి ఆయనది ఏ దృక్పథమో, ఏ విలువలను ప్రతిపాదించడానికి ప్రయత్నిస్తున్నారో ఆలోచించవలసింది పాఠకులు. వాళ్ల ఆలోచనాశక్తిని ఈ కథలు గౌరవిస్తున్నాయి. చదవండి. ఈ వలస గాలులూ పీల్చండి.

ఇర్వింగ్, టెక్సాస్. కేతు విశ్వనాథరెడ్డి
18 సెప్టెంబర్ 2015

# గమనాన్ని గమనించే కథలు

తెలుగు వాళ్ల కిప్పుడు రెండు రాష్ట్రాలు యేర్పడ్డాయి. కానీ ఈ రెండు రాష్ట్రాల్లోని తెలుగువాళ్ల సంఖ్య యెంతో, అంతమంది తెలుగువాళ్లు రెండు రాష్ట్రాల బయట వున్నారు. తొలిరోజుల్లో చాలా చిన్న గొంతుగా ప్రారంభమైన వాళ్ల సాహితీస్వరం క్రమంగా పెరిగి 2000 నాటికి స్పష్టంగా వినబడసాగింది. తమిళనాడులోని హొసూరు నుంచి తెలుగు సాహిత్యం వెలువడడం ప్రారంభించాక గానీ, అక్కడి తెలుగువాళ్ల వునికీ, మనికీ యితరులకు తెలియలేదు. యిప్పుడు రాష్ట్రేతర ఆంధ్రులు తమదైన జీవితాన్ని సాహిత్యీకరించే పనిని నిర్దుష్టంగా చేసుకుపోతున్నారు. సమకాలీన సాహిత్య ప్రక్రియలన్నింటిలోనూ బలంగా వున్న కథానిక వాళ్ల వ్యక్తీకరణకు బాగా దోహదం చేస్తోంది. గత అయిదారేళ్లుగా అమెరికాలో స్థిరపడిన తెలుగువాళ్లు రాస్తున్న కథలు తెలుగు ప్రవాస జీవితాలను (Diaspora) ప్రతిభావంతంగా పరిచయం చేస్తోంది. అమెరికా ప్రవాస కథానికలకు యీ గుర్తింపును తీసుకొచ్చిన ముఖ్యమైన కథకుల్లో తాడికొండ శివకుమార శర్మగారు వొకరు. గత దశాబ్దకాలంలో ఆయన రాసిన యీ యిరవై కథలను యిప్పుడు ఓ సంపుటి రూపంలో చదివినప్పుడు ఆయన యీ పనిని యెంత సాధికారంగా, ప్రతిభావంతంగా చేసారో స్పష్టంగా అర్థమవుతుంది.

అమెరికా దేశం యిప్పటికీ పూర్తిగా పరిణామాన్ని పొందని (Melting pot అంటారు) దేశం. వివిధ దేశాలవాళ్లతో, రకరకాల జాతులవాళ్లతో కలిసి అదొక సంక్లిష్టమైన మానవ సమాజంగా తయారవుతోంది. వుద్యోగాల్ని వెతుక్కుంటూ అక్కడికి వెళ్లిన భారతీయులు గూడా అక్కడి సమాజంలో భాగమైపోక తప్పదు. వాళ్ల పిల్లలు అమెరికన్లే అవుతారు. భారతీయతను మరవలేని తొలితరం వాళ్లకూ, కొత్త దేశీయత చేత తయారు చేయబడిన మలితరం వాళ్లకూ మధ్య సంఘర్షణలు తలెత్తక తప్పదు. యిండియానుంచీ వెళ్లిన తండ్రి తన కూతురు హార్వర్డులో చదవాలనీ, చదరంగంలో గ్రాండ్ మాస్టర్ కావాలనీ కోరుకోవడం

సహజం. కానీ అమెరికనయిజయిన ఆ అమ్మాయి యెంట్రెన్సుటెస్టు కోచింగుకు వెళ్లననీ, టెన్నిస్ ఆడడం మాననని మొరాయిస్తుంది. తన కూతురు కూచిపూడి నాట్యం నేర్చుకోవడానికీ, వయిలెన్ సాధన చేయడానికీ అతను అంగీకరించకపోవడానికి గూడా భారతదేశంలో సంగీతానికున్న నిరాదరణే కారణమని అతను గుర్తించలేడు. కానీ తమ యిష్టాయిష్టాలను తమ పిల్లలపైన రుద్దడం అమెరికాలో సాగదు. వాళ్లో ఫోన్ చేస్తే పోలీసులు తల్లిదండ్రులను 'అట్రాసిటీ' కేసుమీద అరెస్టు చేసి పారేస్తారు. అలిగిన పిల్లలు కోపంతో కాస్సేపు కనిపించకపోతే అమెరికాలోని తల్లిదండ్రులు రకరకాల అనుమానాలతో భయభ్రాంతులవుతారు. చివరకు అక్కడి అమెరికన్ పోలీసు గూడా అలిగి వెళ్లిపోయిన పద్నాలుగేళ్ల అమ్మాయితో "నా కిద్దరు పిల్లలు. ఇద్దరూ నీ కంటే పెద్దవాళ్ళే. ఐ కెన్ టెల్ యు దట్ బిహైండ్ దట్ క్లౌడ్ ఆఫ్ మాడ్‌నెస్ దేర్ యీజ్ ఎ సన్ కాల్డ్ లవ్. ది క్లౌడ్ ఈజ్ టెంపరరీ. ఇట్ విల్ క్లియర్. నీ విషయంలో అది ఈ పాటికి క్లియర్ అయిపోయింది. ఐ విల్ ప్రూవ్ ఇట్ టు యూ... టునైట్ – ఇన్ టెన్‌మినిట్స్. ఫస్ట్ ఐ షుడ్ కాల్ దెమ్... ముందుగా మీ నాన్న నెంబరు నాకివ్వు... మీ అమ్మాయి ఒక అంకుల్ని తీసుకు వస్తోందని చెబుతాను" అంటాడు.

భారతదేశంలో పిల్లలకు తల్లిదండ్రులతోబాటూ బంధువులూ, స్నేహితులూ, వుపాధ్యాయులూ వుంటారు. ముఖ్యంగా తాతలూ, అమ్మమ్మలూ, నాన్నమ్మలూ, బాబాయిలూ వుంటారు. యెన్ని రకాల గొడవలున్నా వొక సమాజం గూడా వుంటుంది. వాళ్ల వెనకో వూరు వూరే వుంటుంది. యీ విషయాన్ని గుర్తించిన హిల్లరీ క్లింటన్ లాంటివాళ్లు "పిల్లల్ని పెంచాలంటే వొక వూరు వూరే కావాలి" అని చెబుతున్నారు. (ఆమె రాసిన పుస్తకం పేరు It takes a village). యీ విషయాన్ని అమెరికాలో జీవిస్తున్న తెలుగువాళ్లు సైతం ఆలస్యంగా గుర్తించడమే జీవితంలోని వైచిత్రి. యిటువంటి సంక్లిష్టమైన జీవన విధానాన్ని చిత్రించడానికి రచయితకు సునిశితమైన దృష్టితో బాటు నిర్మోహత (Detachment) కూడా వుండాలి. అప్పుడే "ది లోన్ డ్రమ్మర్" వంటి కథలు రాయగలుగుతారు. జీవితమే మూల సూత్రంగా, వాస్తవికతే ఆలంబనగా రాసే యిటువంటి కథలు చదువుతున్నప్పుడు కెనడా జీవన విధానాల్ని గుర్తించి కథలు రాసిన "ఆలిస్ మన్రో" గుర్తుకొస్తారు. ఆమె కథల్లో కూడా సిద్ధాంతాల కతీతమైన, సమీకరణలకు లొంగని, సంక్లిష్టమైన జీవనగతులు పాఠకుల్ని విస్మయుల్ని చేస్తూ వుంటాయి.

అమెరికాలో స్థిరపడిన తొలితరం భారతీయులు మాత్రం తమదైన సంస్కృతీ సంప్రదాయాలను మరవలేరు. అమెరికాలో చనిపోయిన తన తమ్ముడికి ఉదారంగా విరాళాల నిచ్చిన అమెరికన్ల రుణం తీర్చడం కోసం, వొక అన్న తానూ అమెరికాకు వెళ్లి, అక్కడే డబ్బు సంపాదించి, వాళ్లకు అప్పుతీర్చడానికే జీవితాన్నంతా వెచ్చిస్తాడు. (నాకు తెలిసిన

టెన్సింగ్ నార్కే). మరో వ్యక్తి తాను చనిపోయినప్పుడు తనని పూడ్చటం కోసం తన స్వగ్రామం నుంచీ 23 కిలోల మట్టిని (యిండియా నుంచి విమానంలో అమెరికాకు వెళ్ళేటప్పుడు 23 కిలోల బరువును మాత్రమే అనుమతిస్తారు) తీసుకెళ్తాడు. యింకోవ్యక్తి అమెరికాలో ఐటీ సాఫ్ట్‌వేర్ వుద్యోగాలు మారిపోయినప్పుడు, తనకు వారసత్వంగా వచ్చిన అర్చక వృత్తిని చేపట్టడానికి సందేహించడు.

వొకకప్పుడు ఈ పరిస్థితులకు భిన్నంగా తల్లిదండ్రులు అమెరికనయిజవడమూ, పిల్లల్లో పాతకాలపు బుద్ధులు మిగిలి వుండడమూ కూడా సంభవించవచ్చు. భర్త చనిపోయిన తర్వాత వొక భార్య తన వయసున్న మరోవ్యక్తితో కలిసి జీవించడం (Living together) మొదలెడుతుంది. అయితే ఆమె పిల్లలు మాత్రం అందుకు వొప్పుకోరు.

తానే వో కథలో చెప్పినట్టుగా శివకుమారశర్మగారు యిప్పటికీ, యెప్పటికీ భారతీయుడే (Still an Indian). విదేశాలకు వెళ్ళి స్థిరపడిన భారతీయ విద్యాధికులు తమ మాతృదేశంలోని జరిగే ప్రతివిషయాన్నీ అప్రమత్తతతో పట్టించుకుంటూనే వుంటారు. తమ దేశంలో మంచిని పెంచడం కోసం, చెడును రూపుమాపడం కోసం తమ శక్తులనంతా వినియోగిస్తారు. శర్మగారి లాంటి రచయితలు తమ జన్మభూమిలో జరుగుతున్న అరాచకాలను తూర్పార బట్టడం కోసం కథలు రాస్తూ వుంటారు. స్వార్థమూ, లంచగొండి తనమూ, దేశంలోని రాజకీయాల నెంతగా దిగజార్చాయో చూసి విలవిల లాడిపోతారు (స్వాభిమాన వ్రతం, సున్నాల పక్కన ఒకటి, ఊహాతీతం మొదలైన కథలు). దేశంలోని మంచిని చూసినప్పుడు పరవశమై పోతారు (రేపటి ఆశాకిరణాలు) తమ జీవితపు జ్ఞాపకాలను తలచుకున్నప్పుడు ఆనందంతో పులకించిపోతారు (పంచముఖి, ఆ నవ్వుకోసం). సార్వజనీనమైన సత్యాల అన్వేషణకు గూడా పూనుకుంటారు (రిచర్డ్ బాక్ నవలిక జొనాతన్ లివింగ్‌స్టన్ సీగల్‌ను జ్ఞాపకం చేసే ‘శిఖరాగ్రాన’, పంచముఖి, డెడ్‌మేన్ పేరడాక్స్).

శివకుమార శర్మగారి కథల్ని చదువుతున్నప్పుడు పాఠకుడు మళ్ళీ వొకసారి తన జీవితాన్ని గురించీ, తన ప్రపంచాన్ని గురించీ పునర్మూల్యాంకన చేసుకుంటారు. సాగివచ్చిన దూరాన్ని పరిశీలించి తన గమనమెలా సాగుతోందో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాడు. తనలోని లోపాల్ని వెదికిచూసి, తనను మరింత మంచి మానవుడిగా తయారు చేసుకోవడానికి సన్నద్ధమవుతాడు. వుత్తమ సాహిత్యానికింతకంటే మించిన ప్రయోజన మింకేముంటుంది?

తిరుపతి మధురాంతకం నరేంద్ర

5 అక్టోబరు 2015

# నా మాట

మరీ మొదటికెడితే –

రాజేశ్వరిగారూ, నాగమల్లయ్య గారూ, మధ్య నేను. అదే, "ఆ నవ్వుకోసం," "దానిమ్మ గింజలు" మధ్య.

రెండు చేతులతోనూ వాళ్లని దూరానికి నెడుతూ మధ్యలో నా ప్రపంచాన్ని ఏర్పాటు చేసుకున్నా నన్నమాట.

ఒక చేతికి నెట్టడాని కేమీ లేక, పట్టుకోవడానికి జ్ఞాపకాలు మాత్రం మిగిలి దశాబ్దం కావస్తోంది.

ఆ జ్ఞాపకాలు అపురూపాలే!

* * *

అదృష్టమంటే నాదే ననుకుంటూంటాను.

ఐఐటీ మద్రాసులో చారి – అదే, కందాళం వెంకట రామానుజాచారి – గారి పరిచయం స్నేహంగా మారడం, వారి ద్వారా అప్పాజోస్యుల సత్యనారాయణ గారు ఆత్మీయులవడం –

ఇరవయ్యేళ్ల వయసులో విదేశయానాన్ని ఊహించకుండానే కొన్నేళ్ల తరువాత అమెరికా వచ్చినా, ఈ శతాబ్దం మొదలయ్యేదాకా అసలు కథలు రాయాలనే లేని తలపు మొలకెత్తడం, ఆ మొలకలకి వెలుగునిచ్చిన సంపాదకు లుండడం –

ఆ రచనలని సుప్రసిద్ధ రచయితలు శ్రీ "వసుంధర" దంపతులు గత దశాబ్దంగా చదవడమే గాక వాటిని "రచన"లో విశ్లేషిస్తూ ప్రోత్సహించడం –

ఇరవైరెండేళ్లుగా ప్రతియేటా సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలని నిర్వహిస్తూ పలువురి ప్రశంసల నందుకుంటున్న అజో–విభొ–కందాళం ఫౌండేషన్ బానర్ మీద ఈ సంకలనాన్ని వెలువరించగలగడం –

సుప్రసిద్ధ రచయితలు శ్రీ కేతు విశ్వనాథరెడ్డిగారు, శ్రీ మధురాంతకం నరేంద్రగారు ముందుమాట రాయడం – మనసుని నింపిన మరెన్నో అదృష్టాలతోనూ, "ఆ నవ్వుకోసం," "దానిమ్మగింజలు"తోనూ కలగలిపిన గొప్ప అదృష్టం అన్నమాట!

* * *

ఒక్క "పెళ్లంటే"లో తప్పితే పత్రికల్లో ప్రచురింపబడ్డ ఈ కథల్లో పెద్దగా మార్పులేమీ జరగలేదు. "పెళ్లంటే"కి మాత్రమే పత్రికా వెర్షన్ లేకపోవడమే గాక అది ప్రచురింపబడ్డ ఏడాది తెలిసినా గానీ, తారీకు మాత్రం దొరకలేదు. అందుకని కొద్దిగా తేడాలుంటాయి.

– రచయిత

# కథాక్రమం


| | |
|---|---|
| 1. ఆ నవ్వుకోసం | 13 |
| 2. రహస్యం | 21 |
| 3. స్వాభిమానాభివృద్ధి వ్రత కథ | 29 |
| 4. సున్నాలపక్కన ఒకటి | 36 |
| 5. శిఖరాగ్రాన | 45 |
| 6. టెల్గు సినిమా తీద్దాం రా | 54 |
| 7. థాంక్స్ టు టెక్నాలజీ | 64 |
| 8. రేపటి ఆశాకిరణాలు | 71 |
| 9. ఊహాతీతం | 85 |
| 10. విదేశ గమనే విద్యా పరాదేవతా | 92 |
| 11. నాకు తెలిసిన టెన్సింగ్ నార్కే | 100 |
| 12. పంచముఖి | 109 |
| 13. ది లోన్ డ్రమ్మర్ | 120 |
| 14. 23 కిలోలు | 128 |
| 15. ఓ ప్రేమకథ | 135 |
| 16. పెళ్లంటే | 144 |
| 17. స్టిల్ ఏన్ ఇండియన్ | 160 |
| 18. ఇట్ టేక్స్ ఎ విలేజ్ | 169 |
| 19. డెడ్ మేన్ పేరడాక్స్ | 179 |
| 20. దానిమ్మ గింజలు | 201 |

# ఆ నవ్వుకోసం...

తనమంచంచుట్టూ నిలబడి ఉన్న భార్య మీనాక్షినీ, పిల్లలనీ, తల్లిదండ్రులనీ, అక్కాబావలనీ కలియజూశాడు వివేక్. యాక్సిడెంట్ తాలూకు దెబ్బలని అతని శరీరం ఇంకా ప్రతిఘటిస్తూనే ఉంది. కుడిచేతికి కట్టూ, తలకి దెబ్బా, వాచిన పెదవీ, ఆ ప్రతిఘటన తాలూకు నెప్పులూ కలిసి కనీసం రెండు వారాలు తనని మంచానికి కట్టిపడేసి ఉంచు తాయని అతనికి అర్థమయింది. మీనాక్షి నోటినించీ ఇంక ఆ ప్రశ్న వినక తప్పదన్న అతని నమ్మకం వమ్ముకాలేదు. ఇన్నేళ్ల అన్వేషణా ఫలించనందుకా లేక ఆమెకు నచ్చే జవాబు నివ్వక తప్పదని అర్థమైనందుకా తన కింత నీరసం ఆవహిస్తోంది అని వివేక్ ఆలోచిస్తున్నాడు.

* * *

ఒక మనిషికి సన్నిహితులు ఎగతాళికి పెట్టే ముద్దుపేరు ఆ వ్యక్తి ప్రత్యేకతనిబట్టీ, అతని వయసునిబట్టీ ఉంటుంది. ఆ ప్రత్యేకత హర్షణీయమో, ఘర్షణీయమో, తల తాడనీయమో, ఇల మోదనీయమో సమాజంలో అందరికీ బాగా ఎరుకే. ప్రత్యేకతల గూర్చి చూస్తే –

చదువుపిచ్చి – హర్షణీయం, పెళ్లికానంతవరకూ.

పేకాటపిచ్చి – ఘర్షణీయం, అన్ని వయసుల్లోనూ.

క్రికెట్‌పిచ్చి – తల తాడనీయం; ముందు తల్లిదండ్రులకీ, తరువాత పెళ్లానికి.

సినిమాపిచ్చి – ఇల మోదనీయం; ముఖ్యంగా పెళ్లైన తరువాత, భార్యనికూడా తీసుకెళ్లినప్పుడు.

ఈ ప్రత్యేకతలే కాలేజీలో చేరకముందే గనుక ఉంటే, ఆ వ్యక్తిని పుస్తకాల పురుగనో, పేకట / క్రికెట్ / సినిమా పిచ్చోడనో అంటారు.

వివేక్‌కి ఇప్పుడున్న ప్రత్యేకత అతను హైస్కూల్లో ఉన్న రోజుల్లోనే గనుక ఉండినట్లయితే, అతణ్ణి “గుళ్లపిచ్చో”డనేవారు. ఇప్పుడు మీనాక్షి మాత్రం, “మా ఆయనకి

గుళ్ల పిచ్చి" అంటుంది. పెళ్లికి ముందే గనుక ఈ పిచ్చి ఉన్నదని తెలిసి ఉండుంటే అతనితో తన పెళ్లి జరిగేది కాదని ఆమెకి తెలుసు. అతని హైస్కూలు రోజులనీ, కాలేజీ రోజులనీ, దాదాపు డిప్పకటింగ్ హెయిర్ స్టైల్‌తో, మొహమ్మీద విభూదీ, కుంకుమలతో, చెవిలో పూవుతో, చేతుల్లో కొబ్బరిచిప్పతో అతణ్ణి ఊహించుకుంటే ఆమెకు గగుర్పాటు కలుగుతుంది.

అలాగని వివేక్ ఇప్పుడూ ఆ గెటప్‌తో తిరుగుతున్నాడని కాదు, అతను పనిచేసేది మల్టీనేషనల్ కంపెనీ అవడం ఆ గెటప్‌కి అతణ్ణి దూరంగా ఉంచడం కారణమని, అది తన అదృష్టమనీ ఆమె నమ్ముతుంది. పెళ్లై, పిల్లలు పుట్టి, వాళ్లు ఉన్నత పాఠశాలల్లోనూ, జూనియర్ కళాశాలల్లోనూ చదువుతున్నప్పుడు, వ్రతాలూ,పూజలూ జనజీవన స్రవంతిలో కలిసిపోయిన వాళ్లకి మామూలే. యథావిధిగా జరుపుకోవాల్సిన వినాయకచవితి తప్ప ఇంటిల్లిపాదీ చేసుకోవాల్సిన పూజ లేమున్నాయట? మిగిలిన పండుగ లన్నింటికీ – జనవరి ఒకటితో సహా – గుడికెళ్లి, గంట కొట్టొచ్చేస్తే సరిపోదూ? మహా అయితే, ఓ కొబ్బరికాయ కొట్టో లేక అష్టోత్తరం చేయించో కొంచెం అధికఫలాన్ని కొట్టెయ్యొచ్చు. అవీ గాకపోతే, వైకుంఠ ఏకాదశినాడు సత్యనారాయణ వ్రతం, కార్తీకపౌర్ణమినాడు కేదారేశ్వర వ్రతం పూజారినే ఇంటికి పిలిచి చేయించుకోవచ్చు. వీటికి కంపెనీవాళ్లు ప్రత్యేకంగా సెలవు నివ్వకపోయినా, వివేక్ సెలవుపెట్టి పూజారిని పిలిపించి పూజలుచేస్తే ఆమె ఏనాడూ అడ్డుచెప్పలేదు కానీ, అతనికి ఈ గుళ్లపిచ్చేమిటోననే ఆమె బాధ.

కొందరు ఏడాది కోసారి తిరుపతి వెడతారు. ఇంకొందరు వీలైనప్పుడల్లా షిర్డీనో, లేక బాబా పుట్టిన రోజని పుట్టపర్తో వెడతారు. మరి, వివేక్? పెళ్లయి, పిల్లలు పుట్టిన తరువాతే అని గుర్తుంది గానీ, అతను ఎప్పుడు ఈ గుళ్లని వెదుక్కుంటూ వెళ్లడం మొదలుపెట్టాడో మీనాక్షికి సరిగ్గా గుర్తులేదు. మొదట్లో ఫలానా గుడి కెళ్లొచ్చానని చెప్పేవాడు. క్యాంపుల కెళ్లొచ్చి నప్పుడల్లా అతను ఆ గుడికీ, ఈ గుడికి వెళ్లొచ్చానని చెబితే ఆమె పట్టించుకోవడం మానేసింది గానీ, పిల్లలు ఊరుకుంటారా? తండ్రి కనపడడం ఆలస్యం, "విచ్ టెంపుల్ డిడ్ యు గో టు దిస్ టైం డాడ్?" అని అడగడం మొదలుపెట్టారు. క్యూరియాసిటీతో మొదలయిన ఆ ప్రశ్నలు కాస్తా వాళ్లు టీనేజర్లయ్యేసరికి – ముఖ్యంగా పెద్దవాడు ఇంటర్ పూర్తి జేసేసరికి– వ్యంగ్యపు రంగుని పులుముకున్నాయి. పోనీలే, ఆ గుళ్ల నించీ ఫొటోలూ, తాయెత్తులూ తేవట్లేదు, ప్రసాదాలు తేవడంతో సరిపుచ్చుకుంటున్నారు అని ఆమె నిట్టూరుస్తుంది.

మీనాక్షికీ, పిల్లలకీ కూడా చిరాకు పుట్టించిన విషయం– వాళ్లు ఏడాది కోసారి కుటుంబ సమేతంగా వెకేషన్ కని ఏ ఊరెళ్లినా అక్కడికి దగ్గరలో ఏ గుళ్లున్నాయో విచారించి, "ఎంత, మహా అయితే ఓ అరగంట" అంటూ వివేక్ వాటిని దర్శించడం.

మొదట్లో నసుక్కుంటూ అతనితో బాటు వెళ్లినా, తరువాత అతణ్ణి ఆపడానికి విఫల ప్రయత్నాలు చేసి, చివరికి, వాళ్లు హోటల్లో నిద్రలేచే సమయానికి అతణ్ణి ఆ దర్శనాలని పూర్తి చేసుకొమ్మన్నారు.

వివేక్‌కి గుళ్ల పిచ్చి పట్టడానికి కారణంగా ఎవరి నయినా మీనాక్షి చూపించగలిగితే, అది ఆమె అత్తగారు; మామగారు పెద్దగా పూజాపునస్కారాలని పట్టించుకోరని ఆమెకి పెళ్లయిన కొత్తలోనే అర్థమయింది. పైగా ఆయన భార్య పాటించే మడిని అపహాస్యం చెయ్యడం చూసింది కూడా– అది కూడా జోకుల రిపిటీషన్‌తో. అత్తగారు కూడా ఆ అపహాస్యాన్ని పట్టించుకున్నట్లేమీ మీనాక్షికి కనిపించలేదు. అత్తగారు పొద్దున్న వంట చేస్తూనే రకరకాల స్తోత్రాలని చదువుతుండేది. అలాగని తనని గానీ, అక్కయ్య శ్రీదేవిని గానీ వాటిని చదవమని ఆమె ఏమీ నిర్బంధించలే దంటాడు వివేక్. అప్పుడప్పుడూ తల్లి చదివే స్తోత్రాల్లో దొర్లే పదాలకి అర్థమేమిటని అడిగేవాడు. కొన్నింటికి ఆమె చెప్పేది. మరికొన్నింటికి మాత్రం, "ఏమో నాయనా, నాకు తెలియదు" అని జవాబిచ్చేది.

"అర్థం తెలియకుండా ఎందుకే వాటిని చదవడం?" అనేవాడు వివేక్.

"నువ్వు తెలుసుకుని చదువు. మా తరం అయిపోయింది" అనేదావిడ.

"నీకు వీటి అర్థం తెలియదంటే మీనాన్న బాధపడడే? పాపం, సంస్కృత పండితుట్ట! ఆయన్నే అడుగుదామంటే పంపించేశావాయె!"

"అది నా చేతుల్లో వుంటే నే నెందుకు పంపిస్తానూ? హయ్యో రామ!" అనేదావిడ.

మొదటిసారి ఈ సంభాషణని మీనాక్షి వినడం ఆమె పెళ్లయిన కొత్తల్లో. పెళ్లికి కూడా రాకుండా వివేక్ తాతగారు ఎక్కడికెళ్లారన్నది ఆమెకు మొదట అర్థంకాలా. అక్కడే ఉన్న అతని అక్కయ్య శ్రీదేవి, "ఎన్నేళ్లయినా మీరిద్దరూ ఈ డైలాగ్ సీక్వెన్స్‌ని ఎలా గుర్తుపెట్టుకుంటార్రా?" అన్నా కూడా. "నువ్వు ఈ డైలాగ్‌ని గుర్తుపెట్టుకోలా?" అన్నాడు వివేక్.

"మరి మీ తాతగారు పెళ్లికి రాలేదేం?" అన్నది మీనాక్షి. అందరూ గొల్లున నవ్వారు.

"ఆయనని రావద్దని చెబుతూ హాల్లో ఫోటోకి దండేశాం, చూళ్లేదా?" అన్నది శ్రీదేవి.

కొన్ని బుద్ధులూ, అలవాట్లూ తాతలవి మనవలకి అబ్బుతాయని మీనాక్షి వినకపోలేదు గానీ, వివేక్ తాతగారి గూర్చి ఆమెకి పెద్దగా తెలియకపోవడం వల్ల ఏ లక్షణాలు అబ్బాయో, ఏ గుణాలు వచ్చాయో, లేక రాబోతున్నాయో ఆమెకు తెలియలేదు కానీ, అతనిలోని ఒక గుణం మాత్రం ఆమెకి బాగా చిరాకుని కలిగిస్తుంది. అన్నీ అతనికే తెలుసుననుకుంటాడని అతనిమీద ఆమెకి కోపం కూడా.

ఒకసారి "తూర్పున సూర్యుడు ఉదయించినట్లు" అన్నది మీనాక్షి.

"తెలిసీ పలికిన విలువేమో" అన్న సముద్రాలవారి "చిగురాకులలో చిలకమ్మా" పాటలో సూక్తిని జీవనసూత్రంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నాడు గాబట్టి, "అంటే,

సంవత్సరంలో రెండుసార్లే నన్నంత అసాధారణంగానా?" అన్నాడు వివేక్. ప్రశ్నార్థకంగా పెట్టిన ఆమె మొహాన్ని చూసి, "సంవత్సరంలో ఒక సగం ఉత్తరాయణ కాలమనీ, రెండవ సగం దక్షిణాయన కాలమనీ విన్నావు గదా! ఆ ఏ ఒక్క సగంలోనూ సరిగ్గా ఒక్కరోజు మాత్రమే సూర్యుడు తూర్పున ఉదయించేది. అంటే, రెండు ఆర్నెల్ల కాలంలో, రెండు రోజు లన్నమాట! మిగిలిన రోజు లన్నింటిలో తూర్పుకి ఉత్తరానో లేక దక్షిణానో ఉదయిస్తాడు," అని విశదీకరించాడు.

"సూర్యుడు తూర్పున ఉదయిస్తాడనే వాళ్లంతా పిచ్చివాళ్లన్న మాట!" అన్నది మీనాక్షి కొంచెం కోపంగా.

"కాదు. తేలిగ్గా ఉంటుందని అంటారంతే. ఎవరయినా గానీ సూర్యోదయాన్ని కొన్నాళ్లపాటు రోజూ గమనిస్తే నిజాన్ని స్వయంగా తెలుసుకోవచ్చు!" అన్నాడు వివేక్.

"నేను సూర్యోదయానికి ముందు లేవనని తిన్నగా చెప్పొచ్చుగా!" అన్నదామె మూతి తిప్పుతూ.

ఇలా రెండుమూడు విషయాల గూర్చి "మీనాక్ష్యా ప్రతిబోధితాం" వివేకోక్తులని విన్న తరువాత, అతనుపక్రమించే ముందరే ఆమె రెండుచేతులనూ జోడించి, "నన్నొదిలెయ్యండి!" అనడం అలవాటు చేసుకుంది.

"ఆ నమస్కారాలు మాపూర్వీకులకి – అంటే మా తాతముత్తాతల కనేకాదు, భూమి సూర్యునిచుట్టూ తిరుగుతోంది అని కనుక్కున్న యాజ్ఞవల్క్యుడికి[1] కూడా!" అనేవాడు వివేక్.

"మీకు గుళ్లవెంట తిరిగే అలవాటుందా?" అనడిగింది మీనాక్షి ఒకసారి శ్రీదేవిని, వివేక్ కుటుంబసమేతంగా మామగారింట్లో ఉన్నప్పుడు.

"వీధి చివర గుడికి మీ మామగారిని తీసుకెళ్లడమే కష్టం. ఏదో పెళ్లిళ్ల మూలకంగా రెండుమూడుసార్లు ఆ తిరుపతి వెంకన్ననీ, బెజవాడలో చుట్టాలుండడం వల్ల ఆ దుర్గమ్మనీ చూడడానికి వీలైంది," అన్నది అత్తగారు.

"మరి ఈయనకి ఈ గుళ్లపిచ్చెక్కణ్ణించీ వచ్చింది?" అనడిగింది మీనాక్షి.

"ఏం గుళ్లు చూశావురా? మధుర మీనాక్షి?" అనడిగింది శ్రీదేవి కొంటెగా. "చెక్" అన్నది మీనాక్షి.

"కంచి కామాక్షి?" "చెక్". "కాశీ విశాలాక్షి?" "చెక్". "శ్రీశైలం భ్రమరాంబ?" "చెక్". "బెజవాడ కనకదుర్గ?" "చెక్".

"ఇతను చూడని గుళ్లని పట్టుకోవాలంటే అవుటాఫ్ ది ఆర్డినరీ గుళ్ల గూర్చి అడగాలి. అలంపురి జోగులాంబ?" అడిగాడు శ్రీదేవి భర్త.

[1]శతపథబ్రాహ్మణ: 8.7.3.10; http://www.astronomytrek.com/who-dicovered-the-eatrh-moves-around-the-sun/

"చెక్" అన్నది మీనాక్షి. "ఇంకా, మైసమ్మ, పోలేరమ్మ, అంకాళమ్మల్లాంటి వీధి చివర, చెట్ల కింద ఉండే గుళ్లని కూడా ట్రై చెయ్యండి. అంతెందుకు? ఊటీలో ఉన్న గుళ్లేవో మీకు తెలుసా? డెహ్రాడూన్లో? ఈయన అక్కడ కూడా హాజరు వేయించుకున్నారు" అన్నది మీనాక్షి.

"వెళ్లిన గుళ్ల వివరా లన్నింటినీ, ఎప్పుడు ఏ గుడిని చూశావో రికార్డు చేసుకోకపోయావా, ఎక్కువ గుళ్లని చూసినవాడిగా గిన్నిస్ బుక్‌లో కెక్కేవాడివి?" అన్నాడు శ్రీదేవి భర్త.

"నువ్వింకా కేలండర్లని కలెక్ట్ చేస్తున్నావా?" అనడిగింది శ్రీదేవి, మాట మార్చడానికి ప్రయత్నిస్తూ.

"ఏం కేలండర్లూ?" అడిగింది మీనాక్షి కొంచెం ఆశ్చర్యంగా.

"జనవరి రాగానే బట్టలకొట్లవాళ్లూ, కిరాణా కొట్లవాళ్లూ ఇచ్చే కేలండర్లంటే వీడికి చాలా ఇష్టంగా ఉండేది. పాతవాటిని కూడా పారెయ్యకుండా చాలా కాలం దాకా ఉంచే వాడు" అన్నది శ్రీదేవి.

"సినిమాతారలంటే అంత మోజన్నమాట!" అన్నాడామె భర్త, బావమరిదిని ఆటపట్టించడానికి కొత్త విషయం దొరికినందుకు ఆనందిస్తూ.

"అది ఇప్పుడు వీళ్ల చిన్నప్పుడు అన్నీ దేవుళ్ల కేలండర్లేగా!" అన్నది అత్తగారు.

"మాయింట్లో కాలెండర్లన్నీ నేను తగిలించినవే. దేవుళ్ల పటాలు కిచెన్లో, అజంతా ఎల్లోరా పెయింటింగులు లివింగ్ రూంలో, సీనరీలు బెడ్రూంలో పిల్లల గదుల్లో పోస్టర్లు వాళ్ల యిష్టం!" అన్నది మీనాక్షి గర్వంగా. వివేక్ చిన్నగా నవ్వి ఊరుకున్నాడు.

"చూడు ఆ నవ్వు. వివేకానందుడిలాగా!" అన్నది శ్రీదేవి.

"పుట్టిన లగ్గం ప్రకారం వీడిపేరు 'వ'తో మొదలవ్వాలంటే, వివేకానంద్ అని మానాన్న ప్రతిపాదించారు. మీ మామగారు, వీడు సన్యాసవుతాడేమోనని భయపడి 'ఆనంద్'ని కలపనివ్వలేదు" అన్నది మీనాక్షితో వివేక్ తల్లి.

* * *

మళ్లీ అందరూ కలిసింది వివేక్ వాళ్లింట్లో. అతణ్ణి హాస్పిటల్ నుంచీ తీసుకువచ్చిన తరువాత.

"అంత పెద్ద యాక్సిడెంట్ అయినా ఎముకలేవీ విరక్కపోవడం మన అదృష్టం!" అన్నాడు వివేక్ తండ్రి.

"ఏ మదృష్టమో, అట్లా హాస్పిటల్లో కన్ను తెరవకుండా రెండురోజులు ఐసియూలో వాణ్ణి చూస్తే గుండె తరుక్కుపోయింది" అన్నది అతని తల్లి కళ్లు ఒత్తుకుంటూ.

"ఇంకా నయం! మీరంతా కూడా అతనితోపాటు కార్లో ఉన్నారు కాదు!" అన్నాడు శ్రీదేవి భర్త మీనాక్షినీ, వాళ్ల పిల్లలనీ చూస్తూ.

"ఆ గుడి కెళ్లకుండా ఉండుంటే అసలీ యాక్సిడెంట్ అయ్యేదా?" అన్నది మీనాక్షి.

"ఇకనుంచీ గుళ్ల వెంట తిరగడం తగ్గించుకోండి!" అభ్యర్థనతో కూడిన ఆదేశాన్ని జారీ చేసింది.

"యాక్సిడెంటవ్వాలని రాసుంటే ఎలాగోలా అయ్యేది. రోడ్డు మీద కాలు పెట్టాలంటేనే భయంగా ఉంది!" అన్నది శ్రీదేవి. "గుడికెళ్లొ"ద్దంటూ అనవసరంగా పాపాన్నెందుకు మూటగట్టుకుంటావని మరదలికి సూచిస్తూ.

"ఇప్పటిదాకా చూసిన గుళ్లు చాలదా? ఇంకా ఎన్ని గుళ్ల కెళ్లాల్ట?" అన్నది మీనాక్షి భర్తని నిలదీస్తున్నట్లుగా.

"ఇప్పటిదాకా చూసిన సినిమాలు చాలదా?" అని ఎవరూ ప్రశ్నించినట్లు వివేక్‌కి గుర్తులేదు– కొత్తగా వచ్చిన సినిమా కెడదామన్నప్పుడు. ఎందుకంటే, అన్ని సినిమా కథలకూ రామాయణమే మూలం అని నిరూపిస్తూ హీరోయిన్ని విలన్ బారినుంచీ రక్షించడానికి హీరోచేసే యుద్ధం ప్రతీ సినిమా క్లైమాక్స్‌లోనూ ఉంటుంది మరి! గుడి కెడదా మన్నప్పుడు మాత్రం భిన్నత్వంలో ఏకత్వం కనిపిస్తుంది– దేవుడు సర్వాంతర్యామి కాదా అంటూ. "ఒక సూర్యుండు సమస్త జీవులకు తానొక్కొక్కడై తోచు" రీతిని వేరే రూపాలనేవి చూసేవాళ్ల దృష్టినిబట్టీ ఉంటాయని వాదిస్తారు కూడా. "ఇన్ని గుళ్లు చూశావ్ ఇంకా ఏమున్నవి చూసేందుకు కొత్తగా?" అని తన నింతవరకూ ఎవరూ ప్రశ్నించక పోవడం తన అదృష్టం అనుకున్నాడు పక్కమీద వెల్లకిలా పడుకోబెట్టిన తన పొజిషన్నించీ ఆ బెడ్రూంలో చుట్టూ నిలబడ్డ వారందరినీ చూస్తూ.

తల్లి చదవగా అతను విన్న స్తోత్రాల్లోనూ, నామాల్లోనూ ఆ దేవతకు మెరపువంటి శరీరమనీ ("విద్యుల్లతా విగ్రహే"), నాలుగు చేతులనీ ("చతుర్భుజే"), మెరిసిపోయే కిరీటమనీ ("కురువిందమణిశ్రేణీ కనత్కోటీరమండితా"), చేపల్లాంటివో ("వక్త్రలక్ష్మీపరీవాహచలన్మీనాభలోచనా") లేక లేడిపిల్ల కళ్లవంటివో ("బాలకురంగలోలనయనే") కళ్లు గలదనీ, సంపెంగ రేకులవంటి ముక్కు గలదనీ ("నవచంపకపుష్పాభనాసాదండవిరాజితా"), దొండపండువంటి పెదాలనీ ("నవవిద్రుమబింబశ్రీన్యక్కారిరదనచ్ఛదా") వర్ణన లున్నాయి. ఆఖరికి, ఆమె ఆ శివుని మనస్సును దోచుకున్నటువంటి మందహాసం గలదని కూడా వర్ణన ఉన్నది. ("మందస్మిత ప్రభాపూరమజ్జత్కామేశమానసా") అతను చూసిన కాలెండర్ల లోని దేవతల బొమ్మలూ, గుళ్లల్లో విగ్రహాలూ ఆ వర్ణనలకి తగ్గట్టుగానే ఉన్నవి– కళ్లు తెరిచి ఉంచి చూడలేని ఆ ప్రకాశాన్ని మినహాయించి.

అతన్ని గుళ్ల వెంట తిప్పింది మాత్రం తల్లి నోట్లోంచి విన్న "స్మితదంతపంక్తిరుచిరాం," "శుద్ధవిద్యాంకురాకారద్విజపంక్తిర్ద్వయోజ్వలా" అన్న వర్ణనలు, వాటికి అర్థం తెలుసుకున్నప్పుడు ఆ వర్ణనలకి రూపకల్పన చేసిన చిత్రపటాలు గానీ విగ్రహాలు గానీ ఎక్కడయినా ఉన్నాయేమో చూద్దామని అతనికి కలిగిన ఆలోచన. తేలికగానే కనుక్కోవచ్చని ముందతను కనిపించిన కేలండర్ల న్నింటినీ పరీక్షించాడు. ఇంటర్నెట్లో బొమ్మలు చూశాడు. అన్ని

చిత్రపటాల్లోనూ అమ్మవారి రెండుపెదాలూ కలిపే ఉన్నాయి. వాటిల్లో చిరునవ్వు కనిపించింది గానీ, ఎక్కడా కనిపించని "స్మితదంతపంక్తిరుచిరాం" అతణ్ణి అన్వేషణలో భాగంగా గుళ్ల వైపు దారి తీయించింది. ఇప్పటిదాకా చెక్కబడిన ఏ అమ్మవారి విగ్రహాని కయినా ఆ శిల్పికి ఆ అమ్మవారు అలా సాక్షాత్కరించి ఉంటుందా, దాన్నాతడు ఆ శిల్పంలో మలచగలిగాడా అన్న కుతూహలమే అతని అన్వేషణకి కారణం. ఎన్నో గుళ్ల మెట్లని ఎక్కి, దిగిన తరువాత అది కవుల కల్పనే తప్ప రూపకల్పనగా ఎక్కడా కనిపించదని అనిపించి అతణ్ణి ఇప్పుడు నిరాశ ఆవహించింది.

అతను ఆలోచనల మధ్యలో తండ్రి బెడ్రూం బయటకి వెళ్లడాన్ని గమనించలేదు గానీ, గది బయటనుండే ఆయన, "ఏమే, కాఫీ ఇస్తావా?" అనడం వినిపించింది. తల్లి వివేక్ మంచం పక్కనుండే, "కాఫీ ఇస్తా నుండండి" అన్నది. "కాఫీ ఇస్తున్నా వనుకున్నాను" అన్నారాయన. శ్రీదేవి పెద్దగా నవ్వింది. వివేక్ పెదవులమీద నవ్వురా బోయింది గానీ, కొద్దిగా వాచిన కింది పెదవి నెప్పి పుట్టడం వల్ల ఆగిపోయింది. "ఏమిటి నవ్వుతున్నావ్?" అంటూ ఆయన బెడ్రూంలోకి వచ్చారు. శ్రీదేవి నవ్వు నాపుకుంటూ వాళ్లిద్దరి సంభాషణని రిపీట్ చేసింది.

"ఇద్దరు చెవిటివాళ్లు రోడ్డుమీద ఒకరికొకరు ఎదురుపడ్డార్ట. "ఏవండీ, షికారుకేనా?' అన్నాట్ట ఒకడు. 'అబ్బే లేదండీ, ఊరికేనే షికారుకి' అన్నాట్ట రెండవవాడు. దానికి మొదటివాడు 'అలాగా, షికారు కనుకున్నానులెండి' అన్నాట్ట. అలా ఉన్నదన్నమాట ఈ తంతు!" అన్నారాయన.

వివేక్ తల్లి ఫక్కున నవ్వింది. తెలియనివాళ్ల ముందు పళ్లు కనపడకుండా పెదవులు కలిసి ఉండేట్లు చేసే మందహాసం కాదది. అమందానందకందళితహృదయారవిందపు పరిమళాన్ని తనకు కావలసిన వాళ్లకు పంచుతూ సరస్వతీదేవి వీణానాదం కన్నా మధురమైన శబ్దం చేస్తూ నోరారా నవ్విన నవ్వు ("నిజసల్లాపమాధుర్యవినిర్భర్త్సితకచ్ఛపీ")!

వివేక్‌కీ, శ్రీదేవికి ఆయన ఆ జోకెయ్యడం, దానికి ఆవిడ అంతలా నవ్వడం ఎన్నవసారో గుర్తులేదు గానీ, ఈనాడు మాత్రం వివేక్ వింతగా చూశాడు. ఆ గదినిండా ఆమె పంచుతున్న పలువరుసల కాంతిని ("స్మితదంతపంక్తిరుచిరాం") చూసి, "శుద్ధ విద్యాంకురాకారద్విజ పంక్తిర్ద్వ యోజ్వలా"కి సారూప్యతని (షోడశాక్షరి ఆమె పలువరుస) అమ్మ ముఖంలో చూడకుండా ఎన్ని గుళ్లల్లో వెదికాను? అమ్మ నవ్వుని విన్నాను గానీ నవ్వేటప్పుడు ఆమె ముఖాన్ని ఎప్పుడూ గమనించలేదా!" అని ఆశ్చర్యపోయాడు. "చిన్నప్పుడు లాల పోసేటప్పుడూ, జోల పాడేటప్పుడూ, గోరుముద్దలు తినిపించేటప్పుడూ, కోరి ముద్దులు కురిపించేటప్పుడూ షోడశాక్షరులు ఆమె నోటిద్వారా పలికించిన రసరాగఝరులు చెవిద్వారా చేకూర్చిన ఆనందం, ఆమె నవ్వుకు మెరుపద్దిన ఆ పలువరుసల

కాంతి తన కన్నులలో నింపిన ప్రశాంతతతో పోటీపడి ఉంటుందా?" అని ఆలోచనలో పడ్డాడు. "పుట్టిన మొదట్లో కొన్నాళ్లు పూర్వజన్మ వాసన లుంటాయనీ, రోజులు గడిచేకొద్దీ అవి మాసిపోతాయనీ అంటారుగానీ, పసిబిడ్డగా ఉన్నప్పుడు తల్లిమాటా, స్పర్శా, ఉనికీ కలిగించే ప్రశాంతత పెద్దయేకొద్దీ మనసు మూలల్లో మరుగున పడిపోతుందని గమనించ రెందుకో! పూర్వ జన్మలని సంశయాత్మకం అనేవాళ్లు కూడా బాల్యానికి తల్లితో ముడిపడి వున్న అపూర్వ సంబంధాన్ని నిస్సందేహంగా ఒప్పుకుంటారు గదా!" అని కూడా అనుకున్నాడు. "సురరక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు" అని పోతన అన్నాడు గానీ తనయితే, "జనని నవ్వుల జూచు జన్మము జన్మము" అనేవాడన్న నిర్ణయానికి అతనొచ్చాడు.

అతని కెందుకో, ఈ ప్రపంచంలో "స్మితదంతపంక్తిరుచిరాం" గూర్చి అన్వేషణ చేసిన వారిలో తను ప్రథముడు కాడన్న నమ్మకం కలిగింది. "వివేకానందుడు గురువైన రామకృష్ణ పరమహంసని అడిగే ఉంటాడు– ఆ దేవి దివ్యమైన పలువరుస నెప్పుడు చూడగలనని. పరమహంస, 'నీకు చూడాలని రాసి ఉంటే ఆమె అనుగ్రహం కలక్కపోదు" అని చెప్పి ఉంటారు. ఆయన కేమో గానీ, నాకు మాత్రం ఆ అనుగ్రహం ఇవ్వాళ కలిగింది. కాదు కాదు, ఆ అనుగ్రహం ఎప్పటినించో ఉన్నదన్న జ్ఞానం ఇవ్వాళ కలిగింది. ధన్యుణ్ణి!" అనుకుని చేతు లెత్తబోయాడు జోడించి నమస్కారం పెట్టడానికి.

"చేతికి కట్టుంది, ఎత్తకండి!" అని వారించింది మీనాక్షి. "ఇప్పుడున్నది గుళ్లో కాదు, ఇంట్లో, తెలుసా?" అని ప్రశ్నించింది– యాక్సిడెంటయిన తరువాత అతనికి కలిగిన షార్ట్‌టర్మ్ మెమరీలాస్ సమస్యని గుర్తుపెట్టుకుని, ఇంకా ఈ లోకానికి అతను పూర్తిగా రాలేదేమోనన్న ఆదుర్దాకి కొద్దిగా భయం తోడైనందువల్ల.

"కంగారుపడకు. 'మా ఆయనకి గుళ్లపిచ్చి' అనే అవకాశం నీకింక ఇవ్వను!" అన్నాడు వివేక్.

(తానా పత్రిక, ఆగష్టు 2014)

# రహస్యం

ఊరికి దూరంగా ఉన్న ఆ ప్రదేశం ఎత్తుపల్లాలతో, రాయిరప్పలతో ఎగుడుదిగుడుగా ఉంది. అక్కడక్కడా పెద్ద పెద్ద కొండరాళ్లు. రాతి ప్రదేశం అవడం వలన దూరదూరంగా అక్కడక్కడ మాత్రమే పెద్ద వృక్షాలు కనిపిస్తున్నాయి. చదునుగా చేసిన ప్రదేశంలో ఒక పర్ణశాల. దానికి దగ్గరగా కొందరు రాజభటులు. వాళ్ల దృష్టి మాత్రం పర్ణశాలవైపు కాక అక్కడికి కొద్ది దూరంలో నిలబడ్డ రాజకుమారుల మీద, వారి గురువు ద్రోణాచార్యుల మీద నిమగ్నమై ఉంది.

తనముందు నిలబడ్డ కురు, పాండవ సోదరుల్ని పరకాయిస్తున్న ద్రోణాచార్యుల వారి మదిలో ఆలోచనలు.

'హస్తినాపురంలో ఈ ఉద్యోగం తనకు అదృష్టవశాత్తు దొరికిందనే చెప్పుకోవాలి. తన బావమరిది కృపుని సహాయంతో ధృతరాష్ట్రుని కొలువులో తనకు ఉద్యోగం లభిస్తుందేమో నని నిన్న ఇటు వస్తున్నప్పుడు హస్తినాపురపు పొలిమేరల్లో ఈ రాజకుమారుల్లో కొంతమంది ఒక బావి వద్ద గుమిగూడి ఉండడం తను చూశాడు. వారికి కొద్దిదూరంలో వేరొక రాజకుమారుల గుంపు పోగై ఉంది. ఆ గుంపు మధ్యలో ఇద్దరు రాజకుమారులు కుస్తీ పడుతున్నారు అరుచుకుంటూ– 'తప్పు నీదంటే నీదని, నీవు కావాలని బావిలో పడేశా'వని అతడంటే, 'నీకు పట్టుకోవటం చేతకాలే'దని మొదటివాడు అంటూ. వాళ్ల చుట్టూ మూగిన మరికొందరు రాజకుమారులు ఆ యుద్ధాన్ని ప్రోత్సహిస్తూ మధ్యమధ్యలో చప్పట్లు కొడుతున్నారు. ఏమిటని విచారిస్తే, వాళ్లు ఆడుకునే బంతి బావిలో పడిపోయిందని, దాన్ని బయటకు తీసే మార్గం తెలియక కుస్తీ పడుతున్నారనీ, పేర్లు దుర్యోధనుడు, భీమసేనుడు అని తెలిసింది. అప్పుడు ముందు వారిద్దరి మల్లయుద్ధాన్ని వారించి, బంతిని తను బయటకి తీస్తానన్నాడు'.

"ఇక్కడ గాలము, తాడు, చేద ఏమియును లేవు," వినయంగా అన్న బాలుని వైపు చూసి తను చిన్నగా నవ్వాడు 'వాటి అవసరం లేదు' అని అర్థం వచ్చేలాగా. ఆ బాలుని పేరు యుధిష్ఠిరుడని తరువాత తెలిసింది.

బావి నీటిలో తేలుతున్నది నూలుబంతి. విలువిద్యా ప్రావీణ్యత నుపయోగించి తను ఆ బంతిని బయటకు తీద్దామని అనుకున్నాడు. ఒక బాణం వెనుక ఇంకొక బాణాన్ని గురిచూసి వేసి, బాణాలతో తాడుని తయారు చేసి ఆ తాడుతో బంతిని పైకి లాగవచ్చునని తను అనుకున్నాడు. అమ్ముల పొదిలోంచి బాణాన్ని తీసి, నారిని సంధించి మొదటి బాణాన్ని వదిలిన తరువాత కానీ ఆ ఆలోచనలోని లోపమేమిటో తనకు తెలిసిరాలేదు.

నీటిలో తేలుతున్న బంతి బలంగా వచ్చి తాకిన బాణపు ధాటికి మొదట నీటిలో మునిగింది. తరువాత, బాణం దిగబడిన ఆ బంతి, బాణపు జడత్వం బంతి జడత్వం కన్నా ఎక్కువగుట చేత నీటిలో పక్కకు తిరిగింది. బంతిలో గ్రుచ్చుకున్న బాణం పక్కకు ఒరిగి, చెక్కతో తయారు చెయ్యబడిన దగుటచేత నీటి మట్టమునకు సమాంతరంగా యుండునట్లుగా నీటిలో తేలింది. దానితో బాణముల త్రాడుతో బంతిని వెలుపలకు తీయవచ్చునన్న తన ఊహ తలక్రిందులైంది. ఇంకొక బాణము వేసినా మరల అదే పరిస్థితి అని అర్థమయిన తరువాత ఆ పరిణామము తనకు ముందు ఆశ్చర్యమునూ, అటు పిమ్మట తనలో అలజడినీ కలిగించింది.

'తను ధృతరాష్ట్రుని కొలువులో ఉద్యోగమును అర్థించి వచ్చినవాడు. హస్తినాపురపు పొలిమేరలలో అడుగు పెడుతూండగనే తనకీ పరీక్షా? ఈ బంతిని వెలికితీయు ప్రయత్నములో తను విఫలుడైనట్లు ధృతరాష్ట్రునికి తెలిసినచో అతని కొలువులో తనకు ఉద్యోగము లభించునా? ఉద్యోగము లభించకపోయిననూ బంతిని వెలికి తీయుదునని తను పలికిన పలుకులు డంబము లవవలసినదేనా? తన విలువిద్యా ప్రాభవము ఈ బాలల ముందు అపహాస్యము కావలసినదేనా? తను ఈ గండమునుండీ బయటపడుటెట్లు?

'అప్పుడు తన మనస్సులో ఒక చిన్న ఆలోచన కలిగి, గంగానదీ ఉరవడిలో కొట్టుకు పోతున్న వానికి చేజిక్కిన ఒక చెట్టుకొమ్మ మాదిరి తనకు కొంచెం ఆధారము దొరికినట్లయింది. తన ఉత్తరీయమునకు ఈ బాలల ఉత్తరీయములను కలిపి, వాటిని ఒక బాణమునకు ముడివేసి, ఆ బాణమును బంతికి గురిచూసి వదిలినచో? అట్లు చేసినచో ఆ వస్త్రముల బరువుకు బాణము గురితప్పునని విలువిద్యా ప్రావీణ్యత తనను హెచ్చరించింది. తన పలుచని ఉత్తరీయములోని నూలు పోగులను విడదీసి, సన్నని త్రాడుగా కూర్చి, ఆ త్రాడును బాణమునకు ముడివేసి, బాణమును వదిలినచో? అది సంభవమేనని విలువిద్యా ప్రావీణ్యత అనుమతి నిచ్చిన తరువాత తను బాణము వేయుట, దారపు సహాయముతో ఆ బంతిని బయటకు లాగుట, దాని వలన రాజదర్శనము కలుగుట,

ఈ బాలలకు గురువుగా నియమింపబడుట జరిగింది. దాని ఫలితమే తను ఆచార్యునిగా ఈ రాజకుమారుల ముందు నిలబడుట. ఆ సమయోచిత యోచన తనకు సంభవించనిచో తను ఉదర పోషణార్థం... ఆ ఆలోచననే ఇక నా దరికి రానివ్వను!' అని ద్రోణాచార్యులు ప్రతిజ్ఞ చేసుకొన్నారు.

'ఈ రాజకుమారులకు తను యుద్ధవిద్యలు నేర్పాలి. వీరందరికీ అస్త్రవిద్యలో కొంచెం ప్రవేశము కలదని తనకు భీష్మాచార్యుల వారు తెలియజేశారు. వీరిలో అస్త్ర శస్త్ర ప్రావీణ్యము ఏ ఒకరికో లేక ఇద్దరికో మాత్రము అబ్బునని తను అనుభవముతో తెలుసుకున్న విషయము మరి వీరందరూ భీష్మాచార్యులవారి మనుమలే! ఆ రక్త సంబంధము వలన వీరందరూ అస్త్ర శస్త్ర ప్రావీణ్యు లగుదురా? పరికించవలయును.'

ఆయన తన ఆలోచనలను ఆపి ఆ రాజకుమారుల నుద్దేశించేటంతలో అర్జునుని చెయ్యి పైకి లేచింది.

'ఏమి నాయనా?' మృదుస్వరంతో ప్రశ్నించారు.

అర్జునుడు చేతితో పొట్టను పట్టుకుని దూరంగా ఉన్న పొదలవైపు చూపించాడు. వెళ్లవచ్చునని చేతితో ఆయన సైగ చెయ్యగానే పరుగున వెడుతున్న అర్జునునివైపు, అతని వెనుకనే పరిగిడుతున్న రక్షకభటుని వైపు ఒక క్షణకాలము చూసి ఆయన మిగిలిన రాజకుమారులను సంబోధించారు.

'బాలలారా, ఆ వృక్షోపరిభాగమును చూచితిరా?'

రాజకుమారుల దృష్టి ద్రోణుని కుడిచేయి చూపుడు వ్రేలి దిక్కుగా మరలి, అది అక్కడకు ఏబది గజముల దూరంలో కల ఒక మర్రిచెట్టు ఉపరిభాగము వైపు పయనించింది.

దానిమీద ఒక మృణ్మయ పక్షి ఉన్నది. దానిని ఆయన అశ్వత్థామ చేత ఆ ఉదయముననే అక్కడ పెట్టించారు.

'మీరు మీ విల్లులకు బాణమును సంధించి, ఆ పక్షి కంటికి గురిపెట్టి బాణములను వేయండి. దుర్యోధనా, ముందుగా నీవు ఇచ్చటికి వచ్చి ప్రయత్నించుము.'

దుర్యోధనుడు, ద్రోణుడు చూపించిన స్థలానికి వచ్చాడు. అమ్ముల పొదిలో నుంచి బాణాన్ని తీసి, వింటికి సంధించి గురి చూశాడు.

'దుర్యోధనా, పక్షి కనిపించినదా?' ఆయన గొంతులో సందేహము.

'కనిపించినది గురుదేవా' దుర్యోధనుని గొంతులో 'కనిపించక ఎక్కడికి పోతుం'దన్న దృఢమైన ఆత్మవిశ్వాసము.

'అయిన బాణము వదులుము.'

దుర్యోధనుడు బాణాన్ని వదిలాడు. అది వృక్షోపరిభాగము వైపు పయనించి, పక్షికి తగులకనే నిర్వీర్యమై క్రిందకు రాలింది. దుర్యోధనుడు విఫలుడైనాడు.

తరువాత దుశ్శాసనుని వంతు. ఆ తరువాత మిగిలిన కౌరవుల వంతు. వారందరూ దుర్యోధనుని మార్గమునే అనుసరించి బాణములను వదులుటచేత అందరూ విఫలులైనారు. కొన్ని బాణములు చెట్టుకొమ్మలకు గ్రుచ్చుకొన్నవి. అలా గ్రుచ్చుకొనక క్రిందపడిన బాణము లన్నియు ఒక కుప్పగా తయారైనవి. వీరిలో ఎవరూ కృతకృత్యు లవకపోవడం మాత్రమే కాదు ద్రోణుని ఆశ్చర్యపరిచింది, వారి గురి పక్షి వైపే లేదు. ఇదెటుల సంభవము?

ఈ మధ్యలో అర్జునుడు మూలశంక తీర్చుకుని వచ్చాడు. నిలబడి ఉన్నంతసేపూ ఉదర భాగాన్ని చేతితో పట్టుకుని బాధపడుతూనే ఉన్నాడు. మధ్యమధ్యలో పొదల వైపు పరిగెడుతూనే ఉన్నాడు. అతను తన మనసుని అక్కడ జరుగుతున్న కార్యక్రమం మీద కేంద్రీకరించలేకపోతున్నాడు.

నూరుగురు కౌరవుల తరువాత పాండవుల వంతు వచ్చింది. యుధిష్ఠిరుడు, భీమసేనుడు, నకులుడు, సహదేవుడు కూడా కౌరవుల మార్గము ననుసరించి విఫలులైనారు. చివరగా అర్జునుని వంతు వచ్చింది.

అప్పటికి అర్జునునికి ఉదర అస్వస్థత కొంచెము తెరిపినిచ్చినది కాబోలు, మెల్లిగా ముందుకువచ్చాడు. బాణాన్ని సంధించి, వింటిని ఎక్కుపెట్టాడు. ఆ బాణమును అర్జునుడు వదిలినచో అది అప్పటికే చెట్ల కొమ్మలకు గ్రుచ్చుకొన్న బాణముల వైపు గానీ లేక కుప్పగా క్రింద చేరిన బాణములను గురి చూచిన వైపుకు కానీ కాక కొంచెం కుడివైపుగానూ, ఇంకొంచెం ఎత్తుగానూ పయనిస్తుంది. అర్జునుని గమనిస్తున్న దుర్యోధనుడు కిసుక్కున నవ్వాడు. బాణాన్ని గురిపెట్టడం రానివాడివి విల్లు నెందుకు పట్టుకోవడమన్న అర్థాన్నిస్తూ. దాన్ని గమనించిన దుశ్శాసనుడు కూడా విరగబడి నవ్వాడు. అన్నల ననుకరిస్తూ కౌరవు లందరూ గొంతు కలిపి నవ్వడం క్షణకాలంలో జరిగిపోయింది. యుధిష్ఠిరుడు అర్జునుని వైపు జాలిగా చూశాడు. భీమసేనుని మొహంలో జాలికన్నా కౌరవులు అర్జునుని అపహాస్యం చేస్తున్నారన్న కోపం ప్రతిబింబించింది. నకుల సహదేవులు చెరొకరి మొహాలు చూసుకుని, బహుశా ఉదర సంబంధమైన అస్వస్థత అతని మనసుతో ఆటలాడుతున్నదని భావించి జాలిపడ్డారు.

అర్జునుని గురిని చూసిన ద్రోణాచార్యుల వారి మొహంలో చిరునవ్వు వెలిసింది. అదీ క్షణకాలం మాత్రమే. ఇంతలోనే కౌరవుల పకపకలు వినిపించడంతో ఆయన భృకుటిని ముడివేసి కౌరవుల వైపు తీక్షణంగా చూశారు. మళ్లీ నిశ్శబ్దం నెలకొనగానే ఆయన అర్జునుని ఆజ్ఞాపించారు.

'బాణమును వదులుము!'

అర్జునుడు వదిలిన ఆ బాణము పక్షి కంటికి గ్రుచ్చుకుని, పక్షితో సహా నేల కూలడంతో కౌరవుల మొహాల్లో ఆశ్చర్యము, ద్రోణాచార్యుల మొహంలో ఆనందము వెల్లివిరిశాయి.

ద్రోణాచార్యుల వారి ముఖంలో ఆ ఆనందం క్షణకాలం మాత్రమే నిలిచి, దాని స్థానముననే సందేహము చోటుచేసుకున్నది.

'నూర్గురు రాజకుమారులలో బాణమును గురిపెట్టగల సామర్థ్యము ఒక్కనికే ఎట్లు అబ్బినది? ఈ వార్త తను భీష్మాచార్యుల వారికి గాని, ధృతరాష్ట్రుల వారికి గానీ ఎలా చేరవేయగలడు?'

రాజకుమారులకు కొంచెం సమయము విరామాన్ని ప్రకటించి, మధ్యాహ్న భోజనమునకు పంపించారు.

'ఈనాటి తన పరీక్షా ఫలిత వివరములు రాజుగారి చెవిన పడకపోవు. రాజకుమారులు సఫలీకృతులు కాకపోవుటకు తను కారణమని నిందించినచో?' అని ఇంచుక భయము కలిగి, తన పరీక్షా మార్గంలో లోపం ఉన్నదేమోనని ఆయన ఆలోచించారు. ఒక లోపము ఆయన మదిలో మెదిలింది. అది ఒక్క దుర్యోధనుడు తప్ప మిగిలిన ప్రతి ఒక్కరూ అంతకు ముందువారి గురి ఏదో ప్రత్యక్షముగా చూచుట. 'అందువలననే అందరూ తప్పు త్రోవ ననుసరించారేమో! అర్జుననకు ఉదర అస్వస్థత లేకున్నచో అతడు కూడా మిగిలిన వారి ననుకరించేవాడేమో?' ఆ లోపాన్ని ఎలా సవరించాలని ఆలోచించారు. ఆ ఆలోచన ఘనీభవించి కార్యరూపమై మదిలో మెరిసిన తరువాత ఆయన వెంటనే తరువాత కార్యక్రమానికి సంసిద్ధులైనారు.

ఆ రోజు మధ్యాహ్నము ప్రతి ఒక్క రాజకుమారునికీ వేర్వేరుగా పరీక్ష పెట్టదలిచారు. ప్రొద్దుటి పరీక్షకి మరికొన్ని పరీక్షలను జోడించారు. తరువాత తన పర్ణశాలకు దూరంగా ఉన్న ఒక చెట్టుపైన అశ్వత్థామ చేత వేరొక మృణ్మయ పక్షిని పెట్టించారు.

మొదట రాజకుమారుల నందరినీ ఆయన తన పర్ణశాల ముందు సమావేశ పరిచారు. తరువాత మొదటిగా వారిలో యుధిష్ఠిరుని వెంటబెట్టుకుని వారికి దూరముగా వంద గజాలకు పైగా నడిచారు. ఎందుకైనా మంచిదని ఒక పెద్ద కొండరాయిని తమకీ, మిగిలిన రాజకుమారులందరికీ అడ్డు ఉండేలా చూసుకుని, అక్కడ యుధిష్ఠిరునికి కొన్ని పరీక్షలు పెట్టి, వాటి తరువాత అక్కడికి కొద్ది దూరంలో ఉన్న చెట్టుపై అశ్వత్థామ పెట్టిన పక్షిని బాణంతో కొట్టమన్నారు. యుధిష్ఠిరుడు బాణము వదిలే సమయానికి అడ్డుకొని, 'పక్షి కన్ను కనిపించుచున్నదా?' అని అడిగారు.

'పక్షి కనిపించుచున్నది గురుదేవా!' యుధిష్ఠిరుడు సత్యవ్రతుడని ఎందుకంటారో అప్పుడే ద్రోణాచార్యులకి తెలిసింది.

'ఇంకేమి కనిపించుచున్నవి?'

'చెట్ల ఆకులు, వాటి మధ్యలో నీలాకాశము, నా కనుచివరలలో మీరు.'

'సరే, బాణమును వదులుము!'

యుధిష్ఠిరుడు వదిలిన బాణము పక్షికి తగులకనే క్రిందపడిన తరువాత ఆ బాణమును వెనక్కు తీసుకువచ్చి, తనకు ఇమ్మన్నారు ద్రోణులవారు. అలా అయినచో, తరువాత వచ్చువారికి తమ ముందువారు ఎటువైపు బాణమును గురిపెట్టారో తెలియదు.

'సరే. ఇంక నీవు వెళ్లి, వేరొకళ్లను పంపు.'

ప్రతీ రాజకుమారుడికీ ఒకటే పరీక్ష. పరీక్షలోని అన్ని భాగాలనీ అందరూ జవాబు చెయ్యాలి. ఆఖరుకు బాణమును గురిపెట్టుట, దానిని వదులుట, అటుపైన ఆ బాణమును తెచ్చి ద్రోణుని కిచ్చుట కూడా.

ఒకవేళ ఆ బాణము చెట్టుకొమ్మలో గ్రుచ్చుకుని పోయినచో ఒక భటుడు ఆ చెట్టు పైకి ఎక్కి దానిని బయటకు తీయును. ప్రతీ రాజకుమారునికీ అంతకుముందు తన సోదరుడు ఎలా జవాబు ఇచ్చాడో, ఎటువైపు బాణమును గురిపెట్టాడో తెలియకపోవడం వలన ఈ పరీక్షా ఫలితాలు సవ్యంగానే ఉండే అవకాశాలు హెచ్చుగా ఉన్నాయి.

అర్జునుని వంతు వచ్చింది. అర్జునుడికి కూడా మొదటి పరీక్షలన్నీ అయిన తరువాత బాణాన్ని చేతికి అందించి, ప్రశ్నించాడు– 'పక్షి కనిపించుచున్నదా?'

'కనిపించుచున్నది గురుదేవా.'

'ఇంకేమి...' అని మధ్యలో ఆగిపోయారాయన. తనను తమాయించుకుని, 'బాణమును వదులు'మని ఆజ్ఞనిచ్చారు. ఆ బాణము ఆ రోజు ఉదయము లాగుననే పక్షి కంటికి తగిలి పక్షితో సహా నేలరాలింది.

అందరు రాజకుమారుల పరీక్షలగుసరికి సాయం సంధ్యాసమయ మైనది. మరి, నూట అయిదు మందికి ఒకరి తరువాత ఒకరికి పరీక్షలు పెట్టుట సామాన్యమైన విషయమా? రాజకుమారులను పంపించి, ఆ రాత్రి ఆయన నిశితంగా ఆలోచించారు. మరునాడు రాజసభలో ఏం చెప్పదలచుకున్నారో నిర్ధారించుకున్నారు. 'పక్షితో పాటు ఇంకేమి కనిపించుచున్నది?' అని అర్జునుని ప్రయత్నపూర్వకంగానే ప్రశ్నించలేదు– జవాబు ఏం చెబుతాడోనని భయపడి – అన్న సంగతిని మాత్రం ధృతరాష్ట్రునికి గానీ, వేరెవ్వరికి గానీ ఆయన చెప్పదలచుకోలేదు. 'అలా ప్రశ్నించలేదు' అనడానికి సాక్షులు వేరెవరూ లేరు. పైగా, అర్జునుని 'నీవేం' జవాబు చెప్పావు?' అని ఎవరైనా తరచి అడుగుటకు అవకాశాలు చాలా తక్కువే ఉన్నాయి. అప్పటికి ఆయనకు మనశ్శాంతి కలిగి, మూడవ ఝామున నిద్రపట్టింది.

రాజసభలో మొదట ప్రశ్నించింది భీష్ములవారు. 'నిన్న రాజకుమారులకు మీరు ఏవో పరీక్షలు పెడితిరని వింటిమి. వారి సామర్థ్యాలెలా ఉన్నవి? మిమ్మల్ని గురుదేవులుగా పొందు అర్హత వారికి ఉన్నదా?'

'ఆ...ం.. మాకును చాలా కుతూహలముగా నున్నది. చెప్పండి ఆచార్యా!' అన్నారు ధృతరాష్ట్రులవారు.

"చిత్తం మహారాజా!. రాజకుమారులను వింటికి బాణమును సంధించి చెట్టుపై గల మృణ్మయ పక్షి కంటికి గురిపెట్టమంటిని, వారు బాణమును వదులు ముందర వారికేమి కనిపించుచున్నదని ప్రశ్నించితిని. ఒక్క అర్జునుడు తప్ప అందరూ పక్షితోపాటు చెట్ల ఆకులూ, ఆకాశమూ కనిపించుచున్నవని, చివరికి వారి కనుసన్నల్లోంచి నేను కూడా కనిపించితినని చెప్పితిరి.'

'అర్జునుడేమి చెప్పినాడు?' – భీష్మాచార్యుల గొంతులో కుతూహలం.

'కేవలం పక్షిమాత్రమే కనిపించినదని చెప్పినాడు'.

అర్జునునికి ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి తను అవకాశాన్ని కలిగించలేదన్న సంగతి తనకొక్కనికే తెలుసు. నూట నలుగురిని ఒకే రకంగా ప్రశ్నలు వేసినందువల్ల అర్జునుని కూడా అలాగే ప్రశ్నించి ఉంటాడని అందరూ అనుకోవడం సహజం. అర్జునుని గూర్చి తను చెప్పింది అబద్ధమైనా, దానికి కారణం, నిజాన్ని సంపూర్ణంగా చెప్పి నూట నలుగురు రాజకుమారుల పరువును బయట పెట్టుటకు, తను మరల ఉద్యోగాన్వేషణ మొదలు పెట్టుటకు కలిగిన వెఱపు.

'అయితేనేమి? పక్షిని ఎంతమంది కొట్టగలిగిరి?' – ధృతరాష్ట్రుని గొంతులో ఇంచుక అసహనం.

'ఒక్క అర్జునుడు మాత్రమే మహారాజా!'

'అర్జునునిది సునిశిత దృష్టి అన్నమాట. అతని పరిశీలనా దక్షతను నేనెప్పుడో ఎరుగుదును' – భీష్మాచార్యులు.

'రేపటి నుండి అందరు రాకుమారులకూ అస్త్రవిద్యతో పాటు మిగిలిన శస్త్రవిద్యలను నేర్పెదను.'

'శహభాష్ ఆచార్యా. మాకు మంచి గురువులే దొరికినారు!' భీష్మాచార్యుల గొంతులో అమలిన ఆనందం.

'అవునవును.' ధృతరాష్ట్రుని గొంతులో కొంచెం నిరాపేక్ష.

* * *

ద్రోణాచార్యులవారు ఆ క్రితం రోజు ఉదయం గమనించినది, ఒక్క అర్జునునికి తప్ప మిగిలిన రాజకుమారు లందరికీ హ్రస్వదృష్టి అని. ఆ దృష్టి లోపాన్ని నిర్ధారించు కునేటందుకే ఆయన అదేరోజు మధ్యాహ్నం వాళ్లకు దృష్టి సంబంధమైన పరీక్షలు పెట్టారు. నిర్ధారణ అయిన తరువాత 'రాజకుమారులకు దృష్టిలోప'మని ధృతరాష్ట్రునికి చెప్పడం

సాహసం చెయ్యడమేనని ఆయన నమ్మారు. అప్పటికి దృష్టిలోప సవరణకై సులోచనములు కనిపెట్టబడి యుండలేదు కనుక ఆ సత్యాన్ని దాచి, అర్జునునికి విలువిద్యా ప్రావీణ్యతనూ, మిగిలినవారికి హ్రస్వదృష్టి ఇబ్బంది కలిగించని కత్తి, గదా యుద్ధములలో ప్రావీణ్యతనూ ఒసగదలచారు. అలాగని, మిగిలిన వారందరికీ విలువిద్యను కూడా నేర్పకపోలేదు. ఎందుకంటే, యుద్ధరంగంలో శత్రువు మీదకు బాణాన్ని వదిల్తే అది శత్రువుకు ప్రాణహానిని కలిగించకపోయినా, ఏ రథ సారథికో, గుర్రానికో లేక ధ్వజానికో తగులకపోదు. అందుకనే భారత యుద్ధంలో ద్రోణుడు ఒక్క అర్జునునికే విలువ నిచ్చాడు– అర్జునుని అస్త్ర విద్యా కౌశలాన్నే కాక అతని సునిశిత దృష్టిని కూడా ఎరిగి ఉన్నవాడు గనుక.

(రచన మాస పత్రిక, మే 2004)

# స్వాభిమానాభివృద్ధి వ్రత కథ

శంకరయ్య డాబా మీద అసహనంగా కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. సాయం సంధ్యవేళ ఆ పల్లెటూరి అందాల్ని తిలకించడానికి అతను డాబామీదకు రాలేదు. మనసు చికాకుగా వుండడంతో కాళ్లెటు తీసుకువెడుతున్నాయో గమనించకుండానే డాబా మీదకు వచ్చాడు.

శంకరయ్యకు అంత చికాకు కల్గించిన వ్యక్తి లక్కీగాడంటే వాళ్లిద్దరినీ తెలిసిన వాళ్లెవరూ నమ్మరు. లక్కీగాడు కేవలం శంకరయ్య దగ్గర పనిచేసేవాడు మాత్రమే కాదు– శంకరయ్యకు కుడి, ఎడమ భుజాలు కూడా. చిన్నప్పటినుంచీ శంకరయ్యతో కలసిమెలసి పెరిగాడు. శంకరయ్యంటే ప్రాణం పెడతాడు. శంకరయ్య చూపుల్ని గుర్తించి అవతలి మనిషిని లేపేసే వ్యక్తి. వాడివల్ల చాలా లాభం కలిగిందని నమ్మి శంకరయ్యే వాడికి లక్కీగాడని పేరుపెట్టాడు.

అలాటివాడు ఇవాళెందుకు ఎదురు తిరిగాడు? వాడి మాటల్ని ఎంత తీసెయ్యలేక పోయినా, వాడి ఆలోచనలని కొట్టెయ్యలేకపోయినా, వాడు ఎదురు చెప్పినందుకు బాగా కోప మొస్తోంది. లక్కీగాడికి బదులు వాడి స్థానంలో ఇంకెవరయినా ఉండుంటే ఈ పాటికి వాడి పుచ్చె ఎగిరిపోయుండేది.

వాడికింత ధైర్యమెలా వచ్చింది?

అసలు దీనికంతటికీ కారణం జయలక్ష్మి. పట్నంలో శంకరయ్య ఇలాకా. వయసులో ఉండి, పసిమి ఛాయలో పిటపిట్లాడుతూంటుంది. తెరమీద నుంచీ వూడిపడ్డ సినీతార కన్నా బావుంటుంది. అప్పుడప్పుడూ పనిమీద మాత్రమే పట్నంవెళ్లే శంకరయ్యకి జయలక్ష్మిని దగ్గరకి తీసినప్పటినుంచీ పనిలేకపోయినా పట్నం వెళ్లడం అలవాటయ్యింది.

అయితే రెండ్రోజుల క్రితం శంకరయ్య చెవిన ఓ వార్త పడింది. జయలక్ష్మి ఖాతాలో తన ఎగస్పార్టి నాయుడు కూడా ఉన్నాడని. వెంటనే ఆ క్రితంరోజు శంకరయ్య పట్న

మెల్లి, జయలక్ష్మికి నచ్చచెబుదామని చూశాడు. ఒక ఒరలో రెండు కత్తు లిమడవని చెప్పి నాయుడ్ని వదులుకో మన్నాడు. జయలక్ష్మి 'ససేమిరా' అంది. శంకరయ్య క్కోపమొచ్చి ఆ నాయుడి పుచ్చె లేపేస్తా నన్నాడు. 'అది మీ ఇద్దరికీ మధ్య' అంది. దాంతో శంకరయ్య ఖంగుతిన్నాడు. అంటే, నాయుడిక్కూడా అదే చెప్పి ఉంటుందా?

ఒకే పల్లెటూళ్లో ఉంటున్న ఇద్దరు ఎగస్పార్టీ నాయకులకి ఒకే ఇలాకా అన్న ఆలోచన శంకరయ్యకి రుచించడంలేదు. అలాగని జయలక్ష్మి మత్తు శంకరయ్యకు దిగడమూలేదు.

ఒకవేళ అతను జయలక్ష్మిని వదులుకుంటే, అతని మగతనాన్ని హేళనచేసే అవకాశాన్ని నాయుడికి కలిగించి నట్లవుతుందని శంకరయ్యకి అనిపించింది.

ఆ రోజు మధ్యాహ్నానికి నాయుడి పుచ్చె లేపెయ్యాలనే నిర్ణయానికి శంకరయ్య వచ్చాడు. వచ్చిందే తడవుగా లక్కీగాడిని పిల్చి ఆ పనప్పగించాడు. పుచ్చెలు లేపించడం శంకరయ్య కెంత అలవాటో, వాటిని లేపడం లక్కీగాడికి అంతే అలవాటు.

"నన్ను చమించాల్దొరా, నేనాపన్చెయ్యను!" అన్న లక్కీని చూసి నివ్వెరపోయాడు.

"రేయ్! ఎవర్తో మాట్లాడుతున్నావో తెలుసా?" శంకరయ్య కను లెఱ్ఱచేస్తూ గద్దించాడు.

"తెలుస్దొరా. నేను దయిర్యం సేత్తున్నాన న్తెలుసు. అయినా, మనసులో మాట సెబుతున్నాను"

"ఏవిట్రా నువ్వు చెప్పేది?" వాడి మాటలకు కోపం ఎక్కువవుతోంది శంకరయ్యకి.

"నీకేమైనా సెడు సెయ్యడాన్కి నాయుడు సూత్తే నా పాణం అడ్డేసి నిన్ను కాపాడుతా న్దొరా. నువ్ సెప్పకుండానే ఆడ్ని లేపేత్తా! కానీ ఈ ఇసయం మాత్రం నీకూ, నాయుడికీ మద్దెనే దొరా!" ఎటువంటి జంకు లేకుండా నిర్భయంగా మాట్లాడాడు.

"ఇన్నాళ్లు నిన్ను అందరికన్న ఎక్కువగా చూసుకుని నీకు జీత మిచ్చినందుకు ఇదేరా నువ్వు చూపే విశ్వాసం? నాకు తీరని అవమానం జరుగుతుంటే నువ్వు అలా చూస్తూ కూర్చుంటావురా? నేనింకా హనుమంతుడికి సుగ్రీవుడి మీద ఉన్నంత భక్తీ, విశ్వాసాలు నీకు నామీద ఉన్నాయ్యనుకున్నాను!" శంకరయ్య ఆవేశంతో కరిచినంత పన్చేశాడు.

"దీ న్నవమానం అనుకోకు దొరా. వాలి సుగ్రీవుణ్ణెల్లగొట్టి తారని భార్యగా ఉంచు కొంటే సుగ్రీవుడే ఎల్లి వాలితో యుద్ధం సెయ్యలేదూ? అలా ఈరోసితంగా గెలిత్తే వచ్చే ఆనందం సెట్టు సాటు నింసీ బానం ఏయింసడం వల్ల రాదు కదా? ఐనా తార నిజంగా సుగ్రీవుడి వద్దకే ఎడతానంటే వాలి పంపించే వాడేమో!" అన్నాడు.

శంకరయ్య దంగైపోయాడు. "వీడు తెలుగు సినిమాలకి డైలాగులు రాయాల్సిన వాడు- వెధవ నాకు నీతులు నేర్పుతున్నాడు!" అనుకున్నాడు.

"వాలి రాజుగా ఉంటే పెజలేం కష్టాలు పడలేదని పంతులుగారు సెప్పారు. సుగ్రీవుడికీ, వాలికీ పళ్లేదు కనక దాన్ని ఆళ్లిద్దరే తేల్చుకున్నారు రాములో రొచ్చిన్దాకా!" లక్కీగాడు అంతటితో ఆపాడు.

లక్కీగాడు మొండివాడన్న సంగతి శంకరయ్యకు బాగా తెలుసు. వా దేపనైనా చేస్తానంటే ఎవరూ వాణ్ణాపలేరు. చెయ్యనంటే చేయించనూ లేరు.

"నే నాలోచిస్తా, నువ్వెళ్లు" వాడి నీతిబోధల్ని హరాయించుకోలేక, వాడింత నీతిమంతు డెప్పుడయ్యాడో అర్థంకాక, కోపాన్ని దిగమింగి అన్నాడు శంకరయ్య.

లక్కీగాడు వెళ్లినదగ్గర్నుంచీ శంకరయ్య ఆలోచిస్తూనే ఉన్నాడు. పోనీ జయలక్ష్మిని వదిలేద్దామంటే సినీతారల్ని తలదన్నే పర్సనాలిటీ! రంభ ఎలా ఉంటుందో తెలియదుగానీ, జయలక్ష్మి ఉంటే చాలనిపిస్తుంది. పైగా, ముప్ఫై సంవత్సరాల అనుభవంతో జయలక్ష్మి లాంటి ఆడదాన్ని, ఆమె ఇచ్చే ఆనందాన్నీ శంకరయ్య ఎరగడం ఇదే మొదటిసారి! ఆ ఆనందాన్ని ఇంకొకళ్లతో – తన ఊళ్లోని నాయుడితోపాటు పంచుకోవలసి రావడాన్ని సహించ లేకపోయాడతను.

దీన్నర్థం చేసుకోలేని లక్కీమీది కోపాన్ని హరాయించుకోలేక పోతున్నాడు. అలాగని మళ్లీ లక్కీగాడు తిరుగుబాటేం చెయ్యట్లేదు. వాడు చెప్పింది సమంజసమేనని మనసులో ఏ మూలో అనిపిస్తూంటే దాన్ని కొట్టి పారెయ్యలేకపోతున్నాడు.

"ఏం చెయ్యాలి?" అన్న ప్రశ్నకు జవాబు దొరకక చివరకు సూరయ్యని సలహా అడగడానికి నిశ్చయించుకున్నాడు. సూరయ్య శంకరయ్య తండ్రికి నమ్మిన బంటు. శంకరయ్య తండ్రి సూరయ్యకి ప్రేమగా 'శకుని' అని పేరుకూడా పెట్టాడు– అతగాడి రాజకీయ చతురతకు ముగ్ధుడై.

యజమాని పోయిన తర్వాత ముసలితనంతో రోజూచేసే పనులనించీ విశ్రాంతి తీసుకుని ఓ చిన్న పెంకుటింట్లో సూరయ్య కాలం వెళ్లబుచ్చుతున్నాడు.

శంకరయ్య చెప్పింది పూర్తిగా విన్న తరువాత "నీకు స్వాభిమానాభివృద్ధి వ్రతం చెయ్యవలసిన సమయం వచ్చిం"దన్నాడు.

"అదేం వ్రతం? ఆ పేరు ఇంతవర కెప్పుడూ వినలేదే!" ఆశ్చర్యపోయాడు శంకరయ్య.

"ఇది వినాయక చవితి వ్రతం లాంటిది కాదు అందరికీ తెలియడానికి. రాజులకూ, పాలకులకూ మాత్రమే తెలుసు. ఈ వ్రతాన్ని పూర్వం పాండవులలో పెద్దవాడు ధర్మరాజు చేశాడు. ఆ కథ చెబుతాను విను!" అని మొదలుపెట్టాడు.

* * *

భారతయుద్ధంలో గెలిచి ధర్మరాజు పట్టాభిషిక్తుడైన తర్వాత పాండవసభలోకి భటులు ఒక వ్యక్తిని ప్రవేశపెట్టారు న్యాయవిచారణకై. అతడి పేరు విలోదుడు. అతని మీద నేరారోపణ – రాజద్రోహం.

"విన్నావుగా నేరారోపణ? దీనికి సమాధానమేమిటి?" ధర్మరాజు ప్రశ్నించాడు.

"నా మీద రాజద్రోహ నేరారోపణ సమంజసం కాదు మహారాజా!" విలోదుడు వినయంగానే ధీరత్వంతో మనవి చేశాడు.

"మరి నీ నేరమేమిటో నువ్వే చెప్పు!" ధర్మరాజు సాత్వికంగానే ప్రశ్నించాడు.

"నేరమైతే గదా ధర్మప్రభూ అదేమిటో వివరించడానికి?" ఎదురు ప్రశ్న వేశాడు విలోదుడు.

"నేరమేమీ చెయ్యి లేదంటున్నాడు మరి నిరపరాధైన ఇతడు కారాగారంలో ఎందుకు ఉన్నాడు?" అని ఆలోచిస్తూ ధర్మరాజు మంత్రిని విలోదుడి నేరమేమిటో విశదీకరించ మన్నాడు.

నేరారోపణ పత్రాలు చదివి మంత్రి ఇలా చెప్పాడు. "ఈ విలోదుడు భారత యుద్ధంలో కౌరవుల పక్షాన యుద్ధం చేశాడు. మొదటిరోజు యుద్ధం అయిన తర్వాత ఆ రాత్రి, ఇతడు మిగిలిన సైనికులతో ఈ యుద్ధం సైనికుల మధ్య జరగకూడ దన్నాడు. రాజ్యాన్ని పాలించేది కౌరవులైతేనేం, పాండవులైతేనేం, ప్రజల కెటువంటి ఇక్కట్లు లేవన్నాడు. కౌరవుల యుద్ధం తమ పాలనని నిలబెట్టుకోవడానికే కనుక, శత్రువుల నెదుర్కోవడానికి తయారు చేసిన సైన్యాన్ని దాయాదులతో జరుగుతున్న యుద్ధానికి ఉపయోగించరాదని ఉపన్యాసా లిచ్చాడు. దాయాదుల యుద్ధంలో సైన్యానికి తావుండరాదనీ, సైన్యం సమసి పోయిన తరువాత దాయాదులలో గెలిచినవాళ్లు రాజ్యపాలన చెయ్యడం న్యాయం కాదని వాదించి, దాయాదులు వారిలో వారు మాత్రమే యుద్ధం చెయ్యాలని ప్రతిపాదించాడు.

"అప్పటికే ఒకరోజు బీభత్సాన్నీ, దారుణ మారణకాండనీ ప్రత్యక్షంగా చూసిన విలోదుడి చుట్టూ మూగిన కౌరవసైనికులు అతడి ప్రతిపాదనతో ఏకీభవించారు." చారులద్వారా ఈ వార్త భీష్మాచార్యుల వారికీ, దుర్యోధనుడికీ చేరింది.

"దుర్యోధనుడు ఆగ్రహోదగ్రుడై ఈ రాజద్రోహానికి శిరచ్ఛేదమే తగిన శిక్షన్నాడు. యుద్ధరంగంలో యుద్ధం చేయననేవాడు పిరికివా డన్నాడు. వాడికి సైన్యంలో తావు లేదన్నాడు. విలోదుడి వాదనకి స్పందించిన సైనికులను దృష్టిలో పెట్టుకొని, భీష్ముల వారు దుర్యోధనుడిని వారించారు. మిగిలిన సైన్యాన్ని ఈ విపరీత వాదనతో ప్రభావితం చేయకుండా ఉండడానికి అప్పటికి మాత్రం విలోదుడికి కారాగార శిక్ష వెయ్యమన్నారు. యుద్ధం అయిన తర్వాత పూర్తి నేర విచారణ జరుపుదా మన్నారు. ఇప్పుడిది విచారణ సమయం!"

ధర్మరాజు ఆలోచించాడు. విలోదుడి వాదన సమంజసంగానే తోచింది. భీష్ముడు, ద్రోణుడు, కృపుడు మొదలైన వీరులందరూ కౌరవుల పక్షాన యుద్ధం చెయ్యక పోయినట్లయితే

భారతయుద్ధం ఎంతో త్వరగా ముగిసేది. కౌరవులు హస్తినాపురాన్ని సవ్యంగా పరిపాలించడం లేదు, ప్రజలని పీడిస్తున్నారని కాదుగదా తాము యుద్ధం చేసింది!.

ఆ పాలనలో న్యాయమైన భాగం కొరకు. అలాగని ఒక సైనికుడు మిగిలిన సైనికులని యుద్ధం చేయవద్దని ప్రోత్సహించడాన్ని తను సమర్థించలేదు. యుద్ధరంగం మీద ఆ యుద్ధం సముచితమా కాదా అన్న వాదనలని సైనికులు చెయ్యకూడదు. ద్రోణుడు, కృపుడు మొదలైన వారంతా రాజు ఉప్పు తిన్నారన్న ఉద్దేశంతో యుద్ధం చేశారు తప్ప దాని ఉచితానుచితాల్ని ప్రశ్నించలేదు. ఈ రెండు ఆలోచనల తూర్పు, పడమరల మధ్య నలిగిన ధర్మరాజు సలహా కోసం నైమిశారణ్యంలో ఉన్న సూతమహర్షి వద్దకు వెళ్లాడు.

"ఏం ధర్మరాజా, ఏమి విశేషం? అరణ్యవాస సమయంలో నా దగ్గర వినాయక చవితి వ్రతకథ చెప్పించుకున్న తరువాత మళ్లీ ఇదే కనపడడం!" సూతుడు మందహాసంతో పరామర్శించాడు.

"ఆ వ్రతఫలితం వల్ల నేనీనాడు రాజ్యపాలకుడ నైనాను. ఈనాడు రెండు సమంజసమైన వాదాల నడుమ నలుగుతున్న నాకు పరిష్కారమార్గాన్ని చూపుతారని వచ్చాను మునివర్యా," అని వినయంగా జవాబిచ్చి విలోదుడి కథని వివరించాడు.

విన్న తరువాత సూతమహాముని చిన్న నవ్వు నవ్వి, "నువ్విప్పుడు చేయవలసింది స్వాభిమానాభివృద్ధి వ్రతం" అని సెలవిచ్చాడు.

"ఆ వ్రతమేమిటో సెలవియ్యండి మునివర్యా," ధర్మరాజు వినయంగా మనవి చేశాడు.

"ఈ వ్రతాన్ని త్రేతాయుగంలో రామరావణ యుద్ధ సమయంలో రావణుడు ఆచరించాడు. అదెలాగునన..."

* * *

రావణుడి కొడుకు మేఘనాధుడి బాల్యమిత్రుడు అయోమయుడు. ఇనుము లాంటి శరీరం కలవాడవడంతో అతడికాపేరు వచ్చింది. ఇంద్రజిత్తంతటి వీరుడు కూడా. అయితే ఎక్కువగా ఆలోచిస్తాడని ఇంద్రజిత్తతణ్ణి ఆట పట్టించేవాడు.

రామరావణ యుద్ధం మొదలై, మొదటిరోజు యుద్ధం అయిన తరువాత యుద్ధ భూమిలో మృతులైన రాక్షస సంఖ్యచూసి అయోమయుడికి ఆశ్చర్యమేసింది. దేవతల నోడించిన రావణ సైన్యానికి మానవులతో, వానరులతో యుద్ధం లిప్తపాటులో ముగియ గలదన్న ఆత్మస్థైర్యంతో ఉన్నవాడు కాస్తా ఆ ఆత్మస్థైర్యం సడలి ఆ యుద్ధపు ఉచితాను చితాలని గూర్చి ఆలోచించాడు. ఒక మానవ నారి అపహరణ కారణమైన ఆ యుద్ధంలో రావణుడికి తప్ప మిగిలిన అసురులకు ప్రమేయం లేదని గ్రహించాడు.

పరాక్రమవంతుడు గనుక రావణుడే రాముడిని ఎదుర్కోవాలన్న తీర్మానానికి అయోమయుడు వచ్చాడు. ధైర్యం గలవాడు కాబట్టి రావణుడికి ఎదురుగా నిలబడి ఆ విషయాన్ని చెప్పాడు.

రావణుడు ఆగ్రహంతో కంపించిపోయాడు. దేవతల నోడించి రాక్షసజాతికి గర్వ కారకుడైన తనని అయోమయుడు తప్పుపడుతున్నా డన్నాడు.

దేవతలతో యుద్ధం రాక్షసజాతి మనుగడకు సంబంధించినదనీ, అందుకని రాక్షసులందరూ యుద్ధం చెయ్యవలసినదేననీ, రాముడితో యుద్ధం అలాంటిది కాదనీ అయోమయుడు వాదించాడు.

యుద్ధభూమిలో యుద్ధం చేయకపోవడమే కాక తనతో వాదిస్తున్నందుకు కోపంతో రావణుడి కళ్లు ఎర్రగా తయారయ్యాయి. చెవుల్లోంచి ఆవిరి రావడం మొదలైంది. అయినా తమాయించుకుని, మేఘనాధుడి స్నేహితుడనీ, పూర్వపు యుద్ధాలలో అమేయ పరాక్రమాలు చూపించాడనీ శిరచ్ఛేదం చెయ్యక అయోమయుడ్ని చెరసాలలో బంధించాడు.

లక్ష్మణుడి చేతిలో మేఘనాధుడు హతుడైన తరువాత రావణుడు అయోమయుడ్ని అర్థించాడు స్నేహితుని చంపిన శత్రువుమీద పగ తీర్చుకొమ్మని. అయోమయుడు చలించలేదు సరికదా, తన తీర్మానం మీద తనకున్న విశ్వాసం పెరిగిందన్నాడు. రావణుడే కనుక తనమాట వినివుంటే మేఘనాధుడు సజీవుడై వుండేవా డన్నాడు.

ఆ క్షణంలో రావణునికి అయోమయుడి వాదన సమంజసమే నేమోనని అనుమానం పొడసూపింది. ఒంటరిగా తన మందిరానికి వెళ్లి దీర్ఘంగా ఆలోచించాడు. ఆలోచించినకొద్దీ సంశయం పెరిగింది. వాదన తనలో కలిగించిన అలజడిని తల్లి దగ్గర వెలిబుచ్చాడు.

దితి రావణుణ్ణి పరకాయించి చూసింది. “సీతాపహరణ ఉచితానుచితాలని గూర్చి నీ కిదివరకే చెప్పాను. నీ నిర్ణయం నువ్వు తీసుకున్నావు. అయోమయుడి సమస్యని పరిష్కరించడానికి నువ్వు స్వాభిమానాభివృద్ధి వ్రతాన్ని చెయ్యడం నీ తక్షణ కర్తవ్యం. ఈ వ్రతాన్ని మీ తండ్రి కశ్యపప్రజాపతి చేస్తుండగా చూశాను. రాజులకు ఆత్మస్థైర్యం లోబడినప్పుడు ఈ వ్రతం సత్ఫలితాలనిస్తుంది,” అని చెప్పి రావణునికి ఆ వ్రతాన్ని బోధించింది.

“నీ మీద నీకు అపనమ్మకం, లేక నీ నిర్ణయంమీద నీకు ఏ కొంచమైనా సంశయం కలిగినప్పుడు ఈ వ్రతాన్ని చెయ్యి. ఒకగదిలో వెయ్యి దీపాలని పద్మాకారంలో అమర్చి వాటిలో మధ్యలో నీవు పద్మాసనం వేసుకుని కూర్చోవాలి. నీ ఆలోచనలని నిలిపి, భ్రూమధ్యంలో దృష్టిని కేంద్రీకరించి, నేను చెప్పబోయే మంత్రాన్ని వెయ్యిసార్లు ఉచ్చరించాలి.

“అహం సర్వేషామపి వరిష్ఠః

మమ వచనం సర్వైరపి శృణ్వన్తు॥

“వెయ్యిసార్లు ఉచ్చారణ చేసిన తరువాత తూర్పుకు తిరిగి అర్ఘ్యం విడు. అప్పుడు ఈ వ్రతాన్ని నీవు సక్రమంగా సంపూర్తిగా చేసినట్లు. నీకు కావలసిన ఆత్మస్థైర్యం లభిస్తుంది.”

ఆరోజు రాత్రి రావణుడు ఆ వ్రతాన్ని చేసి, అయోమయుడి సంగతి తేల్చడానికి కావలసిన ఆత్మస్థైర్యాన్ని పొందాడు," అని ముగించాడు సూతమహర్షి.

ధర్మరాజు ముఖంలో సందేహం పొడచూపింది. "ఒక దానవుడు చేసిన వ్రతాన్ని..." అని అనబోయి మధ్యలోనే ఆగిపోయాడు.

"దానవుడైనా పాలకుడేగా! కశ్యప ప్రజాపతికి ఇంకొక కొడుకైన దేవేంద్రుడు ప్రతీరోజూ ఈ వ్రతాన్ని చేస్తూనే ఉంటాడు. ఎవరైనా ఋషుల తపస్సు వలన తన పదవికి భంగం వాటిల్లే సూచనలు కనిపిస్తే మరీ విపరీతంగా చేస్తాడు. పైగా రాజు రాజ్యపాలకుడు. దేవుడి తరువాత రాజే గొప్పవాడని శాసనాలు, పురాణాలు, వేదాలు ఉద్ఘోషిస్తున్నాయి. దేవతలస్తుతులు కూడా 'రాజార్చిత' అని దేవుళ్ల మహిమలతో పాటు రాజుల గొప్పదనాల్ని కూడా చాటుతున్నాయి!" అని సెలవిచ్చాడు సూతమహర్షి.

"అయితే వెంటనే ఈ వ్రతాన్ని నేను నా ధర్మపత్నితోనూ, అనుజులతోనూ చేసుకుంటాను!" సందేహ నివృత్తి అయినవాడై అన్నాడు ధర్మజుడు.

"కాదు ధర్మరాజా, ఈ వ్రతాన్ని నీవు మాత్రమే ఆచరించాలి. కావాలంటే నీ తరువాత పట్టాభిషిక్తులయ్యే వారికి నువ్వీ వ్రతాన్ని తెలుపవచ్చు."

ధర్మరాజు హస్తినాపురాని కేగి వ్రతా న్నాచరించి, ఆ వ్రత ఫలప్రాప్తిని పొందాడు.

* * *

"ఇప్పుడు రాజులులేరు కనుక ఈ వ్రతాన్ని ప్రజాపాలకులు, రాజకీయ నాయకులు, మంత్రులు ఆచరిస్తూంటారు" అని ముగించాడు సూరయ్య.

శంకరయ్యకి కూడా ఆ వ్రత మాచరించిన తరువాత సందేహనివృత్తి అయి లక్కీగాడికి ఇవ్వవలసిన సమాధానానికి కావలసిన ఆత్మస్థైర్యం లభించింది.

మరునాటినించీ లక్కీగాడిని చూసినవాళ్లెవరూ లేరు – చరిత్రలో అయోమయుడి గూర్చీ, విలోదుడి గూర్చీ విన్నవాళ్లు లేనట్టుగానే.

రావణుడి తల్లి అతనికి బోధించిన మంత్రానికి అర్థం – నేనే అందరికన్నా గొప్పవాణ్ణి! నా మాటే అందరూ వినాలి!!

(స్వాతి మాసపత్రిక, అక్టోబరు 2004)

# సున్నాల పక్కన ఒకటి

దూరాన కనిపిస్తున్న ఎత్తైన పర్వతం దగ్గరవుతున్న కొద్దీ రామస్వామి కళ్లకి అది పర్వతం కాదనీ ఎత్తైన గుట్ట అనీ, ఇంకా దగ్గరయ్యే కొద్దీ ఆ గుట్ట వెయ్యిరూపాయల కట్టలనీ, ఇంకా ఏవో నోట్ల కట్టలనీ కుప్పగా పొయ్యడం వల్ల తయారయినదనీ గుర్తించి అతను ఆశ్చర్యపోయాడు. తిరుమల తిరుపతి దేవస్థానంలో గానీ, పద్మనాభస్వామి దేవస్థానంలో గానీ పనిచేసే వాళ్లెవరూ కూడా ఇంత డబ్బుని ఎప్పుడూ కళ్లారా చూసి ఉండరని అనుకున్నాడు. వాళ్లదాకా ఎందుకు? ఆ వెంకటేశ్వరుడూ, పద్మనాభుడూ కూడా చూసి ఉండరనే అనుకున్నాడు.

"ఇది నీ సంపాదన!" అన్నాడు అతణ్ణి అక్కడకు తీసుకొచ్చినవాడు. రామస్వామి ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది.

తనతో బాటు తీసుకుని వెళ్లలేదని అందరూ నమ్మించిన నోట్లు ఎదురుగుండా కనిపించడం రామస్వామికి కలిగిన అంతులేని ఆశ్చర్యానికి మొదటి కారణం. రెండవది, అతనెప్పుడూ తనకెంత డబ్బు ఉన్నదీ – లక్షలతో మొదలు పెట్టి, కోట్లని దాటి, లక్షలాది కోట్లని దాటిన దాకా– అంటే, ఏ బ్యాంకు లాకర్లో ఎంత బంగారం ఉన్నదీ, స్విస్‌బ్యాంకుల్లో ఎంత డబ్బు ఉన్నదీ, దేశవిదేశాల్లో ఉన్న రియల్ ఎస్టేట్ ప్రాపర్టీ విలువ ఎంత, లాంటి వివరాలు– కాగితం మీద రాసిన సంఖ్యలలో మాత్రమే తెలుసుకోగలిగాడు గానీ ఆ డబ్బు నంతటినీ ఒక్కచోట అత నెప్పుడూ చూడలేదు. నాలుగేళ్ల మనవడితో తన కెంత డబ్బు ఉన్నదో గెస్‌చేసి కాగితం మీద అంకెలువేసి చూపమనేవాడు. అతని ఉద్దేశంలో సంఖ్యా శాస్త్రమంతా ఒకటి, సున్నా అనే అంకెలకే పరిమితం. ఒకటి పక్కన ఎన్ని సున్నా లనేదే అతని ప్రశ్న. ముప్పై సున్నాలున్నా గానీ ముప్పైలో మూడు అన్న అంకె ఉండక తప్పదు గదా అన్న పెద్ద మనవణ్ణి, "ఆ తెలివితేటలతో పైకి రాలేవు!" అని కసిరాడు. అతని సంపాదన ఒకటి పక్కన పది సున్నాల నెప్పుడో దాటింది. అది వంద సున్నాలకి ఎప్పుడు చేరుతుందా అన్న ఆలోచనే అతని బుర్రని ఎప్పుడూ తొలుస్తూండేది.

అతని ఆశ్చర్యానికి మూడో కారణం, అంతటి మనోహర దృశ్యాన్ని ఏ ధనలక్ష్మి పక్కనో నిలబడి కాకుండా యమకింకరుని పక్కన నిలబడి చూడడం.

ఆ ఆశ్చర్యం స్థానంలో పరమానందం చోటు చేసుకోవడానికి ఎంతోసేపు పట్టలేదు. లారీల్లో నోట్లకట్టలని తరలిస్తున్నప్పుడు పట్టుబడతాడేమో నన్న భయం గానీ, ఇంట్లో అల్మైరాలో దాస్తే ఇన్‌కంటాక్సువాళ్లు రెయిడ్ చేస్తే వాళ్లని బెదిరించడానికి కలిగే కోపం గానీ, తన వంతు ఏదని ప్రశ్నించే పార్టీ హైకమాండ్ వేధింపుల వల్ల కలిగే విసుగు గానీ లేకుండా ఆ డబ్బు పర్వతాన్ని కనులారా చూసి ఆనందించాడు. మేరు పర్వతంలా ఉన్న ఆ గుట్టపైకి ఎక్కడానికి విశ్వప్రయత్నం చేసి కింద నోట్లకట్టలు జారిపోవడం వల్ల కాలికి పట్టుదొరక్క ఆ కుప్ప మీద బోర్లాపడ్డాడు. వెనక్కి తిరిగి, రెండుచేతులతోనూ అందిన నోట్లకట్టలని పైకి ఎగురవేస్తూ చిన్నపిల్లాడు బెలూన్లని ఎగురవేసినంత సంబరపడ్డాడు. ఆ నోట్ల కట్టలు మీద పడుతుంటే పూలవాన పడుతున్న ఫీలింగ్‌తో ఉయ్యాల్లో పైన తిరుగుతున్న రంగురంగుల బొమ్మలని చూసి పసిపిల్లాడు కేరింతలు కొడుతున్నట్లు కాళ్లూ చేతులూ ఆడించాడు.

"ఏరిరా రంభ, ఊర్వశి, మేనకలు? నీ యబ్బ. పట్రండిరా వాళ్లని! స్వర్గమంటే ఈ కుప్పమీద నాతో కలిసి పొర్లడం. భూమ్మీద నాకెట్లాగూ కుదర్లేదు. మా లోకం నుంచి నా క్కావలసిన అందగత్తెలని ఇప్పటికిప్పుడు పట్రమ్మంటే మీ కెలాగో చేతకాదు!" డిమాండ్ చేశాడు.

ఎవరో అతన్ని జబ్బపుచ్చుకుని విసురుగా లేపి నిల్చోబెట్టినట్టు నిఠారుగా నిలబడ్డాడు. అమెరికా పిల్లాడి చేతిలోంచి ఐపాడ్‌ని లాక్కున్నట్టుగా అనిపించి అతని కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"నువ్వు నీ జీవితకాలంలో చేసిన పుణ్యఫలం ఆ క్షణికానందం. అసలు నువ్వు ఆ మాత్రమైనా పుణ్యం చేశావంటే నాకు అసలు నమ్మబుద్ధి కావట్లేదు!" అన్నాడు ఆ కింకరుడు.

శిక్షని అమలుచేసే ప్రదేశానికి అతణ్ణి తీసుకువెడుతున్నానని ఆ కింకరుడు చెప్పడం రామస్వామికి అప్పుడు గుర్తొచ్చింది. అయోమయంగా ఆ కింకరుణ్ణి చూశాడు.

"నువ్వీ నోట్లన్నీ చింపి పోగులు పెట్టాలి!" ఆజ్ఞాపించాడా కింకరుడు.

"నీ కేమైనా పిచ్చా వెర్రా? వీటిని చింపడమేమిటి? అసలు నాతో పాటు ఇవి రావనే అనుకున్నాను. వీటిని పోగుచెయ్యడానికి యాభై ఏళ్లకి పైగా కష్టపడ్డాను!" అరిచాడు రామస్వామి.

"మొదటి లక్షకి కష్టపడాలి. తరువాతి లక్షలకి అంత కష్ట మనిపించదు. మొదటి కోటికీ అంతే. అయినా అది కష్టపడేవాళ్లని గూర్చి చెప్పింది. నీలాంటి వాళ్లని గూర్చి కాదు. నోరు మూసుకుని ఇంక మొదలుపెట్టు!" గదిమాడు.

నోట్ల కట్టల్ని చిత్తుకాగితాలలాగా చింపమంటున్నారని ముందు విచారమేసినా, ఆ గుట్ట సైజు చూసి అతని గుండె గుభేల్మంది. "ఎంతకాలం పాటు?" అడిగాడు.

నవ్వాడా కింకరుడు. చూడ్డానికి చిరునవ్వులాగానే ఉన్నా అది వికటాట్టహాసంలా వినిపించింది రామస్వామికి. చేసేది లేక గుట్టవైపు చేయి చాచగానే ఒక రూపాయి నోటు అతని చేతిలోకి రావడం రామస్వామికి చిత్రమనిపించింది. "రూపాయి కాగితం చలామణీలో లేక ఇరవై ఏళ్లయింది!" అనుకుని, ఆ నోటుని చూసి అది పంథొమ్మిది వందల యాభైలో ముద్రించినదిగా గుర్తించాడు.

ఆ రూపాయి నోటుకి మాత్రం అతను బాగానే గుర్తున్నాడు. అతనికి పదేళ్ల వయసప్పుడు అతను దాన్ని ఎదురింటి వాళ్లమ్మాయి గిరిజ నుంచి మాజిక్ అనిచెప్పి మాయజేసి జేబులో పెట్టి తెచ్చుకున్నాడు. గిరిజ వాళ్ల నాన్నతో కలసి రామస్వామి వాళ్లింటికొచ్చి అతని తండ్రికి కంప్లైంటు చేసింది.

"ఏరా వాళ్ల రూపాయి కాగితం నీ దగ్గరుందా?" అడిగాడు అతని తండ్రి. దానికి జవాబుగా, గిరిజ వాళ్ల నాన్న మోకాలి మీద ఫెడీమని తన్నాడు రామస్వామి. "ఎవరూ మా అబ్బాయిని దొంగ అనడం నాకు ఇష్టముండదు!" అన్నా డతని తండ్రి. వచ్చిన వాళ్లు కోపంగా గిర్రున తిరిగి వెళ్లిపోయారు.

"పెట్టుబడి లేకుండా రూపాయి సంపాదించావు. ఇలాగే అభివృద్ధి చెందు!" ఆశీర్వదించాడు అతని తండ్రి.

ఎవరో "నెక్స్ట్" అన్నట్లుగా ఆ రూపాయి నోటు అతని చేతిలోంచి ఎగిరిపోయింది. మళ్లీ అతను చెయ్యి చాచేసరికి అతని చేతిలోకి ఈ సారి ఒక రూపాయి నోట్లు పది వచ్చాయి. వాటికీ అతను బాగా గుర్తున్నాడు.

సంక్రాంతి పండక్కి పదేళ్ల రామస్వామి వాళ్ల ఇల్లు అత్తయ్యా మామయ్యలతో, పెద్దమ్మ పెద్దనాన్నలతో, అన్నయ్య వదినెలతో, అక్క బావలతో, వాళ్ల పిల్లలతో నిండిపోయింది. ఆ సరదాల మధ్యలో పిల్లలు రామస్వామి మీద కంప్లైంటు చేశారు. తమ డబ్బులు అతను– తీసుకుని ఇవ్వట్లేదని. వివరంగా వాళ్లు చెప్పిందిది. అతను వాళ్లని, "మీ దగ్గర రూపాయి ఉన్నదా?" అనడిగి, "ఒక రూపాయిని పదిచేస్తాను," అన్నాడు. రూపాయి ఉన్న వాళ్లిచ్చారు. లేనివాళ్లు తల్లిదండ్రుల దగ్గర అడిగి తెచ్చిచ్చారు. అతను ఒకచేత్తో గిరిజ దగ్గర సంపాదించిన రూపాయిని చూపించాడు. రెండో చేత్తో వాళ్లిచ్చిన పదిరూపాయలనీ చూపించి మొత్తాన్ని జేబులో వేసుకున్నాడు.

"రూపాయిని పది చేస్తానన్నాడు గానీ మీ కిస్తానని అన్లేదుగా!" పాయింటు లేవదీశాడు అతని తండ్రి.

భేతాళుడు మర్రిచెట్టు వెదుక్కుంటూ వెళ్లినట్లుగా ఈ పదిరూపాయలూ రామస్వామి చేతులోంచి వెళ్లిపోయాయి. మే మున్నామంటూ అతని చేతిలోకి వచ్చి వాలాయ్ పది రూపాయలనోట్లు కొన్ని. ఆ నోట్ల మాటల్లోనే..

"ఏముందీ, ముందులాగానే పట్నంలో క్లాసుమేట్లకి పదిని వందచేస్తానని చెప్పి మమ్మల్ని తన చేతిలోకి తీసుకున్నాడు. బంధువుల కుండే మొహమాటాలు వాళ్లకి ఉండవుకదా, తన్నడానికి వెంటపడ్డారు. పారిపోతున్నప్పుడు కనపడ్డ ఒక గూండాకి పది రూపాయలిస్తా ననేటప్పటికి వాడు వీడికి బాడీగార్డయి కూర్చున్నాడు."

అగ్నిపర్వతం లోంచి వెలువడ్డ లావాలాగా ఆ గుట్ట మధ్యలోంచి వచ్చిన వేలి ముద్రలు మాత్రం ఉన్న కాగితాలు అతని ముందుకొచ్చెయ్. నలభయ్యేళ్ల క్రితం వ్యవహారం అతనికి అంతగా గుర్తులేకపోవచ్చు గానీ అతణ్ణి మాత్రం అవి మరచిపోలేదు.

"జోగయ్య, రత్తమ్మ, జానకమ్మ గుర్తున్నారా?" అంటూ అవి అతణ్ణి చుట్టుముట్టాయి. రత్తమ్మనీ, జానకమ్మనీ అతను తేలిగ్గానే మరిచిపోయుండవచ్చు గానీ, జోగయ్య మొన్నీమధ్య దాకా "స్వామికార్యం" సక్రమంగా నిర్వహించబడడానికి సహాయం చేస్తూనే ఉన్నాడు. అతను భూపరిమితి చట్టం తాలూకు మిగిలిన శకలం.

రత్తమ్మ జోగయ్య భార్య. జానకమ్మ వాళ్ల పన్నెండేళ్ల కూతురు. రామస్వామి తండ్రి భూపరిమితి చట్టాన్నుండీ తప్పించుకోవడం కోసం పనివాళ్లకీ, పాలేర్లకీ ఆస్తులు రాసిచ్చినప్పుడు వాళ్లింట్లో పనిచేస్తున్న జోగయ్య తను అదృష్టవంతుణ్ణనే అనుకున్నాడు. తండ్రి పోయిన తరువాత ఇరవయ్యేళ్లకే రామస్వామి గద్దె నెక్కిన సమయంలో జోగయ్య "నా ఆస్తి" అనే పరిస్థితి కొచ్చాడు. దానికి కారణం, పక్క ఊళ్లోని సోషలిస్టు నాయకుడు వెంకటేశ్వర్లు ప్రజల హక్కుల గూర్చి ఉపన్యాసా లిస్తూ ఊరూరా తిరుగుతూ ఆ ఊరికి రావడం, అతని మాటలు జోగయ్య చెవికెక్కించుకోవడం.

రామస్వామి తమచేత తెల్లకాగితాల మీద వేలిముద్రలు వేయించుకుంటున్నప్పుడు అందరు పనివాళ్లతో కలిసి జోగయ్య కూడా వేలిముద్ర వేశాడు గానీ ఆ రాత్రే అతను పక్క ఊరికెళ్లి వెంకటేశ్వర్లుని కలిసివచ్చాడని రామస్వామికి తెలిసింది. మరునాడు చీకటిపడే ముందు వెంకటేశ్వర్లుని లేపేసే కార్యాన్ని రామస్వామి జోగయ్యకు పురమాయించాడు. అతనొచ్చేదాకా ఒంటరిగా ఉండడ మెందుకని రత్తమ్మనీ, జానకమ్మనీ తనింట్లో వదిలి వెళ్లమన్నాడు. మొదట సందేహించినా ఆ ప్రాంగణం ఎప్పుడూ సందడిగానే ఉంటుంది గనుక జోగయ్య స్వామి ఆజ్ఞని పాటించి బయలుదేరాడు.

జోగయ్య దాదాపు అర్థరాత్రప్పుడు వచ్చి వెంకటేశ్వర్లు తప్పించుకున్నాడని చెప్పి భార్యనీ, కూతురునీ తనతో తీసుకువెడతా నన్నాడు. "వాళ్లు నిద్రపోతున్నారు. రేప్పొద్దున్న

వస్తార్లే!" అని అతణ్ణి పంపేశాడు రామస్వామి. నీళ్లు నమిలినా జోగయ్యకి వెళ్లక తప్పలేదు. అతనికి తెలియని దేమిటంటే, అతని వెనుక పోతురాజును రామస్వామి పంపాడనీ, "నీ ప్రాణాల మీద ఆశవుంటే ఊరొదిలి వెళ్లిపొమ్మ"ని జోగయ్య వెంకటేశ్వర్లుకి వార్నింగ్ ఇచ్చి, అటూ ఇటూ తిరిగి కాలయాపన చేసి వచ్చాడనీ పోతురాజు అప్పటికే రామస్వామికి చెప్పాడు.

మరునాడు జానకమ్మ రక్తసిక్తమైన పరికిణీతో చెరువు పక్కన కొన ఊపిరితో పడి ఉండడాన్నీ, రత్తమ్మ శరీరం బావిలో తేలడాన్నీ, జోగయ్య ఒక చెయ్యి జీవం లేకుండా వేలాడుతుండగా పిచ్చిపట్టినట్లు తిరగడాన్నీ ఆ ఊరి ప్రజలు సూర్యుడు తూర్పున ఉదయిస్తాడన్నంత సహజంగా తీసుకున్నారు.

అప్పటినుంచీ "స్వామికార్యం" జరగవలసి ఉన్న రోజున రామస్వామి ఇల్లు ఆ పని చేసేవాడి కుటుంబంతో సరదాగా ఉండేది. ఆ కార్యాన్ని జరపబోయే వాడితో బాటు జోగయ్యని వెంటపంపడం, పంపే ముందర పోతురాజు జోగయ్యని చూపించి, అతని కథని ఆ పూజారితో పంచుకోవడం వల్ల ఇంకో జోగయ్యని ఉదాహరణగా చెయ్యవలసిన అవసరం రామస్వామి కెప్పుడూ రాలేదు.

* * *

"జరగండి, జరగండి!" ఎవరి ఆదేశమో తెలియదు గానీ దాన్ని వెంటనే పాటించి వెళ్లిపోయాయి ఆ వేలిముద్రల కాగితాలు. ముందుకు చాచిన చేతికి తగిలిన కట్టల్ని చూసి అతనికి చిరాకేసింది. లేకపోతే, ఎవరో పనికిమాలిన బ్యాంక్ కాషియర్ తయారు చేసినట్లుగా ఒక రూపాయి, రెండు రూపాయలూ, అయిదూ, పదీ, అన్ని రకాల డినామినేషన్లు కలిపి ఉండే కట్టలు ఇక్కడ కూడానా! పైగా, కొన్ని బాగా మాసి, నలిగిపోయి, చిరగడానికి సిద్ధంగా ఉన్న నోట్లు. కొత్త నోట్లు భూతద్దంలో చూసినా ఎక్కడా కనిపించేటట్లు లేవు. దానికి తోడు వాటికి నూనె మరకలు, పాల వాసనలు, పోపు డబ్బాల వాసనలూను. కింకరుడి ఆజ్ఞని పాటిద్దామని ఒక నోటుని చింపబోయేసరికి అది అతని చేతిని కొరికింది. కలిగిన నొప్పివల్ల "అబ్బ" అని విదిలించుకొని గాటుపడ్డ చోట చూస్తే అక్కడ "చిట్‌ఫండ్" అని కనిపించింది.

* * *

పల్లెలో ఎదుగుదల లేదని పట్నంలో చిట్‌ఫండ్ కంపెనీని తమ్ముడిచేత పెట్టించాడు. అక్కడ అతను సంపాదిద్దామనుకున్న కోటి రూపాయలనీ వెయ్యిమంది చేత పదివేల చొప్పున కట్టించవచ్చు. కానీ, పదివేలు కట్టేవాళ్లు కనీసం వందకళ్లతో అతన్ని కాస్తారని అతనికి తెలుసు. అందుకే పదివేల మందిచేత వెయ్యిచొప్పున కట్టించుడే మేలనుకున్నాడు. అయితే, దీనికి టైం పడుతుందని అతనికి అర్థమైంది. చిట్‌ఫండ్స్‌కి కావలసినది నమ్మకం.

ఎంత ఎక్కువమంది నమ్మితే అంత మంచిది. ఆ నమ్మే వాళ్లకి అధికార బలం గానీ, రాజకీయ బలం గానీ ఉండకూడదు. ధనబలం ఉంటే చిట్‌ఫండ్స్ జోలికే రారు. అందుకని నెలకి పది రూపాయలతో మొదలు పెట్టించాడు (అవి పదివేల రూపాయలుకే కాక పది రూపాయలకు కూడా విలువ ఉన్న రోజులు). తర్వాత మెల్లగా పది ఊళ్లకి పాకించాడు.

నోటి మాటని మించిన ప్రసార సాధనం చిట్‌ఫండుకి లేదు. ఆ మాట పాలవాళ్లు, కూరగాయ లమ్మేవాళ్లు, బండీల మీద కాఫీ, టీలు అమ్మేవాళ్లతో మొదలయింది కాస్తా నౌకర్లు, బంట్రోతుల్లాంటి నెలసరి చిన్న జీతగాళ్లకి, ఆ పైన తాలూకాఫీసు క్లర్కులదాకా చేరింది. తను కోరిన కోటీ చేరిందనే గాక ఇంకాస్త పైకి చేరితే పెద్ద ప్రమాద మవుతుందని పసిగట్టిన రామస్వామి ఆ కంపెనీ పెట్టిన దాదాపు పదేళ్లకి, తమ్ముడు డబ్బుతో పరారీ అయ్యాడని స్వయంగా పోలీస్ రిపోర్టిచ్చాడు. ఆ రోజు షట్టర్లు మూసిన కంపెనీ ముందు తన బలగంతో రామస్వామికి రక్షణ కల్పించి ప్రజలమీద లాఠీచార్జీ చేసిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ సక్రమంగా "స్వామికార్యాన్ని" నిర్వహించినవాడే.

* * *

ఫెళ ఫెళలాడే నోట్లకట్టలు అతని చుట్టూ చేరాయి. తమనెప్పుడూ బ్యాంక్ లాకర్లలోనూ, ఇంటి అల్మైరాల్లోనూ, సూటుకేసుల్లోనూ బంధించి ఉంచి, గాలినీ, వెలుతురునీ కూడా తమకు కరువుచేసిన అతణ్ణి చూద్దామని కోట్లమంది చెమటలకి ప్రతినిధులయిన తమని ఎవరికీ సహాయపడనీకుండా చేసిన అతని దర్శనంకోసం ఎప్పటినుంచో అవి వేచివున్నాయి.

ప్రభుత్వ మిచ్చిన బంజరుభూముల పట్టాలను పట్టుకొని పంటకాలువలు రాగానే తమ కష్టాలు గట్టెక్కుతాయని ఆశిస్తున్న గిరిజనులని, ఎన్నో ఏళ్లక్రితం ప్రామిస్ చేసిన పంటకాలువని తవ్వించే ఉద్దేశం ఆ ప్రభుత్వానికి లేదని నమ్మించి, వాటిని తనకు అమ్మేలా చేయించి, వాళ్లల్లో చివరి పట్టాదారుడి వేలిముద్ర పడిన మరునాడు దినపత్రికల్లో ఆ పంటకాలువల తవ్వకాలు రేపో మాపో మొదలవుతాయని "స్వామికార్యం" క్రింద ఒక ప్రకటన నిప్పించాడు. అతను కొన్న భూముల రేట్లు తెల్లవారే సరికి రెట్టింపయాయి.

శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో "ఏమీ తెలియ"దని చెప్పడం ఇష్టంలేక, "వివరాలు త్వరలోనే ప్రకటిస్తాం" అని జవాబుని వాయిదా వేసిన ముఖ్యమంత్రి రామస్వామిని పిలిపించి బెదిరించాడు.

"ఇప్పుడు ప్రభుత్వం, మేమా ప్రకటన నివ్వలేదు!" అని చెబితే అటేమో, మీకు తెలియకుండా పనులు జరుగుతున్నందున అధిష్ఠానం కోప్పడుతుంది. ఇటేమో, మేం మీ కులపోళ్లం కానందుకే ఇలా చేశారని బంద్‌లు, ధర్నాలు చెయ్యడానికి మా వాళ్లు రెడీగా ఉన్నారు. పంటకాలువ తవ్విస్తారో లేదో మీ యిష్టం!" అన్నాడు రామస్వామి.

“కాంట్రాక్టు నీకు వచ్చేలా చేస్తాను. సగం నాకు!” అన్నాడు ముఖ్యమంత్రి.

“భగీరథుడు గంగని తెచ్చినట్లుగా, ఆ కాలువని తవ్వించి అక్కడ ఫ్యాక్టరీలు పెట్టించి మీరు ఉద్యోగాలని తెచ్చి పెడుతున్నారని ప్రచారం చేస్తాను. ఫ్యాక్టరీలకి ఉచితంగా ఎలక్ట్రిసిటీ కావాలి!” అన్నాడు రామస్వామి.

వాటాలు కుదిరి కాలువ పని మొదలు పెట్టినా అది కుంటుకుంటూ నడుస్తున్న సమయంలో ఒక మల్టీనేషనల్ ఎలక్ట్రానిక్ కంపెనీ రామస్వామి కొన్న బంజరు భూములున్న చోట ఫ్యాక్టరీ పెడుతున్నట్లు పత్రికల్లో వార్త వచ్చింది. అక్కడున్న భూముల ధర వెంటనే రెట్టింపయింది. ఆ భూముల్లో కొంతభాగంలో ఎపార్ట్‌మెంట్లు కడతా నన్నాడు రామస్వామి. ప్లాన్లేవీ ప్రభుత్వపు ఆమోదాన్ని కూడా పొందకముందే అవన్నీ వేడి వేడి మిరపకాయ బజ్జీల్లాగా అమ్ముడు పోయాయి. ఆర్నెల్లు తిరక్కుండా ఒక అమెరికన్ కంపెనీ అక్కడ ఫ్యాక్టరీ పెట్టబోతున్నట్లు వార్త వచ్చింది. భూముల ధరలు ఆకాశంలోకి దూసుకుపోయాయి. జాప్యం చేస్తే ధరలు పెరుగుతాయని వెంటనే కొనుక్కుందా మనుకున్న స్వదేశీ నివాసులకు రంగురంగుల బ్రోచర్లు చూసిన ఎన్నారైలు పోటీ కొచ్చేసరికి ఎపార్టుమెంట్ల విక్రయం వేలం పాట లాగా మారిపోయింది.

అక్కడ ఒక ఫాక్టరీని తనే పెడుతున్నాడనీ, దానికి లోను కావాలనీ రామస్వామి ఒక బ్యాంకుకు అప్లైచేసినప్పుడు అతని దగ్గర ఉన్న భూమిపట్టాలని, మార్కెట్ ధర మేరకు పది శాతానికి హామీగా పెట్టి తొంభైశాతానికి అతనికి లోను మంజూరు చేశాడు “స్వామి కార్యాన్ని” సక్రమంగా నిర్వహించే బ్యాంక్ మేనేజర్. అది జరిగిన రెణ్ణెల్లకే మల్టీనేషనల్ కంపెనీ అసలు ఆ భూముల్లో ఫ్యాక్టరీ పెడతానని తనెప్పుడూ అనలేదని అన్నా, ఇంకో రెణ్ణెల్ల తరువాత అమెరికన్ కంపెనీ కూడా దానికి గొంతు జతకలిపినా, అప్పటికే రామస్వామి మంత్రిపదవిలో సురక్షితంగా ఉండడం వల్ల అదంతా కాపిటలిస్ట్ దేశాల, తెల్లవాళ్ల అహంకారం వల్ల అని కారాలు మిరియాలూ పత్రికల్లో వచ్చేలాగా నూరాడు.

కంపెనీ లేవీ అక్కడ ఫ్యాక్టరీలని కట్టట్లేదని తెలిసిన తరువాత అతను కొన్న బంజరు భూములు పదేళ్ల క్రితపు వెలుగులనే సంతరించుకున్నాయి. అసలు అంతకు మించిన వెలుగులు ఎప్పుడూ అక్కడ లేవనే చెబుతాయి ఆ ప్రదేశాన్ని వదిలిపోని పాములూ, తేళ్లూ, జెర్రులూను. అక్కడ ఎపార్ట్‌మెంట్లకి పూర్తి డబ్బులు కట్టిన ఎన్నారైలు ఎవరూ ఆ భూములని చూసినవాళ్లు కారు. అయిదేళ్ల తరువాత, అక్కడ కట్టడాలనేవే లేవని చూసి తెలుసుకుని ఆశ్చర్యపోయారు. రామస్వామికి అప్పిచ్చిన బ్యాంకుకి లోను తీర్చమని అడగడానికి అతనప్పుడు మంత్రి పదవిలో ఉన్నాడు. ధైర్యంచేసి అడిగిన మేనేజర్‌ని భూములను జప్తు చేసుకొమ్మన్నాడు. వాటి విలువ లోను మొత్తంలో రూపాయికి పదిపైసల

చొప్పున కూడా లేదని బ్యాంకు భోరుమంది. అక్కడ ఎపార్ట్‌మెంట్లని కడతా మన్న కంపెనీలన్నీ బినామీ కంపెనీ లని తెలిసి, వాటి దర్యాప్తు వరకూ వచ్చేసరికి అతను ముఖ్యమంత్రయి కూర్చున్నాడు. మొత్తం డబ్బుని ముందే తీసుకున్న కాలవపనిని పూర్తి చెయ్యవలసిన సామాజిక, నైతిక, ధార్మిక బాధ్యతల గూర్చి పత్రికల్లో వచ్చిన సంపాదకీయాలని అతను గిట్టనివాళ్ల ప్రచారాలుగా ఎప్పుడో కొట్టేశాడు.

అతను ముఖ్యమంత్రి అవడానికి ముఖ్యకారణం అతను ఎన్నివిధాలుగా డబ్బుని స్వదేశం నుంచే గాక విదేశాల నుండి కూడా పార్టీ అధిష్ఠానానికి చేర్చగలడో నమ్మకంగా చెప్పగలగడం. పదవిని పొందిన తరువాత ఆ మాటని శాయశక్తులా కృషిచేసి నిలబెట్టుకున్నాడు. అతను వివిధ సంక్షేమ పథకాలను ప్రతిపాదించడమే కాక కేంద్ర ప్రభుత్వం నుంచీ, ప్రపంచ బ్యాంకు నుంచీ, ఐఎమ్మెఫ్ నుంచీ కూడా పెద్దమొత్తాల్లో అప్పులు తెచ్చాడు. పంచభూతాల్లో ఏ భూతాన్నీ వదలకుండా ప్రతీదానికీ ఒక యజ్ఞాన్ని తలపెట్టాడు. గాలియజ్ఞం పేరిట పెద్ద విండ్‌మిల్ ఫార్మ్‌లనీ, జలక్రీడా యజ్ఞం పేరిట చెరువుల చుట్టూ స్పోర్ట్స్ కాంప్లెక్సులు కట్టడానికీ, మురికివాడలని ఖాళీచేయించి ఆ స్థానంలో షాపింగ్ కాంప్లెక్సులని కట్టించడానికి అగ్నియజ్ఞాన్నీ, ఆకాశ యజ్ఞం పేరిట ఊరికొక విమానాశ్రయాన్ని కట్టించడానికీ అప్పుతెచ్చాడు. భూయజ్ఞం పదవిలోకి రాకముందే చేసి ఉన్నాడు. ఇవికాక పేదల కోసం అని చెప్పి, దళారుల, మిల్లర్ల కోసం అన్న యజ్ఞాన్నీ తలపెట్టాడు. ఇవన్నీ ఎంతోమంది యజ్ఞాలకి సహాయపడేవాళ్లకి ఉపాధిని కల్పించాయి. ఈ మహర్దశలో ఫెళఫెళ్లాడే నోట్లు అతని దర్శనానికి కూడా నోచుకోకుండా తిన్నగా ఇంటి గోడల్లోకి, బ్యాంకుల్లోకీ వెళ్లిపోతుండేవి. విదేశాల నుండీ ప్రజాసంక్షేమానికి తెచ్చిన డబ్బుల్లో అతని వాటా అసలు భారతదేశంలో అడుగుపెట్టకుండానే స్విస్ బ్యాంకుల్లో చేరిపోతుండేది. రాష్ట్రానికి చేరిన డబ్బులో అధికభాగం కూడా బినామీ కంపెనీలద్వారా అతని అక్కౌంట్లో జేరిపోతుండేది. చిట్‌ఫండ్ కంపెనీ పెట్టిన మొదట్లో అతను తనవద్దకు చేరిన డబ్బుల్ని ఆప్యాయంగా నిమిరేవాడు. ఈ దశలో వాటి విలువెంతో కాగితం మీద చూసుకోవడంతోనే సరిపోయేది.

“ఒక్క మనిషి ఇంత మందిని అంతలా బంధించి ఉంచాడంటే ఆశ్చర్యంగా ఉన్నది!” అన్నాయి ఆ నోట్లకట్టలు రామస్వామి నుండి దూరంగా వెళ్లిపోతూ.

“ఫైర్” అన్న ఆజ్ఞ ఎప్పుడు వెలువడ్డదోగానీ, అతను చిన్నప్పుడు గిరిజనుండి తీసుకున్న రూపాయినోటు అతని మోకాలు మీద ఫెడీమని తన్నింది. బాధతో మోకాలు పట్టుకున్నాడు.

కజిన్ల నుంచి మాయం చేసిన రూపాయినోట్లు అతనికి మొట్టికాయలు వేశాయి. చెవులు మెలిపెట్టాయి. బుగ్గల్ని గిల్లాయి. చిరాకనిపించినా సహించగలిగాడు.

"హైస్కూలు క్లాస్‌మేట్ల నుంచీ మాయం చేసిన పదిరూపాయల నోట్లు అతణ్ణి వళ్లు హూనం అయేట్లు కిందపడేసి కొట్టాయి. "అయ్యో, అమ్మో!" అని అరిచాడు.

పాల వాసననీ, పూల వాసననీ, కూరగాయల వాసననీ, నూనె మరకలనీ, పసుపు కుంకుమలనీ అంటించుకున్న రకరకాల నోట్లు అతన్ని కర్రలుగానూ, కట్టెలుగానూ, పలుపుతాళ్లు గానూ, సైకిల్ చెయిన్లు గానూ మారి బాదాయి. వంగోబెట్టి పిడిగుద్దులు గుద్దాయి. కిందపడేసి డొక్కల్లో తన్నాయి. పళ్లు రాలగొట్టాయి. దవడలు వాయగొట్టాయి. ఒక్కో దెబ్బ తగిలినప్పుడల్లా బాధతో మెలికలు తిరిగిపోయాడు.

ఫెళ ఫెళ్లాడే నోట్ల కట్టలు ఇటుకరాళ్లల్లాగా అతని మీద వర్షించాయి. కొన్ని కట్టలు విడిపోయి పదునైన కత్తుల్లాగా, మర రంపాల్లాగా అతని కండరాలని తెగ్గోశాయి.

అతను ఏవో రంగు కాగితాలనుకున్న నోట్లు – జర్మన్ మార్కులూ, అమెరికన్ డాలర్లూ, స్విస్ ఫ్రాంకులూ– అతనప్పటిదాకా, అతణ్ణప్పటిదాకా చూడని నోట్లు, మెషీన్ గన్లు వదిలిన బుల్లెట్లలాగా అతని శరీరంలో ఏ భాగాన్నీ కూడా వదిలిపెట్టకుండా చిల్లి పరిచాయి.

ఆ బాధని భరించలేక చచ్చిపోతే బాగుణ్ణనుకున్నాడు రామస్వామి.

* * *

సున్నాలని అతను అనుకున్న  వెనక నిలబడ్డవాళ్లు తమ నమ్మకంతో గతంలో అతణ్ణి తమ ముందు నిలబెట్టారు. వమ్ము చెయ్యబడ్డ నమ్మకం ఆ సున్నాల చుట్టుపక్కల నిలబడడానికి కూడా అతను అనర్హుడని తీర్మానించింది.

(నవ్య వీక్లి, ఫిబ్రవరి 29, 2012)
(రామ్‌కీ కల్చరల్ ఫౌండేషన్ – నవ్య వీక్లి
దీపావళి కథల పోటీలో విశేష బహుమతి పొందిన కథ)

# శిఖరాగ్రాన

"అమ్మా, ఏదోగా అనిపిస్తోంది," అన్నది పిల్లపిట్ట.

"తెల్లవారిన తరువాత నిన్ను గూట్లోంచి తోసేస్తాననా?" అన్నది పిట్ట తల్లి.

"అప్పుడు కూడా ఇలాగే అనిపిస్తుందా?"

తల్లి పిల్లని చూసింది. గూడులోకి కురుస్తున్న వాన చినుకులు పిల్లపిట్ట నెత్తిమీద కుచ్చులపై బడి, మెరుపు లొచ్చినప్పుడు రంగుల ధారలు కడుతున్నాయి.

"ఇంతకు ముందెప్పుడైనా ఇలా అనిపించిందా?"

"ఆకలైనప్పుడల్లా, ఎప్పుడొస్తావా అనిపించేది. నిన్న మాత్రం 'నువ్వు రాకపోతే?' అనిపించి, 'నా ఆకలి తీరేదెట్లా' అన్న ఆలోచన వచ్చింది. అప్పుడు కూడా ఇలాగే అనిపించింది."

"నీకు ఇకనుంచి కలిగే భావనల్లో ఇది ఒకటి. దీన్నే ఆదుర్దా అంటారు."

"ఇకముందు ఎప్పుడూ ఇలానే అనిపిస్తూంటుందా?"

"నిన్ను తినాలని పక్షులు నీ వెంటబడినప్పుడు– అంటే, నీ ప్రాణానికి ముప్పు వచ్చినప్పుడు – ఈ ఆదుర్దా రూపం మార్చుకుని భయంగా తయారవుతుంది. నీకు తెలియకుండానే నువ్వు ఇప్పటిదాకా నీకున్న ప్రాణభయం నుంచి తప్పించుకున్నావు."

"అదేమిటి?" "నువ్వు గుడ్డుగా ఈ గూటిలో చేరినప్పటినుంచీ ఇప్పటిదాకా – నేను లేని సమయంలో ఏ పామో వచ్చి నిన్ను మింగేస్తుందేమోనని నేను భయపడ్డానే కానీ నీకు ఆ భయం లేదుకదా! రేపటి నుంచి ఆ భయం నాకు ఉండదు. నీకే ఉంటుంది."

పిల్లపిట్ట ఆరోజు పగటివేళ గూటి అంచుకుపోయి తొంగి చూసింది. ఆకాశానికి దగ్గరగా ఉన్నానని ముచ్చటపడింది. ఈ గూట్లోంచి తోసెయ్యబడ్డ తరువాత నేలను తాకేలోపున రెక్కలు విప్పగలనా అని సందేహం వచ్చి, రోజంతా వాటిని కదుపుతూనే ఉంది. 'గూడును దాటి బయటకు వెళ్లవద్దు' అన్న తల్లి ఆజ్ఞ వెనుక అర్థం ఏమై ఉంటుందా

అని పరిశోధించడానికి బయటకి వెళ్లి చక్కెర్లు కూడా వేసింది. కానీ, నేలమట్టం దగ్గర మొదలుపెట్టి, 'మళ్లీ ఇంత ఎత్తును చేరుకోగలనా?' అన్న సందేహానికి జవాబు చెప్పుకోలేకపోయింది. తల్లేమో, ఇంత ఎత్తులో ఇలాంటి చెట్టు మీదే గూడు కట్టుకోవాలని చెప్పింది. తన ఆహారం తనే సంపాదించుకోవాలట. తన గూడు తనే కట్టుకోవాలట. ఇక భయం సంగతి సరేసరి.

"అమ్మా, నేనిక్కణ్ణించి వెళ్లనే," అన్నది దీనంగా.

"నాకే కాక నీకుకూడా ఎన్నాళ్లు తిండి తెచ్చిపెట్టను? ఇంక నా చేతగాదు!" రెక్కలెత్తేసింది తల్లి.

నిజానికి పిల్లపిట్టకి అక్కణ్ణుంచి బయట పడాలనే ఉంది. ముఖ్యంగా పక్క గూళ్లల్లో నుంచి పిల్లపిట్టలు రా రమ్మని పిలుస్తుంటే ఎన్నాళ్లు మనసును నిగ్రహించు కోవడం? తనేమో ఎప్పుడెప్పుడు గూట్లో నుంచి బయటపడి ఆడుకుందామా అనుకుంటుంటే తన తిండి కోసం తనే తిరగా లంటుందేమిటి? పైగా, తనను తినడం కోసం కొన్ని పక్షులు వెంటపడతాయని అన్నది! ఇప్పుడు తెలియని ప్రపంచం గూర్చి భయం పుడుతోంది.

"ఆహారం సంపాదించుకోవా లంటే నీతో పోటీ పడాలా అమ్మా?"

"నాతో కాదు. నాలాంటి వాళ్లతో. నీలాగే ఇప్పుడే రెక్కలు విప్పుకుంటున్న వాళ్లతో."

"గూడు కట్టుకోవడానికి మాత్రం బోల్డు చెట్లు కనిపిస్తున్నాయి."

అంతలో ఓ పెద్ద మెరుపు మెరిసింది. చెవులు దద్దరిల్లేంత శబ్దం కూడా అయ్యింది. పక్కనే ఉన్నచెట్టు ఒక వెలుగు వెలిగి, ఫెళఫెళమంటూ నేలకు రాలింది. ఆ కాంతిని భరించలేక కళ్లు మూసుకుని, ఆ శబ్దానికి వణికిపోయి, అది తల్లి రెక్కల క్రిందకు చేరి గట్టిగా వాటేసుకుంది.

"నాకీ భయం వద్దే!" అన్నది భయంగా.

"దానిని నీకు దూరంగా ఉంచాలంటే తోటివాళ్లతో సఖ్యంగా ఉండు. వాళ్లకు చేతనయినంత సహాయం చెయ్యి. లేకపోతే మా అమ్మ చెప్పిన చెట్టు లాగా అయిపోతావ్."

"ఏం చెట్టే అది? ఇక్కడే ఉందా?"

"పిల్లలని గూటిలోనుంచీ తోసే ముందర ఈ చెట్టు గూర్చి చెప్పడం ఎన్నోవేల తరాల నుండి మన వంశంలో ఆనవాయితీగా వస్తోందట. నా వంతుగా నీక్కూడా చెబుతాను, విను."

* * *

ఇదెప్పటి మాటో ఎవరికీ తెలియదు.

అనగనగా ఒక అడవి. అడవంటే అట్లాంటి ఇట్లాంటి అడవి కాదు. నేలంటే చెట్లేననిపించేటంత పెద్దది. మనం రోజంతా ఏ దిక్కులో ఎగిరినా దాని సరిహద్దులేవో

కనుక్కోలేము. ఛెంగున గెంతులేసే లేళ్లు. అవి ఎంతలా గెంతగలవో చూపించడాని కన్నట్లుగా వాటి వెంటబడే సింహాలు, పులులు, చిరుతలు. ఆ నిరూపణలకు అంతరాయం కలిగిస్తూ కంచెల్లా పొదలు. ఆ పొదల మీద చుట్టపు చూపుగా వచ్చినట్లుగా పువ్వులు. అవి తమకోసమే నంటూ విఱ్ఱవీగే తేనెటీగలు. వాటి పట్టును తమకు కట్టబెడితే పట్టనట్లుగా ఉండే చెట్లు. ఆ చెట్లను ఉడికించడానికా అన్నట్లు కాయలను తెంపి కిందపడేసే ఉడతలు. మనం గుడ్లని పొదిగినట్లుగా తనలో ఆ కాయలను దాచుకుని పొదిగే నేలతల్లి.

అదంతా ఒక లోకం!

ఆ లోకంలో ఒకనాడు మెరుపు మెరిసింది. ఆకాశం బద్దలయ్యింది. ఆ బద్దలు దడిగట్టి ఓ చెట్టును ప్రేమగా హరించుకున్నాయి. ఆ దృశ్యాన్ని చూడడానికా అన్నట్లు నేల పొదుగు లోనుంచి అమాయకంగా పైకి చూశాయ్ రెండాకులు.

"ఉరుములో నుండి ఉద్భవించిన మెరు"పన్నాయ్ కొన్ని చెట్లు. "మెరుపులోంచి ఊడిపడ్డ ఉరుము" అన్నాయ్ మరికొన్ని. "తల్లిని పొట్టన పెట్టుకుంది" అన్నాయ్ ఇంకొన్ని. "అంత ఎత్తూ ఎదుగుతుంది!" అన్నారు వాళ్లల్లోని జోస్యులు. "వంశ నాశనం!" అన్నారు వాళ్లలోనే మరికొందరు.

ఉరుమో, మెరుపో, లేక రెండూ కలిపో ఊదిన ప్రాణాన్ని ఉగ్గబట్టుకుని, దానిని కాపాడుకోవడానికా అన్నట్లు విత్తులోనే దాక్కోవడానికి ఆ రెండాకులూ ముడుచుకు పోబోయాయి. "నేనున్నాగా!" అంటూ నేలలో కలిసిపోతున్న తల్లి ఆ మొక్క సున్నితమైన వేళ్లని ప్రేమగా నిమిరింది. నేలలో కలిసి దానిని కనిపెట్టుకు ఉంటానంది. ఆ ప్రేమ ఆ మొక్కకు అణువణువునా ధైర్యాన్ని నింపింది.

దాని చిన్నతనం పెద్ద ప్రత్యేకతలేవీ లేకుండానే గడిచిందని చెప్పవచ్చు. కానీ దానికి తనకి లేనిదేమిటో స్పష్టంగా తెలుసు. చుట్టుపక్కల తన వయసువాళ్లను చూస్తే దానికి అసూయగా ఉండేది. అవి తల్లుల నీడలో పెరుగుతున్నాయి. గాలివానల జోరునుండి తల్లి కొమ్మలు వాటిని కాపాడుతున్నాయి. వరదలప్పుడు బలమైన వాటి వేళ్లని అడ్డేస్తున్నాయి. వానల జోరుకూ, వరదల తాకిడికీ ఎప్పుడో కొట్టుకుపోతానన్న భయంతో శిథిలమై నేలలో కలిసిపోతున్న తల్లివేళ్లను గట్టిగా పట్టుకుని నిలబడేది పిల్లమొక్క. మిగతా మొక్కలకేమో తల్లులే ఆ విషయం చెప్పేవి.

వాన నీళ్లల్లో కొట్టుకుపోతున్న మొక్కల్నీ, కొమ్మల్నీ చూసి పిల్లమొక్కలు, "మేము కూడా ఈత కొడతాం అమ్మా!" అని గునిస్తే, వాటి తల్లులు కసిరేవి – వేళ్లతో నేలని గట్టిగా పట్టుకొమ్మని.

"దాని పేరేమిటి?" అడిగింది పిట్టపిల్ల.

"పేరు... ఒంటరి అని పెడదాం" అన్నది పిట్టతల్లి. అని కథని కొనసాగించింది.

"చూడండి, తల్లి లేకపోయినా ఎలా పెరుగుతోందో అది! దాని పట్టుదల మీకు లేదు. మీరు దానంత కృషి చెయ్యరు" అనేవి తల్లులు తమ పిల్లమొక్కలతో.

ఒకసారి కుండపోతగా వాన కురిసినప్పుడు ఒంటరి పక్కనున్న ఒక మొక్క ఆ ఆనందానికి ఉబ్బి తబ్బిబ్బవడంతో దాని వేళ్లు నేలలో నుంచి తన్నుకొచ్చి పడబోయింది. ఇంకో చెట్టు మీద వాలి ఎలాగో పూర్తిగా పడకుండా తట్టుకుంది.

"నువ్వే చేశావు!" అన్నది దాని తల్లి ఒంటిరిని నిందాత్మకంగా.

"దాని వేళ్లు నేల ఉపరితలానికి దగ్గరగా ఉండడం వల్ల చిత్తడికి పట్టు దొరకక కూలిందిగానీ, నేను చేసిన దేముంది?" అన్నది ఒంటరి.

"మా వేళ్లు అలానే లేవా ఏమిటి?" నువ్వు ఎంతో కాలంగా దాని వేళ్లని పైకి తోయడం వల్లనే అది నీ వైపుకు రాకుండా నీకు దూరంగా వాలింది" అన్నది దాని తల్లి తిరుగులేని ఋజువుని చూపిస్తున్నట్లు.

ఆ వాలిన మొక్క సగం వేళ్లు ఆకాశం వైపు చూస్తుండగా... నిస్సహాయంగా, చూడడానికి జాలిగొలుపుతూ ఉండేది. అది మూలుగుతూ అట్లా చాలా కాలం బతికింది. నేలపైకి వచ్చి గాలి పోసుకుంటున్న వేళ్లతో అది తనమీద కసి తీర్చుకునే అవకాశం కోసం వేచి ఉన్నట్లనిపించింది ఒంటరికి.

"నీ సంగతి తెలిసే అందరూ నీకు దూరంగా ఉంటున్నారు!" అన్నది సగం ఒరిగిన మొక్క. "నువ్వు కూలితే నిన్ను పట్టుకోవడానికెవరూ ఉండరు!" అన్నది దాని తల్లి శాపం పెడుతున్నట్లు. అప్పటినుంచి ఒంటరి పెట్రేగి పోయిందన్నాయి దాని చుట్టుపక్కల చెట్లు. దానికి కారణం, వాటికి లేని ఎదుగుదలని అది చూపించడమే. అది శాఖోపశాఖలుగా విస్తరించి, అనేక పక్షుల గూళ్లకు నెలవయ్యింది. చిరుగాలి వీచినప్పుడు అది గలగలా నవ్వేది. పక్షులు నిద్రపోతున్నప్పుడు వాటికి చిన్న చిన్న వింజామరలు వీచేది. సూర్యోదయం అవుతున్నప్పుడు అది బలంగా ఒళ్లు విరుచుకుని పక్షుల్ని నిద్ర లేపేది.

ఎందుకో తెలియదు గానీ వానలు కురవడం క్రమంగా తగ్గాయి. ఆ వర్షాభావానికి చాలా చెట్లు ఆకులు రాల్చడం, ఎండిపోవడం మొదలుపెట్టాయి. ఆకుల్లో పచ్చదనాన్ని కోల్పోని ఒంటరిని చూసి, దాని వేళ్లతో పెనుగులాడలేక ఓడిపోతున్నామనీ, అందుకనే తాము ఎండిపోతున్నామనీ, తమని ఎండబెట్టి ప్రకృతి వనరులన్నీ ఒంటరి ఒక్కతే అన్యాయంగా అనుభవిస్తోందనీ అవి నిర్ణయానికొచ్చాయి.

క్రమేణా ఆ విశాలమైన అడవి కాస్తా ఎడారిగా మారిపోయింది. చివరి మూలుగు లాగే దాకా కూడా చుట్టుపక్కల చెట్లు, "మా అందరి ప్రాణాలు తీసి, మా ఉసురు పోసుకుంటున్నావు!" అనడం ఆపలేదు. ఆ తరువాత ఒంటరిని నిందించడానికి గానీ దాని కొమ్మల్లో ఇళ్లు కట్టుకోవడానికి గానీ ఎవరూ లేరు.

"అదేమిటి? దాని మీద పక్షులెందుకు గూళ్లు కట్టుకోవడం ఆపేసాయి?"

"మనం గూళ్లు కట్టేది, మనకి దొరికే తిండికీ, నీళ్లకీ దగ్గరగా. ఎడారి లాంటి ప్రదేశంలో మనకి ఆ రెండూ ఉండవు. పైగా, ఎండిపోయిన చెట్ల శాపానికా అన్నట్లు గాలివాటుకు ఒంటరి పెద్ద పెద్ద కొమ్మలన్నీ విరగిపోయాయి. అందుకని గూళ్లు కట్టుకోవడానికి తావులేదు. మిగిలిన రెండు మూడు కొమ్మలూ పక్షులకు అందనంత ఎత్తులో ఉన్నాయి."

"పిడుగుల వల్ల మన పక్కన చెట్టులాగా ఒంటరి తల్లి కూడా కూలింది గదా! అట్లాంటి పిడుగులేవీ ఒంటరిని తాకలేదా మరి?"

"అక్కడ వానలుంటే గదా ఉరుములూ, పిడుగులూను!"

"మరి దానికి పిల్లలెవరూ లేరని అదెప్పుడూ బాధపడలేదా?"

"పిల్లలెందుకు లేరూ, ఉండేవాళ్లుట! మొదట్లో అది శాఖోపశాఖలుగా విస్తరించి ఉన్నప్పుడు ఆ నీడలో అవేవీ ఒక ఎత్తుకు మించి ఎదగలేకపోయేవి. తర్వాత నీటిఎద్దడిని అవి తట్టుకోలేక పోయాయి. ఆ తరువాత పుట్టిన విత్తనాలేవీ మొక్కలు కాలేకపోయాయి. ఒంటరి మరీ ఎత్తుకు ఎదిగిన తరువాత దాని రూపమూ, తీరూ అన్నీ మారిపోయాయి అన్నార్ట దాన్ని చూసిన వాళ్లు."

"అదేమిటి?"

"దాని తల్లిని గానీ, దాని జాతి చెట్లని గానీ చూసిన వాళ్లు ఒంటరికి గూడా వెడల్పైన ఆకులూ, బలమైన కొమ్మలూ ఉంటయ్యనుకుంటారు. కానీ చెప్పాగా, గాలి తాకిడికి కొమ్మలు విరిగి, ఆకులు పలచబడ్డాయి. చూసిన వాళ్లకు ఆకాశంలోకి చొచ్చుకుపోతున్న బలమైన కాండం కనిపిస్తుందట గానీ అంతుమాత్రం కనిపించదట."

"అదెక్కడుందో చెప్పవా? దానిని చూడాలని ఉంది."

"అది ఇప్పుడు ఉన్నదో, లేదో ఎవరికీ తెలియదు. దాన్ని చూసిన వాళ్లు ఇప్పుడెవరూ లేరు. కొన్ని వందల తరాలుగా దాన్ని చూసే ప్రయత్నం కూడా మానుకున్నారు."

"ఎందుకని?"

"దాని చుట్టూ ఎడారి అయింది అని చెప్పాను గదా! ఒక్క చెట్టూ కనిపించదు. అక్కడికెళ్లే దారిలో ఆహారమూ, నీళ్లూ ఉండవట. ఒకవేళ అంతదూరం వెళ్లినా ఆ ఎత్తుకు చేరడం కూడా కష్టమేనట. మనకి చేతనయ్యే పని కాదది. పైగా అలాంటి ప్రయాణం మొదలుపెడితే దారిలో ఎదురయ్యే గద్దల నుంచీ, రాబందుల నుంచీ దాక్కోవడానికి తావే ఉండదు."

"అంత వింత చెట్టుని చూడాలని నీ కెప్పుడూ అనిపించలేదా?"

"ఎందు కనిపించలేదూ? నీ వయసులో ఉన్నప్పుడు మన వాళ్లందరికీ అలా అనిపించబట్టే అది ఎక్కడ ఉంటుందో తెలిసింది. అయితే, దాన్ని చూడడమే ఎవరికీ కుదర్లేదు. నాకు వయసొచ్చే సరికల్లా తిండీ, పిల్లలూ– వీటితోనే సరిపోయింది."

"నువ్వు చెప్పిన ఒంటరి కథ నిజమైతే, నేను దాన్ని తప్పక చూడాలి. దానితో మాట్లాడాలి."

"నువ్వా? వాళ్ల మాటలు మనకు అర్థమవుతాయి. మన పాటల్ని అవి ఆనందిస్తాయేగానీ చెట్లతో మనం మాట్లాడ్డం ఉండదు. ఇన్నాళ్లు ఈ చెట్టుమీద ఉన్నాను. ఇప్పటిదాకా దీనితో ఏమైనా మాట్లాడానా?"

"మాట్లాడితే ఏం చేసేదానివి?"

"నేను లేనప్పుడు నా పిల్లల్ని జాగ్రత్తగా కాపాడు అని చెప్పేదాన్ని. నువ్వైతే ఒంటరితో ఏం మాట్లాడతావు?"

"నువ్వు చెప్పిన భయమేదో దానికీ ఉండుండాలి. అది ఆ భయా న్నెట్లా జయించిందో తెలుసుకోవాలి. రెక్కలు పెద్దవి చేసుకుని నువ్వు చెప్పేటంత దూరం ఎగరగలిగిన సత్తువ వచ్చాక ఆ ప్రయాణం చేస్తూ ఇంకా ఏమేం అడగాలో ఆలోచిస్తాను. నీకు కూడా ఒకప్పుడు ఒంటరిని చూడాలని అనిపించింది కదా! అప్పుడు నువ్వు దాన్ని ఏమని అడగాలనుకున్నావ్?"

"అసలా ఆలోచనే రాలేదు. ఊరికే చూసివద్దా మనుకున్నా నంతే."

అంతలో ఓ మెరుపు ఓ ఉరుమును కుమ్మేయడంతో మళ్లీ పిల్లపిట్ట తల్లి రెక్కల క్రిందకు చేరింది.

తల్లి నిట్టూర్చి, "నువ్వా, అంత దూరం చేరడానికి కావలసిన సత్తువను సమకూర్చుకునేది? సరేలే, రేపు కూడా ఇక్కడే ఉందువు గాని, ఎలాగూ ఇంకో ఇద్దరికి ఆహారం తెచ్చే అవసరం లేదు కదా!" అన్నది.

* * *

"ఎవరు నువ్వు?"

"చెట్లు మాతో మాట్లాడవన్నదే మా అమ్మ!"

"మాట్లాడవలసిన అవసరం రాలేదిప్పటిదాకా."

"చివరిసారిగా ఎప్పుడు మాట్లాడావో గుర్తుందా?"

"ఎప్పుడు మాట్లాడినా మీ జాతి వాళ్లతో మాత్రం కాదు."

"మా మీదెందుకో అంత కినుక?"

"పొరపాటుగా అన్నాను. మా జాతికాని వాళ్లతో అని అనవలసింది."

"ఎందుకని అలా?"

“మాతో మాట్లాడడానికి మీకు ఆసక్తి ఉండదు గనుక. మాట్లాడుకోవడానికి మీ వాళ్లే అంతమంది ఉంటే మా అవసరం మీకేముంటుంది? ఇప్పుడు నువ్వు మాట్లాడుతున్నావంటే నీ వాళ్లెవరూ నీకు లేనట్టే.”

“ఉన్నారో లేదో తెలియదు గానీ వాళ్లని వదిలి మాత్రం చాలా కాలమైంది.”

“ప్రత్యేక కారణాలేమైనా ఉన్నాయా?”

“ఇదే – నిన్ను చేరాలన్నదే.”

“ఎందుకో నామీద అంత ఆసక్తి?”

“నీ వింత ప్రవర్తన గూర్చి మా అమ్మ చెప్పింది. నీ అంత స్వార్థ పరురాలు ఉండదని ఆవిడ మాటల సారాంశం. అందులో ఏదో వివరణ లోపించిం దనిపించింది. ఎడారిలాంటి ఈ ప్రదేశంలో నువ్వు ఒక్కదానివే నిలబడడం అత్యంత ఆశ్చర్యకరమైన విషయం. దానికి వివరణేదో నీ నుంచే తెలుసుకోవా లనిపించింది.

“ఒక పక్షిని చూసి ఎన్ని వేల సూర్యోదయాలైందో నాకసలు గుర్తులేదు. ఇలాంటి చోటికి నువ్వు నన్ను వెతుక్కుంటూ వచ్చావంటే నువ్వు కూడా సామాన్యురాలివి కాదు.”

“పొగడ్త లాపి నా ప్రశ్నలకు జవాబు చెప్పు.”

“కారణమేముంది? జీవితేచ్ఛ – అంతే. దానికి అనుకూలించిన వాతావరణం.”

“చాలా తేలికగా చెప్పావ్. ఎవరికి ఉండదు జీవితేచ్ఛ?”

“అయితే, దాన్ని గూర్చి ఏం చేస్తున్నారో వాళ్లనే అడుగు.”

“వాళ్లల్లో లోపించినదీ, నీలో ఉన్నది ఏమిటి?”

“అపరిమితమైన భయం.”

“నీలో లోపించి వాళ్లలో ఉన్నది?”

“ఉన్నది చాలనుకునే మనస్తత్వం.”

“మరి నీ మీది ఆరోపణల విషయం?”

“ఏం ఆరోపణలు?”

“నువ్వు నీ వేళ్లతో పక్క చెట్లని కూలగొట్టడం.”

“అందులో నా తప్పేముంది? నేను ఎదుగుతున్న ప్రదేశంలో చుట్టుపక్కల చెట్ల వేళ్లు నేల ఉపరితలాన్ని ఆక్రమించి, నాకు చోటు లేకుండా చేసాయి. దాంతో అప్పుడు, నా వేళ్లని నేలలో లోతుకు పంపిస్తే గానీ నాకు జీవించడానికి అవకాశం దొరకలేదు. వేళ్లు ఉపరితలానికి దగ్గరగా ఉన్నచోట నేల తడిసినప్పుడు కూలిపోక తప్పదు కదా! నా చుట్టుపక్కల నన్ను పట్టుకోవడానికి ఎవరూ లేరన్న ఎరుక కలిగించిన భయమే నా వేళ్లని భూమి లోతుల్లోకి దింపింది.”

"మరి – వనరుల నన్నింటినీ నువ్వు వాడుకుని మిగిలిన వాటికి ఏమీ లేకుండా చేశావన్న ఆరోపణలో ఎంత నిజం ఉంది?"

"చెప్పాగా– నేలలోకి లోతుగా వేళ్లని పంపాల్సి వచ్చిందని! నీటి ఎద్దడి వచ్చినప్పుడు మిగిలినవాటి వేళ్లు అంతలోతుగా లేకపోవడం వల్ల భూమిలో క్రమంగా తగ్గిపోతున్న నీటిమట్టాన్ని అవి చేరుకోలేక పోయాయి. 'నీ రహస్య మేమి'టని అడిగితే వేళ్లని లోతుకు పంపించడమని చెప్పాను. 'మా కింతకన్నా చేతకావట్లేదు' అన్నాయి కొన్ని. 'మేం రాతిమీదున్నాం' అన్నాయి మరికొన్ని. 'మాకు ఇంతకన్నా చేతకాదని మా అమ్మ మాకు పుట్టకముందే చెప్పిం'దన్నాయి ఇంకొన్ని. 'అయినా, ఇప్పుడు మొదలు పెడితే ఎప్పటికయ్యేను?' అన్నాయి వేరే కొన్ని.

"నేనేదో వాళ్లకి రావలసినదాన్ని దోచుకుంటున్నానని అవి వేసిన నింద గూర్చి నాకు తెలుసు. ఆమడదూరంలో ఉన్న చెట్లు కూడా నా వేళ్లు తమ గొంతుని నొక్కేస్తున్నాయని నింద వేస్తే నవ్వాలో జాలిపడాలో తెలియలేదు. గాలి వీచినప్పుడల్లా బలంగా చెంపదెబ్బ కొట్టినంత గట్టిగానూ, లేనప్పుడు చెవిలో జోరీగలాగాను ఆ నింద నన్ను చికాకు పెట్టింది."

"మరి నీలో ఎంతో మార్పు వచ్చిందన్నది మా అమ్మ. నిన్ను చిన్నప్పుడు చూసిన మా వాళ్లు– ఇప్పటివాళ్లే కాదు కొన్ని వేల తరాల కిందటి వాళ్లు కూడా – నిన్ను గుర్తుపట్టలేరంది."

"ఆ బలమైన గాలులు నా రెక్కలు విరగ్గొడుతుంటే వాటి నుంచి నన్ను రక్షించు కోవడానికి కొమ్మలు లేకుండా ఎదగడం మొదలుపెట్టాను. వెడల్పాటి ఆకులకు నీళ్లు ఎక్కువ కావలసి వచ్చేది. అందుకని సన్నగా వుండే ఆకులని పెంచడం నేర్చుకున్నాను."

"మీ వాళ్లెవరూ పక్కన లేకపోవడం గూర్చి నీకెప్పుడూ బాధకలగలేదా?"

"పక్కన ఉన్నప్పుడూ బాధ కలిగిందిగా! పైగా, ఎవరో ఉంటారనుకుని నేను – నేనే కాదు ఏ చెట్టయినా, నువ్వయినా, వేరే ప్రాణి ఏదైనా పుట్టదని తెలుసుకున్నాను. సరే నీ సంగతులేమిటి?"

"నీకు కలిగినన్ని బాధలు నాకేం కలగలేదు ఒక్క చిన్న విషయంలో తప్ప. మా అమ్మ నన్ను గూట్లోంచి తోసే ముందురోజు నాకు ఎగరడానికి ప్రయత్నించా లనిపించింది. 'గూడు దాటి వెళ్లద్దు' అన్న మా అమ్మ ఆజ్ఞ నతిక్రమించాను. నాతో పాటు నా తోబుట్టువులు కూడా ప్రయత్నిస్తామన్నారు. అయితే నేనొక్కదాన్నే మళ్లీ గూటికి చేరుకోగలిగాను. మిగిలిన ఇద్దరూ పాపం నేలకొట్టుకుని ప్రాణాలు విడిచారు. నేనే వాళ్లని తోసేశానంది మా అమ్మ. కాదని కీచు కీచుమన్నాను. అయినా వాళ్ల చావుకు నేనే కారణమంది. అందుకే నీ కథను నన్ను భయపెట్టడానికే చెప్పి ఉంటుందని నా అనుమానం. అయితే, అది నాలో భయాన్ని బదులు ఆసక్తిని పెంచింది.

"మీ జాతివాళ్ల గురించి నాకు తెలియదు గానీ, మా వాళ్లల్లో మాత్రం నీ కథని తల్లులు పిల్లలకు చెపుతూనే ఉన్నారు. మా కందనంత దూరంలో, అధిగమించ లేనంత ఎత్తులో నువ్వున్నావని తెలిసి ఆ ఎత్తునందుకోవాలని, ఆ దూరాన్నధి గమించాలని బలంగా కోరిక కలిగింది."

"దాన్ని ఎలా సాధించావ్?"

"మమ్మల్ని వేటాడే గద్దలని చూసి, అవి రెక్కలని అసలు కదపడకుండా అంతసేపు ఎలా చక్కర్లు కొట్టగలవో తెలుసుకున్నాను. రెక్కలలో బలం చేకూరడం కోసం అందరికన్నా ముందు నిద్ర లేచి వీలైనంత దూరం చక్కర్లు కొట్టి వచ్చేదాన్ని. అలాగే, నేను చేరగల ఎత్తుల్ని క్రమంగా పెంచుకుంటూ వచ్చాను. నేను గుంపులో ఎక్కువగా కలిసి ఉండక పోవడంతో నామీద కొందరికి అసూయాద్వేషాలు పుట్టాయి. ఒకరిద్దరు నాకు తెలియకుండా నన్ను వెంటాడి, నేను మావాళ్లనే ఆహారంగా భుజించడం చూశారు.

"అయితే, నేను మావాళ్ల నెవరినీ చంపలేదు. మమ్మల్ని తినడం వల్ల గద్దలకు ఆ శక్తి వచ్చిందని నమ్మి చచ్చిపోయిన మా వాళ్లని నేను తిన్నది నిజమే. వాళ్లు దాన్ని నమ్మక నాపైకి యుద్ధానికి వచ్చారు. అయితే, అప్పటికి నేను చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం మొదలవడంతో వాళ్లని ఎదుర్కొని, ఓడించి, నేనే వాళ్లని వెలేశాను. అప్పటినుంచీ, నాకన్నా బలమైన వాళ్లని వెదుక్కుంటూ వెళ్లి, వాళ్ల జీవిత విధానాలని చాటుమాటుగా గమనించి, వాటి ననుసరిస్తూనే, వాటిని నాకు కావలసిన విధంగా మార్చుకున్నాను. నే ననుసరించిన వాళ్లెవరూ నన్నిప్పుడు చేరుకోలేరు. ఈ రెక్కలూ, ఈ శరీరమూ – మా అమ్మ కూడా నన్నిప్పుడు గుర్తుపట్టలేదు.

"మొదట నిన్ను చూడాలనీ, భయాన్ని ఎలా జయించావో తెలుసుకోవాలనీ కుతూహలం మాత్రం ఉండేది. నిన్ను చేరే ప్రయత్నంలోనే క్రమంగా భయాన్ని జయిస్తున్నానని అర్థం చేసుకున్నాను. చివరకు నువ్వే నాకు జోడీవని అర్థమై నిన్ను చేరకుండా ఉండలేని పరిస్థితి వచ్చింది."

"బావుంది. అయితే మనిద్దరిదీ ఒంటరి జంటన్న మాట. నీకింకా ఎత్తులనూ, దూరాలనూ చేరుకోవాలన్న కోరిక ఉంటే ఇది నీ ప్రయాణంలో ఒక మజిలీ అనుకో. కాకుంటే నువ్వు రోజూ తిరిగొచ్చి ఆ ప్రదేశాల గూర్చి నాకు కబుర్లు చెప్పు. ఏదైనా గానీ, నా నెత్తిన ఒక కుచ్చును కూరుస్తాను– నీకు గూడులాగా. బడలిక తీర్చుకో."

(ఆంధ్రజ్యోతి కథా వంసతం కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ)

(ఆదివారం ఆంధ్రజ్యోతి, అక్టోబర్ 31, 2010)

# తెల్గు సినిమా తీద్దాం రా

"గది బయట ఎంతమంది ఉన్నారో చూశావా? నా అడ్వర్టయిజ్‌మెంటుకి ఇంత రెస్పాన్స్ వచ్చిందని నాకు చాలా ఆనందంగా ఉంది," అన్నాడు సుందరయ్య మేనల్లుడు కిష్టుడితో.

వాళ్లిద్దరూ కూర్చుని ఉన్నది హైదరాబాదులోని ఒక హొటలు రూమ్‌లో. సుందరయ్య ఇచ్చిన అడ్వర్టయిజ్‌మెంటు ఆయన సినిమా తీస్తున్నాడనీ, దానికి కథ, కమామిషు కావాలనీను. ఆయనకి వయసు యాభై ఖచ్చితంగా దాటిందని ఆయన నెరిసిన జుట్టూ, తలని వదిలి వెళ్లిపోయిన సగం పైగా వెంట్రుకలనిబట్టీ చెప్పచ్చు.

అమెరికాలో గత పాతికేళ్లుగా గ్రోసరీ స్టోర్ నడుపుతూ కూర్చోవడం మరచిపోయిన మనిషాయన. కూర్చోవడానికే తీరిక లేకపోతే సినిమాలు చూడ్డానికి ఎక్కడ టైమ్ ఉంటుంది? పాతికేళ్లలో తెలుగు సినిమా ఎలా మారిందో ఆయనకి అస్సలు ఐడియా లేదు. అందుకే ఇండియాలో ఉన్న మేనల్లుడు కిష్టుడి సహాయాన్ని అర్థించాడు.

"సుఖాన ఉన్న ప్రాణాన్ని కష్టపెట్టుకోవడం ఎందుకు మామయ్యా? ఈ వయసులో ఈ సినిమా రొంపి నీకెందుకు?" ఆయనని ఆపడానికి విఫలప్రయత్నాన్ని కిష్టుడు మళ్లీ ఇంకొకసారి చేశాడు.

"నన్ను అమెరికాలో అందరూ గ్రోసరీ సుందరయ్యగానే గుర్తుంచుకునేలా ఉన్నారు. అలా కాకుండా, విజయవంతమైన సినిమాలు తీసి, విజయావాళ్లని మించిపోయేటంత కీర్తిని సంపాదించా లనిపించి, స్టోరుని మా అబ్బాయికి అప్పజెప్పి ఇలా వచ్చాను. అయినా ఇప్పుడదంతా ఎందుకు గానీ, ఇంక వాళ్లని రమ్మనమని చెప్పు".

కిష్టిగాడు తలుపు తీయకుండానే దూసుకుని ఒక డైరెక్టరూ, అతని అసిస్టెంటూ వచ్చారు.

ఫ్రెష్‌గా ఇస్త్రీచేసి వున్న తెల్ల ప్యాంటు, చొక్కానిబట్టీ వాళ్లల్లో డైరెక్ట రెవరో పోల్చుకోవడం చాలా తేలిక. అసిస్టెంటు, 'డైరెక్టర్' అని రాసి వున్న కుర్చీ పట్టుకొచ్చి వేయగా, డైరెక్టర్ స్టైల్‌గా అందులో కూర్చున్నాడు. "నమస్కారం సుందరయ్యగారూ," అన్నాడు అసిస్టెంటు.

"అరె. మా ఇద్దరిలో నేనే సుందరయ్యనని పసిగట్టేశారే!" సంతోషించాడు సుందరయ్య.

"ఇక్కడ సినిమాతీసే మొహం మీదేనండి మరి. (మోసపోయే మొహం కూడా మీదేనండి) ముందు బైట వెయిట్ చేస్తున్నవాళ్లని పంపించెయ్యండి," అన్నాడు అసిస్టెంటు.

"అదేమిటండీ, మేమేదో అన్ని కథలూ విని మాకు నచ్చిందాన్ని సెలెక్ట్ చేసుకుందా మనుకుంటే..." అడ్డుకున్నాడు కిష్టిగాడు. అతన్ని పట్టించుకోకుండా, సుందరయ్యతో, "మీరు సినిమా ఎందుకు తీద్దామనుకుంటున్నారు?" అన్నాడు.

"కొద్దిగానైనా డబ్బు చేసుకోడానికి. ఇంకా ఎక్కువగా పేరు తెచ్చుకోవడానికి."

"అవునా? ఆ కీర్తి ఎలా వస్తుంది? యువతరానికి నచ్చేలా కొత్త హీరో హీరోయిన్లని పరిచయం చేస్తే..."

సుందరయ్య అడ్డుకుంటూ అడిగాడు– "ఆయన ఎవరు?" అని. అసిస్టెంటు ఆశ్చర్యాన్ని నటిస్తూ అన్నాడు– "ఆయనెవరా? కమాపాస్క్రీదసం బ్రహ్మ పేరే విన్లేదా? ఈయన కుర్రవాళ్లతో కుర్రకారుకి సినిమా తీసినట్లుగా వేరెవ్వరూ తియ్యలేరు."

"మామయ్యా, కమాపాస్క్రీదసం బ్రహ్మ అంటే, కథ, మాటలు, పాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, సంగీతం బ్రహ్మ అని అర్థం," అన్నాడు కిష్టుడు.

"మరి ఆయనే నిర్మాతగా ఓ సినిమా తియ్యచ్చుగా?" సుందరయ్య ఆశ్చర్యంతో అడిగాడు.

"తియ్యచ్చు. ఎందుకు తియ్యకూడదు? కానీ, ఆయన కీర్తికాముకుడు కాదు. అందుకే వేరేవాళ్లకి నిర్మాతగా ఛాన్స్ ఇస్తూంటాడు."

"ఆయన భస్మాసురుడికంటే తెలివైనవాడు. ఎప్పుడూ ఎదుటివాళ్ల నెత్తిమీద చెయ్యి పెడతాడు"

"ఈయన ప్రతిభగూర్చి తెలుసుకోవాలంటే ఈయన సినిమాలంటే వెర్రెత్తిపోయే కుర్రకారు నడగండి"

"మరే. ఈయన సినిమాలు తీసేటంత స్పీడ్‌గా పిచ్చాసుపత్రులు కట్టించ లేకపోతున్నారు ఉన్న హాస్పిటళ్లల్లో చోటుచాలక– ఇటు కుర్రకారుకీ, అటు నిర్మాతలకీనూ."

సుందరయ్యకి కిష్టుడేదో మంచి అవకాశాన్ని పోగొడతాడన్న భయం వేసింది. "ముందు సినిమా కథ చెప్పండి," అన్నాడు.

అసిస్టెంటు, డైరెక్టర్ని మాట్లాడనివ్వట్లేదు. "మీకు కథెందుకండీ? సక్సెస్‌ఫుల్ అయ్యే సినిమా కావాలి– అంతేగదా? మీరు చెక్కులు రాసి వాటిమీద సంతకాలు చేస్తూండండి

చాలు. మిగిలినవన్నీ ఆయనే చూసుకుంటారు. ఇదో ప్యాకేజీ డీల్. ఇందులో ఆయన కొత్త హీరోనీ, హీరోయిన్నీ పరిచయం చెయ్యాలని నిర్ణయించుకున్నారు."

"ఏం, ఉన్నవాళ్లెవరూ వెయ్యమన్నారా?" కిష్టుడు మధ్యలో పుల్లవేశాడు.

"అమెరికాలో చదువుతున్న వాళ్లబ్బాయినీ, స్విట్జర్లాండులో ఉన్న ఆయన చెల్లెలి కూతురునీ ఈ సినిమాతో వెండితెరకి పరిచయం చేసి, మీకు పేరుతెద్దామని అనుకుంటున్నారు. అయితే, వాళ్లిద్దరూ ఇంకా హైస్కూల్లోనే ఉండడం వల్ల షూటింగంతా అమెరికాలోనూ, స్విట్జర్లాండ్‌లోనూ తీద్దామని నిర్ణయించుకున్నారు"

"అంటే ఫ్యామిలీ అఫైర్ అన్నమాట!"

"ఒరేయ్, ముందు ఆయన్ని కథ చెప్పనివ్వు," సుందరయ్య విసుక్కున్నాడు.

"అమెరికాలో ఓ పదహారేళ్ల తెలుగు కుర్రాడు స్కూల్లో సరిగ్గా చదువుకోవట్లేదని తల్లి కోప్పడితే, చెప్పా పెట్టకుండా లండన్ వెడతాడు. అక్కడికి స్విట్జర్లాండ్ నించీ ఒక తెలుగమ్మాయి స్నేహితురాళ్లతో పిక్నిక్‌కి వస్తుంది. ఇక్కడొక పాట."

డైరెక్టర్ కుర్చీలోంచి లేచొచ్చి, అసిస్టెంట్ భుజం మీద చెయ్యివేశాడు. "ఇంక నేను చెప్తాలే," అని మొదలు పెట్టాడు. "ట్రఫాల్గర్ స్క్వేర్లో హీరోయిన్ని చూసిన హీరో, మనసు పారేసుకుని ఆమె వెంటపడతాడు. ఇక్కడ ఇంకోపాట. ఈ పాటలో హీరోయిన్ కూడా హీరోని ప్రేమించడం మొదలుపెడుతుంది. పాటయ్యేసరికి వాళ్లిద్దరూ ఫ్రాన్స్ చేరుకుంటారు. అక్కడ హీరోయిన్ తండ్రి వాళ్లకి ఎదురొస్తాడు. అతడు వెంటనే హీరోను గొడ్డళ్ల రెడ్డిగా గుర్తించి తన కొడవళ్ల సైన్యాన్ని హీరో మీదకు వదుల్తాడు. ఆ వార్త వినగానే హీరో తండ్రి తన గొడ్డళ్ల సైన్యాన్ని హీరోకి సహాయంగా పంపిస్తాడు. ఆ రక్త పాతంలో థేమ్స్ నది ఎర్రగా అవడం చూసి, సిఐఎ సహాయంతో ఇంటర్ పోల్ హీరో హీరోయిన్ల తండ్రుల్ని జైల్లో వేస్తారు. అప్పుడు హీరోహీరోయిన్లు చదువులు మానేసి హాయిగా పెళ్లి చేసుకుంటారు."

"యూరోప్‌లో కొడవళ్లతోనూ, గొడ్డళ్లతోనూ నరుక్కోవడ మేమిటండీ?"

"ఆమాత్రం అర్థం కాలేదుటండీ? ఇది రాయలసీమ రక్తపాతం, ప్రేమ కలిసిన స్టోరీ. ఈ రెండింటినీ కలిపి ఇప్పటిదాకా పూర్తిగా యూరోపులో సినిమా తీసిన వాడెవడూ లేడు. అదీ ఈ సినిమాలోని ప్రత్యేకత."

"మామయ్య ఆలోచించి తర్వాత చెప్తాడు లెండి."

అసిస్టెంటుకి కోపం వచ్చింది. "అసలు ఈయన్ని మీరే మనుకుంటున్నారండీ? అసలు ఇప్పటిదాకా ఏ నిర్మాతా ఆయన్ని కథ చెప్పమని అడగలేదు. ఆయన ఏ సినిమా తీసినా అది వాళ్ల భాగ్యం అనుకున్నారు."

"అది ఫ్లాపు అయినప్పుడు వాళ్ల ఖర్మ అనుకున్నారు," మళ్లీ పుల్లేశాడు కిష్టిగాడు.

"అలాంటిది – అలాంటిది మీరు – మీరు," అని అసిస్టెంటు కోపంతో ఊగిపోతున్నాడు.

డైరెక్టర్ అసిస్టెంట్‌ను ఆగమన్నట్టు పక్కకు తీసి, "మీకు గొప్ప భవిష్యత్తు ఉన్న ఒక హీరోని పరిచయంచేస్తాను అని, అసిస్టెంటు వైపు చూసి, "రెడీ?" అని ప్రశ్నించి, తలుపుతీసి, "బాస్, ఒరేబాస్" అని పిలిచాడు. అసిస్టెంటుపాడడం మొదలుపెట్టాడు.

'వాడు ఎగిరొస్తే బాస్ – వాడు నడిచొస్తే బాస్ –
వాడు పడిలేస్తే బాస్ – వాడు పడవేస్తే బాస్ –
వాడు ఎదిరిస్తే బాస్ – వాడు బెదిరిస్తే బాస్ –
వాడు నవ్విస్తే బాస్ – వాడు కవ్విస్తే బాస్.
కన్ను కొట్టాలన్నా – షర్టు లాగాలన్నా –
ముద్దు పెట్టాలన్నా – గుద్దు లేయాలన్నా –
దుమ్ము లేపాలన్నా – తరిమి కొట్టాలన్నా –
దుంప తెంచాలన్నా – కొంప ముంచాలన్నా
వాడే బాస్ వాడే బాస్."

ఈ పాట వస్తూండగా 14 ఏళ్ల కుర్రాడు లోపలకి వచ్చాడు. డ్యాన్స్ చేసుకుంటూ.

"చూశారా ఆ కట్ – లుక్ ఎట్ దట్ ఫేస్. ఈజ్ ఇన్ట్ ఇట్ గ్రేట్? నడకలో ఆ గ్రేస్! కోపం చూపించాడంటే చిరంజీవిని మించిపోతాడు," అన్నాడు డైరెక్టరు.

"అదేమిటండీ – మరీ పసిపిల్లాడిలా ఉన్నాడు. వీడేం హీరో?" అన్నాడు సుందరయ్య. కుర్రాడి క్కోపమొచ్చింది. "మి? పసిపిల్లడూ? నో. నో. లుక్ ఎట్ దిస్ గడం. లుక్ ఎట్ దిస్ మిసం. మి నో పసిపిల్లడూ!"

"ఏమిటండీ మీ సినిమా ఫ్లాపు కావాలా? ఆ?" అసిస్టెంటు బెదిరించాడు.

"వాడు గనక నోరు విప్పితే ఖచ్చితంగా ఫ్లాపే!" అన్నాడు కిష్టిగాడు.

"ఇది ఇరవయ్యో శతాబ్దం కాదండీ – యాభయ్యేళ్ల హీరో హైస్కూల్లో చదువుతున్నట్టు చూపించడానికి! వీడు నవతరానికి ప్రతినిధి" అన్నాడు డైరక్టరు కోపంగా.

"నాకు నమ్మకం కుదర్టంలా," అన్నాడు సుందరయ్య.

"ఒక గుడు గుడానంటె కకుతావ్ బల్లున రత్తం," అన్నాడు కుర్రాడు. "అప్పుడే కాదు నాన్నా. ముందీ నిర్మాతని డబ్బులు కక్కనీ. తర్వాతే రక్తం," అనునయిస్తూ అతని చెవిలో అన్నాడు డైరెక్టర్.

"ఏ భాష అది?" అడిగాడు సుందరయ్య.

"తెలుగేనండీ. ఆ తెలుగే ఇప్పుడు తెలుగు సినిమాల్లో మాట్లాడుతుంటే, అవి సూపర్ హిట్లవుతున్నాయి. అందుకే నేనిప్పుడు అమెరికా తెలుగు మాట్లాడ్డానికి హైదరాబాద్‌లో కోచింగ్ సెంటర్లు పెట్టబోతున్నాను," అన్నాడు డైరెక్టరు.

"అది, ఒక్క గుద్దు గుద్దితే కక్కుతావు భళ్లున రక్తం అన్నదానికి వచ్చిన క్షోభ," అన్నాడు కిష్టిగాడు.

"మా కాలంలో అయితే ఆ 'గుద్దుగుద్దితే' అన్న డైలాగ్‌ని ఎంత పవర్‌ఫుల్‌గా చెప్పేవాళ్లు!" అన్నాడు సుందరయ్య. ఇంకా ఆశ్చర్యంలోనే మునిగిపోతూ.

"అది ఇక్ష్వాకుల కాలంలో అండీ," తీసిపారేశాడు డైరెక్టర్. "సరే. మీకలాగే కావాలా? ఒరేయి ఇట్రారా."

కుర్రాడు ఇంకా కోపంగానే ఉన్నాడు – "షూట్ డబ్బిచ్చిన తర్వాత చేద్దువుగానిలే. మన నౌకర్లలో ఒకణ్ణి జైలుకి పంపిస్తాను– వాడే చేశాడన్చెప్పి. బెస్ట్ రూట్ చెప్పనా? ఈ సినిమా అయ్యేదాకా ఆగు. అప్పుడు వాడంతట వాడే – ఏమిటి – వాడంతట వాడే వెళ్లి హుసేన్ సాగర్లో దూకుతాడు," అనునయించాడు డైరెక్టర్.

కుర్రాడికి ఆ సమాధానం నచ్చింది. "ఓ.కె. ఇఫ్ యు సే సో!"

"ఇప్పుడు, 'ఒక్క గుద్దు గుద్దితే కక్కుతావ్ భళ్లున రక్తం," అన్న డైలాగ్ నువ్ లిప్ సింక్ చెయ్యి. నేను డైలాగ్ చెబుతా, ఓకే?" అన్నాడు డైరెక్టర్.

కుర్రాడు లిప్ సింక్ చేశాడు.

"అంటే, ఈ కుర్రాణ్ణి సినిమాలోకి తీసుకుంటే, ఇంకొకళ్లని వాయిస్ డబ్బింగ్‌కి తీసుకోవా లన్నమాట!" కిష్టుడు, మామయ్యకి అర్థమయేలా వివరంగా చెప్పాడు.

"మా కాలంలో అయితే అందరూ వాళ్ల డైలాగులు వాళ్లే చెప్పేవాళ్లు. కొందరయితే వాళ్ల పాటలు వాళ్లే పాడుకునేవాళ్లు కూడా," అన్నాడు సుందరయ్య.

డైరెక్టర్ పగలబడి నవ్వాడు. "అయ్యా, మీరు ఇక్ష్వాకుల కాలం వాళ్లు కాదు – రాతియుగం వాళ్లు. హీరోయిన్లు వాళ్ల డైలాగులు వాళ్లే చెప్పి రెండు దశాబ్దాలయింది. ఇప్పుడు వాళ్లే కాక హీరోలు, విలన్లు, ఆఖరికి ఎక్స్‌ట్రాలు కూడా డబ్బింగ్ చెప్పించు కుంటున్నారు," అన్నాడు అసిస్టెంటు.

"సరే. మీరు మీ ఫోన్ నెంబరూ, వివరాలూ ఇచ్చి వెళ్లండి. మేము తర్వాత మిమ్మల్ని కాంటాక్ట్ చేస్తాం," అన్నాడు కిష్టుడు ఈ ఇంటర్వ్యూని ముగిద్దామని.

అసిస్టెంటుకి కోపమొచ్చింది. "మేం వెళ్లమండీ. ఈయన్ని మించిన డైరక్టరూ, ఈ కుర్రాణ్ణి మించే హీరో ఇంతకు మించి కథా మీ కెక్కడ దొరుకుతాయో చూస్తాం."

అక్కడే బైఠాయించిన వాళ్లిద్దరినీ చూసి ఏం చెయ్యాలో తోచక, మొహాలు చూసుకున్నారు మామయ్యా, కిష్టుడూను. "నువ్వు బయటకు వెళ్లి నీ ఐపాడ్‌లో డైలాగులూ, పాటలూ విను. వీళ్లతో పని పూర్తిచేసుకుని మేం వస్తాం," డైరెక్టర్ కొడుక్కి చెప్పాడు.

కుర్రాడు కోపంగానే బయటకు వెళ్లాడు.

కిష్టుడు బయటికి వెళ్లి, "నెక్స్ట్!" అని పిలిచాడు.

జయలక్ష్మి ప్రవేశించింది. జయలక్ష్మి ఒకప్పుడు సినిమాతార. అయితే, సినిమాల్లో నుంచి బయటకు వచ్చిన పదేళ్లలోనూ శరీరానికి ఇరవయ్యేళ్ల బరువుని సంపాదించి

పెట్టింది. మొహాన నల్లకళ్లజోడు. ఆవిడ అక్కడకి వస్తుంటే ఎవరో మొహాన తెల్లపెయింటు ఆమె మొహం మీద కుమ్మరించినట్లుగా ఉంది. పెదవులు కిళ్లీ నమిలినట్టుగా బాగా ఎర్రగా ఉన్నాయి. బొడ్డుకిందకి దిగిన చీర. ఒక చేతిలో పేపర్లకట్ట, ఇంకో చేతిలో విసనకర్ర ఉన్నాయి.

"ఎవరయ్యా ఇక్కడ నిర్మాత?" అడిగింది.

సుందరయ్య కుర్చీలోంచి లేచి, "నేనే" అన్నాడు.

"నా నుంచీ తప్పించుకోవడం అంత ఈజీ అనుకున్నావేంటి?" అంది కళ్లజోడు తీసి కళ్లు రెండూ రెపరెప లాడిస్తూ.

గాభరాపడ్డాడు. "అబ్బే. నేనలా అనుకోలేదే!"

"మరైతే నాతో ఒక్క ముక్క చెప్పచ్చుగా!" గోముగా అంది. సుందరయ్యకి అర్థం కాలేదు. "ఏమని?"

"నీవు లేక నేను లేను – నేను లేక నీవు లేవు. నేనే నీవు, నీవే నేను," పాడింది.

ఆశ్చర్యపోయాడు కిష్టుడు. "మామయ్యా. నువ్వేదో నీ గ్రోసరీ షాపులో ఇరుక్కుపోయా వనుకున్నా గానీ పాదలేపనం పూస్కుని ప్రవరాఖ్యుడిలా ఇలా ప్రపంచయాత్ర చేసుంటావని పొరపాటునైనా ఊహించలేకపోయాను."

"అమ్మమ్మ. ఈవిడ ఎవరో నాకు తెలీదురా!"

"తెలియదా? సరిగ్గా చూడు," డ్యాన్స్‌పోజుపెట్టి, "ముప్ఫయి యేళ్ల క్రితం రామ భీమ యుద్ధం," అంది.

సుందరయ్య ఆశ్చర్యంగా చూసి ఆనందం పొందాడు. "జయలక్ష్మి... గారూ– నువ్వా... మీరా... ఇంతలా డ్రస్సుందికదా, గుర్తు పట్టలేకపోయాను."

"మామయ్యా... నీకింత గొప్ప చరిత్ర ఉందనుకోలేదు. అదీ ముప్ఫయ్యేళ్ల క్రితం. అమ్మమ్మమ్మా!"

"అబ్బ ఊరుకోరా! ఇది నువ్వనుకునే దేదీ కాదు. అప్పుడు 'రామ భీమ యుద్ధం' అన్న సినిమాలో ఈవిడ శివుడిముందర చేసిన నాట్యం మా కాలపు కుర్రవాళ్ల హృదయాల్లో కలకాలం నిలిచిపోయింది."

"మరలాంటప్పుడు నన్నెందు కడగలేదూ?" కొంచెం కినుకని కలిపి గోముగా అంది. "పోనీలే. నీ తప్పును క్షమిస్తున్నాను. ఈ కాగితాల మీద సంతకం చెయ్."

"ఏమని?"

"ఇందులో నా కూతుర్ని హీరోయిన్‌గా తీసుకుంటున్నానని."

"ఏదీ నీ కూతురు?" అడిగాడు సుందరయ్య.

జయలక్ష్మి పిలిచింది. "జానీ, జానీ!"

మెల్లగా నడుచుకుంటూ వచ్చిందో పన్నెండేళ్ల పిల్ల.

"ఏదీ మీ కూతురు?" ఇంకా బయటకే చూస్తున్నాడు సుందరయ్య.

"ఎదురుగ్గా కనిపిస్తుంటే!"

"జానీ అని పిలిస్తే ఇంకా కుక్కపిల్లనుకున్నా" అన్నాడు కిష్టుడు.

"దాని పేరు ఝనక్ సింగ్. ముద్దుగా జానీ అని పిలుస్తానంతే!"

"తెలుగుపేరు కాదు గనక సినిమాల్లో హిట్టయ్యే అవకాశం ఉంది," అన్నాడు కిష్టుడే మళ్లీ.

సుందరయ్య ఆశ్చర్యపోయాడు. "ఇంత చిన్నపిల్లా?"

"చిన్నపిల్లేమిటి, ఈ కాలంలో నడవడం వచ్చేసరికల్లా అమ్మాయిలు హీరోయిన్లయి పోతుంటే? దాన్దుంపతెగ- ఒలింపిక్స్‌లో 12 ఏళ్ల పిల్లల్నే చైనా ఆడవాళ్ల విభాగంలో దింపగాలేంది- ఇంకా నేనే కొద్దిగా ఆలస్యం చేశాను."

"ఈ పిల్లేం మాట్లాడగలదు. డైలాగులేం చెప్పగలదు? ఏమ్మా, సినిమాల్లో ఇంతకు ముందేమయినా వేశావా?" అడిగాడు సుందరయ్య.

"ఐ డోన్ట్ నో టెల్గు," అంది జానీ.

"పోన్లేమ్మా. మేం మాట్టాడేది తెలుగని నీకు అర్థమయ్యింది," అన్నాడు కిష్టుడు.

"తెలుగు మాట్టాడ్డం రాకుండా తెలుగు సినిమా హీరోయినేమిటి?" అన్నాడు సుందరయ్య.

"అది మీకాలంలో, ఈ కాలంలో తెలుగొచ్చు అని ఏమాత్రం తెలిసినా సినిమా రంగంలోకి తీసుకోవడం మానేశారు మామయ్యా. మొన్నీమధ్య వచ్చిన తెలుగు సినిమాలో, అర్జున్‌సింగ్ హీరో, అమలా పటేల్ హీరోయిన్. మలయాళం యాదవ్ విలన్. కథ, మాటలు, పాటలు, దర్శకత్వం మమ్ముట్టి నెడంజళియన్. పాటలేమో, ఒక మలయాళ గాయకుడు హిందీ యాక్సెంట్‌తో ఐ లవ్యూ అంటూ తెలుగు సినిమాలో పాడాడు."

"ఇంతకీ సంతకం చేస్తున్నావా లేదా?" జయలక్ష్మి డిమాండ్ చేసింది.

"ఇవ్వాళ్లేగా కథలు సెలెక్ట్ చేయడం మొదలుపెట్టింది! సెలెక్ట్ చేశాక మిమ్మల్ని కాంటాక్ట్ చేస్తాం."

"మీకు కథే కావాలంటే నేనే చెప్తా వినండి. ఇదొక స్త్రీ ప్రధాన కథ. ఈ సినిమా తీసినందుకు తెలుగు సినిమా చరిత్రలో మీ పేరు నిలిచిపోతుంది. ప్రపంచానికి దూరంగా విసిరేసినట్టున్న ఒక ఐలాండ్. దాని కొక బీచి. ఆ బీచ్‌మీద ఒక హెలికాప్టర్ మీద కెమెరా ఫోకస్ చేస్తుంది. దాన్లో వచ్చి, ఆ బీచ్‌మీద పూర్తిగా తడిసివున్న హీరో, హీరోయిన్ డ్యూయెట్ పాడుతుండగా సినిమా మొదలవుతుంది. (పాట పాడుతుంది. షకలక బేబీ ట్యూన్‌లో)

"కిచకిచ బేబీ భౌ భౌ బీబీ నీకు నాకు మారేజీ
డిషుం డిషుం కింగ్ కాంగ్ డాషింగ్ డార్లింగ్ – తెచ్చుకుందాం కారేజీ –
కారేజీ లేకే కాటేజీకే చలో– కాటేజీ అందర్ దర్వాజా బంద్‌కో –
ఓ మేరీ ఓ మేరీ ఓ మేరీ – చిత్‌చోరీ చిత్ చోరీ చిత్ చోరీ"

సుందరయ్య అడ్డు తగిలాడు. "ఈ డ్యూయెట్టు కోతికీ, కుక్కకీ మధ్యా?"

"పిచ్చిప్రశ్న!" జానీని చూపించి, "ఈ హీరోయిన్‌కీ, హీరోకీ మధ్య. డ్యూయెట్ అయిపోగానే కొందరు ఆదిమానవ స్త్రీలు హీరోని ఎత్తుకుపోతారు."

"మామూలుగా హీరోయిన్ను విలన్లెత్తుకుపోతారు. ఇక్కడ హీరోని విలన్లెత్తుకుపోతారు. ఇదేదో వెరైటీగా ఉంది," అన్నాడు కిష్టుడు.

"మరే మనుకున్నారు? ఇట్లాంటి అయిడియా ఎవరికీ రాలేదంటే నాకు ఆశ్చర్యంగా ఉంది. హీరోని ఎత్తుకుపోయిన ఆదిమవాసులలో మగవాళ్లే ఉండరు. అందుకోసమని వాళ్లు హీరోని ఎత్తుకుపోతారు. వాళ్లలోనే అంతమంది ఆడవాళ్లున్నారు కనుక, హీరోయిన్‌ని అక్కడే వదిలేస్తారు. హీరోయిన్‌కి హెలికాప్టర్ నడపడం రాదు గనుక హీరో లేకుండా వెనక్కి వెళ్లలేదు. అందుకని, హీరోయిన్ తన హీరోని కాపాడుకుంటానని శపథం చేస్తుంది. హీరోయిన్ ఒంటరిగా వెళ్లి క్లైమాక్స్‌లో వాళ్లతో పోట్లాడి, హీరోని వెనక్కు తెచ్చుకోవడంతో కథ అంతమవుతుంది."

"అంతమంది ఆడవాళ్ల మధ్య వున్న ఒంటరి మగాడు అక్కణ్ణించీ బయటకు ఎందుకు వస్తాడండీ? చచ్చినా రాడు," నవ్వుతూ అన్నాడు కిష్టుడు.

"క్లైమాక్స్ సీన్‌కి ముందు హీరోని గుంజకి కట్టేసి, ఆదిమవాస స్త్రీలంతా హీరోని ఒళ్లంతా తడుముతూ పాడే పాట ఈ సినిమాకే హైలెట్. ఇంకా, చివర హీరో, హీరోయిన్ హెలికాప్టర్లో వెడుతున్నప్పుడు కనీసం అరడజను ఆదిమవాస స్త్రీలు ఆ హెలికాప్టర్‌కు వేలాడుతూ యుద్ధం చెయ్యడం గొప్ప హైలెట్!"

డైరక్టర్ చప్పట్లు కొట్టాడు. "కుర్రకారుని పిచ్చెక్కించేలా ఎంచక్కా తీయొచ్చు. బ్రహ్మాండంగా ఉంది కథ!"

జయలక్ష్మి సంతోషించింది. "ఓ, మీరా డైరక్టరు గారూ! ఈ కథ మీకు నచ్చుతుందనే అనుకున్నాను. కుర్రకారు కనీసం పదేసి సార్లు చూసేలా చేసే బాధ్యత మీది!"

"పది కాదండీ, ఒక్కొక్కళ్లు వంద... వందసార్లు చూస్తారు," అన్నాడు డైరక్టర్.

"మీరు కథ వినిపించారు గదా. అందరూ ఇంక వెళ్లిరండి. మా నిర్ణయం మీకు తర్వాత తెలియజేస్తాం," అని కిష్టుడు బలవంతంగా వాళ్లని బయటికి తోలాడు.

"నాకు ఆశ్చర్యంగా ఉందిరా!" అన్నాడు సుందరయ్య. "జయలక్ష్మి వచ్చినా కూడా 'లే లే లే లె లె లే నారాజా,' లాంటి పాటలు సినిమాలో పెట్టలేదు. పైగా, స్త్రీ ప్రధానంగా

సినిమా అంటుంది. మా కాలం సినిమాల్లో అయితే, ఆఖరికి పౌరాణిక సినిమాల్లో కూడా దేవతావస్త్రాలతో– ఏమిటి, ఆ జయలక్ష్మి 'రామ భీమ యుద్ధం'లో శివుడి ముందు చేసినట్టు– ఒక్క నాట్యమయినా పెట్టేవారు. వీటిల్లో ఒక్కటైనా అట్లాంటి డ్యాన్స్ ఏదీ కనిపించలేదు."

కిష్టుడు పెద్దగా నవ్వాడు. "మామయ్యా, మీ కాలంలో ఆ పాత్రలు వెయ్యడానికి వాంపులు ఉండేవాళ్లు. ఈ కాలంలో హీరోయిన్లే వాంపుల డ్రెస్సులతో సినిమానిండా డాన్సులు చేస్తూ కనిపిస్తారు. అందుకని ఆ వాంపులు వేసినవాళ్లంతా ఉద్యోగాల్లేక ఎప్పుడో వెళ్లిపోయారు."

డైరెక్టరూ, అసిస్టెంటూ, జయలక్ష్మీ, తలుపుని ఒక్క తోపుతోసి లోపలికి వచ్చారు.

"అనుకున్నాను. అమెరికాలో ముప్ఫయి యేళ్లున్నారంటేనే అనుమాన మొచ్చింది. ఈ సినిమాలో గొప్పదన మేమిటో తెలుసా? హీరోయిన్ బీచ్‌లో బికినీ డ్రెస్సుతో పాడుతుండగా కదా ఆదిమవాసులు ఎత్తుకుపోయారు! దాంతో అదే డ్రెస్సుతో సినిమా అంతా హీరోని అడవుల్లో వెతుక్కోవడం. అందుకని ఎప్పుడూ ఏదో ఒక ముల్లు, ఒక కొమ్మా పట్టుకుని ఆ గుడ్డలు చిరుగుతుంటాయి," అన్నాడు డైరెక్టర్.

"పైగా, ఆదిమవాసులంతా ఒక్క తాటాకులు మాత్రం కట్టుకుని తిరుగుతూంటారు. ఇప్పుడు ఊహించుకోండి ఆ క్లైమాక్స్ హెలికాప్టర్ సీన్ని!" అన్నాడు అసిస్టెంటు.

"ఆదిమవాసులు గుంపులో చేసే డాన్సుని!" అని శ్రుతి కలిపింది జయలక్ష్మి.

"అద్భుతం– అద్భుతం. ఒక్క సినిమాతోనే ఆంధ్రా అంతా నా పేరు మోగిపోతుంది," అన్నాడు సుందరయ్య.

"ఇంతకీ సెన్సారు వాళ్లు సినిమా రిలీజుకి ఒప్పుకుంటారా?" సందేహాన్ని వెలిబుచ్చాడు కిష్టుడు.

"దాని సంగతి నాకు వదిలెయ్యండి. ఆ బోర్డులో ఉండేదెవరనుకుంటున్నారు? ఇదుగో మనవా డున్నాడే– వీడి మామగారు, ఈ జయలక్ష్మి వాళ్ల అమ్మా, సినిమాల్లో వేసి, ఎలక్షన్లలో ఓడిపోయిన రాజకీయ నాయకుడు ఒకడు. అంతా మనవాళ్లే!" అభయహస్తా న్నిచ్చాడు డైరెక్టర్.

"ఇప్పుడు సంతకం చెయ్యండి. అడ్వాన్స్ రెండు కోట్లిచ్చి," డైరక్టర్ ఇంక బిజినెస్సులోకి దిగాడు.

సుందరయ్య షాక్ తిన్నాడు. "ఏమిటి, అడ్వాన్సే రెండుకోట్లా!"

"ఎంతలో తీద్దామను కున్నారేమిటి?" అసిస్టెంటు అనుమానంగా చూశాడు.

"ఏదో పదిలక్ష లనుకున్నాను!"

జయలక్ష్మి పగలబడి నవ్వింది. "సినిమా అంతా హీరోయిన్ ఒక్క బికినీతోనే తిరుగుతుంది కనుక దాని ఖరీదే లక్షరూపాయ లవుతుంది."

"నా ఆస్తులన్నీ అమ్మినా కోటి దాటదు!" ఖచ్చితంగా అన్నాడు సుందరయ్య.

అందరూ సుందరయ్య ముఖాన్ని సీరియస్‌గా చూశారు. ఆయన అబద్ధం చెప్పట్లేదని అర్థమయ్యింది.

"ఈమధ్య అమెరికానుంచి వచ్చినవాళ్లని నమ్మలేకుండా ఉన్నాం. రాతియుగంలో ఉన్నట్టుగా బిహేవ్ చేస్తున్నారు. పొద్దున్నే టైమ్ వేస్ట్ చేశారు. ఇంకో బకరాగాణ్ణి వెదుక్కుందాం పదండి," తిట్టుకుంటూ బయటికెళ్ళాడు డైరెక్టర్. అతని వెనుకే అసిస్టెంటు, జయలక్ష్మి వెళ్లారు.

"అదికాదురా. అడ్వాన్సే రెండుకోట్లంటే మొత్తం సినిమాకు ఎంతవుతుందేమిటి?"

"కనీసం పదికోట్లు."

"ఏమిటి, రూపాయలే?"

"కాదు. డాలర్లు."

సుందరయ్య మూర్ఛపోయాడు. కిష్టయ్య గాభరాగా మామయ్యని కదిపాడు. "మామయ్యా, మామయ్యా– జోక్‌కి అన్నాను. అంతే!"

(కామెడీ కథల పోటీలో బహుమతి పొందిన కథ)

(స్వాతి సపరివారపత్రిక, జూన్ 21, 2010)

# థాంక్స్ టు టెక్నాలజీ

తండ్రి తనను ప్రేమిస్తున్నాడని నమ్మడం పదిహేనేళ్ల వయసులో రాధాకృష్ణకే కాక అదే వయసులో వుండీ తరువాతి తరానికి చెందిన జస్వంత్‌కి కూడా కష్టం కావచ్చు. తరాలు మారినా గానీ పాత్రలు వేరయినా గానీ సమాజంలో పరిణామంవల్ల, సంఘంలో స్థానంవల్ల ఆశల్లో, ఆశయాల్లో, భావోద్వేగాల్లో మార్పులు చోటుచేసుకున్నా కూడా మానవ సంబంధాల గూర్చిన కొన్ని అభిప్రాయాలు మాత్రం ఋజువులు చూపనిదే మారేవికావు.

"ఎప్పుడు చూసినా ఆ వీడియో గేమ్స్ కంప్యూటర్లోనో, ఎక్స్‌బాక్స్‌లోనో, గేంబాయ్‌లోనో, ఎన్నిసార్లు చెప్పాలి?" ఇంట్లో అడుగు పెడుతూనే కోపంగా అరిచాడు టెలీకాం కంపెనీలో చీఫ్ ఇంజనీర్ రాధాకృష్ణ, కొడుకు జస్వంత్ మీద.

"ఆ వెధవ తెలుగు పుస్తకాలు చదివితే ఏమొస్తుంది? ఏ షేక్స్‌పియర్‌వో, బెర్నార్డ్‌షావో పుస్తకాలు చదువు. కొంచెం ఇంగ్లీషయినా వంటబడుతుంది!" అన్నాడు ఎల్డీసీ వెంకట్రావ్ ఇంటికి రాగానే కొడుకు రాధాకృష్ణ చేతిలో ఉన్న తెలుగు వారపత్రికని చూసి.

"ఇప్పుడేగా మొదలు పెట్టిందీ?" పెద్దగానే జవాబిచ్చాడు పదిహేనేళ్ల జస్వంత్ హారీపాటర్ గేమ్ మీద కాన్సంట్రేషన్‌ని ఏమాత్రం తగ్గనివ్వకుండా.

"కార్టూన్లు చూడడాని కని ఇప్పుడే అమ్మ దగ్గరనుంచి తీసుకున్నాను," అన్నాడు పదిహేనేళ్ల రాధాకృష్ణ. అంటూనే ఆ పత్రికలో యర్రంశెట్టి శాయి డైలాగు ఒకటి గుర్తొచ్చి ఫక్కున నవ్వాడు.

"అసలు దాన్ని కొనిపెట్టినందుకు నాకు బుద్ధిలేదు. అయినా నిన్నని ఏం లాభం? రాజారెడ్డి వాళ్లింట్లో చూసినదగ్గరనుంచి పోరిందే, కొనమని! మీ అమ్మ ననాలి! ఏదో ఒకరోజున వాటిని గోడకేసి పగులకొడతాను. పీడా విరుగుతుంది," అన్నాడు చీఫ్ ఇంజనీర్ రాధాకృష్ణ.

"ఇంట్లో కొనకపోయినా మీ అమ్మ ఎక్కడ్నుంచో పట్టుకొస్తుంది ఆ వెధవ పుస్తకాలని! ఏముంట య్యందులో? ఒక భాషలేదు, సంస్కృతిలేదు, విజ్ఞానం సరేసరి! ఏదో ఒకరోజున

వీటిని తగులబెడతాను. అప్పుడు కుదురుతుంది తిక్క!" కొడుకు ఆ పత్రికను చదువు తున్నాడనే గాక పైగా నవ్వుతున్నాడని కోప మొచ్చింది వెంకట్రావుకి.

"ఆ. పగులగొట్టండి! మీ డబ్బులేగా! అప్పటినుంచీ ఆ రాజారెడ్డి గారింటికి వెళ్లినప్పుడల్లా వాటి మొహం చూడనివాడిలాగా, ఏమీ లేనివాళ్లలాగా మొహం వాచినట్లు ఆ వీడియో గేమ్స్‌కే మీ అబ్బాయి అతుక్కుపోతే మీకు పరువుగా ఉంటుంది!" చికాగ్గా అన్నది చీఫ్ ఇంజనీర్ భార్య మంజరి.

"తగులబెట్టడానికి అవి మన పుస్తకాలు కావు. సీతమ్మగారు వాళ్లవి," అన్నది వెంకట్రావు భార్య జయమ్మ మెల్లగా.

"అరె. వాడికర్థం కాకపోతే నీకే మయ్యింది? రెండేళ్లలో ఐఐటి ఎంట్రన్స్ రాయాలి. వాటిల్లో నెగ్గాలంటే ఇప్పటినుంచీ చదవకపోతే ఎట్లా? వాటిల్లో నెగ్గటం మాట అటుంచు. కనీసం రామయ్య కాలేజీలో అయినా ఎంట్రన్స్ పాసయ్యి ఆ ఐఐటి కోచింగ్ కయినా సీటు సంపాదించుకో గలుగుతాడా? ఈ వీడియో గేమ్స్‌లో ఉన్న శ్రద్ధ చదువులో ఏది? వీటిల్లో పరీక్షలు పెడితే మాత్రం నీ కొడుకు ఫస్టొస్తాడు!"

"ఆ పత్రికలు కూడా కుమ్మో ఏమయినా పెడతాయా? టైం వేస్టు. ట్యూషన్లు ఎలాగూ పెట్టించడం లేదు. వాటికి వెళ్లేవాళ్లతో పోటీపడాలంటే ఇంకా శ్రద్ధగా చదవాలి!"

"వీడియో గేమ్స్‌లో ఛాంపియన్‌షిప్ గెలవాలంటే, లేటెస్టు గేమ్స్ కావాలి. ఇది 2009 గేమ్. 2010 వెర్షన్ వచ్చి ఆర్నెల్లయింది. ఇంకో నెలలో 2011ది కూడా వస్తుంది," అన్నాడు జస్వంత్.

"ట్యూషన్లలో స్కూల్లో చెబుతున్నవే చెబుతున్నారు. మా ఫ్రెండ్ నోట్స్ తీసుకుని చూశాను," అన్నాడు పదిహేనేళ్ల రాధాకృష్ణ.

"తమరు వాడికా గేమ్‌ని కొని ఆర్నెల్లకి పైగా అయింది! ఏదో పెద్ద రిలీజ్ అయినవన్నీ కొనిపెడుతున్నట్లు మాట్లాడుతున్నారు! ఆ రాజారెడ్డి గారింట్లో ఇంకా ఇండియాలో మార్కెట్లోకి రాని గేములు కూడా ఉంటాయట!" అన్నది మంజరి.

"ఇవేవి కొత్త పత్రికలేం కావు. అయినా ఆ సీతమ్మగారు ఠంచనుగా తను చదవగానే ఏమీ ఇవ్వదు. నెలకోసారి రెండు మూడు పత్రికలు కలిపి ఇస్తుంది. అదికూడా అడగ్గా అడగ్గా. ఎప్పుడు చూసినా ఇంకా వాళ్లాయన చదవలేదనో, వాళ్లమ్మాయి చదవలేదనో చెబుతూనే ఉంటుంది. అయినా చుట్టుపక్కల పిల్లల్లో వీడే బాగా చదువుతాడు!"

"అరె. ప్రతీదానికీ రాజారెడ్డితో పోలుస్తా వేమిటీ? వాడు ఇన్‌కంటాక్స్ ఆఫీసర్. నేను ప్రయివేట్ కంపెనీలో ఇంజనీర్ని. వాడి రాబడి నాకెక్క డుంటుందీ? వాడి పిల్లలు చదువు రాకపోయినా వాడు సంపాదించే ఆస్తితో బతుకుతారు. ఇక్కడ సీటు రాకపోతే వేరే రాష్ట్రానికో లేకపోతే అమెరికాకో పంపించి చదివిస్తాడు. వాళ్లకి చదువు అస్సలు

ఇష్టం లేకపోతే బిజినెస్ పెట్టిస్తాడు. వీడికి ఎంసెట్లో రాంక్ రాకపోతే లక్షలు కట్టాలి డొనేషన్లు. పిత్రార్జితా లేమున్నయ్ అమ్మడానికి?"

"ఇప్పటిదాకా, వీడు చదువుతున్న బళ్లో మిగతావాళ్లతో పోలిస్తే బాగానే చదవ్వొచ్చు కానీ, ఇంజనీరింగ్ ఎంట్రన్స్ అంటే రాష్ట్రం మొత్తంలో కుర్రాళ్లతో పోటీ! సామాన్య మను కున్నా వేమిటి? అప్పో సొప్పో చేసయినా సరే ఇంజనీరింగ్ చదివిద్దాంలే అని నే ననుకున్నా వీడు నాకా అవకాశ మివ్వాలి కదా!" అన్నాడు ఎల్డీసీ వెంకట్రావు.

"కట్టండి లక్షలు డొనేషన్లు! తప్పకపోతే మీరు మాత్రం ఏం చేస్తారు? మా అన్నయ్య కొడుకూ, అక్కయ్య కూతురూ ఇంజనీ ర్లయ్యారు. వీడికి మాత్రం ఎక్కడో అక్కడ సీటు తెప్పించాల్సిందే!" అన్నది మంజరి.

"వాడికామాత్రం తెలియదా ఏమిటి?" మెల్లగానే అన్నది జయమ్మ.

"ఎక్కడో అక్కడ సీటు సంపాదించడం కాదు ప్రశ్న. ఆ నాలుగేళ్ల చదువు అయిన తరువాత జీతాల్లో ఎంత తేడా వుంటుందో నీకేమైనా తెలుసా? ఐఐటిల్లో చదివిన వాళ్లకి నెలకి కనీసం లక్ష! మల్టీ నేషనల్ కంపెనీలల్లో! ఫారిన్ వెళ్లే అవకాశాలు కూడా చాల ఎక్కువే. తర్వాత ఐఐఎంలో ఎంబీయే చేస్తే కనీసం లక్షన్నరో లేక రెండు లక్షలో! అదే ఏ ప్రైవేటు కాలేజీ డిగ్రీయో అయితే నెలకి పాతికవేలు! నువ్వు కట్టే అయిదో పదో లక్షల డొనేషన్ ఎన్ని సంవత్సరాలకు జమ అవుతుందో ఆలోచించు!" అన్నాడు చీఫ్ ఇంజనీర్.

"ఏం తెలుసో ఏమో! నాలాగా క్లర్కులాగా వాడు మిగిలి పోగూడదని నా ఆశ. ఎదుగూ బొదుగూ లేని జీతమూ, జీవితమూను! నా పక్కసీట్లో పాపారావు లంచం తిన్నాడని అరెస్టు చేశారు. పైవాడు తిడితే అది నా తప్పు కాకపోయినా పడాలి. నేను చేరినప్పుడు నా ఉద్యోగానికి అంత పోటీ లేదు గానీ ఇప్పుడు ఎల్టీసీలక్కూడా పరీక్షలూ, సిఫార్సులూ, లంచాలూను."

"అలాంటప్పుడు అంతంత డబ్బులు పోసి ఆ చదువులెందుకూ? రాజారెడ్డిగారినే వాడికి ఐటివోగా ఉద్యోగం ఇప్పించమనండి. మీకు డబ్బు ఖర్చుపెట్టే బాధా తప్పుతుంది, మీ అబ్బాయికి రెండుచేతులా సంపాదించే అవకాశమూ దొరుకుతుంది!" అన్నది చీఫ్ ఇంజనీర్ భార్య మంజరి.

"పోనీ వీణ్ణి ట్యూషన్లోకి తీసుకొమ్మనమని ఆ సుందరంగారి నడగరాదూ? మీ స్నేహితుడేగా!" అన్నది జయమ్మ.

"రాజారెడ్డి నాకు ఫ్రెండ్ కావచ్చు. కానీ నాకంటే ముందు వాడి అన్నదమ్ముల, అక్కచెల్లెళ్ల పిల్లలే కాక, వాడి భార్య తరఫువాళ్ల పిల్లలుకూడా క్యూలో ఉన్నారు. వాడు మాత్రం ఎందరికని చెయ్యగలడు? అదీగాక ఈనాడు అవన్నీ, వాడికంటే పైన ఉన్న పెద్దపెద్దవాళ్ల చేతుల్లో ఉన్నాయ్."

"ఎక్కడైనా బావగానీ వంగతోట దగ్గర కాదని, ఆ సుందరం ఈ విషయంలో ఖచ్చితమైన మనిషి. తెలిసినవాళ్లు గదా అని ఫ్రీగా ట్యూషన్ చెబితే నయాపైసా రాకపోగా శ్రమ మాత్రం మిగుల్తుం దంటాడు."

"నీ ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చుంటారుగా ఇవ్వాళ! ఏదీ?" అడిగాడు రాధాకృష్ణ.

"ఇవాళ వస్తుంటే నీ లెక్కల మాస్టారు కనిపించారు," అన్నాడు వెంకట్రావ్ కొడుకు మొహంలోకి చూస్తూ.

జస్వంత్ కాళ్లీడ్చుకుంటూ వెళ్లి పోగ్రెస్ రిపోర్ట్‌ని తెచ్చి వాళ్ల డాడీ ఒళ్లో పడేసి మళ్లీ వీడియో గేమ్ ముందు కూర్చున్నాడు.

తండ్రి ముఖంలోకి చూడలేక తలదించుకున్నాడు పదిహేనేళ్ల రాధాకృష్ణ.

"లెక్కల్లో ఏమిటి ఈ గ్రేడ్?" ఇంటి కప్పెగిరిపోయేట్లు అరిచాడు చీఫ్ ఇంజనీర్.

"నీ కొడుకు బాగానే చదువుతాడని అన్నట్టున్నావు కదూ?" అడిగాడు వెంకట్రావ్ భార్యని.

"నేను రాయనన్నాను. నువ్వే పట్టుబట్టి తీసుకెళ్లి రాయించావు!" అన్నాడు జస్వంత్.

జరగకూడనిదేదో జరిగిందని జయమ్మకు అర్థమైంది. "కాఫీ తెస్తా నుండండి," అని లోపలకు వెళ్లబోయి, "ఎక్కడికి వెడుతున్నావ్?" అన్న భర్త ప్రశ్నవిని ఆగిపోయింది.

"ఆ ముందు మూడురోజులూ జ్వరమైతే, ఏం చదువుతాడు, ఏం రాస్తాడు? నేను వద్దన్నా వినకుండా తీసుకెళ్లి రాయించారుగా! అంతే మరి!" చికాగ్గా అన్నది మంజరి.

"క్రికెట్ ఆడడానికి," తల దించుకుని జవా బిచ్చాడు పదిహేనేళ్ల రాధాకృష్ణ.

"అంతే, చివరకు తప్పు నాది! ప్రయివేటు స్కూళ్లల్లో మేకప్ టెస్టులు కష్టమని తల్లీ కొడుకూ నాకు చెప్పి, ఆ పరీక్ష రాయించినందుకు చివరకు నా మీదకు తోస్తున్నారు. ఎక్కడ కెడుతున్నావ్?"

"ఆ క్రికెట్ బాల్ గట్టిగా ఉంటుంది. చెయ్యో, కాలో విరగ్గొట్టుకొస్తే డాక్టర్ల చుట్టూ తిరగడానికి నా దగ్గర డబ్బులేదు!" అన్నాడు ఎల్డీసీ.

చేతిలో క్రికెట్ బాల్ పట్టుకుని వెడుతున్న జస్వంత్‌ని చూసి, "యు ఆర్ నాట్ గోయింగ్ ఎనీవేర్. నాట్ విత్ దీస్ గ్రేడ్స్!" అరిచాడు చీఫ్ ఇంజనీర్.

"నెల రోజులపాటు టీచర్లు సమ్మె చేస్తే వాళ్ల స్థానంలో బియిడి ట్రైనింగ్ తీసుకుంటున్న వాళ్లచేత పాఠాలు చెప్పించి, అర్థం అయిందో లేదో తెలుసుకోకుండా అందులో పరీక్ష పెట్టినందువల్ల అంత తక్కువగా మార్కులొచ్చె"య్యని తల్లి ఒళ్లో తలదాచుకుని ఏడుస్తూ చెప్పాడు రాధాకృష్ణ, తండ్రి ఇంట్లో లేనప్పుడు.

"ఎప్పుడూ చదువు, చదువు, ఐ హేట్ హిమ్!" అని తలుపు విసురుగా వేసి బయట కెళ్లాడు జస్వంత్.

"మరి నాన్నకా సంగతి చెప్పొచ్చుగా?" అనునయిస్తూ అడిగింది జయమ్మ.

"వాణ్ణర్థం చేసుకోరెందుకని?" అని విసురుగా లేచింది మంజరి. "డాడీకి ఎప్పుడూ నా గ్రేడ్స్ తప్ప నే నక్కర్లేదు!" అని జస్వంత్ చాలాసార్లనడం ఆమెకి బాగాగుర్తే. "నువ్వు అది డాడీతోనే చెప్పొచ్చు కదరా!" అని కూడా అందామె.

"ఆయన చూపులు తట్టుకోలేనమ్మా!" అన్నాడు రాధాకృష్ణ. తండ్రి కసలు తనంటే ఇష్టం ఉన్నదా అని అనుమానపడ్డాడు కూడా.

"యాజ్ ఇఫ్ ఇటీజ్ గోయింగ్ టు మేకె డిఫరెన్స్!" అన్నాడు జస్వంత్ చికాగ్గా మొహం పెట్టి.

"ఏం చెప్పినా వాడి బాగుకోసమేగా!" తల పట్టుకుని సోఫాలో కూలబడ్డాడు చీఫ్ ఇంజనీర్.

"ఏం చదువులో ఏమిటో! నీ చదువు నువ్వు చదువుకున్నావు గనుక సరిపోయింది గానీ, ఈ కాలంలో అయితే మేమేం చెయ్యగలిగే వాళ్లం?" అన్నది అక్కడే కూర్చుని అంతా చూసిన జయమ్మ.

"మీ అబ్బాయి గొప్పవాడు! మీ మనవడే ఎందుకూ కొరగానివాడు, సరేనా?" అని బెడ్రూంలో కెళ్లి ధడాల్న తలుపేసింది మంజరి.

"వాణ్ని మీరెప్పుడూ ఒక్కముక్క కూడా మెచ్చుకోలుగా అన రెందుకు?" ప్రక్కన చేరి చెక్కిలి నొక్కి చక్కగ మరుకేళి చొక్కిన తరువాత జయమ్మ అడిగింది.

"రోజూ ఛస్తున్నాను మీ తండ్రీ కొడుకుల యుద్ధాన్ని భరించలేక. తమరు వాడితో ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడింది లేదు ఈ మధ్యలో," రాధాకృష్ణ తనమీద వేసిన చేతిని విదిల్చికొట్టి పక్కకు తిరిగి పడుకుంది మంజరి.

"నా బదులు నువ్వు చేస్తూనే వున్నావ్‌గా! నీకు నేనుకూడా తోడయితే వాడికి ఓవర్ కాన్ఫిడెన్స్ వచ్చి మొదటికే మోసం వచ్చే ప్రమాదముంది!" అన్నాడు వెంకట్రావ్. ఆవిడ దగ్గర సేదతీరిన శరీరంతో బాటు కొడుకు ఉజ్జ్వల భవిష్యత్తును గూర్చిన ఊహలు అతని కనురెప్పలమీద బరువుగా వాలడంతో నిద్రలోకి జారుకున్నాడు.

"కొద్దిగానైనా మంచి గ్రేడ్స్ పట్టుకురమ్మనమని చెప్పు. అప్పుడు నా మొహంలోకి నవ్వు దానంతటదే వస్తుంది," అన్నాడు చీఫ్ ఇంజనీర్ వేరే పక్కకి తిరుగుతూ. శరీరం సేదతీరడానికి మంజరి సహాయం లేకపోవడంతో బాటు జస్వంత్ భవిష్యత్తును గూర్చిన ఆరాటం నిద్రని అతని కళ్లకి దూరంగా ఉంచింది. చిన్నప్పుడు తన భుజాలమీద ఎక్కి ఆడిన జస్వంత్ అతనికి పదే పదే గుర్తుకు వచ్చాడు.

* * *

"ఇదుగో, వీడియో టేపులన్నీ ఎక్కడున్నాయో తీసివ్వు!" అన్నాడొకరోజు రాధాకృష్ణ మంజరితో.

"నాకేం తెలుసు? మీరేగా వాటిని భద్రంగా పెట్టుకుంటారు! అయినా ఇప్పుడు వాటితో అవసరమేమొచ్చింది?"

"మనం వీడియో కెమెరా కొని పదిహేనే ళ్లయ్యింది. ఎప్పుడయినా రికార్డ్ చెయ్యడమే తప్ప ఆ టేపుల్ని చూసింది లేదు."

"నేను చూడాలో అంటే మీకెప్పుడయినా పట్టిం దేమిటీ?"

"టై మెక్కడ దొరికింది, ఆ టేపులని ట్రాన్సఫర్ చేస్తూ కూర్చోవడానికి? ఇప్పుడయినా ఎందుకు తప్పట్లేదంటే – కొన్నప్పుడు దాని ఖరీదు లక్ష రూపాయలు – జస్వంత్ పుట్టినప్పుడు కొన్నదది! ఇప్పుడు దీనికి పార్టులు ఏవీ దొరకట్లేదట. ఇది పాడయితే, టేపులుండి కూడా ప్రయోజనం లేదు. వాటిని డివిడీల్లోకి మారుస్తాను ఇవ్వాల్టినుండీ," అన్నాడు. అనడమే గాక ఆనాటి నుంచే మాట నిలుపుకోవడం మొదలుపెట్టాడు. వీడియో కెమెరాని టీవీకి కనెక్ట్‌చేసి, ప్లే చేస్తున్న వీడియోని డివిడి రికార్డర్లో రికార్డు చేస్తూ టీవీలో దాన్ని చూడ్డం మొదలుపెట్టాడు. మంజరి కూడా పక్కన చేరింది వాటిని చూడడానికి.

రాత్రి పదిగంటల ప్రాంతంలో తన గదిలోంచి బయట కొచ్చిన జస్వంత్, తల్లిదండ్రులు చూస్తోంది తన చిన్నప్పటి వీడియోలని గ్రహించడానికి అట్టే సమయం పట్టలేదు. వాడు చూస్తూండగానే ఆర్నెల్ల వయసప్పుడు చేతులతో తనని పైకెత్తినప్పుడు తండ్రి మొహం మీద ఉచ్చపోసిన దృశ్యం వచ్చింది. పొట్ట పగిలేలా నవ్వి, "దటీజ్ వెరీ ఫన్నీ!" అన్నాడు. ఆ తరువాత తండ్రి తనని ఎత్తుకు తిరగడమూ, ముద్దులు పెట్టుకోవడమూ చూశాడు.

"ఈ వీడియే టేపులు చూడకపోతే నువ్వివన్నీ చేశావంటే నమ్మేవాణ్నికాదు," అని అన్నాడు.

రాధాకృష్ణకి తల్లితో సంభాషణ గుర్తొచ్చింది.

"నాన్న నా గూర్చి ఒక్క ముక్క కూడా మంచిగా చెప్పరెందుకని?" జయమ్మ నడిగా డొకసారి.

"ఎందుకు చెప్పర్రా? అయితే నువ్వు వింటున్నప్పుడు మాత్రం చెప్పరు."

"నాకు నమ్మబుద్ధి కావట్లేదు!"

"ఆయన నీ గూర్చి ఎప్పుడూ గర్వపడతారు. ఆయనకి నేను ఎన్నిసార్లు చెప్పానో – మీరు వాడిని బాగా చదువుతున్నావురా అని అనవచ్చుగదా, అని! అయితే, ఆయన నమ్మకాలే వేరు. తల్లిదండ్రులు పిల్లల నెప్పుడూ వాళ్లముందర పొగడకూడ దనేవారు.

నీతో చెబితే ఇంక నువ్వు చదవడం మానేసి రోడ్లమ్మట తిరగడం మొదలు పెడతావని కూడా ఆయన భయం."

తండ్రి తనని ప్రేమించేవాడని నమ్మడం కష్టమే అయింది రాధాకృష్ణకి– ఆయన ఎప్పుడు చూసినా ఇంకా బాగా చదవాలంటూ ఉంటే. ఆయన బ్రతికి ఉన్నంతకాలం ఆ అపనమ్మకం రాధాకృష్ణ మనసులో వాళ్లిద్దరికీ మధ్య అడ్డుగోడగా నిలిచింది. ఆయన పోయిన తరువాత కానీ మెల్లగా ఆ అడ్డుగోడ పునాదులు కదలడం మొదలుపెట్టలేదు. ఆ బెర్లిన్ వాల్ కూలిన తరువాత అవతలపక్కన తండ్రి లేకపోవడం అతణ్ణి బాధపెట్టింది. ఆ గోడ కూలడం కొన్నేళ్ల క్రితం జరిగుంటే బావుండే దనుకున్నాడు.

ఇప్పుడు జస్వంత్ తండ్రిని చూస్తున్నాడు. వచ్చి రాధాకృష్ణ పక్కన కూర్చున్నాడు. వాడు తండ్రి నల్లుకున్న తన చిన్నతనాన్ని చూశాడు. ఆ వెల్లివిరిసిన చిన్నతనం తండ్రి మొహం మీద కాంతు లీనడం చూశాడు. తండ్రి కురిపించిన ముద్దులవర్షం అప్పుడే తనమీద పడ్డ అనుభూతి చెందే ఉండాలి.

లేకపోతే మరునాడు తండ్రి ఇంటికి రాగానే, క్లాసులో లెక్కల్లో మళ్లీ తక్కువ మార్కు లొచ్చాయని చెప్పడమేకాక, "నేనింకా ఇంప్రూవ్ అవాలి, సహాయం చెయ్య"మని అడుగుతాడా?

"అదృష్టవంతుడు! నేను బ్రతికి ఉన్నప్పుడే తండ్రి ప్రేమనీ, ఆతృతనీ తెలుసుకున్నాడు. అదే తను? తన చిన్నతనం తన తండ్రి మదిలో నిక్షిప్తమైన దృశ్యమాలిక. ఆ చిన్నతనాన్ని తనతో ఎప్పుడు పంచుకున్నా మాటలు మాత్రం చెవిలోకి ఎక్కాయి గానీ ఆ దృశ్యకావ్యం మాత్రం తన కళ్ల వెనక్కి చేరలేకపోయింది. తన మదిలో ఓ మూల దాక్కుని పీడించిన అనుమాన భూతానికి వీడి మదిలో చోటు దక్కించుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. థాంక్స్ టు ది కేమ్ కార్డర్, థాంక్స్ టు టెక్నాలజీ!" అనుకున్నాడు రాధాకృష్ణ.

తల్లి ప్రేమనీ, అనురాగాన్నీ చిన్నతనం నుంచీ ప్రతీ ముద్దలోనూ పంచిపెడుతుంది గనుక ఆమె మనసు తెరిచి ఉంచిన పుస్తకం లాంటిది. తండ్రి ఆప్యాయతే, బీరువాలో దాచి వుంచి తాళం వేసినట్లుగా ఉండడంవల్ల ఆ గుప్తధనాన్ని కళ్ల జూపడం టెక్నాలజీవల్ల సాధ్యమయితే ఆ టెక్నాలజీ మనిషి పురోగమనానికి మైలురాయిగా మాత్రమే నిలిచిపోకుండా మానవ సంబంధాలని పెంపొందించడానికి కూడా తోడ్పడుతున్నట్లే లెక్క!

(వేదుల చిన్న వేంకట చయనులు – నవ్య వీక్లీ కథలపోటీలో
విశేష బహుమతి పొందిన కథ)

(నవ్య వీక్లి, ఫిబ్రవరి 16, 2011)

# రేపటి ఆశాకిరణాలు

నిద్రలో బస్సు కుదుపులకి జోగుతున్న సుబ్బారావుకి బస్సుకు సడెన్‌గా బ్రేకు వెయ్యడం వల్ల ముందు సీటుకు నుదురు కొట్టుకుని మెలకువ వచ్చింది. పరిస్థితి అర్థమయ్యేలోగానే, "దిగండి, అందరూ దిగండి" అని అరుస్తూ మనుషులు బస్సును ధబధబా బాదుతుండడంతో మండుతున్న కళ్లను నులుముకుంటూ చేత్తో సంచీని పట్టుకుని ముందువాళ్లను యాంత్రికంగా అనుకరిస్తూ అతను క్రిందకు దిగాడు. కాలు కింద పెడుతూండగానే ముక్కు పుటాలకు సోకింది గుప్పుమని కిరసనాయిల్ వాసన.

"సామాన్లు పట్టుకుని తొందరగా ఆ చెట్టు దగ్గరకు పదండీ!" ఆదుర్దా, భయం నిండిన గొంతుతో అర్థింపుతో కలిపి భర్తకు ఆదేశాన్ని వెలిపరచిందొక భార్య.

నిద్ర చెడగొట్టినందుకు కోపాన్ని కసితీరా ఏడుపు రూపంలో ప్రకటించినా మామూలుగా సముదాయించే తల్లి అలాంటి ప్రయత్నం చేసే సూచనలు కూడా లేకపోయేసరికి ఆశ్చర్యంతో గొంతును కట్టేసింది ఒక పసిపిల్ల.

"నా సామాన్లు కొద్దిగా దించి పెట్టండి నాయనా," బస్సు మధ్యలో ఒక సైడు సీటులో నిల్చొని, తనని దాటి వెడుతున్న వాళ్లలో ఎవరిలోనో ఒకరిలో మానవత ఉండక పోతుందా, సాయం చెయ్యలేక పోతారా అన్న ఆశతో అర్థిస్తోంది ఒక ముసలావిడ.

"అరె, నన్ను దిగనివ్వ రేమిటండీ?" పట్టుకున్న పెద్ద సూట్‌కేసును దింపడానికి చాలా కాళ్లు అడ్డురావడంతో వాటి తాలూకు శరీరాల్ని గదమాయించే ప్రయత్నం చేస్తూ, సూట్‌కేస్ బాగా బరువుండడం వల్ల దానిని పైకి లేపడానికి కష్టపడుతూ అంటున్నాడు ఇరవయ్యేల్లో ఉన్న ఓ కుర్రాడు.

అప్పటకి ఒక పదిగజాల దూరానికి చేరి బస్సువైపు చూస్తున్న సుబ్బారావుకు ఆ సూట్‌కేసును చూడగానే దానివల్ల తగిలిన దెబ్బ గుర్తొచ్చి మోకాల్ని తడుముకున్నాడు. విదేశ పయనం నుదుటి మీద స్పష్టంగా రాసివుంటే మధ్యలో ఈ అవాంతర మేమిటని ఆ సూట్‌కేసు విసుక్కుంటున్న దనిపించింది సుబ్బారావుకి.

మనుషులు పూర్తిగా దిగడం కోసం ఆగకుండా, ఆ బస్సు నాపిన వ్యక్తులు, వేరెవరో కట్టి పడేసిన రాజకుమారుణ్ణి చంపుతున్న అసహాయశూరుల్లా బస్సును గొడ్డళ్లతో నరుకుతున్నారు, గునపాలతో పొడుస్తున్నారు.

కళ్ల కెదురుగా కనపడుతున్న దృశ్యాలను మనసు అర్థం చేసుకుంటూండగానే ఎదురుగా వెలిగిన మంట చుట్టూరా ఉన్న చీకటిని సుబ్బారావుకి చూపించింది. దాని వేడి, వంటిని చుట్టివున్న జనవరి మాసపు చలిని గుర్తుచేసి, అతని శరీరంలో వణుకు పుట్టించింది.

బస్సు మంట వెలుగులో ప్రయాణీకుల ముఖాల్లో పరిస్థితి అర్థమైన ఛాయలు నిస్సత్తువ రూపంలో వెల్లడవుతున్నాయి. చేతిలో ఆ బస్సుకు కావల్సిన టిక్కెట్టు తప్ప నయాపైస లేక ఏం చెయ్యాలో తెలియక కింద కూలబడి పక్కనున్న ఆరేళ్ల పిల్లాణ్ణి కావలించుకుని ఏడుస్తోంది ఒక వనిత.

ఓణీ వేసుకున్న ఒక పదహారేళ్ల పిల్లా, ఓ వృద్ధ వయస్కురాలూ, సముదాయించే వాళ్లు లేక ఒకళ్ళ నొకరు పట్టుకుని గుడ్లనీరు కుక్కుకుంటున్నారు.

మంటలు బస్సు నావరించగానే దానికి కారకులైన వాళ్లల్లో ఉత్సాహం పెల్లుబికింది. వాళ్లల్లో ఒకడు దప్పందుకోగానే, వాళ్లు శాపవశాత్తు మానవ రూపాల్ని ధరించి, ఆ శాపం నుంచీ విముక్తి పొందిన పిశాచాల్లా ఆనందంతో గంతులెయ్యడం మొదలుపెట్టారు.

వారి ఆనందాన్ని ఇనుమడింప చెయ్యడాని కన్నట్లు ఇంకొక ఆర్టీసీ బస్సు వచ్చి దగ్గరగా ఆగింది– ఒప్పందం ప్రకారం బకాసురుడికి కోపం రాకుండా వుండడానికి పంపిన అరణం లాగా. ఆ బస్సులో భీముడు ఉన్న ఛాయలేం లేకపోవడంతో అది కూడా క్రిందకు దింపబడ్డ ప్రయాణీకుల మోహాల్లో వెలుగును నింపడానికి శక్తివంచన లేకుండా కృషిచేసింది.

ఆకాశా న్నంటడానికి కృషి చేస్తున్న మంటలు కృతజ్ఞత చూపించడానికా అన్నట్లు తాము అక్కడ ప్రత్యక్షం కావడానికి కారకులైన వాళ్ల మీద శాయశక్తుల్లా వెలుగును విరజిమ్మాయి. ఆ వెలుగులో వాళ్ల చేతుల్లో గొడ్డళ్లూ, గునపాలే కాక కొందరి భుజాలకు కట్టిన తాయెత్తులూ, మెళ్లో వేళ్లాడుతున్న దేవుళ్ల బిళ్లలూ మెరుస్తూ కనిపిస్తున్నాయి. నరకాసురుడి వధను పండుగగా జరుపుకుని ఆనందించి రెణ్ణెల్లే అయింది కానీ, నరకాసురుడి మానసపుత్రుల్నించీ మానవజాతిని రక్షించడానికి సత్యభామ సంతతి ఎక్కడా దరిదాపుల్లో కనిపించడంలేదు.

సుబ్బారావు వాచీ చూసుకున్నాడు. తెల్లవారడానికి ఇంకా రెండుగంటల వ్యవధి వుంది. తమ బస్సు వెళ్లాల్సిన దారివైపు దృష్టి సారించాడు. దూరంగా మినుకు మినుకు మంటూ కనిపిస్తున్న వీధి దీపాలు ఊరి ఉనికిని తెలుపుతున్నాయి. “అంటే, తను గమ్యానికి

దగ్గరగానే ఉన్నా డన్నమాట. కానీ ఇక్కణ్ణించీ కాలినడక తప్పదులా ఉంది," అనుకుని నీరసించాడు.

మళ్లీ ఇంకొక బస్సు. ఇంకొక భోగి మంట – భోగం దూరంగా మిద్దెల్లో కూర్చొని, ఇక్కడ మంట పెట్టిస్తున్న వాళ్లకి. ఈ వేడి వాళ్లకు అంటదు గానీ, వాళ్ల వేడి మాత్రం ఇక్కడ బాగానే తగుల్తోంది. అది జాతీయ రహదారి కావడంతో, పైగా ఒక పెద్ద నగరానికి రెండు గంటల దూరంలో మాత్రం ఉండడంతో, తెల్లవారేసరికి నగరానికి చేరాల్సిన బస్సులన్నీ ఇక్కడ బలవంతపు అంతిమ యాత్ర సాగిస్తున్నాయి.

ఒక నాలుగైదు బస్సుల ఖననం తర్వాత నరకాసురుడి వారసుల్లో కొందరు రోడ్డు పక్కగా ఆపివున్న ఒక జీపువైపు వెళ్లడం సుబ్బారావు గమనించాడు. బయటికి తీసిన డబ్బాల బట్టీ వాటిలో ఉన్నది కిరసనాయిలని గ్రహించాడు. జీపు పక్కనే ఒక అంబాసడర్ కారు కూడా ఆగి ఉంది. తెల్లవారుతున్న వెలుగులో వాటిని సుబ్బారావు గుర్తుపట్టాడు.

అప్పటికే బస్సుల్లోంచి దింపబడ్డ ప్రయాణీకులంతా వేర్వేరు గుంపులుగా ఏర్పడ్డారు. ఒక ఒంటరిగా వెడుతున్న మగవాళ్ల గుంపు, ఒక కుటుంబంతో ప్రయాణిస్తున్న వాళ్ల గుంపు, ఒక ఆడవాళ్ల గుంపు, కలిసికట్టుగా ఉంటే రాక్షసత్వాన్ని విజయవంతంగా ఎదర్కోవచ్చు నన్న ఉద్దేశ్యంతో కాకుండా అందరూ కలిసి ఒక్కసారి కళ్లు మూసుకుంటే రాక్షసులు మాయమవుతారన్న ఆశతో వాళ్లు అక్కడ సమావేశ మయినట్లు కనిపిస్తోంది. సుబ్బారావు ఒంటరిగానే ప్రయాణిస్తున్నాడు గనుక మగవాళ్ల గుంపుకు దగ్గరగా చేరి నిలబడ్డాడు. వాళ్ల మాటల్లో, ఈ బస్సుల దహనకాండ అతని ఊళ్లోని ఒక రాజకీయ నాయకుణ్ణి అతని ప్రతిపక్షం వాళ్లు రెండు రోజుల క్రితం చంపినందుకు చూపిస్తున్న ఆగ్రహం అని అర్థమైంది.

"ఇది జరిగి రెండు రోజులు అయ్యింది కదా, ఈ పాటికి పోలీసులు జాగ్రత్తలు తీసుకుని ఉంటార్లే అని బయల్దేరా!" – ఒకాయన వాపోయాడు.

"దమ్ముంటే వాళ్లని ఒకళ్ల నొకళ్లు ఎదురుపడి తన్నుకోమనండి. చంపుకోమనండి. మధ్యలో మన ల్నెందుకు ఇలా వేధించడం?"– ఒకాయన ఆవేశంతో అన్నాడు. హాని కలిగించగల వాళ్లు కూతవేటు దూరంలో లేరన్న సంగతి బహుశా ముందు గమనించే ఉంటాడు.

తెలతెలవారుతుండగా అప్పుడు జరిగిందా సంఘటన.

ఈత రానివాడు వరదలో కొట్టుకుపోతు న్నప్పుడు తెగించి ఈదుదామని ప్రయత్నించి నట్టుగా ఒక ముసలావిడ అగ్నికాముకదళంలో నాయకుడిలా కనిపిస్తున్నవాడిని బ్రతిమలాడడం మొదలుపెట్టింది.

"లే. ఎళ్లెహె!" ముందు పట్టించుకోకపోయినా ఆవిడ వదలకుండా పట్టుకునే సరికి అతను చిరాగ్గా విదిలిస్తున్నాడు.

అతనావిడని తోసి పారెయ్యలేదన్న ధైర్యంతో కాబోలు ఒక యువకుడు– పాతిక ముప్ఫై ఏళ్ల మధ్యలో ఉంటుంది వయసు – తను కూడా గొంతు కలిపి వెంటపడ్డాడు.

"సార్, సార్! నా కివ్వాళ సిటీలో ఇంటర్వ్యూ ఉంది సార్. నాకు ఇద్దరక్కయ్యలూ, ఇద్దరు చెల్లెళ్లూ – ఎవరికీ పెళ్లి కాలేదు సార్. మా నాన్న రిటైరయ్యాడు సార్. నాకీ ఉద్యోగం చాలా అవసరం సార్. ఇవాళ ఇంటర్వ్యూకి ఇక్కణ్ణించీ రెండు గంటలు ప్రయాణం సార్. నా దగ్గర వేరే డబ్బులేం లేవు సార్. ఆవిణ్ణీ, నన్నూ ఒక బస్సులో పంపించండి సార్!" బతిమాలుతూ వంగి, కాళ్లమీద పడబోయాడు.

అతన్ని కాలితో గట్టిగా తన్నేసి ముందుకు కదిలాడా అగ్నికాముకుడు సుబ్బారావు వేపుకు వస్తూ. ఆ తోపుకు పక్కకు పడినా, మళ్లీ లేచి వెంటపడి, ఈసారి అతని చేతిని గట్టిగా పట్టుకునే ప్రయత్నం చేస్తున్నాడు ఆ యువకుడు – ఉద్యోగం రాకపోతే ప్రాణం వుండీ లాభమేముందన్న నిర్ణయాని కొచ్చినవాడిలా.

వాళ్లిద్దరూ తనవైపు రావడం చూస్తున్న కొద్దీ సుబ్బారావుకు అక్కణ్ణించీ పారిపోవా లనిపిస్తోంది కానీ మెదడులో అంతగా భయం ఉందని అనిపించకపోవడం వల్ల గావును కాళ్లు మొరాయిస్తున్నాయి.

అగ్నికాముకుడి సహనం తొందరగానే నశించినట్లుంది. అతను ఆ కుర్రాడి చొక్కాని ఎడంచేతి గుప్పెట్లో బిగించి కుడిచేత్తో మొహం మీద గుద్దడానికి చెయ్యెత్తేసరికి వాళ్లిద్దరూ సరిగ్గా సుబ్బారావు ముందున్నారు. ఆ కుర్రాడి తల సుబ్బారావు కళ్లనూ, అగ్నికాముకుడి కళ్లనూ కలవనీకుండా అడ్డం పడుతోంది.

"నర్సయ్యా," అన్నాడు సుబ్బారావు. ఆ పిలుపులో కోపం లేదు, ఆదేశం అసలే లేదు, భయం ఉందో లేదో తెలియదు గానీ అర్థింపు మాత్రం ఉంది.

ముసుగేసుకుని హత్య చెయ్యబోతున్న వాణ్ణి పేరు పెట్టి పిలిచినప్పుడు స్తంభించి పోయిన హంతకుడిలా చేతిని గాల్లోనే ఆపేశాడు ఆ అగ్నికాముకుడు.

అతి హీనస్వరంతో కూడిన పిలుపు తన పెదవి దాటిందని అప్పుడర్థమైంది సుబ్బారావుకి.

తనను పేరు పెట్టి పిలిచిన మనిషి మొహం చూడడానికి ఎడమ గుప్పెట్లో ఉన్న కుర్రాణ్ణి నర్సయ్య పక్కకు లాగగానే అతని మెడలో ఎర్రతాడుకు వేలాడుతున్న సీతారామలక్ష్మణ ఆంజనేయస్వాము లున్న బిళ్ల సుబ్బారావుకి కనిపించింది. రాముడికి దణ్ణం పెట్టుకొమ్మనమని గుళ్లోకి పంపే మనసుల్లో అదే మనసు మారుమూలల్లో దాగిన ఖరదూషణాదులని ఓడించడానికి కావల్సిన శక్తి ఎందుకు ఉండదు? దేవుడిని మెడలోనే కట్టేసి మెదడులోకి రానీయకుండా అడ్డుపడుతుండే ఆ శక్తులు ఎంత గొప్పవి!

ఆలుచిప్పలో వర్షపు చినుకుపడిన తరువాత పూర్తి పరిణామం పొందకుండానే వెలికి తీసిన ముత్యంలా నర్సయ్య వికృతంగా ఉన్నాడు. ఎంతో కాలం క్రితం చూసినప్పటి

కంటే జుట్టు బాగా పెరిగి ఉంది. అందుకే కాబోలు సుబ్బరావు ముందతన్ని గుర్తుపట్టలేక పోయాడు.

కాళ్లల్లో ధైర్యం మెదడులో కెక్కినట్టుంది– కొట్టద్దన్నట్టు తల మెల్లగా అడ్డంగా ఆడించాడు సుబ్బారావు.

నర్సయ్య సుబ్బారావుని తీక్షణంగా చూశాడు. ఆ చూపులో ఊరికి ఐదు కిలోమీటర్లకి పైగా దూరంగా వచ్చి బస్సు ల్నటకాయిస్తున్నా తెలిసినవాడు కనిపించినందుకు కోపం ఉంది. కుడిచేతిని క్రిందకు దించకుండా ఎడమచెయ్యి గుప్పెట తెరిచి నర్సయ్య ఆ కుర్రాణ్ణి వదిలిపెట్టేటప్పటికి ఆ లేపిన చెయ్యి తనకు తాకుతుం దేమోనని ఒక్కక్షణం సుబ్బారావుకు భయమేసింది. కానీ, ఎడమచేతి గుప్పెట్లోని చొక్కాని వదిలేసి, ఎత్తిన కుడిచేతిని కిందకు దించుతూ, నర్సయ్య విసురుగా అక్కణ్ణించి వెళ్లిపోయాడు.

కింద కూలి, గుప్పెట్లో వెన్నెల చెయ్యి జారిపోయినట్లు రూఢి అయినందుకో లేక నరకాసురుడి చేతిలో చావనందుకో ఏడుస్తున్న ఆ కుర్రాణ్ణి పైకిలేపి భుజాలకు హత్తుకున్నాడు సుబ్బారావు.

నర్సయ్యతో కలిపిన మాటలో పేరుతో పాటు కొంత పరిచయం కూడా తొంగిచూడడం వల్ల మిగిలిన వాళ్లు సుబ్బారావుని గూర్చి గుసగుసలు మొదలు పెట్టగానే ఆ కుర్రాణ్ణి అక్కడే వదిలి కొద్దిగా దూరంగా నడిచాడు.

మొదటి బస్సును తగులబెట్టినప్పుడు పట్టుమని ఇరవైమంది కూడా లేని దుండగులు ప్రయాణీకులకన్నా ఎక్కువ సంఖ్యలోనే కనిపించినా పది బస్సుల్నాపి తగులబెట్టడం వల్లా, అనేక ప్రైవేటు వాహనాలు కూడా ఆగిపోవడం వల్లా తయారైన జనసమూహం విచ్చుకుంటున్న వెలుగురేఖల్లో విరుచుకుపడబోయే ఉప్పెనలాగా కనిపించి అగ్నికాముకులు తిరోన్ముఖు లయ్యారు.

"మాష్టారూ, నర్సయ్య మిమ్మల్ని ఊళ్లో దింపమన్నాడు, రండి." అని చెప్పిన సలీం తమ్ముడికి చేత్తోనే అక్కర్లేదని సంజ్ఞ చేసి వాణ్ణి పంపించేశాడు సుబ్బారావు.

వాళ్లటు వెళ్లగానే ఇటు వచ్చిన పోలీసులు మొహాల్లో అప్పటిదాకా అక్కడికి రాకుండా వుండడానికి పుచ్చుకున్న మందుల, లంచాల ఛాయలేం కనిపించలేదు.

అటకాయించిన వాళ్లు అడ్డం లేకపోవడం వల్లా, ఎదురుగా కనిపిస్తున్న పోలీసులు ఏదో చేస్తా రనిపించడం వల్లా, ప్రైవేటు వాహనాలు ఆ డివైడెడ్ హైవేలో రెండో పక్కనించి ఎదుట దార్లో వెళ్లడం మొదలు పెట్టాయి.

ఇరుక్కుపోయిన ప్రయాణీకులు బతిమాలో, డబ్బులిచ్చో, ప్రైవేటు వాహనాల్లో ఇరుక్కుంటున్నారు. "బడి గంట కొట్టగానే విముక్తి పొందిన పిల్లల్లా గబగబా అక్కణ్ణించీ పరుగెత్తుతున్నారు," అనుకున్నాడు సుబ్బారావు.

సుబ్బారావు తనతో పాటు బస్సులో వచ్చిన వాళ్లవైపు చూశాడు. పెద్ద సూట్‌కేసు కుర్రాడు దూరంగా ఆగిన ప్రైవేటు వాహనాల దగ్గరకి ఆ సూట్‌కేసుని మోసుకు వెళ్లలేక చుట్టుపక్కల వాళ్లని సహాయం అడుగుతున్నాడు– “మేష్టార్లూ, దీన్ని కొద్దిగా చూస్తూంటారా, లిఫ్ట్ అడిగి వస్తాను,” అని. అతను డబ్బులిస్తానన్నా దాన్ని చూసేవాళ్లూ, మోసేవాళ్లూ ఎవరూ లేరు. ఆ డబ్బుల అవసరం ఉన్న ఆరేళ్ల పిల్లవాడి తల్లి ఆ సూటుకేస్‌ని మోసి డబ్బు సంపాదించే శక్తి లేక, కేవలం మానవత్వాన్నీ జాలినీ అర్థించి తప్ప గమ్యం చేరలేదని అర్థమై తోటి ప్రయాణీకుల్ని ఆశ్రయిస్తోంది.

సుబ్బారావు కొన్ని అడుగులు ముందుకేసి, ఆ సూట్‌కేస్‌ను తను చూస్తుంటానని చెప్పగానే, నమ్మకస్తుడిలాగే కనిపించినందువల్లో ఏమో, “థాంక్స్ మాస్టారూ!” అని అతడు పరుగెత్తుకు వెళ్లాడు. బస్సులోంచి దిగేటప్పుడు విసుక్కున్నా, మంటలు కనపడగానే, బొందితో విదేశయాన ప్రాప్తిలేకుండా చెయ్యబోయిన ఖర్మనించి కొద్దిలో తప్పించు కున్నట్లు తెలిసి నీరసంగా వాలిపోయి ఉన్నదా సూట్‌కేస్.

నర్సయ్యచేత దెబ్బతినబోయిన కుర్రాడు కూడా కళ్లు తుడుచుకుని తన ప్రయత్నాల్ని మొదలుపెట్టాడు.

తన ఊరు కనుచూపు మేరలో కనిపిస్తూండడంతో కొంచెం కష్టపడైనా నడిచే వెళ్లడానికి సుబ్బారావు నిర్ణయించుకున్నాడు. దాదాపుగా అక్కడ ఇరుక్కుపోయిన వాళ్లందరూ అతని ఊరుని దాటి రెండుగంటల దూరంలో ఉన్న నగరానికి చేరుకోవలసిన వాళ్లే. వాళ్ల యాతనతో పోలిస్తే తన ఇక్కట్లు గొప్పవని అనిపించ లేదతనికి. సూట్‌కేస్ కుర్రాడు లిఫ్ట్ సంపాదించుకోగానే సుబ్బారావు తన ఊరివైపు నడక సాగించాడు.

ఊరు దగ్గరవుతున్నకొద్దీ అది భూతంలా ఆకారాన్ని పెంచుతున్నట్లు, దాని ముందు క్షణక్షణానికి తన ఐదడుగుల శరీరం చిన్నదైపోతున్నట్లు అనిపించింది. ఆ ఆలోచనే చిత్రంగా ఉందతనికి. పుట్టి పెరిగిన ఊరు తనకు భూతంలా అనిపించి భయపెడుతుందని అతనెప్పుడూ కలలోనైనా అనుకోలేదు. ఇంతకు ముందు బస్సుల్ని తగులబెట్టడం గూర్చి పేపర్లో చదవడమే గానీ అలాటి ముప్పు తను ప్రయాణిస్తున్న బస్సుకే వాటిల్లుతుందని అప్పటి దాకా అనిపించనూ లేదు మరి! అందులోనూ తన ఊరి ప్రజల నుండీ. పైగా తెలిసిన వాళ్ల నుండీ. అంతకన్నా ముఖ్యంగా నర్సయ్య నుండీ.

దగ్గరయ్యే కొద్దీ మొదట దర్శన మిస్తున్నవి పూరిపాకలు. వాటిని దాటుకుంటూ కొద్దిగా ముందుకు నడిస్తే తమ నగ్నత్వానికి సిగ్గుపడి ఆ పాకలే సిమెంటుతో కట్టిన కొట్లవెనుక దాక్కున్నట్లుగా ఉన్నాయి. ఊరు మొత్తం నాలుగు వందల గడప మాత్రమే అయినప్పుడు సుబ్బారావు ప్రాథమిక పాఠశాలలో చేరాడు. ఊరు ఇప్పుడెంత పెరిగిపోయిందీ!

సుబ్బారావు చిన్నతనంలో ఊళ్లో ఉన్న డాబాల్ని లెక్కించాలంటే ఒక చేతివేళ్లు చాలు. పెంకుటిళ్లకైతే ఒక మనిషి కాలి, చేతి వేళ్లు సరిపోయేవి. అప్పుడు ఊళ్లో ఉన్న పూరి పాకలన్నీ రాజుచుట్టూ సైన్యంలాగా డాబాలవాళ్లకీ, పెంకుటిళ్లవాళ్లకీ రక్షణ నిస్తున్నట్లుండేవి. చుట్టుముట్టినట్టు ఉన్న సైన్యం గూర్చి రాజు లెప్పుడు భయపడ్డారో తెలీదు గానీ వాళ్ల ధైర్యాన్ని ఇనుమడింపచేసుకోవడాని కన్నట్టు ఊళ్లో డాబాలు ఎక్కువ చేసుకున్నారు. డాబాలు డాబాల్ని పెడితే, వంశాచారం ప్రకారం పాకలు పాకల్నే పెట్టాయి. అది పాక ప్రజలు గమనించారేమోనని, ఏడుస్తున్న పిల్లలకి చందమామని చూపించినట్లుగా, చదువుకుంటే వాళ్ల పిల్లలు కూడా పెరిగి, వృద్ధిలోకొచ్చి, డాబాలు కాకపోయినా కనీసం పెంకుటిళ్లయినా కట్టుకోవచ్చు నన్నారు. చదువుకీ, సంపదకీ ఉన్న లంకె ఏదో తెలియని పూరిపాకల సైన్యం మాత్రం వెనక్కి తగ్గీ, తగ్గీ, ఊరు ఎంత పెద్దదయిందీ అని ఆశ్చర్యపోతూ, రాజుల కింకా తమ సైన్యపు టవసరం ఉందనే నమ్ముతున్నారు. అప్పుడప్పుడు కాపాడడానికి ఎక్కువ రాజులు దొరికారని మురిసిపోతూ కూడా ఉన్నారు. అలా కాపాడడానికి తమ సైన్యాన్ని ఎక్కువ చేసుకుంటున్నారు కూడా! లంకెని కల్పించిన వాళ్లు మాత్రం చదువుతో సంబంధం లేకపోయినా, చదువును దూరంగా వుంచినా, రాజ్యాలు చేస్తున్నారు.

ఇవన్నీకాక ఆ రోజు ఉదయం సుబ్బారావుకు అర్థమైన దేమిటంటే, ఆ రాజులు వాళ్లలో వాళ్లు కక్షలని తీర్చుకోవడానికి ఈ సైన్యాన్ని ఉపయోగిస్తున్నారు. పైగా, జాతీయ రహదారి పక్కనే ఉండడం వల్ల నాలుగువేల గడప దాటిన ఊళ్లో ఇప్పుడు రాజులూ ఎక్కువయ్యారూ, వాళ్లకి సైన్యాల అవసరమూ ఎక్కువవుతున్నట్లూ ఉంది.

సుబ్బారావు నడుస్తూ ఆలోచిస్తూనే ఉన్నాడు.

సుబ్బారావు తండ్రి ఒకప్పుడు ఊళ్లో ఉన్న ఒకే ఒక్క ప్రాథమిక పాఠశాలకి ప్రధానోపాధ్యాయుడు. సుబ్బారావు బళ్లో చేరేటప్పటికి ఆ బడిలో ప్రతీ తరగతికీ రెండు సెక్షన్లుండేవి. సుబ్బారావు ఏ సెక్షన్‌లో ఉండి చదవడం ఎవరి పక్షపాతం వల్లా కాకపోవచ్చు. 'ఏ' లో కాకపోతే 'ఏదో' సెక్షన్‌లో ఉండేవాడు. అతనే గనుక ఆ రెండో సెక్షన్లో ఉండుంటే సలీం మీద అతనికి అయిష్టత కలిగి ఉండేదా అంటే చెప్పడం కష్టమే. సలీం ఉన్నాడని ఆ రెండో సెక్షన్‌కి 'ఏదో' సెక్షన్ అని పేరు పెట్టింది సుబ్బారావే.

నర్సయ్య 'ఏ' సెక్షన్‌లోనే ఉండేవాడు. అయితే, సలీం లాగా కాకుండా ఎక్కువ మాట్లాడేవాడు కాదు. అతను పుట్టకతోనే వాళ్ల నాన్న కండలు తెచ్చుకున్నవాడిలా ఉండేవాడు. కండల ధైర్యంతోనే కావచ్చు– ఒకసారి పిచ్చికుక్క బారి నుండీ సుబ్బారావును రక్షించాడు. అప్పట్నించీ సుబ్బారావుకు నర్సయ్య స్నేహితుడయ్యాడు. నర్సయ్య తండ్రి రిక్షా లాగడం గానీ వాళ్లు కనుమనాడు మేకపోతు మాంసం తినడం గానీ నర్సయ్య తెచ్చిన చెక్కల్ని తినడానికి సుబ్బారావుకి అడ్డం రాలేదు. పైగా నర్సయ్య తన సెక్షన్‌లో ఉండడం

వల్ల సలీం దూకుడికి సమాధానం చెప్పగల సత్తా ఉన్నవాడు తనకు స్నేహితుడైనందుకు సుబ్బారావు గర్వించాడు. డంబాలు కొడుతూ తనలాంటి వాళ్లను భయపెట్టే సలీంకి బుద్ధి చెప్పగలిగేవాడు బడి మొత్తంలో నర్సయ్య ఒక్కడే అని సుబ్బారావుకు గట్టి అభిప్రాయం ఏర్పడింది. వాడికి బుద్ధి చెప్పకుండా ఐదో తరగతి తను పూర్తిచేస్తాడేమోనన్న భయం కూడా పట్టుకుంది.

ప్రయత్నపూర్వకంగా ఆ భయం పోగొడదామని సలీం అనుకుని ఉండకపోవచ్చు గానీ, వాళ్లు అయిదో తరగతిలో ఉన్నప్పుడు ఒకరోజు ప్రొద్దున ఇంటర్వెల్‌లో ఓ కర్ర చూపించి సుబ్బారావునీ, నర్సయ్యనీ కూడా బెదిరించాడు. సలీంకి బుద్ధి చెప్పమని సుబ్బారావు ఎన్నిసార్లు చెప్పినా విననట్లుండే నర్సయ్యకూ్కడా ఆ రోజు తిక్కరేగినట్లుంది. నాలుగిళ్లవతల ఉన్న తన ఇంటికెళ్లి సైకిల్ చెయిన్ పట్టుకొచ్చాడు. కర్రతో సాము చేస్తున్న సలీం ఆధ్వర్యంలో 'ఏదో' సెక్షన్, చెయిన్‌ని వీరోచితంగా గిరగిరా తిప్పుతూ నర్సయ్య ఆధ్వర్యంలో 'ఏ' సెక్షన్ బడి ముందర రోడ్డున పడ్డాయి. చెయిన్‌ని చూడగానే వాళ్ల నాన్న పలుపుతాడుతో కొట్టిన దెబ్బలు గుర్తుకొచ్చీ కావచ్చు, 'ఏ' సెక్షన్ తిరగ బడిందన్న ఆశ్చర్యంతోనూ కావచ్చు – సలీం వెనుకడుగు వేస్తూ తన సైన్యాన్ని సందు చివర దాకా తీసుకువెళ్లాడు. గెలిచినందుకు నర్సయ్య చంకలు కొట్టుకోలేదు కానీ, దెబ్బ వేటుకు అందని దూరంలో వెనగ్గా నిల్చుని ప్రోత్సహించిన సుబ్బారావు మాత్రం గర్వంగా ఫీలయ్యాడు. బడికి తిరిగి వచ్చిన తరువాత ప్రధానోపాధ్యాయుడి చేతిలో కేన్ బెత్తంతో ఓ దెబ్బ తిన్న తరువాత కూడా ఆ గర్వం అతన్ని వీడలేదు. సలీంని కానీ నర్సయ్యని కానీ కొట్టకుండా కొడుకనైనా చూడకుండా అసలు యుద్ధం కూడా చెయ్యని తన నెందుకు కొట్టారని అడగాలని కూడా అతనికి అనిపించలేదు.

హైస్కూల్లో చేరిన సుబ్బారావుకు నర్సయ్య అక్కడ కనిపించలేదు. అక్కడ కొత్త స్నేహితుల మధ్యలో నర్సయ్యను గుర్తుంచుకోవడానికీ, అలగా జనంతో తిరిగి పాడైపోతున్నాడని బాధపడడానికి అతని తండ్రికి అవకాశాన్నివ్వడానికీ సుబ్బారావుకి తీరికా లేదు.

సుబ్బారావుకి జీవితంలో మరచిపోలేని సంఘటన అతనికి పదమూడేళ్లప్పుడు జరిగింది. బస్‌స్టాండ్‌కి వెళ్లడానికి తల్లి పిలవమంటే ఇంటి బయటికి వెళ్లి దూరంగా కనిపించిన రిక్షాని పిలిచాడు. అది దగ్గరవుతున్న కొద్దీ అక్కణ్ణించి పారిపోవాలన్న కోరికని ఆశ్చర్యంతో నోటిని తెరిచిన అతని మెదడు కాళ్లకి చేరవెయ్యక పోవడం వల్ల అక్కడే భూమిలో దిగేసినట్లు ఉండిపోయాడు.

"నర్సయ్యా! ఏమిటి నువ్విలా?" – రిక్షా దగ్గరకు వచ్చిన తరువాత గొంతు పెగల్చుకుని అడిగాడు.

“మా అయ్యకు ఒంట్లో బావుండట్లేదు. రిక్షా లాగలేకపోతున్నాడు. రెక్కాడకపోతే తిండెట్టా? ఇంతకీ ఎక్కడికి తీసుకువెళ్లమంటావ్ చెప్పు.”

స్నేహితుడి రిక్షా ఎక్కకుండా ఉంటే, అతని మనుగడకి అడ్డం కొట్టినట్టేనని స్పష్టంగానే తెలుస్తోంది. ఎక్కితే, తన కుటుంబాన్ని బస్‌స్టాండ్‌కు చేర్చడానికి అతను పడే శ్రమకి కారకుడై, ప్రత్యక్షంగా ఆ శ్రమని చూడాలి. సుబ్బారావు అశక్తతని ఎదిరించడానికి వీల్లేకుండా నర్సయ్య చెయిన్‌ని రిక్షా చక్రాలకి కట్టిపడేశాడు.

అప్పట్నించీ సుబ్బారావు నర్సయ్యకి ఎదురు పడడం క్రమంగా తగ్గిపోయింది. టీచర్ ట్రైనింగ్ తీసుకోవడానికి జిల్లా కేంద్రానికి వెళ్లిన తరువాత సెలవులకి ఇంటి కొచ్చినప్పుడు ఎప్పుడూ నర్సయ్యని వెతుక్కుంటూ వెళ్లలేదు. ఊరు పెరగడం కూడా సుబ్బారావుకు నర్సయ్య ఎదురుపడకుండా ఉండడానికి సహకరించింది.

పుట్టి పెరిగిన ఊళ్లోనే, అతను చదువుకున్న ప్రాథమిక పాఠశాలలోనే ఉద్యోగం దొరకడానికి సుబ్బారావుకు అందినచోట కాళ్లు పట్టుకోకా, తన్నినచోట ముడుపులు చెల్లించు కోకా తప్పలేదు. బతకలేక బడిపంతులు అన్న నానుడిని నిజం చెయ్యడానికి అధ్యాపక వృత్తిని చేపట్టకపోయినా, బతకడానికి అవసరమని ప్రైవేటుగా ట్యూషన్లు చెప్పడం అలవాటు చేసుకున్నాడు.

ఉపాధ్యాయుడిగా చేరిన తరువాత సుబ్బారావుకు నర్సయ్య అప్పుడప్పుడూ కనిపిస్తూనే ఉన్నా అతన్ని కలిసింది మాత్రం నర్సయ్య కొడుకును బళ్లో చేర్చడానికి వచ్చినప్పుడు. అప్పటికి నర్సయ్య ఆటోరిక్షాకు ఎదిగాడు. నర్సయ్య కొడుకు కూడా అయిదవ తరగతితో చదువుకు స్వస్తి చెప్పాడు. ఆపైన కొన్నేళ్లకు నర్సయ్య ఓ కామందుకు డ్రైవరయ్యాడు. మనవడు రాజిగాణ్ణి కూడా అదే స్కూల్లో చేర్చడానికి వచ్చేసరికి స్థానికంగా చీమల స్థాయిలో ఉన్న రాజకీయనాయకులను చిన్నతనంలోనే పాములాగా తరిమికొట్టిన ఆ కామందు కొడుక్కు కుడిభుజ మయ్యాడు. రాజిగాణ్ణి బడి దగ్గర కార్లోంచి దింపినందుకు నర్సయ్య ఎంత గర్వంగా ఫీలయ్యాడో!

అదేమిటో గానీ, ఆ ఊళ్లో చాలాచోట్ల పూరిపాకల స్థానంలో డాబాలు వచ్చినా ఆ ప్రాథమిక బడి మాత్రం ఆ రెండింటికీ సరిహద్దురేఖలా మిగిలిపోయింది. లేకపోతే మూడు తరాల వారికి ఒకే బళ్లో చదువుకునే అవకాశం అంత తేలిగ్గా వస్తుందా– పట్టించుకునే నాథుడు లేక బడి శిథిలమైపోతూన్నాగానీ?

ఇంట్లోకి అడుగుపెట్టే ముందే మొదటిసారిగా తన ఇంటి శిథిలావస్థను గమనించి సుబ్బారావు ఆశ్చర్యపోయాడు. అవును మరి. తాతలు కట్టించిన పెంకుటిల్లు. ఉద్యోగంలో ఎదుగూ బొదుగూ లేక, కొడుకుని చదివించడం కోసం, కూతురికి పెళ్లి చేయడం కోసం ఇంటిని అశ్రద్ధ చెయ్యక తప్పలేదు.

"తెల్లవారుఝామకల్లా ఇంటికి చేరాల్సిన వాళ్లు! తొమ్మిదవుతోంది. ఇప్పుడా రావడం? అమ్మాయి పెళ్లి సంబంధం ఏమైంది?" – సుబ్బారావు చెప్పులు కూడా విప్పకుండానే భార్య ప్రశ్నల వర్షం కురిపించింది.

* * *

మూడు రోజులపాటు ఊళ్లో జరిగిన విధ్వంసాలు, యుద్ధాలు చేసేవాళ్లు అలసిపోవడం వల్లనో, అస్త్రసన్యాసం చెయ్యడం వల్లనో, లేక అదుపులోకి తేవడానికి రెండు పార్టీలు పోలీసులకు పర్మిష న్నివ్వడం వల్లనో మొత్తానికి ఆగిపోయాయి.

అన్ని కథల్లోలాగానే ఈ కథ కూడా కంచికి వెడుతుందని అందరూ అనుకున్నారు. అయితే కంచి స్వాములవార్ని జైల్లో పెడితే కథ ఏమవుతుందనే ప్రశ్న ఎవరికీ స్ఫురించలేదు.

బస్సులు తగులబెట్టడాలూ, ఆ తరువాత తగులబెట్టిన వాళ్లు ఉద్యోగానికి వెళ్లి వచ్చినట్టుగా జైలుకెళ్లి మామూలుగా తిరిగివచ్చి నడిరోడ్డులో తిరగడాలూ చూడడం అలవాటు పడిన ప్రజల్ని ఆ రోజు ప్రభుత్వం చేసిన ప్రకటన ఆశ్చర్యచకితుల్ని చేసింది. బస్సులు తగులబెట్టడాల్ని, ప్రభుత్వపు, ప్రజా ఆస్తుల్ని విధ్వంసం చెయ్యడాన్నీ వీడియోలు తీసి, వాటిని టీవీలో చూపడం వల్ల వాటికి కారకులైన వాళ్లని పట్టుకుని ఆ సాక్ష్యాధారాల నుపయోగించి తీవ్రంగా శిక్షిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. వీడియోలు తీస్తున్నట్లు కనిపించగానే బస్సులు తగులపెడతున్నవాళ్లు కెమెరాల ముందు కెళ్లల్లా డాన్సు చెయ్యడం సుబ్బారావుకు గుర్తొచ్చింది.

నర్సయ్యను, అతని కొడుకును జైల్లో వేశారన్న సంగతి సుబ్బారావుకు బళ్లు మళ్లీ తెరిచిన రెండు రోజులకు తెలిసింది– బడి బయట రాజిగాడు డేవిడ్‌ని కిందపడేసి కొడుతుంటే వాళ్లిద్దర్నీ విడదీయాల్సి వచ్చిన తరువాత.

రాజిగాణ్ణి చెయ్యి చాచమన్చెప్పి కేన్ బెత్తంతో వాణ్ణి ఒక దెబ్బవేసిన తరువాత సుబ్బారావు అరిచినట్లుగా అడిగాడు – "ఎందుకురా, నువ్వు కూడా మీ నాన్న, తాతల్లాగానే తయారవుతున్నావ్?" అని. కానీ, వాణ్ణి అడిగిన ప్రశ్న, "ఎందుకురా వాణ్ణలా కొడుతున్నావ్?" అని పక్కపిల్లాడు, "ఆడి అయ్యనీ, తాతనీ డేవిడ్‌గాడు కూనీ కోర్లన్నాడండీ" అని జవాబిచ్చిన తరువాత గానీ సుబ్బారావుకి తెలియలేదు.

సుబ్బారావుని నిస్సత్తువ ఆవహించింది. అతని కళ్ల ముందరే రెండు తరాలు మట్టిలో కలిసిపోతున్నాయ్ – వాటినే అనుకరిస్తూ మూడోతరం? రాజీగాడు చేసిన తప్పుపనల్లా నర్సయ్యకి మనవడిగా పుట్టడమేనా? అతని అశక్తత కళ్ల నీళ్ల రూపంలో పిల్లల ముందు బయటపడుతుందేమోనని వాళ్లందర్నీ క్లాసుల్లోకి పొమ్మన్నాడు.

నర్సయ్యా, అతని కొడుకూ వృత్తిరీత్యా మాంసాన్ని కోసిన ధర్మవ్యాధుణ్ణి అనుకరిస్తూ స్వర్గానికి వెడతారేమో తెలియదుగానీ, ముందు మాత్రం జైలుకు వెడుతున్నారు.

నర్సయ్య అకృత్యాలు బస్సుల్ని తగులబెట్టడాన్ని మించవని సుబ్బారావుకు నమ్మకంగా ఉంది. నర్సయ్య కొడుకు తండ్రిని మించిన తనయుడేమో సుబ్బారావుకి తెలియదు.

వాళ్లిద్దరూ కనీసం హైస్కూలు చదువు పూర్తిచేసి వుంటే పరిపక్వత చెంది, సంఘం గర్వపడే టంతటి ఆణిముత్యాలు అయి ఉండేవారు కారేమో గానీ, సంఘ విధ్వంసక కార్యాలు చేపట్టకుండా ఉండేవాళ్లని మాత్రం సుబ్బారావుకు నమ్మకముంది. అది, చదువు సంస్కారాన్ని నేర్పుతుందని సుబ్బారావు భ్రమపడడంవల్ల కాదు. చదువువల్ల ఏళ్ల తరబడి సంఘంలో ఏర్పరచుకున్న ఒక స్థానాన్ని పోగొట్టుకోవడం ఇష్టం లేకపోవడం ముఖ్య కారణమవడం అని అతను నమ్మడంవల్ల.

అయిదవ తరగతి దాకా చెప్పే చదువులో "అసత్యము లాడరాదు", "జీవహింస మహాపాపము" అని బోధిస్తూనే ఉన్నారు కదా! రాముడి గూర్చీ, బుద్ధుడి గూర్చీ, ఏసుక్రీస్తు గూర్చీ చెబుతూనే ఉన్నారు. అవి తలకెందు కెక్కట్లేదు? కోపం వచ్చినా ఇంట్లో వస్తువుల్ని పగులగొట్టడం, ఉంటున్న ఇంటిని తగులబెట్టడం వంటి విధ్వంసక పనులని చెయ్యనివాళ్లు కూడా బస్సుల్ని తగులబెట్టడానికి ముందంజ వేయడానికి కారణం, అలా చేసినా డబ్బు అడ్డం పడడంవల్ల శిక్షలు పడకపోవడం వల్లనా? ఇవ్వాళ వీడియోలు సాక్ష్యాధారాలుగా ఉండడంవల్ల శిక్ష పడితే, వచ్చేసారి కెమెరామెన్‌లని చావగొట్టి, కెమెరాలని పగులగొట్టీ ఆ పైన తమ పనులు కానిస్తారు.

ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలకు చెప్పాల్సింది ప్రభుత్వం నిర్దేశించిన చదువునా లేక సంఘం ఎలా పనిచేస్తుందన్న విషయాన్ని కూడా విద్యార్థులకు తెలియజెప్పాల్సిన అవసరం ఉపాధ్యాయులకు ఉన్నదా? దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు అరవయ్యేళ్లు కావస్తున్నా సంఘానికి అవసరమైనట్లుగా పాఠ్యాంశాలని నిర్దేశించడంలో, పిల్లలని బాధ్యతాయుతులైన పౌరులుగా తీర్చిదిద్దడానికి కావల్సిన వనరుల్ని సమకూర్చడంలో ప్రభుత్వం విఫలమైందనే చెప్పాలి. గాంధీగారినీ, నెహ్రూగారినీ, సరోజినీ నాయుడిగారినీ ప్రతి బడిలోనూ ఫోటో ఫ్రేముల్లో బంధించకపోతే గొప్ప గొప్ప తెలుగువాళ్లకి శిలావిగ్రహాల్ని చెక్కించి వాటిని చెరువుల పక్కన నాటకపోతే, వాళ్లిచ్చిన ఉత్తేజపరిచే ఉపన్యాసాల్ని ఎక్కడో భద్రంగా గదుల్లో పెట్టి తాళాలు వెయ్యకపోతే, వాళ్ల ఆలోచనా తరంగాల్ని పాఠ్యాంశాలుగా ప్రభుత్వం నిర్దేశించి పిల్లల చేత వాటి గూర్చిన చర్చలను జరిపించవచ్చుగా? పిల్లలను ఆలోచింప జెయ్యచ్చుగా? ప్రభుత్వం విఫలత సమాజ విఫలతగా పరిణమించకుండా ఆపేదెట్లా? మామూలుగా అయితే సంఘంలో కనిపించే విధ్వంసకరమైన ఆకర్షణల నుంచీ పిల్లల దృష్టిని మరల్చడానికి తల్లిదండ్రులకు ఉపాధ్యాయుల సహకారం కావాలి. కానీ, వీళ్ల తల్లిదండ్రుల్లో చాలామందికి వీళ్లకి సంఘం గూర్చి చెప్పాలి అనిపించదు, చెప్పగల సామర్థ్యమూ ఉండదు. పెద్దవాళ్లకా నేర్పు లేనప్పుడు, పైగా తండ్రులు కనపడకపోయి నప్పుడు, లేక

తండ్రులే హిరణ్యకశిపు లైనప్పుడు, జీవనభృతికైనా సరే, విధ్వంసకర మార్గాన్ని అనుసరించ కుండా ఉండేలా పిల్లలని తీర్చిదిద్దాల్సిన ప్రత్యేక బాధ్యత ఉపాధ్యాయుల కున్నదా?

అయిదవ తరగతిలో నేలమీద కూర్చున్న పిల్లలను, వాళ్ల వెనుక ఉన్న గోడ మీద తగిలించి ఉన్న ఫోటోలోని గాంధీగారి బొమ్మనూ మార్చి మార్చి చూస్తూ సుబ్బారావు ఆలోచిస్తున్నాడు.

వీళ్లల్లో నాలుగోవంతు హైస్కూలుదాకా వెళ్లరు. ఇంకో నాలుగోవంతు హైస్కూలుదాటి వెళ్లరు. వీళ్లల్లో ఎవడో ఒకడు భవిష్యత్తులో డబ్బిచ్చి బస్సులు తగులబెట్టించేవాడు కావచ్చు, ఒకడు తగులబెట్టేవాడు కావచ్చు. వీళ్ల భవిష్యత్తుల మీదే సంఘం ఆధారపడి ఉంది! వీళ్లదే కాక, సంఘ భవిష్యత్తుని కూడా సరైన దారిలో తీర్చిదిద్దడం సాధ్యమేనా? ఐదవ తరగతి అవగానే చదువుకు స్వస్తి చెప్పే బడుగు జనాలకి, "ఒరేయ్, నాగుపాము దగ్గరకు దాని నెత్తిమీద మణికోసం వెళ్లకండిరా, నాశనమైపోతారు" అని చెప్పడం ఎలా?

"నువ్వు కావాలనే బడిపంతులువి అయ్యావు. ఈ పిల్లలని బాధ్యతాయుతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దగల సామర్థ్యం నీకుంది. నాకు తెలుసు" అన్నట్లు గాంధీగారు నవ్వుతున్నారు.

"రాజిగాడి తాత, నేను మీలాగే ఇదే బళ్లో పక్కపక్కన కూర్చుని చదువుకున్నాం, మీకు తెలుసునట్రా? నాకు అప్పుడప్పుడు వాళ్లమ్మ చేసిన చెక్కలు తెచ్చిస్తుండేవాడు కూడా"– ఆలోచన ఎటు దారితీస్తుందో తెలియకుండా హృదయం పలికిన పలుకులివి.

తలకాయ దించుకుని కూర్చున్న రాజిగాడు చివ్వున తలెత్తాడు. తండ్రీ, తాతా ఖూనీకోర్లు కాదని పంతులుగారు చెబుతారన్న ఆశాభావం వాడి కళ్లల్లో తళుకున్న మెరిసింది.

"రాజిగాడి తాత మీ అంత చదూకున్నాడా సార్?" – ఒక పిల్లవాడు ప్రశ్నించాడు నమ్మలేనట్టుగా. "లేదురా. వాళ్ల అయ్యకి ఒంట్లో బాగోలేకపోతే రిక్షా తొక్కి సంపాదిస్తానని చదువు మానేశాడు. నన్నొకసారి ఓ పిచ్చి కుక్క కరవబోతే కాపాడాడు కూడా. రాజిగాడి నాన్న కూడా పనిచెయ్యకపోతే ఇల్లు గడవదని చదువు మానేశాడు."

పిల్లలు శ్రద్ధగా కూర్చొని ఉత్కంఠ భరితమైన సినిమా కథ వింటున్నారు. రాజిగాడి కళ్లకి పంతులుగారు వెంటనే జైలు నుంచీ తండ్రినీ, తాతనీ విడిపించబోయే హీరోలాగా కనిపించారు.

"రాజిగాడి నాన్నని, తాతని పోలీసులు ఎందుకు పట్టుకెళ్లారో మీకేమైనా తెలుస్రా?"

"తెలీకపోట మేటండీ, ఆళ్లు బస్సులయ్యా తగలబెట్టినార్టండీ" – మూడు రోజుల టీవీ వార్తలు బాగానే వంటబట్టించుకున్న పిల్లాడు జవాబిచ్చాడు.

"ఈ గొడవలు బస్సులు తగులబెట్టడంతో ఆగిపోలేదు గదా?" రెట్టించాడు సుబ్బారావు – ఇంద్రధనస్సుకి చివర బంగారుగని ఉండే ఉంటుందన్న నమ్మకంతో.

"ఆళ్లా పన్చేసినారని అవతలోళ్లు ఈళ్ల కొట్లకీ, ఇళ్లకీ నిప్పెట్టినారండి."

ఒక చెంపని కొడితే ఇంకో చెంపని గాంధీగారు చూపిస్తే బ్రిటీష్ వారు సిగ్గుపడి వెళ్లిపోయారు. సిగ్గుపడడం ఆ బ్రిటీష్ వాడికి బుద్ధిలేకపోవడం వల్ల అని – ఇప్పుడేమిటి, గాంధీగారు పోయి పాతికేళ్లు కాకుండానే భారతీయులు నిరూపించారు.

"మా అయ్య పన్చేసే ఎల్డింగ్ షాపుని తగలబెట్టారండి" – సలీం తమ్ముడి కొడుకు.

"మీరు కూడా పెద్దయిన తరువాత ఇలాంటి గొడవలు చేస్తారర్రా?" – సుబ్బారావుకు వాళ్లేం సమాధానం చెప్తారో విందామని వుంది. గడ్డివాములో సూది కోసం వెదుకుతున్న అనుభూతి.

"చెయ్యమండీ."

"ఎందుకర్రా?"

"మా అయ్య ఎల్డింగ్ చెయ్యట్లేదు గదండీ, ఇప్పుడు రోజుకి ఓ పాలేనండీ మేం తిండం. అయ్య పన్చేసేప్పుడు రెండుపూట్లా తినేవోళ్లమండి."

అయిన నష్టం వల్లే కాక నడపడానికి బస్సు ల్లేకపోవడం వల్ల తగులబెట్టిన ఒక్కొక్క బస్సుకి ఎనిమిది ఉద్యోగాలు చొప్పున తొలగిస్తామని ఆ రోజు ప్రొద్దున్న ఆర్టీసీ చేసిన ప్రకటన సుబ్బారావు చెవిలో ఇంకా రింగుమంటోంది.

"బస్సుల్లేక మా అయ్య పట్నం నించీ రావడానికి మూడు రోజులు పట్టిందండి."

"పోలీసులు జెయిల్లో వేస్తారు కదండీ?" – డేవిడ్ జవాబిచ్చాడు. మళ్లీ ఒక్క క్షణం ఆగి, "రాజిగాడు చేస్తాడేమోనండీ!" అన్నాడు.

రాజిగాడు చివ్వున తలెత్తి చురుగ్గా చూసిన చూపుకి డేవిడ్ తనపని అయి పోయిందేమోనని భయపడ్డాడు.

"మీకు ఎవరైనా డబ్బులిచ్చి ఇంకొకణ్ణి చంపమని చెప్తారనుకోండి, ఆ పని చేస్తారా?" – ఆ సూది దగ్గర్లోనే ఉన్న అనుభూతి.

"ఇంకొకళ్లని చంపడం తప్పు కదండీ!"

గడ్డివాములో సూది దొరికినట్లనిపించింది సుబ్బారావుకి.

"మీరు నాకో ప్రమాణం చేస్తారర్రా?" ఆశతో అడిగాడు.

"తప్పకుండా సార్" – పిల్లలు ఏకకంఠంతో జవాబిచ్చారు – బొటన వేలుని సుబ్బారావు గురుదక్షిణగా అడుగుతాడేమోనన్న సందేహ మేమీ లేకుండా.

"ప్రమాణం అంటే ఏమిటో తెలుసా? ఎన్ని ఆటంకాలు ఎదురైనా సరే చెప్పిన మాటమీద నిలబడ్డ మన్నమాట – హరిశ్చంద్రుడిలాగా. నేను చెప్పినట్టు చెప్పండి. మేము బస్సుల్ని తగులబెట్టము."

"మేము బస్సుల్ని తగులమెట్టము!" – పిల్లలు మొదట ఆశ్చర్యపోయినా, ముక్త కంఠంతో అన్నారు.

"షాపుల్ని కూడా పగలగొట్టం సార్!" – ఒక కుర్రాడు ప్రతిపాదించగానే మిగిలిన వాళ్లంతా గొంతు కలిపేసరికి ఆశ్చర్యపోవడం సుబ్బారావు వంతయ్యింది.

"డబ్బులిచ్చినా సరే మేం ఎవర్నీ చంపం సార్!"

మనస్తత్వశాస్త్రజ్ఞుడు కాకపోయినా, సమాజంలో ఉన్న రుగ్మతలన్నిటికీ సమాధానాలు చూపించ గలడన్న నమ్మకం లేకపోయినా, సుబ్బారావు మేష్టారికి సమాజం భవిష్యత్తు మీద ఆశ కలుగుతోంది. ఎందుకంటే –

నేటి బాలలే...

('రచన' మాసపత్రిక, ఆగస్టు 2006)

# ఉపోద్ఘాతం

శివయ్య ఎన్నికలలో నిలబడ్డ రోజుని తెలుగు ప్రజల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజని కొందరంటే, మీడియా కాకిలా అరుస్తోందని అన్నవారు లేకపోలేదు. శివయ్యని మహాత్మాగాంధీతో పోల్చి సత్యసంధుడన్న వారు కొందరయితే, అతనికి బకాసురుడనే నామధేయాన్నిచ్చింది వేరెవరో కాదు – అప్పటికి ఎన్నికైన ప్రజాప్రతినిధులు.

శివయ్యని ముందు దూదిపింజకింద తీసేసిన మీడియా అతనికి ఇంటర్వ్యూలని ప్రసాదించడంతో అతని పేరు ప్రజల నోళ్లల్లో పడడానికి ఎక్కువ సమయం పట్టలేదు. అతనిపట్ల యాంకర్లు ప్రదర్శించిన వ్యంగ్యధోరణి అతణ్ణి ప్రజలకి దగ్గరగా చేర్చిందనే చెప్పుకోవచ్చు. ఏ ఇంటర్వ్యూలోనయినా గానీ అతణ్ణి అడిగిన మొదటిప్రశ్న – ఒకటి, రెండు పదాల తేడాతో మాత్రమే – "నన్ను గెలిపించండి, నేను ఇన్నివేల కోట్ల రూపాయలని వెనకేసుకుంటాను, అని చెప్పడానికి సిగ్గులేదూ?" అని.

అతను ఇచ్చిన సమాధానం కూడా, కొన్ని పదాల తేడాతో: "ఇప్పటిదాకా ఎన్నుకోబడ్డ వాళ్లెవరినీ ఎంత వెనకేసుకున్నారని మీరడగలేదు, వాళ్లు చెప్పలేదు. ఎన్నికయిన తరువాత వెనకేసుకున్నారంటూ వాళ్ల స్థిర, చరాస్తుల వివరాలని ఋజువులతో మీరు ప్రచురించినా వాళ్లకి చీమకుట్టినట్టుగా కూడా లేదు. వాళ్లు గనులని కొల్లగొట్టినా, చందనపు అడవులని స్వాహా చేసినా భారతదేశానికి స్వతంత్రం వచ్చిన తరువాత అలాంటి ఉద్దండులని విజయవంతంగా న్యాయస్థానంలో విచారణ జరిపి వాళ్లని శిక్షించిన దాఖలాలేం లేవు. ఒకానొక కాలంలో రాజకీయ నాయకులు లంచాలు తింటూ పట్టు పడ్డారని ఆడియో రికార్డింగ్ వినిపించగానే పార్టీల అధిష్ఠానాలు వాళ్లను పదవుల్లోంచి తొలగించేవి. ఈనాడు వీడియోలు చూపించినా కూడా అణువంతయినా సిగ్గులేకుండా ఆ వీడియోలు తీసినవాళ్ల ఎజెండా ఏమిటోనన్న ప్రశ్నని లేవదీసి, ఇన్వెస్టిగేషన్ అంటూ ప్రభుత్వపు సంస్థల నన్నింటినీ వాళ్లమీదకి ఉసిగొల్పి, వాళ్లని కోర్టులచుట్టూ తిప్పించడమే

కాక, వాళ్ల ఇళ్లమీద దుండగులచేత దాడులు చేయించినా, మీ మీడియావాళ్లే కాక ప్రజలు కూడా 'కాలంతీరు' అంటూ ఎవరిపనులు వాళ్లు చేసుకుంటున్నారు. రెండు మూడు రోజుల తరువాత మీ మీడియావాళ్లకి మరో హాట్ టాపిక్ దొరుకుతుంది– అది రాజకీయాల గూర్చే కానక్కర్లేదు, సినిమాతారల పెళ్లి గూర్చో లేక విడాకుల గూర్చో కూడా కావచ్చు. అందుకే, సిగ్గు ఉండకూడనిచోట అది దారికి అడ్డం రాకూడదని తెలుసుకున్నాను."

మీడియాలో చర్చ మొదటగా శివయ్య మీదే జరిగింది. అతడు ఎక్కణ్ణించీ వచ్చాడనీ, అతని వెనక రాజకీయ హస్తాలు హస్తినలోగానీ బస్తీలోనే గానీ ఉన్నాయేమోనని ఆరాలు తీశారు. అతని పూర్తిపేరు సాంబశివరావనీ, అతను 1947 ఆగష్టు 15న పుట్టాడనీ, డాక్టరుగా అమెరికా వెళ్లిన తరువాత గొప్ప మందుని కనిపెట్టడంతో బోల్డంత డబ్బు చేసుకుని ముప్ఫయ్యేళ్లు నిండకుండానే మిలియనీ రయ్యాడనీ, ఆ తరువాత ఇన్వెస్ట్‌మెంట్ బాంకర్ అయి, వై2కె సమయంలో కొత్తగా మొదలవుతున్న టెక్నాలజీ కంపెనీలల్లో ఇన్వెస్ట్‌చేసి బిలియనీర్ అయ్యాడనీ, అయితే, అప్పటిదాకా మీడియాకి దూరంగా ఉండడం వల్ల అతనిగూర్చి అంత పెద్దగా ఎవరికీ తెలియలేదనీ తెలిసింది. వాళ్లకి అంతుబట్టని విషయమల్లా, అప్పటిదాకా రాజకీయాల్లో వేలుపెట్టినట్లు ఎక్కడా దాఖలాల్లేని మనిషి ఇంత హఠాత్తుగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి పదవికి పోటీ ఎందుకు చేస్తున్నాడన్నది.

శివయ్యకి ఒక పార్టీని తయారుచెయ్యడానికి పెద్దగా శ్రమపడవలసిన అవసరం లేకపోయింది. అతన్ని ఎలా కాంటాక్ట్ చెయ్యాలో మీడియాద్వారా తెలుసుకుని అతనికి డబ్బులు ఎదురిచ్చి అతని పార్టీలో చేరిపోయారు.

"ఇంతమంది మీ పార్టీవైపుకు రావడానికి కారణం, మీరు వాళ్లకి ఎంత కొల్లగొట్టుకోవచ్చో చెప్పి ఉంటారు. కాదా?" నిలదీశాడో యాంకరుడు.

"తాటిచెట్టు నెందుకు ఎక్కావంటే కల్లుతాగడానికి అని చెప్పడానికి నేనేమీ భయపడను," అన్నాడు శివయ్య. నోట మాటరాని ఆ యాంకరుడు బ్రేకు తీసుకుని మళ్లీ వచ్చిన తరువాత, "ఎంత డబ్బు వెనకేసుకుందా మనుకుంటున్నారో చెప్పడంలో నిజాయితీ ఉందిగానీ ఆ డబ్బు తీసుకోవడంలోనే నీతిలేదు!" అన్నాడు.

"చట్టాలు చేసినది నీతిని నిలబెట్టడానికే అయితే ఈనాడు ఇంతగా అవినీతి సంఘంలో నాటుకొనిపోయేదే గాదు. ఈనాటి ప్రజాప్రతినిధులని అడగడానికి భయపడే ప్రశ్నలని నాకు సంధించడంలోనే మీకు నీతి ఏ మాత్రం ఉన్నదో తెలుస్తూనే ఉన్నది గదా!" అన్నాడు శివయ్య. మళ్లీ "బ్రేక్," అన్నాడు యాంకరుడు.

శివయ్య పార్టీ అభ్యర్థులు ప్రతి నియోజకవర్గంలోనూ తమతమ టార్గెట్లు ఎన్ని కోట్లో నిర్భయంగా చెప్పారు. అంతేకాక వాళ్ల ప్రత్యర్థులకి సవాళ్లు విసిరారుకూడా– వాళ్లు ఎన్ని పదుల, వందల, లేక వేల కోట్ల పరిమితులకి కట్టుబడి ఉంటారో చెప్పమని, అదే తామయితే అణాపైసలతో సహా లెక్కచెబుతామనీను.

శివయ్య పార్టీ కొత్తది కాబట్టి అప్పటికే దశాబ్దాల చరిత్ర ఉన్న రాజకీయ పార్టీలన్నీ కుమ్మక్కై ఆ సవాళ్లకి జవాబులు చెప్పకూడదని నిర్ణయించుకున్నాయి. వాళ్ల నిర్ణయాలకి కారణం, అలాంటి సవాళ్లు విసిరింది తామెంత అవినీతిపరులో నిర్ధారించడానికి శివయ్య వేసిన ఎత్తుకావచ్చునీ, సవాళ్లని తాము స్వీకరించగానే శివయ్య తన పనయిందని పెద్దగా నవ్వేసి ఈలవేసి గోలచేస్తాడేమోననీను. అలాగని ఎన్నికలలో గెలవడానికి వాళ్లు తమ ప్రయత్నాలనేమీ ఆపలేదు. హాజ్ కోసం ఉచితంగా మక్కాకి టిక్కెట్లిప్పిస్తామని ఒక పార్టీ అంటే, కేదార్‌నాథ్, బదరీనాథ్ యాత్రలకి టిక్కెట్లిప్పిస్తామని మరొకపార్టీ, జెరూసలానికి పంపిస్తామని వేరొక పార్టీ, నాస్తికులకి అంతరిక్షయాత్రలకి టిక్కెట్లిప్పిస్తామని ఇంకొకపార్టీ వాగ్దానాలు చేశాయి.

"గెలిస్తే మీరేం చేద్దామనుకుంటున్నారు?" అనడిగిందో యాంకరి.

"ప్రజలకోసం– అని మీరడగలేదు. నేను ఇప్పుడు ఏమయినా చెప్పినా, 'మీరు మీ వాగ్దానానికి కట్టుబడి ఉంటారని మేమెందుకు నమ్మాలి?' అని ఎదురు ప్రశ్నవేస్తారు. అందుకని, వాళ్లు చేసేదానికీ, నేను చేసేదానికీ పెద్ద తేడా ఉండదనుకోండి. కాకపోతే, నేను చవగ్గా చేసిపెడతానంతే!" అన్నాడు శివయ్య.

"సవారీకోసం పోటీపడే భోగందాన్లా మాట్లాడుతున్నారు," అన్నదా యాంకరి నిరసనగా.

"పాపం రాజకీయాలతో పోల్చి పొట్టకూటికోసం భోగంవాళ్లు పడే తిప్పలని ఎందుకు తల్లీ కించపరుస్తావు?" తిరిగి ప్రశ్నించాడు శివయ్య.

"వాళ్లు రకరకాల వాగ్దానాలు చేస్తున్నారు కదా! ఉదాహరణకి మక్కాకీ, జెరూసలంకీ, అంతరిక్ష యాత్రలకీ టిక్కెట్లిప్పిస్తా మంటున్నారు!!" అన్నదా యాంకరి మాటమారుస్తూ.

"అవి జరిగేవి కాదని మీకు తెలుసు. అయినా మీరు వాళ్లని ప్రశ్నించరు. ఎన్నికల్లో వాగ్దానాలు నీటి మూటలవంటివని ఈ మధ్య జరిగిన ఏ ఎన్నికలు చూసినా తెలుస్తుంది."

"అవేకాక, పరిశ్రమలు స్థాపిస్తామనీ, కాలువలు తవ్విస్తామనీ, డాముల్ని కట్టిస్తామనీ, వేతనాలు సవరిస్తామనీ, ప్రతి కుటుంబానికి జీవనోపాధిని చూపిస్తామనీ–"

"మీరు చెప్పినవాటిల్లో మొదటి మూడింటికీ కొంత ప్రయత్నం జరుగుతుంది. ఎన్నికల్లో మా పార్టీ గెలిచినా, గెలవకపోయినా గాలి వీస్తూనే ఉంటుంది. నీరు పారుతూనే ఉంటుంది. అయితే గాలీ, నీరూ లాగా కాక, వాటివల్ల లాభాలు సామాన్య ప్రజలకంటే ఆ పరిశ్రమల కాంట్రాక్టుల లబ్ధిదార్లకే ఎక్కువ అన్న విషయం నా కంటే మీకు ఎక్కువ తెలుసు. వేతనాల సవరణ ముసలెద్దు నడకలాగా మెల్లగా అప్పుడప్పుడూ జరుగుతూంటుంది. ప్రతీ కుటుంబానికీ జీవనోపాధిని చూపించడమనేది ఇప్పటిదాకా జరగలేదు, ఇకముందు జరుగుతుందనడానికి దాఖాలాలూ లేవు," అన్నాడు శివయ్య.

శివయ్య పార్టీతో పోటీపడుతున్న వాళ్లు శివయ్యగూర్చి మాట్లాడకూడదని ఎంత పట్టుదలతో ఉన్నా మీడియా వాళ్లని వేధించి, వాళ్ల దగ్గరినుంచీ జవాబులని రాబట్టేదాకా వదల్లేదు.

"అమెరికా దుష్ప్రభావం ఆ శివయ్య మీద ఎంత ఉన్నదో తెలియట్లేదా? మన భారతదేశం ఎంత గొప్పది? నీతీ, నిజాయితీ, సత్యం, ధర్మం అన్నింటికీ మనదేశం పుట్టినిల్లు అని గుండెలు చరుచుకుంటూ గొప్పలు చెప్పుకోవాల్సిందిపోయి – మన పరుచూరి బ్రదర్స్ రాసినట్లు, 'పొగడరా నీ తల్లి భూమిభారతినీ' అని అనవలసిందిపోయి, 'నేను అవినీతిపరుణ్ణి' అంటూ రొమ్ములు గుద్దుకునే పాశ్చాత్యుని గూర్చి అడిగే ప్రశ్నలకి జవాబు చెప్పాల్సి రావడం ఈనాడు తెలుగు ప్రజలు చేసుకున్న ఖర్మవల్ల కాక మరెందువల్లో నాకు ఏమాత్రం తట్టడం లేదు," అన్నారు వాళ్లు.

"గెలిచిన తరువాత వాళ్లు ఒక్కొక్కళ్లూ ఎంత వెనకేసుకుంటున్నారో లెక్కచూపిస్తామని చెబుతున్నారు గదా, వాళ్ల వెబ్‌సైట్స్‌లో పెడతామంటున్నారు గదా, అది ఈనాడు జరుగుతున్న దానికంటే నయంకాదా?" అని అడిగాడు వెన్నుపూస వున్న ఓ యాంకరుడు.

"అంటే, నేను ప్రజలడబ్బుని చెప్పకుండా వెనకేసుకుంటున్నాననేగా దానర్థం?" అని ఆ నాయకుడు రెచ్చిపోయేసరికి యాంకరుడి వెన్నుపూస కాస్తా వెన్నపూసగా రూపాంతరం చెందింది. అయితే, టీవీలో ఎంతసేపు మొహాన్ని చూపిస్తే అంత మంచిదని గుర్తుకొచ్చిన ఆ నాయకుడు, "అంత ధైర్యంగా వాళ్లే చూపిస్తున్నప్పుడు మన యాంటీ కరప్షన్ బ్యూరోలూ, సీబీఐలూ, ఇన్‌కంటాక్స్‌వాళ్లూ చేతులకి గాజులేసుకుని కూర్చోరు," అంటూ మాటమార్చాడు.

"వందల్లోనూ, వేలల్లోనూ తమది కాని డబ్బుని తీసుకునేవాళ్లు చేసేది దొంగతనం. వేలకోట్లల్లో డబ్బులు చేతులు మారితే దాన్ని దొరతనమంటారు. దొరతనాన్ని విచారణ జరపడానికి పవిత్ర భారతదేశంలో న్యాయస్థానాలు ఇంకా పుట్టలేదు," అన్నాడు శివయ్య. కోటిరూపాయలకే అమ్ముడుపోయే న్యాయాధిపతుల గూర్చి ప్రజలు వినేవున్నారు గనుక వాళ్లకా జవాబు సమంజసంగానే అనిపించింది.

"ఇన్నివేల కోట్లరూపాయలని వెనకేసుకుంటాను అని బాహాటంగా చెప్పగలిగే ధైర్యం మీకెలా వచ్చింది?"

"ఇంతకుముందు వున్న ప్రభుత్వపు నాయకులు ఎనిమిదేళ్లల్లో వెనకేసినంత డబ్బుని ఇప్పుడున్న ప్రభుత్వపు నాయకులు నాలుగేళ్లలోనే లాగేశారు. ఒక ముఖ్యమంత్రి ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఐదుశాతం తనదంటే, తరువాతివారు పదిశాతం తమదన్నారు. ఇది అందరికీ తెలిసిన సత్యం. ఈ ప్రభుత్వాలకి ప్రజలు చూపిన ఆదరణే నాకీ ధైర్యాన్నిచ్చింది."

"మీరు మీ పార్టీని స్థాపించి మీ ప్రతిపాదనలని వినిపించినప్పుడు నవ్వనివారు లేరు. ఇప్పుడు మీ పార్టీ పోటీచెయ్యని నియోజకవర్గం లేదు. మీ పార్టీకి ఆశయం

ఏమయినా ఉంటే అది మీ స్వలాభం మాత్రమే. అలాంటిది మీ పార్టీలో ఇంతమంది చేరడం దేశపురోగతికి ఏమాత్రం ఆశాజనకంగాలేదు," అన్నాడో యాంకరుడు నిరసిస్తూ.

"నరమాంసభక్షకుల్లో నీతీ నిజాయితీలుంటాయని మీకు తెలుసా? వాళ్లు తమలోని వాళ్లని తినరు. బయటివాళ్లను మాత్రమే తింటారు. రావణుడికాలంలో కూడా రాక్షసులు మానవులనీ, దేవతలనీ వేధించినట్లు చదువుకున్నాంతప్ప వాళ్లల్లోనే ఒకడు ఇంకొకణ్ణి మోసగించినట్లు గానీ, ఒక రాక్షసుడు ఒక రాక్షసవనితను బాధించినట్లుగానీ వేధించినట్లు గానీ ఏ పురాణాల్లో నయినా చెప్పగా విన్నామా? మరి దేవతల్లోనో? ఇంద్రుడు ఒక మానవ వనితకోసం మారువేషం వేశాడు. చంద్రుడు తన గురువయిన బృహస్పతి భార్యని లేవదీసుకుపోయాడు. అంతెందుకు? బ్రహ్మదేవుడు శివలింగపు ఆద్యంతాలని చూశానని అబద్ధం చెప్పి శివుని చేత నరకబడడంవల్ల ఒక ముఖాన్ని కోల్పోయాడు. ఈ ఉదాహరణలని చెప్పి దేవతలకి గౌరవాన్నివ్వడంలో లోపం చూపడంలేదే!

"మనమధ్య నిరంతరం జరుగుతోంది పిల్లీ, ఎలుకల మధ్య ఆట వంటిది. పంట పెరుగుదలకి ఎరువులనీ, మంచి విత్తనాలనీ కనిపెడతాం. వాటిల్లో కల్తీ కలిపి పంట తగ్గడంవల్ల వ్యవసాయదారుడి పొట్టకొట్టడమే కాక మనందరి కళ్లూ మనమే పొడుచు కుంటున్నాం. ఒక మంత్రమేసో లేక ఒక యంత్రం వల్లనో నాణ్యమయిన సరుకుని రైతుకి అందేలా చెయ్యగలిగితే అందరికీ లాభమేకదా! ఇక్కడి నాయకుల్లోని కల్తీ మీకు కనిపిస్తోంది. బయట దేశాలవాళ్లు భారతదేశంలోని సాంకేతిక అభివృద్ధిని మాత్రం చూస్తున్నారు. దేశం ప్రగతిబాటలో నడుస్తున్నట్లా లేక వెనకడుగేస్తున్నట్లా? 'దేశసేవ కోసమే నాయకులు ఎన్నికల్లో నిలబడేది' అన్న భ్రమనించీ ప్రజలు ఎంత తొందరగా బయటపడితే అంత త్వరగా దేశం పురోభివృద్ధిని సాగిస్తుందని నా నమ్మకం. అప్పారావుగారు 'స్వంత లాభం కొంతమానుకు పొరుగువానికి తోడు పడవోయ్' అన్నారు గానీ 'స్వంతలాభం ఎంత ఎంతను మంత్రిపదవుల ఆశగదవోయ్' అనేది రాజకీయ నాయకుల గూర్చి ఈనాటి ప్రజలెరిగిన సత్యం. 'స్వంతలాభం ఇంత కెంతను మంత్రి పదవుల ఆశతగదోయ్' అని మీరు ఎవరికయినా నీతులు చెప్పబోతే మిమ్మల్ని పిచ్చాసుపత్రిలోంచి పారిపోయి వచ్చినట్లుగా భావిస్తారు! అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరమే మేలన్నారు గదా పెద్దవాళ్లు! రోగ నిర్ధారణ అయినప్పుడే గదా సరయిన వైద్యం జరిగేది!! నేను నిజాయితీగా నిజాలని చెబుతుంటే మీరెందుకు నిరసిస్తున్నారో నా కర్థం కావటంలేదు," అన్నాడు శివయ్య.

"మీ సేవ చెయ్యడానికే మీ ముందుకొస్తున్నాను అని నేను మిమ్మల్ని మభ్యపెట్టను, మీ తెలివితేటలని కించపరచను. ముఖ్యమంత్రి పదవికి దరఖాస్తు పెట్టుకుంటున్నాను. అందుకు నాకు గల క్వాలిఫికేషన్లేవో మీరు నా వెబ్‌సైట్లో చూశారు. అయితే ఆ ఉద్యోగానికి జీతమేదో నిర్ణయించేశాం గదా, కనీసం మీరయినా ఆ జీతంతోనే సరిపెట్టు కోవచ్చుగదా, అని మీరునన్నడగవచ్చు. ఏ ఉద్యోగాని కయినా కొంతఖర్చు ముందే పెట్టవలసి ఉంటుందని

మీకు తెలుసు. ఉదాహరణకి, నల్గొండలో ఉండే అభ్యర్థి ప్రభుత్వ పాఠశాల ఇచ్చిన డిగ్రీని చేత్తో పట్టుకుని గుంటూర్లో ఇంటర్వ్యూ కొస్తే దానికి దారిఖర్చులు మాట్లాడకుండా పెట్టుకుంటాడు. ఆ ఉద్యోగంలో అతను ఎంపికయితే, జీవితకాలంలో ఆ ఉద్యోగంలో అతని సంపాదన అతని దారిఖర్చులకి ఎన్నిరెట్లో గమనించండి. ఇంజనీరింగ్ కాలేజీలో నాలుగు లక్షల రూపాయలు ఖర్చుపెట్టినా సరే డిగ్రీ సంపాదించుకొన్న తరువాత జీవితకాలంలో ఆ ఇంజనీర్ సంపాదన ఆ ఖర్చుకి తేలిగ్గా కనీసం అరవైరెట్లుంటుంది. మరి ముఖ్యమంత్రి అవాలంటే? వందలకోట్ల ఖర్చు. ఆ పదవిని చేపట్టిన తరువాత ప్రభుత్వం వారిచ్చే అన్ని అలవెన్సులూ కలిపితే అయిదేళ్లల్లో అది ఒక కోటికన్నా తక్కువే ఉంటుంది. నేను బిజినెస్ మాన్‌ని. నేను అయిదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలంటే ఆ పదవి నాకు దక్కడానికి అయ్యే ఖర్చులని పెట్టుబడిగా భావిస్తాను గనుక దానికి తగ్గ ప్రతిఫలం రావాలని ఆశిస్తాను– ఒక ఇంజనీర్ లాగానే, ఒక తాలూకా ఆఫీస్ క్లర్క్‌లాగానే. అందుకని వందలకోట్ల ఖర్చుకి వేలకోట్లలో లాభాన్ని ఆశించడం సమంజసమే నన్న నా వాదనతో మీరు ఏకీభవించక పోయినా అందులోని నిజాన్ని గ్రహిస్తారనే నమ్ముతున్నాను.

"అమెరికా ఎన్నికలలో గూడా చాలానే ఖర్చవుతోందని మీరు వార్తలలో చదువుతూనే ఉన్నారు. ప్రెసిడెంట్ ఒబామా రెండవసారి ఎన్నికలలో పోటీ చేసినప్పుడు ఆయనా, ఆయన ప్రత్యర్థీ చెరొక బిలియన్ డాలర్లూ – అంటే అయిదువేల కోట్ల రూపాయలు ఖర్చుచేశారు. ఆ ఖర్చంతా వాళ్ల ఆశయాలనూ, ప్రతిపాదనలనూ సమర్థించే సామాన్య ప్రజలవద్దనుంచీ, బిజినెస్‌ల వద్దనుంచీ, బిలియనీర్ల వద్దనుంచీ పోగుచేశారు. అయితే గెలిచిన తరువాత వాళ్ల రాబడిని ప్రజలే కాక ప్రత్యర్థులూ కూడా డేగకళ్లతో చూస్తారు గనుక, లంచాలు తినే అవకాశాలు అమెరికాలో ప్రెసిడెంటుకిగానీ, ఎన్నికయిన ఇతర ప్రజా ప్రతినిధులకి గానీ ఉండవు. లక్ష్మణరేఖ దాటిన వాళ్లు పట్టుబడ్డప్పుడు రాజీనామాలు చెయ్యడం, అప్పుడప్పుడూ కటకటాల వెనక్కి వెళ్లడం గూర్చి మీరు వినే ఉంటారు. అమెరికాలోనే గాక ఇక్కడ కూడా పెద్ద కంపెనీల్లో చీఫ్ ఎగ్జెక్యూటివ్‌లకి సంవత్సరంలో జీతం కంటే బోనస్‌లు చాలా ఎక్కువగా ఉంటాయి గనుక, ఈ పదవిలో ప్రతిభని చూపెట్టడానికి నా మోడల్ ఇదీ. అంతేగాక, ప్రెసిడెంట్ ఒబామా ప్రత్యర్థిలాగానే, ఎన్నికలలో నిలబడ్డప్పుడు ఒకళ్లు ఓడిపోకతప్పదు. ఆ ఓడిపోయిన వాడికి అతని ఖర్చంతా బూడిదలో పోసిన పన్నీరేగదా! ఆ దృష్టితో చూస్తే నే నడుగుతున్న బోనస్ సమంజసంగానే కనిపిస్తుంది. అక్కడ ఒబామా ప్రత్యర్థి మిట్ రామ్నీ తన స్వంతడబ్బు చాలా తక్కువ పెట్టాడు. ఇక్కడ ఖర్చు ఖర్చంతా నాదే. అదీ ముఖ్యమయిన తేడా. ఇంకొక్క విషయం: నేను ఖర్చుపెడుతున్న ప్రతీ రూపాయీ సక్రమసంపాదనే, రిజర్వ్ బాంక్‌కు లెక్కలు చూపించినదే! అంతేకాక నేను తీసుకునే ప్రతీ రూపాయి మీదా టాక్సులు కడతాను. పారదర్శక ప్రభుత్వం వల్ల వచ్చే లాభాలని మీరు తప్పక మెచ్చుకుంటారని నా నమ్మకం," అన్నాడు శివయ్య.

"ఇన్వెస్ట్‌మెంట్స్ ద్వారా చాలా డబ్బు చేసుకున్న ఖ్యాతి మీకుండగా ఇంత డబ్బుని ఈ ఎన్నికలలో ఎందుకు ఖర్చుపెడుతున్నారు? గెలుస్తానన్న హామీ లేదుగా? అదే మీరు స్టాక్‌మార్కెట్లోనో, రియల్ ఎస్టేట్లోనో పెడితే అయిదేళ్లల్లో తేలిగ్గా రెట్టింపుచేసుకునేవాళ్లు. ఇక్కడ అసలుకే మోసం వచ్చే ప్రమాదముందిగా!"

"కిశోరానికి ఏనుగు కుంభస్థలాన్ని కొడితేనే గదా ఆనందం! ఓడిపోయినందువల్ల డబ్బుపోయినా నా మనుగడ కేమీ ఇబ్బందిరాదు. నేను గెలిస్తే నాకు మాత్రమే కాదు లాభం – ప్రజలందరికీ కూడా. పారదర్శకతకి ప్రజలు అలవాటు పడితే నా తరువాత వాళ్లనించీ కూడా అదే కోరుకుంటారు. అప్పుడది చవగ్గా దొరికే అవకాశముంది కూడా!" అన్నాడు శివయ్య.

* * *

"లాభం చేసుకోవడానికే ఎన్నికలలో నిలబడుతున్నాను," అని శివయ్య చెప్పిన సత్యం సుందరంగా అనిపించిందా, పారదర్శకతకీ, నిజాయితీకి ప్రాధాన్యతనిచ్చి తెలుగు ప్రజలు అతణ్ణి గెలిపించారా అనే ప్రశ్నలకి జవాబులు ఎన్నికలయిన తరువాత గానీ తెలియదు. అతను గెలిచేటట్లయితే, ఆ పై ఎన్నికలలో, తప్పు పాఠం నేర్చుకుని అతనికంటే ఎక్కువ డబ్బుని వెనకేసుకుంటామంటూ అతని ప్రత్యర్థులు పోటీచేస్తారా, లేక అతనికన్నా తక్కువ ఖరీదుకే ప్రజాసేవ చేస్తామంటారా అన్నది ముఖ్యమయిన ప్రశ్న అవుతుంది. ఆ మొదటి పరిస్థితి గనుక వస్తే, తెలుగు ప్రజలు నవ్వేసి అలా అంటూ పోటీచేసేవాళ్లకి ఎన్నికలలో డిపాజిట్ గూడా దక్కనీయరని నా నమ్మకం. రెండవ పరిస్థితి గానీ నిజంగా సంభవిస్తే, పదవుల్లో ఉన్నవాళ్ల అక్రమార్జనలకి వారధి పడుతుంది. అంతేకాక, పారదర్శకతని పాటిస్తూ, శివయ్యకంటే తక్కువ డబ్బులు తీసుకుంటామంటూ వాళ్లు రావడం వల్ల అతనికి సరయిన పోటీ ఏర్పడి, గర్వం అతని తలకెక్కకుండా ఉండడానికి సహాయపడుతుంది. ఫ్రీ మార్కెట్ ఫర్ ఎలక్షన్స్! అప్పుడు చవగ్గా పాలకులని కొనుక్కోవడం వల్ల ప్రజలే గెలిచే అవకాశముంది! అది హర్షణీయమేగదా!! రెండు విధాలుగా కూడా ప్రజలదే గెలుపు!!! కాపిటలిజాన్ని ప్రజాసేవకి గూడా వినియోగించవచ్చని ఎవరయినా కలలోనయినా ఊహించి ఉంటారూ?

(www.eemaata.com, జులై 2013)

* * *

# విదేశ గమనే విద్యా పరాదేవతా

విద్యా నామ నరస్య రూపమధికం ప్రచ్ఛన్న గుప్తం ధనమ్
విద్యా భోగకరీ యశస్సుఖకరీ విద్యా గురూణాం గురుః
విద్యా బంధుజనే విదేశ గమనే విద్యా పరాదేవతా
విద్యా రాజసుపూజితా నహి ధనం విద్యా విహీనః పశుః

నేల మీద పరిచిన స్లీపింగ్ బాగ్ మీద కూర్చుని వీపుని గోడకానించి ఎదురుగా ఉన్న పదమూడంగుళాల టీవీ మీద వస్తున్న జెర్రీ స్ప్రింగర్ షోని కళ్లు చూస్తున్నా, తన మెదడులో మాత్రం భర్తృహరి మొదటి సుభాషితం ఘోష – తాతయ్య గొంతులో. ఆయన గొంతులో ఏ పఠనమైనా వేదఘోష లాగానే వినిపిస్తుంది. ఆయన గొంతు శ్రావ్యంగా వినిపించడమే కాక ఆయన విడమరిచి చెప్పిన అర్థాన్ని మెదడు తన పరిస్థితికి అన్వయిస్తూ తన ఆలోచనలని ఆ సుభాషితం వైపు మళ్లీ మళ్లీ లాగుతోంది.

**విద్యా విహీనః పశుః –**

తను పశువు కాదనడానికి ఋజువు తన డిగ్రీ సర్టిఫికెట్.

తను డిగ్రీలో చేరడం గూర్చి ఎంత గొడవ జరిగింది?

తనకు ఇంజనీరింగ్‌లో సీటు రాకపోయేసరికి మూడేళ్ల డిగ్రీ చదువు వృధా అన్చెప్పి, ఆయన దారిలోనే నడిస్తే తన పద్దు వ్యయం నుంచి ఆదాయంలోకి మారుతుందన్నాడు నాన్న. ఎనిమిదో ఏట ఉపనయనం చేసి నేర్పిన వైదిక విధుల్ని వృధా చెయ్యడం ఎందుకని ఆయన అభిప్రాయం. అవేమైనా తన ఇష్టాయిష్టాలతో ప్రమేయం ఉండి జరిగినవా? ఎలిమెంటరీ స్కూల్లో చేరగానే తన క్లాస్‌మేట్ల నందరినీ చూసి తెలుసుకున్నది వాళ్లందరిలోకి తనొక్కడే వేరుగా ఉన్నాడన్న విషయం. గుండూ, పిలకా, నుదుట విభూతి తనని ఎక్కడ వున్నా పట్టి ఇచ్చేవి. వాటిని వదిలించుకోవడానికి తాతయ్య సహాయం కావాల్సివచ్చింది. అమ్మ మాట నాన్నెప్పుడూ విన్న గుర్తులేదు మరి. "ఏమో నాయనా మీ నాన్నెప్పుడు

నామాట విన్నారు కనుక?" అనేది ఆవిడ నోటిలోంచి రోజుకి కనీసం అరడజను సార్లయినా ఊడిపడే వాక్యం.

అయితే తాతయ్య సహాయం తీసుకోవచ్చని హైస్కూల్లో చేరేదాకా తనకు తట్టలేదు. "ఈ కాలంలో క్రాపు పెంచుకోవడానికీ, వైదిక కర్మలూ, పూజలూ చేయించడానికీ సంబంధం లేదు. వాణ్ణి వదిలెయ్ ఈ విషయంలో" అన్నాడు తాతయ్య. ఏ కళనున్నాడో గానీ, నాన్న ఆయన మాట విన్నాడు.

తనకి గుర్తున్నంత వరకూ తాతయ్య తన తరపున వకాల్తా పుచ్చుకోవడం అది మొదటిసారి. తరువాత నాన్న తనను పురోహితుడి విధులవైపు లాగినప్పుడల్లా తాతయ్యను దీనంగా చూసేవాడు– మాంత్రికుడు రాజకుమారి నెత్తుకుపోతే విడిపించడానికి వచ్చే రాజకుమారిడిలాగా తాతయ్య తనను కాపాడుతాడేమోనని. పొద్దున్నపూట నాన్న ఇంట్లో లేనప్పుడు తాతయ్యతో మొరపెట్టుకునేవాడు. సాయంత్రం పూటంతా నాన్నకి తీరికే తనతో గడపడానికి. ఈనాటి అమెరికా భాషలో నాన్న తనతో చాలా క్వాలిటీ టైం గడిపాడు.

తాతయ్య అడ్డుపడకపోతే తను డిగ్రీలో చేరేవాడు కాదు. పౌరోహిత్యం వంశపారం పర్యంగా వచ్చినా తాతయ్యకంటే నాన్న ఛాందసుడెట్లా అయ్యాడో తెలియదు. మారే కాలంతో మారాలంటాడు తాతయ్య. ఆటోరిక్షాలొచ్చినా గుర్రబ్బండి తోలేవాడిలా కనిపిస్తాడు నాన్న. డిగ్రీలో చేరేముందే అయింది గొడవ. నాన్న తనకేవో కొత్తపాఠాలు నేర్పుతానంటే తను నేర్చుకోను అనకుండా సహాయ నిరాకరణోద్యమం మొదలుపెట్టాడు. కొన్ని రోజులపాటు ఒకే పాఠం చెప్పి, చెప్పి విసిగిపోయాడు నాన్న– తను పాఠం అప్పజెప్పక పోవడం గూర్చి. తనకా పాఠం రాకపోతేగా?

"గుర్రాన్ని నీటి దగ్గరకు తీసికెళ్లగలవు గానీ దానిచేత నీళ్లు తాగించలేవు!" అన్నాడు తాతయ్య తన సంగతి అర్థమై.

"ఈ గుర్రాన్నే నమ్ముకున్నవాణ్ణి. ఇది తాగక చస్తే నాకే నష్టం. కొట్టయినా దీనిచేత నీళ్లు తాగిస్తాను!" అన్నాడు నాన్న.

అమెరికాలో అయితే తను నమ్ముకున్న గుర్రం మొండితనంతో ప్రాణాపాయాన్ని తనే కొని తెచ్చుకున్నా, కొట్టడం మొదలుపెడితే మాత్రం యానిమల్ రైట్స్ ఆర్గనైజేషన్ వాళ్లు కోర్టు కీడుస్తారనీ, మంచి ఉద్దేశంతోనైనా సరే తల్లిదండ్రులైనా గానీ పిల్లల్ని కొట్టినా, తిట్టినా ప్రభుత్వమే పిల్లల్ని తల్లిదండ్రుల నించీ వేరుచేసి పిల్లల సంరక్షణ చూస్తుందనీ ఒక సీనియర్ కొలీగ్ ద్వారా తెలుసుకున్నప్పుడు తెగ ఆశ్చర్యపడ్డాడు.

బాగా చదివి ఇంజనీరింగ్‌లో సీటు తెచ్చుకోవడానికి సరైన కృషి చెయ్యకుండా తను బలాదూర్ తిరుగుడు తిరిగాడని నాన్నకు కోపం. చివరకు తాతయ్యే రాజీ కుదిర్చాడు– నాన్న మాటలు వింటేనే తను డిగ్రీలో చేరేటట్లు.

**విద్యా బంధుజనే విదేశ గమనే –**

తను అమెరికా రావడానికి విద్యే కారణం. అయితే అది నాన్న చెప్పిన విద్యకాదు. డిగ్రీ చదువు తరువాత కాకతాళీయంగా స్నేహితుడి ప్రోద్బలంతో సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ నేర్పిన విద్య. హైదరాబాద్‌లో సెక్రటేరియట్‌లో ఉద్యోగం చేస్తున్నపుడు కలిగిన అవకాశం. ట్రైనింగ్‌కి స్వంత డబ్బులు అవసరం లేకపోయినా, అమెరికా రావడానికి మాత్రం స్వంత పెట్టుబడి కావాల్సొచ్చింది. ఆ అప్పు చెయ్యడం నాన్నకి ఇష్టంలేదు.

"సిరి రా మోకాలడ్డంటావెందు" కన్నాడు తాతయ్య.

"వాడు చేసే అప్పు తీర్చకపోతే ఈ మోకాలే అప్పులవాళ్లకందేది!" అన్నాడు నాన్న. "హిందూ సాంప్రదాయంలో, పద్ధతుల్లో పాండిత్యం ఉన్నవాణ్ణి అమెరికా నుంచీ వచ్చుల్లా ఆదరిస్తుంటే అమెరికా వెళ్లి అనామకుడిగా ఉంటానంటాడు వీడు. వాస్తులో సిద్ధాంతి గారబ్బాయిని చూడు. జ్యోతిషంలో అవధానిగార్ని చూడు. అమెరికా నుంచీ రావడమేకాదు, వచ్చి వీళ్లని తమతోబాటు తీసుకువెడుతున్నారు కూడా!"

"ఒరేయ్ సోమూ, సందు చివరేమన్నా కారు కనిపిస్తోందేమో చూడు మీ నాన్నని తీసుకెళ్లడానికి!" తాతయ్య వ్యంగ్యం నాన్న నషాళాని కంటింది.

"సందు చివర్లో కాదు ఆకాశంలోకి చూడు పుష్పక విమానం వస్తోందేమో, ఇటు తండ్రి వల్లా, అటు కొడుకు వల్లా పడుతున్న బాధల్నించి నన్ను విముక్తి చెయ్యడానికి!" విసురుగా అనేసి అక్కణ్ణించీ లేచి వెళ్లిపోయాడు.

అప్పటిదాకా ఉన్న దూరపు బంధుత్వాలు దగ్గరైపోయాయి. పెళ్లి సంబంధాల మాట సరేసరి. "వీడెందుకన్నా పనికివస్తాడంటావా?" అనడిగిన వాళ్ల దగ్గర్నించీ కూడా వచ్చాయి.

చుట్టాల్లో డబ్బులు బాగా ఉన్న ఒక పెద్దాయన ఇంటికి అమ్మ తీసుకెళ్లింది తన విదేశీ పయన వార్తని స్వయంగా చెప్పడానికి.

"ఏరా, పూజలు చేయించడానికి వెడుతున్నావా అమెరికాకి?" ఈర్ష్యతో నిండిన చనువు నిప్పుపెడితే అపహాస్యం ఆజ్యం పోసింది. బయటివాళ్లు బాధలు పెట్టగలరేమో గానీ హింసించడంలో మాత్రం చుట్టాలకి సరితూగలేరు.

"కాదు, కర్మకాండలు చేయించడానికి!" తను ఠక్కున సమాధానం ఇచ్చాడు.

"వీడు మనుషులతో మాట్లాడ్డం నేర్చుకోవాలే!" సానుభూతితో ఆయన తన అభిప్రాయం వెలిబుచ్చాడు.

"ముందు నువ్వు మనిషివి కా…" అన్న మాటల్ని తను నాలిక చివర్నే ఆపేశాడు. కొంతమంది పెద్దమనుషులు వయసు తెచ్చిన పెద్దరికాన్ని భుజాన వేసుకుని, తమ వంటిమీద బట్టలేం లేవన్న సంగతి గమనించరని ఆ రోజున తెలిసింది.

**విద్యా భోగకరీ యశస్సుఖకరీ...**

అమెరికా వచ్చిన మొదటివారంలోనే సి++ స్పెల్లింగ్ చెబితే చాలు సంవత్సరానికి అరవైవేల డాలర్ల జీతం ఇచ్చే సమయంలో తనకు వీసా లాటరీ తగిలిందని తెలుసుకున్నాడు. రెండోవారం అయ్యేసరికి, హోండా సివిక్ కారు కొన్నాడు. రెండు నెలలు తిరిగేసరికి అపార్ట్‌మెంట్‌లో సుఖంగా బ్రతకడానికి కావల్సిన వస్తువులు కొనుక్కున్నాడు. మూణ్ణెల్లు తిరిగేసరికి ఇండియాలో అప్పు తీర్చేశాడు.

చుట్టాలు, పెద్దగా చెప్పుకోదగ్గ స్నేహితులూ ఉన్న ఊళ్లోనే కాక ఖండంలో కూడా లేకపోవడంతో ఎన్ని గంటలైనా ఆఫీసులో ఉండిపోవడం అలవాటయ్యింది. పనిమంతుడిగా పేరు తెచ్చుకున్నాడు.

ఒకరోజున ఫ్రెండ్స్ చెప్పిన అడ్రస్సు పట్టుకుని వాషింగ్టన్ డిసి దగ్గరలో శివ విష్ణు టెంపుల్‌కి వెళ్లాడు. అక్కడ ఆంధ్రాలోలాగా కట్టిన గుడిని చూసి ఆశ్చర్యపోయాడు. గుళ్లో వినాయకుడికి అభిషేకం జరుగుతుంటే పూజారి గొంతుకు తనుకూడా గొంతును జత కలిపాడు.  పూజారి మంత్రాల ఉచ్చారణ స్పష్టత తాతయ్యనీ, నాన్ననీ గుర్తుకుతెచ్చింది. అలా రెండుమూడు సార్లు ఆ గుడికి వెళ్లిన తరువాత ఆ పూజారి తన వివరాలు అడిగి తెలుసుకున్నాడు. అతని వివరాలు చెప్పాడు. సుదర్శనశాస్త్రికి ముప్ఫై ఏళ్లు కూడా ఉండవు. అమెరికా వచ్చి మూడేళ్లు దాటింది. గ్రీన్‌కార్డు కూడా నేడో రేపో రావచ్చు. ఆ గుళ్లో ఉండే నలుగురు పూజార్లకీ తెలుగు కొద్దో గొప్పో వచ్చినా, ఇతనే స్వచ్ఛమైన తెలుగులో మాట్లాడగలిగింది.

సిలికాన్ వాలీలో మొదలైన డాట్‌కామ్ ఉప్పెన తనను కూడా ముంచేస్తుందని కలలో కూడా అనుకోకముందే తన కంపెనీవాళ్లు తనను బెంచీ ఎక్కించారు. అప్పటిగ్గానీ కార్లని ఎయిర్‌పోర్ట్‌లో వదిలేసి స్వదేశానికి తిరిగి వెళ్లిన భారతీయుల గూర్చి తనకు తెలియలేదు. తనను ఇండియా నుంచీ తీసుకువచ్చిన కంపెనీకి రోజూ ఫోన్‌చేస్తుంటే, మొదట్లో జవాబు చెప్పిన వ్యక్తులు కూడా తన పరిస్థితిలోనే ఉన్నారని తెలిసింది. చివరకు ఒకతను విసుగ్గా, “ఉద్యోగాలేం లేవు, బెంచీమీద కూర్చుంటావో ఇండియా తిరిగివెడతావో నీ ఇష్టం. ఇంక ఇక్కడికి ఫోన్ చెయ్యొద్దు!” అని చెప్పాడు.

ఒక నెలపాటు ఉద్యోగాల్ని వెదుకుతూ అపార్ట్‌మెంట్‌లోనే ఉండేసరికి తనకు పరిస్థితి అర్థమైంది– కూడబెట్టుకున్న డబ్బు అపార్ట్‌మెంట్ అద్దెకీ, కార్ పేమెంట్‌కీ ఇంకో రెణ్ణెల్లు మాత్రమే సరిపోతుందని. ఈ రెణ్ణెల్లలో ఉద్యోగం రాకపోతే తిరిగి ఇండియా వెళ్లడానికి కూడా డబ్బు ఉండదు. పైగా ఇండియాలో కూడా ఐటీ ఫీల్డ్‌లో ఉద్యోగాలు దొరకట్లేదని తెలిసింది.

వెనక్కి తిరిగి ఇండియా వెడితే అమ్మ తన దురదృష్టం అంటుంది. నాన్న 'నా మాట నువ్వెందుకు వింటావ్?' అంటాడు. బంధువుల్లో పెద్దాయన 'అమెరికా రిటర్న్డ్ పూజారి' అని పట్టం కడతాడు. ఆ పట్టం కట్టించుకునే బదులు అమెరికాలో అనామకుడి బీద బతుకే నయమేమో! తన బ్రతుకు కేరాఫ్ ప్లాట్‌ఫాం కాక తప్పదులా ఉంది. ఎందుకంటే హెచ్–1 వీసా ఉన్నవాళ్ల రెస్యూమేల్ని చూడను కూడా చూడకుండా చెత్తబుట్టలో వేస్తున్నారని తెలిసింది.

నాన్న మీద కోపంతో సన్నగిల్లిన దేముడి మీద నమ్మకం అమెరికా చేరేసరికి పూర్తిగా మాయమైనా ఉద్యోగం వచ్చేలా లేదన్న నిరాశ ఆవహించిన దగ్గర్నుంచీ మళ్లీ చిగురించడం మొదలయ్యింది. మొదట సంధ్యావందనం, కొద్ది రోజులైన తరువాత రోజూ విష్ణు సహస్రనామాలు, మరికొద్ది రోజుల తరువాత అష్టలక్ష్మీ స్తోత్రం ఇవన్నీ చేసినా రోజులో ఎంతో కాలం మిగిలిపోతోంది. ఇరవైనాలుగు గంటలు అంత దీర్ఘంగా ఉంటయ్యని అప్పటిదాకా తెలియలేదు.

ఒకరోజు గుళ్లో 'రూమ్మేట్ కావాలి' నోటీస్ కనిపించింది. అద్దె తను కట్టేదాంట్లో పావు మాత్రమే. ఫోన్‌చేసి, అడ్రస్ పట్టుకుని వెళ్లాడు. తలుపు తీసిన వ్యక్తి సుదర్శనశాస్త్రి.

"మీరు గుడి వాళ్లిచ్చిన ఇంట్లోకదా ఉంటానన్నారూ?" అతను చెప్పింది ఇంకా గుర్తుంది.

"ఇప్పుడు నేను గుళ్లో పనిచెయ్యట్లేదు."

"మరి మీకు..." మధ్యలోనే ఆగిపోయాడు.

"గుడితో సంబంధం లేకుండా నేనే పూజలూ అవీ చేయించడం మొదలుపెట్టాను. మీ భాషలో చెప్పాలంటే నేను నా కంపెనీ పెట్టుకున్నానన్నమాట!"

"మరి గుడి మీకిచ్చే సెక్యూరిటీ?"

"మూడేళ్ల అనుభవంతో తెలుసుకున్నది, గుడిలో కంటే విడిగానే పూజారిగా బాగా బ్రతకవచ్చని. తెలిసిన మిత్రులు నన్ను ప్రోత్సహించారు కూడా, నా పూజల్ని మెచ్చి."

"ఇక్కడ అంతమంది మిమ్మల్ని ఇళ్లకి పిలిచి పూజల్ని చేయించుకుంటారా?" ఎందుకో అమెరికాలో ఉన్నవాళ్లకి హిందూ దేవుళ్లకి చేసే పూజలంటే అంత ఇష్టం ఉండదన్నది తన అభిప్రాయం.

"ఈమధ్య కాలంలో ఈ చుట్టుప్రక్కల ఎక్కువమంది తెలుగువాళ్లు ఇళ్లు కొనడతో గృహప్రవేశాలూ, నామకరణాలూ, కొత్తకార్లకి వాహనపూజలూ ఎక్కువయ్యాయి. అవి శని, ఆదివారాల్లోనే జరగాలి. గుళ్లో వాళ్లు మాత్రం గుళ్లో రద్దీవల్ల వాళ్ల పూజార్లని శనీ, ఆదివారాల్లో ఇళ్లకు పూజలకి పంపించరు. ఒకప్పుడు గుళ్లో మాత్రమే సత్యనారాయణ వ్రతం చేయించడానికి కుదిరేది. ఇప్పుడు పూజల మంత్రాల్తో ఆడియో కాసెట్‌లు వచ్చినా

గానీ, పురోహితుడు స్వంత ఇళ్లలో పూజచేయడం వల్ల వచ్చే తృప్తినీ ఆనందాన్నీ కోరుతున్నారు. ఇవన్నీ నాకు ఇచ్చిన అవకాశాలు."

సుదర్శనం అపార్ట్‌మెంటులోకి మారిన తరువాత తను గమనించినది శని, ఆదివారాల్లో ప్రొద్దున్నే వెళ్లి రాత్రి 8-9 గంటలదాకా సుదర్శనం ఇంటికి రాకపోవడం. ఎవరో ఒకళ్లు వచ్చి అతన్ని వాళ్ల ఇంటికి తీసుకువెళ్లి వెనక్కు దిగబెడుతుండేవాళ్లు. ఒకటి, రెండుసార్లు తను సుదర్శనాన్ని దిగబెట్టి వచ్చాడు కూడా. నెలరోజులు తిరిగేసరికి వారంలో మిగిలిన రోజుల్లో కూడా అతను అప్పుడప్పుడు వెళ్లి రావడం మొదలుపెట్టాడు.

ఆ నెలరోజుల్లోనూ తన పరిస్థితి క్రమంగా అధోగతికి దిగజారిపోతూనే ఉంది. తన ఉద్యోగ ప్రయత్నాలేవీ ఫలించలేదు. తను పంపించే రెస్యూమేలు పట్టించుకునే వాడెవడూ కనిపించలేదు. జావా ప్రోగ్రామర్లకి ఒకప్పుడు గంటకి రెండువందల డాలర్లు ఇచ్చిన వాళ్లు ఇపుడు పదిడాలర్లు కూడా ఇవ్వట్లేదని విన్నాడు. ఇంట్లో కంప్యూటర్ లేకపోవడం వల్ల ఇంటర్నెట్ కెళ్లాలన్నా, ఇ-మెయిల్ చూడాలన్నా కూడా లైబ్రరీ కెళ్లాలి. కార్లో గాస్ పోయించడానికి డబ్బుల్లేక, అది కూడా మానేశాడు. ఉద్యోగం వచ్చిన మొదట్లో కొన్న టీవీని సగం ధరకే అమ్మేశాడు. మనస్థితి అసలు బాగోలేదు. రాత్రిపూట నిద్రపట్టట్లేదు. తినాలంటే ఏవీ సహించట్లేదు.

**ప్రచ్ఛన్న గుప్తం ధనమ్ -**

ఒక శనివారం నాడు పొద్దున్నే సుదర్శనం వెళ్లిపోయిన తరువాత లావొక్కింతయు లేదు.. రీతిలో దేవుడి మీద భారం వెయ్యక తప్పదనిపించింది.

ప్రాణంబుల్ ఠావుల్ దప్పెను మూర్ఛవచ్చె... పోతన తన గూర్చే ఆ పద్యాన్ని రాసి ఉంటాడు.

స్నానం చేసివచ్చి తన బెడ్రూంలో కూర్చొని, అమెరికా వచ్చేటప్పుడు అమ్మ ఇచ్చిన సత్యనారాయణ స్వామి ఫోటోని పెట్టెలోంచి బయటకు తీశాడు. దాన్ని గోడకు ఆనించిపెట్టి, పెద్దగా పూజా కార్యక్రమాన్ని నిర్వహించాడు. మనసులో రూపం పోసుకుని, గొంతు సృష్టించిన శబ్దతరంగాలు చెవుల్లోపడి, మనసులో మార్మోగుతుంటే మనసులోనే వేరే మూల అదో అస్పష్టమైన తృప్తి, అవ్యక్తమైన స్పందన. అష్టోత్తరం చదువుతుంటే కళ్ల వెంబడి నీళ్లుకారాయి. మనసు, రావే ఈశ్వర కావవే వరద, సంరక్షించు- రీతిలో ఆక్రోశించింది. తను ఇట్లా దేవుడిని ప్రార్థిస్తాడని గానీ, ప్రార్థించగలడని గానీ ఎప్పుడూ అనుకోలేదు.

సోమవారం నాడు ప్రొద్దున సుదర్శనం మెల్లగా అడిగాడు. "మీ నాన్నగారేం చేస్తుంటారు?"

చెప్పక తప్పలేదు. కాసేపటి నిశ్శబ్దం తర్వాత మళ్లీ అతనే అడిగాడు– "సత్యనారాయణ వ్రతం కాక నీకింకేం వచ్చు?"

నాన్న తనకు నూరిపోసినవన్నీ చెప్పాడు. కాసేపటి నిశ్శబ్దం తరువాత, మాటలు మెల్లగా పేరుస్తూ సుదర్శనం అన్నాడు. "మొన్న శనివారం ప్రొద్దున బయటికి వెళ్లిన తరువాత మరచిపోయిన వస్తువు కోసం వెనక్కివస్తే వినేవాళ్లను మంత్రముగ్ధుల్ని చేసేలా నీ నోట్లోంచి నామాలు వినిపిస్తున్నాయి. కుతూహలంతో నీ గదిలోకి తొంగిచూస్తే నీ పూజలో నువ్వు నిమగ్నుడివై ఉన్నావు. నీ మంత్రోచ్చారణలో స్పష్టత నేను ఇంకెవరి దగ్గరా వినలేదు ఒక్క మా గురువుగారి దగ్గర తప్ప. నీ ధ్యాన నిమగ్నతని చూసి నేను అసూయపడుతున్నాను. నువ్వేమనుకోనంటే..."

నాలికమీద ఆడుతున్న మాటలను నోటిలోపలే ఆపడానికి చేసిన విఫలప్రయత్నం తరువాత మళ్లీ తనే అన్నాడు. "నాకు ఈ మధ్య పని ఒత్తిడి ఎక్కువైంది. శనీ ఆదివారాల్లో ఒక్కో రోజుకీ నాకు ఐదారుకు పైగా పిలుపు లొస్తున్నాయి. నీకు అభ్యంతరం లేకపోతే నేను చెయ్యని వాటిని నువ్వు చెయ్యవచ్చు."

వేటి బాహువుల నుంచి తను తప్పించుకుందా మనుకున్నాడో అవే తనచుట్టూ బిగుసుకుంటున్నాయి.

"నేనిట్లా అనడం నీకు నచ్చకపోవచ్చు. రెండ్రోజులు బాగా ఆలోచించిన తరువాతే ఈ సలహా ఇస్తున్నాను. నీకున్న క్వాలిఫికేషన్లకి ఇది నామోషీగా అనిపిస్తే ఈ అవకాశాన్ని నిన్ను ప్రస్తుతం కొన్నాళ్లు గట్టెక్కించడానికి వాడుకో.

"నిన్ను చూస్తే నాకు అసూయగా ఉంది. నువ్వు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌వే గాక మేము చేసిన పనికూడా చేయగలవు. మరి నేనో? నాకు నా వృత్తి తప్ప వేరే విద్య తెలియదు. ఒకవేళ ఇక్కడ పూజారులకి కొదువలేకుండాపోతే నా సంగతేమిటని నాకు భయం వేస్తూంటుంది.

"ఒకవేళ నువ్వు నా సలహా పాటించినా, నేనేమీ నీకు నిస్వార్థంతో సహాయం చేస్తాననడం లేదు. మీ ఐటి వాళ్లకి మళ్లీ గిరాకీ పెరగంగానే నువ్వు మళ్లీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌వి అవుతావు. అప్పుడు నీ నుంచి నాకు కాంపిటీషన్ ఉండకపోవడమే కాకుండా నీ క్లయింట్స్‌ని నా దగ్గరకే పంపిస్తావు!" అని చెప్పి బెడ్రూంలోకి వెళ్లి తలుపు వేసుకుని పడుకున్నాడు.

తను అప్పటి నుంచీ ఆలోచిస్తూనే ఉన్నాడు. మంచం, పరుపు అమ్మేసి కొనుక్కున్న స్లీపింగ్ బాగ్‌మీద కూర్చుని ఆలోచిస్తున్నకొద్దీ అర్థమౌతోంది.

**విద్యా బంధుజనే –**

ఇక్కడున్న తెలుగువాళ్లందరూ తన బంధువులే.

**విద్యా రాజ సుపూజితా –**

సుదర్శనం సర్వీసులు కోరే వాళ్లెందరూ పెద్దపెద్ద డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, ఇంకా వివిధ వృత్తుల్లో రాణించినవాళ్లే.

**విదేశ గమనే విద్యా వరా దేవతా–**

విదేశంలో స్వదేశపు విద్య నేర్చినవారికి ఆ విద్యాదేవిని మించిన దేవత లేదు.

**ప్రచ్ఛన్న గుప్తం ధనమ్ –**

సాఫ్ట్‌వేర్ నాలెడ్జి తను అమెరికా రావడానికి కారణమైతే, నాన్న నేర్పిన విద్య తనకు సముద్రంలో మునగబోతున్న వాడికి దొరికిన చెక్క తీరున ఆధారం ఇస్తానంటోంది. కళ్లకి కనబడేలాగా ఎదురుగా దాచిపెట్టి వున్న ధనాన్ని ఇంతకాలం చూడలేదు. సుదర్శనం నిద్రలేచిన తరువాత తన నిర్ణయాన్ని చెబుతాడు.

* * *

విద్య చేకూర్చవలసింది డిగ్రీ సర్టిఫికెట్‌లని కాదు – దొరికిన అవకాశాలను ఉపయోగించుకునే తెలివితేటల్ని. విద్య నేర్పవలసింది గారెలబుట్టలో పడేలా తన్నే వాడిముందు మోకాళ్లమీద మోకరిల్లగలగడాన్ని.

(తెలుగు నాడి, నవంబర్ 2004)

# నాకు తెలిసిన టెన్సింగ్ నార్కే

టెన్సింగ్ నార్కే పేరు వినగానే గుర్తొచ్చేవి హిమాలయాలు.

వైకుంఠపాళీ అనగానే నాకు స్ఫురించేది సురేష్ గాడు.

హిమాలయాలు టెన్సింగ్ నార్కే చేరిన శిఖరాగ్రాలకే కాక వాటిని చేరడానికి ప్రతి మలుపులోనూ ప్రతీ చరియ దగ్గరా ప్రకృతి విసిరేసిన ఆటంకాల్ని అధిగమించిన పట్టుదలకు ప్రతీకలు.

సురేష్‌గాడు, నిచ్చెనల ఎగరేతలకీ పాముల పడవేతలకే కాక నిచ్చెనలమీద పాములు సాధిస్తున్న ఘనవిజయాల వైకుంఠపాళీ జీవితానికి ప్రతీక.

మా చిన్నప్పుడు శీను వాళ్లింట్లో ఆడిన ప్రతిసారీ వైకుంఠపాళీలో వాడే గెలిచినప్పు డెప్పుడూ వాడి మొహంలో ఆనందం వెల్లివిరియలేదు. ఇప్పుడు నాకు ఎదురుగా కూర్చున్న వాడి మొహంలో పాముల పడవేతల దెబ్బల తాలూకు బాధల ఛాయలూ లేవు. బహుశా వీడిని దృష్టిలో పెట్టుకునే పాశ్చాత్యులు పాముల పటాన్ని షూట్స్ అండ్ లాడర్స్‌గా మార్చి ఉంటారు– పడవేతలకు జారుడు బండలైతే అంత బాధలు కలిగించవని. ఇరవైయ్యేళ్ల తాలూకు బాధల ఛాయలే మొహంలో లేనప్పుడు ఖండాంతర ప్రయాణం కలుగజేసే అలసటెలా కనిపిస్తుంది? వాడు విస్కీ తాగుతున్న తీరు చూస్తూ వాడి మొహంలో ఎవరో తోయగా జారుడు బండపై జారిన చిహ్నాలున్నాయా లేక కష్టపడి నిచ్చెన లెక్కిన గుర్తులున్నాయా అని ఆలోచిస్తున్నాను.

వాడు, నేను అమెరికాలో ఇలా కలుసుకుంటామని ఎన్నేళ్ల క్రితమైనా సరే ఎవరైనా భవిష్యత్తు చెప్పి ఉంటే వాళ్లని పిచ్చివాళ్లకింద జమకట్టి ఉండేవాడిని. అదే మొన్నీమధ్య దాకా అయితే, అద్వానీ పాకిస్తాన్లో అడుగుపెట్టి జిన్నావి సెక్యులర్ ఆదర్శాలు అన్నప్పుడని కూడా అనేవాణ్ణి.

ఏడాది క్రితం పరిస్థితి దారుణమైనదే. దాని ప్రతిఫలాన్ని వీడు వాడుకుని అమెరికా వచ్చాడంటేనే ఇంకా నమ్మలేకపోతున్నాను. వీడు నాకు తెలిసిన సురేషేనా?

ఏడవ తరగతిలో వాడితో పరిచయం. అది కూడా మా నాన్నకి హెడ్మాస్టరు గారు తెలిసినందువల్ల నన్ను బాగా చదివే కుర్రాడి పక్కన కూర్చోపెడితే ఆ సువాసనలు నాక్కూడా ఏమైనా వంటబడతాయేమోనన్న ఆశవల్ల. దాని కోసమని సెక్షన్ మార్పిడి కూడా జరిగింది.

అప్పుడయితే  వాడు అంత క్వయెట్‌గా ఎలా ఉండేవాడా అని ఆశ్చర్యపోయేవాణ్ణి. కానీ ఎవరైనా కాలచక్రాన్ని ముందుకు తిప్పి భవిష్యత్తును ఊహించగలిగి వుంటే మాత్రం ప్రపంచంలోని బాధలన్నింటినీ కావాలని భుజాల మీద చేర్చుకోవడం వలన అని అప్పుడు తెలుసుకునేవాడిని.

ఒకసారి స్కూలు ఎగ్గొట్టడం వల్ల నోట్సు కోసం వాళ్లింటికి వెడితే గానీ తెలీలేదు వాళ్లుండేది రెండుగదుల పెంకుటింట్లో అని. (ముగ్గురాడపిల్లల పెళ్లిళ్ల భారాన్ని మోయలేనని ఆ ఇల్లు వినేవాడికి, విననివాడికి గూడా మొరపెట్టుకున్నట్టుందని ఆ తర్వాత అనిపించేది.) అప్పుడర్థమైంది సురేష్‌ని కలవడానికయితే లైబ్రరీకి వెళ్లమని శీనుగాడు ఎందుకు చెప్పాడో. సురేష్ వాళ్ల నాన్న ఉద్యోగం తాలూకా ఆఫీసులోనే అయినా అది డబ్బొచ్చే సీటు కాదని కాలేజీ కొచ్చిన తర్వాత శీనుగాడు చెప్పాడు.

ఇంటర్లో కాలేజీ ఫస్టు వచ్చినవాడికి ఏ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ పరీక్షలోనూ ఎడ్మిషన్‌కి సరిపోయే మార్కులు రాకపోవడం కన్నా ఆశ్చర్యకరమైన విషయం వాడు పాలిటెక్నిక్ కాలేజీలో చేరతాననడం.

“ఇంజనీరింగ్ ఎంట్రన్స్‌లో మంచి రాంక్ వచ్చి ఉంటే తల తాకట్టు పెట్టయినా నిన్ను చదివించేవాణ్ణన్నారు మీ నాన్న.” హఠాత్తుగా అన్నాను.

“ఆయనకి తన తలమీద ఎనలేని గౌరవం!” విస్కీగ్లాసు పెదవుల కానించబోతూ అన్నాడు.

“ఐదుగురు పిల్లల్లో పెద్దవాడు గదా అని వాడి చదువుకే తలకు మించిన ఖర్చుపెడితే కూతుళ్ల పెళ్లిళ్లు ఎలా చేస్తార్ట అన్నాడు వాడు,” అన్నాడు శీను చాలా ఏళ్ల క్రితం.

అంతస్తుల ప్రభావం చిన్నప్పుడే తెలిసినందువల్ల సురేష్‌కూ, నాకు మధ్యలో ఉండడం వల్ల కావచ్చు శీనుగాడు మా ఇద్దరికీ క్లోజ్‌గా ఉంటాడు. సురేష్ అభిప్రాయాలు నాకు తెలిసేది మాత్రం శీనుగాడి వల్లనే. నాకు అమెరికా అడ్రస్ చిన్నప్పడే మా ఎఫ్ఆర్‌సిఎస్, లండన్, రిటర్న్‌డ్ డాడీ రాసిపెట్టడం వల్ల సురేష్ వాడి బాధలు నాకు అర్థం కావనుకుంటాడు.

వాడు పాలిటెక్నిక్ పూర్తిచేసి ఎలక్ట్రీషియన్‌గా విజయవాడలో పాల ఫ్యాక్టరీలో చేరేటప్పటికి నేను అదే ఊళ్లో డొనేషన్ కట్టి మా డాడీ నాకు వేసిన పూలబాట– ఇంజనీరింగ్‌లో సగంలో ఉన్నా. ఒకరోజు సినిమాకెడితే అక్కడ కనిపించాడు. వాడి

కొలీగ్ డేవిడ్, అతని చెల్లెలుతో కలిసి. ఆ అమ్మాయి పేరు జాస్మిన్ అని శీనుగాడు చెప్పాడు. మనిషికన్నా పేరే అందంగా తెల్లగా ఉంటుంది.

"డేవిడ్ ఫ్యాక్టరీ ప్రమాదంలో చనిపోకపోయినా జాస్మిన్ని పెళ్లి చేసుకునే వాడేమో," అన్నాడు శీను తర్వాతెప్పుడో.

డేవిడ్ పోయిన తర్వాత అతని తల్లిదండ్రుల్ని ఓదార్చడానికి తరచుగా వాళ్లింటి కెళ్లేవాట్ట. వాళ్లకి మతిస్థిమితం లేకపోతే వీడికేమైనట్టు?

"సానుభూతి చూపించడానికి పెళ్లిచేసుకోనక్కర్లేదని చెప్పాను. ఆ కుటుంబానికి దగ్గరవడానికి అంతకంటే మార్గం లేదనిపించిందన్నాడు," అన్నాడు శీను.

"పెళ్లయిందని చెప్పడానికి కూడా నువ్వు మీ ఇంటికి వెళ్లలేదట?" ఇంటరాగేట్ చెయ్యడానికి ఇన్నేళ్ల తరువాత దొరికిన ఈ అవకాశాన్ని పోగొట్టుకో దలచుకోలేదు.

"విషయం తెలిసిందిగా," అన్నాడు పొడిగా సోఫాలో వెనక్కువాలుతూ.

"పదిమంది ముందూ అరిచీ, ఏడ్చీ, తిట్టడానికి అవకాశం కల్పించలేదని ముందు బాధపడ్డా, ఏడవడానికి, తెగతెంపులు చేసుకోవడానికి వచ్చిన అవకాశాన్ని మాత్రం బాగానే దొరకపుచ్చుకున్నారు. కృష్ణానదిలో ఈత కొట్టడానికని దిగి మునిగిపోయానని అందరికీ చెప్పారు. శ్రాద్ధాలు అవీ కూడా పెట్టారు," అన్నాడు శీనుగాడు. "కూతుళ్ల పెళ్లిళ్లు జరగాలంటే అది తప్ప వేరే మార్గం ఏముంది?" అన్నాడు మళ్లీ వాడే.

చెల్లెళ్ల పెళ్లిళ్లు చేస్తాడు, జీతం డబ్బులతో కాకపోతే వచ్చే కట్నం డబ్బుతో అనుకున్నారు. మతాంతర వివాహమే కాకుండా అత్తమామలను పోషించే భారాన్ని కూడా భుజాన వేసుకున్నాడు! ఇంకేంటి చేసేది?

"నీ పెళ్లికి వద్దామనుకున్నాను–కుదర్లేదు," అన్నాడు ఫైర్‌ప్లేస్ చప్టామీద నేను, నా భార్య ఉన్న ఫోటోని చూస్తూ.

అది ఎంత వరకూ నిజమో కానీ ముందుమాత్రం, నేను వాడు రాకుండా ఉంటేనే బావుంటుందనుకున్నాను– నా పెళ్లిలో మెయిన్ అట్రాక్షన్ వాడి భార్య అవుతుందేమోనని భయపడుతూ. అయితే ఆ అవసరం లేదని అమెరికా భార్య, అమెరికా అత్తమామల హడావుడి చూసిన తరువాత కానీ అర్థం కాలేదు.

"వచ్చేవారం దాకా నువ్విక్కడే ఉంటే సరోజని, పిల్లల్ని చూసేవాడివి," అన్నానే గానీ వాడు ఉండడం లేదని నాకు తెలుసు. అమ్మబాబోయ్! వారం పాటు ఆతిథ్యం ఇవ్వడం నా వల్లకాదు. సరోజ వున్నా ఆ పరిస్థితేం మారదు. తను కూడా వర్కు చేస్తుంది కదా.

"సురేష్ కువాయిట్ వెళుతున్నాట్ట!" పెళ్లికొచ్చిన శీను చెప్పాడు.

"ఆహా!" అన్నానే గానీ ఏడాది తర్వాత సద్దాం హుస్సేన్ కువాయిట్‌ని ఆక్రమించి నప్పుడు కానీ, ఆ తర్వాత అమెరికాలో టీవి ముందు సిఎన్ఎన్‌లో ఇరాక్ మీద గల్ఫ్

వార్‌లో అమెరికా, బ్రిటన్ కలిపి కురిపిస్తున్న బాంబుల వర్షాన్ని చూస్తున్నప్పుడు కానీ ఆ సంగతి గుర్తుకు రాలేదు. పెళ్లయిన కొత్తరోజులు (ఎంత సిటిజెన్ని పెళ్లి చేసుకున్నా అమెరికా చేరేటప్పటికి ఓ ఆర్నెల్ల విరహవేదన అనుభవించాల్సొచ్చింది మరి), పాత జ్ఞాపకాలని ఇండియాలోనే వదిలి రావడం కారణాలు కావచ్చు.

"వాళ్లమ్మాయి పుట్టిన నాలుగోరోజున ఇరాకీ మిస్సైల్ హాస్పిటల్ మీద పడ్డదట. వాళ్లెలాగో కట్టుబట్టలతో జోర్డాన్ పారిపోయి అక్కడినుంచి భారత ప్రభుత్వం దయవల్ల వెనక్కి తిరిగొచ్చారు," అన్నాడు శీను రెండేళ్ల తరువాత గుంటూరులో కలిసినప్పుడు. మా అబ్బాయి పుట్టినప్పుడు ప్రిమెచ్యూర్ డెలివరీ అవడం వల్ల వాడు ఐసియులో నెలరోజులు గడపడం, సరోజ పెయిడ్ లీవ్ తీసుకొని నెలరోజుల పాటు ఇంట్లో కూర్చోవడం, అప్పుడు గుర్తుకొచ్చింది.

"అంతకుముందు నెలరోజుల క్రితమే చెల్లెలి పెళ్లికోసమని డబ్బు పంపిస్తే నేనే తీసుకెళ్లి ఇచ్చాను. మిగిలిన రెండు పెళ్లిళ్లకి కూడా సహాయం చేయకపోతాడా అనే ఆశతో ఉన్నారు వాడి అమ్మానాన్న".

"మరి వీడు పెళ్లికి వెళ్లాడా?" అడిగిన తరువాత కానీ అదెంత చచ్చుప్రశ్నో తెలియలేదు.

"భలేవాడివే! చచ్చినవాడు కనిపిస్తే పెళ్లిలో జనాలు ఝడుసుకోరూ?" అన్నాడు శీను నవ్వేస్తూ. కువాయిట్ వెళ్లి రావడం వలన సురేష్‌కి నష్టమే కానీ ఆర్థికంగా లాభమేమీ లేదన్నాడు శీను.

విజయవాడ కనకదుర్గ గుడికి వెళ్లినా అక్కడ థర్మల్ పవర్ స్టేషన్‌లో పనిచేస్తున్న సురేష్‌కి ఫోన్ చెయ్యడానికి కూడా టైం దొరకలేదు.

"నీ పిల్లలు ఈ దేశం గర్వపడేలా ఉన్నారు," అన్నాడు సురేష్ గోడ మీద మా పిల్లల ఫోటోలు చూస్తూ. వాళ్ల తెలివితేటల మీద కాంప్లిమెంట్ అని ముందు గర్వపడ్డా కానీ అది ఫోటో గదా అని గుర్తొచ్చి తెల్లగా బొద్దుగా ఉన్నారంటున్నాడని అర్థం చేసుకోవడానికి ఓ క్షణం పట్టింది.

"మీ అమ్మాయికిప్పుడు పధ్నాలుగేళ్లు కదూ?" అడిగాను. ఫర్లేదు గల్ఫ్‌వార్ అయి ఎన్నేళ్లయిందో గుర్తుంది.

"ఆ... దగ్గరకు తీసుకుని ఆడించడానికి కుక్కపిల్ల కావాలంటుంది," ఫోటోలో మా అమ్మాయి ఎత్తుకుని ఉన్న తెల్ల పిల్లిని చూస్తూ అన్నాడు.

సిజేరియన్ తర్వాత సగం కూడా కోలుకోకుండా కువాయిట్ నించి పారిపోయే ప్రయత్నంలో ఆరోగ్యం బాగా పాడై అసలు జాస్మిన్ బతకడమే ఆశ్చర్యం అన్నాడు శీను. సురేష్ అప్పుడే వేసక్టమీ చేయించుకున్నాట్ట.

"సత్యం అమెరికా వస్తున్నాడు. వాడిచేత నీకేమైనా పంపించమన్నావా?" చెల్లెలు సుషమ అడిగింది ఒకరోజున ఫోన్ చేసి. అది గుంటూర్లో మెడిసిన్ చదువుతున్నప్పుడు ఇంకో డాక్టర్ని ప్రేమించి పెళ్లి చేసుకోవడం వల్లగానీ, లేకపోతే డాడీ దానిక్కూడా అమెరికా సంబంధం చేసేవారే. డాక్టర్లకి అమెరికా వీసా ఇవ్వకపోవడం వల్ల వాళ్లు గుంటూర్లోనే సెటిలయ్యారు. అందుకే ఇండియా వెళ్లినప్పుడల్లా శీనూని కలవడానికి వీలయ్యేది. పైగా మందుకొట్టడానికి బావగారితో పాటు మంచి కంపెనీ కూడా.

"ఏ సత్యం?" అర్థం కాక అడిగాను.

"అదేరా సురేష్ తమ్ముడు!" అప్పుడు గుర్తొచ్చింది. వాడు సురేష్ చిన్నతమ్ముడని.

"సత్యం కంప్యూటర్ ఇంజనీరింగ్ చదువుకి వాళ్ల నాన్న తలకాయ తాకట్టుపెట్టాడు," అని శీను అని అప్పుడే నాలుగేళ్లయిందా?

"అదేదో ఆ సావిత్రి పెళ్లికి పెట్టచ్చుగా?" సావిత్రి సురేష్ రెండో చెల్లెలు.

"ఈ తాకట్టు వల్ల వాడి చదువై వాడు అక్కల పెళ్లిళ్లు చేస్తాడని ఆశ. అదేదో సామెతుంది చూశావా? ఆకలితో ఉన్నవాడికి ఒక చేపనిస్తే ఒకసారి మాత్రమే ఆకలి తీరుతుంది, అదే, వాడికి చేపలు పట్టడం నేర్పిస్తే జీవితాంతం పనికొస్తుందని? అలా అన్న మాట."

"అంటే ఈ చదువు వల్ల వాడి వలలో అంత పెద్ద చేప పడుతుందంటావా? అయినా అప్పటికి సావిత్రికి వయసు బాగా మీరిపోదూ?"

"ఉన్నది ఒక్క తలే అయినప్పుడేం చేస్తారు?" అన్నాడు శీను.

"వాళ్ల నాన్న వాడి చదువుకి తల తాకట్టు పెట్టాడనుకున్నా. ఏకంగా అమ్మేశాట్ట. పింఛను డబ్బులన్నీ హుష్‌కాకి. అమెరికా రావడానికి మాత్రం సురేష్ తలట ఇప్పుడు తాకట్టుకి- ఐమీన్ వాడి మామగారి ఇల్లట. పాపం, నాలుగేళ్ల పాటు వాళ్ల అత్తగారి ఆరోగ్యం గూర్చి పెట్టిన ఖర్చుల నుంచి ఇప్పుడే కోలుకుంటున్నాడు."

"అదేంటి?" అర్థం కాక అడిగాను.

"వాళ్ల మామగారు పోయిన దగ్గర్నుంచి ఆవిడ ఒంట్లో బాగాలేక హాస్పిటల్ చుట్టూ తిరగడాలు. ఒక ఏడాదైంది ఆవిడపోయి. వాణ్ణి డబ్బులడగడానికి నన్ను పంపించాడు. వాడేమో చెల్లెలు పెళ్లికి ఏమైనా ఇస్తానేమో కానీ తమ్ముడి అమెరికా ప్రయాణానికి నయాపైసా ఇవ్వనన్నాడు. అప్పుడు వాళ్లమ్మ వెళ్లి నువ్విివ్వకపోతే వాడు మాకు మిగలడురా అని ఏడ్చిందట. వాడు ఫోర్మెన్ అయ్యాడని వాళ్లకి తెలిసి ఉంటుందిలే."

"మీ అమ్మాయేమంటోంది-మెడిసినా, ఇంజనీరింగా?" నిశ్శబ్దం భరించలేక అడిగాను. ఎయిర్‌పోర్టు నుంచి వచ్చేటప్పుడు కూడా అంతే. మా మధ్య పెద్దగా మాటలేం లేవు.

"ఏం టెక్నీషియనూ, నర్సూ ఉద్యోగాలు కావా?"

ఆ రెండు ప్రొఫెషన్ల గురించి అంత గర్వపడే వాళ్లు నాకిదే మొదటిసారి తగలడం. జాస్మిన్ నర్సు కోర్సు చేసిందని శీను చెప్పింది గుర్తొచ్చింది.

"నువ్విప్పు డిక్కడున్నావుగా– ఇంజనీరింగు, మెడిసినూ అందుబాటులోకి వస్తాయి," వాడి ప్రశ్నను పట్టించుకోనట్టే అన్నాను.

చిన్న నవ్వు నవ్వి కిటికీలోంచి కనిపిస్తున్న చంద్రుడి వైపు తిరిగి అన్నాడు. "తెలుగు అసోసియేషన్లో నీకు ఇన్ఫ్లుయన్స్ ఉన్నదటగా! నాకు డోనార్ల లిస్టు సంపాదించి పెడతావా?"

"సత్యం పోయాట్టగా?" అర్ధరాత్రి మధ్యలో నిద్రలో తీసుకున్న రిసీవర్లో శీను గొంతు.

"ఏ సత్యం? అయినా రేపొద్దున్న దాకా ఆగచ్చుగా నాయనా?"

"సురేష్ తమ్ముడు!"

నిద్ర మత్తు వదిలిపోయింది. పడుకోబోయే ముందు తెలుగు అసోసియేషన్ వాళ్లు పంపించిన ఇ–మెయిల్ గుర్తొచ్చింది. "పాతికేళ్ల తెలుగు కుర్రాడు రోడ్డు దాటుతూ స్పీడుగా వస్తున్న గార్బేజ్ ట్రక్కు కిందపడి చనిపోయాడు. రిటైరయిన వాళ్ల నాన్నకి ఈ వార్త వినగానే గుండెపోటు వచ్చి ఎడంచేతికీ, కాలుకీ పక్షవాతం వచ్చి పడిపోయాయి. సత్యం అమెరికా వచ్చి ఆర్నెల్లయినా ఉద్యోగం లేక బెంచీ మీద కూర్చున్నాడు. అతని చదువుకి, ఆమెరికా రావడానికి, వాళ్ల కుటుంబం పెద్ద మొత్తంలో అప్పు చేయవలసి వచ్చిందని స్నేహితులు చెప్పుతున్నారు. అతనికి పెళ్లి కావలసిన ఇద్దరు అక్కలున్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి మీ విరాళాలను మాకు పంపితే మేము వాళ్ల కందజేస్తాము," సత్యం అన్న పేరును చదివాను కానీ అది మైండ్లో రిజిస్టరు కాలేదు.

"ఆత్మహత్య అనే పోలీసుల అభిప్రాయమట?" శీను గొంతు మళ్లీ.

నాకన్నా ఇండియాకే వార్తలు త్వరగా చేరుతున్నాయి. అంటే ఆ ట్రక్కు డ్రైవర్ మీద కేసు లేకపోవడమే కాక నష్టపరిహారం ప్రసక్తి కూడా ఏమీ ఉండదన్నమాట.

"అక్కడికొచ్చిన తరువాత ఫ్రెండ్స్ దగ్గర కూడా అప్పు చేశాట్ట. ఆత్మహత్య గురించి కూడా మాట్లాడాడని వాళ్ల రూమ్మేట్స్ పోలీసులకి చెప్పార్ట."

తెలివితేటలు లేనివాళ్లందరూ వాడికి ఫ్రెండ్స్ ఎలా అయ్యారు? ఈ పోలీసు ఇన్వెస్టిగేటర్లకి డిప్రెషన్, ఉద్యోగం లేకపోవడం, అప్పులు చెయ్యడం లాంటి వర్డ్స్ వీళ్లు అందించగానే వాళ్లు కాస్తా సూసయిడ్ అని త్వరగా కంక్లూషన్కి వచ్చి కేసుని క్లోస్ చేసి వుంటారు. ఆ ట్రక్కు డ్రైవర్ ఎంత స్పీడ్లో వస్తున్నాడు, వాడు రెడ్ లైట్ అతిక్రమించాడా లాంటి వేవీ పూర్తిగా విచారించకుండానే... ఎంతైనా థర్డ్ వరల్డ్కి చెందిన వ్యక్తి. వాడి చుట్టాలెవరూ ఇక్కడ లేరు నిలదీసి అడగడానికి. పైగా నోరు తెరిచి ఫ్రెండ్స్ కాస్తా దిక్కుమాలిన ఇన్ఫర్మేషన్ అందిచ్చారు.

ఓ నెల తరువాత శీను మళ్లా ఫోన్ చేశాడు. "నీ కిది తెలుసా? దహనం ఖర్చులకి పోను పాతికవేల డాలర్లు పోగయ్యాయట. సురేష్ చెల్లెలి మొగుడు తన వాటా చెక్కు డైరక్టుగా తన పేరు మీద రాయించుకున్నాట్ట."

ఇది ఇంట్లో మిగిలిన ఒకే ఒక్క మగదిక్కు చెలాయించే అధికారం గావును.

"ఆడపిల్లల పెళ్లిళ్లకి ఏమైనా మిగిల్చాడా మరి?"

"యమకింకరులు, చిత్రగుప్తుడూ, యమధర్మరాజూ కలబోసిన విశ్వరూపం గదా! అత్తమామల్ని కూడా దగ్గరుంచుకొని మరదళ్ల పెళ్లిళ్లు కూడా తనే చేస్తానన్నాడు. మొత్తం డబ్బు కొట్టేయ్యడానికి. సురేష్ పానకంలో పుడకలాగా అడ్డం పడ్డాడు."

"వీడెట్లా వెళ్లాడక్కడి కసలు?"

"ముందెప్పుడూ అనుకోలేదు కానీ, ఇంతడబ్బు వాసన తగిలేటప్పటికి వాడిలోనూ మార్పొచ్చినట్టుంది. ఎట్లా తెలిసిందో కానీ వాడూ వాటా కావాలన్నాడు. ఇవ్వను ఫో– అన్నాడు బావగారు. ఈ డబ్బు పిత్రార్జితం కాదు. కాబట్టి అవసరమైతే కోర్టుకెడతానన్నాడు వీడు. బావగారేమో బండతిట్లు. అన్నయ్య ఇచ్చిన డబ్బుతోనే తన పెళ్లయిందని తెలిసి కూడా చెల్లెలు నోరు విప్పలేదు. వాళ్లమ్మ నన్ను లాక్కెళ్లింది వాడికి నచ్చచెప్పడానికి. వాటా ఇవ్వకపోతే అక్కడ్నించి వీడు కదలనన్నాడు. చివరకి వీణ్ణి వదిలించుకునే టందుకని పదివేల డాలర్లు వాళ్ల నాన్న పేరుమీద చెక్కు రాయించేలా ఒప్పందం కుదుర్చుకొని అందులోనించి రెండు లక్షల రూపాయలు మాత్రం పెద్ద కొడుక్కి వాటా ఇచ్చాడు. ఒకలక్ష సత్యం అమెరికా రావడానికి వీడు పెట్టిన డబ్బు. ఇంకొకటేమో చెల్లెలు పెళ్లికిచ్చిన లక్ష."

"మొత్తానికి వీడు మనుషుల్లో పడుతున్నట్టున్నాడే!" ఆశ్చర్యపోవడం నా వంతయింది. "అయినా వాళ్ల అమ్మా నాన్న పోయిన తరువాత ఆ డబ్బులో వీడికీ వాటా ఉంటుందిగా!"

"వాళ్ల తదనంతరం ఆస్తంతా పెద్దల్లుడికే దక్కేలా విల్లు రాయించారుగా– ఇంకెక్కడుంటుందీ?"

"ఇదిగో నీ సూట్‌కేసు, అందులో పట్టకపోతే నా సూట్‌కేసులో పెట్టినవి ఇవిగో," నా ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ సురేష్.

రెండునెలల క్రితం ఇండియా వెళ్లినప్పుడు కొత్త ఇంట్లోకి కావాలని మా ఆవిడ హైదరాబాద్‌లో కర్టెన్లు కుట్టించింది. వాటి కోసమని ప్రత్యేకంగా ఒక సూట్‌కేస్‌ను కూడా కొనాల్సివచ్చింది. వచ్చేటప్పుడు అనవసరంగా వీటికి ఎక్స్‌ట్రా లగేజ్ కట్టాలే అనుకుంటున్నప్పుడు శీను అన్నాడు.

"సురేష్ మీ ఊరు వస్తున్నాడు తెలుసా?"

విస్కీ ముక్కులోకి పోతే ఎలా వుంటుందో మొదటిసారిగా అప్పుడు తెలుసుకున్నాను.

"వాడు ఐటి కెలా సరిపోతాడు?" తేరుకున్న తరువాత అడిగాను.

"అందర్లానే వాడికీ పవర్‌ప్లాంట్‌లో కంప్యూటర్లలో కొన్నేళ్లుగా అనుభవం ఉంది. ఓ లక్ష పెట్టి ట్రైనింగ్ తీసుకొన్నాడు."

"వాడికి వీసా రావడమే ఆశ్చర్యంగా ఉంది. మరి పెళ్లాం?"

"అత్తమామల్ని పెట్టుకొని కూతుర్తో ఉంటోంది. నర్సుగా పనిచేస్తోంది గనుక మంచంలో ఉన్న మామగారికి సేవ చెయ్యడానికి సులువుగా ఉంటుందని అల్లుడుగారు సహాయం చేశారు."

"అదేమిటి?"

"ఏముందీ? ఇద్దరు మరదళ్ల పెళ్లిళ్ల పేరుతో మామగారి డబ్బు కొంత ఖర్చు చేయించి మిగిలినదంతా తన పేరుకు మార్చుకున్నాడు. తర్వాత తన్ని తగలేశాడు."

సురేష్‌కి ఫోన్ చేసి అడిగాను. కర్టెన్లు తెచ్చిపెట్టగలవా అని– అలా అడగడానికి దాదాపు పదిహేనేళ్లుగా వాడికి ఫోన్ కూడా చెయ్యలేదన్న సంగతి నన్ను మొహమాట పెట్టలేదు. అయినా వాడేమైనా మోస్తున్నాడా? ఎలాగో హైదరాబాద్ మీంచే రావాలాయె! అలాంటప్పుడు మా ఇంటికొచ్చి సూట్‌కేసు తీసుకెడితే ఏమైంది? పైగా ఎయిర్‌పోర్టుకి వెళ్లి పికప్ చేస్కుంటున్నాగా!

* * *

ఆ రోజు వచ్చిన మెయిల్ చూస్తుంటే చేతివ్రాతతో ఉన్న నా అడ్రస్ చూస్తే ఆశ్చర్యమేసింది. ఈ కాలంలో నాకు ఉత్తరాలు రాసేవాళ్లెవరున్నారా అని! కవర్ సైజు వాలకం చూస్తే అది అమెరికా సరుకేనని స్పష్టంగా తెలిసిపోతోంది. ఫ్రం అడ్రస్ సురేష్ అని ఉంది.

వాడు అమెరికాకి వచ్చి రెండేళ్లయిందని నిన్ననే గుర్తొచ్చింది– "కొని రెండేళ్లయినా అప్పుడే ఈ కర్టెన్లు పాతబడిపోతున్నాయ్," అని సరోజ అన్నప్పుడు.

"వీడు కూడా తమ్ముడిలాగే బెంచి మీద కూర్చున్నాడని వాడి భార్య, అమ్మా, నాన్న ఆందోళన పడుతున్నార్రా," అన్నాడు ఫోన్లో శీను సురేష్ వచ్చిన రెణ్ణెల్లకి. అప్పటికే ఈ కారణంగానే ఒకడు ఆత్మహత్య చేసుకున్నాడనుకుంటున్నారు. నాకూ భయమేసింది ఏ క్షణానయినా వాడు నన్ను డబ్బు అడగవచ్చుని.

ఎక్కువ రోజులు అలా భయపడనక్కర్లేకుండానే వాడి దగ్గర్నుంచి ఇ–మెయిల్ వచ్చింది. మాకు నాలుగ్గంటల దూరంలో ఉండే ఒక పవర్‌ప్లాంట్‌లో సూపర్‌వైజర్‌గా జాయిన్ అయ్యాడని చెపుతూ.

"వీడక్కడ ఉద్యోగమేమైనా చేస్తున్నాడంటావా? ఇక్కడ వాడి కుటుంబ పరిస్థితిలో మార్పేమీ లేదు," అన్నాడు శీను మొన్నామధ్య మాట్లాడినప్పుడు.

ఇప్పుడీ ఉత్తరం.

“ఇంతకీ ఉత్తరం నీకు రాయలేదన్నమాట!” అన్నాడు శీను ఫోన్లో. అర్ధరాత్రి వేళ నిద్రలేపినందుకు విసుక్కుని వున్నా ఫోన్లో మొహాలు కనిపించవుగదా.

“టెక్నికల్‌గా నాకే రాసినట్టనుకో, తెలుగు అసోసియేషన్ ప్రెసిడెంట్‌ని నేనేగా!”

“కాకపోతే రాసేవాడు కాదేమోలే,” అన్నాడు సాలోచనగా.

“అమెరికాలో రెండేళ్లుండగానే ఇండియాలో స్థలాలు, అపార్ట్‌మెంట్లు కొన్నవాళ్లు, భార్యా, పిల్లల్ని అమెరికా తెప్పించుకున్నవాళ్లూ మాత్రమే నాకు తెలుసు ఇప్పటిదాకా,” అన్నాన్నేను.

“దహనం ఖర్చులతో కలిపి 30 వేల డాలర్లు మీ అసోసియేషన్‌కి అప్పగించడానికి ఈ మూడేళ్లు కష్టపడ్డాడన్నమాట!”

దుఃఖానికి, పొట్ట చెక్కలయ్యేలా నవ్వుకి తప్ప నా కళ్లల్లో నీళ్లు తిరగడం నాకిప్పటిదాకా తెలియదు.

“ఎవరి విరాళపు డబ్బులు వారికి ఇచ్చేద్దామనుకున్నాట్ట. కానీ నేను వాడికి ఇచ్చిన డోనర్ల లిస్ట్‌లో అందరి వివరాలు సరిగా లేక ఆ పని చెయ్యలేకపోయాట్ట. అందుకని మా అసోసియేషన్‌కి ఇచ్చి, సత్యంలాంటి వాళ్లని ఆదుకోవడానికి ఇంకా కావాలంటే చెప్పమన్నాడు.”

“మొత్తానికి వాడికి డబ్బు వాసన వేసిందని మూడేళ్ల క్రితం అనుకున్నాగానీ, డబ్బుకు ఈ వాసనకూడా ఉంటుందని నాకు తెలియదు. ఇప్పుడు గుర్తుకొస్తోంది. ఇంజనీరింగ్ ఎంట్రన్స్‌లో వాడికి మంచి ర్యాంక్ రాకపోవడం వాడు కావాలని ఎంట్రన్స్ సరిగ్గా రాయకపోవడం వల్ల. సీటొచ్చేలా రాస్తే వాళ్ల నాన్న నిజంగా తలతాకట్టు పెట్టేస్తాడని భయపడి.” అన్నాడు శీను.

వాడు జీవితంలో నిచ్చెనెక్కినప్పుడల్లా ఓ పాము కాటేస్తూనే ఉంది. 30 వేల డాలర్ల బొక్కలో ఉండడంవల్ల వాడు పెద్ద పాము వేటుకు గురయ్యాడని శీనుకి ఫోన్ చేసే ముందు అనిపించినా నేనూహించనంత పెద్ద నిచ్చెన ఎక్కాడని ఇప్పుడు ఒప్పుకోక తప్పడంలేదు. నా భయమల్లా వైకుంఠపాళిలో అంత పెద్ద నిచ్చెనెక్కి పైకి చేరగానే పక్కనే ఉంటుంది పొడవైన పాము పడగ విప్పుకొని!

ఆలోచించగా ఆలోచించగా నా అనాలజీ తప్పనిపిస్తోంది. వాడి శక్తి సామర్థ్యాల మీద నాకిప్పటికి నమ్మకం కుదుర్తోంది. వాడు నాకు తెలిసిన టెన్సింగ్ నార్కే. ఎంతో ఎత్తయిన కొత్త కొత్త శిఖరాలను అధిగమిస్తూనే ఉంటాడు. ఏ పాము పడగన్నా, ఏ కొండ చరియన్నా వాడికి భయం లేదు. వాడి విజయానికి నేను మనసులో చప్పట్లు కొడుతూనే ఉంటాను. గొప్పవాళ్ల విజయాలకి అసూయ పడలేనప్పుడు, వాళ్ల స్థాయికి చేరుకోవాలని అనుకోవడానికి కూడా భయమేసినప్పుడు, చెయ్యడానికి మిగిలింది చప్పట్లు కొట్టటమేగా!

(నవ్య వీక్లి, జులై 26, 2006)

# పంచముఖి

**శ్రీ మాతా..**

"అమ్మను వదిలిపెట్టి ఇంతకాలం ఎట్లా ఉన్నావురా?"

"... ..."

"ఇంజనీరింగ్‌కని వెళ్లినప్పుడు నాలుగునెల్లపాటు నిన్ను చూడకుండా ఉండడానికి అలవాటుపడ్డాను. ఇప్పుడు రెండేళ్ల కొకసారి వస్తావు. పట్టుమని నెలరోజులు కూడా ఉండవు. నాకు జబ్బు చేసినప్పుడు మళ్లీ నిన్ను చూస్తాననుకోలేదు."

"జాగ్రత్తేవ్. వాడి చొక్కాకి నీ కాటుక అంటుతుంది. అది పోనుకూడా పోదు. ఈసారి ఫ్లైట్ కనెక్షన్లేవీ మిస్సవ్వలేదుగా! అందుకని పూర్తిగా నెలరోజులు ఇక్కడే ఉంటాడ్లే."

"మాతా, మరప్పుడెందుకే వాడికి పెళ్లి చేస్తానంటావు? పెళ్లైన తరువాత రెండేళ్ల కొకసారైనా వస్తాడంటావా?"

"రాకపోతే పెళ్లాం ఊరుకుంటుందేమిటి? ఏడాది తిరిగేసరికి మొట్టి లాక్కొస్తుంది."

"అంత ఖచ్చితంగా చెబుతున్నావేమిటి మాతా?"

"లోక సహజం నాయనా!"

"అమ్మా, నాన్నని మొట్టి ఎప్పుడైనా అమ్మమ్మా వాళ్లింటికి తీసుకెళ్లావుటే?"

"మీ నాన్నని మొట్టి తీసుకెళ్లడమా? ఆయనకంత అదృష్టమెక్కడ?"

"నాన్నకి నీ చేత మొట్టికాయలు తినేటంత అదృష్టం కూడా లేదా?"

"మొట్టికాయలు తినే అదృష్టం గురించి కాదురా నేనంది. అత్తారింటికి వెళ్లే అదృష్టం గురించి. అక్కడ ఈయనకి పెట్టడానికి ఏముంది, ఈయనకి మొట్టికాయలు వేసన్నా తీసుకువెళ్లడానికి! అయినా ఈయనెప్పుడూ సెలవు లేదనడమే. ఏదో వీడొస్తున్నాడని నెలరోజులు ఇప్పుడు సెలవుపెట్టారు కానీ!"

"సెలవులు పెడుతూ కూర్చుంటే ఈ సంసారాన్నెలా ఈదుకొచ్చేవాణ్ణి?"

"నెల చివరికొచ్చేసరికి ఎప్పుడూ కటకటే. అరిచి గీపెట్టినా నయాపైసా ఇచ్చేవారు కాదు. ఒకటో తారీకు వచ్చేదాకా ఆగాల్సిందే!"

"నీళ్లు పోసుకుని మార్కెట్ కెళ్లి కూరలు తీసుకొస్తాను. మీకు అక్కడ దొండకాయలు దొరుకుతాయిరా?"

"నాన్నా, ఇప్పుడు అమెరికాలో అన్నీ దొరుకుతాయ్."

"ఈ చిన్నాడు చూడు, తను అమెరికా వెళ్లొచ్చినట్టు మాట్లాడతాడు."

"అమెరికాలో జరిగే ప్రతి విషయమూ తెలుసుకోవడానికి అక్కడికే వెళ్లనక్కర్లా. అయినా వీడు ఉత్తరాల్లో రాశాడు కదా!"

"వాడికి దొండకాయలు కాదు, కాకరకాయలంటే ఇష్టం. కారం పెట్టి కాయలక్కాయలు చెయ్యమంటావా లేక ఉల్లిపాయ వేసి వేపుడు చేసేదా?"

"మాతా, ఉల్లిపాయలు వేసి వేపుడు చెయ్యి."

"నువ్వుండరా. వాడికి కాయలక్కాయలంటేనే ఇష్టం."

"ఇంక ఈ నెలరోజులూ నీకిష్టమైన వంటలే నాయనా!"

"మరీ వేషాలు వేస్తున్నావు– అక్కడికి నీ కిష్టమైనవేవీ చెయ్యనట్టు! పొద్దున్నే ఎవరా ఫోన్ చేస్తోంది?"

"ఇంకెవరూ ఆ పిడబ్ల్యుడి ఇంజనీర్‌గారయ్యుంటాడు. దాదాపు వారం రోజుల్నుంచీ నువ్వెప్పుడొస్తావా అని నిముషాల్లెక్క పెడుతున్నాడు. రోజూ ఫోన్లే."

"ఆ..ఆఁ ఇప్పుడే వచ్చాడు. ఇవ్వాళా? వాణ్ణొకసారి కనుక్కొని చెబుతాను."

"ఏవిటా దూకుడు? కొద్దిగా గౌరవమిచ్చి మాట్లాడ్డం నేర్చుకో!"

"పిడబ్ల్యుడి ఇంజనీర్‌గారు ఇవ్వాళ వస్తారా పిల్లని చూసుకోవడానికి అని అడుగుతున్నారు. ఏమే, ఇవ్వాళ పెళ్లి సంబంధం చూద్దామంటావా?"

"ఇవ్వాళ నేనెక్కడికీ వెళ్లను. మధ్యాహ్నం నిద్రపోవాలి."

"అవ్వా కావాలి, బువ్వా కావాలంటే ఎలా కుదురుతుంది నాయనా? ఈ నాలుగు వారాల్లో పెళ్లి చేసుకొని వెళ్లాలంటావ్."

"మాతా, వచ్చే సంబంధాలన్నీ ఇంజనీర్లగారివీ, డాక్టర్లగారివీ కదా, ఆ రాబోయే కోడలు నిన్ను సరిగ్గా చూస్తుందంటావా?"

"నన్నెట్లా చూస్తే నాకేం నాయనా? మీరు సుఖంగా ఉండడమే నాకు కావాల్సింది."

"ఇంతకీ నీ థీసిస్సేదో ఎప్పుడయ్యేట్లు?"

"వెనక్కి వెళ్లిన తరువాత రెండు మూడు నెలల్లో అవుతుంది."

"నువ్వు లలితా సహస్రనామాలు పారాయణం చేస్తున్నావురా?"

"... ..."

"మాతా, ఎందుకే అలాంటి ప్రశ్నలడిగి వాణ్ణి ఇబ్బంది పెడతావు? క్రితంసారి వచ్చినప్పుడు చెప్పాడుగా, చెయ్యట్లేదని!"

"అక్కడ చెయ్యకపోతే చెయ్యకపోయావు గానీ, ఇక్కడున్నన్నాళ్లు కొద్దిగా పారాయణం చెయ్యి ఏం? మాకు తృప్తిగా ఉంటుంది."

"మాతా, ఎప్పుడు మీ తృప్తిగూర్చేనా, వాడి తృప్తి గూర్చి మాట్లాడవేం?"

"వాడు బాగుంటే మాకొక్కరికేనా తృప్తి? వాడికుండదా ఏం? మేమేం చెప్పినా మీ బాగుకోరే నాయనా."

"అవున్నాయనా, పెద్దలమాట చద్దిమూట అంటారు. మనింట్లో అది ఇడ్లీల మూట!"

"అదేంటి?"

"రోజూ ప్రొద్దున టిఫిన్. ప్రతిరోజూ అవే తినీతినీ విసుగొస్తోంది. లేకపోతే దిబ్బరొట్టె."

"ఇప్పుడదైనా ఉంది. వాడి చిన్నప్పుడు అవ్వెక్కడున్నాయ్? చద్దెన్నం తిని స్కూల్ కెళ్లేవాడు. ఇంటికొచ్చిన తరువాత తినడానికి ఏమైనా ఉన్నయ్యోమోనని డబ్బాలు వెతుక్కొనేవాడు వెధవ. చివరికి గోధుమపిండిలో పంచదార కలిపి ఇచ్చేదాన్ని. సరే కానీ, నీళ్లు కాగేవుంటాయ్. పోసుకో. బడలిక తీరుతుంది. ఈలోగా పాలు వస్తే కాఫీ పెట్టి ఇస్తా. ఒరేయ్ చిన్నోడా, నీళ్లు వదిలారేమో చూడు."

"ఇంకా ఆ బిందెల్తో నీళ్లు మోస్తున్నావా అమ్మా?"

"లేకపోతే జరిగేదెట్లా నాయనా? తాగడానికీ కావాలి, గుడ్డలుతుక్కోవడానికీ కావాలి."

"మాతా, నీళ్లొస్తున్నాయ్. ఆ బిందెటిలివ్వు. బోరింగ్ కొడతాను."

"అదేమిటీ, క్రితంసారి మోటార్ ఉండేదికదా."

"నా బొంద. దానికెప్పుడూ రిపేరే. పైగా కరెంటుఖర్చు. అందుకని, ఇంటాయన దాన్ని పీకేసి బోరింగ్ వేయించాడు."

"క్రితంసారి వచ్చినప్పుడు నువ్వట్లా నీళ్లబిందెల్ని మోసుకొంటూ ఇంట్లోంచి తిరుగుతుంటే భయమేసేది– తడినేల మీద ఎక్కడ జారిపడతావోనని."

"తప్పేదేముంది నాయనా? సందులోంచి తిరగాలంటే దూరం. పైగా రాళ్లు గుచ్చుకుంటాయి."

"పోనీ, నేను బోరింగ్ కొడతా. నువ్వు నీళ్లు మొయ్యరా."

"అమెరికా నుంచి ఇప్పుడేగా దిగావ్? రెండ్రోజులాగు!"

"నువ్వేం చెయ్యక్కర్లా, నువ్వు లేనప్పుడు మేం చేసుకోవట్లేదా ఏమిటి? అసలే రేపో మాపో పెళ్లిచేసుకోబోతున్నవాడివి. ఇప్పుడేం కొని తెచ్చుకోకు నాయనా."

"అదేదో నీక్కానీ, వాడిగ్గానీ అయితే ఫర్లేదా?"

"ఇదుగో, రెటమతంగా మాట్లాడకు."

"కోడలు చేత నీళ్లు మోయిస్తావటే?"

"కోడలా? చెప్పుచ్చుకొంటుంది. అయినా ఇక్కడుంటుందా పెడుతుందా? పెళ్లవగానే అమెరికా వెడుతుందిగా!"

* * *

**సంప్రదాయేశ్వరీ సాధ్వీ-**

"ఏవిటమ్మా, రెండ్రోజుల్లో పెళ్లి పెట్టుకొని ఇప్పుడా రావడం?"

"నువ్వొచ్చి నన్నేమైనా తీసుకొచ్చావా, గదమాయిస్తున్నావ్?"

"రోజుకో సంబంధం చూడ్డంతోనే సరిపోయింది. అన్నీ నీకు నచ్చే పేర్లే. శారద, కాత్యాయని, గాయత్రి, లక్ష్మి, రమ, ఇంతలోనే పెళ్లి."

"పోన్లే నాయనా, నీ పెళ్లి చూడకుండా హరీ అంటానేమోనని భయపడ్డాను."

"అప్పుడే సంతోషపడకు, ఇంకా రెండ్రోజులుంది పెళ్లికి."

"ఎంత మాట పడితే అంతమాట అనడమేనా, పెద్దా, చిన్నా తారతమ్యం లేకుండా పోతోంది."

"కోప్పడకే, చంటి వెధవని. వాడేదో జోక్ చేశాడంతే."

"ఇరవయ్యేళ్లొస్తున్నాయ్. బుద్ధీ, జ్ఞానముండక్కర్లా?"

"అమ్మమ్మా, నువ్వు నా పెళ్లి చూడకుండా పోవడానికి వీల్లేదు. నీ కోసమని నేను కనీసం నలభయ్యేళ్లొచ్చేదాకా పెళ్లే చేసుకోను."

"నా బంగారుకొండవిరా, చూడవే, వాడి మనసు తెలుసుకోకుండా అనవసరంగా వాణ్ణి తిట్టావు. అమెరికా మనవడా, నాలుగేళ్లయ్యిందిరా నిన్నుచూసి. అమెరికానుంచి మొదటిసారి వచ్చినప్పుడు మా ఊరొచ్చావ్. క్రితంసారి రాలేదు."

"మీ ఊరికి రావడానికీ, తిరిగి రావడానికే రెండ్రోజులు ఖర్చవుతాయ్. ఆ టైంలో అమెరికా వెళ్లి తిరిగికూడా రావచ్చు. నువ్వే వచ్చుంటే బావుండేది."

"ఎక్కడొస్తుందిరా? ఆవిడకీ ఒంట్లో బావుండట్లేదు. మొదటిసారి ఏదో నా మాట విని వెళ్లావ్. క్రితం సారి అదీలేదు."

"కాదులేవే, మా అద్దె ఇంట్లోనేమో పాతకాలం మరుగుదొడ్లాయె. అప్పుడు వచ్చినప్పుడు ఆ రెండు పూట్లకే కష్టపడ్డాడు. అందుకే క్రితంసారి రాడనే అనుకొన్నాను."

"అదేంకాదు. మొదటిసారి వచ్చినప్పుడు వద్దంటున్నా వినకుండా బట్టలు పెట్టారు."

"మరీ బావుందిరా. పెద్దమనవడివి, రాకరాక వస్తే ఆ మాత్రం పెట్టకపోతే ఎట్లా?"

"అప్పు చేశా?"

"అవసరమైతే అప్పో సప్పో చెయ్యక తప్పేదేముంది?"

"అది అవసరం కాదు. అవసరం అంటే అది మామయ్య కూతురికి స్కూలు యూనిఫాం కుట్టించడం."

"సర్లే, అవి ఎప్పుడూ ఉండేవే."

"అందుకేనేమో, నాన్న కూడా మీ ఇంటికి రానిది."

"అది మా ఖర్మ నాయనా, దానికెవరేం చేస్తారు?"

"ఏరా, అమ్మమ్మ ఇక్కడున్నంతసేపూ ఆవిడతో పోట్లాడుతూనే ఉంటావా?"

"అది కాదమ్మా, నేనొస్తున్నానని ముందే తెలుసుకదా. నేను రాగానే రావచ్చుగా?"

"బావుందిరా. వచ్చి నెల్లాళ్లు అల్లుడినెత్తి మీద కూర్చొమ్మంటావా? ఆయనసలే నెలరోజులు సెలవు పెట్టి నీ కోసం ఇంట్లో ఉంటున్నారు."

"సరేలే, నువ్విక్కడ రెండ్రోజులు మాత్రమే ఉండడం నీకే నయం. లేకపోతే ఆయన వచ్చినప్పుడల్లా నేల మీద కూర్చున్నదానివల్లా లేచి నిలబడి ప్రాణాన్ని ఎంతో హైరానా పెట్టుకొంటావ్."

"ఆవిడకీ జీవితమంతా హైరానే నాయనా. నల్గురాడపిల్లలు, నలుగురు మగపిల్లలు. కొంతమంది పోయారు. తేరుకొనేలోగా మీ తాతయ్యే పోయారు."

"ఆయన పోయేసరికి ఇద్దరాడపిల్లల పెళ్లిళ్లన్నా అయ్యాయి. అంతవరకూ నయం. ఆస్తులా, పాస్తులా?"

"అమ్మమ్మా, నువ్వు పోయిన పన్నెండోరోజున అందరూ ఏమంటారో తెలుసా? 'ఆవిడ జీవితంలో ఒక్కరోజైనా సుఖం అనుభవించింది లేదుకానీ, ఆవిడ పిల్లలు వృద్ధిలోకి వచ్చి ఇవ్వాళ ఈ కార్యక్రమాన్ని ఘనంగా చేయించారు' అని."

"ఏం ఘనమో నాయనా. దానికీ మీ మామయ్యలకి మళ్లీ అప్పు చెయ్యడం తప్పదు. తీసుకొని తీసుకొని ఏ ఆస్పత్రిలోనో పోకుండా ఉంటే చాలు."

"ఇంక చావుల మాట ఆపుతావా, నీ నోరు కుట్టెయ్యమంటావా? ఏవిటా మాటలు, శుభకార్యం ఇంట్లో పెట్టుకొని?"

"నీ ఆరోగ్యం ఎట్లా ఉంటోందిరా?"

"అబ్బబ్బ, అమ్మమ్మా! ఎప్పుడు కలిసినా నా ఆరోగ్యం గురించి అడగడం మానవా?"

"ఎందుకురా ఆవిడ మీద అంత విసుక్కొంటావ్? నువ్వు పొత్తిళ్లలో ఉండగా ఆవిడ నీకు ఎంత సేవ చేసిందో తెలుసా? మూడేళ్లప్పుడు జబ్బుచేసినప్పుడు నువ్వు మాకు దక్కవనే అనుకొన్నాం. మందులా మాకులా? కాంపౌండర్ ఇచ్చిన రంగునీళ్లు పొయ్యడాలు, కక్కులు, విరోచనాలు తుడవడాలూ ఆవిడకేగా? నేనేమో అప్పుడు నీ తర్వాత పుట్టిపోయిన పిల్లాడిని కడుపుతో ఉన్నాను. అప్పటికి ఆవిడ మాకు దగ్గరగా ఉండబట్టి సరిపోయిందిగానీ, లేకపోతే నువ్వేమయ్యుండేవాడివో ఎవరికి తెలుసు?"

"వాణ్ణి అంత కోప్పడకే. నా ముద్దుల పెద్దమనవడు. నువ్విప్పుడు అనవసరంగా కళ్లనీళ్లు పెట్టకు."

* * *

**రమా రాకేందువదనా రతిరూపా రతిప్రియా–**

"రమాదేవి గారూ! ఓ రమాదేవిగారూ!"

"... ..."

"ఓ రాకేందువదనా!"

"... ..."

"ఓ రతిప్రియా!"

"అక్కడికి తమరేదో రతిప్రియులు కానట్టు!"

"మెలకువగానే ఉండి నిద్ర నటిస్తున్నారన్నమాట. ఈ పాతికేళ్లలో తమరు నా గూర్చి తెలుసుకొన్న దింతేనా? నేను రతీప్రియుణ్ణి కూడా."

"తమరు రతీప్రియులు కాదని ఖచ్చితంగా తెలుసు."

"అంత ఖచ్చితంగా నేను మన్మథుణ్ణి కాదని చెప్పారంటే తమరింకెవరితోనో... ఎవడు వాడు?"

"తమరు మన్మథులైతే తమరి వెంట స్త్రీ జనం గుంపులు గుంపులుగా ఉండాలి కదా!"

"లేరని తమరెట్టా అనుకొన్నారు?"

"పాతికేళ్లల్లో చొక్కామీద ఒక లిప్‌స్టిక్ మరకైనా లేదు. క్రెడిట్ కార్డు బిల్లుల్నిండా అన్నీ నా ఖర్చులే."

"ఇంకా నువ్వేదో అమాయకురాలి వనుకొన్నాను. నామీద డిటెక్టివ్ వర్కు బాగానే చేశావన్నమాట. అక్కడే పప్పులో కాలు వేశావు. నేనెన్ని జాగ్రత్తలు తీసుకొంటానో ఇప్పుడైనా తెలిసిందా? కాలేజీ రోజుల్లో ముఖ్యంగా అమెరికాలో– నా కెంతమంది గర్ల్‌ఫ్రెండ్స్ ఉండేవాళ్లో నీకు తెలియదు కదా! ఎప్పుడు చూసినా ఇ–మెయిల్స్‌లోనూ, టెక్స్ట్ మెసేజీలతోనూ బిజీగా ఉండేవాణ్ణి."

"ఓ మన్మథుడుగారూ! తమరు అమెరికాలో చదివిన రోజుల్లో ఇళ్లల్లో కంప్యూటర్లే లేవు. పైగా, ఇ–మెయిల్స్ అసలే లేవు. అపర్ణ పుట్టిన అయిదేళ్లదాకా సెల్‌ఫోన్లు లేవు."

"ఎంత వద్దనుకొన్నా నా వయస్సు గుర్తుచేశావు. అప్పుడే మన పెళ్లయ్యి పాతికేళ్లయ్యిందా? థాంక్యూ."

"కార్డు బావుందా?"

"కార్డుకే కాదు థాంక్యూ చెప్పింది. పాతికేళ్లపాటు నన్ను కనిపెట్టుకొని ఉన్నందుకు."

"... ..."

"ఆశ్చర్యమేస్తోంది. పాతికేళ్లు, అరుచుకొన్నా, అలిగినా, పోట్లాడుకొన్నా, మాట్లాడుకోకపోయినా– పిల్లల్ని స్కూల్లో దించడం, డాక్టర్ల అప్పాయింట్‌మెంట్లు, ఇంట్లో రిపేర్లూ–"

"తమరేమో బిజినెస్ ట్రిప్పులని ఊరేగడాలూ..."

"పెళ్లయినప్పుడు నాకేమనిపించిందో తెలుసా? నిన్నూ, నన్నూ ఒక పడవలో పడేసి, రెండు తెడ్లు చేతికిచ్చినట్లు. పడవ ఎటు పోతోందో తెలియదు. నీటి ప్రవాహపు ఉరవడి ఎప్పుడనుకూలంగా ఉంటుందో, ఎప్పుడు బోర్లా కొట్టిస్తుందో తెలియదు. పడవకి చిల్లిపడదన్న గారంటీ లేదు. ఎదురీదాల్సొస్తుందేమోనని అనిపించినప్పుడు అరుపులూ, కేకలూ, నీకేవి తెలియవు ఈ విషయాలు."

"ఎప్పుడన్నా చెబితే కదా తెలిసేది!"

"నాకాశ్చర్యకరమైన విషయమేమిటంటే, మా అమ్మలాగా నాకు కావల్సినవి చేసి పెడతావు, మళ్లీ అపర్ణ మీద కేకలు వేసినట్లుగా నా మీద కూడా అరుస్తావు. నువ్వు రకరకాల పాత్రల్లో జీవిస్తుంటావ్ కానీ నేనే ఎప్పుడూ మొగుడి పాత్రలో పాతుకుపోయా ననిపిస్తుంది."

"మరీ భారీ డైలాగు లాపండి. మంచం బరువు తట్టుకోలేనంటోంది. నీళ్లు పోసుకొని, పూజ కూడా చేసుకొని పక్కమీది కెక్కినట్టున్నారు తమరు?"

"పురుషార్థప్రదా పూర్ణా అంటూ లలితా సహస్రనామాల్ని మా అమ్మ మెచ్చేలా చదివాను. ఆవిడ కాస్తా ఆ నాలుగిట్లో ఒకదాని సిద్ధికోసం మీ అమ్మచేత రమాదేవి అన్న కన్యని నీకు పాతికేళ్ల క్రితం అందజేశాను కదా అని చెప్పింది. జ్ఞానోపదేశం అయి ఇలా వచ్చాను."

"ఈ మాటల్ని మీ అమ్మ వింటే పెడర్థాలు తీస్తున్నారని బాగా తిడుతుంది."

"అంతకుముందు మా అమ్మ చేసిన సేవలేవీ నాకు గుర్తులేవు కానీ, నాకు దాదాపు పదేళ్లువచ్చిన దగ్గర్నుంచీ మా అమ్మతో సంభాషణ చాలా మితంగా ఉండేది. 'వర్షంలో తడవకు, ఎండలో తిరగకు, హెూం వర్క్ పూర్తిచేశావా, చెడు సావాసాలు చెయ్యకు. మీ నాన్నకి కోపం తెప్పించకు, నీళ్లు పోసుకొని పూజచేసుకో, నీ కిష్టమని లడ్డు చేశాను.' అనేవి మా అమ్మ స్టాక్ డైలాగులయితే, 'అమ్మా, నాకు బాదుషా చేసిపెట్టు. సైకిల్ కొనిపెట్టు, కొత్త చెప్పులు కావాలి, సినిమాకి డబ్బులియ్యి' అనేవి నాడైలాగ్స్. అమెరికా వచ్చిన తరువాతయితే, 'సరిగ్గా తింటున్నావా, ఏం చేసుకుంటున్నావో ఏమో, ఆరోగ్యం జాగ్రత్త' అని ఆవిడా, 'పళ్లు బాగా తిను. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో, డాక్టరు దగ్గరకు వెళ్లడం అశ్రద్ధ చెయ్యకు' అని నేను. ఇదేనా లైఫంటే?"

"పాతికేళ్లలో నాతో తమరి డైలాగు లేమిటటా? 'పిల్లల చేత హెూంవర్కు చేయించావా, సంగీతానికి తీసుకెళ్లావా, డాక్టర్ అపాయింట్‌మెంట్ తీసుకో, రిపేర్‌మేన్ ఒంటి గంటా, నాలుగు మధ్యలో వస్తానన్నాడు' ఇవ్వేగా?"

"అపర్ణ కూడా అడుగుతూనే ఉండేది. 'ఏవిటి డాడీ, నువ్వు బిజినెస్ ట్రిప్పుకి వెళ్లినప్పుడు కూడా హోంవర్కు గూర్చే అడుగుతుంటావ్' అని."

"లైఫు రొటీనైపోయింది."

"ఇంక నుంచీ రొటీన్ డైలాగుల్ని ఒక్క స్త్రీకే పరిమితం చేస్తా."

"ఎవరా స్త్రీ?"

"సర్వశక్తిమయి, సర్వమంగళ, సద్గతిప్రద."

"మరి ఈ స్త్రీ సంగతేవిట్ట?"

"వస్తున్నా. ఆ పనిమీదే ఉన్నా. ఆవిడ ఒసగిన పురుషార్థాల్లో దేనిని ఉపయోగించు కోకపోయినా ఆవిడకి కోపం వస్తుంది. కోపం ఆవిడకి వచ్చినా ఈవిడకి వచ్చినా ప్రమాదమే కదా! ఎవరికీ కోపం రాకుండా ఉండడానికే ఈ ప్రయత్నమంతా. హాపీ యానివర్సరీ."

* * *

**అపర్ణా చండికా–**

"ఏమయ్యారు పిల్లలు? టీనేజర్లయిన దగ్గర్నుంచీ మరీ కనిపించకుండా పోతున్నారు."

"తమరేం చేసేవారో టీనేజర్‌గా ఉన్నప్పుడు?"

"ఫ్రెండ్స్‌తో తిరిగి, భోజనం టైంకి ఇంటికి చేరుకొనేవాణ్ణి. ఇల్లంటే లాడ్జింగ్, బోర్డింగ్‌ల క్రింద తయారైంది. పాపం, మా నాన్న! మన పెళ్లికని వచ్చినప్పుడు అసలు సెలవే పెట్టని మనిషి నెలరోజుల పాటు సెలవు పెట్టారు. నాకేమైనా పట్టిందా? పొద్దున్నే ఇంట్లోంచి వెళ్లడం, భోజనానికి ఇంటికి రావడం, మళ్లీ ఇంట్లోంచి వెళ్లడం, రాత్రి తొమ్మిదింటికెప్పుడో ఇంటికి రావడం."

"మరింకేం? పిల్లలు అచ్చంగా తండ్రి పోలికేనన్నమాట!"

"ఇవ్వాళ మన యానివర్సరీ– అది కూడా సిల్వర్‌జూబ్లీ అని వాళ్లకి గుర్తుండక్కర్లా?"

"అసలు తమరికి గుర్తుందో, లేదోనని నాకనుమానమే– ఇవాళ నిద్రలేచేదాకా, పైగా, బిజినెస్ ట్రిప్పునుంచి రాత్రేగా ఇంటికి వేంచేసింది? ప్రొద్దున్న తమరు నిద్రలేచి కిందికి దిగి వెళ్లడం నాకు తెలుసు. మళ్లీ తమరు మంచం ఎక్కి మాట్లాడేదాకా ఈయన ఇంతే అని నిరాశతో ఉన్నా."

"ఆఖరికి రెస్టారెంటుకి వెళ్లడానికి కూడా వీల్లేకుండా వీళ్లింట్లో ఈ పార్టీ. ఇవాళే పెట్టుకోవాలా?"

"వాళ్లబ్బాయి గ్రాడ్యుయేట్ అయిన తర్వాత ఇండియా వెళ్లాడు కదా! అందుకని ఈ పార్టీ ఇవ్వడానికి వాళ్లక్కూడా ఇప్పుడే కుదిరింది. అయినా కంప్లైంట్ చేస్తున్నారంటే ఆశ్చర్యంగా ఉందే! మీ బెస్ట్ ఫ్రెండ్ కదా!"

"అందుకేగా, మాట్లాడకుండా వస్తోంది. పిల్లలయితే అయిపే లేరు."

“పిల్లలు మనతోపాటు పార్టీలకి రావడం మానేసి ఎన్నేళ్లయ్యింది? కాలేజీ అవగానే అది ఉద్యోగంలో చేరుతుంది. కనీసం ఉన్న ఊళ్లో ఉండి చదువుకోడానికి వీలయ్యింది. అంతవరకూ నయం. తర్వాత దాని పెళ్లి. ఈలోపే వాడు కాలేజీకి.”

“సర్లే, ఇన్ని కార్లున్నయ్యిక్కడ. చాలామందినే పిలిచినట్టున్నారు.”

“పదండి లోపలికి– ఆకలేస్తోంది.”

“.. ..”

“సర్‌ప్రైజ్– కంగ్రాచ్యులేషన్స్ ఆన్ యువర్ ట్వంటీఫిఫ్త్ యానివర్సరీ!”

“ఇదేమిటి– మా యానివర్సరీ ఇవ్వాళ అని మీకెవరు చెప్పారు?”

“అపర్ణ– ఈ ఏర్పాట్లన్నీ అపర్ణ, చంద్రనే చేశారు. మీ ఫోన్‌బుక్‌లోంచి మీ ఫ్రెండ్స్ నంబర్లు తీసుకొని అందరికీ ఫోన్‌చేసి, దీన్ని సర్‌ప్రైజ్ కింద ఉంచాలని మరీ మరీ చెప్పారు. అపర్ణే రెస్టారెంట్‌కి ఆర్డర్ చేసి ఫుడ్డంతా అరేంజ్ చేసింది. నిన్న మధ్యాహ్నం నుంచి ఇద్దరూ ఇక్కడే ఉండి ఈ డెకరేషన్లు చేశారు.”

“స్పీచ్, స్పీచ్. రమాదేవిగారూ ముందు మీరు.”

“నేను కాదు. ముందు ఆయన్ని మాట్లాడమనండి.”

“నేనా– ఐ యామ్ స్పీచ్‌లెస్. ఐ యాం స్టిల్ డైజెస్టింగ్ దిస్ సర్‌ప్రైజ్. ఫస్టఫాల్ రమకి పబ్లిగ్గా థాంక్స్ చెబుతున్నాను. ఈ పాతికేళ్ల సహచర్యానికీ, సావాసానికీ. ఇందాక లోపలికి అడుగుపెట్టే ముందరే రమతో అన్నాను. పిల్లలేరీ, మన యానివర్సరీ గూర్చి పట్టించుకోలేదే అని. లలితా సహస్రనామాల్లో అపర్ణ పక్కనే వచ్చే పేరు చండిక. అందుకే అది చిన్నప్పణ్ణించే కోపతాపాల్ని ప్రదర్శివంచినప్పుడు దాన్ని చండీ అని పిలిచేవాణ్ణి. అమరకోశంలో పార్వతీదేవి పేర్లలో చండిక పక్క వచ్చే పేరు అంబిక. అపర్ణ, పార్వతి, దుర్గ, చండి కాంబికా. అంబ అన్నా అంబిక అన్నా తల్లే కదా! అది సూటవుతుందిప్పుడు. నేను నిన్ను వదిలి ఉండను డాడీ అనేది చిన్నప్పుడు. ఆ మాట నిలబెట్టుకొనే ఇంట్లో వుండి కమ్యూట్ చేస్తూ ఇంజనీరింగ్ చదువుతోంది. ఇప్పుడు మెడిసిన్‌లో సీట్ వస్తే ఇల్లు దాటి వెళ్లాలనుకోండి. పెళ్లయిన తర్వాత సరేసరి.”

“ఐ విల్ స్టే నియర్ యూ.”

“(బేబీ సిటింగ్‌కి వీలవుతుంది)”

“బేబీ సిటింగ్ కోసం మాత్రం కాదని ఖచ్చితంగా చెప్పగలను. దాని చిన్నప్పట్నుంచీ నేను ఎప్పుడు బిజినెస్ ట్రిప్పుకెళ్లినా రోజూ దానికి ఫోన్ చెయ్యాల్సిందే. షి కెప్ట్ ఎ టాబ్ ఆన్ మి ఆల్ దీజ్ ఇయర్స్– మా అమ్మలాగా. అమ్మ అనంగానే గుర్తొచ్చింది. వాట్ మై కిడ్స్ డిడ్ ఫర్ మీ. ఐ డిడ్ నాట్ డూ ఫర్ మై పేరెంట్స్. వాళ్ల యానివర్సరీ ఎప్పుడో కూడా నాకు గుర్తులేదు. ఐ ఫీల్ ఎషేమ్డ్. షష్టిపూర్తి చేసుకోవాలన్న మా నాన్న కోరిక

తీర్చలేకపోయాను... ఐ థాంక్ గాడ్ ఫర్ దీజ్ వండర్‌ఫుల్ కిడ్స్. థాంక్యూ ఆల్ ఫర్ కమింగ్. మిమ్మల్నందర్నీ ఒక్కచోట ఇలా చూడగల్గడం నాకు చాలా ఆనందంగా ఉంది. స్పెషల్ థాంక్స్ టు శ్రీనివాస్ అండ్ హరిణి ఫర్ హోస్టింగ్ దిస్ పార్టీ."

* * *

**బాలా లీలా వినోదినీ–**

"మెల్లిగా రండి. ఇక్కడ అంత కొంపలేం మునిగిపోవట్లేదు."

"బి కేర్‌ఫుల్ డాడీ. జస్ట్ రిలాక్స్. డోన్ట్ ఎక్జర్ట్ యువర్‌సెల్ఫ్."

"ఏమైపోతారోనని ఎంత భయపడ్డానో తెలుసా?"

"వాటీస్ దిస్ మామ్! యు హావ్ టు బి స్ట్రాంగ్."

"స్ట్రాంగ్‌గా ఉండమని చెబుతూ నువ్వేడుస్తావేమిటి? ఇంట్లో అడుగుపెట్టా కదా! ఆపరేషనై కళ్లు తెరిచినప్పుడు చూడాలి మీ అమ్మ ముఖం! బావురుమని ఏడ్చేసింది."

"ఏడవక? ఈ మనిషి మళ్లీ ఇంట్లో అడుగుపెడతారని అనుకోలేదు. కళ్లు తెరిచే ఉన్నా ఆ ఆక్సిజన్ మాస్కు, అసలు హాస్పిటల్లో అడుగుపెట్టని మనిషి అలా ఆ మంచం మీద మత్తుగా పడుకొని ఉండడం."

"మా అమ్మమ్మేది?"

"అమ్మమ్మ ఇక్కడెందుకుంటుంది? ఏం మాట్లాడుతున్నారో తెలుస్తోందా?"

"ఆర్యూ ఓకె డాడ్?"

"అదే, శర్వాణి."

"శారా ఈ టైంలో ఇక్కడెందుకుంటుంది? స్కూల్లో వుంది."

"చిన్నప్పుడు నాకు జబ్బు చేస్తే మా అమ్మమ్మ నాకు బాగా సేవలు చేసి బతికించు కొందట. ఇప్పుడు నేను నా మనవరాలివల్ల బతికాను. గుండె నెప్పొచ్చినప్పుడు అదే గనుక నా పక్కన లేకపోయుంటేనా? ఈ పాటికి మా అమ్మమ్మతో కబుర్లు చెబుతూ ఉండే వాణ్ణి."

"షి కాల్డ్ మి ఆన్ మై సెల్‌ఫోన్ అండ్ సెడ్ తాతా సెడ్ కాల్ 911. ఫస్ట్ ఐ డిడన్ట్ అండర్‌స్టాండ్. ఐ ఆస్క్‌డ్ హర్ టు గివ్ ద ఫోన్ టు యు. షి సెడ్ యు ఆర్ లయింగ్ ఆన్ ద ఫ్లోర్. దట్స్ వెన్ ఐ కాల్డ్ 911."

"అయిదేళ్ల పిల్లయినా దాన్ని మీతోపాటు షాపింగ్‌కి తీసుకొని వెళ్లుంటే ఇవాళ ఇట్లా నాతో మాట్లాడుతూ ఉండేవారు కారు. హూ థాట్ ఐ నీడెడ్ ఎ ట్రిపుల్ బైపాస్ సర్జరీ!"

"ఎంత చెప్పినాగానీ ఎప్పుడైనా హెల్త్ చెకప్పుకి వెడితేగా! ఆ పని చేసుంటే ఆ వాల్వులు ఎంత మూసుకుపోయి ఉన్నయ్యో ముందే తెలిసేది."

"యు ఆర్ స్పాయిలింగ్ హర్ డాడ్."

"నువ్వు, చంద్ర మాకు దగ్గర్లోనే ఉండడం నా అదృష్టం. నేను దగ్గరగా ఉండే అదృష్టం మా అమ్మకీ, నాన్నకీ లేకపోయింది. ఐ డోన్ట్ థింక్ ఐ ఎంజాయ్డ్ యువర్ ఛైల్డ్‌హుడ్ మచ్. ఎప్పుడూ మిమ్మల్ని పెంచడం గూర్చీ, జాబ్ గూర్చీ టెన్షన్సే. శర్వాణి పుట్టినప్పట్నించీ నీ చిన్నతనంలో మిస్సయినవన్నీ అనుభవిస్తూ ఆనందిస్తున్నాను. పేరెంట్స్‌గా మీరు చేసేవి మీరు చెయ్యండి. మీరు చెయ్యని వాటిని గ్రాండ్ పేరెంట్స్‌గా మేం చేస్తాం. సాయంత్రం దాన్ని పంపించడం మర్చిపోకు."

"చిన్నప్పట్నుంచీ అది ఏం చేసినా మీ నాన్నకి వింతే. మీరు బోర్లా పడ్డప్పుడూ, పాకినప్పుడూ ఈయన రికార్డులెప్పుడూ మెయిన్‌టెయిన్ చెయ్యలేదుగానీ ఇప్పుడు నీ కూతురికి మాత్రం దాదాపు ప్రతి నిమిషమూ రికార్డుచేస్తూ వస్తున్నారు."

"ఐ విల్ సెండ్ హర్ ఇన్ ది ఈవెనింగ్. బట్ నో గేమ్స్ విత్ హర్ ఫర్ యూ."

"అయితే కథలు చెబుతాను. ఈ ఆనందం ఎక్కువ కాలం ఉండాలని కోరుకొంటాను గానీ ఇప్పుడే అంతమవాలనుకొంటానటే? చిన్నపిల్లల చేతలకు ఆ అమ్మవారు ఆనందిస్తుందట. ఆవిడే కాదు నేను కూడా."

(తెలుగు నాడి కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ)

(తెలుగు నాడి, ఆగష్టు 2007)

# ది లోన్ డ్రమ్మర్

'మిడతల దండులో ప్రతి మిడతకీ చోటుంటుంది. నా కారుకే ఇక్కడ చోటులేదు' అనుకున్నాడు రామారావు స్కూలుకు బయటగా ఫర్లాంగు దూరంలో రోడ్డు పక్కగా కారు ఆపి స్కూలు పార్కింగ్‌లాట్‌లో నుంచి నడుచుకుంటూ వస్తూ కొన్ని కార్లు పార్కింగ్‌లాట్‌లోనే కాక గడ్డిమీద కూడా ఎగుడుదిగుడుగా పార్క్‌చేసి ఉన్నాయి. తనకే మాంత్రికశక్తి ఉంటే ఈ డొక్కు కార్లలో ఒకదాన్ని మాయంచేసి దాని స్థానంలో తన మెర్సిడెజ్‌ని ఉంచేవాడు అనుకున్నాడు.

స్కూల్‌కి రెండు ద్వారాలు ఒకదాని కొకటి దాదాపు రెండువందల అడుగుల దూరంలో కనిపించాయి. దేన్లోంచి లోపలకు వెళ్లాలో తెలియలేదు. తనున్న దూరం నుంచి చూస్తే మెయిన్ ఎంట్రన్స్‌లా అనిపిస్తున్న దాన్లోంచి లోపలకు అడుగుపెట్టాడు. లోపల నిశ్శబ్దంగా ఉంది. ఎవరూ కనిపించలేదు. కుడిపక్కగా కారిడార్లో చివరగా డబుల్ డోర్స్ కనిపించాయి. అతను వాటివైపు నడుస్తుంటే ఆ హాల్లో అతని బూట్ల శబ్దం ప్రతిధ్వనించింది. ఆ తలుపులకున్న గాజు కిటికీలలో నుంచి మనుషులు కనిపించే ముందరే అతనికి చప్పట్ల శబ్దం లీలగా వినిపించింది. తలుపు తీసుకుని లోపలకు అడుగుపెట్టాడు.

అది స్కూల్ జిమ్నేషియం అని పైకెత్తి పెట్టిన బాస్కెట్‌బాల్ హూప్స్ వల్ల తెలిసిందతనికి. "థాంక్యూ ఆల్ ఫర్ కమింగ్ టూ ద స్ప్రింగ్ కాన్సర్ట్" మైకులో ఎవరో మాట్లాడుతున్నారు. చూడ్డానికి వీల్లేకుండా ముందు బెర్లిన్ వాల్ లాగా మనుషులు. తల పైకెత్తి ఎడమవైపు చూశాడు. మెట్లలాగా అమర్చిన బ్లీచర్స్‌లో చాలామంది కూర్చున్నట్టున్నారు. చోటులేని వాళ్లు తన కడ్డంగా నిల్చున్నారు. లేకపోతే తనలాగానే ఆలస్యంగా వచ్చినవాళ్లా? కావాలంటే ముందుగానే వచ్చేవాడేమో గానీ, అమెరికాలో శాస్త్రీయ సంగీతం వినడానికి ఎంతమంది వస్తార్లే అని అనుకోవడం వల్లే ఇలా.

కాకపోయినా, ముందు వచ్చి ఉంటే సావిత్రికి తను కనబడేవాడు. చివరిదాకా ఉండాలా లేక సావిత్రికి కనబడకుండా వెళ్లిపోవాలా అని ఇంకా తేల్చుకోలేకపోతున్నాడు.

మైక్‌లో ఎనౌన్స్‌మెంట్ అయినట్లుంది. జనాలు చప్పట్లు కొట్టారు. మిడతల దండు యుద్ధానికి బయల్దేరినట్లు శబ్దం మొదలయింది. అదేదో ఇంగ్లీషు సినిమాలో మ్యూజిక్‌లా ఉంది. సైన్యం యుద్ధానికి నడుస్తున్నప్పుడు వస్తూంటుంది– గుర్తొచ్చింది మార్చింగ్. పొద్దున్న సంగీత అంది. మార్చింగ్ బాండ్ డాడీ అని. రక్తాన్ని ఉడికిస్తున్నట్టుగా బానే ఉంది.

కోట్ పాకెట్లో సెల్‌ఫోన్‌కి లైఫ్ వచ్చింది. సైలెంట్ మోడ్‌లో ఉంది గనుక ఎవరినీ డిస్టర్బ్ చెయ్యలేదు– బతికిపోయాడు. బయటికి తీసి నెంబర్ చూశాడు. డాక్టర్ మిశ్రా. జిమ్నేషియంలోంచి బయటికివచ్చాడు. పట్టుకుంటే వదల్డు. ఈ తెల్లవాళ్లలాగా అంటీ అంటనట్లు ఉండచ్చుగా!

"హలో."

"వాట్ డిడ్ యు థింక్?"

"నాట్ డిసైడెడ్ యెట్."

"ప్రైమ్ ప్రాపర్టీ, ఉయ్ కెన్ నెగోషియేట్. టుమారో ఈజ్ ద లాస్ట్ డేట్ యు నో!"

"ఐ యాం ఇన్ స్కూల్. రిసెప్షన్ నాట్ గుడ్. యు ఆర్ బ్రేకింగ్ అప్," సాకు చెప్పి పెట్టేసి జిమ్నేషియం తలుపు తీస్తుండగా మళ్లీ చప్పట్లు వినిపించాయి. ఒక సీన్ అయిపోయినట్లుంది. కొంతమంది బ్లీచర్లల్లో సీట్లు వెతుక్కుని కూర్చున్నట్టున్నారు. నిల్చునే చోట కొంచెం ఖాళీవచ్చింది. సందు చేసుకుంటూ గోడవారగా నిలబడ్డాడు. రెండు బాస్కెట్ బాల్ కోర్టులు పట్టే ఇన్‌డోర్ స్థలం అది. మధ్యలో అమర్చిన కుర్చీల్లో యూనిఫాంలు వేస్కుని పిల్లలు కూర్చున్నారు. యాభై మందుండొచ్చు. ఎయిత్ గ్రేడ్ కదూ?

ఒక తెల్లావిడ మైక్ దగ్గరకొచ్చి ఎనౌన్స్ చేసింది. "ది నెక్స్ట్ పీస్ ఈజ్" ఏదో చెప్పింది. "కండక్టెడ్ బై మైకేల్ సిల్వర్‌స్టీన్. ఐ టేక్ స్పెషల్ జాయ్ అండ్ ప్రైడ్ ఇన్ ప్రజెంటింగ్ హిమ్. వెన్ ఐ జాయిన్డ్ దిస్ స్కూల్ టెన్ ఇయర్స్ బాక్, హి వజ్ మై ఫేవరెట్ స్టూడెంట్. టుడే, ఆఫ్టర్ హి ఫినిష్డ్ హిజ్ మాస్టర్స్ ఇన్ మ్యూజిక్ హి కేమ్ బాక్ యాజ్ ఎ టీచర్ హియర్" జనాలు పెద్దగా చప్పట్లుకొట్టారు. 'బతకలేక బడిపంతులు' వీళ్లకి వర్తించదా?

మైకేల్ ముందుకు వచ్చి, బౌ చేశాడు. తెల్లవాడు. ఒక అడుగు ఎత్తున్న సీటుమీద ఎక్కాడు– పిల్లలందరికీ కనిపించడానికి గావును. రెండు చేతుల్నీ చాచి పైకెత్తాడు. కుడిచేతిలో చిన్నపుల్లలా ఉంది. దాన్నేనా బటాన్ అనేది? పిల్లలు ఇన్‌స్ట్రుమెంట్స్ పైకెత్తారు. అన్ని రకాల వాటిని తనెప్పుడూ చూళ్లేదు. వాటి పేర్లసలే తెలీదు. కొన్నింటిని మాత్రం తన పెళ్లికి పెట్టిన బాండ్‌మేళంలో చూసిన గుర్తు. చెంగావీ రంగుచీర కట్టుకున్న చిన్నదీ–

దాని దిమ్మదియ్య అందమంతా చీరలోనే ఉన్నది... బాగా వాయించారని చెప్పుకున్నారప్పుడు. స్త్రీని నగ్నంగా చూడ్డం కొత్తేం కాకపోయినా హాస్పిటల్లో ఎగ్జామినేషన్ టేబుల్‌మీద చూడ్డం వేరు. చీరలో ఉన్న అందాన్ని ఆస్వాదించడం వేరు. ఆ బాండ్‌మేళం వాళ్లయితే నాలుగు డబ్బులకోసం వాయిస్తారు. వీళ్ళేం చేస్తార్ట నేర్చుకుని?

మైకేల్ చేతుల్ని విగరస్‌గా ఊపుతున్నాడు. సిల్వర్‌స్టీన్ అంటే జ్యూ అన్నమాట. మరి నెత్తిన యాముల్కా లేదే! ఇతను ఆ బటాన్‌ని ఊపినట్టే వాళ్లు వాయిస్తున్నారా లేక ఎవరి గోల వాళ్లదేనా? వినడానికి బాగానే ఉంది. ఈ పీస్ కూడా ముందుదాని లాగానే పెద్ద శబ్దం చేస్తూ జోరుగానే సాగుతోంది. అవగానే చప్పట్ల హోరు. బ్లీచర్స్‌లో తల్లిదండ్రులు. ఎవరి సంతానం గూర్చి వాళ్లు చప్పట్లు కొట్టి ఉంటారు. మైకేల్ ఆడియన్స్ వైపు తిరిగి మళ్లీ బౌ చేశాడు. చప్పట్లు. పీట మీంచి దిగి, ఎడంచేత్తో విద్యార్థుల్ని చూపించాడు మళ్లీ చప్పట్లు.

కుర్చీలో కూర్చున్నవాళ్లు లేచి నిలబడ్డారు. అప్పుడే అయిపోయిందా? మరి సంగీత? అప్పుడు చూశాడు. ఇందాక కుర్చీల్లో కూర్చుని వాయించిన వాళ్ల కిరువైపులా గోడవారగా ఇటో యాభైమందీ అటో యాభైమందీ కుర్చీల్లో కూర్చొని ఉన్నారు. వాళ్ల వంతుకోసం. వాయించడం అయిపోయిన వాళ్లు వెనకవైపుగా కుడివైపు కుర్చీలవైపు వెడుతుంటే వాటిల్లో కూర్చున్న వాళ్లు లేచి ముందునుంచి ఇటువైపు వస్తున్నారు.

ఇంతమంది ఇండియన్సా! వీళ్లంతా సంగీతం మీద ఆసక్తి ఉండి చేరినవాళ్లా లేక సర్టిఫికెట్లకోసం, కోర్సులు చేశామని చెప్పుకోవడంకోసం వాయించేవాళ్లా? చైనీస్ కూడా బాగానే ఉన్నారు. వాళ్ళల్లో ఎవరు చైనీసో ఎవరు కొరియన్సో చెప్పుకోవడం కష్టం. ఇట్లా అయితే తెల్లవాళ్లు ఇరవయ్యేళ్లల్లో డెఫినెట్‌గా మైనారిటీ అవకేం చేస్తారు? అయినా ఈ స్కూల్లో ఉన్నది నూటయాభై స్టూడెంట్సేనా? సెవెన్త్ అండ్ ఎయిత్ కలిపి? కాదనుకుంటా. ఇక్కడ ఒక రాక్ బాండ్ చేత కాన్సర్ట్ ఇప్పిస్తే తెలుస్తుంది అసలు ఎంతమంది స్టూడెంట్స్ ఉన్నారో! సంగీత ఇంటరెస్ట్ ఈ తక్కువమంది ఉండేవైపే రావాలా? తక్కువమంది మాత్రమే ఉండే ప్రొఫెషన్స్ ఎన్నిలేవు? మెడిసిన్, ఇంజనీరింగుల్లా!

అయినా సావిత్రిని అనాలి. ఇంట్లో ఊర్కెనే కూర్చోవడం ఎందుకని పెయింటింగ్ మొదలుపెట్టింది. ఇంటిని తన పెయింటింగ్‌లతో నింపింది చాలక ఎగ్జిబిషన్ పెడతానంటుంది. పెట్టింది కూడా రెస్టన్ కమ్యూనిటీ సెంటర్లో. వాటికి ధరలు కూడా పెట్టిందట కావాలంటే కొనుక్కోవచ్చని. ఎవడో తలకి మాసినవాడు రెండొందల డాలర్లిచ్చి ఒకదాన్ని కొంటే ఆనందంగా చెప్పింది. అది తన గంటరేటు. పది సంవత్సరాల క్రితం! కాకపోయినా ఆ పెయింటింగ్ వెయ్యడానికి వారం రోజులు పట్టిందట. పోనీ నలభై గంటలే పట్టిందనుకుంటే గంటకి అయిదుడాలర్లు. ముష్టి మినిమమ్ వేజ్. నాన్నకయితే అదికూడా లేదు.

నాటకాల్లో పద్యాలు పాడుకుంటూ ఊళ్లు తిరిగాడు. నయాపైస కూడా ఎప్పుడూ సంపాదించ లేదుట. తాతయ్య ధర్మమా అని తనకీ డిగ్రీ వచ్చింది. అల్లుడు గదా అని నాన్నని ఏమీ అనలేకపోయాడు తాతయ్య. ఆయన స్థానంలో తనుంటేనా, అల్లుడని కూడా చూడకుండా కాళ్లు విరగ్గొట్టించేవాడు.

ఇందాకటి తెల్లావిడ గునగునా నడుచుకుంటూ వచ్చి మళ్లీ మైకు పట్టుకుంది. 'ది నెక్స్ట్ పీస్ విల్ బి కండక్టెడ్ బై సంగీతారావ్". రావ్ లాస్ట్ నేమ్. ఇంటిపేరు ఎప్పుడో మరుగున పడిపోయింది. స్కూల్లో పి.రామారావు. పాస్‌పోర్ట్‌లో తప్ప అన్నిచోట్లా డాక్టర్ రావ్. "సంగీతా ఈజ్ డూయింగ్ మాస్టర్స్ ఇన్ మ్యూజిక్ ఎట్ జార్జి మేసన్ యూనివర్సిటీ." మాస్టర్స్ ఇన్ మ్యూజిక్. ఎగైనెస్ట్ మై విష్. పుండు మీద కారం రుద్దుతోంది. కనీసం ఇదైనా డాక్టర్ అవుతుందనుకున్నాడు. మిశ్రా ముగ్గురు పిల్లలూ డాక్టర్లే. సడ్స్‌గాడికి పెట్టిన పేరు సుధాకర్. గాలిలో తేలే బుడగకిలాగా నిలకడ తక్కువ. హైస్కూల్లో స్పోర్ట్స్ మెడిసిన్ తీసుకుంటే ఆనందపడ్డాడు. ఇంజనీరింగ్‌లో చేరితే పోనీలే అనుకున్నాడు. ప్రొబేషన్లోకొచ్చి ఆ తర్వాత హొటల్ మేనేజ్‌మెంట్ అన్నాడు. ఎంబీయే చేయించవచ్చులే అనుకుంటే సంఘసేవ అంటే ఇష్టపడే అమ్మాయి వెంటపడి ఇండియావెళ్లాడు. డబ్బు, డబ్బు అనే గర్ల్‌ఫ్రెండ్ దొరికితే బావుండేది. అయినా కెరీర్ అడ్వాన్స్‌మెంటే ముఖ్యంగా పెట్టుకునే పిల్లకి వీడితో ఎట్లా కుదురుతుందిలే! అప్పుడు తండ్రికే కాక గర్ల్‌ఫ్రెండ్‌క్కూడా దూరమవుతాడు.

అయినా ఇదంతా వాళ్లమ్మ తప్పు. తనమాటే నెగ్గుంటే ఇండియాలో బోర్డింగ్ స్కూల్లో పెట్టించి చదివించి ఉండేవాడు. మిశ్రా పెద్దకొడుకు లాగే. కాకుంటే జమైకాలో మిశ్రా మూడో కొడుకు లాగే. ఉన్న ఒక్క కొడుకునీ అంత దూరం పంపించనంది సత్తెకాలపు సావిత్రి. మరి ఇప్పుడు వాడెక్కడున్నాడు?

"షి హాజ్ బీన్ వర్కింగ్ విత్ దీజ్ కిడ్స్ ఫర్ ది లాస్ట్ ఫోర్ మంత్స్ యాజ్ పార్ట్ ఆఫ్ హర్ మాస్టర్స్. షి ఈజ్ వండర్‌ఫుల్! ఎనెర్జెటిక్! ప్లీజ్ వెల్‌కం సంగీతా."

చప్పట్లు. దాదాపు ఎగురుతున్నట్లుగా వస్తోంది. చిన్నప్పుడెప్పుడో తప్పటడుగులు వేస్తూ తన చేతుల్లో వాలినట్లుగా. కళ్లల్లో ఉత్తేజంతో నిండిన ఆనందం- అవార్డులు తీసుకోవడానికి స్టేజీమీదకి వస్తున్నప్పటిలాగే. అదైనా వెళ్లి ఎప్పుడుచూశాడు గనుక? సావిత్రి వీడియో తియ్యడమేకాక పట్టుపట్టి తనకి చూపించగా చూసిందే. అంత ఆనందం తన కళ్లల్లో ఎప్పుడైనా ఎవరికైనా కనిపించి ఉంటుందా? కనీసం కళ్ల వెనుకనైనా నిలిచిందా? హైస్కూలు, మెడికల్ ఎంట్రన్స్, ఇసిఎఫ్ఎమ్‌జీ, బోర్డ్ ఎగ్జామ్స్, ప్రైవేట్ ప్రాక్టీస్. ప్రతిచోటా టెన్షనే. క్వార్టర్ చివర రిపోర్టు కార్డులు ఇంటికివచ్చే ముందురోజు ప్రాణం తీసేదట. సావిత్రి చెప్పేది. ఐ యామ్ నర్వస్ అబౌట్ మై గ్రేడ్స్ అంటూ. నడుముకు

తగిలించుకున్న పేజర్‌కి బానిసై, ప్రైవేట్ ప్రాక్టీసన్చెప్పి, వారానికి నాలుగ్గంటలైనా వాళ్లతో గడిపిందెప్పుడు?

సంగీత ఒకచేత్తో బటాన్‌ని పట్టుకుని విగరస్‌గా రెండుచేతుల్నీ ఆడిస్తోంది. ఎగిరి పోతుందేమో అందమైన కలలాగా! 'సంగీతం ఎందుకురా దీనికి. ఎప్పుడు చూసినా ఆ పియానోనో ఏదో వాయిస్తూనే ఉంటుంది. మీ నాన్న పోలిక మంచిదికాదు!' అనేది అమ్మ- తను రాత్రి ఎంత ఆలస్యంగా వచ్చినా తనని ఒకసారి చూడందే నిద్రపోయేదికాదు. ఆవిడెవరో చెప్పిందని సావిత్రే చేర్పించింది సంగీతని పియానో కోచింగ్‌లో - ఒక కాంపిటిటివ్ హైస్కూల్లో సీటుకోసం పనికివస్తుందని. అప్పట్నుంచీ అతుక్కుపోయింది ఆ సంగీతానికి. మిశ్రా భార్య ఇవేమన్నా చేసిందా? అసలావిడకి ఏమీ పట్టదు. ఒంటి నిండా నగలు దింపుకుని రుబ్బురోలులా దొర్లుతూ ఉంటుంది. అందుకే గామోసు మిశ్రా రెబెకాని దగ్గర చేర్చుకున్నాడు.

లిబరల్ ఆర్ట్సులో చేరింది బేచలర్ డిగ్రీ చెయ్యడానికి. కనీసం సైకాలజీలో మేజర్ అవమన్నాడు తను. ఏ కళనుందో ఒప్పుకుంది. ప్రి-మెడ్ అన్నాడు. ససేమిరా అంది. తను తగ్గి సరే, ముందిది పూర్తిచెయ్యమన్నాడు- జూనియర్ ఇయర్లో ఒప్పించవచ్చులే అని. మాట వింటేనా? కాలేజీ ఫీజు కట్టను అనడానికి వీలుంటేనా? 4.0 జిపిఎ స్టూడెంట్- ఫుల్ స్కాలర్‌షిప్‌తో చదివిందాయె! ఇంట్లోంచి పో అంటే పార్ట్‌టైం ఉద్యోగం చేసుకు బతుకుతుంది. అయినా సడ్స్‌గాడి మీద కోపం దీనిమీదెందుకు చూపించడం?

ఎయిత్ గ్రేడ్ అంటే పదమూడు, పధ్నాలుగేళ్ల పిల్లలు. దాదాపు యాభైమంది. సంగీత చేతులకి వేలాడుతూ వాటిని ఎటుతిప్పితే అటు తిరుగుతున్నారు తెల్లచొక్కాల తారకలు. రెండు చేతుల్లోనూ మెరిసే విష్ణుచక్రాల్లా తిరిగి, ఆ మెరుపుల్ని మంత్రం వేసి అలానే నిలబెట్టి-

ఉవ్వెత్తున ఎగిసిన చిచ్చుబుడ్డీ మెరుపుల్లా చప్పట్లు. ముందుకు వంగి బౌ చేస్తూ సంగీత. తల నొకసారి పూర్తిగా ఎడమవైపుకి తిప్పి. బ్లీచర్ల మీద మొదలుపెట్టి కుడివైపుకు తిప్పుతూ హాలంతా కలియజూశాడు. ఈ స్నాప్‌షాట్‌ని, ఈ చిత్రాన్ని... మనసు మూలల్లో కాక ఆకాశంలో అందరికీ కనిపించేలా ఎగరెయ్యాలనిపిస్తోంది. అంత పెద్ద కాన్వాస్ మనసు మూలల్లో ఎలా ఇరుక్కుపోయిందసలు? తనకెప్పుడైనా ఇంతమంది చప్పట్లుకొట్టారా? నవలల్లో రాసినట్టు, సినిమాల్లో చూసినట్లు కళ్లనిండా ఆనందం నింపుకున్న చూపులు తననెప్పుడైనా స్పృశించాయా? కార్ మెకానిక్కులూ, ప్లంబర్లూ ప్రాబ్లం వచ్చినప్పుడు మాత్రమే కావల్సివచ్చినట్లుగా, డాక్టర్ల పరిస్థితీ అంతే. ఆరోగ్యంగా ఉండేవాడికి డాక్టర్ అవసర మేమిటట? కాన్ఫరెన్స్‌కి వెడితే అందరూ డాక్టర్లే. ఒకళ్లని మెచ్చుకునే అసవరం ఇంకొకళ్ల కెందు కుంటుంది? ఎవడికైనా అవార్డులొస్తే. ఆ అవార్డు కోసం ఎంత లాబీచేసి ఉంటాడోనని వెనకనుంచి గుసగుసలు.

అయినా ఏదో చిన్నపిల్ల కదా అని చప్పట్లుకొడుతున్నారా లేక వీళ్లకి అది నిజంగా ఏం అకంప్లిష్ చేసిందో అర్థమయిందా? అయిందనుకోవడానికి ఆధారమేమీ లేదు. పిల్లలు వాయించారు. వాళ్ల తరఫు వాళ్లు చప్పట్లుకొట్టారు. మరి తను? చప్పట్లు కొట్టలేదా? అదేమిటి? ఆశ్చర్యంగా ఉందే, హాలంతా కలియజూసిన తరువాత ఏం చేసినట్లు? అపురూప సౌందర్యాన్ని నింపుకున్న అమూల్యమైన క్షణాన్ని మనసులో దాచుకోవడంలో బిజీగా ఉండుంటాడు. అయినా చప్పట్లు కొట్టింది ప్రతిభకా లేక ఊర్కెనే ఎంకరేజ్ చెయ్యడానికా? సంగీతంలో ఏది ప్రతిభో తనకేం తెలుసు? దానికి చెప్పాలి. వీళ్లు చప్పట్లుకొట్టగానే మురిసిపోకు. వాళ్లకేం అంతగా తెలియదు. జస్ట్ ఏవరేజ్ పీపుల్ అని.

కానీ, తను డబ్బిస్తానన్నాగానీ అన్ని వందలమంది బుధవారం సాయంత్రం ఎనిమిది గంటలకి వస్తారా? ఆ మధ్య మాధవన్ వాళ్లమ్మాయి భరతనాట్యం అరంగేట్రం అంటే తప్పక వెళ్లాల్సొచ్చింది. అదికూడా శనివారం సాయంత్రం. అయిదొందలు పట్టేహాలు. వచ్చారో మూడు వందల మంది. డాన్స్ తర్వాత డిన్నర్. పదిహేను వేలు ఈజీగా అయుండాలి. ఇక్కడున్నంతమందిని రప్పించాలంటే దానిపక్కన ఇంకో సున్నా పెట్టాలి. రప్పించవచ్చు. కానీ వచ్చిన వాళ్లందరూ ఇంత ఆనందంగా చప్పట్లు కొడతారా?

ఇందాకటి ముసల్ది మళ్లీ గునగునా నడుచుకుంటూ మైక్ దగ్గరికి వచ్చింది. “ఐ హావ్ బీన్ డూయింగ్ దిస్ ఫర్ థర్టీ ఇయర్స్.” మరీ ముసల్దేం కాదు. తనకంటే ఓ అయిదేళ్లు పెద్దదేమో మహా అయితే. “ఐ ఎంజాయ్డ్ ఎవ్రీ మూమెంట్ ఆఫ్ టీచింగ్,” అబద్ధాలు. సం మూమెంట్స్ డెఫినెట్లీ. ఎ లాట్ ఆఫ్ దెమ్ పాజిబుల్. అన్నీ ఇంపాజిబుల్. నా స్టూడెంట్స్ అంతా గొప్పవాళ్లే అనదు కదా! “థాంక్స్ టు కిడ్స్ లైక్ దిస్. అండ్ యంగ్ టీచర్స్ లైక్ మైక్!” అన్నది. “బిఫోర్ వుయ్ ప్లే ది లాస్ట్ పీస్ వన్ ఇంపార్టెంట్ అనౌన్స్‌మెంట్. ఫర్ ది రీజినల్ మ్యూజిక్ కాంపిటీషన్స్ ది బసెస్ విల్ బి లీవింగ్ ఎట్ ఫైవ్ ఓ క్లాక్. వుయ్ నీడ్ టు బి దేర్ బై ఎయిట్ ఓ క్లాక్. వుయ్ షుడ్ బి బాక్ బై నైన్ ఎట్ నైట్.” ఈ పిల్లలందరూ బస్‌లో ఇంకోచోటికి వెళ్లి, కాంపిటీషన్స్‌లో పాల్గొని– హైస్కూల్లో ఉన్నప్పుడు తనకూ అనిపించేది. స్నేహితులతో కలిసి పిక్నిక్‌లకి వెళ్లాలని. స్కూళ్ల దగ్గరగానీ తల్లిదండ్రుల దగ్గరగానీ డబ్బులేవీ? ఆటపాటలతో కలిపితే చదువు బాగా వంటబడుతుం దనేవారు శ్రీమన్నారాయణగారు హైస్కూల్లో సోషల్‌స్టడీస్ చెబుతూ. ‘రాక్షసి బొగ్గు బెంగాల్‌లో దొరుకుతుందని బట్టీ పట్టించడం కాదోయ్. రాణీగంజ్ అస్సంసోల్ రాక్షసిబొగ్గు బెంగాల్ సార్ అని పాడుతూ చెప్తే కలకాలం గుర్తుంటుంది.’ అందుకేనేమో తన కిప్పటికీ గుర్తుంది. అట్లా సిలబస్ డెవలప్ చెయ్యాలంటే కొంత టైం పడుతుంది. అందుకే చెప్పనివ్వరు. స్కూలంటే బట్టీపట్టడం మాత్రమే. ఈ పిల్లలేమో పొద్దున్న అయిదింటికి బస్సెక్కినా అందులో నిద్రపోతా రనుకోడు తను. వాళ్ల పిఎస్‌పీలూ, ఐ–పాడ్‌లూ, గేమ్‌బాయ్‌లూ, కబుర్లూ,

కేకలూ– ఎంజాయ్‌మెంట్ అంతా స్కూల్‌డేస్‌లోనే. సంగీత కూడా ఇలాంటి వాటికి వెళ్లినట్లుంది. అంతా సావిత్రే చూసుకుంది.

“దీజ్ ఆల్ ఆర్ వండర్‌ఫుల్ కిడ్స్. బట్ వుయ్ వాంట్ టు రికగ్నైజ్ ఎ కపుల్ ఆఫ్ స్టూడెంట్స్. వన్ ఈజ్ క్రిస్టీనా, షి వజ్ ఔట్‌స్టాండింగ్ త్రూఔట్ ది ఇయర్”. చప్పట్లు, క్రిస్టీనా వచ్చి అవార్డు తీసుకుంది. సంగీత క్కూడా ఇట్లాంటివేవో వచ్చినట్లున్నాయ్. తల తిప్పి బ్లీచర్స్‌లోకి చూశాడు. కొంతమంది వీడియోలు తీస్తున్నారు. “ది సెకండ్ వన్ ఈజ్ సమ్ వన్ హూ ఇంప్రూవ్డ్ మోస్ట్ డ్యూరింగ్ ది ఇయర్– సుదీప్ సింగ్.” చప్పట్లు, కెమెరా ఫ్లాష్‌లు. ఇద్దరూ ఏం చేస్తారు ఈ అవార్డులతో? సంగీతంలో డిగ్రీలు పొందుతారా? “ది లాస్ట్ పీస్ వుయ్ ఆర్ గోయింగ్ ప్లే ఈజ్” ఏదో చెప్పింది. ఇదీ ఉద్రేకపూరితంగానూ, మార్చ్ చెయ్యాలనిపించేదిగానూ ఉంది. పెద్దగా డ్రమ్స్ మోగుతున్నాయి. ఇత్తడి పళ్లాల వంటివి మోగాయి. ప్రపంచంలో ఆనందం తప్ప ఇంకేమీ లేదన్న ఉధృతమైన ఉత్తేజంతో కాన్సర్ట్ అయిపోయింది.

మిడతల దండు రెక్కలు సర్దుకోవడం మొదలయ్యింది. రాసుకుంటూ, తోసుకుంటూ బయలుదేరింది. గోడవారగా నిలబడ్డాడు. స్టూడెంట్స్ వాళ్ల ఇన్‌స్ట్రుమెంట్స్‌తో జిమ్నేషియంలో నుంచి బయటికి నడుస్తున్నారు. ఎందుకో తనకక్కడ్నించి కదలా లనిపించడం లేదు. సావిత్రి తన నిక్కడ చూస్తే చూణ్ణీ. దేర్ ఈజ్ ఎ ఫస్ట్ టైం ఫర్ ఎవ్రీథింగ్. సావిత్రి గానీ సంగీత గానీ తను మొదటినుంచి అక్కడ ఉన్నాడంటే నమ్ముతారా? సంగీత దగ్గరికి నడుస్తూ– సావిత్రి మైకేల్‌తో మాట్లాడుతూ– సంగీత వెయిట్ చేస్తూ– సావిత్రి తలతిప్పి చూసింది. తనని చూసి ఆశ్చర్యం. దాని స్థానంలోనే ఆనందం. మళ్లీ సందేహం. ఏం చూశాడో? తల తిప్పి సంగీతతో ఏదో అని తనవైపు నడుస్తోంది. సంగీత తనవైపు తల తిప్పింది. “ఎప్పుడొచ్చారు?” “సంగీతని చూశాను,” “అంతా రికార్డు చేశాను. మీకెలాగో రావడానికి కుదరదని.” తన మనసులో ఉన్న రంగుల కాన్వాసు నాన్‌ట్రాన్స్‌ఫరబుల్. నాట్ ఫర్ షేరింగ్.

“హాయ్ డాడ్. ఐ హోప్ యు కేమ్ ఇన్ టైమ్!” గొంతులో అపనమ్మకంతో కూడిన సందేహం. ఇన్నేళ్లూ పట్టించుకోనివాడు, ఇప్పుడు? “యస్ ఐ డిడ్!” “మీట్ మైక్. దిసీజ్ మై డాడ్!” హౌ వజ్ ఐ అని అడగలా. “యు ఆర్ గుడ్” సావిత్రి మైకేల్‌తో. పిచ్చిది– ఆడపిల్ల ఒక మగాణ్ణి తీసుకొచ్చి వాళ్ల నాన్నకి పరిచయం చేస్తే దానర్థం తెలియదు ఇంకా. తెలుసేమో? “హి ఇంట్రడ్యూస్‌డ్ మి టు మిసెస్ కెల్లర్. యు నో ది లేడీ హూ వజ్ మేకింగ్ ది ఎనౌన్స్‌మెంట్. దట్స్ హౌ ఐ గాట్ దిస్ ఆపర్చ్యూనిటీ.” మ్యూజిక్‌లో మాస్టర్స్ చేసినవాడూ, నువ్వూ ఇద్దరూ స్కూల్లో టీచర్లుగా గడపండి మీ జీవితాలు! ఇద్దరికీ కలిపి నలభై వేలు వస్తుందా సంవత్సరానికి? ఎదుగూ బొదుగూ లేని ఉద్యోగాలు.

అపార్ట్‌మెంట్‌లో ఉండడం ఇప్పుడు బాగానే ఉంటుంది. పిల్లలు పుట్టిన తరువాత? 'నో ఛైల్డ్ లెఫ్ట్ బిహైండ్' వచ్చిన తర్వాత స్కూళ్లలో మ్యూజిక్కు, ఆర్టూ కట్ చెయ్యడం మొదలు పెట్టారట. అంటే ఆ టీచర్ల ఉద్యోగాలైనా ఎంతకాలం ఉంటాయో? అంతేమరి! 'మే మానందిస్తాం. దానికి మీరు డబ్బుకట్టాలి!' అంటే ఎవరూరుకుంటారు? ఎప్పుడైనా తన ఉద్యోగంలో ఆనందం పొందాడా? పేరు మోసిన కార్డియాలజిస్ట్‌కి ప్రతి సర్జరీ టెన్షనే. ఆంకాలజిస్ట్‌కి కాన్సర్లు కనుక్కోవడంలో ఆనందం ఎందుకుంటుంది? తృప్తి ఉంటుంది. ఆనందానికన్నా తృప్తికే ఎక్కువ జీతం! మరి కారు ట్రబుల్ డయాగ్నోస్ చేసినవాడికెందుకు డబ్బివ్వడానికి గింజు కుంటారు? 'ఈ కారు మెకానిక్కులు, ప్లంబర్లు మనల్ని దోచేస్తున్నారు!' అంటాడు మిశ్రా.

మైకేల్‌కి షేక్‌హాండ్ ఎప్పుడిచ్చాడో తెలియదు. ఏం మాట్లాడాడో గుర్తులేదు. రెండు మైండ్లు– మాట్లాడిం దొకటి, ఆలోచించిం దొకటి. దానికి మెల్లగా నచ్చచెప్పాలి. పోట్లాట పెట్టుకుంటే ప్రయోజనం లేదు. సడ్స్‌గాడు ఎలాగూ ఈ దేశంలోనే లేడు.

"పెళ్లి చేసుకుంటా నంటుందా?" బయటి కొస్తున్నప్పుడు పక్కన సావిత్రితో.

"ఏం చేసుకుంటే?" అంటే తెలుసునన్నమాట!

"ఇద్దరు టీచర్లకి కలిపి ఎంతొస్తుందనుకున్నావ్? తాత పోలిక!" ఇదేమిటి సావిత్రి అనాల్సింది తనన్నాడు? తండ్రి మీద కసా? ఇప్పటిదాకా ఎప్పుడూ అంతలా ఆలోచించలేదే! తల్లి మాటల ప్రభావమేనా ఇదంతా?

'ఎంతొస్తే ఏం? ఒకరి కొకరుంటారు!" అంటే మా సంగ తేమిటి? డబ్బు కన్నా తోడే ముఖ్యం అంటోంది. ఒకటున్న వాళ్లు రెండోదాన్ని కోరుకోవడం సహజమే. అయినా ఎంత మాటంది! మీకోసమే కాదా ఇదంతా? అంగుళీమాలుడేనా– అడవిలో ప్రయాణీకులని దోచుకుని వాళ్ల బొటనవేళ్లని మెళ్లో వేసుకుని, తర్వాత పెళ్లాం పిల్లలచేత నీ పాపంలో భాగం మాకొద్దు అనిపించుకున్నాడు? తనెవరిని దోచుకున్నాడు?

మిశ్రాకి కాల్‌చేశాడు. "ఐ విల్ జాయిన్ యు. లెట్స్ బయ్ ఇట్!" మనవళ్ల కోసం.

ముందే వచ్చింది కనుక సావిత్రి కారుని ఎంట్రన్స్‌కి దగ్గరగానే పార్క్‌చేసింది.

"కారు దగ్గర డ్రాప్ చేస్తాను రండి."

వద్దని చెప్పి నడిచి కారు దగ్గరికి చేరాడు. మిడతలన్నీ వెళ్లిపోయాయి. వుయ్ మార్చ్ టు ఎ డిఫరెంట్ బీట్. ఒంటరి మిడత మిగిలింది రోడ్డు పక్కగా.

(తెలుగు నాడి, డిసెంబర్ 2008)

# 23 కిలోలు

ఆ ఆలోచన ఎప్పుడు వచ్చిందో నాకు బాగా గుర్తుంది.

“ఇవ్వాళ జుట్టుకు రంగు వెయ్యట్లేదేమిటి?” బాత్‌రూంలోకి వెళ్లబోతుంటే శ్యామల అడిగింది.

“ఏం, దీని కేమయిందిప్పుడు?” అన్నాను జుట్టులోకి వేళ్లు పోనిస్తూ.

“కొన్ని వెంట్రుకలు రాగి రంగులోనూ, కొన్ని కుదుళ్ల దగ్గర్నించీ తెల్లగా మెరుస్తూ, అక్కడక్కడా మాత్రం నల్ల వెంట్రుకలు.”

“రేపెలాగూ ఇండియా వెడుతున్నాను గనుక నువ్వు నన్నో రెండు వారాలపాటు చూడక్కరలేదు. ఇవ్వాళ, రేపట్లో నువ్వు నీ చూపులని నా మీద ప్రసరించే క్షణాలని వేళ్లమీద లెక్కపెట్టచ్చు. ఆ పరిమిత క్షణాలని కూడా మాటీవీకో లేక జెమినీకో కట్టేస్తే నువ్వూ, నేనూ ఇద్దరం సుఖంగా ఉండవచ్చు.”

“సాయంత్రం పార్టీ గురించి నేను మాట్లాడేది. మీ పక్కన నన్ను చూసేవాళ్ల గూర్చి. మా నాన్నలాగా కనిపించే మొగుడి పక్కన ఎలానడిచేది?”

“నాన్నే అనుకుంటే మాటైనా వినేదానివి.”

“నాన్న అని నేను అనుకోవడంలా, మిగిలిన వాళ్లు అంటారంటున్నా. అయినా మీకంటే ఇరవయ్యేళ్లు ఎక్కువ ఉన్నవాళ్లు కూడా రంగేస్తుంటే – ప్రతీసారీ ఈ రాద్ధాంతం ఎందుకో?”

“ఊర్కెనే నిన్ను ఉడికిద్దామని గానీ, చిన్నప్పుడు తలంటి పోసేటప్పుడు మా అమ్మచేత మొట్టికాయలు, ఇప్పుడు నీచేత చివాట్లు. అయినా కూతురికి పెళ్లి కూడా చేసిన తర్వాత ఈ ఆర్భాటాలెందుకో?”

“కూతురికి పెళ్లి చేసినా పెళ్లాం ఇంకా ఉన్నది గనక.”

“అదృష్టవశాత్తూ బట్టతల రాలేదు. లేకపోతే విగ్గు కూడా పెట్టించే దానివేమో?”

"విగ్గంటే గుర్తొచ్చింది. మా చెల్లెలు ఆయుర్వేదంలో ఇప్పుడు ఏదో షాంపులూ, హెయిర్ ఆయిల్సూ వస్తున్నాయని చెప్పింది జుట్టుకోసం. మరిచిపోకుండా పట్రండి."

"అయితే రెండో సూట్‌కేస్ తప్పదన్న మాట ఈసారి కూడా."

"ఎయిర్‌లైన్ వాళ్లు రెండు తీసుకువెళ్లవచ్చంటే మీకేమిటి ప్రాబ్లం?"

"పెళ్లైన కొత్తలో అంటే అర్థముంది, పిల్లలు చిన్నవాళ్లుగా ఉన్నప్పుడంటే అర్థముంది, దానికి పెళ్లి చేస్తున్నప్పుడంటే అర్థముంది, ఇంకా ఇండియా వెళ్లేటప్పుడూ అక్కణ్ణించీ వచ్చేటప్పుడూ రెండెందుకుట?"

"మీ అబ్బాయికింకా పెళ్లికావాలి. ఆ సంగతి గుర్తుందా?"

"వాణ్ణి ముందు ఆ అమ్మాయి చేసుకుంటాననాలి గదా!"

"చేసుకోనంటే నేను మహదానందంగా ఓ తెలుగమ్మాయిని చూసి పెళ్లి చేస్తా."

"ఒకవేళ నువ్వు చెయ్యగలిగినా గానీ ఆ అమ్మాయితో ఇంగ్లీషులో తప్ప మాట్లాడలేవని పందెం కాస్తాను."

"అయినా ఫర్లేదు. మన దేశం కాని నాకీ అమ్మాయి నచ్చలేదు మొర్రో అంటే వాడేమో వినడు. మీరేమో పట్టించుకోరు."

"పట్టించుకోవడానికి ఇదేమన్నా తైలమా?"

"........."

"అర్థం కానట్టుంది. సరే. ఆ గోలెందుకు కానీ, ఈసారి నేను ఒక సూట్‌కేసుతోనే వెడతాను, ఒక దానితోనే తిరిగి వస్తాను."

"కుదరదు. రెండు పట్టుకు రావాల్సిందే."

"అక్కడ రెండిట్లో పట్టడానికి కావాల్సినన్ని సరుకులేం ఉండవు."

"పెట్టెలు పట్టనంతగా మీ అన్నయ్యా వాళ్లు మీకు పెట్టుబళ్లేం పెట్టరని తెలుసులెండి. పెళ్లి కొడుకు అమెరికా వాడైనా సరే."

"వాళ్లు ఏమీ పెట్టకపోయినా సరేగానీ, రెండు పెట్టెల్లో పట్టే సరుకు ఏం ఉంది?"

"ఏదో ఉంది. మా చెల్లెలికి లిస్ట్ ఇచ్చాను. సూట్‌కేసులో పెడుతుంది. పట్టుకు వచ్చే బాధ్యత మాత్రం మీది."

"ఎయిర్‌లైన్స్ వాళ్లు తెచ్చుకోనిస్తున్నారు కదా అని రాళ్లతో నింపైనా సరే రెండో సూట్‌కేసు పట్టుకుని రమ్మంటావ్."

"అదే – డైమండ్ రాళ్లతో."

"అట్లా పట్టుబడితే ఇంక శ్రీకృష్ణ జన్మస్థానమే. మర్చిపోయా ఇది అమెరికా కదా, మొహమ్మద్ అని పేరు లేకపోవడం మంచిదయ్యింది. లేకపోతే ఆ క్యూబా పక్కన ఉన్న గొంటానమో ప్రిజన్లో పడేస్తారు."

"అయ్యో, అంత భాగ్యం కూడానా?"

"మొగుణ్ణి జైల్లో పడేస్తారంటే దాన్ని భాగ్యమంటావ్! ఆహా, నా మీద నీకెంత ప్రేమ ఉందో ఇప్పుడర్థమయింది."

"నేన్నది సూట్‌కేసుని డైమండ్లతో నింపగల సామర్థ్యం గూర్చి."

"డైమండ్లంటే ఏమిటి? రాళ్ళేగా! నీలాంటి వాళ్ళు వాటికి విలువనివ్వబట్టే అవి కాళ్ళకింద ఉండకుండా ఆడవాళ్ల వంటి మీద చేరాయి. మగవాళ్ల గుండెల్లో గుదిబండలై కూర్చున్నాయి."

"ఒకప్పుడు ముప్పైకిలోలు పట్టుకొచ్చాం ఒక్కో సూట్‌కేస్‌లో. ఈ పెట్రోలు ధరల పుణ్యమా అని అదికాస్తా ఇరవైమూడుకు తగ్గించారని నేను బాధపడుతుంటే, అది పట్టుకురావడానికి కూడా ఎంత బాధో!"

ముప్పై కిలోలు – ఎందుకు గుర్తులేదూ? బాగానే గుర్తుంది. ఒక్కో సూట్‌కేస్‌లో ముప్పై ఏం ఖర్మ, ఇంకో రెండో, మూడో కూడా ఎక్కువై, పార్కింగ్‌లాట్లోంచి ఇంట్లోకి, పధ్నాలుగు మెట్ల మీదుగా – ఎనిమిది సూట్‌కేసుల్ని పైకి చేరుస్తూ, అందులో ఎవరైనా ఇటుకలని పాక్ చేశారా అని చికాకుపడుతూ.

అదిగో, అప్పుడొచ్చింది ఆలోచన. రాళ్లు– విలువైన రాళ్లు.

అదిగూడా మా నాన్న గుర్తొచ్చి. ఆయన పాకులాడిన 'స్వర్గాదపి గరీయసీ' గుర్తొచ్చి. రక్తంలో కలిసిన పంచదార నవ్విన తియ్యటి నవ్వు, చిక్కని నల్లనిరంగుతో కప్పివెయ్య బడుతున్న నెరసిన జుట్టు ద్వారా బాత్‌రూం అద్దంలో ప్రతిఫలిస్తుండగా.

మా పిల్లలు పుట్టిన తరువాత ఒకసారి అమెరికా వచ్చారు. రిటైరయినా గానీ తరువాత మాత్రం ఇంక రానన్నారు. పరాయి మట్టిలో కలవడం గూర్చిన భయమేకాక, అంత్యక్రియలు తనకి కావలసిన విధంగా ఈ దేశంలో జరిగే అవకాశం లేదన్న నమ్మకమూ, ఈ ఖరీదయిన హాస్పిటల్ బిల్స్ నా మీద పడతయ్యేమోనన్న భయమూ కూడా కారణాలని నాకు తెలుసు.

అద్దంలో నుంచీ, "మరి, నీ సంగతేమిటి?" అని నాన్న అడుగుతున్నట్లనిపించింది.

* * *

నదులన్నీ సాగరంలో కలిసినట్టుగా ఆంధ్రప్రదేశ్‌లోని ఊళ్లన్నీ హైదరాబాద్ వైపు పరుగెత్తుతున్నాయ్. అలలు కొండలకి కొట్టుకోవాలని చూపించే ఆతృత, బాధ్యతలేవీ లేకుండా అవి చేసే అల్లరీ కన్పిస్తుంది కానీ, సాగర మధ్యంలో ఉండే గంభీరత మాత్రం ఆ ఊళ్లో ఎక్కడా కనిపించదు. సాగరపు లోతుల్లో దాగిన మణులే తామన్న సంగతి గుర్తించని ప్రజానీకం సాగరపు నివాసుల్లా ప్రవర్తిస్తుంటే అలనై ఆవిరయి పోవాలనిపిస్తుంది.

వంశీ పెళ్లయిన తరువాత హైదరాబాద్‌లో ఆవిరయి గుంటూర్లో తేలాననుకున్నాను గానీ, జేబులోని బస్ టికెట్ మాత్రం ఖచ్చితంగా కాదంది.

"అసలెందుకు వెళ్లడం?" అన్నాడు అన్నయ్య.

ముప్ఫయ్యేళ్లకి పైగా అయింది ఆ ఊరు వదిలి. పాత యిల్లెక్కడో తెలుసు గనక వెతుక్కుంటూ వెళ్లానని మాత్రం చెప్పలేను. బ్రాడీపేట నాలుగో లైన్లో నడుస్తూ వెడుతుంటే పైన వేలాడే ఎలక్ట్రిక్ వైర్లని చూసి, సాలెగూడులో నడుస్తున్న భావన.

"నువ్వనుకున్నట్టుగా గుంటూరు ఇప్పుడు లేదు. గుర్తు పట్టలేవు కూడాను!" అన్నాడు సంజూ.

"క్రితం సారి వెళ్లినప్పుడు మనం ఉన్న యింటిని పడగొట్టి పోసిన కుప్పచూసి కళ్ల వెంబడి నీళ్లు తిరిగెయ్," అన్నాడు వాడే మళ్లీ.

మా అన్నదమ్ముల్లో వాడే కొద్దిగా ఎమోషనల్లూ, పొయెటిక్కూ గూడా.

ఆరువాటాలు, మూడు బిల్డింగులూ ఉన్న కాంపౌండ్ అది. బిల్డింగుల మధ్యలోనే క్రికెట్టు ఆడడం – "ఒరేయ్! ఇక్కడ కాదు బయటికివెళ్లి ఆడుకోండి," అన్న సుబ్బారావుగారి ఆజ్ఞని ఎప్పటికప్పుడే సిక్సర్ కొట్టేస్తూ.

ఇంటి పెరట్లో పత్తిచెట్టు. నాన్న ఎత్తుకుని తిప్పినప్పుడు ఏడుస్తున్నాను కదా అని ఎప్పుడైనా పత్తి కాయలని కోసిస్తే కిందపడేసే వాణ్ణట. మళ్లీ ఇంకొకదాన్ని కోసిస్తే దానికీ అదే గతి. ఆ వయసులో సదా గాడు విసిరికొట్టింది ప్లాస్టిక్ ఆటవస్తువుల్ని – ప్రకృతితో సంబంధంలేని వాటి గూర్చి డబ్బున్న తల్లిదండ్రులు వేరేగా అనుకుంటారు తప్ప ఆ వయసులో విసిరి కొట్టడానికి ఏదైనా ఒకటేనన్న సీక్రెట్ మాత్రం పసిపిల్లల్లో మాత్రమే భద్రంగా దాగి ఉంటుంది.

"ఢిల్లీ సుల్తాన్, పట్టుకుపోతాన్!" నాటకమూ అదే పెరట్లో. తవ్వడానికి గునపం కూడా లేక, అమ్మ యిచ్చిన అట్లకాడతో గుంటతవ్వి, అందులో ఎప్పణ్ణుంచో మూలగా పారేసిన బొంగుల్ని దూర్చి, వాటికి నాన్న పంచెని తెరగా కట్టి.

ఆ పెరట్లోనే పున్నాగచెట్టు. అది కురిపిస్తే తప్ప చేతికి అందని వరాలూ, అందిన వరాల కాడలని విరిచి పీ పీ అను వూదడాలూ; పక్కనే వర్షం వచ్చినా రాకపోయినా వరాలని నేలమీదే ఏరుకోవాలని శాసించే పారిజాతం చెట్టు; అన్నీ ఎలా మరిచిపోగలను?

పూలచెట్లు ఇష్టమని బండెడు నల్లరేగడి మట్టిని అమ్మ తెప్పించి గోడపక్కనే పోయిస్తే దాన్ని చదునుచేసి, ఇటికెలతో బోర్డరు చేసి అందులో విరగ పూయించిన కనకాంబరాలనీ, చేమంతులనీ, బంతులనీ, చిక్కుడు చెట్టునీ ఎట్లా మరువగలను? అదే మట్టితో వినాయకుణ్ణి చేసే ప్రయత్నాన్ని కూడా.

ఇంతకు ముందెప్పుడూ చూడని ఆ నాలుగంతస్తుల ఎపార్ట్‌మెంట్ కాంప్లెక్సులోకి గేటుతీసి అడుగుపెట్టి ఆగిపోయాను. చుట్టూచూశాను. ఆ చివరి నించీ ఈ చివరిదాకా బండలు. నిరాశ ఆవహించింది.

"ఎవరు కావాలండీ?" కొత్త వాడినని పసిగట్టి అడిగాడు వాచ్‌మన్.

ఎవరని చెప్పను?

నా కోరిక విని ఆశ్చర్యపోయాడు ఆ ఎపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంటు. "కింద చూశారు గదా?" అని కూడా అన్నాడు– "కుదరదు" అనే ముందర.

డబ్బుతో కొనలేనిది ఏముంది అన్న ధీమాతో వచ్చిన నన్ను ఈ పరిణామం నిరాశా నిస్పృహలకి లోను చేసింది.

"ఒకసారి ఇలా రండి!" అన్న వాళ్లావిడ పిలుపువిని ఆయన వెళ్లగానే చింత చిగురు గుర్తుకొచ్చి నోట్లో నీళ్లూరించింది.

"మీ అదృష్టం బాగుంది. అయితే రెండ్రోజు లాగాలి. ఉన్న బోర్‌వెల్‌లో నీళ్లు రావట్లేదని ఇంకో బోర్‌వెల్ వేయిస్తున్నాం. దానికోసం మెషీన్ వస్తుంది," అన్నాడాయన వెనక్కువచ్చి.

రెండ్రోజుల తర్వాత అక్కడ నన్ను చూసిన వాళ్లేమనుకున్నా లెక్కపెట్టలేదు. ముఖ్యంగా, నా పనయిన తర్వాత నాగరికత చేతులు కడుక్కోమంటే నవ్వేసి జేబులో పెట్టుకున్న నా చేతుల్ని చూసి.

హైదరాబాద్ వచ్చిన తరువాత అన్నయ్య వాళ్లకి అందులో ఏముందో చెప్పుకోనవసరం లేకపోయింది కానీ, ఎయిర్‌పోర్టులో నా పేరు ఎనౌన్స్ చేసి పిలిచినతర్వాత – అది గూడా, లగేజీ చెక్‌చెయ్యడం అయిపోయిన తరువాత – వాళ్లకి చెప్పక తప్పలేదు.

నమ్మలేనట్లు చూశారు. పెట్టె తెరచి చూసిన తర్వాత ఆ చూపులు పిచ్చాణ్ణి చూసినట్లుగా మారాయి. "ప్రొహిబిటెడ్ ఐటంస్ లిస్టులో ఇది లేదు కదా?" అన్న నా ప్రశ్నకు జవాబివ్వలేక వెళ్లమన్నారు.

న్యూయార్క్‌లో దిగిన తర్వాత కన్వేయర్ బెల్టు మీద నుంచీ తీసుకుంటుంటే సూట్‌కేసుకు బొక్క పడ్డట్టు తెలిసింది దాన్ని భద్రంగా తీసుకుని కస్టంస్ లైన్లో నిలబడ్డాను. మనిషిని చూడగానే హార్ట్ రేట్ చెప్పగలిగే ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ వాడొకడు నా సూట్‌కేస్ వాలకాన్ని చూసి దాన్ని ఎక్స్–రే మెషీన్లో పెట్టమన్నాడు.

ఆ మెషీన్లో దాని పేగులు లెక్కించిన ఆ కస్టంస్ అధికారి లేచి నిలబడి, అది ఇవతలకు రాగానే "ఇందులో ఏముంది?" అనడిగాడు. చెప్పాను.

లావుగా ఉన్న కళ్లద్దాల్లోంచి అతని కళ్లల్లో నీటిపొర ఆకాశమంత విశాలంగా, సముద్రమంత నిశ్చలంగా కనిపించింది.

నాకన్నా అతను పెద్దకావచ్చు. ఈ చైనీసు వాళ్ల వయసు చెప్పడం కష్టం.

"థాంక్యూ మై ఫ్రెండ్. యు గేవ్ మి ఎ గ్రేట్ అయిడియా!" అని కరచాలనం చేశాడు. మా మధ్యలో కన్వేయర్ బెల్టు లేకపోతే కావలించుకునే వాడనిపించింది. యాక్సెంటుని బట్టీ నాలాగే ఇమ్మిగ్రెంట్ అని తెలిసింది.

ఇంటికి రాగానే ఆ సూట్‌కేస్ వాలకాన్ని అనుమానంగా చూసింది శ్యామల. అందులో ఏమున్నదని అడిగింది. చెప్పాను. నమ్మలేకపోతే పెట్టి తెరిచి చూపించాను.

"మరి నేను తెమ్మన్నవి?" కోపానికి ఆనకట్ట తెగడానికి సిద్ధంగా ఉన్నదని చెప్పగలను.

"ఆ రెండో సూట్‌కేసులో."

"మరి మీ గుడ్డలు?"

"కేరీ ఆన్లో పట్టని వాటిని ఇండియాలో వదిలి వచ్చాను – బీదవాళ్లకి ఇవ్వమని చెప్పి."

"ఎందుకని అన్ని డబ్బులు వేస్టు చేశారు?"

"వాటికన్నా విలువైన దాని కోసం."

"ఎవరైనా వింటే నవ్వుతారు."

"చెప్పకు!" అన్నాను పొరపాటున అలా అనడం చెప్పడానికి పర్మిషన్ ఇచ్చినట్టే కదా!

"ఆ పెళ్లికి వెళ్లకుండా ఉంటే మూడువేల డాలర్లూ మిగిలేవి, ఈ గోలా ఉండేది కాదు."

"మూడు ఔన్సుల బంగారం వచ్చేది!" అన్నారు పార్టీలో ఆడవాళ్లు.

"ఇంకొన్ని వేలు కలిపితే ఇండియానించీ గ్రానైట్ తెప్పించి ఇంటినిండా పరుచుకోవచ్చు" నన్నారు కొందరు మగవాళ్లు.

"మీ డాడీ తెచ్చిన స్పెషల్ బేస్‌మెంటులో ఉంది చూడండి" అని చెప్పి శ్యామల రాధీని, సదాని బేస్‌మెంట్‌లోకి తోసింది.

* * *

చీకట్లోనైనా, వానలోనైనా దాదాపు కళ్లు మూసుకుని ఇంటికి డ్రైవ్ చెయ్యగలను– ఎన్నో ఏళ్ల బట్టీ చేస్తున్నాను కాబట్టి.

ఆరోజు కూడా అలానే వస్తుంటే గుండ్రంగా తిరిగే ఎగ్జిట్ ర్యాంప్ మీద నా కారు మరింత గుండ్రంగా, అంతకన్నా వేగంగా, రోజూ టైర్లని పట్టి ఆపుతున్న రోడ్డుమీదున్న కసినంతా ఒక్కసారే తీర్చుకుంటూ, శృంఖలాలని తెంపుకుని అడవిలోకి పరుగెడుతున్న ఖైదీలా రోడ్డు మీద నించీ ఎగిరి దూకింది.

పోలీసుల మీద కచ్చతో ఎవడో, అక్కడి దగ్గరలోనే ఉండే పోలీస్‌స్టేషన్ వాళ్లు తరచుగా వాడే ఆ ర్యాంప్ మీద నూనె పొయ్యడం వల్ల అక్కడ పోలీస్‌కార్లకే కాక ఇంకా చాలా కార్లకి యాక్సిడెంట్ అయిందని చదివినగుర్తు. అయితే, అలా చేసిన వాణ్ణి పట్టుకున్నామని చెప్పారు గదా! మరి యిదెట్లా అయింది?

చుట్టూ ఎవరున్నారో చూద్దామని ప్రయత్నించాను కానీ, లోతులో ఉండడం వల్ల కాబోలు – ఆకాశం మాత్రం కనిపిస్తోంది. ఎవరి మొహాలూ కనిపించట్లేదు. శ్యామల ఎక్కు పెట్టడం వినిపిస్తోంది.

నా కోరికని వాళ్లు మన్నించరని భయపడ్డ మాట నిజమే– అందరూ చేసినట్లు చెయ్యాలనే పట్టుదల శ్యామలది. అందుకనే, నన్ను దహనం చెయ్యరనే నమ్మకం నాకు కలగలేదు. వీలునామా రాశాను గానీ, “దాన్ని అంతా అయిపోయిన తర్వాత చూస్తే?” అన్న ప్రశ్న నన్ను వేధించిందిప్పటిదాకా. బేస్‌మెంటులో సదాతో చెప్పింది వాడికి గుర్తున్నదన్న మాట.

“బాబూ, మొదట నువ్వు మట్టి చల్లమ్మా.”

ఎంతో ఆతృతతో ఎదురు చూశాను.

ఆకాశాన్ని కొంత కప్పేస్తూ సదా ముందుకువచ్చాడు. వాడి చేతిలో నా ప్రియమైన సూట్‌కేస్. దాన్ని చూడగానే నా సందేహాలన్నీ పటాపంచలైపోయాయి. “గాడ్ బ్లెస్ యూ!” అన్నాను. వినిపించిందో, లేదో! అందులో ఉన్న మట్టిని నా మీద బోర్లించాడు.

నా తల్లి నన్ను కావలించుకుంటూ, నా ఒళ్లంతా స్పృశిస్తూ, తన గర్భంలో నన్ను ఇముడ్చుకుంటూ ఆకాశాన్ని నాకు కనబడనీకుండా కప్పేసింది.

(కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ)

(ఆంధ్రభూమి దినపత్రిక, మే 31, 2009)

* * *

# ఓ ప్రేమ కథ

మబ్బులంటే నా కెంతో ఇష్టం.

అరుణారుణిమ వర్ణాలని ప్రాతఃకాలంలోనూ, సంధ్యాసమయంలోనూ సూర్యునిలో పరికించి పులకరించేవాళ్లు కొందరయితే, ఆ సమయాల్లో మబ్బులు విసిరిన వలలో చిక్కుకుని వాటి విన్యాసాలనీ, విలాసాలనీ తనివితీరా వీక్షించేవాణ్ణి నేను. సూర్యోదయాలకి ముందు అవి సూర్యుని రాకని తెలిపే వందిమాగధుల్లాగానూ, అస్తమయాల తరువాత రోజంతా అతను చూపిన ప్రతిభాపాటవాలకి మురిసిపోయి చప్పట్లు కొడుతున్న ప్రేక్షకుల్లాగానూ ఉన్నాయని ఒకరోజు అనుకుంటానా, మరునాడు అవి తమ అందాలను ఎగరేసి అతణ్ణి తమవెంట లాక్కొచ్చి, తరువాత మాయమైపోయి మళ్లీ అస్తమయ సమయానికి తాము అతని వెనుకే నడుస్తున్నామన్న విషయాన్ని అతనికి తెలియచెయ్యవద్దని నాకు కనుగొట్టి చెబుతూ వెంటనడిచే రమణీలలామల్లాగా కనిపిస్తాయి. అవి అలా నాకు కన్నుగొడుతున్నప్పుడు వెనక్కి తిరిగిచూసిన సూర్యుడు మొహాన్ని ఎర్రగా చేసేసుకుని, గిరుక్కున మొహం తిప్పేసుకుని, మరునాడు పొద్దున్నదాకా అలానే ఉంచుకుంటాడు – మళ్లీ మబ్బుల దర్శనమయేదాకా. కాసేపట్లోనే వాటి మంత్రాలకి చల్లారిపోయి రోజంతా తెల్లగానే ఉంటాడు.

నాలుగేళ్ల పాపచేసిన రంగుల కళాఖండంలో లాగా మబ్బులు నిలబడ్డాయని ఒకసారి సూర్యోదయం సమయంలో అనుకుంటానా, ఆ మధ్య చూసిన అర్ధచంద్రాకారపు సముద్రతీరాన్ని ఇసుకతో, సముద్రంతో, ఒడ్డుకు దూరమయ్యేకొద్దీ మారే నీళ్ల రంగుతో, ఆఖరికి ఆ నీటి చివరన మీద వాలిపోయే ఆకాశంతో సహా తెచ్చి నా కళ్లముందు ఆకాశంలో నిలబెడతాయి. ఒక్కోసారి మబ్బులులేని సూర్యోదయం ఏదో పనిమధ్యలో ఉండడం వల్ల అమ్మ అడ్డం రాకపోవడంవల్ల భయం కల్గించే నాన్న కోపంలా కనిపిస్తుంది. మరోసారి, తడిచేతిని చీరెకొంగుకు తుడుచుకుంటూ బామ్మ అడ్డంవచ్చి నాన్నని

గదిమినప్పుడు, తలుపు వెనుక దాక్కుని దాని సందులోంచి చూస్తున్న పిల్లాడికి, ఆ మంత్రానికి చల్లబడిపోతూ కనిపించే నాన్న మొహంలోని నారింజ రంగుని ఆ మబ్బులు పులుముకున్నట్లు కనిపిస్తాయి. అప్పుడప్పుడూ మాత్రం సూర్యుడు పెట్టిన ముద్దుకి వేడెక్కిన సిగ్గు రంగుని అవి ప్రదర్శిస్తాయి.

సూర్యుడు తమకు మాత్రమే పరిమితం కావాలనుకున్నప్పుడు మాత్రం అవి అతణ్ణి చుట్టేసి, లోకానికి దట్టమైన నల్లని రంగుని చూపెడతాయి. అతని కౌగిట్లో ఉరుములు, మెరుపులతో సేదతీరి కాసేపటికి ఆవిరై మాయమవుతాయి.

ఒక్కోసారి ఆకాశాన్ని సముద్రంగా మార్చేసి, ఉదయించడానికి బద్ధకిస్తున్న సూర్యుణ్ణి, అతని కిరణాలని పట్టుకుని బయటకు లాక్కొస్తున్న అలల్లాగా అవి దర్శనమిస్తాయి. వేరొకసారి, అప్పుడే వెళ్లిపోవద్దని చీకటి అతణ్ణి తనకౌగిలిలో బంధించి ఉంచాలని చేసే చివరి విఫలప్రయత్నాలకి అవి రూపాన్నిస్తూ శిథిలమవుతున్న తాటాకు తడికల్లాగా అతనికి అడ్డం వస్తాయి. ఇంకొకసారి, వస్తున్నాడొస్తున్నాడోయ్ అంటూ అతని కాంతికిరణాలని విశ్వమంతా వెదజల్లాలనే తపనతో అయిదారు గొట్టాలలో పెట్టి వదిలిన చంద్రుని పరిమాణమున్న తారాజువ్వలు వెళ్లిన బాటగా రూపాంతరం చెందుతాయి.

ఇంద్రధనుస్సులో కనిపించని బంగారు, వెండివర్ణాలు వాటికెక్కణ్ణించి వచ్చాయో చెప్పమన్నా అవి చెప్పవు. పైగా, ఉన్నవాటినే నువ్వు సరిగ్గా చూశావా అని గేలిచేస్తాయి. తెలుపు, నలుపు, ఎరుపు, కెంజాయ, పసుపు, బంగారం, వెండిరంగులతో మాత్రమే వాటిని గుర్తుపెట్టుకుంటూ, నీలం మబ్బుల్లేని ఆకాశపురంగుమాత్రమేనని భ్రమసే నాలాంటివాడికి కొన్నివేల నీలవర్ణాల సమాహారంతో – బంగారం, వెండిని కలిపిన వాటితోసహా – మానవుడి ఛాయలేని చెట్టూ పుట్ట, కొండాకోనలతో సూర్యాస్తమయం అయిన తరువాత ప్రశాంతంగా ఉన్న సముద్రతీరాన్ని కళ్లముందుంచుతాయి.

ఇప్పటిదాకా నేను ఆకుపచ్చరంగు మబ్బు గూర్చి చెప్పలేదేమని మీరు అనుకుంటున్నారు గదూ? దాన్ని గూర్చి చెప్పాలంటే ఒక కథ చెప్పాలి. ఈ కథకీ ఆ రంగుగల మబ్బుకి గల సంబంధం ఏమిటో తెలుసుకోవాలంటే కథ చివరిదాకా ఆగాల్సిందే. ఈలోగా ఆ రంగుగల మబ్బుని మీరు చూశారేమో గుర్తుకు తెచ్చుకోండి.

* * *

మబ్బుతో అందరికీ తొలిసారి పరిచయం అమ్మ పొత్తిళ్లలో ఉన్నప్పుడే జరగవచ్చు. అది, తనలో దాగుండే ఉరుములు, మెరుపులద్వారా తన ఉనికిని పసిపాపలకి తెలియజెప్పు కోవాలని మబ్బుపడే ఆత్రం వల్లకావచ్చు. అప్పుడయితే, "ఎందుకమ్మా భయం, నేనున్నాగా!" అని తల్లి అక్కున జేర్చుకుని లాలిస్తుంది. నోటిమాటల సడి కాలినడకల వడిని చేరినప్పుడు "అర్జునః ఫల్గుణః పార్థః" అన్న మంత్రాన్ని కూడా ఆమె ఉపదేశించవచ్చు. వర్షపు నీళ్లు

ఇచ్చి వెళ్లిన కాలువలమీద కాగితపు పడవలని నడుపుతున్నప్పుడు మబ్బులు తెచ్చే ఆనందమేమిటో చూచాయగా తెలియవచ్చు. కానీ, నాకు మబ్బు అని అనగానే చాలాకాలం పాటు ఉరుముతప్ప మరేదీ వెంటనే గుర్తుకురాకపోవడానికి కారణం సుబ్బారావు.

అతను మా ఇంటాయన మేనల్లుడు. ఆయన ఇంట్లోనే ఉంటూ కాలేజీలో బి.ఏ. చదువుతూండేవాడు. అప్పుడు నాకంటే కనీసం పన్నెండేళ్లు పెద్ద ఉండాలి. కాంపౌండ్ వాల్ లేని మా ఇంటి వరండాలోంచి అతను తన ఇద్దరు మిత్రులతో సందుచివర నిలబడి మాట్లాడుతూండడం నాకు కనిపిస్తుండేది. వాళ్లు అప్పుడప్పుడూ అతనికోసం వచ్చి ఇంటి ముందు నిలబడి అతణ్ణి పిలవడం కూడా నాకు బాగా గుర్తు.

ఒకరోజు చీకటిపడిన తరువాత ఇంటిముందు నిలబడి అతణ్ణి పిలిచిన గొంతు వేరేగా ఉంది. ఆ గొంతు నుండీ వెలువడిన "సుబ్బారావు ఉండేది ఇక్కడేనా?" అన్న ప్రశ్న ఆ మధ్య మానాన్న ఒకనాడు ఇంట్లో అడుగుపెడుతూ, "ఏడే వాడు?" అన్న ప్రశ్న లాగా కరుకుగా వినిపించి, దాని తరువాత నాకు జరిగిన బడితెపూజని గుర్తుకుతెచ్చి భయాన్ని పుట్టించింది. పెద్దవాళ్లు అప్పుడప్పుడూ వాడే ఆ గొంతు మా ఇంటాయనక్కూడా బాగా తెలిసే ఉండాలి, "ఎందుకూ?" అంటూ బయటికొచ్చాడు. "ముందతన్ని పిలవండి!" అన్న వాళ్ల ప్రశ్నకి బదులుగా, "పనేమిటో చెప్పండి" అన్నాడు.

"వాడు మీ అబ్బాయా?"

"నేను వాడి మామయ్యని".

"మా అమ్మాయిని వాడు కాలేజీకెళ్లే దారిలో కాపుకాసి రోజూ అల్లరిపెడుతున్నాడు" అన్నదవతల కంఠం.

"నేను కనుక్కుంటాను," అన్నాడు మా ఇంటాయన ప్రశాంతంగా.

అవతలివాళ్లు కాసేపు నిశ్శబ్దంగా ఉన్న తరువాత, "ఈసారి ఇక్కడిదాకా రానివ్వం. రోడ్డుమీదే నిలబెట్టి తంతాం!" అనిచెప్పి వెళ్లిపోయారు.

పెద్దయిన తరువాత నాకు అర్థమైన దేమిటంటే, "వాడు" అన్న పదాన్ని అవతల కంఠం సుబ్బారావుని గూర్చి వాడడం వాళ్ల కోపస్థాయిని తెలియజెయ్యడంతో ఆ పరిస్థితిలో అతణ్ణి వాళ్లముందుకు రానీయకుండా ఆయన మేనేజ్ చేశాడని. మా ఇంటాయన గనుక, "సుబ్బారావు అలాంటి పనులుచెయ్య"డని ఓట్రిస్తే గనుక ఆయనముందే అతణ్ణి కడిగేద్దామనో లేక ఉతికేద్దామనో వచ్చినవాళ్లు కాస్తా ఇలాంటి జవాబుని ఆశించలేదు గనుక, దానికి ఎలా సమాధానం చెప్పాలో తెలియక వెనుదిరిగి ఉంటారనీను.

"ఏరా, వాళ్లు చెప్పింది నిజమేనా?" అన్నాడాయన ఇంట్లోకొచ్చిన తరువాత సుబ్బారావుని గద్దిస్తూ. మా రెండు వాటాలమధ్య మూసివుండే తలుపులు అవతలిపక్క సంభాషణలని మాకు చేరనీకుండా ఎప్పుడూ ఆపలేదు.

"నేనుకాదు మామయ్యా! మా ఫ్రెండ్ ప్రసాద్ ఆ అమ్మాయిని తను ప్రేమిస్తున్నానని చెప్పాడంతే!" అన్నాడు సుబ్బారావు.

"అవ్వ! ఏం పోయేకాలం బుద్ధులు! ఎంత పరువుచేటు!! నా కిష్టంలేకపోయినా ఆ పల్లెటూళ్లో ఉన్న మీ అమ్మ మొహంచూసి ఆయన నిన్నిక్కడ నెత్తికెక్కించుకొని చదివిస్తుంటే..." వాక్యాన్ని మధ్యలోనే ఆపేసింది ఇంటావిడ. "నా ఖర్మ ఇలా కాలింది!" అన్న తరువాత ఆవిడ ముక్కు చీదడం స్పష్టంగానే వినిపించింది.

"ఇంక ఆ ప్రసాద్‌తో తిరక్కు!" మేనల్లుడికి ఆజ్ఞని జారీచేశా డాయన.

* * *

శాన్‌ఫ్రాన్సిస్కో నగరాన్నించీ మ్యూర్ వుడ్స్ నేషనల్ పార్క్‌కి వెళ్లాలంటే హైవే 101 మీద ఉత్తరదిశగా గోల్డెన్ గేట్ బ్రిడ్జ్ దాటి కొంతదూరం వెళ్లిన తరువాత ఎగ్జిట్ తీసుకోవాలి. అక్కణ్ణించీ వెళ్లేదారి కొండలచుట్టూ తిరుగుతూ లోతైన ఘాట్‌లని ఒకవైపు, ఎత్తైన కొండలని ఇంకోవైపూ మార్చిమార్చి చూపిస్తూ చివరికి ఆ పార్క్‌కి చేరుస్తుంది. అక్కడ ఎన్నో వందల ఏళ్లుగా ఆకాశాన్నంటే ప్రయత్నాన్ని నిరాఘాటంగా నిర్విరామంగా చేస్తున్న రెడ్‌వుడ్ చెట్ల మధ్య ప్రతీక్షణమూ పండుగ చేసుకునే నిశ్శబ్దాన్ని నేలమీద సన్నపాయలుగా ప్రవహించే కొండనీటి గలగలలు తప్ప ఏవీ భగ్నం చెయ్యవు. ఆ చెట్లకుండే చిన్న ఆకులు కూడా నేలకి కనీసం వందల అడుగులు ఎత్తులో ఉండడంవల్ల వాటి గలగలు కూడా నేలమీద నిలబడ్డవాళ్లకి వినిపించవు. ఆ ప్రశాంతతని మరోసారి పొందుదామని వెడుతూ మార్గమధ్యంలోనే రోడ్డుపక్కన కారునాపి దిగాను– వ్యాలీలో కనబడుతున్న దృశ్యాన్ని తనివితీరా చూడడానికి.

ఆ వ్యాలీలో వేలాడుతోంది ఒక మబ్బు. దూదిపింజలాగా ఉన్నది. అది అక్కడ ఎవరినో పరామర్శించడానికో, ఓదార్చడానికో, అక్కునచేర్చుకోవడానికో, లేక అందాలతో బంధించడానికో నిలబడ్డట్టుగా అనిపించింది. విమానంలో కూర్చొని మబ్బులన్నిటినీ దాటేటంత ఎత్తులో ఎగరడం తెలుసుగానీ ఆ వ్యాలీని దాటేటంత కూడా ఎత్తులేని ఈ మబ్బు నాకు చెయ్యిచాచితే అందేటంత దూరంలో ఉండడం నన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేసింది. అంతదగ్గరగా దాని ప్రత్యేకతని గమనించడం అదే మొదటిసారి.

* * *

ఇంజనీరింగ్ కాలేజీలో రెండో ఏడాది చదువుతున్నప్పుడు డిసెంబర్లో సెలవులకి ఇంటికి వెళ్లేసరికి శేఖర్, జ్యోతి ఒక ఐటమ్ అయ్యారు. ఇద్దరూ మెడికల్ కాలేజీలో క్లాస్‌మేట్స్. వాడూ, నేనూ హైస్కూల్ నుంచీ క్లాస్ మేట్లం. నాకు సెలవులే అయినా శేఖర్‌కి కాలేజీ ఉన్నందున పగటిపూట వాడిని కలవాలంటే బెస్ట్ టైం ఎప్పుడయినా కావచ్చుకానీ, ప్లేస్ మాత్రం వాళ్ల కాలేజీ కాంటీన్. క్లాసు లెగ్గొట్టడం గూర్చి వాళ్లిద్దరూ

పెద్దగా పట్టించుకోలేదు. శేఖర్ ఆ అమ్మాయిని నాకు పరిచయం చేసేసరికి వాళ్లు ఒకళ్ల వాక్యాలని ఒకళ్లు పూర్తిచేసే పరిస్థితి కొచ్చారు. ఆ తరువాత సెమిస్టర్ల మధ్యలో సెలవులకి వచ్చినప్పుడల్లా వాళ్లమధ్య ఒకరి సామీప్యం ఇంకొకళ్లకి ఆనందాన్నివ్వడంలో కనిపించిన పురోభివృద్ధిని గమనిస్తూనే ఉన్నాను. వాళ్లమధ్య ప్రేమని అత్యంత సన్నిహితుడిగా చూసినవాణ్ణి. నా ఫైనల్ ఇయర్లో. ఫైనల్ సెమిస్టర్ అప్పటికి పూర్తికాకపోతే మాత్రం, వాళ్లు రిజిష్టర్ మేరేజ్ చేసుకుంటామంటే సాక్షి సంతకాన్ని పెట్టకుండా ఎలా వుంటాను? ఇంకో సంతకం మాత్రం, అపర్ణదై ఉంటే బావుండేదనుకున్నాను.

నేను నా డిగ్రీ మూడో ఏడాది మధ్యలో డిసెంబర్లో సెలవులకి వచ్చి మా ఊళ్లో ఉన్న రోజుల్లో శేఖర్‌తో కలిసి హోటల్లో టిఫిన్ తిని కాఫీ తాగిన తరువాత వాడికి మెడికల్ కాలేజీదాకా కంపెనీ ఇస్తూ నడిచివెళ్లే ముందర సెంటర్లో నిలబడి కాలేజీకెళ్లే అమ్మాయిలని చూస్తున్నప్పుడు నా కళ్లముందు మెరిసిన మెరుపే అపర్ణ. ఆ అమ్మాయి వుమెన్స్ కాలేజీలో చదువుతోందని తరువాత తెలుసుకున్నాను. ఆ అమ్మాయి సెంటర్లో నిలబడివున్న నన్ను దాటివెళ్లిన తరువాత వెనుదిరిగి నేను తనని గమనిస్తున్నానని నిర్ధారణ చేసుకోవడం, తను నన్ను గమనించిందని నేను గుర్తుపెట్టుకోవడం, అంటే కనులు కనులతో కలబడడం, ఒకేసారి జరుగుతూండేది ప్రతీరోజూ. అది కుదరనీయని ఆదివారమంటే నాకు కోపం వచ్చేది. వేసవి సెలవులంటే మరీనూ.

అమ్మాయిల పేర్లు తెలుసుకోవాలంటే అంత తేలికకాని రోజుల్లో నా నెలరోజుల సెలవుల్లో చివరి రోజున డైరెక్ట్‌గానే అడిగి తెలుసుకోవాలనుకుని మామూలు టైంకే వెయిట్ చేస్తున్నాను. ఆ అమ్మాయి నన్ను దాటి వెడుతున్నప్పుడు నేను ఆమె పక్కన నడవడం మొదలుపెట్టి, “నాకు మీపేరు...” అని ఆగిపోయాను. ఆమె నావైపు తలతిప్పి, కళ్లల్లోకి చూస్తూ, “అపర్ణ” అంది.

నేను వాక్యం పూర్తి చెయ్యలేకపోవడానికి కారణం నా భుజం మీద పడ్డచెయ్యి.

* * *

గ్రాండ్‌ఫాదర్ మౌంటెన్ అమెరికాలో తూర్పు ప్రాంతంలో ఉన్న అత్యంత ఎత్తైన పర్వతం. సముద్రమట్టానికి మైలుకు పైగా ఎత్తులో ఉంటుంది దాని శిఖరం. బి.టెక్ పూర్తిచేసిన తరువాత కంపెనీ పంపగా నార్త్ కెరొలైనా రాష్ట్రానికి వెళ్లి, అక్కడ ర్యాలీలో పనిచేస్తున్నప్పుడు దగ్గరేకదా అని క్రిస్మస్ సెలవుల్లో డ్రైవ్ చేసుకుంటూ వెళ్లాను. చలికాలం కావడంవల్ల కాబోలు ఆ పర్వతం దగ్గరయ్యేకొద్దీ రోడ్డుమీద కనిపించే కార్లసంఖ్య తక్కువవుతూ వచ్చింది. కొండచుట్టూ ప్రదక్షిణం చెయ్యడానికన్నట్టు వేసిన రోడ్డుమీద వెళ్లి శిఖరాన్ని చేరుకున్న తరువాత అక్కడ విజిటర్స్ సెంటర్ పార్కింగ్ లాట్ ఖాళీగా కనిపించింది. నేనొచ్చానని కాబోలు, ఆనందంగా వచ్చి నా కారుని చుట్టేసిన మబ్బుని

అలానే చూస్తూ ఉండిపోయాను. కారు పార్క్ చేస్తున్నప్పుడు అస్పష్టంగా దాదాపు యాభై అడుగుల దూరంలో ఉన్నట్టు అనిపించిన విజిటర్స్ సెంటర్ బిల్డింగ్‌ని కూడా కనపడనీయకుండా పూర్తిగా నన్నది చుట్టేసింది. తలుపు తీసి కాలు బయటకుపెట్టి దిగాను. మబ్బు చుట్టేసిన ఆనందాన్ని మొదటిసా రనుభవించాను గానీ దానిలో దాక్కున్న గాలి మాత్రం ధడేల్మని కారు తలుపుని వేసేసింది. కారు అడ్డం లేకుండా ఒక అడుగువేసినా గానీ ఆ మబ్బూ, గాలీ కలిసి నన్ను ఎగరేసుకుపోతాయని భయం వేసింది. వెంటనే విజిటర్స్ సెంటర్ వైపుకు అడుగువేసే ఆలోచనని కూడా వదిలేసి కారెక్కి శిఖరాన్నుంచీ కిందకు డ్రైవ్ చెయ్యడం మొదలుపెట్టాను. మొదటి మలుపువచ్చే దాకా స్టీప్ ఇంక్లైన్. చివరగా హెయిర్ పిన్ బెండ్. కారుని కంట్రోల్ చెయ్యలేకపోతే? అరచేతుల్లో చెమటలు పట్టాయి.

* * *

"ఇందాకట్నుంచీ పిలుస్తున్నాను. పలక్కపోతే నువ్వు కాదేమోనని అనుమానం వచ్చింది కూడా!" అన్నది నా భుజం మీద వేసిన చెయ్యి ఓనర్ గొంతు. ఆ ఓనర్ మా పాత యింటాయన. అదే, సుబ్బారావుకి మామయ్య మా అమ్మగొంతులో, "ఎంత పరువు చేటు!" అన్న మూడు ఉరుములు నా మదిలో దిగబడ్డాయి. పెళ్లి కెదిగిన అక్కయ్య, హైస్కూల్లో వున్న చెల్లెలు మెదడులో మెరిసి భయపెట్టారు. నేను అపర్ణని పేరడగడం, ఆ అమ్మాయి చెప్పడం ఈయన వినివుంటే? ఈ వార్తని మా యింటికి చేరవేస్తే? అవి కలుగజేసే పరిణామాలని గూర్చిన భయాలు నన్ను చుట్టుముట్టాయి. ఆరోజే నేను ఊరు వదుల్తున్నాననీ, అందుకని, మా అమ్మానాన్నలకి తెలిసినా వాళ్లు నన్ను ప్రశ్నించకపోవచ్చుననీ అనుకుని స్థిమితపడ్డాను.

* * *

డెన్వర్‌ని మైల్-హై సిటీ అంటారు.

సముద్రమట్టానికి మైలు ఎత్తులో ఉంటుంది గనుక. ఆ చుట్టుపక్కల పర్వతాల శిఖరాలు ఎండాకాలంలో కూడా ఎంతో కొంతమంచుతో కప్పబడి ఉంటాయి. ఒక రోజున హైవే మీద కార్లో బౌల్డర్ వెడుతూ నేను చూసిన దృశ్యం ఇదీ! మేఘాల మధ్యలోంచి ఎవరో దింపుతున్నట్టున్న మెరిసే లావుపాటి కాంతికిరణ స్తంభాలు మంచుతో కప్పబడిన ఆ శిఖరాన్ని చేరుతూ నింగికి వేసిన బాటలాగా ఘనీభవించి ఉన్నాయి. ఆ వెలుగుల జిలుగు నామెదడులో పచ్చబొట్టు వేసింది.

* * *

అమెరికా వచ్చిన రెండేళ్ల తరువాత ఇండియా వెళ్లేసరికి నీలాంబరి - శేఖర్, జ్యోతిల కనులపాప- బొద్దుగా ముద్దుగా వుండి పాకుతూ ఇల్లంతా చక్కబెడుతోంది. ఈ

వెలుగు శేఖర్నీ, జ్యోతినీ ఇంకా గాఢంగా పెనవేసింది. కళ్లజోడు, మీసాలు వాళ్ల నాన్నకిలాగే నాకూ ఉన్నాయని నామీదకి తేలిగ్గానే దూకేసింది. ఆ ముగ్గురినీ చూస్తే "మెరుపు మేఘము కలిసి మెరసినట్లుండె!" అన్న అన్నమయ్య వాక్యం గుర్తొచ్చింది. నీలాంబరి వాళ్ల మేఘానికి అద్దిన మెరుపు.

"నీ మబ్బుని చూడవా?" అన్నాడు శేఖర్ ఆటపట్టిస్తూ- మబ్బుల ఉపమానాన్ని అప్పటికే వాడితో పంచుకున్నాను గనుక.

"చూడాలంటే, కారూ, కొండలూ, లోయలూ, జనారణ్యంలేని ప్రదేశాలూ కావాలి. లేకపోతే మళ్లీ ఎవరో ఉరమడం ఖాయం!" అన్నాను.

"ఇక్కడ జనారణ్యంలో తప్ప ఛాయిస్‌లేదు. అమెరికా తీసుకువెళ్లు. అక్కడ నీకు కావలసినట్లు చూసుకోవచ్చు!" అన్నాడు వాడు.

"తనకి ఇంకా పెళ్లి కాలేదని నీకెలా తెలుసు?" అడిగాను.

"మొన్నీమధ్య మా బాబాయి కూతుర్ని యూనివర్సిటీలో చేర్చడానికి వెడితే అక్కడ కనిపించింది. మెళ్లో నల్లపూసలూ అవీ ఏవీలేవు," అన్నాడు షెర్లాక్‌హోం స్టైల్లో.

"జ్యోతి మెడలోనూ లేవు" అన్నాను అనవసరంగా ఆశని పెంచుకోవడం ఎందుకని.

"ఇక్కడ రివర్స్ నాయనా. ఈవిడ నా మెడలో వేసింది వీరతాడు!" అన్నాడు వాడు జ్యోతి మెడచుట్టూ చెయ్యేస్తూ. అమెరికాలో అయితే అలాంటి పొజిషన్లో ఉండే ప్రేమజంట తరువాత తమ పెదాలని పెనవేసేది. వీళ్లు నాముందు అంత ధైర్యం చెయ్యలేదు. "ఆ పిల్ల అంతధైర్యం చేసేదే అయితే నిన్నీపాటికి ఎప్పుడో ఎగరేసుకుపోయేది."

ధైర్యం చెయ్యడానికి వాడు అప్పటికే కొన్ని వివరాలు సంపాదించిపెట్టాడు వాడి బాబాయి కూతుర్ని పట్టుకొని. యూనివర్సిటీ క్యాంపస్‌కెళ్లి అపర్ణ క్లాసులుంటయ్యనుకొన్న బిల్డింగ్ ముందు నిలబడ్డాను. మొదటి రోజే అపర్ణ కనిపించింది కానీ, ఆమె కళ్లల్లోకి చూడగానే గుండె వేగం పెరిగిందనీ, అందుకని ఫ్రీజ్ అయి ఆమెదగ్గరకు వెళ్లే ప్రయత్నం చెయ్యలేదనీ చెబితే ఈ కాలపు పిల్లలు నవ్వుతారు. తను నన్ను ఖచ్చితంగా చూసిందనేది గమనించినా, గొంతు గుండెలోపల దాక్కుండిపోవడం వల్ల అలాగే వచ్చేశాను.

రెండో రోజు ఆ అమ్మాయి పక్కన ఇద్దరు చెలికత్తెలు ఆమెకి చెరోపక్కా నిలబడి కాపలాకాస్తున్నట్లుగా కనిపించేసరికి ఆరోజు ప్రయత్నానికి స్వస్తి చెప్పాను.

* * *

కాలిఫోర్నియాలో శాన్‌ఫ్రాన్సిస్కోకి సౌత్‌వెస్ట్‌గా ఉత్తరదక్షిణాలుగా ఉన్న హైవే 280 మీద ఉత్తరదిశగా సాయంత్రం డ్రైవ్‌చేసి వెడుతూ ఎడమవైపున కనిపిస్తున్న సీనరీని చూస్తున్నాను. ఈ రోడ్డు కొండలమధ్యగా వెడుతుంది. ఎడమవైపున వేలీ. దానికి ఇంకాస్త పశ్చిమంగా కొండలవరుస. వాటికి ఇంకాస్త పశ్చిమంగా ఇంకో కొండలవరుస. పక్షిలాగా

ఆ వరుసలని దాటుకుంటూ వెడితే ఒక ఇరవై ముప్ఫై మైళ్లదూరంలో పసిఫిక్ మహాసముద్రం. ఆఫీసు పనిమీద సిలికాన్ వేలీ చుట్టుపక్కలకి వెళ్లినప్పుడు ఆ సీనరీని చూడడం కోసం ఆ రోడ్డుమీద వెళ్లడమంటే నాకు చాలా ఇష్టం.

ఆ ట్రిప్పులో నేనా రూట్లో వెళ్లడం ముచ్చటగా మూడోసారి. ముందు రెండురోజులూ నేను గమనించినది, ఆ కొండల వరుసలు కప్పుకొన్నట్లు వున్న మబ్బుని. మబ్బు అంటే మనకి కనిపించే ఎత్తులో మొదలై ఆకాశంలో ఎంత ఎత్తుకు వెళ్లినా ఉంటుంది అనేది నా అపోహ మొదటిసారి విమానం ఎక్కేదాకా. విమానంలో ఎక్కిన తరువాత ముప్ఫైవేల అడుగుల ఎత్తుకెళ్లి అక్కణ్ణించీ మబ్బులన్నీ ఆ ఎత్తుకి కిందనే ఉండడం చూశా. ఆ రెండ్రోజులూ ఈ పర్వత శ్రేణులమీద మాత్రం నిశ్చలంగా ఉన్నట్టున్న మబ్బుతెర వందమీటర్లకన్నా మందంలేక ఆ పైన ఆకాశం స్పష్టంగా కనిపించింది.

ఈ మూడో రోజు మాత్రం ఆ పర్వతశ్రేణులమీద పశ్చిమాన్నుండీ తూర్పువైపు ప్రవహిస్తున్నట్లు ఆ మబ్బు ఉండడం నన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేసింది. కార్లో డెబ్భైమైళ్ల వేగంతో వెడుతున్న నాకు ఉత్తరదిశగా వెళ్లే కొద్దీ ఆ మబ్బు ప్రవాహం వెనుకగా ఉన్న కొండలవరుసమీద నుంచీ లోయలో దూకడం, తరువాత కొండల వరుసలపైకి పాకడానికి అడ్డం వచ్చిందని డీకొట్టి తంపరలై గాల్లో కెగరడం స్పష్టంగా కనిపించింది. కొన్ని నిమిషాలు మాత్రమే పట్టింది ఆ మబ్బు నేను వెడుతున్న దారిని నేల ఎత్తుకుచేరి నన్ను కప్పెయ్యడానికి.

మొదటిసారి విమానంలో వెడుతూ మబ్బులోకి అది జొరబడడాన్ని చూసినప్పుడు, "అమ్మో గుద్దేశాడు!" అనుకున్నాను పైలట్ గూర్చి. ఇప్పుడు నేను ముందున్న కారుని గుద్దినా నేను చూసిన అపురూప దృశ్యం ముందు ఈ డేమేజ్ ఏపాటి దనిపించింది.

"క్లౌడ్స్" అన్నాను అక్కడికి వచ్చిన పోలీస్ ఆఫీసర్‌తో.

"ఉయ్ సీ దిస్ వన్స్ ఇన్ ఎ వైల్. సమ్‌టైమ్స్ కాజువాల్టీస్." అన్నాడతను.

* * *

"దు ఆర్ డై!" అనుకున్నాను మూడోరోజు అపర్ణ కనిపించినప్పుడు. గాలి బాగానే వేస్తోంది. అపర్ణ తన బస్‌స్టాప్‌కి వెళ్లాలంటే నన్ను దాటే వెళ్లాలి. తను నన్ను చూసింది గానీ దారి మార్చుకోకపోవడం ఆశాజనకంగా అనిపించింది. పైగా, ఆరోజు ఆమెపక్కన ఇంకెవరూలేరు. ఆమె నన్ను దాటగానే ఆమె వెనుక నుంచీ బయల్దేరి ఆమెకి ఎడమవైపుగా నడుస్తూ వచ్చి, "నాపేరు" అనడంతో బాటు ఆమె చీరచెంగు గాలికి ఎగిరి నామొహాన్ని కప్పెయ్యడమే గాక బలమైన వస్తువేదో నా నుదిటిని తాకడం మాత్రం నాకు గుర్తుంది.

* * *

"మళ్లీ చీరెకొంగుని మొహంమీద కప్పుకున్నారూ?" అన్నది నా శ్రీమతి బెడ్రూంలోకి వస్తూ.

“నువ్వుంటే నిన్నే కప్పుకొని పడుకునేవాణ్ణి” అన్నాను మొహంమీంచి కొంగుని తియ్యకుండా. “ఇంతకీ ఇది ఆ కొంగేనా కాదా?”

“అసలది ఈ రంగేకాదు. అయినా, మొహాన్ని కొంగుకప్పేస్తే దానిరంగు తెలియకుండా ఎలా ఉంటుందసలు?” అపర్ణకి ఇప్పటికీ ఆశ్చర్యమే!

“పానకంలో పుడకలాగా అక్కడ ఆస్తంభాన్ని పెట్టించినవాళ్ల నడుగు!” అన్నాను.

“తమరొస్తున్నారని ఆ స్తంభాన్ని ఆ రోజునే ప్రత్యేకంగా అక్కడ పెట్టించాను మబ్బూ!” అన్నది మొహంమీంచి కొంగుని తీసేస్తూ. వెంటనే తనని మీదకు లాక్కున్నాను.

మోరల్ సపోర్ట్ కోసమని వచ్చి దూరంగా నిలబడి చూస్తున్న శేఖర్, నేను కిందపడడం చూసి, ‘ఏం నాటకం ఆడుతున్నావురా!’ అని ముందు ముక్కుమీద వేలేసుకోకుండానే ఆశ్చర్యపడి, మనుషులు నాచుట్టూ గుమికూడడం చూసిన తరువాత అది నాటకం కాదని అర్థమై కూడా అపర్ణని కాసేపు కంగారుపడనిచ్చి, మరీ అవసరం అయితే చూద్దాంలే అని చోద్యం చూశాట్ట. వాడలా చూడబట్టేకదా, అపర్ణ కంగారులో “ఏమండీ” అని పిలుస్తూ, తరువాత ఎవరో సోడాబాటిల్ తెచ్చిస్తే ఆ నీళ్లు నామొహంమీద చల్లిందీ, ఆ తరువాత నా వెంట నడిచిందీను!

నా మొహాన్ని కప్పేసిన చీరె రంగే కాదు ఆ చీరె ఎలాంటిదో కూడా చెప్పదు ఇప్పటిదాకా. అందుకని, తను నా మొహంమీంచి కొంగుని లాగేసినప్పుడు నేను తనని కప్పేసుకుంటాను. ఇది మా ఇద్దరికీ నచ్చిన సీక్రెట్. అందుకే నా జవాబు కరెక్టయినా తను తప్పనే అంటుంది. ఇరవయ్యేళ్ల బట్టీ ఇదే తంతు.

నా జవాబు కరక్టని నాకెందుకంత ఆత్మవిశ్వాసమో చెప్పమంటారా? ఆకుపచ్చ మబ్బుల గూర్చి మీరు విన్లేదా? అమెరికాలో ఇళ్లనికూడా లేపేసే శక్తిగల సుడిగాలులు – టోర్నడోలంటారు– రాబోవడాన్ని ఆ రంగు మబ్బులు సూచిస్తాయి. దగ్గర కొచ్చినప్పుడు అమాయకంగా తెల్లగా ఉన్నట్టుండే మబ్బులు సూర్యుడితో కలిసి ఎన్ని వేషాలేస్తాయి!

(రచన మాసపత్రిక, అక్టోబర్ 2012)

# పెళ్లంటే...

నాకు అర్థంకావటం లేదు.

నేనడిగిన ప్రశ్నకు తను ఎగిరి గంతేస్తుం దనుకున్నాను. నా మెడను వాటేసుకుని కన్నీళ్లతో నా భుజాన్ని తడిపేస్తుం దనుకున్నాను.

"నో" అంటుందన్న సందేహం ఇసుమంత కూడా నా మెదడ్లో ఎక్కడా లేదు. అన్లేదు కూడా.

మరి ఈ మౌన మేమిటి? నిశ్చలంగా ఆ చూపేమిటి? అహిరి గూర్చి వర్రీ అవడానికి వీల్లేకుండా ఆ పిల్ల నీళ్లకి దూరంగా కూర్చునే ఇసుకతో ఆడుకుంటోంది. ఆ పిల్లకి ఎవరైనా ఎత్తుకుపోతా రేమోనని భయపడడానికి బీచ్‌లో పెద్దగా జనసంచార మేమీ లేదు.

చాచిన చెయ్యి సందిగ్ధంలో పడి, ఇప్పుడేం చెయ్యమంటావంది.

నేను గమనించి వుండను గానీ, జవాబు లేని నా బ్రెయిన్ ఆశ్చర్యపోయి ఉలుకు పలుకు లేని సందర్భంలో ఈ భూమికి గురుత్వాకర్షణ శక్తి ఇంతింతై వటుడింతయై అన్నట్లుగా ఎక్కువైనట్లుంది – చేతిలోని డైమండ్ పొదిగిన ఉంగరం కొద్ది క్షణాల్లో కిలోల బరువెక్కి నట్లనిపించింది.

ఉంగరాన్ని వేళ్ల మధ్యలో తిప్పితిప్పి అలసిపోయిన కుడిచేతిని వెనక్కు తీసుకుని, ఒళ్లో పెట్టుకున్నాను. ఎడమచేతిని వెనక్కు చాచి, అరచేతిని ఇసుకమీద పెట్టి, దానిమీద బరువు నానించి, వెనక్కి వాలి, కిరణ్‌ని చూస్తున్నాను.

తను ఆలివ్ కలర్ షార్ట్ మీద, పెద్ద ఎర్రపూలున్న లేత పసుపు పచ్చని టీషర్ట్ వేసుకుని, మోకాళ్లని పైకివంచి కూర్చుని, వాటిమీద రెండు అరచేతులూ పెట్టి, ఆ చేతులమీద తన గెడ్డాన్ని ఆనించి, ఇంకా అలాగే నిశ్చలంగా అహిరిని చూస్తోంది.

ఫ్రేం మారి ఆకుపచ్చ బోర్డరున్న పసుపుపచ్చరంగు పట్టుచీర కడితే, ఆ పోజులో బాపు బొమ్మలో పెళ్ళికూతురిలా కళకళలాడుతుంది.

నేను వెనక్కువాలడం వల్ల, నాకు ఎడంవైపు కూర్చున్న తను ముందుకు వాలి వుండడం వల్ల, నాకు తన కుడిచెవి మీదుగా కొంచెం మాత్రం చెంప కనిపిస్తోంది.

ముందునుంచీ చూస్తే, కిరణ్ సినీనటి భూమికలాగా ఉంటుంది.

కిరణ్‌ని కూడా బొట్టు పెట్టుకోగా ఎప్పుడూ చూడలేదు.

కళ్లు చిలిపిగా చూస్తూనే ఉంటాయి కానీ చికాకుల్ని కప్పిపెడుతున్న ట్లుంటాయి. కొద్దిగా చికిలించినట్లే ఉంటాయి కానీ చిరునవ్వుని చిందిస్తున్నట్లుగా కూడా ఉంటాయి.

కోటేరు లాంటి సూటి ముక్కు సూదంటురాయిలా ఆకర్షిస్తూ ఉంటుంది.

మాట్లాడుతున్నప్పుడు గుండ్రంగా కదిలే ఆ పెదవుల విన్యాసాన్ని చూడాలనిపిస్తుంటే (చెవికెక్కడం లేదని) మళ్లీ మళ్లీ మాట్లాడించేలా చెయ్యాలనిపిస్తుంది.

ముందుకు వంగి, ఎడమచేతిని తన నడుం చుట్టూవేసి, గట్టిగా పట్టుకుని, "ప్లీజ్" అని ప్రాధేయపడాలని ఉంది. అమెరికా కాబట్టి, అందులోనూ బీచ్ కాబట్టి, అలాంటి పబ్లిక్ డిస్‌ప్లేలు నాకేం సిగ్గనిపించవు గానీ, ....ఆమె మౌనమే ఆ పని చెయ్యడానికి అడ్డం వస్తోంది.

ఉంగరాన్ని తీసుకొచ్చిన ప్లాస్టిక్ బాగ్‌లోనే చుట్టి, స్విమ్మింగ్ ట్రంక్‌లోని సీక్రెట్ జేబులో పెట్టేశాను. మెల్లిగా లేచి, ఇసుక కొద్దిగా దులుపుకుని అహిరి వైపు అడుగువెయ్యబోతూ సందేహంతో ఆగిపోయాను. మళ్లీ ఆ పిల్లేం చేసింది మధ్యలో అనిపించి అహిరి దగ్గరకు వెళ్లాను.

సెప్టెంబర్‌లో వర్జీనియా బీచ్ చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. పిల్లలకు స్కూళ్లు తెరవడం వల్ల బీచ్‌లో జనసమ్మర్దం ఉండదు. వర్క్‌కు వెళ్లడానికిక్కూడా ఎనిమిది గంటలకు ముందు నిద్రలేవని నేను ఇక్కడ వున్న రెండ్రోజులూ సముద్రం మీద సూర్యోదయాన్ని చూడడం మాత్రం మిస్సవ్వను.

అహిరి స్విమ్మింగ్ డ్రస్ వేసుకుని నేలమీద గొంతుక్కూచుని చిన్న ప్లాస్టిక్ షవల్‌తో ఇసుకని ఎత్తిపోస్తోంది.

"లెట్ మి షో యు హౌ టు మేక్ ఎ ఫోర్ట్" అని, ఇసుకని సావనీర్ షాప్‌లో కొన్న ప్లాస్టిక్ ఫోర్ట్ అచ్చులో పోసి దాన్ని తలకిందులుగా చేసి ఆ అచ్చుని తీసేశాను. తనకదేమీ పట్టనట్లు షవల్తో ఆ ఫోర్ట్‌ని కూల్చేసింది. నాలుగేళ్ల పిల్లలకి తీర్చిదిద్దిన అందాలు తెలియవనుకుంటా.

"డు యు వాంట్ టు గో ఇన్‌టు వాటర్?" అనడిగాను. ఎగిరి గంతేసింది.

నా టీషర్ట్ తీసి అక్కడ పడేసి, అహిరి చెయ్యి పట్టుకుని నీళ్లలోకి నడిచాను. చిన్న అల దగ్గర కొచ్చేసరికి దూరంగా పరుగెత్తడం, నీళ్లు వెనక్కు వెళ్లగానే వాటి వెంట పరుగెత్తడం – అహిరికి ఇదంతా భలే ఆటగా ఉంది. అహిరిని ఎత్తుకుని నీళ్లు నాకు ఛాతీ వరకు

వచ్చేదాకా సముద్రంలోకి నడిచాను. అక్కడ తనని రెండు చేతుల్తోనూ పైకి లేపి, పడేసినట్టుగా నీళ్లల్లోకి నడుందాకా దించి, చటుక్కున పైకి లేపుతుంటే అహిరి ఒకటే పకపకలు. నీటి కింద ఇసుకలో కాలు ఆనించినా, కొద్దిగా బాలన్స్ తప్పింది. పడబోయి నిలదొక్కుకున్నాను. స్విమ్మింగ్ వచ్చు కనుక అంత భయపడాల్సిన దేమీలేదు.

అహిరిని నీళ్లలో ఆడిస్తూనే ఒడ్డువైపు చూసేసరికి అక్కడ కిరణ్ నిల్చుని వెంటనే బయటకు రమ్మనమని సంజ్ఞలు చేస్తోంది. బయటకు రాగానే కరిచినంత పనిచేసింది.

"ఎందుకంత లోపలికి వెళ్లావ్?"

"నాకు స్విమ్మింగ్ వచ్చుగా, దట్స్ ఒకె" మెల్లగానే అన్నాను.

"నో, దట్స్ నాట్ ఒకె!" విసురుగానే అంది.

ఆ చివరి సమాధానం నేను ఎంతోసేపటి క్రితం అడిగిన ప్రశ్నకు సమాధానంలా వినిపించింది కానీ, కూర్చున్న చోటే పర్సుల్నీ, కెమెరానీ, దొంగలభయాన్నీ వదిలేసి తను పరుగెత్తి రావడం వల్ల నేను ఓవర్ రియాక్ట్ అవుతున్నానేమో, అలా అనడం నిజంగా అహిరిని గూర్చిన భయంతో మాత్రమే నేమో అని కొంచెం సేపయిన తరువాత అనిపించింది.

ఆ రోజు రాత్రి హొటల్లో, ఓషన్ వ్యూ రూంలో ఒక డబుల్ బెడ్‌మీద నేను పడుకున్నాను. రెండో దానిమీద అహిరి, తను పడుకున్నారు. కావాలనే తెరిచి ఉంచిన బాల్కనీ స్లైడింగ్ డోర్లోనించీ వెన్నెలని విరగగొట్టి, ఒడ్డుకు విసిరేస్తున్నట్లుగా సముద్రపు ఘోష వినిపిస్తోంది. వెల్లకిలా పడుకుని చీకట్లో కప్పుకేసి చూస్తున్నాను. ఈ రాత్రి గూర్చి ఎన్ని కలలు కన్నాను – తను "యస్" అంటుందనీ, ఈ ట్రిప్పు మెమొరబుల్‌గా మారుతుందనీ! మెమొరబుల్‌గా మారింది, కానీ నాక్కావల్సినట్లుగా మాత్రం కాదు.

"వై డు యు వాంట్ టు మారీ మి?" చీకట్లోంచి కిరణ్ గొంతు. నా ప్రశ్నకి బదులు ప్రశ్న – దాదాపు ఆరుగంటల తరువాత.

నేనింకా నిద్రపోలేదని ఎంత ధీమా! ఈ "ఎందుకు" అన్న ప్రశ్న వినవలసి వస్తుందని నేను ఊహిస్తేగా జవాబు చెప్పగలగడానికి?

వై డు ఐ వాంట్ టు మారీ... హర్? కళ్లు తెరిచి అలాగే పై కప్పుకేసి చూస్తున్నాను.

* * *

"నీకు బ్రహ్మాండమైన డాక్టరు సంబంధం చూశాం. అమ్మాయి కుందనపు బొమ్మలా వుంటుంది" అన్నారు అమ్మా నాన్న ఇండియా నుంచి ఫోన్లో.

"నువ్విప్పుడు వెళ్లకపోతే ఇంకొకళ్లు ఎగరేసుకు పోవడం ఖాయం!" అక్కయ్య టీజ్ చేసింది డెట్రాయిట్ నుంచి ఫోన్లో – "ఇప్పుడేం ముహూర్తాలుంటాయ్?" అన్న నా ప్రశ్నకి సమాధానంగా.

"ముందు సంబంధం ఖాయం చేసుకో, మేలో వెళ్లి పెళ్లిచేసుకుందువుగాని!" బావగారి సలహా.

పనిచేస్తున్న కంపెనీని క్రిస్మస్ నుంచీ జనవరి ఒకటో తారీకు దాకా మూసివేస్తారు కనుక ఆ సెలవుల్ని ఉపయోగించుకుంటూ ఎయిర్ ఇండియాలో ఇండియా ప్రయాణ మయ్యాను. న్యూయార్క్ ఎయిర్‌పోర్ట్‌లో మామూలుగానే, ఇండియన్లు ఇండియన్లని పట్టించుకునే స్థితిలో లేరు.

దాదాపు ఒక ఏడాది వయసున్న పాపని ఎత్తుకునీ, ఆ పాప స్ట్రోలర్నీ, లగేజ్ కార్ట్‌నీ తోయడానికి ఒక భారతీయురాలు కష్టపడుతుంటే, చుట్టుపక్కల నిలబడ్డ భారతీయుల్ని చూశాను. స్త్రీని దేవతగా కొలిచే కల్చర్ గదా, ఎవరైనా సహాయ పడతారేమోనని. ఆవిడని చూసినట్టు కనిపిస్తే సహాయం చేయవలసి వస్తుందని కాబోలు ఎవరూ ఆవిడ ఉనికినే గమనించినట్లుగా లేరు. ఒంటరిగాణ్ణే కనుక సహాయం చేస్తానన్నాను. ఆవిడ వద్దనలేదు. పెళ్లై, ఒక పిల్ల తల్లికూడా కాబట్టి ఆవిడ అన్నాను గానీ, మా యిద్దరి వయసూ దాదాపు ఒకటేనని చెప్పగలను. నే చూడబోయే పెళ్లికూతురు ఆవిడలా ఉంటే బాగుండనిపించింది. ఆ పాప దాదాపు అక్కయ్య కూతురు వయసుదే కావడం వల్ల, మొన్నామధ్య థాంక్స్‌గివింగ్ సెలవులకి వెళ్లినప్పుడు ఆ నాలుగు రోజులు దాన్ని దింపకుండా ఎత్తుకోవడం అలవాటు కావడం వల్లా కావచ్చు, ఫ్లయిట్‌లో అంతా నా దగ్గరే ఆడుకుంది. అప్పుడప్పుడు ఆవిడ కళ్లు తుడుచుకోవడం గమనించాను. బహుశా ఇండియాలో వాళ్ల అమ్మకో నాన్నకో ఒంట్లో బాగోలేదని అందుకే పక్కన హజ్బెండ్ లేకుండా వెడుతోందని గ్రహించాను.

అమెరికా జీవనవిధానాలు వంటబట్టడం వల్ల, రొమాంటిక్‌గా ఉంటుందని, పెళ్లిచూపుల్లో జయశ్రీని "విల్ యూ మారీ మి?" అని అడుగుదా మనుకున్నాను గానీ, "ఆ అమ్మాయి నో అంటే ఏం చేస్తావ్? ఇది మోడర్న్ ఇండియా నాయనా, గాంధీగారి ఇండియా కాదు!" అని స్నేహితుడు రాజుగాడు వార్నింగ్ ఇవ్వడం వల్ల ఆ ప్రయత్నం విరమించుకున్నాను.

అనుకున్నట్లుగానే మేలో పెళ్లి అయిందిగానీ, ఎంతో ఎదురు చూసిన మొదటిరాత్రి, కుదరదని దూరంగా పడుకోబెట్టింది జయశ్రీ. మొదటి రాత్రినాడు ఈ ఇబ్బందు లుంటాయని ఎక్కడా చదివిన గుర్తులేదే అనుకున్నాను. రెండు, మూడు కూడా అంతే. రాజుగాడి దగ్గర వాపోతే, వాడు, "మామూలుగా అయితే ఆ యిబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటారే! పైగా డాక్టరుకూడా కదా?" అన్నాడు. వాడూ నేనూ హైస్కూలు చదువులప్పటినించీ క్లాస్‌మేట్లమే అయినా వాడికున్న సెక్స్‌కు సంబంధించిన నాలెడ్జికి జోహార్లర్పించి నా ధర్మ సందేహాలకి సమాధానాలని వాడి దగ్గర వెతుక్కునేవాణ్ణి. వాడు పెద్దయ్యేసరికి డాక్టర్

సమరం నిలదొక్కుకోబట్టి సరిపోయిందిగానీ, లేకపోతేనా, ఆయన పేరుకూడా ఎవరికీ తెలిసేది కాదు.

హనీమూన్‌కి బెంగుళూరు, ఊటీ వెళ్లినప్పుడు, "ఇంతదూరం వచ్చి ఇవన్నీ చూడకపోతే ఎలా?" అని జయశ్రీ పొద్దున్నే నన్ను నిద్రలేపి బయటకు లాక్కుపోవడం, రాత్రి బాగా లేటుగా హొటల్‌కి తిరిగిరావడం, తర్వాత అలసిపోయాననో, తలకాయ నెప్పనో సాకులు.

"ఎవరినైనా ప్రేమించి, చివరకి ఇష్టంలేని ఈ పెళ్లి చేసుకున్నావా?" రెండు రోజులయిన తరువాత అడిగేశాను.

ఆ రాత్రే శోభనం. అయినా, ఆ వారం రోజుల్లో మొత్తం రెండు సార్లుమాత్రమే – అది కూడా తన ప్రోద్బలం వల్లనే – తను అదెట్లా మరచిపోగలదు?

గ్రీన్‌కార్డ్ వచ్చేదాకా జయశ్రీకి ఇండియాలో గడపాల్సిన అవసరం లేకుండా హెచ్–4 వీసా తొందరగానే వచ్చింది. అఫ్‌కోర్స్ వీసా అప్లికేషన్లో డాక్టరని రాయలేదు. అలా రాయవద్దనీ, హౌస్‌వైఫ్ అని రాయమని తనే సలహా ఇచ్చింది. వీసాకి అప్లై చేసేసరికి తనకి డిగ్రీ చేతికి రాకపోవడం వల్ల ఆమె టెక్నికల్‌గా అబద్ధం చెప్పినట్లు కాదు. అమెరికాకి రావడానికి కూడా ఎంతో కాలం పట్టలేదు. కానీ, ఇక్కడ కూడా పరిస్థితి దాదాపు పూర్వం లాగానే. ఏదో దయతలచినట్లుగా వారానికోసారి తప్ప, మళ్లీ తలకాయనొప్పనీ, ఒంట్లో బాగోలేదనీ, హొంసిక్‌నెస్సనీ సాకులు.

ఒకరోజు ఇంటికొచ్చేసరికి సామానుతో సహా పరారయ్యింది– "నేను కాలేజీలో ఉన్నప్పుడు ఒకతన్ని ప్రేమించాను, అతనికీ నాకు కూడా వేర్వేరుగా అమెరికా రావాల్సిన పరిస్థితి. ఇవ్వాళ అతనొచ్చి నన్ను తీసుకెడుతున్నాడు. సారీ టు హావ్ యూజ్డ్ యు" అన్న ఉత్తరాన్ని నాకు వదిలిపెట్టి.

"విల్ యూ మారీ మీ?" అని నిజంగా పెళ్లి చూపుల్లో అడిగి వుంటే తనేం జవాబు చెప్పేదా అనిపిస్తుంటుంది అప్పుడప్పుడు.

ఇందులో నా తప్పేమీలేదని అర్థమైనా, ఇలాంటి కేసు నాకు మళ్లీ తగలదని నమ్మకమున్నా, నా పెళ్లికోసమని మళ్లీ ఇండియా వెళ్లే ప్రయత్నాన్ని విరమించుకున్నాను. ఈ విషయంలో మొగవాళ్లు కూడా స్పాయిల్డ్ గూడ్సే. కాకపోతే, పెళ్లై ఆర్నెల్లుకూడా కాకుండానే ఇండియాలో నన్ను మళ్లీ పెళ్లిపీటల మీద ఎవరు కూర్చోనిస్తారు? అమెరికాలో తప్ప, అదికూడా డేటింగ్ చేసిన తరువాత కానీ, మళ్లీ పెళ్లిమాట తలపెట్టకూడ దనుకున్నాను. మనిషి ప్రవర్తన, విలువలు ముఖ్యం, జాతీ, కులమూ కాదు అని అర్థమైంది కనుక. ఇదే పరిస్థితి ఇక్కడ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ చదువుతున్నపుడు ఎదురైతే చాలా తొందరగానే డేటింగ్ సీన్లోకి దిగే అవకాశముండేది. ఈ ఉద్యోగంలో చేరాక, కొత్త ప్రదేశ మవడం

వల్ల, ఉన్న వూళ్లో నాకంటూ ప్రత్యేకంగా ఫ్రెండ్స్ అంటూ లేకపోవడం వల్ల, ఒక్క బార్‌ల వెంట పడడంతో విసుగెత్తింది. పెళ్లై ఇండియానించి వచ్చిన రెండేళ్లకి కాంట్రాక్ట్ మారడం వల్ల ఊరుకూడా మారవలసివచ్చింది.

ఆ ఏడాది ముందుదాకా అయితే థాంక్స్‌గివింగ్ సెలవులకి అక్కయ్య వాళ్లింటికి డెట్రాయిట్ వెళ్లేవాణ్ణి కానీ, అక్కయ్య మామగారు పోవడంవల్ల వాళ్లు ఇండియా వెళ్లడంతో ఆ నవంబర్లో మాత్రం నేనెక్కడికీ పోకుండా గురువారం నుంచీ ఆ నాలుగు రోజుల సెలవులూ ఒంటరిగానే గడపవలసివచ్చింది.

గురువారం పొద్దున్న పదిగంటల తరువాత నిద్రపట్టలేదు. విసుగ్గా లేచి కూర్చున్నాను. ఇంటర్నెట్ సర్ఫ్ చేశాను. వెబ్‌లో చాట్ చేద్దామన్నా నా పాత క్లాస్‌మేట్లందరూ పెళ్లయ్యో లేక ఎక్కడికో పోతూ ట్రాఫిక్‌లో ఇరుక్కోవడం వల్లనో ఎవరూ దొరకలేదు. లంచ్‌కి ఓ రెండు బ్రెడ్ స్లైసులు తిన్నాను. చివరకు విసుగెత్తి నాలుగవుతున్న టైంలో... ఆఫీసుకు వెళ్లాను. ఈ నాలుగు రోజుల సెలవులలో గురువారం గడపడమే కష్టం. దాదాపు అన్ని రెస్టారెంట్లూ, షాపులూ క్లోజ్ చేస్తారు. రోడ్లమీద జనసంచారమే ఉండదు.

కీ కార్డును ఉపయోగించి బిల్డింగ్‌లోకి ప్రవేశించి, ఎనిమిదో అంతస్తులో వున్న నా ఆఫీసు రూంలోకి వెళ్లి తలుపు తీసే ఉంచి కూర్చున్నాను. కిటికీలోంచి బయటకు చూస్తే పక్కనే, ఎప్పుడూ బిజీగా ఉండే హైవే మీద అప్పుడప్పుడూతప్ప కార్లే కనిపించడంలేదు. కంప్యూటర్ మానిటర్ని డైరక్షన్ మార్చి, దాని ముందు నేను కూర్చున్నప్పుడు నాకు ఎదురుగా నా ఆఫీసు తలుపు కనిపించేలా కూర్చున్నాను. అది ముఖ్యం. లేకపోతే, బిల్డింగ్ మొత్తంలోకీ ఇంకెవరూ లేరని నేనకుంటున్న రోజున నన్నెవడేం చేసినా దిక్కు ఉండదు.

"అహిరీ, డోంట్ రన్ లైక్ దట్," ఆఫీస్ రూం ముందు నడవాలో వినపడ్డ ఓ ఇండియన్ ఆడగొంతూ, ఎక్కడో విన్నట్టున్న ఆ పేరూ నన్ను కళ్లెత్తి ద్వారం వైపు చూసేలా చేసాయి. పరుగెత్తుతున్న ఒక ఆడపిల్ల కాస్తా, నా రూం తలుపు తెరిచి ఉండడంతో అక్కడ ఆగి నా వైపు చూస్తోంది. ఆ పిల్లకి అక్కయ్య కూతురి వయసే ఉంటుంది. రెండడుగుల వెనకగా ఆ పిల్ల తల్లి కూడా, ఈ సెలవునాడు తను కాక ఇక్కడున్న వాళ్లెవరా అని చూస్తూ ఆ పిల్ల వెనకే వచ్చి ఆగింది.

"ఐ హావ్ సీన్ యూ సంవేర్," ఠక్కున అన్నాను.

"రెండేళ్ల క్రితం ఎయిర్ ఇండియా ఫ్లయిట్లో" అన్నది తను. ఈ ఆఫీసులోకి వచ్చిన తరువాత మెయిల్ బాక్స్ మీద కిరణ్ అని చూసిన గుర్తుంది. ఇంటి పేరు కూడా తెలుగుదే. ఎవడో తెలుగువాడే అనుకున్నాను కానీ ఆ కిరణే ఈ కిరణ్మయి అని ఎవరూహిస్తారు? అప్పటి ఏడాది పిల్లకి ఇప్పుడు మూడేళ్ల వయసుండాలి.

“యూ వర్ గోయింగ్ టూ గెట్ మారీడ్” అన్నది కిరణ్. తను ఆ విషయం ప్రస్తావించకుండా ఉండుంటే బాగుండే దనిపించింది.

“షి లెఫ్ట్ మీ” – నా సొంత విషయమేదీ అయినట్లు కాకుండా సాధ్యమయినంతగా ఎమోషన్ ఏదీ లేకుండా చెప్పాను. “బాక్ టూ బీయింగ్ సింగిల్. మీరేంటి, ఇవాళ ఇక్కడిలా?”

“మీలాగే. ఇంట్లో బోర్ పుట్టి!”

“మీ హజ్బెండ్ ఊళ్లో లేరా?” అడిగాను. హజ్బెండ్ ఇంట్లో ఉంటే స్త్రీకి బోర్ పుట్టకూడదన్నది నా అభిప్రాయంగా నాకే వినిపించింది. ఒక్క క్షణం తీసుకుని, లేరన్నట్టు తల ఆడించింది. అంతకు ముందరి పరిచయం, ఇప్పుడు ఒకే కంపెనీలో పనిచెయ్యడం కలిగించిన కాన్ఫిడెన్స్ వల్ల డిన్నర్ నేను వండి పెడతానంటే నాతోపాటు ఎపార్ట్‌మెంట్‌కి వచ్చింది. ఆఫీసు విషయాల గూర్చి, మేనేజర్ల గూర్చి, మా బాక్‌గ్రౌండ్‌ల గూర్చి మాట్లాడుకున్నాం. నేను ఇక్కడ ఎమ్మెస్ చేసి ఐటి జాబ్ చేస్తుంటే, తను ఇండియానుంచీ కన్సల్టెంట్‌గా వచ్చి స్థిరపడిందని తెలిసింది.

ఆ తర్వాత నేను, కిరణ్, అహిరి కలిసి అప్పుడప్పుడూ రెస్టారెంట్లకీ, షాపింగ్‌లకీ వెళ్లేవాళ్లం. కిరణ్ మెడలో కానీ, చేతికి కానీ పెళ్లైన చిహ్నాలు ఏవీ లేవు. భర్త గూర్చి కూడా ఎప్పుడూ మాట్లాడలేదు. వాళ్ల ఎపార్ట్‌మెంట్లో కూడా తన తల్లిదండ్రుల ఫోటోలు తప్ప వేరే మగాడి ఫోటో లేకపోవడం వల్ల తనది డైవోర్స్ కేసని నమ్మకం కలిగింది.

ఒకరోజు డిన్నరైన తరువాత పార్కింగ్ లాట్లో కారు దగ్గరకి వెళ్లేటప్పుడు కిరణ్ చెయ్యి పట్టుకుంటే విడిపించుకోలేదు. ఆ తరువాత ఒకసారి తన ఎపార్ట్‌మెంట్‌లో అహిరి నిద్రపోతున్నప్పుడు, సినిమా చూస్తుండగా నడుంమీద చెయ్యి వేస్తే తీసెయ్యలేదు. ఒళ్లు వేడెక్కినప్పుడు కిరణ్ కాండోమ్ అందించినప్పుడు మాత్రం నా మనస్సు చివుక్కుమంది కానీ, శరీరం బ్రెయిన్ మాట వినలేని పరిస్థితి. “పెళ్లెప్పుడు?” అనడగని ఈ “నో స్ట్రింగ్స్ అటాచ్డ్” వ్యవహారం నాకు బాగానే ఉంది కానీ, ఎంత రాత్రయినా సరే, శరీరాలు చల్లబడిన తరువాత నన్ను మాత్రం తన ఇంట్లోంచి తరిమేసేది.

అహిరి నాకు బాగా దగ్గరయింది. కిరణ్ రానప్పుడు కూడా అహిరిని షాపింగులకి తీసుకెళ్లేవాణ్ణి. నేను స్విమ్మింగ్‌పూల్లో దిగి దానిచేత ఈత కొట్టించడం దానికి ఇష్టం.

ఒకసారి అహిరిని తీసుకుని గుడికెళ్లాను. కిరణ్ మాత్రం గుళ్లకీ, గోపురాలకీ దూరంగా ఉంటుంది గనుక రాలేదు. దణ్ణాలన్నీ అయిన తరువాత అక్కడ ఉన్న కాసెట్లూ, సీడీలూ చూస్తుంటే ఒకాయన నా భుజం తట్టి, “యువర్ డాటర్ ఫెల్ డౌన్” అని, అహిరి ఏడుస్తున్న వైపు చూపించాడు.

ఆ తర్వాత, ఆయన అన్న “యువర్ డాటర్” అన్న రెండు పదాలూ అప్పటిదాకా రాని ఆలోచనను నా మెదడ్లోకి నెట్టాయి. “వై నాట్?” అనిపించింది.

వర్జీనియా బీచ్ వెకేషన్ ప్లాన్ చెయ్యడం పెళ్లి ప్రపోజల్ కోసమే. నేను నా బాక్‌గ్రౌండ్ చెప్పాను. పైగా, నాతో సన్నిహితంగా ఉంటున్నా గానీ నేను తన పాస్ట్ హిస్టరీని కూడా అడగలేదు.

కానీ, ఇప్పుడేమిటిలా?

* * *

వర్జీనియా బీచ్ నుంచీ ఆదివారం తిరిగి వచ్చేటప్పుడు అహిరి గూర్చిన మాటలు తప్ప మా మధ్య మాటలేం లేవు. ఆ ముందు శుక్రవారం దాకా అయితే వారం మధ్యలో కనీసం రెండు మూడు రోజులు సాయంత్రాలు కలుస్తూనే ఉండేవాళ్లం. అలాంటిది ఆ తరువాత వారమంతా కిరణ్‌ని కలిసింది లేదు. శనివారం ప్రొద్దున అహిరిని స్విమ్మింగ్ క్లాస్‌కి తీసుకువెళ్లాలని గుర్తొచ్చి మెలకువ వచ్చింది కానీ, ఈ కొత్త పరిస్థితిలో వెళ్లవచ్చో లేదోనన్న సందేహం. వెంటనే కోపం కూడా వచ్చింది. ఏం, నేనంత పనికిరాకుండా పోయానా ఏ సమాధానమూ ఇవ్వకుండా ఉండడానికి? నాకన్నా గొప్పవాళ్లు దొరుకుతారా ఈ మహారాణికి? ఏం చూసుకునో అంత గర్వం! ఒక కూతురు కూడా ఉన్నప్పుడు ఒక ఇండియన్ ఆడదానికి పెళ్లి కావడం ఎంత కష్టమో అందరికీ తెలుసు!

పెళ్లైతే చేసుకుంటానన్నాను గానీ, ఆలోచిస్తే ఇప్పుడు అర్థమౌతోంది. అసలు దాదాపు గత తొమ్మిది నెలలుగా తను నాకోసం వెచ్చించిన సమయమెంత? అహిరి బాగోగులు చూడగా మిగిలినంత! శని, ఆదివారల్లో కూడా ఎక్కడికెళ్లినా అహిరి వెంటే ఉందిగా! తను ఏ పనిచేసినా అహిరి ఆనందం కోసమే. నేనే ఘోరంగా పొరపడ్డాను. ఆవిడకి నేను ఆనకపోతే బతకలేనేంటి? కిరణ్ కాకపోతే క్రిస్టీనా. కాకపోతే నజీర్. టీవీ చూస్తూ కూర్చున్నాను. లంచ్‌కి పిజ్జా ఆర్డర్ చేశాను. మధ్యాహ్నం ఓ సిక్స్ పాక్ బీరు కొని రెండు సినిమాలు అద్దెకు తెచ్చాను. సాయంత్రం ఆరు గంటలకు విసుగుపుట్టి ఆఫీసుకు వెళ్లి కూర్చున్నాను. అదికూడా విసుగుపుట్టి, తొమ్మిది గంటలకు చైనీస్ టేకవుట్ పట్టకొచ్చి సినిమా పెట్టాను.

శని, ఆది వారాల్లో, కిరణ్ పరిచయం కాకముందరి నా యాక్టివిటీసే ఇవన్నీను. ఇప్పుడు బోర్ పుడుతున్నాయి. కాలేజీలో ఉన్నప్పుడయితే నాలాటి వాళ్లతో కలిసి బీర్లు తాగుతూ ఎన్ని ట్రిపులెక్స్ సినిమాలు చూసినా బోర్ పుట్టలేదు. ఇప్పుడు ఏ సినిమా అయినా బోరే.

ఆ పైవారం కూడా వర్క్‌లో కిరణ్‌కి కనపడకుండా జాగ్రత్తపడ్డాను. అయినా మా ఇద్దరివీ వేరే ఫ్లోర్లు, ప్రాజెక్టులు కనుక కావాలంటే తప్ప ఎదురుపడే అవకాశం లేదు. అయినా, మూడువారాల ముందరి సంగతివేరు, ఇప్పుడు వేరు. రెండో శనివారం కూడా స్విమ్మింగ్ పూల్ వైపు వెళ్లలేదు. అహిరిని స్విమ్మింగ్‌లో చేర్పించడం నా ఐడియానే. కిరణ్‌కి

స్విమ్మింగ్ రాదు. రాకపోయినా, నడుంలోతు నీళ్లలోకి దిగి నాలుగేళ్ల పిల్లని పట్టుకోవడం కష్టమేం కాదు గనుక తనే తీసుకెళ్లి వుంటుంది.

మూడవ శనివారం నాడు స్విమ్మింగ్ క్లాస్ అయ్యేటైంకి పూల్ దగ్గరకు వెళ్లాను. కిరణ్ కనిపించలేదు. వచ్చి వెళ్లిపోయిందో, రాలేదో తెలియదు. కాసేపు అక్కడే కూర్చుని బయటకు వచ్చాను. బయట పార్కింగ్ లాట్‌లో తల్లిపక్కనే నడుస్తున్న మూడేళ్ల తెల్లపిల్లాడు హఠాత్తుగా రోడ్డు మధ్యకు పరుగెత్తాడు. ఎదురుగుండా వస్తున్న కారు సడెన్ బ్రేక్‌తో ఆగబట్టి ప్రమాదమేమీ జరగకుండా సరిపోయింది. ఆ పిల్లాడి తల్లి, "డోంట్ డూ ఎనీథింగ్ స్టుపిడ్. ఐ హావ్ ఎ లాట్ ఇన్వెస్టెడ్ ఇన్ యూ," అంది. ఎంతకూల్‌గా అన్నది! ఆ పిల్లాణ్ణి అంతకంటే తిట్టనూ లేదు, కొట్టనూ లేదు.

మస్తిష్కంలో ఒక లైట్ బల్బ్ వెలిగింది. కిరణ్‌తో రిలేషన్‌షిప్‌లో నేను చాలా ఇన్వెస్ట్ చేశాను– ఎమోషనల్‌గా."నో స్ట్రింగ్స్ ఎటాచ్డ్" అనుకున్న వ్యవహారం ఎంతదాకా దారితీసింది! నా పెళ్లికి ముందు, నదురుగా వున్న ఆడపిల్ల కనిపిస్తేచాలు, మనసు ఆమెని కోరేది. నన్ను ఆకర్షించే ఆడదాని మెడ పైభాగంలో ఒక మెదడు ఉంటుందనీ, ఆ మెదడులోని ఆలోచనలు చాలా ముఖ్యమనీ జయశ్రీ నాకు తెలిసేలా చేసింది. ఆఫీసులో రోజూ ఎదురయ్యే ఆడవాళ్లని చూసి, వాళ్ల ప్రవర్తనని బట్టీ "నో వే" అని వాళ్లని నా కేండిడేట్స్ లిస్ట్‌లోంచి కొట్టేయ్యడం జరిగింది.

ప్లేబోయ్ సెంటర్ స్ప్రెడ్‌కి నగ్నంగా పోజులిచ్చిన ఒక యువతి, "నేను సెక్సుకు అంత ప్రాధాన్యతనివ్వను. మొదటి డేట్‌లోనే అదేదో అయిపోతే మిగిలిన విషయాల్ని ఇన్‌హిబిషన్లేవీ లేకుండా మాట్లాడుకోవచ్చు!" అని స్టేట్‌మెంట్ నిస్తే, "మి ఫస్ట్!" అని ఎడ్రస్‌తో సహా ఉత్తరం రాద్దామనిపించింది ఒకప్పుడు. నా పెళ్లి తతంగమైన తరువాత కానీ నేను పుట్టి, పెరిగిన కల్చర్, ఒక పక్క నించీ కాదంటూనే వేరొక పక్కనించీ సెక్సుకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, పెళ్లిని ఆ సెక్సుకు లైసెన్స్‌గా నిర్వచించి, ఆ లైసెన్స్ బిళ్లల్ని ఆడదాని మెళ్లో వేలాడదీస్తుందని అర్థం కాలేదు. జయశ్రీకి ఆ లైసెన్స్ బిళ్లల్ని ధిక్కరించేటంత ధైర్యం ఎప్పుడొచ్చిందో, ఎలా వచ్చిందో తెలియదు. అమెరికా కదా, స్థానబలిమి వల్లనేమోనని అనుకోవడానికి లేకుండా ఆ మాస్టర్ ప్లాన్‌ని ఇండియాలో ఉండగానే వేసింది!

జయశ్రీని పెళ్లిచూపుల్లో ఒక స్త్రీగా మాత్రమే చూశాను. కిరణ్‌ని ఒక స్త్రీగా కన్నా ముందుగా ఒక తల్లిగా, ఒక కో వర్కర్‌గా, ఒక ఫ్రెండ్‌గా, అన్నిటికన్నా ముందు ఒక మనిషిగా చూశాను. మగతోడు లేకుండా ఒక కూతుర్ని పెట్టుకుని అమెరికాలో జీవితాన్ని సాగిస్తున్న తన ధైర్యాన్ని మెచ్చుకున్నాను. తన పర్సనల్ విషయాలని నేను అడగలేదు కాబట్టి, డైవోర్స్ ఇచ్చినవాడో, లేక మోసం చేసిన బాయ్‌ఫ్రెండో ఎవడో ఉండుంటాడ్లే

అని కూడా ఆక్సెప్ట్ చేశాను. వింతేమిటంటే, కిరణ్‌కి కూతురు కలగడానికి ఒక మగాడు మోసం చెయ్యడమో లేక పెళ్లైన తరువాత ఇంట్లోంచి తరిమెయ్యడమో కారణాలవ్వచ్చుని అనిపించింది కానీ, పెళ్లి ప్రేరణ లేకుండా స్వచ్ఛందమైన కోరిక కిరణ్‌కి కలగడం వల్ల కావచ్చునని మాత్రం కలలోకూడా అనిపించలేదు. అయినా, ఒక స్త్రీకి పెళ్లి కాకుండా పుట్టే పిల్లలకి పాపఫలాలని నామకరణం చేసే సంస్కృతిలోనించీ వచ్చిన ఆడదానికి అంత స్వచ్ఛందమైన కోరిక ఎలా కలుగుతుంది ?

జయశ్రీకి నాకూ మధ్య సంఘం ఏర్పరచిన మూడు ముళ్ల అనుబంధం తప్ప వేరేదీ లేదు. ఒకవేళ అదేదైనా ఏర్పడివుంటే ఆ ఏర్పడడం శారీరక సంబంధంతోనే గదా మొదలయ్యింది! ఈ విషయంలో ప్లేబోయ్ సెంటర్‌స్ప్రెడ్ యువతి అన్నదానికీ నా పెళ్లికి ఒకటే తేడా. జయశ్రీ నన్ను విడిచి వెళ్లకుండా ఉండుంటే శారీరక సంబంధం ఏర్పడింది గదా అని పైగా "పెళ్లి" కూడా అయింది కదా అని – ఇంక మిగిలిన విషయాలన్నిటిలోనూ ఇద్దరమూ సర్దుకుపోవలసి వచ్చేది.

ఒక విధంగా చెప్పాలంటే, జయశ్రీతో నా పెళ్లికి కారణాలు – వయసొచ్చింది, ఉద్యోగం ఉంది. అందరూ నడిచేదారిలో సాగడానికి ఇంక మిగిలింది పెళ్లేగా! ఆ తరువాతేగా పిల్లలు! ఒకవేళ జయశ్రీ నాతోనే ఉండి, తనకు పిల్లలు కనడం సుతరామూ ఇష్టం లేదనుకుంటే అప్పుడేం చేసేవాణ్ణి?

నా పెళ్లితంతులో ఎంత వింత దాగుందో నాదాకా వస్తేగానీ తెలియలేదు. ఆ పెళ్లి, నీ వెనుక మేమున్నామంటూ కొందరు పెద్దలు జయశ్రీకి ఇచ్చిన అభయం; చట్టం ముందు చూపించడానికి ఉపయోగపడే పనికరం. అది, నేను చెడుత్రోవలు పడితే బెదిరించి నన్ను తనచెంత చేర్చడానికో, లేక పరిహారం ఇప్పించడానికో ఉపయోగపడే ఆయుధం. అదేదో నాకు ఉపయోగపడడానికి, పెద్దల వెంటబడి, బుద్ధి చెప్పించి, తనని మళ్లీ నా దగ్గరకు రప్పించుకోవడానికి, జయశ్రీ మార్లిన్ మన్రోనూకాదు, ఐశ్వర్యారాయీ కాదు.

అదే, కిరణ్‌తో మాత్రం, శారీరక సంబంధంకన్నా ముందరే, సంఘంకోసం వేసుకునే సంకెళ్లకన్నా కూడా ముందుగానే అనుబంధం ఏర్పడింది. ఇక మిగిలిందల్లా "నీకు నేనున్నాను, నాకు నువ్వుంటావా?" అని సంఘానికి అర్థమయ్యే కొన్ని కార్యక్రమాల కోసం ఆధారపడడానికో మనసు.

ఈ మనసనేది బ్రెయిన్లో లోడ్ చేసిన ఫర్మ్‌వేర్ లాంటిది– ఎవరు లోడ్ చేస్తారో తెలియదు కానీ, అనుభూతి మీద ఆధారపడి సాఫ్ట్‌వేర్‌ని క్రియేట్ చేసుకుంటుంది. ఏదైనా అర్థం అయిందంటే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ సక్రమంగా అయినట్టే. కాకపోతే మాత్రం లోడింగ్ ఎర్రరో, ఆపరేటింగ్ సిస్టమ్ ఎర్రరో, లేకపోతే సాఫ్ట్‌వేరే సరిగ్గా లేదనో అర్థం.

ఇద్దరు మనుషులు శారీరకంగా దగ్గరయినప్పుడు మనసులు కూడా దగ్గరవుతా యనడానికి నిదర్శనమేమీ లేదు. శారీరకంగా దగ్గరవడం, హార్డ్‌వేర్ కంపాటిబిలిటీ వల్ల. అలా అని, వాళ్ల మనసులు కూడా – అంటే ఫర్మ్‌వేర్ కానీ, సాఫ్ట్‌వేర్ కానీ – దగ్గరవుతాయని గారంటీ ఏమీలేదు. ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ ఒకటేనేమో కానీ, ఖచ్చితంగా ప్రతీ ప్రోగ్రామూ వేర్వేరే. స్నో ఫ్లేక్స్ లాగా, ఫింగర్ ప్రింట్స్ లాగా, ఏదీ ఇంకొక దానిలాగా పొరపాటున కూడా ఉండదు.

ఒకరి అలవాట్లు, అభిరుచులు రెండోవాళ్లు ఆమోదిస్తే, గౌరవిస్తే, అది మనసులు దగ్గరయ్యాయనడానికి నిదర్శనమా? పెళ్లయిన తరువాత ఒకళ్లు రెండోవాళ్ల అభిరుచుల పట్ల అగౌరవమే కాక ఈసడింపు కూడా చూపిన తరువాత అలాంటి వాళ్ల మధ్య ఉండే శారీరక సంబంధం "పవిత్ర" అనుబంధమేనా? సెక్సు అన్న పదానికి ముసుగు వెయ్యడానికి ఎన్ని పర్యాయపదాలు!

కిరణ్ ప్రశ్నకి నాకు సమాధానం దొరికింది – రిచ్ ఆర్ పూర్, ఇన్ సిక్‌నెస్ ఆర్ ఇన్ హెల్త్ – తను నా పక్కనుండాలి.

* * *

వర్జీనియా బీచ్‌నుంచీ తిరిగివచ్చిన నాలుగో శనివారం. స్విమ్మింగ్‌కి అహిరిని తీసుకు వెళ్లాల్సిన సమయం. కిరణ్ అపార్ట్‌మెంట్ బిల్డింగ్ బయట వాళ్ల అపార్ట్‌మెంట్ నంబర్ వున్న కాల్ బటన్ నొక్కాను. అది ఇంటర్‌కామ్. ఇంటి కీ ఉంటే కానీ బయటి తలుపుతీసి బిల్డింగ్‌లోకి అడుగు పెట్టలేరు. అపార్ట్‌మెంట్ డూప్లికేట్ కీ నా దగ్గర ఉంది కానీ, ఇప్పటి పరిస్థితి వేరు కదా! జేబులో ఉన్న డైమండ్ రింగ్‌ని మళ్లీ ఒకసారి తడిమి చూసుకున్నాను.

"హూ ఈజిట్?" కిరణ్ గొంతు స్పీకర్‌లోంచి వినిపించింది.

"నేనే" అన్చెప్పి, బిల్డింగ్ తలుపు ఓపెన్ చెయ్యడం కోసం కిరణ్ బజర్ నొక్కిన తరువాత తలుపు తీసుకుని బిల్డింగ్ లోపలికి అడుగుపెట్టాను. మూడవ అంతస్తు ఎక్కేసరికి, కిరణ్ తలుపు తీసి నిలబడుంది. "నువ్వొస్తా వనుకోలేదు" అనలేదు. "ఇప్పటిదాకా కనిపించ లేదేం?" అని నిలదీయలేదు. వచ్చినందుకు ఆనందమూ ఆ మొహంలో కనిపించలేదు. కానీ నేను వస్తానని తనకున్న నమ్మకం ఆ కళ్లల్లో ఒక్క క్షణం కదలాడిందని మాత్రం చెప్పగలను.

"ఆర్యూ టేకింగ్ మీ ఫర్ స్విమ్మింగ్ టుడే?" అహిరి అడిగింది. అమెరికా పిల్లకదా, తెలుగులో మాట్లాడదు. అప్పటికే స్విమ్మింగ్ డ్రస్ వేసుకుని రెడీగా ఉంది.

"ఈ వీడియో చూస్తూండు. దాన్ని స్విమ్మింగ్ క్లాస్‌కి తీసుకెళ్లొస్తాను" అని కాసెట్ నాకిచ్చి, అహిరిని తీసుకుని బయటకు వెళ్లిపోయింది.

కాఫీ మేకర్‌ని ఆన్‌చేసి, కాసెట్‌ని వీడియోలో పెట్టాను. పెళ్లికాసెట్. ఆ అలంకరణలో కిరణ్‌ని పోల్చుకోవడం కొద్దిగా కష్టమైంది– తనని ఏ అలంకరణా లేకుండా చూడడానికి

అలవాటుపడ్డాను కాబట్టి. కాసెట్ బాగా ఎడిట్ చేసినట్లుంది. పెళ్లి తతంగం అంతగాలేదు. వధూవరులు, కుటుంబ సభ్యులతో గ్రూప్ ఫోటోలు అయ్యాయి.

కాఫీ తెచ్చుకుని తాగడం మొదలుపెట్టాను. టీవీ మీద సీన్ మారింది. ఎవరతను? బాగా నీరసంగా మంచంమీద కూర్చుని ఉన్నాడు. చిక్కిపోయి కనిపిస్తున్నాడు. దాదాపు ఒక ఏడాది వయసున్న పిల్ల అతని దగ్గరగా నిలబడి, వింతగా చూస్తోంది.

"నీ కూతురుటరా. వెళ్లవే, దగ్గరకెళ్లు" ఎవరిదో ఆడగొంతుక.

ఆ పిల్ల కదలకుండా నిలబడి, పెదవుల మధ్య చూపుడు వేలు పెట్టుకుని అలాగే చూస్తోంది. కెమెరా ఆ పిల్ల మొహం మీద ఫోకస్ చేసినప్పుడు అహిరిని గుర్తుపట్టాను. ఆ వయసులోనే కదా మొదటిసారి ఎత్తుకున్నాను? అంటే అతను కిరణ్ హజ్బెండ్ అన్నమాట. పెళ్లికి, ఇప్పటికీ అతని మొహంలో చాలా తేడా కనిపించింది. ఎవరో ముందుకు తోసినట్టున్నారు, అహిరి వెళ్లకుండా ఏడుపు లంకించుకుంది. రెండు చేతులుచాచి, అహిరిని తీసుకుంటున్నాయి. ఎత్తుకున్న తర్వాత కెమెరా అహిరినీ, ఎత్తుకుని ఉన్న కిరణ్‌నీ చూపించింది. కెమెరా మళ్లీ అతని మొహాన్ని చూపెట్టింది. వెర్రిగా నవ్వుతున్నాడు. కెమెరా అక్కడవున్న ఇంకొంతమంది మనుషులనీ మళ్లీ అతన్నీ చూపించింది. అతను ఎవరినీ గుర్తుపడుతున్నట్లు అనిపించలేదు, ఎవరితోనూ మాట్లాడనూ లేదు. కళ్లు చూసిన దృశ్యాల్ని మనసు అర్థం చేసుకోవడానికి ట్రై చేసింది. అయితే, కొన్ని చిక్కుముడులని విప్పడానికి కిరణ్ కోసం నిరీక్షించక తప్పలేదు.

దాదాపు గంట తరువాత కిరణ్ తిరిగొచ్చింది. అహిరి కోసం టీవీలో పిల్లల వీడియోపెట్టి, ఉపోద్ఘాత మేమీ లేకుండానే మొదలుపెట్టింది.

"విజయ్ కూడా అమెరికాలోనే ఉద్యోగం చేసేవాడు – ఇక్కడికి రెండు వేల మైళ్ల దూరంలో. ఇద్దరం అమెరికాలోనే ఉన్నా, అరేంజ్డ్ మారేజే."

"ఇండియా వెళ్లి పెళ్లి చేసుకున్నాం. ఫస్ట్‌నైట్ మర్నాడు, స్నేహితుడు నడుపుతున్న స్కూటర్ మీంచి కిందపడ్డప్పుడు విజయ్ తలకు దెబ్బ తగిలింది. కోమాలోకి వెళ్లాడు. బతక దనుకున్నారు. ఒక వారమైన తరువాత కళ్లు తెరిచాడు. అయితే ఎవరినీ గుర్తుపట్టలేదు. ఇక్కడ నాకు ఉద్యోగంలో సెలవు అయిపోయింది. అప్పటికే జరిగిన టెస్టుల వల్ల విజయ్ అంతకన్నా కోలుకోడని గ్రహించి మా నాన్న నన్ను బలవంతంగా వెనక్కు పంపించారు. విజయ్ వాళ్ల అమ్మానాన్నలు అతన్ని చాలా చోట్లకు తిప్పారు వైద్యం కోసం. శారీరకంగా కోలుకుంటాడు గానీ, తలకాయకు తగిలిన దెబ్బ వల్ల ఇంక ఎవరినీ గుర్తు పట్టకపోవచ్చని డాక్టర్లు చెప్పారు. దెబ్బ తగిలిన దగ్గరినుంచి అతను దాని పూర్వపు మనిషి కాడు. అతని కనీస అవసరాలను గూర్చి చూసుకోవడానికి ఒక ఫుల్ టైం మనిషిని నియమించారు.

"ఆ సంగతి తెలిసేటప్పటికి నేను దీనితో ప్రెగ్నెంట్. జరిగింది పెళ్లే కాదు, నీకు మళ్లీ పెళ్లి చేస్తాను అన్నారు మా నాన్న. అలా జరగాలంటే మతిలేని మనిషికి విడాకులివ్వాలి. అది ఆ మనిషికి తెలియడం కోసం కాదు. పెళ్లిలాగే మిగిలిన వాళ్లకి తెలియడం కోసం. ఏం జరుగుతోందో తెలియని మనిషికి ఎలా విడాకులివ్వడం? విడాకులిచ్చిన తరువాత సులభంగా పెళ్లి జరగడం కోసమని నాన్న అబార్షన్ చేయించుకోమన్నారు. అమ్మ ఏడుపు. నాకే ఏ ఏడుపూ రాలేదు. ఎందు కేడవాలి? కేవలం కొన్ని రోజుల ముఖపరిచయమూ, ఒక రాత్రి మాత్రం శారీరక సంబంధమూ ఉన్న మనిషి అనారోగ్యం గూర్చి నేనెందు కేడవాలి అనిపించింది. నా పొట్టలో పెరుగుతున్న ప్రాణి చేసిన తప్పేమిటో నాకు తెలియలేదు. విజయ్ అనారోగ్యానికి కారణం నాతో జరిగిన పెళ్లేనన్చెప్పి నన్ను తిట్టిన తరువాత, అమెరికాలో ఉన్నది కదా, పెళ్లినాటికే కడుపుతో ఉన్నదేమో నన్నార్ట విజయ్ అమ్మా నాన్నలు– ఆస్తిపాస్తుల వ్యవహారాల గూర్చిన లావాదేవీల ముందు చూపుతో. అలా అంటారని తెలిసే అబార్షన్ చేయించుకోమన్నార్ట నాన్న."

"ఇండియాలో పెళ్లవంగానే మారేజ్‌ని రిజిస్టర్ చేయించుకోవడం వల్ల విజయ్ కంపెనీ నుంచీ అతని డిజెబెలిటీని క్లెయిమ్ చెయ్యడానికి వీలయ్యింది. అఫ్ కోర్స్ డిజెబెలిటీ ప్రూఫ్‌కి కావలసిన డాక్టర్ సర్టిఫికెట్లని విజయ్ తరపు వాళ్లనించీ రాబట్టడానికి మా నాన్న చాలా కష్టపడ్డారు. చివరికి మధ్యవర్తెవరో చెప్పిన సలహాని పాటించి, ఈ డిజెబెలిటీ క్లెయిమ్ చేసినందువల్ల వాళ్ల ఆస్తిమీద నా హక్కులన్నీ వదులుకొంటానని మానాన్న చెప్పించడం వల్ల అది సాధ్యమయింది. ఆ పర్మినెంట్ డిజెబిలిటీకి కంపెనీ ఇచ్చిన కాంపెన్సేషన్ చూస్తే – దిస్ మస్ట్ బి ది మోస్ట్ ఎక్స్‌పెన్సివ్ వన్ నైట్ స్టాండ్ ఫర్ విజయ్ అనిపిస్తుంది!" అని చిన్నగా నవ్వింది.

ఎంత కూల్‌గా చెప్పింది? మరి తనమాట చెప్పుకోదే? అదే కారక్టరైజేషన్ తనకి కూడా వర్తిస్తుందిగా!

"అఫ్‌కోర్స్, దీన్ని పెంచడానికి, కాలేజీలో చేర్పించడానికీ ఆ డబ్బు కావాలనుకో! దీనికి అహిరి అని పేరు పెడతానంటే ఏడుపుగొట్టు దానికి విషాద రాగం పేరు సబబే అన్నారు మా నాన్న. నాన్న ఎంతో ఇష్టపడే రాగానికి ఆయనే ఆ బిరుదు తగిలించడం నా మీద ప్రేమవల్ల– అంతేగానీ దీనిమీద ద్వేషం వల్లకాదు. ఇది పుట్టినప్పుడు సహాయం చెయ్యడానికి వచ్చిన అమ్మ ఏడుపుమొహం రోజూ ఇంటికి రాగానే చూడలేక తొందరగా ఇండియాకి తోలేశా – దీన్ని డేకేర్‌లో పడేసి."

"ఇది పుట్టిన తరువాత దాదాపు ఏడాదికి విజయ్‌కి డబుల్ న్యుమోనియా వచ్చి, చావు బతుకుల మధ్యలో కొట్టుకుంటున్నాడని తెలిసి, ఆస్తి వివరాలు తేల్చుకోవడానికి రమ్మన్నారు నాన్న. ఆ ఆస్తిమీద నాకు ఆశలేం లేకపోయినా, నే వెళ్లేసరికి తను ఇంకా

బతికుంటే, లేకపోతే శవాన్ని చూడగలిగినా సరే, చివరి సారిగానైనా అతని మొహాన్ని చూద్దామనీ, దీనిని తీసుకెళ్ళి వాళ్ళ నాన్నని చూపిద్దామనీ, రికార్డు కోసమని వీడియో తీసి పెద్దయిన తరువాత దానికి ఇద్దామనీ అనుకుని ఇండియా వెడుతున్నపుడు–నిన్ను మొదటిసారి కలిశాను."

"నా లైఫ్‌లో ఒక ఎపిసోడ్‌కి క్లోజర్ దొరకాలంటే అతను బతికి బయటపడకుండా ఉండాలి కదా అని మనసులో రేగిన తలపుకి కలిగిన గిల్టీ ఫీలింగ్‌తో ప్లేన్‌లో నేను అప్పుడప్పుడు ఏడవడం చూసే ఉంటావు.

"దురదృష్ట మెవరిదో గానీ, డబుల్ న్యుమోనియా అతన్ని ఏమీ చెయ్యలేక పోయింది. విజయ్‌ని చూడడానికి వెళ్ళినప్పుడు వాళ్ళు నన్ను అనరాని మాటలన్నారనుకో. వీడియో తీస్తుంటే ఆ మాటలు రికార్డవుతున్నాయని కూడా పట్టించుకోలేదు.

"నాన్న వాళ్ళని తిట్టిపోశారు. అమ్మ దేవుణ్ణి తిట్టింది. ఒకప్పుడు నేను కూడా దేవుణ్ణీ, విజయ్‌నీ, ఈ సంబంధం కుదిర్చిన వాళ్ళనే కాక నాకు ప్లేన్ టికెట్టమ్మిన ట్రావెల్ ఏజెంట్‌ని కూడా తిట్టీ, తిట్టీ ఇంకెవరిని తిట్టాలో తెలియక విసుగెత్తిపోయాను. కొంతకాలం అయిన తరువాత, ఎవరినో తిడుతూ నా బ్రతుకునెందుకు కుళ్ళబెట్టు కోవాలన్న తెగింపువచ్చింది. మాట్లాడడానికి ఒక తోడుకావాలని అనిపించింది. తోడుకావాలంటే జోడుకావాలన్నాడు ఒక జాన్సన్. క్విడ్ ప్రోక్వో. నా వెన్నెలని నేనెందుకు అడవి పాల్చెయ్యాలి? ఐ హావ్ టు లుక్ ఆఫ్టర్ మై సెల్ఫ్, అండ్ జాన్సన్ లుక్స్ ఆఫ్టర్ హిమ్‌సెల్ఫ్. జోడులో ఉన్న ఇంటరెస్ట్ తోడులో చూపించకపోవడంతో జాన్సన్‌కి బై చెప్పాను. తరువాత నువ్వు కలిశావు. నిన్ను ప్రతీ రాత్రీ ఇంటికి తరిమెయ్యడానికి కారణం, అహిరి పొద్దున్న నిద్ర లేవగానే కనిపించే రెండోమనిషి గూర్చి దానికి లేనిపోని ఆశల్ని కల్పించకుండా ఉండాలన్న ఆలోచన.

"చూశావా, ఎవరి గురించో చెబుతున్నట్లుగా నీకు ఇంతసేపటి నుంచీ ఇంత స్వతంత్రంగా, ఫీలింగ్స్ ఏవీలేనట్లుగా మాట్లాడగల్గడం, నే నేర్పరచుకున్న పరిధిలో నిలబడి దేవుణ్ణి పట్టించుకోకుండా నా శారీరక వాంఛల్ని అదుపులో పెట్టుకోవలసిన అవసరం లేకుండా గత తొమ్మిది నెలలుగా నీతో గడపడం, అమెరికాలో ఉండడం వల్లనే సాధ్యమయిందనుకో. విజయ్‌తో పెళ్ళైన పదేళ్ళ తరువాత అతనికిలా అయితే అప్పుడేం చేసేదాన్నో తెలియదు కానీ, ధర్మేచ, అర్థేచ, కామేచ అని పెళ్ళిలో చేసిన ప్రమాణాలు నేను నిలుపుకోలేదు. టెల్ మి. వై డు యు వాంట్ టు మారీ మీ?"

ఒక చోట నిల్చోకుండా అపార్ట్‌మెంట్ అంతా తిరుగుతూ మాట్లాడి, నన్నీ ప్రశ్నని వేసేసరికి కిచెన్ సింక్ దగ్గర, సింక్ వైపు వీపుని పెట్టి, నడుమునీ, రెండు అరచేతుల్నీ వెనక కౌంటర్ మీద ఆనించి నిలబడి నా కళ్ళలోకి సూటిగా చూస్తోంది. ఆ కళ్ళల్లో, నన్ను గూర్చిన తన అంచనా నిజమవుతుందో కాదోనన్న ఆదుర్దా, మళ్ళీ లిప్తపాటు కాలంలో

నిజం కాకేమవుతుందన్న ధైర్యం టకటకా ప్లేసులు మారుతున్నాయి. మానిటర్ మీద ఉన్న అక్షరాల సముదాయాన్ని చూసి కంప్యూటర్ ఏమాలోచిస్తోందో చెప్పవచ్చు. కానీ, కళ్లల్లో వెలువడే భావాలని చూసి ఆ కళ్ల వెనుక ఆలోచనలని చెప్పడం ఎవరివల్ల నవుతుంది?

ఇది నేననుకున్నట్లుగా డైవోర్సు కేసూ, మోసపోయిన కేసూ కాదు, స్వచ్ఛందం కేసూ కాదు. కాదు, కాదు. అహిరిని కని పెంచాలనుకోవడం స్వచ్ఛందం కేసే. నాతో రిలేషన్‌షిప్పూ స్వచ్ఛందంగానే.

నా పెళ్లైన తరువాత, జయశ్రీకి, విజయ్‌కి వచ్చిన పరిస్థితే వస్తే, లేక నిరంతరం అస్వస్థతతో బాధపడుతూ మంచం మీదనించీ లేవకపోతే, విడాకులిచ్చినా ఇవ్వక పోయినా నేను వేరే సంబంధం పెట్టుకుంటే, లోకమే కాక, నాతో తిరిగే స్త్రీయే కాక, నా భార్యగానీ వాళ్ల తరపు వాళ్లు గానీ ఎవరూ ఏమీ అనరు, పట్టించుకోరు. బయట ఏం చేసినా గానీ, విడాకు లివ్వకుండా ఆ రోగిష్టి భార్యని ఇంట్లోనే ఉంచుకుంటే త్యాగమూర్తినని లోకం హర్షిస్తుంది కూడా. టెర్రీ షియావో కేసులో ప్రాబ్లం రావడానికి కారణం ఆ బ్రెయిన్‌డెడ్ ఆవిడ భర్త, ఆవిడకు లైఫ్ సపోర్ట్ తొలగించమని డాక్టర్లను అడగడం వల్ల కదా! కాకపోతే ఎవరికైనా పట్టిందేమిటి?

తను సజావుగా నడవాలన్న సంఘం కోరికను తీర్చడానికే మనుషులు పెళ్లి అనేది చేసుకోవాలా? ఈ సంఘం ఒక భారత స్త్రీ జీవితాన్ని ఎలా తయారుచేసింది? ఆవిడ, “దిజీస్ మై హజ్బెండ్” అని ఎవరినయినా పరిచయం చేస్తే, అది అరేంజ్‌డ్ మారేజ్ అయితే, “హి హాజ్ చోజెన్ టు హావ్ సెక్స్ విత్ మీ” అనో, లేక “హిజ్ పారెంట్స్ హావ్ కైండ్లీ గివెన్ హిమ్ పర్మిషన్ టు హావ్ సెక్స్ విత్ మీ,” అనో హెల్ప్‌లెస్‌నెస్‌ని వ్యక్తం చేసేలా చేసింది. అదే ప్రేమ వివాహమైతే, “ఐ హావ్ చోజెన్ టు హావ్ సెక్స్ విత్ హిమ్,” అని ఒక స్త్రీ ఎంపవర్‌మెంట్‌ని వ్యక్తం చేస్తుంది.

కిరణ్ ధైర్యంగా తీసుకున్న నిర్ణయం – విజయ్ బ్రతుకు భారాన్ని అతనికి తల్లిదండ్రులకి వదిలేసి తన బ్రతుకు తను బ్రతకాలనుకోవడం – పైగా అతని కూతురుని పెంచుతూ. దిసీజ్ ఎంపవర్‌మెంట్. షీ ఈజ్ యాన్ ఎంబాడిమెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్. కష్టాలకి తలక్రిందులౌతుందేమో గానీ తలమాత్రం వంచని మనిషి. అందరూ కిరణ్‌లాగా ఆలోచిస్తే సైకియాట్రిస్టులందరూ వాళ్ల వృత్తుల్నే వదులుకోవాల్సిందే! అహిరి అదృష్టవంతురాలు. మరి నేను? లేక్ వోబగాన్ అన్న ప్రదేశాన్ని గూర్చి గారిసన్ కీలర్ అంటాడు. “వేర్ వుమెన్ ఆర్ స్ట్రాంగ్ అండ్ మెన్ ఆర్ గుడ్ లుకింగ్,” అని! నా పెళ్లి ప్రతిపాదనకి ముందే, నేను జోడునే కాక తోడుని కూడా కోరుకుంటున్నానని గ్రహించిన తెలివైన మనిషి! క్రితం సంవత్సరం థాంక్స్‌గివింగ్‌తో మొదలయిన పరిచయం తొమ్మిది నెలల తరువాత నా కర్థమయ్యేలా ఒక స్పష్టాకృతిని దాల్చింది.

షి చోజ్ మి!

ఐ చోజ్ హర్!!

రెండడుగులు ముందుకువేసి, ఎడమచేతిని కిరణ్ నడుం చుట్టూవేసి దగ్గరకు లాక్కొని, కొద్దిగా ముందుకు వంగి పెదవుల మీద ముద్దు పెట్టుకుని అన్నాను – "నాకు తెలిసిన ఒక రియల్ ఎస్టేట్ ఏజెంట్ ఉన్నాడు. రేపటి నుంచీ ఇళ్లవేట ప్రారంభిద్దాం."

కిరణ్ తన రెండు చేతుల్తో నా నడుముని చుట్టేసి కళ్లలోకి చూసింది. కొంచెం చికిలిస్తున్న ఆ కళ్ల వెనుక తన అంచనా తప్పుకాలేదన్న గర్వం తొంగి చూస్తోంది.

జేబులో ఉంగరం సంగతి గుర్తొచ్చింది. కుడిచేత్తో దాన్ని బయటకు తీసి, కిరణ్ చేతి వేలికి తొడుగుతూ అన్నాను. "నీ కోసమే కొన్నది."

(ఆదివారం ఆంధ్రజ్యోతి, 2006)

# స్టిల్ ఏన్ ఇండియన్

"నాన్న ఫోటో ఎక్కడా కనిపించట్లేదే!"

"అమ్మ ఆరోగ్యం గురించి విని చూడడానికి వచ్చినవాడివి! అమ్మ రెండు కాళ్లమీద నిలబడి కనిపించేసరికి నాన్నను గుర్తుచేసుకుంటున్నావన్నమాట."

"నాన్నే ఉండుంటే నీ ఆరోగ్యం బాగాలేదన్న సంగతి నాకు, శాంతికీ రెండు వారాల తరువాత కాకుండా వెంటనే తెలిసేది కదా!"

"తెలిసి ఏం చేసేవాళ్లురా? నేనేమో వాషింగ్టన్లో, నువ్వేమో చికాగోలో. అదేమో శాన్‌ఫ్రాన్సిస్కోలో. ఉన్న పళాన కారెక్కి డ్రైవ్ చేసి రాగల దూరాలా? మీనాన్న ఉండుంటే రోజుకో ఫోన్‌చేసి కనుక్కునేవాళ్లు అంతే. క్రితం ఏడాది నేను ఇండియాలో ఉన్నప్పుడు నేను హాస్పిటల్ పాలైతే ఏం చేసేవాళ్లు?"

"అప్పుడైతే మామయ్య నీ పక్కనున్నాడన్న ధైర్యం మాకుండేది."

"ధైర్యం కావలసింది పేషెంటుకురా!. చుట్టుపక్కల వాళ్లకి కాదు."

"అదికాదు మామ్. మేం వద్దంటున్నా వినకుండా ఇండియాలో ఉంటానని వెళ్లావ్ ఇక్కడేం మిగిలి ఉందని చెప్పి. తిరిగి వస్తున్నానని సంతోషపడితే ఇప్పుడు నాకుగానీ శాంతికిగానీ దగ్గర్లోలేవు!"

"మీరుండే ప్రదేశాలు నాకు కొత్త కదరా! ముప్పై ఏళ్ల క్రితం ఈ దేశానికి వచ్చినప్పుడు మీ నాన్నతో కలిసి ఊళ్లు మారినా, ప్రతిచోటా మాలాంటి ఇండియన్స్‌నీ, తెలుగువాళ్లనీ కలిసి పరిచయాలు పెంచుకున్నాం. ఇప్పుడా ఓపిక లేదురా. ఇక్కడైతే తెలిసినవాళ్లింకా ఉన్నారు. పరిసరాలు కూడా బాగా పరిచయం."

"రవి దగ్గరకు వాళ్ల పేరెంట్స్ మూవ్ అయ్యారు. నువ్వే ఇక్కణ్ణించి కదలనంటావ్."

"కదలను అనేట్లయితే ఏడాదిపాటు ఇండియాలో ఎట్లా గడిపేదాన్నిరా? ఎప్పుడో మీ నాన్నని పోరిపోరి మీ మామయ్య ఇంటిదగ్గరే ఒక ఫ్లాట్ కొనిపించాను. అన్నయ్య

పక్కనుంటాడు గదా అని వెడితే వాడేమో రిటైరయ్యి వాడి కొడుకు దగ్గరకు వెళ్లిపోయాడు. నా అన్నవాళ్లు పక్కన లేకపోతే అనకాపల్లి అయితేనేం అమెరికా అయితేనేం అని అనుకుని వెనక్కువచ్చా. ఇదుగో ఈ కాఫీ తాగుతూ మాట్లాడుతుండు. నీ కిష్టమైన పకోడీలు చేస్తా. ఆ ఎండ్ టేబుల్ క్రింద ఫోటో ఆల్బమ్ ఉంది చూడు. అందులో నువ్వడిగిన ఫోటోలు కనిపిస్తాయి."

"నాన్న పోయి దాదాపు మూడు సంవత్సరాలు అవుతోందంటే నమ్మబుద్ధి కావట్లేదు!"

"శాంతి పెళ్లి గ్రూప్ ఫోటోలో నా మొహం చూసి ఇప్పుడు నన్నుచూడు. నా వయసు అరవైలోపేనంటే ఎవరూ నమ్మరు. ఈ మూడేళ్లు నాకు పదేళ్ల ముసలితనాన్ని తెచ్చిపెట్టాయి."

"ఇప్పుడు నీకు ఉద్యోగం చెయ్యాల్సిన అవసరమేమిటి మామ్? వచ్చి మా దగ్గర ఉండు."

"నువ్వేదో ఆవేశంలో అంటున్నట్టున్నావ్ గానీ క్రిస్టినాతో సంప్రదించినట్టు లేదు."

"క్రిస్టినా నీకు దాదాపు ఎనిమిదేళ్ల నుంచీ – మాకు పెళ్లి కాకముందు నుంచీ తెలుసు మామ్. తనేమీ అనుకోదు. ఉయ్ హావ్ అల్రెడీ డిస్కస్డ్ ఇట్."

"అయినా అవసరం స్వతంత్రేచ్ఛరా! పెళ్లవ్వగానే మీ నాన్నతో అమెరికా వచ్చి పడ్డాను. నాకు అత్తగారి ఆరడిలేదు. క్రిస్టినాని కూడా అలాగే గడపనీ. మీ ఇంట్లోనో లేక శాంతి ఇంట్లోనో నేనుంటే ఈ అమ్మ నడిచి తిరగగలిగినప్పుడు బాత్రూములు క్లీన్ చెయ్యలేదనీ, టైంకి వండి పెట్టలేదనీ విసుక్కునే అవకాశాలొస్తాయ్."

"కనీసం మా దగ్గరగా ఉంటే నిన్ను ఫ్రీక్వెంట్‌గా చూసే అవకాశం ఉంటుంది కదా మామ్?"

"నువ్వు కాలేజీకని ఇంట్లోంచి వెళ్లిన తరువాత నన్నెంత తరుచుగా చూశావురా? థాంక్స్ గివింగ్‌కనీ, క్రిస్టమస్ సెలవులకనీ, డార్మ్స్ క్లోజ్ చేసినప్పుడు మాత్రం ఇంటికి వచ్చావ్. సమ్మర్‌లోనేమో ఇంటర్న్‌షిప్‌లనీ, ప్రాజెక్ట్‌లనీ వేరే ఊళ్లకెళ్లావ్. ఇప్పుడు కూడా అట్లాగే నాలుగు నెల్లకోసారి వచ్చి చూసి వెడుతూండండి. లేకపోతే టిక్కెట్ పంపించండి. వస్తా."

"నాన్న కూడా పక్కన లేకుండా ఒంటరిగా ఎలా ఉంటావమ్మా?"

"ఒంటరితనం భరించడం కష్టమే గానీ, అది ఈ దేశానికి వచ్చినప్పటి నుంచే అలవాటయ్యిందిరా. మీరు పుట్టకముందు మీనాన్న వర్క్‌కి వెళ్లిన దగ్గర్నుంచీ తిరిగి వచ్చేదాకా ఒంటరితనమే. మీ నాన్న బిజినెస్ ట్రిప్పులకి వెళ్లినప్పుడు అది ఇంకా ఎక్కువ. మీరు కాలేజీలకి వెళ్లడం మొదలైన తరువాత మళ్లీ మీరు పుట్టక ముందరి పరిస్థితే. ఒంటరితనం అసలు తెలియనిది ఎప్పుడో తెలుసా? నువ్వు పుట్టిన దగ్గర్నుంచీ శాంతిని ప్రి-స్కూల్‌కి పంపించేదాకా. మళ్లా ఇప్పుడు. ఒకప్పుడు ఒంటరితనాన్నిచ్చిన పది గంటల్లో ఎంతమందికి

సహాయం చెయ్యగలుగుతున్నానో తెలుసా? ఆ టైంలో ఇప్పుడు ఒంటరితనం అసలు తెలియట్లేదు."

"మరి సాటర్‌డేస్ అండ్ సన్‌డేస్?"

"మీరు పుట్టినప్పుడు ఇక్కడ ఒక్క హిందూ టెంపుల్ కూడాలేదు. ఇప్పుడు కనీసం అరడజను. వీటిల్లో వాలంటీర్‌వర్క్ చెయ్యడానికి ఆ రెండ్రోజుల్లో ఇరవై నాలుగు గంటలు కూడా సరిపోవట్లేదు. అన్నట్టు బాటర్డ్ ఉమెన్‌కి సహాయం చేసేందుకు నువ్వేమైనా విరాళాలు పోగు చెయ్యగలిగితే మా ఆఫీసుకి పంపించు. చాలామంది ఇండియన్స్‌కి సహాయం కావాలి."

"నువ్వు ఉద్యోగం చేస్తావని ఎప్పుడూ ఇమాజిన్ కూడా చెయ్యలేదు మామ్."

"నేను ఇమాజిన్ చేశానేమిటి? మీ నాన్న అంటుండేవారు– పిల్లలు కాలేజీలకి వెళ్లిన తరువాత నీకు బోర్‌గా ఉంటుంది, ఏదో ఒక స్కిల్ అలవర్చుకో అని. క్రితంసారి ఇండియా ట్రిప్పులో జ్ఞానోదయమయ్యింది. మా అమ్మమ్మ ఎనభై ఏళ్లు బతికింది. మా అమ్మ కూడా డెబ్భైఏళ్లకు పైగానే. అంటే కనీసం వచ్చే ఇరవై ఏళ్లు ఏ పనీచెయ్యకుండా ఉండడానికీ, ఇంకొకళ్ల మీద ఆధారపడి బ్రతకడానికి నాకు భయం వేసింది. కొద్దో గొప్పో కంప్యూటర్ గూర్చి తెలియడం వల్ల క్రితం ఏడాది ఇండియాలో ఉన్నప్పుడు ట్రైనింగ్ తీసుకోవడం ఈజీ అయ్యింది. దానివల్లనే ఇప్పుడీ ఉద్యోగం. అయితే నాన్–ప్రాఫిట్ ఆర్గనైజేషన్ అవడం వల్ల ఎక్కువ పే చెయ్యరనుకో. కనీసం హెల్త్ ఇన్సూరెన్స్ ఇస్తారు. అంతవరకూ నయం."

"నీ ఫోన్ వచ్చేసరికి నువ్వింకా ఏ ఫ్రాన్స్‌లోనో, జెర్మనీలోనో ఉంటావనుకున్నాం."

"అదృష్టం లేదు. ఆ ట్రిప్పులో వెళ్లినవాళ్లు ఈ పాటికి వెనక్కి బయల్దేరబోతూ ఉంటారు."

"డాడీకి కొత్త దేశాలు చూడటం అంటే ఇష్టమా?"

"బాగా ఇష్టం. అయితే మీరు పుట్టకముందు కొత్త ఉద్యోగం– సెలవులూ, డబ్బూ రెండూ లేవు. మీరు పుట్టిన తరువాత ఇండియా ట్రిప్పులకనే సెలవులూ, డబ్బూ కూడబెట్టింది. తర్వాత మీ చదువులకీ, పెళ్లిళ్లకనీను. ఆయన కెట్లాగో కుదర్లేదని నేనైనా చూద్దామనుకున్నాను. చూస్తాలే, ఓ నెల్లోనో, రెణ్ణెల్లలోనో."

"ఒక్కదానివీ ఎలా ఆ యూరోప్ ట్రిప్పులో వెడతావు మామ్ అనడిగితే – ఇక్కడే ముప్ఫై ఏళ్లకి పైగా ఉన్నదానిని, ఆ మాత్రం వెళ్లలేనా అని అన్నావ్. అప్పుడు ఊరుకున్నా, ఇప్పుడు నీ ఆరోగ్యం చూసిన తరువాత అడుగుతున్నాను. నువ్వెళ్లే టూర్లో నీతోపాటు నాకుగానీ, శాంతికిగానీ తెలిసిన వాళ్లెవరైనా ఉన్నారా?"

"టెంపుల్లో నీ చిన్నప్పటి నుంచీ వాటంటీర్‌గా వర్క్ చేస్తూ ఒక అంకుల్ కనిపిస్తుండేవారు గుర్తుందా? ఆయన కూడా వస్తానంటేనే నేను బయల్దేరాను. ఆరోగ్యం

బాగోలేక పోవడాన కాన్సిల్ చెయ్యడం వల్ల నాకైతే ఫుల్ రిఫండ్ ఇచ్చారుగానీ నాకు సహాయం చెయ్యడానికి ఆగిపోయినందుకు ఆయనకు మాత్రం బాగానే వదిలాయ్ డబ్బులు."

"ఈసారి వెళ్లినప్పుడు మాత్రం నువ్వు ఏ కంట్రీలో ఉన్నా సరే నాకు ప్రతీరోజూ ఫోన్ చెయ్యాలి. కలెక్ట్ కాల్."

"అలాగేలేరా, రాత్రికి కూరేం చేసిపెట్టమంటావ్?"

"గుత్తి వంకాయ కూరమ్మా. అది నువ్వు చేస్తే తిని చాలాకాలమయ్యింది. క్రిస్టినా ట్రై చేస్తుంది కానీ, నువ్వు చేసినట్టు ఎవరూ చెయ్యలేరు."

"అయితే ఆ పటేల్ బ్రదర్స్‌కి వెళ్లి వంకాయలు పట్రా. చేసి పెడతాను. అవి నా కోసం చేసుకోవడం మానేసి చాలాకాలమయ్యింది. నీ బాగ్ రెండో బెడ్రూంలో పెట్టు. ప్రస్తుతం అది స్టోర్‌రూమ్‌లాగుంది. ఎంతైనా లంకంత కొంపలోని సామాను టూ బెడ్రూం అపార్ట్‌మెంట్లో ఏ సరిపోతుంది? ఈ రాత్రికి నీకు లివింగ్ రూంలోనే పక్క."

* * *

"ఏమిటి శాంతి, చెప్పాపెట్టకుండా ఊడిపడ్డావ్? ఐదు నిమిషాల తరువాత వచ్చుంటే నేను ఇంట్లో ఉండేదాన్ని కాదు."

"నిన్ను చూడాలనిపించింది మమ్మీ."

"అలా తలుపేసేస్తావేమిటి? కిషనూ, కెవినూ వస్తారు గదా!"

"లేదు మమ్మీ కెవిన్ని పెట్టుకుని కిషన్ ఇంట్లో ఉంటానన్నాడు."

"అదేమిటే, నాలుగునెల్ల పిల్లాణ్ణి అట్లా వాళ్ల నాన్న దగ్గర వదిలేసి వచ్చావ్? వాళ్లిద్దరూ కులాసాయేనా? ఏమైనా కాన్ఫరెన్స్‌కి వచ్చావా?"

"నిన్ను చూడాలనిపించిందని చెప్తే నమ్మవేం?"

"నీ దగ్గర్నుంచి నేను వెనక్కి వచ్చి మూణ్ణెల్లేగదే అయింది? అమ్మను చూడకుండా అంత ఉండలేకపోయావా?"

"మనవడు పుట్టి నెలవ్వంగానే నువ్వు వెనక్కు రాగలిగినా... నువ్వు మాతోబాటే ఉంటే బాగుండేది. ఇక్కడ నీకు ఒంటరితనం తప్పేది."

"ఎందుకు తల్లీ మీతో ఉండడం? మీరేమో పొద్దున్నే వర్క్‌కి వెళ్లి చీకటి పడ్డాకగానీ రారు. అప్పటిదాకా మాటలు కూడా రాని పసికందుకు డయపర్లు మారుస్తూ, బాటిల్ పాలు పడుతూ ఇంట్లో కట్టిపడేసినట్లుండాలి. ఇంక నాకా ఓపికలేదు తల్లీ. వాడికి పాటీ ట్రైనింగ్ అయినతర్వాత చూద్దాం... ఈ విషయం మీద కిషన్ నిన్నేమైనా అన్నాడా?"

"వాళ్లమ్మలాగా నువ్వుకూడా కూతురు దగ్గర ఉండి మనవణ్ణి చూసుకుంటా వనుకున్నాడు."

"దాన్ని గూర్చి మీరేమన్నా పోట్లాడుకుంటే నాకు ఫోన్లో చెప్పవచ్చుగదే, ఇట్లా ధడాల్న ఊడిపడడం దేనికి? ఇదేమైనా పక్క ఊరా, పాడా?"

"మేమేం పోట్లాడుకోలేదు మమ్మీ. అయినా నువ్వు మాతో కొన్నాళ్లు, శ్యాంతో కొన్నాళ్లు ఉంటే నీకు ఒంటరితనం తప్పేది."

"మోనిక నీతో ఏం చెప్పింది?"

"సరోజా..., సరోజగారూ, రెడీయేనా?"

"నేను ఇవ్వాళ రావట్లేదు. శాంతి ఇప్పుడే వచ్చి సర్‌ప్రైజ్ చేసింది."

"హాయ్ శాంతి! హౌ ఆర్ కెవిన్ అండ్ కిరణ్?"

"దే ఆర్ ఫైన్. థాంక్స్ ఫర్ ఆస్కింగ్."

"అయితే నేను కూడా ఇవ్వాళ వెళ్లనులే. ఏమైనా కావాలంటే నేను అపార్ట్‌మెంట్లోనే ఉంటాను. కాల్ చెయ్యండి."

"డిన్నర్ ఇక్కడే చేద్దాం ముగ్గురమూను. రావుగారు తెలుసుగా శాంతి! టెంపుల్‌లో చూసేదానివి."

"శాంతితో మాట్లాడుకోవచ్చుగదా, మధ్యలో నేనెందుకు?"

"మరేం ఫర్లేదు. శాంతి చిన్నపిల్లేం కాదు."

"ఏం ప్రోగ్రాం కాన్సిల్ చేసుకున్నావ్ మమ్మీ?"

"వాటర్ ఏరోబిక్స్."

"మీరు మాట్లాడుకుంటూ ఉండండి. ఈలోగా నేనో చిన్నపని చూస్కొని ఏడున్నరకల్లా వచ్చేస్తా."

"వావ్ మమ్మీ! వాటె ఛేంజ్! నిన్ను స్విమ్మింగ్ డ్రెస్‌లో నేనిప్పటిదాకా చూడలేదు. కిషన్ వోన్ట్ బిలీవ్ మి."

"మీ నాన్న కూడా నాతోపాటు నా లైఫ్‌లాంగ్ ఉంటారనే అనుకున్నాను. అదీ ఛేంజ్ అయింది కదా. ఎలాగో బతక్క తప్పట్లేదు. అదేదో హెల్తీగా బతికితే అందరికీ ఆనందంగా ఉంటుంది. తర్వాత మాట్లాడుకుందాం. ముందు నువ్వు నీళ్లు పోసుకురా ప్రయాణపు బడలిక తీరుతుంది. ఈలోపల నీకిష్టమైన కారప్పూస చేస్తాను. నీ బట్టలు ఆ సెకండ్ బెడ్రూంలో పెట్టు. లేకపోతే నూనె వాసన కొడతాయ్."

* * *

"అబ్బ! మంచి డిన్నర్ తిని చాలా కాలమైంది మమ్మీ. ఐ రియల్లీ మిస్ యూ."

"మెడికల్ రెసిడెన్సీయే చేస్తావా, పిల్లాణ్ణే చూస్తావా, లేక వంటే చేస్తావా? అయినా నీకు నేనెప్పుడు గుర్తుకు వస్తానో గెస్ చెయ్యనా? నువ్వు హాస్పిటల్ నుంచి ఇంటికి వస్తూ బేబీ సిట్టర్ దగ్గర కెవిన్ని పికప్ చేసుకున్న తరువాత ఇంట్లో వంటచెయ్యడానికీ, ఏడుస్తుంటే కెవిన్ని సముదాయించడానికీ సతమతమవుతున్నప్పుడు. అవునా?"

"అదేమిటి మమ్మీ, అట్లా అంటావు? ఐ రిమెంబర్ యూ ఆల్ ద టైం."

"నిజంగా? నేను నీకు అమ్మనే, మర్చిపోకు. అమ్మ గుర్తుకు రాకపోవడం నువ్వు మిడిల్ స్కూల్‌లో చేరే ముందరే మొదలయ్యింది. కిషన్ని కలిసిన తరువాత పెళ్లికి పర్మిషన్ కోసం మాత్రం అమ్మ కావాల్సి వచ్చింది. నువ్వు నా పర్మిషన్ తీసుకున్నందుకు మాత్రం నాకు సంతోషమే. అయినా శ్యాం నీకంటే ముందు ఓ అమెరికన్‌ని పెళ్లి చేసుకోవడంతో నీకు మేం వద్దంటామన్న భయమేంలేదు. మా అమ్మ చెప్పేది. బాధల్లో ఉన్నప్పుడు మాత్రం అమ్మ గుర్తుకువస్తుందని. ఇప్పుడింతకీ నీ బాధేంటి చెప్పు. ఎందుకింత హఠాత్తుగా బయల్దేరి వచ్చావ్?"

"నాకు బాధలేం లేవు మమ్మీ. నీ గురించే నాకు భయం. ఐ వర్రీ అబౌట్ యూ."

"నీకు అంత భయం కలిగించేంత పని నేనేం చేశానే? ఇంతకీ నీకు మౌనిక ఏం చెప్పింది?"

"... దట్ హి అండ్ యు ఆర్ ప్లానింగ్ టు బయ్ ఎ హౌస్?"

"కొన్న తరువాత చెప్దామనుకున్నాను. మౌనిక నీ స్నేహితురాలని తెల్సినా కూడా పోన్లే తెలిసిన రియాల్టర్‌కే బిజినెస్ ఇద్దాం అనుకున్నా. కొని సర్‌ప్రైజ్ చేద్దామనుకుంటే కొనకుండానే మౌనిక నాకా ఛాన్స్ లేకుండా చేసింది."

"ఇప్పుడు వర్రీ అవుతున్నాను మమ్మీ. ఆ ఇల్లు డీడ్ నీ పేరు మీదే ఉంటుందా?"

"నా పేరు మీదే కొందామనుకుంటున్నాను. ఏం?"

"ఇంకెవరి పేరూ ఆ డీడ్ మీద ఉండదా?"

"ఆలోచిస్తున్నాను. రావుగారి సలహా మీద లాయర్ని సంప్రదిస్తున్నాను."

"మమ్మీ యూ నో, దేర్ ఆర్ ఎ లాట్ ఆఫ్ మెన్ హూ విల్ బిఫ్రెండ్ లోన్లీ అండ్ రిచ్ లేడీస్, ట్రాన్స్‌ఫర్ ప్రాపర్టీ అండ్ బాంక్ అక్కౌంట్స్ ఇంటూ దెయిర్ నేమ్స్ అండ్ లేటర్ కిక్ దెమ్ అవుట్? నువ్వు మాతో చెప్పకుండా ఏ పేపర్‌మీద సంతకం చెయ్యకు."

"రావుగారికి పెళ్లి కాలేదు తెలుసా? ఎవరో దూరపు బంధువులు తప్ప నా అన్నవాళ్లు ఆయనకు ఎవరూ లేరు."

"తర్వాత ఎవరన్నా వచ్చి వాళ్లు రావుగారి పిల్లలమని చెప్పి, నాన్న సంపాదించిన ఆస్తిలో వాటా తీసుకెళ్లడం... మాకిష్టం లేదు మమ్మీ."

"నువ్వూ, శ్యాం ఈ విషయం గూర్చి మాట్లాడుకున్నా రన్నమాట. మరి వాడు రాలేదేం?"

"ఉత్త ఆస్తి విషయమైతే వాడే వచ్చేవాడు. కాకపోయినందువల్లే ముందు నేను నీతో మాట్లాడుతున్నాను."

"నా మాట వినకుండా మీనాన్న నిన్ను వేరే స్టేట్‌లో కాలేజీకి పంపిస్తే నువ్వు ఇమ్మెచ్యూర్ అనీ, ఏ తప్పు చేస్తావోనని ఎంత భయపడ్డానో తెలుసా? నువ్వు ఇంకో

అమ్మాయితో రూం షేర్ చేసుకుంటున్నానని చెప్పి కిషన్‌తో కలిసి ఒకే రూంలో ఉన్నా వని తెలిసిన తరువాత మీ నాన్నతో చెప్పకుండా ఉండడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. మీ నాన్నది అసలే దూకుడు వ్యవహారం కదా! మెడిసిన్ చదువుతున్నావ్ కదా, నీ జాగ్రత్తలు నువ్వు తీసుకునేలా చెయ్యమని దేవుణ్ణి ప్రార్థించాను."

"మమ్మీ, ఐ వజ్ యంగ్ అండ్ ఇమ్మెచ్యుర్. యూ ఆర్ మెచ్యూర్ బట్ వల్నరబుల్."

"అయితే ఏం చెయ్యమంటావే? మా తాతయ్య పోయిన తరువాత ఇరవయ్యేళ్ల పాటు మా అమ్మమ్మ వాళ్ల కొడుకుల దగ్గర ఉంది. మా నాన్న పోయిన తరువాత మా అమ్మ మీ మేనమామ దగ్గరుంది. వాళ్లట్లా ఉండగలిగారంటే వాళ్లకి రోజంతా మాట్లాడు కోవడానికైనా, పోట్లాడుకోవడానికైనా కొడుకులూ, కూతుళ్లూ ఒకే ఇంట్లో ఉన్నారు– ఆ కాలంలో ఆడవాళ్లెవరూ ఉద్యోగాలు చెయ్యలేదు కనుక. నేను మీ దగ్గరకొచ్చినా మీరు రోజంతా ఇంట్లో ఉండరు కదవే."

"ఆర్ యూ గోయింగ్ టూ మారీ హిమ్?"

"హి ఈజ్ జస్ట్ ఎ కంపానియన్."

"మరి కంపానియన్‌షిప్‌కే అయితే ఇంకొక లేడీని చూసుకోవచ్చుగదా మమ్మీ?"

"బావుందే, ఇంకో లేడీ అయితే, బయట స్నో పడితే నేను ఆవిడా కలిసి షవల్ చేసుకోవాలి. కార్ రిపైర్ చేయించాలంటే ఆ మెకానిక్ మా ఇద్దర్నీ ఒకే రకంగా మోసం చేస్తాడు. ఇద్దరం ఆడవాళ్లమేగా? పైగా తెల్లవాళ్లలోగానీ, నల్లవాళ్లలోగానీ నిచ్చెనెక్కి ఇంటి బయట క్రిస్మస్‌లైట్లు వెలిగించే ఆడవాళ్లని చూశావా?"

"ఇట్స్ నాట్ ఫన్నీ మమ్మీ. ఇఫ్ ఇటీజ్ జస్ట్ కంపానియన్‌షిప్, వై డోంట్ యూ స్టే ఇన్ దిస్ అపార్ట్‌మెంట్ అండ్ లెట్ హిం స్టే నెక్స్ట్ డోర్?"

"ఐ డోన్ట్ అండర్‌స్టాండ్ యువర్ అబ్జెక్షన్ శాంతి! వాట్ ఈజ్ బాదరింగ్ యు?"

"మమ్మీ దిసీజ్ నాట్ సంథింగ్ దట్స్ ఈజీ ఫర్ శ్యాం అండ్ మీ టు ఎక్స్‌ప్లెయిన్ టు అవర్ కిడ్స్ – దిస్ లివింగ్ టుగెదర్ బిజినెస్."

"వైనాట్? స్టెప్ డాడ్స్‌ని పిల్లలకి ఈ దేశంలో చాలా ఈజీగానే ఇంట్రడ్యూస్ చేస్తారు గదే వాళ్ల తల్లులు? పైగా నువ్వూ, వాడూ చిన్నపిల్లలేం కాదు."

"...ఐ కాంట్ ఇమాజిన్ యూ విత్ హిమ్ మమ్మీ!"

"నువ్వెందుకే ఏడుస్తావ్? మీ నాన్న పోయిందగ్గర్నుంచీ మూడేళ్లు ఏడుస్తూనే గడిపాను. అయినా ఆరోగ్యంగానే ఉన్నాను. యూరోప్ ట్రిప్పుకెళ్లి వచ్చిన తరువాత కొంచెం ప్రశాంతత లభించింది. ఇంకో రెండేళ్లు గడిచింది. నేను బతక్క తప్పదని తెలిసింది. డిడ్ ఐ ఇమాజిన్ ఐ విల్ ఫేస్ దిస్ సిట్యుయేషన్? నో! మీ పెళ్లిళ్లయిన తరువాత మీరు మీ పిల్లలతో మా ఇంటికి థాంక్స్ గివింగ్‌కనీ, క్రిస్మస్‌కనీ వస్తారని నేను, మీ నాన్న కలలుకన్నాం. ఈ

అపార్ట్‌మెంట్‌కి ఒక్క మనిషి గెస్ట్‌గా వచ్చినా లివింగ్‌రూంలో పడుకోవాల్సిందే. అలాంటప్పుడు నువ్వూ, శ్యాం ఫామిలీల్తో సహా వస్తే ఉండడానికి చోటు కావాలి కదా? అందుకే టౌన్‌హౌస్ కొంటున్నాను. మీ నాన్న కలనీ, నా కోరికనీ నిజం చెయ్యండి."

"ఉడ్ యూ ఎట్ లీస్ట్ హాంగ్ డాడ్స్ ఫోటో ఇన్ ద లివింగ్ రూం?"

"ఐ డోన్ట్ నో."

* * *

"పోనీ ఇల్లు కొనడాన్ని ఒక ఏడాదిపాటు పోస్ట్‌పోన్ చెయ్యకూడదూ?"

"కుదర్దు. నా చిన్నారి మనవణ్ణి నా ఇంట్లో ఈ ఏడాదే చూసుకోవాలి."

"పోనీ ఇల్లు కొన్న తర్వాత అందులో కొంత కాలం నువ్వే ఉండు సరోజా. తర్వాత కొన్నాళ్లకీ నేను వస్తాను."

"అందువల్ల లాభమేమిటండీ?"

"ఈ లివింగ్ టుగెదర్ గూర్చి అపోహలూ, అపార్థాలూ తగ్గుతాయి."

"ఎవరికి?"

"ఈ చుట్టుపక్కల వాళ్లకీ, నీ పిల్లలకీను."

"చుట్టుపక్కల వాళ్లు అనుకునేవి అనుకుంటూనే ఉన్నారు. ఇండియాలో అయితే బాధపడాలి కానీ ఇక్కడ ఆ అవసరం లేదుగా? మన తరం వాళ్లు అదృష్టం ఉంటే వాళ్ల పిల్లలతో ఉంటున్నారు బేబీ సిటింగ్ చేస్తూ. వాళ్లకి మన బాధలు తెలుసుననే నా నమ్మకం. ఒకప్పుడు ఇండియా నుంచీ అనేక దేశాలకి వలసపోయారు కదా, వాళ్లకి కూడా నా పరిస్థితి ఎదురయ్యిందా?"

"పాతకాలంలో జాత్యంతర వివాహాల్ని ఒప్పుకునేవాళ్లు కాదు, సౌత్ ఆఫ్రికాలో ఇండియన్లు ఇండియన్లుగానే జీవితాలు గడిపారు. గాంధీ ముందుకాలం నుంచీ దాదాపు ఇరవయ్యో శతాబ్దం చివరిదాకా. అందుకని కుటుంబవ్యవస్థ ఇండియాలోనూ, సౌత్ ఆఫ్రికాలోని ఇండియన్లలోనూ ఒకేలా ఉండేది. యూదులు కూడా ఏ దేశానికి వలసపోయినా అక్కడ వాళ్ల స్వంత పద్ధతుల్నీ, ఆచారాల్నీ పాటించడం మానలేదు. అమెరికానే ఒక ప్రత్యేక దేశం. మన తరం ఇక్కడకు వచ్చిన నాటినుంచీ ఇప్పటిదాకా జాత్యంతర వివాహాలు బాగా పెరిగాయి. పెళ్లి అనేది వాళ్ల స్వంత హక్కని మీ పిల్లలే ప్రకటించారు. అందుకని ఒకప్పుడు వలసపోయిన వాళ్లు కొన్ని తరాల తరువాత ఎదుర్కొన్న సమస్యలన్నీ ఇప్పుడిక్కడ ఒకే తరంలో ఎదురవుతున్నాయ్."

"ఒకవేళ తను ముందు పోతే నేనేం చేస్తానని అడుగుతుండేవారాయన. నేనే ఆ సంభాషణని కొనసాగించేదాన్ని కాదు."

"పోనీ ఆయన ఫోటోని శాంతి అన్నట్టుగా లివింగ్ రూంలో గోడకి తగిలించ వచ్చుగా?"

"ఫోటోని గోడకు తగిలించకపోతే గుండెలో ఉండరేంటి? ఇంట్లో తోబుట్టువు కాని మగవాడు ఉన్నప్పుడు సంబంధీకుడు కాని వేరే మగవాడి ఫోటో ఎవరి ఇంట్లోనైనా చూశారా? ఒకే ఇంట్లో మీరూ, నేనూ ఉండడానికి మానసికంగా రెండేళ్ల నుంచి తయారవుతున్నాను."

"నాకు స్త్రీ విముఖత అని, అందుకనే ఇప్పటిదాకా పెళ్లి చేసుకోకపోవడమే కాక ఏ స్త్రీని నేను ఆ దృష్టితో తాకననీ శాంతికి ఎందుకు చెప్పలేదు?"

"నలభై ఏళ్లపాటు గుప్తంగా దాచిన విషయం ఇప్పుడు నావల్ల బయటపడడం ఇష్టం లేకపోవడం వల్ల! ఒకవేళ అలా బయటపెడితే, నా పిల్లలైనా సరే నా మీద చూపించే సానుభూతిని సహించలేనన్న నమ్మకం వల్ల."

"మగాడి పొందు లేకుండా, నాతో కలిసి జీవించడం వల్ల నీకు లభించేదేమిటి?"

"ఏడవాలనుకున్నప్పుడు తలకాయ ఆనించడానికి ఒక భుజం. తప్పో ఒప్పో చిన్నప్పటి నుంచీ ఒకే భర్తతో జీవితం అని నా మనసులో నాటుకుపోయింది. ఇప్పుడు అలాగే శేషజీవితం గడపడానికి అవకాశం దొరికింది. ఐ యామ్ స్టిల్ ఏన్ ఇండియన్."

(తెలుగు నాడి, ఆగస్టు 2005)

# ఇట్ టేక్స్ ఎ విలేజ్

"తప్పదా?" ఫోన్‌ని చేతులోకి తీసుకుంటూ అడిగాడు రాఘవ. గొంతులోని భయం అతని చేతివేళ్లలోకి పాకి వణికించింది.

"ఫర్ హెవెన్స్ సేక్. ప్లీజ్ కాల్ దెమ్. లెట్ సంబడీ హెల్ప్ అజ్ ఫైండ్ హర్. బిఫోర్ ఇట్ ఈజ్ టూ లేట్. ఇప్పుడు తొమ్మిదయ్యింది!" అన్నది రమ్య. ఆమె గుండెలోంచి ఉబుకుతున్న కన్నీళ్లు ఇంక ఆమె కళ్లవెనుక దాగలేక బయటికి దారిని వెదుక్కోవడం మొదలుపెట్టాయి.

9-1-1 డయల్ చేశాడు. ఆ ఎమర్జెన్సీ నెంబర్లను ఈ విషయమై పలకరించాలని అతనెప్పుడూ అనుకోలేదు. "యస్. మై డాటర్ హాజ్ నాట్ కమ్ హోమ్ ఫ్రమ్ స్కూల్ యెట్."

"... ..."

"హర్ నేమ్ ఈజ్ శారా. దట్స్ షార్ట్ ఫర్ శారద. ఎస్ఎఆర్ఎడిఎ. నార్మల్లీ షీ ఈజ్ హోమ్ బై త్రీ. దట్స్ సిక్స్ అవర్స్ బాక్."

"... ..."

"షి ఈజ్ థర్టీన్... వుయ్ చెక్‌డ్ విత్ ఆల్ హర్ ఫ్రెండ్స్. హర్ సెల్ ఈజ్ టర్న్‌డ్ ఆఫ్...ఓకె. వుయ్ విల్ వెయిట్ ఫర్ ది ఆఫీసర్స్."

"ఇలా అవుతుందని నేనెప్పుడూ అనుకోలేదు!" ఫోన్ పెట్టేసి తలకాయ రెండు చేతులతోనూ పట్టుకుని కలో నిజమో తెలియని పరిస్థితిలో నిలబడ్డాడు రాఘవ.

**ఫోన్ చేసే అయిదునిముషాల ముందర -**

"బుద్ధిలేదూ? పదమూడేళ్ల ఆడపిల్ల మీద చెయ్యి చేసుకోవడానికి నీకు సిగ్గులేదూ? మా నాన్న నా మీద ఒక్కసారి కూడా చెయ్యెత్తలేదు!" రమ్య ఎర్రబడ్డ కళ్లకు మామూలుగా మెత్తనైన ఆమె నోరు అరుదైన, గరుకైన భాషనిచ్చింది.

"చెప్పు. పోలీసులకి ఫోన్‌చేసి, మా ఆయన కొట్టడం వల్లనే నా కూతురు ఇంట్లోంచి పారిపోయిందని! ఛైల్డ్ ఎబ్యూజ్ కింద నన్ను జైల్లో తోస్తారు. అప్పుడు హాయిగా ఇండియా వెళ్లి, మా ఆయన అమెరికా జైల్లో ఉన్నాడని గొప్పలు చెప్పుకుందువుగాని!"

"అది నాకు మళ్లీ కనిపించకపోతే నిన్నుచంపి నేను పోతా జైలుకి. సరేనా?"

"ఇందులో నీ ప్రమేయం ఏదీ లేనట్టు ఎగుర్తావేం? దాన్ని సవతి తల్లిలాగా సాధించింది నువ్వు కాదూ? ఇంట్లోకి అడుగుపెడుతూండగానే అది టీవీ చూస్తోందనీ. వీడియో గేమ్స్ ఆడుతోందనీ, చదవట్లేదనీ, వయొలిన్ వాయించట్లేదనీ కంప్లైంట్స్ ఇచ్చింది ఎవర్ట? నేనా? నీకు దాన్ని కంట్రోల్ చెయ్యడం ఎప్పుడూ చేతకాలేదు. నేను మాత్రం ఛస్తానా! నిన్నే ఓ లెంపకాయ వాయించి ఉంటే ఎప్పుడో సరిపోయేది. ఇవాళీ పరిస్థితొచ్చేది కాదు.

"దాని మంచి కోరేగదా చెప్పింది! నీకేమో ఏదీ పట్టదు. నేను ఇనిషియేటివ్ తీసుకోబట్టే దానికివాళ అంత గొప్ప హైస్కూల్లో సీటు దొరకడానికి కొద్దిగానైనా ఛాన్సుంది."

"ఉన్న హైస్కూల్ ఏదో తక్కువదైనట్లు! అదేమో, నువ్వు పుష్ చేసినకొద్దీ మొరాయించింది నేనా స్కూల్‌కి వెళ్లనంటూ. నీ ఫ్రెండ్స్ దగ్గర నువ్వు గొప్పలు చెప్పుకోవడానికి అది హైస్కూల్ మారాలి!"

"ఆ గొప్పేదో నీకు వచ్చినట్లు గాదా? అయినా నువ్వు కొడతావని నేననుకున్నానా?"

"నేను చెయ్యెత్తకుండానే 'డోంట్ హిట్ మి' అని అది అరిచేసరికి నాకు ఒళ్లు మండిపోయింది. అయినా, మా నాన్న నన్ను కొట్టినట్లుగా కర్రతో కొట్టానా ఏం? చేతితో వేసింది ఒక్క దెబ్బ. అది కూడా నిన్నరాత్రి. పొద్దున్న బానే వెళ్లింది కదా స్కూల్‌కి! ముందే నీకు వార్నింగ్ ఇస్తున్నాను. పోలీసు లొచ్చిన తరువాత నువ్వు అనవసరంగా ముందే 'మా ఆయన దాన్ని కొట్టాడు' అని చెప్పకు!"

**అప్పటికి యాభై నిమిషాలముందు**– శారా స్నేహితురాలు కాట్యా ఇంటి బెల్‌కొట్టి–

"హాయ్ కాట్యా! యు రిమెంబర్ మి. శారాస్ డాడ్? శారా హేజ్ నాట్ కమ్ హోమ్ యెట్. డూ యూ నో ఎనీథింగ్ అబౌట్ హర్?... నో? మీ ఫ్రెండ్స్ ఫోన్ నంబర్లు నాకు కొంచెం ఇస్తావా? అవన్నీ శారా ఫోన్లోనే ఉంటాయి. అది మా కెప్పుడూ ఇవ్వలేదు. అదేమో ఫోన్ ఆన్సర్ చెయ్యడం లేదు."

"ఏమన్నది కాట్యా?" కాట్యా దగ్గర ఫోన్ నంబర్లు తీసుకుని రాఘవ కారు ఇంకా ఎక్కకుండానే రమ్యనించీ ఫోన్.

"తెలియ దన్నది. కొన్ని నంబర్లిచ్చింది. నీ కేమయినా లక్కుందా?"

"ఏం లక్కూ? వెనకంతా చెట్లు. పక్కనే ఉన్నా విసిరి పారేసినట్లుండే కొంపలు. చుట్టు పక్కల తెలుగువాళ్లే కాక ఇండియన్స్ కూడా ఎవరూ లేరు. ఎవరితోనూ

మాట్లాడుకోవడానికి కూడా వీలులేకుండా ఉండే కొంపలోకి తెచ్చిపడేశావ్. ఇప్పటిదాకా ఏ ఫోనూ రాలేదు. ఎవరూ తలుపుకొట్టనూ లేదు!" అవతల ముక్కు చీదడం స్పష్టంగానే వినిపించింది రాఘవకి.

**అప్పటికి గంట ముందు–**

"ఇంకా రాలేదా? ఈపాటికి వచ్చేసుంటుందని అనుకున్నానే! నువ్వు దగ్గర్లో టెన్నిస్ కోర్టుల దగ్గర చూడలేకపోయావా?" ఇంట్లోకి అడుగుపెడుతూ అన్నాడు రాఘవ. అయినా ఇంటికొచ్చిన తరువాత గంటసేపటి దాకా అది ఇంట్లో ఉన్నదో లేదో కూడా చూడలేదంటే ఎవరయినా వింటే నవ్విపోతారు!"

అమెరికన్ స్కూల్ సిస్టమ్‌తోను, బస్సుల స్కెడ్యూళ్లతోను అలవాటయిన వాళ్లిద్దరికీ ఎనిమిదవ తరగతి పిల్లలని తల్లిదండ్రుల లిఖితపూర్వక అనుమతిపత్రం లేనిదే వేరే బస్సుల్లో ఎక్కనివ్వరనీ, ఇంటిదగ్గర తప్పితే వేరెక్కడా దిగనివ్వరనీ తెలుసు. అప్పుడప్పుడూ టీవీలో వచ్చే మిస్సింగ్ పిల్లల కేసులగూర్చి, పోలీసు కుక్కలని ఉపయోగించల్లా నైబర్‌హుడ్స్‌లో– ముఖ్యంగా చెట్లు బాగా ఉన్నచోట్ల – రాత్రిపూట కూడా సెర్చ్ లైట్ల సహాయంతో వెతకడం గూర్చి విన్నవాళ్లే గానీ అలాంటిది శారాకి అవసర మవుతుందని ఊహించడానికి కూడా భయపడ్డారు. బస్‌స్టాప్‌లో దిగి ఇంటికి నడిచి వస్తున్నప్పుడు ఎవరయినా కార్లోకి లాక్కొని పోయారేమో, చెట్ల మధ్యలోకి ఈడ్చుకుని పోయారేమోనని గాని అనుమానించటానికే ఇద్దరూ కంపించిపోయారు.

స్ట్రోక్ వచ్చిన వ్యక్తికి అది రాగానే డాక్టర్ సహాయం చెయ్యగలిగిన కొద్ది నిముషాల్లాగే పిల్లలని వెదకడం మొదలు పెట్టడానికి వాళ్లు కనబడటం లేదని తెలిసిన తరువాత వచ్చే మొదటి ఘడియలు కూడా అపురూపం. అది తెలిసి కూడా ఇండియానుంచీ తెచ్చుకున్న పరువు గూర్చిన ఆదుర్దా, ఇరవయ్యేళ్లుగా ఉంటున్నా గూడా ఇంకా అర్థం కాదనిపించే అమెరికన్ సమాజాన్ని గూర్చిన భయమూ, మామూలుగానే పోలీసులకు దూరంగా ఉండాలనుకునే మనస్తత్వమూ, వాళ్లని తొమ్మిదింటిదాకా 9–1–1కి ఫోన్ చెయ్యనీకుండా ఆపాయి.

* * *

ఇంటి ముందాగుతున్న పోలీసు కారునీ, దానిమీద తిరుగుతూ వెలుగుతున్న నీలం, ఎరుపు లైట్లనీ చూడగానే దుఃఖం తన్నుకు వచ్చింది రమ్యకి. సోఫాలోంచి లేచి నిలబడుతూ పడబోతుంటే రాఘవ ఆమెని పట్టుకుని కూర్చోబెట్టి వెళ్లి తలుపు తీశాడు.

ఒక నల్లజాతి మగ ఆఫీసరూ, ఒక శ్వేతజాతి ఆడ ఆఫీసరూ లోపలికి వచ్చారు. శారా వివరాలు, పొడుగు, బరువు, వయసు, పొద్దున్న స్కూలుకి వెళ్లేటప్పుడు ఎలాంటి బట్టలు వేసుకున్నదీ తెలుసుకున్నారు. స్కూల్‌లో ఎవరితోనైనా ప్రాబ్లంస్ ఉన్నాయా,

నైబర్‌హుడ్‌లో ఎవరైనా వేధిస్తున్నారా అని అడిగారు. ఒక్కర్తే కూతురు అని తెలిసి కూడా అడగాలి గనుక అడుగుతున్నాం అని చెప్పి, ఇంట్లో ఏమైనా సమస్యలున్నాయా అని కూడా అడిగారు. లేవని అడ్డంగా తలూపారు రమ్య, రాఘవలు. శారా ఎంత ఎకంప్లిష్‌డో చెప్పడానికి దానికొచ్చిన ట్రోఫీలు– కూచిపూడి నాట్యంలో, వెస్టర్న్ వయోలిన్లో, టెన్నిస్‌లో, స్పెల్లింగ్ బీలో, ఛెస్‌లో లివింగ్ రూంలోనే కాక శారా బెడ్రూంలో కూడా ఉన్న ట్రోఫీలు చూపించారు.

"డిస్పాచ్ పంపుతాం అన్ని యూనిట్లకీ – బి ఆన్ ద లుకవుట్! అని" చెప్పి వెళ్లారు ఇద్దరు పోలీసు ఆఫీసర్లూ వచ్చిన అరగంట తరువాత.

వాళ్లు వెళ్లిన అయిదు నిమిషాలకి కాలింగ్‌బెల్ మోగింది. రెండంగల్లో వెళ్లి తలుపుతీశాడు రాఘవ. ఆ వచ్చింది శారా అన్న ఆశతో. ఎదురుగా నైబర్ జార్జిని చూసి నీరుగారిపోయాడు.

"ఈజ్ ఎవిరిథింగ్ ఒకె?" అనడిగాడు జార్జ్, శ్వేత జాతీయుడు.

"శారా ఇంకా ఇంటికి రాలేదు. ఎక్కడుందో కూడా తెలియదు!" జవాబిచ్చాడు రాఘవ.

తరువాత రాఘవ ఇంటిముందు మెల్లిగా చేరుతున్న మిగిలిన నైబర్లకి జార్జే సమాచారాన్నందజేశాడు. వాళ్లే చుట్టుపక్కల ఇళ్లల్లోని పిల్లలని శారా గూర్చి అడుగుదామని నిర్ణయించుకుని కదిలారు. కొద్ది నిముషాలయిన తరువాత కొద్దిమంది టార్చ్‌లైట్లతో ఇంటి వెనుక చెట్లమధ్య వెదకడం కిటికీలోంచి చూస్తే అతనికి కనిపించింది. వాళ్లు శారా ఆనవాళ్ల కోసం, దాని దుస్తులు, షూస్ లాంటి వాటికోసం వెతుకుతున్నారని తెలిసి అతను కంపించిపోయాడు.

రాఘవకి, ఇది "వాట్ డిడ్ ఐ డూ రాంగ్?" అని బాధపడాలో లేక "వై ఈజ్ దిస్ హాపెనింగ్ టు మి?"అని ఆక్రోశించాలో అర్థం కాని పరిస్థితి. ఆ మొదటి ప్రశ్న అతనికి వర్తించే పక్షంలో తన్ను తాను క్షమించుకోగలిగే పరిస్థితిలో అతనులేడు. అందుకే, క్రితం రాత్రి శారా మీదకు లేచిన తన చేతిని పదేపదే నుదుటిమీద, తలుపులమీద, గోడలమీద కొట్టుకుంటూ తనని తాను తిట్టుకుంటూ తిరుగుతున్నాడు.

"తను దాన్ని ఎంతో ఎత్తుకు చేర్చుదామని కడుతున్న మెట్లకీ, నందూ వాడి పిల్లలని హైదరాబాద్‌లో నారాయణలో కోచింగ్ కోసం జేర్పించడం కోసం చేసిన ప్రయత్నాలకీ తేడా ఏం ఉంది? ఇవన్నీ కూడా తమకు వీళ్ల వయసు ఉన్నప్పుడు అందుబాటులో లేవని కూడా తెలియనివి కదా!" ఈ ఆలోచన నెలల నుండి అతని మనసులో సుళ్లు తిరుగుతోంది.

"టెక్నికల్‌గా అవును కానీ, నిజంగా మాత్రం కాదు!" అన్నాడు నందూ. "అందుబాటులో ఉండడం అంటే నేడు డబ్బులు కట్టగలగడం. కానీ ఈ కోచింగ్ సెంటర్లలో

తీసుకునే వాళ్లకి చాలామందికి స్వతహాగానే ఎక్కువ ఎనలిటికల్ ఎబిలిటీ ఉంటుంది. వాళ్లు పరీక్షల్లో నెగ్గడానికి పుట్టినలాంటి వాళ్లన్నమాట. చేరడమయితే చేరాడు గానీ, వాళ్లతో వీడు పోటీ పడగల్గుతాడనుకోను!" అన్నాడు కొడుకుని గూర్చి. "నీ కొడుకు మీద నీకే అంత నమ్మకం లేకపోతే ఎందుకుచేర్చావు వాణ్ణక్కడ?" అన్న ప్రశ్నకి, "మానవప్రయత్నం చెయ్యాలి గదా?" నవ్వుతూ ఫోన్లో సమాధాన మిచ్చాడు.

అలాంటి ప్రయత్నం ముఖ్యమని రమ్య కూడా నమ్మింది. తెలిసిన, తెలియని, తెలుగు, నాన్–తెలుగు ఇండియన్ తల్లులతో మాట్లాడి, అప్పటికే ఆ ప్రత్యేకమయిన హైస్కూల్లో వాళ్ల పిల్లలని చేర్చగలిగిన తల్లుల మాటలకి ఎక్కువ విలువ నిచ్చింది. ఆ స్పెషల్ హైస్కూల్లో అడ్మిషన్‌కి ఎంట్రన్స్ పరీక్షపాస్ అవడంతోబాటు, ఎక్స్‌ట్రా కర్రికులర్ ఏక్టివిటీస్‌లో పాల్గొనడం చాలా ముఖ్యమనీ, ఎన్ని సర్టిఫికెట్లుంటే అంత మంచిదనీ వాళ్లు చెప్పారని, ఎనిమిదవ తరగతి పూర్తిచేస్తే గానీ ఆ హైస్కూల్లోకి రానివ్వకపోయినా శారాకి అయిదేళ్లప్పుడే రాఘవతో దానికి ఛెస్ నేర్పించింది. తనేమో స్పెల్లింగ్ బీ పరీక్షలకి ప్రిపేర్ అవడానికి దానిచేత ఇంగ్లీషు పదాలకి స్పెల్లింగులని బట్టీ పట్టించింది. త్వరలోనే దాని ఛెస్ ప్రాభవానికి మురిసిపోయి, ఒక రష్యన్ గ్రాండ్ మాస్టర్‌ని గంటకి వంద డాలర్లు ఇచ్చేలా వారానికి రెండుసార్లు ఇంటికి రప్పించుకొని కోచింగ్ ఇప్పించారు. ప్రతీ శనివారం పొద్దున్న అయిదింటికల్లానో, లేక వెళ్లాల్సిన దూరం మరీ ఎక్కువయితే మూడింటికో లేచి, శారాని ఆ ఛెస్ పోటీలకి రాఘవ తీసుకెళ్లాడు. శారాకి ఏడేళ్లు వచ్చేసరికి టెన్నిస్ క్లాసులలోనూ చేర్పించింది రమ్య. వాటన్నిటీ మధ్యలో తెలుగు అసోసియేషన్ ఫంక్షన్లలో స్టేజీ ఎక్కించడం కోసం ఇండియన్ కల్చరల్ ఫెర్ఫార్మెన్సులకని కూచిపూడి నాట్యం. శారా ఏడవ తరగతి పూర్తిచేసే దాకా ఇవేవీ దాని చదువుకి అడ్డంరాలేదు. ఇంక వేటికి అడ్డంవచ్చినా రాఘవ కానీ రమ్యకానీ పట్టించుకోలేదు.

శారా వయసులో రాఘవ ఏం చేసేవాడని అతని తల్లిని అడిగితే, సందు చివర పిల్లలతో క్రికెట్ ఆడుతూండేవాడని ఆవిడ చెబుతుంది. మరి సంగీతంలో ప్రవేశం? "వాడా? రేడియోలో శాస్త్రీయ సంగీతం మొదలు పెట్టగానే దాన్ని కట్టేసేవాడు." ఛెస్? "వాళ్ల నాన్న 'ఒరేయ్ ఛెస్ ఆడదాం రండర్రా' అని పిలిస్తే ఆ నందూగాడు గానీ వీడుగానీ పట్టించుకుంటేనా?" మరి స్కూల్ అయిన తరువాత ఏం చేసే వాడండీ రాఘవ? "ఏమో నాయనా, చుట్టుపక్కల పిల్లలతో ఆడుకునో, తిరిగో ఏడున్నర ప్రాంతంలో వాళ్ల నాన్న వచ్చే సమయానికి ఇంటికి చేరుకునేవాడు."

రమ్య హైస్కూల్లో ఉన్నప్పుడు ఏం చేసేదండీ అని ఆమె తల్లిని అడిగితే, "ఎప్పుడూ నిద్రపోవడమో లేకపోతే మాగజైన్స్ చదవడమో చేస్తుండేది," అని ఆవిడ జవాబిస్తుంది. ఆటలూ, పాటలూ? "టీవీ చూడడాన్ని ఒక ఆటక్రింద పరిగణిస్తే దానికి గోల్డ్‌మెడల్

ఖచ్చితంగా వచ్చేది.” సంగీతం, నాట్యం? “సంగీతమా నా బొందా! ఒకే ఒక్క ఆడపిల్ల, చేర్పించాలని నాకు ఉండేది గానీ, దానికి ఇంటరెస్టేదీ? అప్పటికీ, ఒకసారి మా పెద్దకోడలు దాన్ని ఒక డాన్స్ టీచర్ దగ్గరకి తీసుకెళ్లింది. ‘టీవీలోనే డాన్సులు బావుంటయ్యమ్మా’ అని చెప్పి మానేసింది.” పిల్లలతో ఆడుకోవడం? “వాళ్ల బాబాయి పిల్లలతోనూ, మేనత్త పిల్లలతోనూ – రెండు సందుల అవతలేగా వాళ్లున్నది! వాళ్లతోనే ఆటాపాటా!”

శారాకి ఇంటి చుట్టుపక్కల పిల్లలు కానీ, ఉండే ఊళ్లోనే కాక ఖండంలో కూడా చుట్టపక్కాల పిల్లలుకానీ లేరు ఆడుకోవడానికి. రాఘవ ఇంటి దరిదాపుల్లో నాలుగెకరాల స్థలంలో పదో పన్నెండో ఇళ్లు. ఇంటికో కుటుంబం. వాటన్నిటిలోనూ కలిపి, అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర్నుంచీ, పన్నెండవ తరగతి కెళ్లే పిల్లలదాకా పట్టుమని పదిహేనుమంది కూడా పిల్లలు లేరు. పిల్లలు ఆడుకోవాలంటే ప్లేడేట్ అని చెప్పి తల్లిదండ్రులు కార్లల్లో ఇంకోళ్లింటికో లేక దగ్గర్లో ఉండే ప్లే గ్రౌండ్‌కో తీసుకెళ్లాలి. ఈ నాలుగెకరాల స్థలంలో తేలిగ్గా నలభైకి పైగా కుటుంబాలుండేవి తమ చుట్టుపక్కల, గుంటూర్లో – అనుకునేవాడు రాఘవ.

అతని చిన్నప్పుడు వాళ్లున్న ఇంటి ఆవరణలోని ఒక ఎకరం స్థలంలో ఆరు కుటుంబాలుండేవి. అద్దెకుండే అయిదు కుటుంబాల్లో రాఘవ వాళ్లదొకటి. వాళ్లల్లో ఒకాయన హోమియో వైద్యం చేసేవాడు. జలుబులూ, దగ్గులూ లాంటి చిన్న చిన్న రోగాలకీ, రొష్టులకీ, లేకపోతే అల్లోపతి స్పెషలిస్టుల దగ్గరకెడితే అయ్యే ఖర్చులకి భయపడే వాళ్లకీ ఆయన ఉచిత వైద్యానికి మించిన మందు ఉండేది కాదు. ఆయన ఇచ్చిన తియ్యని గుళికలంటే రాఘవకీ ఇష్టమే. వెనుక వాటాలో ఉండే తాలుకాఫీసరు క్లర్కు రాత్రి భోజనమయిన తరువాత పాడే కాళహస్తీశ్వర శతకంలోని పద్యాలు ఇప్పటికీ రాఘవకి గుర్తు రాకుండా మానవు. పక్కింట్లో, అన్నయ్య దగ్గర ఉంటూ బియిడి ట్రైనింగ్ తీసుకుంటూ అతనికి హైస్కూల్ లెక్కలు చెప్పిన జనార్దన్ మావయ్య ఉండేవాడు. రాఘవకు స్కూల్లో టీచర్ కాకపోయినా అతని చదువు వివరాలను ఎప్పటి కప్పుడు అతనింటికి చేరవేసిన జోగయ్య పంతులుగారు ఇంకోవాటాలో ఉండేవారు. రెండిళ్లవతల, వాళ్లబ్బాయి స్నేహితు డయినందుకు అతనితో బాటుగా కెమిస్ట్రీ పాఠాలు చెబుతానని అతణ్ణి పిలిచిన లెక్చరర్ సుబ్బారావు గారుండేవారు.

సందు చివర ఉండే ఉమాపతి గారినయితే రాఘవ ఎప్పటికీ మర్చిపోలేడు. రాఘవ సిగరెట్ తాగుతున్నాడని ఇంటికొచ్చి చెప్పివెళ్లాడు గదా మరి! తండ్రి అతణ్ణి గొడ్డుని బాదినట్లు బాదుతుంటే అడ్డం వచ్చిన శాస్త్రిగారిని కూడా అతను మర్చిపోలేదు. అడ్డం పడడానికి అతని తల్లికి ధైర్యంలేదు మరి!

ముగ్గురన్నల ముద్దుచెల్లెలు రమ్య. చిన్నప్పటినించీ గారాబం తప్ప ఇంకేం రాగమూ తెలియకుండా పెరిగింది. పెద్దవదిన ఇంటికి వచ్చేటప్పటికి ఏడేళ్ల రమ్య ఆమెకు ముద్దుల ఆడబడుచే కాక చిట్టి చెల్లెలు. చిన్నకూతురు కూడా అయ్యింది.

చిన్నప్పుడు చుట్టుపక్కల వాళ్లతో గానీ చుట్టాలతో గానీ తమకున్నటువంటి ఇంటరాక్షన్ శారాకి లేకపోవడం ఒకలోటు అని రాఘవగానీ, రమ్య గానీ అనుకోలేదు. శారా పాకడం మొదలుపెట్టినప్పుడు వచ్చిన అతని తల్లిదండ్రులు ఒక ఏడాది తరువాత తిరిగి ఇండియా వెళ్లేటప్పుడు, "మేం ఉన్నాం గనుక నీకు తెలియలేదు. ఇంక మీరిద్దరూ మాత్రమే ఎలా దాన్ని పెంచుతారో!" అని బాధపడ్డప్పుడు వాళ్లిద్దరూ దాన్ని తేలిగ్గా కొట్టిపారేశారు. వాళ్లు చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు అమ్మ ఆలనకి బామ్మల, అమ్మమ్మల లాలన తోడయిందని తెలియక కాదు. అవి ఈనాడు అవసరం లేదన్న నమ్మకం చేత.

పదమూడేళ్ల కూతుర్ని ఎలా పెంచాలో రాఘవకే కాక రమ్యకూ తెలియదు. అలాగని పుట్టిన రెండు వారాలకీ, రెణ్ణెల్ల తరువాత, రెండేళ్ల వయసు వచ్చిన తరువాత, ఎలా పెంచాలో వాళ్లకి తెలుసునని కాదు. అదేమిటో గానీ "డాక్టర్లకీ, ఇంజనీర్లకీ, లాయర్లకీ డిగ్రీలుండాలి, టీచర్లకీ, పోలీసులకీ, సైనికులకీ ట్రైనింగ్ కావాలి, కార్లనీ, విమానాలనీ నడపడానికి లైసెన్స్ తప్పనిసరి!" అనే మనుషులే, వాళ్ల జీవితాల్లో అతి ముఖ్యమయిన తల్లిదండ్రుల పాత్రలకే ఎలాంటి ట్రైనింగూ అవసరం లేదని నమ్ముతారు. ఎవరయినా ఏమైనా చెప్పబోతే "నీకెందుకని" తిప్పి కొడతారు కూడా. ఆ పాత్రలను సక్రమంగా పోషించగలమన్న ధీమా అమెరికాలోనే కాక ఢిల్లీలోనూ, ముంబాయిలోనూ, హైదరాబాదు లోనూ కూడా తల్లీ, తండ్రీ, పిల్లలు మాత్రమే ఉంటున్న న్యూక్లియర్ కుటుంబాలలో ఉన్నట్టే రాఘవకీ, రమ్యకీ కూడా ఉంది. పిల్లో, పిల్లాడో కడుపున పడ్డప్పటి నుంచీ ఏం చెయ్యాలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజెయ్యడానికి ఎన్ని పుస్తకాలు, టీవీ షోలూ లేవు? అనారోగ్యాలని ట్రీట్ చెయ్యడానికి డాక్టర్లు అయిదు నిముషాల దూరంలోనే ఉండనే ఉన్నారు!

"మిగిలిన పిల్లలతో ఇంటరాక్షన్ విషయానికొస్తే మీ కంటే మాకేం ఎక్కువ ఏమీలేదు. మా ఎపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో వీళ్ల వయసు వాళ్లు తక్కువ. అయినా పక్క ఎపార్ట్‌మెంట్లలో ఎవరుంటున్నారో కూడా తెలియదు. గేటుదాటి వెళ్లకూడదని వీళ్లకి మీ వదిన ఆంక్షలు పెడుతుంది. మా బావమరిదీ, తోడల్లుడూ ఊళ్లో ఉన్నారన్నపేరే గానీ, వాళ్లని మాత్రం ఏదో ఫంక్షన్లో తప్పితే ఎప్పుడు కలుస్తున్నాం గనుక?" అన్నాడు హైదరాబాదు బంజరాహిల్స్‌లో కోటి రూపాయల ఎపార్ట్‌మెంట్లో ఉండే నందూ.

చదువుల విషయంలో శారాకి ఏమీ తక్కువ చెయ్యట్లేదు. అమెరికాలో కూడా ఎంతో మంది పబ్లిక్ స్కూళ్లు ఉన్నచోట ఉంటున్నాకూడా శారాని ప్రైవేట్ స్కూల్లో చేర్చి

చదివిస్తున్నారు– కాలేజి చదువులకి కట్టేటంత ట్యూషన్ ఫీజు కడుతూ! దాని స్నేహితులతో పోలిస్తే శారాకి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌ని సమకూర్చడంలో ఏమీ లోటుచెయ్యలేదు. ప్లేస్టేషన్, ఐపాడ్, ఐఫోన్ – ఎన్ని సమకూర్చారు! అడిగినదల్లా కొనిస్తున్నప్పుడు వాళ్ల మాట విని అంత ప్రెస్టీజి ఉన్న హైస్కూల్లో చేరడానికి, ఎంట్రన్స్ రాయడానికి అంత ఎందుకు మొరాయిస్తోందో అర్థం కాని విషయం.

మొదట, "నా కిష్టంలేదు. అంతే" అన్నది. తరువాత, "మామూలు హైస్కూళ్లల్లో చదువుతున్న వాళ్లుకూడా ఎమ్మైటీలకి, హార్వర్డులకీ వెళ్లటంలేదా?" అనడిగింది. చివరికి, ఎంట్రెన్సు టెస్టుకి కోచింగ్ తీసుకోవడానికి టైం లేదంది. టెన్నిస్ మానిపించమని అన్నాడు రాఘవ. వీల్లేదన్నది రమ్య. పైగా, ఛెస్ మానిపించమని కూడా అన్నది. "నీకేమైనా మతిపోయిందా, ఇంకో రెండేళ్లల్లో అది గ్రాండ్‌మాస్టర్ లెవెల్‌కి చేరుతుంది. ఇప్పుడెలా ఆపేస్తావ్?" అన్నాడు రాఘవ. ఇద్దరూ కలిసి కూడు పెడతాయా పాడా అని కూచిపూడి డాన్స్, వయొలిన్ మానెయ్యమన్నారు. ఏదయినా మానేస్తాగానీ ఆ రెండూ మాత్రం మానేది లేదంది శారా. అందరూ తలలు బాదుకుని స్టేటస్ కో కంటిన్యూ చేశారు. ఇది చిలికి చిలికి ముందురోజు గాలివానయ్యింది. రెణ్ణెలల్లో జరగబోయే ఆ హైస్కూలు ఎంట్రన్స్ పరీక్షకి ఫీజు కట్టే విషయం మీద డిస్కషన్ వచ్చినప్పుడు శారా అసలా పరీక్షనే తను రాయననడం వల్ల, ఈ రోజు పిడుగుపడ్డది.

"ఇదంతా కల అయితే బావుణ్ణు!" అని ఆశిస్తూనే, "ప్లీజ్ గాడ్ డోంట్ లెట్ ఎనీథింగ్ హాపెన్ టు హర్!" అని అందరూ దేవుళ్లనూ ప్రార్థిస్తున్నారు శారా తల్లిదండ్రులు.

* * *

పోలీస్ ఆఫీసర్ జాన్సన్ వియన్నా మెట్రో స్టేషన్ ఫ్లాట్‌ఫాం బెంచిమీద హెడ్‌ఫోన్స్‌ని తగిలించుకుని కూర్చొని ఉన్న ఆ పిల్లని అంతకుముందు రౌండులో మొదటిసారి చూశాడు. ఇప్పుడు రెండోసారి. వాషింగ్టన్, డి.సి., మెట్రో ఆరంజ్ లైన్ ట్రెయిన్లకి అది టర్మినస్. అయిదు నిముషాల క్రితం వచ్చిన ట్రెయిన్ వెళ్లిపోయింది మళ్లీ వాషింగ్టన్ వైపు. ఫ్లాట్ ఫాంమీద ఏవీ అమ్మే మనుషులుండరు. కొట్లుండవు. బిచ్చగాళ్లు అసలుండరు గనుక ట్రెయిన్ వెళ్లగానే అక్కడ మామూలుగానే నిశ్శబ్దంగా ఉన్నది. ట్రెయిన్ వెళ్లిన తరువాత నిర్జీవంతో కలిసి కాపురం చెయ్యడానికి దొరికే కొద్ది నిముషాల నిశ్శబ్దానికి ఆ పిల్ల అడ్డం పడుతోంది. బాగా పొద్దుపోయినా చీకటి ఆ పిల్లని పూర్తిగా కమ్మేయకుండా స్టేషన్లోని లైట్లు గొడుగు పడుతున్నాయి. జాన్సన్ అడుగులకి నిశ్శబ్దం నిట్టూర్చి పారిపోయింది.

వెళ్లిపక్కన కూర్చుంటూ, "హాయ్ యంగ్‌లేడీ" అన్నాడు ఆఫీసర్ జాన్సన్.

"హాయ్," అన్నదా పిల్ల తలెత్తకుండానే. తనపక్కకొచ్చి కూర్చుంటున్న యూనిఫాంని గమనించి.

"వెయిటింగ్ ఫర్ సమ్‌వన్?" "యస్."

"డిడ్ యు లెట్ దెమ్ నో యు ఆర్ హియర్?" "యస్!"

స్టేషన్లో ఇంకో రౌండ్ వేసివచ్చి ఇంకో ట్రెయిన్ కూడా వెళ్లిన తరువాత మళ్లీ వచ్చి పక్కన కూర్చుంటూ, "వేర్ డు యు లివ్?" అనడిగాడు.

"వియన్నా."

"ప్రెట్టీ క్లోజ్. వాట్ స్కూల్ డూ యు గోటూ?" చెప్పింది.

"ఓ.. వాకింగ్ డిస్టెన్స్.. ఆర్ యువర్ పారెంట్స్ హెూమ్?" జవాబు రాకపోయేసరికి. "ఆర్ దే డైవోర్స్‌డ్?" అనడిగాడు. తలని అడ్డంగా ఆడించింది. "డు యు లివ్ విత్ దెమ్?" అవునన్నట్లు తల నూపింది.

"ఇంతసేపు పట్టకూడదే వాళ్లు రావడానికి!" స్వగతంలా పెద్దగానే అన్నాడు. "కొద్దిగా చలేస్తోంది కదా!... ఇక్కడ పక్కనే స్టార్‌బుక్స్ ఉన్నది తెలుసా?" తల నూపింది. "లెట్ మి గెట్ యు ఎ హాట్ చాకొలెట్. ఇట్స్ మై ట్రీట్." వదిలేటట్లు లేదని గ్రహించి, మాట్లాడకుండా అతనితో బయటికి నడిచింది. స్టేషన్లోంచి బయట పడడానికి టర్న్ స్టైల్‌లో శారా టిక్కెట్టుని పెట్టినప్పుడు ట్రబుల్ వస్తే అతను దాన్ని సాల్వ్ చేశాడు.

పెట్రోల్ కార్లో ఎక్కేముందర "నీపేరేంటీ?" అనడిగాడు. "శారా" "ఒకే! నా సూపర్ వైజర్‌తో చెప్పనీ నీతో హాట్ చాక్‌లెట్ తాగడానికి వెడుతున్నానని. చెప్పకపోతే నా గురించి వర్రీ అవుతాడు!" అని వైర్లెస్‌ని ఆన్‌చేసి "దిసీజ్ ఆఫీసర్ జాన్సన్. ఐ యాం టేకింగ్ శారా టు స్టార్‌బుక్స్. షి ఈజ్ ఎ ప్రెట్టీ యంగ్ గర్ల్. సే, థర్టీన్ ఫోర్టిన్ ఇయర్స్ ఓల్డ్" అన్నాడు. "థర్టీన్" చెప్పింది శారా.

"రైట్ థర్టీన్. లాస్ట్‌నేమ్?" చెప్పింది. ఫోన్లో అవతలవాళ్లకి శారా ఇంటిపేరు చెప్పాడు.

స్టార్‌బుక్స్ దగ్గర దిగేముందర, "వెయిట్! నీకు ఆకలేస్తోందేమో. ఏమైనా తింటావా?" అన్నాడు జాన్సన్. స్కూల్లో లంచ్ అవర్ అయినప్పటినుంచీ ఏమీ తినక పోయినందువల్ల బాగా ఆకలేస్తున్నా తలని అడ్డంగా ఊపింది. వెలుతురులో స్టేషన్‌కి నడిచి వచ్చినప్పుడు అజాపజాలేని భయం చీకటిని తోడు తెచ్చుకుని ఆకలేస్తున్నాగానీ, జేబులో డబ్బులున్నాగానీ బయటికి అడుగు పెట్టనీకుండా శారాని ఆపింది.

హాట్ చాకొలెట్ తాగుతున్నప్పుడు అడిగాడు జాన్సన్. "డిడ్ యు టేక్ ది ట్రైన్?"

"సేమ్ ట్రెయిన్. రౌండ్ ట్రిప్." "నువ్వు ఎక్కడా దిగలేదా?" "నో" "లక్కీ యు" అనుకున్నాడు. సేఫెస్ట్ ప్లేస్. ఆ ట్రెయిన్ ఈ చివరినుంచీ ఆ చివరికెళ్లి రావడానికి మూడు గంటలకి పైగా పడుతుంది. స్కూలు మూడుగంటలకల్లా వదుల్తారు కాబట్టి రెండు ట్రిప్పులు వేసి విసుగుపుట్టి ఎక్కినచోటే దిగేసి ఉండాలి. "ఇంటినించీ పారిపోదాం అనుకునే పిల్లలు అలాగే ఒక ట్రెయిన్లో కూర్చోవడం, దిగిన తరువాత ఎక్కిన స్టేషన్లోనే ఫ్లాట్‌ఫాం మీద కూర్చోవడం ఆ పిల్ల తల్లిదండ్రుల అదృష్టం!" అనుకున్నాడు ఆఫీసర్ జాన్సన్.

"ఈజ్ ఎవిరిథింగ్ ఓకె?" లేదన్నట్టు తల అడ్డంగా ఆడించింది.

"యువర్ పారెంట్స్ మస్ట్ బి ఫ్రం ఇండియా!" అవునన్నట్లు తల ఊపింది.

"డు యువర్ పారెంట్స్ నో వేర్ యు ఆర్?" ఆ పిల్ల కళ్లల్లో నీళ్లు తిరగడం అతని కంటపడకపోలేదు.

"అక్కలు, చెల్లెళ్లు, అన్నదమ్ములు?" "నన్."

"వాటీజ్ రాంగ్?"

కాసేపు నిశ్శబ్దంగా ఉండి, "దే డోంట్ లిజెన్ టు మి!" అని జవాబిచ్చింది.

"ఐ కెన్ మీడియేట్," అన్నాడు జాన్సన్. "కాల్ మి 'అంకుల్' ఇఫ్ యు వాంట్ టు."

శారా నవ్వింది. తండ్రి వయసుకి కొంచెం అటు ఇటు ఉన్న మగాళ్లని అంకుల్స్ అని దేశీయులు పిలిచే ఈ సంప్రదాయం గూర్చి ఇతని కెలా తెలిసిందా అని కూడా ఆశ్చర్యపోయింది. అమెరికన్లకి ఈ అలవాటు లేదని తనకి తెలుసు.

"యువర్ స్మైల్ ఈజ్ వెరీ ప్రెట్టీ. అక్కడ ట్రెయిన్ స్టేషన్లో పటేల్ అని ఒకక్లర్కు ఉన్నాడు. అతని వల్ల మీ అలవాట్లు కొద్దిగా తెలిశాయి. యు నో వాట్, ఐ నీడ్ టు థాంక్ యువర్ పారెంట్స్ ఫర్ యువర్ స్మైల్! లెట్ మి టేక్ యు హోమ్."

చాకొలెట్ సిప్ చేస్తూ అన్నది– "దే విల్ బి మాడ్ ఎట్ మి!" అందులో "రాను," అన్న ధ్వనిలేకుండా.

"నాకిద్దరు పిల్లలు. ఇద్దరూ నీ కంటే పెద్దవాళ్లే. ఐకెన్ టెల్ యు దట్ బిహైండ్ దట్ క్లౌడ్ ఆఫ్ మాడ్నెస్ దేర్ ఈజ్ ఎ సన్ కాల్డ్ లవ్. ది క్లౌడ్ ఈజ్ టెంపరరీ. ఇట్ విల్ క్లియర్. నీ విషయంలో అది ఈపాటికి క్లియర్ అయిపోయింది. ఐ విల్ ప్రూవ్ ఇట్ టు యు టు నైట్ – ఇన్ టెన్ మినిట్స్. ఫస్ట్ ఐ షుడ్ కాల్ దెమ్. ముందుగా మీ నాన్న ఫోన్ నంబర్ ఇవ్వు. శారా ఒక అంకుల్ని తీసుకువస్తోందని చెబుతాను."

* * *

"ఇట్ టేక్స్ ఎ విలేజ్" – ఒక పిల్లని గానీ పిల్లాణ్ణి గానీ పెంచడానికి– అని హిల్లరీ క్లింటన్ తన పుస్తకానికి శీర్షికని పెడితే నవ్విన వాళ్లల్లో రాఘవ, రమ్యలు లేకపోయుండొచ్చు. కానీ, శారా విలేజ్లో తాతలూ, అమ్మమ్మలూ, బామ్మలూ, అత్తలూ, మామలూ, పిన్నులూ, బాబాయిలూ, కజిన్సూ రెండు మూడు సంవత్సరాల కొకసారి రెండు మూడువారాల చొప్పున ఇండియా వచ్చినప్పుడు తప్పితే లేకపోయుండొచ్చు గానీ, రష్యన్ గ్రాండ్ మాస్టర్, టెన్నిస్ కోచ్, వయొలిన్, కూచిపూడి టీచర్లతో బాటు ఆఫీసర్ జాన్సన్ కూడా ఉండడం ఆ పిల్ల అదృష్టం.

(నవ్య వీక్లి, సెప్టెంబర్ 25, 2013)

# డెడ్ మేన్ పేరడాక్స్

పత్రికలలో వచ్చిన వార్తలు ఏమయినాగానీ, సత్యాది ఆత్మహత్య కాదు అని నేనను కోవడానికి బలవత్తరమైన కారణాలున్నాయి. అందులో మొదటిది, నా యాభయ్యేళ్ల సాన్నిహిత్యంలో వాడిదగ్గర పిరికితనం నాకు కనిపించకపోవడం. పులి మీదకు దూకితే వాడేం చేసేవాడో తెలియదుగానీ, వెన్ను మాత్రం చూపించడని నేను కరాఖండీగా చెప్ప గలగడానికి ఒక కారణం నేను పక్కనున్నప్పుడు జరిగిన ఒక సంఘటన. న్యూయార్క్ సబ్‌వేలో ఒక నల్లవాడు తుపాకీని వాడి నడుము కానించి వాలెట్‌ని ఇమ్మన్నప్పుడు, ప్రశాంతంగా దాన్నివ్వడమే కాక, "డబ్బులు తీసుకుని, వాలెట్ నాకు తిరిగిచ్చెయ్, అందులో డ్రైవర్స్ లైసెన్స్ కావాలి. అది లేకపోతే ఆ మోటార్ వెహికల్స్ డిపార్ట్‌మెంటుకి వెళ్లడం కోసం అనవసరంగా ఒక వర్క్ రోజు వేస్ట్‌చెయ్యాలి!" అని ఎంతమంది అనగలరు? వాడి పక్కనే ఉన్న నేను నోట మాట రాక నిలబడ్డాను మరి! తరువాత సబ్‌వే వైపు వెళ్లడానికీ, ఏ వయసువాడయినా సరే, నల్లవాడి నీడని చూడడానికీ నేను భయపడ్డాను గానీ, వాడు న్యూయార్క్‌లో ఉన్నన్నాళ్లూ సబ్‌వేలోనే ప్రయాణం చెయ్యడమే గాక రోడ్డుమీద నల్లవాళ్ల మధ్య నిలబడ్డా పట్టించుకునేవాడు గాదు.

లేకపోతే, ఇరవై నాలుగు గంటలూ లాబ్‌లోనే గడుపుతున్నాడంటూ వాణ్ణి వదిలి వెళ్లిన రంజని సామంత్ దగ్గర చేరిందని తెలిసినప్పుడు ఆత్మహత్య చేసుకునుండాలి. "రోబో" సినిమాలో తన కెక్కువ సమయాన్ని కేటాయించకపోయినా ఐశ్వర్య రజనీకాంత్‌ని వదల్లేదు గానీ, నిజజీవితంలో మాత్రం, ఐశ్వర్యని అనుకరించాలని రంజని ఏమాత్రం అనుకోలేదు. అయినా గానీ కోపంమాట దేముడెరుగు ఆఖరికి నిరాశకూడా వాడి ఛాయలకి రాలేదు. పైగా లాబ్‌లోకొచ్చి ఆ విషయాన్ని మొహం మీద ఉన్న మాస్క్‌ని తొలగించి మొహంలో మొహం పెట్టల్లా "నేను నిన్ను వదిలివెడుతున్నాను" అని రంజని చెబితే, ఎమోషనేదీ లేకుండా "అలాగా!" అన్నాడని వాడిమీదకి చేతి కందిన ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌ని

ఆమె విసిరెయ్యగా అది పగిలితే, "చచ్చాం, ఇప్పుడు దీన్ని మళ్లీ తెప్పించుకోవడానికి వారం రోజులు పడుతుంది," అని తలపట్టు క్కూచున్నాట్ట! వాడే చెప్పాడు ఆ సంగతి!

నిజంగా నిరాశ వాడినీడకు చేరగలిగి ఉంటే అది వాడు కనిపెట్టిన గాడ్జెట్‌మీద అన్ని హక్కులూ తనవేనంటూ పార్ట్‌నర్‌షిప్‌లో వాడి వాటా జీరో అని సామంత్ చెప్పినప్పుడు జరిగుండాలి. ప్రపంచంలో ఏ మారుమూల చూసినా మనుషుల చేతుల్లో వాడి రీసెర్చ్ ఫలం కనిపిస్తున్నప్పుడు, దానివల్ల వచ్చే లాభాలమాట అటుంచి, అసలు దాన్ని కనుగొన్న వాడిగా వాడికి గుర్తింపే లేకపోతే ఆ పరిస్థితిలో ఉన్నవాళ్లల్లో ఎంతమంది ఆత్మహత్యా ప్రయత్నం చెయ్యకుండా ఉంటారు? వాడికి అసలు అలాంటి ఆలోచనే లేనట్లు ఇంకేదో కనిపెట్టా లంటూ ముందుకి సాగిపోయాడు.

ఇంతకీ ఇరవై నాలుగు గంటలూ సత్యా తనతో గడపడాన్ని గర్వపడిన ఆ లాబ్ – వాడు ఉండే ఇంటి కార్ గరాజే! మొదట్లో ఇన్వెస్టర్‌గా ప్రోగ్రెస్ చూడడానికి వస్తున్నానంటూ ఆ లాబ్‌కి వారానికి ఒకసారి వచ్చిన సామంత్ తరువాత రోజుకోసారి రావడం మొదలుపెట్టి, లాబ్‌లోకి అడుగుపెట్టకుండానే ఆ యింట్లో రాత్రంతా గడుపుతున్నాడన్న విషయం గూర్చి ఆలోచించే వ్యవధే ఉంటే సత్యా చేసిన పరిశోధన అంత విజయవంతమయి ఉండేదికాదు. దానివల్ల సామంత్ కొన్ని మిలియన్లకి (డాలర్లలో) అధిపతి అయ్యేవాడూ కాదు. కొన్ని పెన్నీలు మాత్రమే సత్యాకి ఇచ్చాడు. తన కళ్లకి కనబడకుండా వెళ్లిపోవడానికి ఇచ్చిన లంచం అది. ఆ సామంత్ చేతినుండీ రాలినవి అతని ఆస్తితో పోలిస్తే పెన్నీలేగానీ, అవి మాత్రం సత్యా ఇండియా చేరి అక్కడ లాబ్ పెట్టడానికి తోడ్పడ్డాయి. ఆ పెన్నీలు దొరకడం సత్యా దురదృష్టమో లేక నా అదృష్టమో మీరే చెబుతారు. కానీ చెప్పొచ్చిన దేమిటంటే, ఇలాంటి పరిణామాలని అర్భకులెలా ఎదుర్కొంటారో మనం రోజు వార్తల్లో చూస్తూంటాం. కానీ, సత్యా అర్భకుడుకాడు మరి! కనీసం అటు దేవుణ్ణి దూషించడంగానీ, ఇటు బాబాల వెంట తిరగడం గానీ చెయ్యలేదు. ఇంకా ఉదాహరణలు చెప్పి మీ సమయాన్ని వృధాపరచడం గానీ ఆసక్తిని చంపడంగానీ చెయ్యను.

సత్యా ఇండియాకి వెళ్లిపోతున్నాడంటే నేనంతగా ఆశ్చర్యపోలేదు. ఒకప్పుడు రీసెర్చ్ లాబ్స్‌లో పనిచేసిన అనుభవం ఉన్నందువల్ల, ప్రతీ మూణ్ణెల్లకోసారీ లేకపోతే ఆర్నెల్లకోసారీ ప్రోగ్రెస్ చూపించలేని ప్రాజెక్టుల ఎత్తివేతని భరించగలిగే స్థితిలో వాడు లేడు. అప్పటికే ఒకసారి అరుపులూ, కేకలతో పోలీసులచేత కంపెనీనుంచి బయటికి వెళ్లగొట్టించుకున్న ఖ్యాతి వాడి దయినప్పుడు వాణ్ణి ఆహ్వానించడానికి ఏ కంపెనీ ముందు కొస్తుంది? అలాంటి స్థితిలోనేగా వాడిమీద దాదాపు అయిదేళ్లు సామంత్ ఇన్వెస్ట్‌చేశాడు!

వాడి అదృష్టమల్లా పిత్రార్జితమైన ఇల్లొకటి ఇంకా వాడి స్వంత ఊళ్లో ఉండడం, రియల్ ఎస్టేట్ బూమ్ వల్ల అమెరికాలో వాడి ఇంటిని కొన్నధరకి రెండురెట్లకి అమ్మెయ్య

గల్గడం. ఏదో సామెత చెప్పినట్లు, వాడు ఏమీచెయ్యకుండా ఇండియాలో ఎలా కూర్చోగలడన్న నా ప్రశ్నకు రెణ్ణెల్లలోనే జవాబు దొరికింది వాణ్ణించీ వచ్చిన ఫోన్‌కాల్ వల్ల. ఏదో ఎక్విప్‌మెంట్ ఇండియాలో దొరకట్లేదు, ఫలానా ఆన్‌లైన్ కేటలాగ్‌నుంచీ కొని తెచ్చిపెట్టు అనేది దాని సారాంశం. సంవత్సరానికి అయిదారుసార్లు బిజినెస్ పనులవల్ల ఇండియా వెళ్లిరావడం నా కలవాటే.

మామూలుగా అయితే, ఇండియా చేరిన తరువాత హైదరాబాద్ తప్ప ఇంకో చోటికి వెళ్లాల్సిన అవసరం నా కుండదు. అలాంటిది, పుట్టి పెరిగిన ఊళ్లోని వీధుల్లో తిరగడానికి మళ్లీ వీడివల్ల అవకాశం దొరికింది గనుక, సంవత్సరానికి ఒకసారయినా, "అబ్బ, చంపుతున్నావ్‌రా!" అంటూనే వెళ్లి, వాణ్ణి కలిసి, వాడు తెమ్మన్నవాటిని స్వయంగా అందజేస్తుంటాను. వాడికి కావలసిన వస్తువులు అమెరికాలో అయితే ఇట్టే దొరికేవి. మహా అయితే ఒక వారంరోజులు ఆగవలసివచ్చేది. అలాంటిది, నేను తెచ్చి వాడికి ఇవ్వడం అంటే నెలలపాటు నిరీక్షణ. దీనివల్ల నీ పరిశోధన కుంటుపడట్లేదా అని అడిగాను. ఆశ్చర్యకరంగా, లేదన్నాడు. "కావలసింది తొందరగా దొరికినప్పుడు, దాన్ని తెచ్చి అమర్చిన తరువాత గానీ అది పనిచేస్తుందో లేదో తెలుసుకునేవాణ్ణి గాదు. ఉదాహరణకి ఎడిసన్ లైట్ బల్బులో టంగ్‌స్టన్ ఫిలమెంట్ వేస్తే మాత్రమే అది పనిచేస్తుందని తెలుసుకునే ముందర దాదాపు వంద వేరే ఫిలమెంట్లని వాడాడు. ఈ కాలంలో అలాంటి పరిశోధనలు చెయ్యాలంటే చాలా ఖర్చవుతుంది. ఇప్పుడు మనకి లభ్యమయ్యే ఇన్‌ఫర్మేషన్ చాలా ఎక్కువ కాబట్టి, నేను సిములేషన్స్‌చేసి, ఆ పార్ట్ కొనేముందరే అది పనిచేసే అవకాశం హెచ్చుగా ఉందని రూఢి చేసుకున్న తరువాతే ఆర్డరిస్తున్నాను. ఆ విధంగా ఈ నిరీక్షణ నాకు మేలేచేస్తోంది," అన్నాడు వాడు.

వాణ్ణి కలవడానికి వెళ్లినపుడు ఆ ఇంటి చుట్టుపక్కలవాళ్లు నన్ను ఆసక్తిగా చూడడాన్ని నేను గమనించక పోలేదు. "మీరాయనకి చుట్టమా సార్?" అనడిగారు కూడా. కాదు, స్నేహితుణ్ణని చెప్పా. "ఆయన కెవరూ లేరా సార్, చూడ్డానికి ఎవరూ రారు?" అని కూడా అడిగారు. ఎందుకయినా మంచిదని ఆ అడిగినవాళ్ల ఫోన్ నంబర్ తీసుకున్నా. ఇండియా కెళ్లినా గానీ, వాణ్ణి కలవడానికి కుదరని నాలుగయిదుసార్లూ వాళ్లకి ఫోన్‌చేసి వాడింకా బ్రతికే ఉన్నాడని నిర్ధారణ చేసుకునేవాణ్ణి. వాడికి ఫోనుందని నాకు తెలుసు. కానీ నేను ఫోన్ చేసినప్పు డెప్పుడూ దాన్ని వాడు ఆన్సర్ చేసిన పాపానపోలేదు.

ఇండియా కెళ్లిన అయిదారేళ్ల కనుకుంటా, ఫోన్‌చేసి, విస్కీ పట్రమ్మన్నాడు. అంతే! ఏ ఎలక్ట్రానిక్ పరికరమూ తెమ్మనమని చెప్పలేదు. షాకయ్యా. క్వాలిటీ సరుకు పట్టుకుని రెణ్ణెల్లల్లో వాడి ముందున్నాను.

"దేనికి ఈ సెలబ్రేషన్?" కుతూహలాన్ని ఎంతసేపని కప్పెట్టగలను?

“గతాన్ని – ముఖ్యంగా బాల్యాన్ని ఎంజాయ్ చెయ్యగలుగుతున్నందుకు!” అన్నాడు.

తరువాత వాణ్ణే మడిగానో గుర్తులేదు గానీ, వాడి లాబ్ టూరిచ్చాడు. లాబ్ అంటే, వాడి పాత ఇంట్లో నాలుగయిదు గదులు. రకరకాల బాక్సులూ, వైర్లూ, లైట్లతో నిండిపోయి వున్నాయి. కంట్రోల్ పానెల్ రకరకాల డిస్‌ప్లేలతో విమానంలో ఫ్లైట్‌డెక్‌ని గుర్తుకు తెచ్చింది. కరెంటు సప్లై ఎప్పుడూ అంతంత మాత్రమే గనుక జనరేటర్ పెట్టుకున్నాడు. అక్కడున్న పెద్ద బాక్సులన్నీ – రేకులతో చేసినట్లుగా ఉన్నవి– అన్నీ ఇండియా సరుకే. కొన్నింటిని స్పెషల్‌గా ఆర్డరిచ్చి చేయించుకున్నా నన్నాడు. “చాకులాంటి కుర్రాళ్లున్నారు మెషీన్‌షాపుల్లో” అన్నాడు.

“ఏం చేస్తుందీ మెషీన్?” అడిగాను.

“టైంతో ఆడుకుంటుంది,” అంటూ ఒక బటన్‌ని నొక్కాడు. ఒక రాక్షసుడు నోరు తెరిచి నాలుకని బయటికి పెట్టినట్లు నాకు అనిపించడానికి కారణం, ఇంట్లో తయారు చేసినందువల్ల కొద్దిగా క్రూడ్‌గా ఉన్నట్లనిపించడం అయ్యుంటుంది. లేకపోతే, సినిమాల్లో అప్పుడప్పుడూ కనిపించే ఎమ్ఆర్ఐ మెషీన్ బెడ్ లాగే ఉంది ఆ నాలిక.

“ఎలా?”

“కాలాన్ని వెనక్కి నెట్టి!” అర్థంకాని నా మొహాన్ని చూసి “టైం ట్రావెల్‌ని సాధ్యపరిచే మెషీన్లగూర్చి వినలేదా? ఎన్నేళ్లబట్టీ అమెరికాలో ఉన్నావ్?” అంటూ చిరాకుపడ్డాడు.

అప్పుడు నాకర్థమయింది. గతంలోకి వెళ్లి ఆ అనుభవాలని పొందగలిగేలా చెయ్యగలిగే టైం మెషీన్లగూర్చి సైన్స్ ఫిక్షన్ కథల్లో చదివాను. డైనోసార్లని వేటాడ్డం గూర్చి, రోమన్ల, గ్రీకుల గత వైభవాలని ప్రత్యక్షంగా సందర్శించడం గూర్చీ, మొహంజోదారో నాగరికతని స్వయంగా కళ్లతో చూడగలగడం గూర్చీ రాసిన కథలు చదవడం నాకు గుర్తుంది. అలాంటి అనుభవాలని ఈ మెషీన్ సాధ్యపరుస్తుందా!

“డైనోసార్ల దగ్గరకి తీసుకెడుతుందా?”

“తెలీదు,” అన్నాడు అనాసక్తతతో, ఆశ్చర్యపోవడం నావంతయింది.

“తెలియనప్పుడు దీన్ని టైం మెషీన్ అని ఎలా అనగలవ్?”

“ఒక రోజుని వెనక్కెళ్లేలా చెయ్యగలిగినా అది టైం మెషీనే అవుతుంది.”

“నిన్నటి అనుభవాలూ, జ్ఞాపకాలూ షార్ట్ టర్మ్ మెమరీలో నిక్షిప్తమవడంవల్ల వాటిని నెమరువేసుకోవడానికి ఏ మెషీనూ అవసరంలేదు.”

“కరక్టే. ఈ మెషీన్ టైం ట్రావెల్‌ని సాధ్యపరుస్తుందని నిన్ను నమ్మించవలసిన అవసరంలేదు. ఏం చేస్తుందని అడిగావ్ గనుక చెప్పాను. దీనిద్వారా నా చిన్నతనాన్ని – శిశువుగా ఉన్నప్పుడు కాళ్లమీద పడుకోబెట్టి మా అమ్మమ్మ నీళ్లు పొయ్యడాన్ని, మా నాన్న పొట్టమీద పడుకుని నిద్రపోవడాన్ని, రెండేళ్ల వయసులో మా అమ్మ నా పొడుగాటి జుట్టుకు

కొప్పునిపెట్టి దానికి పూలదండ నమర్చడాన్నీ, ఎలిమెంటరీ స్కూల్లో ఉన్నప్పుడు నువ్వూ, నేనూ, రాఘవా కలిసి సుబ్బరాయుడిగారింట్లో దొంగతనంగా జామకాయలని కొయ్యడాన్నీ – అరవయ్యేళ్లు ఇంటూ 365 రోజులూ – ఆఖరి ఊపిరి పీల్చేదాకా గుర్తు తెచ్చుకోవడానికి జ్ఞాపకాలు అనంతం. వాటికి ఇంద్రధనుస్సు మెరుగులని అద్దుతోంది, అప్పుడు చుట్టుపక్కల మనుషుల్లో చూసినా అర్థంకాని భావాలని ఇప్పుడు ప్రేక్షకుడిగా చూడగలగడం – అద్భుతంగా ఉంది!"

"టైం మెషీన్లగూర్చి రాసిన కథల్లో గతంలోకి వెళ్లి, అప్పుడు జరిగిన సంఘటనని ఏమయినా మారిస్తే భవిషత్తు – గతానికి వర్తమానం భవిష్యత్తే గదా– మారుతుందని రాస్తారు గదా, నువ్వలా వర్తమానాన్ని మార్చేలా చెయ్యడానికి ఏమీ నీ టైం ట్రావెల్స్‌లో ప్రయత్నించలేదా?"

"ఉదాహరణకి రంజని నాతోనే ఉండేలా చెయ్యడం? దానికి నేనెందరి రాతలు మార్చాలి!"

"నువ్వు కనిపెట్టిన గాడ్జెట్‌వల్ల సామంత్ అంత లాభపడ్డాడు కదా, పోనీ నీకు లభించాల్సిన ఆ క్రెడిటయినా–"

"ఆ గాడ్జెట్ ఎవరిద్వారా సాధ్యమయిందో వాడికీ, నీకూ, నాకూ తెలుసు. అది ప్రస్తుతం ఇక్కడకూడా రోడ్డుమీద కెడితే కనిపిస్తుంది. సాంకేతిక ప్రగతికి సహాయపడ్డందుకు నాకు గర్వంగానే ఉంది. దాన్ని నానుంచీ వేరుచెయ్యడం ఎవరికీ సాధ్యం కాదు. నువ్వు ట్రై చేస్తావా? కావాలంటే డైనోసార్ల కాలానికి వెళ్లు" అన్నాడు.

వాడు మాటమార్చాడని అర్థమవుతూనే ఉంది. ట్రై చెయ్యకపోతే "కథల్లో చదివినది ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం దొరికినప్పుడు జారవిడుచుకున్నావా?" అని ఎవరయినా నన్ను ప్రశ్నించవచ్చునేమో గానీ, ఆ మెషీన్ నాలికమీద పడుకుని దాని లోపలికి వెడితే బయటికి తిరిగొస్తానా అన్న విషయం గూర్చే నా భయం. రెండేళ్ల క్రితం ఎమ్మారై మెషీన్లో కెళ్లిన అనుభవం ఉందిగానీ, అది ఒక అమెరికన్ కంపెనీ తయారుచేసింది. అమెరికన్ హాస్పిటల్లో ఉపయోగించబడుతోంది. దానికి సర్టిఫికేషన్లన్నీ ఉన్నాయి. ఏమయినా హెచ్చుతగ్గులొస్తే, ఓ పట్టుపట్టడానికి లాయర్లు లైన్లు కడతారు. కోర్టుకేసు మాటటుంచి వీడి మెషీన్‌కి ఎలాంటి సర్టిఫికేషన్లనీ ఆశించడం కూడా తప్పే. నా ఇంజనీరింగ్ పరిజ్ఞానం, ఈ మెషీన్లో నా శరీరం భరించే శక్తికి మించి మాగ్నెటిక్ ఫీల్డ్ డెవలప్ అయినా, హై ఎనర్జీ ఎలక్ట్రాన్లో, లేక ఎక్స్‌రే రేడియేషనో ప్రొడ్యూస్ అయినా, వాటివల్ల కలిగే దుష్పరిణామాలకి బాధ్యత ఎవరిది అన్న ప్రశ్నని లేవనెత్తింది.

నా ఆలోచనలని పసిగట్టినట్లున్నాడు. "ఓ పది నిముషాలపాటు నేను వెళ్లొస్తాను, నీ కళ్లముందరే. తరువాతే నువ్వెడుదువుగాని!" అన్నాడు. సరేనని తల ఆడించాడు.

సత్యా ఆ మెషీన్ కంట్రోల్ పానెల్ మీదనున్న బటన్లనేవో నొక్కాడు. పది నిముషాలు సెట్‌చేశాడు. “ఇది అలారం లాగే, సమయం అయిపోగానే వర్తమానానికి తెచ్చేస్తుంది,” అని వివరించి, “నువ్వేం చెయ్యనక్కర్లేదు, చూస్తూ ఉండు,” అని ఆ రాక్షసుడి నాలుకమీద పడుకున్నాడు. ఒక పది సెకన్లల్లో ఆ నాలుక ఆ మెషీన్లోకి వెళ్ళిపోయింది. అప్పుడు, ఆ కంట్రోల్ పానెల్‌మీది డిస్‌ప్లేలో ఉన్న అంకెలని చూశాను – 1960, సెప్టెంబర్ 6 పొద్దున్న పదిగంటల అయిదు నిముషాలు. ఆ తారీకునీ, ఆ సమయాన్నే ప్రత్యేకంగా ఎందుకు ఎన్నుకున్నాడా అని అనుమానమేసింది. డిస్‌ప్లేలో టైం మారడం గమనించాను. పదినిముషాల తరువాత ఆ మెషీన్ ఆటోమేటిగ్గా నాలికని వెళ్లబెట్టింది. బయటకొచ్చిన తరువాత చెప్పాడు– “నేనున్న స్కూల్లో నువ్వు జాయిన్ అయింది ఆ సంవత్సరమేనని గుర్తుందిగానీ తేదీ గుర్తులేదు. సెప్టెంబర్ 6 కే స్కూల్లో ఉన్నావు.”

వాణ్ణి నమ్మాలో లేదో తెలియలేదుగానీ ఆ మెషీన్లో పదినిముషాల సేపుంటే ప్రమాదం లేదనిపించింది. ఎందుకయినా మంచిదని, అయిదు నిముషాలు సేఫ్టీ మార్జిన్ క్రింద ఉంచుకుని “ఒక్క అయిదు నిముషాలు మాత్రం” అన్నాను. అంతేకాక వాడు అయిదు నిముషాలే సెట్ చెయ్యడం చూశానుకూడా.

“ఏ సంవత్సరాన్ని డయల్ చెయ్యమంటావో చెప్పు.”

“డైనోసార్ల యుగానికి.”

“అంటే మిలియన్ల సంవత్సరాల వెనక్కి. నేను ఎప్పుడూ ఈ మెషీన్లో అంత వెనక్కి వెళ్లాలనుకోలేదు గనుక అన్ని డిజిట్లని ప్రోగ్రాం చెయ్యలేదు– ఇరవయ్యవ శతాబ్దంలో సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాముల్లో సంవత్సరానికి రెండంకెలే కేటాయించినట్లుగా. మరి, ఇందాక డైనోసార్ల యుగానికి వెడతావా అనడిగావెందుకు అని నువ్వడగవచ్చు. కాసేపు కూర్చుంటే సాఫ్ట్‌వేర్ మారుస్తాను.”

సాఫ్ట్‌వేర్‌లో చేసే చిన్న చిన్న మార్పులు అసలు ప్రోగ్రాంకే ఎంత ఎసరుపెట్టవచ్చో స్వయంగా అనుభవం ఉన్నవాణ్ణి గనుక “వద్దులే” అన్నాను. పైగా, ఇప్పుడు సాఫ్ట్‌వేర్ మారిస్తే, దాని తరువాత ఆ మెషీన్ సరిగ్గా పనిచేస్తుందో లేదో తెలుసుకోవడానికి వాణ్ణి మళ్లీ నాకన్నా ముందు కాలయాత్ర చేయించాలి.

“క్రీస్తుశకంలో ఏ రోజయినా సెలెక్ట్ చేసుకోవచ్చు.”

“నేను పుట్టకముందరి ఏ రోజయినా పర్లేదు,” అన్నాను గానీ, అయిదున్నర నిముషాల తరువాత గానీ నేనెంత తప్పుచేశానో అర్థంకాలేదు.

నా కళ్లముందరే అయిదునిముషాలు సెట్ చేశాడు. కాలయంత్రం తన నాలుకని వెనక్కు లాక్కున్న దాదాపు ముప్పై సెకన్ల తరువాత నేనొక మైదానం మధ్యలో నిలబడి ఉన్నాననీ, నా చుట్టూ వేలకొద్దీ జన మున్నారనీ అర్థమైంది. నా శరీరం మీద రెండు

పెదవుల స్పర్శ తెలిసిన తరువాత గానీ నేనొక పసికందుకి స్తన్య మిస్తున్నానని తెలియలేదు. ఉలిక్కిపడ్డాను. చేత్తో తడుముకుని రెండు రొమ్ముల ఉనికినీ నిర్ధారణ చేసుకున్నాను. లంగా సర్దుకుంటూ నేను పూర్తిగా స్త్రీరూపంలో ఉన్నానని గ్రహించాను. ముక్కుకి పోగు, చెవులకి కమ్మలూ, లంగా, దుప్పట్టా, పాలుతాగుతూ నన్నంటిపెట్టుకున్న పసికందూ నన్ను శిలావిగ్రహంలా నిలబెట్టాయి. "హే భగవాన్!" అని పైకి చూసిన తరువాత చుట్టూచూస్తే నేను పంజాబీల మధ్యలో నిలబడ్డానని అర్థమైంది. మైక్‌లో ఎవరిదో ఉపన్యాసం వస్తోంది గానీ ఒక్కముక్క అర్థం కావడం లేదు. ఇంతలో వెనకనుంచీ తోపిడి మొదలయ్యింది. "బ్రిటిష్ పోలీసులు!" అని వెనకనించీ వచ్చిన వార్త ఆ సభలో మధ్యలో ఉన్న నన్ను చేరడానికి ఎంతోసేపు పట్టలేదు. దూరంగా స్టేజీమీద ఉన్న వక్త ఇంకాసేపు అలాగే ప్రసంగించాడు. అసలే ఈ జెండర్ ఛేంజ్‌తో స్టన్ అయివున్నాను. ఇప్పుడీ తోపులాట. అప్పుడే ఏం చూశావు అన్నట్టు తుపాకీ కాల్పుల శబ్దం వినిపించింది. తోపుడు కాస్తా తొక్కిసలాటగా మారింది. ఎక్కడికని వెళ్లేది? అందరిలాగా చెల్లాచెదురై పరుగెట్టి ముందుకు చూద్దును కదా, నుయ్యి! వెనక్కి చూస్తే కొందరు తుపాకీగుళ్లు తగిలి పిట్టల్లా నేలకురాలడం కనిపించింది. నా పక్కనుంచీ కొందరు వెళ్లి ముందున్న బావిలో దూకారు ఒకళ్లు నాకేదో చెప్పారు కూడా. భాష రాక అర్థంకాలేదు. ఇంకొకళ్లు నా చెయ్యి పుచ్చుకొని లాగి వాళ్లతో బాటు దూకించినప్పుడు అర్థమైంది. వాళ్లు నన్నుకూడా దూకమంటున్నారని. దూకాను సరే, ఈత రాదే! నా రొమ్ముని కరచుకొని ఉన్న పిల్లతోసహా నేను మునుగుతున్నాను. నీళ్లు నోట్లోకి పోతున్నాయి. ఊపిరి అందడంలేదు. ఇంతలో ఎవరో ఒకరు సరిగ్గా నా నెత్తిమీదకి దూకారు. అప్పుడర్థమైంది. నేనున్నది జలియన్ వాలాబాగ్‌లో నని!

ప్రాణంపోయిందని నిర్ధారించబడ్డవాడు, లేదు, బతికే ఉన్నాను అని నిరూపించే టప్పుడు తీసే మొదటి శ్వాసలా పెద్ద శబ్దంచేస్తూ ఊపిరి పీల్చుకున్న తరువాత కొన్ని సెకన్లకి ఆ రాక్షస నాలికమీంచి బయటపడి లేచి నిలుచున్నాను.

సత్యా నవ్వాడు – పట్టలేని కోపంతో ఆ నాలికమీంచి లేచి నిల్చున్నవాణ్ణి కాస్తా, ఒళ్లంతా చెమటలతో నిండిపోయినా గానీ, నోరు తెరిచే ముందరే నేను ఆడదాన్ని కాదని నిర్ధారించుకోవడం కోసం తడుముకోవడాన్ని చూసినప్పుడు నేనుకూడా ఫక్కుమని నవ్వాను.

"ఈ మెషీన్ నన్ను నిజంగా కాలయాత్ర చేయించిందనీ, నువ్వా అనుభవాన్ని ప్రోగ్రాం చెయ్యలేదనీ ఋజువేంటి?" ప్రశ్నించాను.

"నీ జీవితంలోని అనుభవాలనే నీకు చూపిస్తే జ్ఞాపకాల లోతుల్లోంచి తవ్వి తీశానని అనేవాడివి. ఈ తారీకుతో నయితే, పుస్తకాలల్లో చదువుకోవడం వల్ల ముందరే కొద్దిగా నయినా పరిచయముంది గానీ, దాని వివరాలు నీకు ఇప్పుడు తెలిశాయి!"

ఒక్క క్షణ మాలోచించిన తరువాత వాడు చెప్పినది లాజికల్‌గానే ఉందనిపించింది. "ఇంకేం, అమ్మెయ్!" అన్నాను.

"ఎందుకూ?" అన్నాడు అమాయకుడిలా.

"పిచ్చోడిలా మాట్లాడతావేంటి? ఎంత డబ్బు చేసుకోవచ్చో అస్సలు అయిడియా లేదా?"

"నాకెందుకు, డబ్బు?"

"పోనీ, ప్రపంచానికి నూతన టెక్నాలజీని అందిస్తున్నానని అనుకునైనా సరే– ఎడిసన్ లైట్ బల్బుని అందించినట్లుగా."

"ఇది నాకోసం నేను చేసుకున్నది – అంతే."

"నేనీసారి వచ్చేసరికి ఆ డైనోసార్ల కాలం దాకా వెళ్ళొచ్చేలా మార్చు. నీకు బ్రహ్మాండ మయిన కాంట్రాక్టులని తెచ్చే బాధ్యత నాది!"

"చూద్దాంలే," అన్నాడు. వెంటనే "నో" అననందుకు సంతోషించాను. మాట మార్చి, "రాఘవ ఈ ఊళ్లోనే ఉన్నాడు తెలుసా?" అన్నాను.

"అలాగా," అని నిరాసక్తంగా ఊరుకున్నాడు.

"క్రితంసారి వచ్చినప్పుడు కలిశాను. నిన్నీపాటికి కలిసుంటాడని అనుకున్నానే!" ఇందాక రాఘవ ప్రసక్తి రావడం మీరు గమనించే ఉంటారు. కలిసున్నట్లున్న పోజులతో ఉన్న బొమ్మలతో తప్ప పురాణాల్లో త్రిమూర్తు లెప్పుడూ కలిసి తిరిగినట్లు ఆధారాలేవీ లేవు. గుళ్లు లేని బ్రహ్మ సంగతి పక్కన పెట్టినా మిగిలిన ఇద్దరికీ కలిపి కట్టిన గుళ్లుకూడా ఎక్కడాలేవు– ఈ మధ్యలో అమెరికాలాంటి దేశాల్లో ప్రవాస భారతీయులు కొత్తగా కడుతున్నవాటిని మినహాయిస్తే. హైస్కూల్లో ఉన్నప్పుడు మాకుమాత్రం త్రిమూర్తులన్న పేరొచ్చింది. ఎక్కడి కెళ్లినా కలిసి వెళ్లేవాళ్లం. పొరబాటున ఇద్దరమే ఎక్కడయినా కనిపిస్తే, మాకు తెలిసినవా ళ్లెవరయినా గానీ, మూడో వాడేడని వెంటనే అడిగేవారు. రాఘవ మెడిసిన్లో సీటొచ్చి కాకినాడ వెళ్లిపోయాడు. నేనూ, సత్యా వేరే కాలేజీల్లో ఇంజనీరింగ్ చదివినా, అమెరికా చేరిన తరువాత మా స్నేహాన్ని కొనసాగించాం. పెళ్లయిన తరువాత రాఘవగూర్చి విశేషాలు ముందు మాకు జాలినీ, బాధనీ కలిగించడంవల్ల వాణ్ణి ఓదార్చబోయాం గానీ తరువాత వాడికి దూరంగా ఉండడమే మంచిదన్న నిర్ణయానికి నేనొచ్చాను. సత్యా అయితే సరే. వాడిలోకంలో వాడుంటాడు గదా! ఇంట్లోనే వేరే గదిలో ఉన్న పెళ్లాన్నే పట్టించుకోనివాడికి పదివేల మైళ్లవతల ఉన్నవాడేం గుర్తుంటాడు? ఇప్పుడయినా రాఘవ ప్రసక్తి తేవడానికి కారణం, దాదాపు అరవయ్యోపడిలో పడుతున్నాం కదా, వాడి సమస్యలు సర్దుకొని ఉండక పోతాయా, ఇప్పుడయినా మళ్లీ ముగ్గురం హాయిగా కలవవచ్చునన్న ఆశతో. అందుకే రాఘవని కలిసి, ఎలాగయినా సరే సత్యాని కలవమని మరీ మరీ చెప్పాను.

అదెంత తప్పో ఆర్నెల్ల తరువాత సత్యానుంచీ వచ్చిన ఫోన్‌కాల్ వల్ల తెలిసింది. వాడిచ్చిన చాంతాడంత లిస్టుని చూసి, "ఇవన్నీ డైనోసార్ల కాలానికి తీసుకెళ్లడానికే?" అన్నాను. "డైనోసార్లని చూడాలంటే అంత వెనక్కి వెళ్లక్కర్లా. నా చుట్టూ కూడ ఉన్నారు. ఈ సారొచ్చినప్పుడు చూద్దువుగాని," అన్నాడు.

తరువాత తెలిసిందిదీ– రాఘవ జీవితం వాడి పెళ్లితోనే అంతమయిందని వాడి పెళ్లయిన మూణ్ణాళ్లకే నాకూ, సత్యాకీ నిర్ధారణ అయింది గానీ, వాళ్లకి ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత మేము పొరబడ్డామేమో ననుకున్నాం. వాడి భార్యకి శూర్పణఖ అని కాకుండా సీత అని పేరు పెట్టినందుకు ఆవిడ తల్లిదండ్రుల మీద నాకు ఎప్పటినుంచో ఉన్న కోప మివాళ తారాస్థాయికి చేరుకుంది. సీత అనగానే నాకు రాముడి భార్య కాక, రాఘవ భార్య గుర్తుకు రావడం గురించి కాదు నేను మాట్లాడేది. సత్యా ఎంతో శ్రమపడి తయారు చేసిన కాలయంత్రాన్ని గునపాలతోనూ, గొడ్డళ్లతోనూ నాశనం చేయించడం గూర్చి.

రాఘవ చేసిన తప్పేమిటి? వాడు జీవించి ఉన్నప్పటి క్షణాలని గుర్తు చేసుకోవాలనుకోవడం. పెళ్లి కాకముందు వాడి ప్రేమ వ్యవహారానికి అడ్డం కొట్టింది వాడి తండ్రి – గోడకేసి రక్తం వచ్చేలా తలకాయని కొట్టుకుని, ఆ ప్రేమ పెళ్లే గనుక జరిగితే రైలుక్రింద తలకాయ పెడతానని బెదిరించి, వాడి తల్లిచేత, "నీ కాళ్లు పట్టుకుంటాను నాయనా, నాకు పతిభిక్షని పెట్టు!" అని చెప్పించీను. తాళికి తలవంచింది సీతకాదు రాఘవ. పెళ్లి ముందరి వాడి ప్రేమ వ్యవహారాన్ని పెళ్లిలోనే ఆమె చెవిలో ఊదిన ఆమె చుట్టానికి బుద్ధి లేకపోతే సరే, నిమిష నిమిషానికీ, "నువ్వు దాన్నయితే ప్రేమగా చూసుకుని ఉండే వాడివి కాబోలు. నారాత ఇలా తగలడ్డది!" అని ముక్కు చీదడానికి ఆమెకి సిగ్గుండక్కర్లా? ఇద్దరు పిల్లలుకూడా పుట్టిన తరువాత కలిగిన సిగ్గువల్ల కాబోలు, వాడు పడగ్గదులు వేరు చేయించినా (రాఘవ పోయిన తరువాత ఈ సంగతిని ఆమె నోటి ద్వారానే విన్నార్ట చెవులున్న వాళ్లందరూను) వాడు హాస్పిటల్లో ఉన్నా, డిస్పెన్సరీలో ఉన్నా క్షణక్షణం ఎక్కడ ఉన్నదీ ఆమెకు చేరుతూనే ఉండాలట!

ఆ పరిస్థితిలో వాడు కాలయంత్రంలో ప్రేమ రోజులని తిరిగి అనుభవించాలనుకోవడంలో తప్పేముంది? నా ప్రోద్బలంతో నయితేనేం, మొత్తానికి వాడు సత్యాని కలిసిన తరువాత సాయంత్రం డిస్పెన్సరీలో ఉన్నాడని అబద్ధం చెప్పించి, ఆ కాలయంత్రంలో దూరితే, కనీసం చెప్పినచోట లేడనే విషయం ఆ శూర్పణఖకి చేరడానికి ఎన్నాళ్లు పడుతుంది? రాఘవని ఏ రావణుడూ ఎత్తుకునీ పోలేదు, వాడు వెళ్లింది లంకకీ కాదు. ఉన్న ఊళ్లో ఎంతసేపు వాణ్ణి పట్టుకోవడం! ఆవిడ జులుంచేసి, సత్యా ఇంటికి వెళ్లి, రాఘవ టైం మెషీన్లో ఉన్న సమయంలో, కాసేపట్లో తలుపులు తెరుచుకుంటాయి, ఆగమంటూ అడ్డంపడిన సత్యాని పక్కకుతోసి, ఎమర్జెన్సీ స్టాప్ బటన్ నొక్కిందట. అయినా,

కాలయంత్రం గూర్చి ఆవిడకు చెప్పడానికి సత్యాకి బుద్ధుండొద్దూ? పైగా, గతంలో కెళ్లి ఆనందాన్ని అనుభవిస్తున్నాడు అని చెబితే ఆవిడకి తిక్క రేగకుండా ఎందుకుంటుంది? చేరి మూర్ఖుని మనసు అంటూ భర్తృహరి ఏనాడో చెప్పాడు.

ఆవిడ రాఘవని బలవంతంగా ఇంటికి లాక్కెళ్లిన తరువాత ఆవిణ్ణీ, కూతురినీ (కొడుకు అమెరికాలో ఉన్నాడు) కలిపి "మీరెవరు, నేనిక్కడ ఎందుకున్నాను?" అని రాఘవ అడిగితే, వేషా లేస్తున్నాడని శూర్పణఖ గట్టిగా తిట్టిపోసిందట. మరునాడు రాఘవ అసలు హాస్పిటల్ వైపు గానీ, డిస్పెన్సరీ వైపు గానీ వెళ్లకపోతే నటనే ననుకుందట. మళ్లీ రాఘవ దగ్గరకి ఎక్కడ చెక్కేస్తాడోనని ఇంటి బయటకు వెళ్లడానికి వీల్లేకుండా గట్టి కాపలా పెట్టిందట. వారం రోజుల తరువాత కూడా వాడావిణ్ణి నువ్వెవరంటుంటే, తిక్కపుట్టి, పెళ్లిఫోటో చూపించిందట. అది చూసి వాడు "నాకెప్పుడు పెళ్లయ్యింది?" అనేసరికి, లబోదిబోమని మొత్తుకుంటూ వాణ్ణి పట్టుకెళ్లి ముందు డాక్టర్ల చుట్టూతా, తరువాత పూజలు, శాంతులు పేరిట గ్రహాలచుట్టూ తిప్పిందట. అప్పటిదాకా ఇంటిగడప తొక్కనివ్వని రాఘవ అన్నా చెల్లెళ్లని ఇంటికి పిలిపిస్తే వాళ్లని గుర్తుపట్టినట్లే ఉన్నాట్ట కానీ, "ఇంత ముసలాళ్లలాగా కనిపిస్తున్నారేంటీ?" అనడిగాట్ట. అతని చెల్లెలి మొగుణ్ణి కానీ, ఆమె పిల్లలని కానీ, అన్నయ్య పిల్లనికానీ ఎవరినీ వాడు గుర్తుపట్టలేదట. అప్పుడు గానీ వీడు చెల్లెలి పెళ్లికి ముందుకాలంలో ఉన్నాడని వాళ్లకి అర్థం కాలేదట. ఆమెకి పెళ్లే కాని కాలంలో వాడున్నప్పుడు ఆ తరువాత తరువాత వచ్చిన ఆమె మొగుడిగూర్చి గానీ తన పెళ్లిగూర్చి గానీ వాడికి తెలియకపోవడంలో వింతేముంది?

అప్పుడు మొదలుపెట్టిన సీత శోకం రాఘవతోబాటు అందరినీ సత్యా ఇంటికి లాక్కెళ్లేలా చేసింది. టైం మెషీన్లో ఎమర్జెన్సీ స్టాప్ నొక్కడం ఏ ఫలితాలకి దారితీసిందోనని ముందుగా సత్యా ఆదుర్దా పడ్డాట్ట కానీ అప్పటికి ఆమె తాకిడికి గుర్రై రెణ్ణెల్లు దాటినందువల్ల ఏమీ అయ్యుండదన్న నిశ్చయానికి వచ్చాట్ట. వాళ్ల దగ్గరనుంచీ వివరాలని సత్యా రాబట్టిన తరువాత, "ఎలాగోలా ఆయన్ని మామూలుగా చెయ్యా"లన్న ఆజ్ఞని జారీచేసిందట ఆ శూర్పణఖ. సత్యా ఏదో ఒకటి పెద్దగా వ్యాఖ్యానం లేకుండా చేస్తే సరిపోయేది. అలా కాకుండా, వాళ్లతో "ఇప్పుడు వాణ్ణి కాలయంత్రంలో పడుకోబెట్టి కాలాన్ని మళ్లీ వెనక్కి తిప్పితే, తిరిగొచ్చిన తరువాత వాడు ఆ యాత్ర చేసేముందరి స్థితిలో ఉంటాడా లేక వేరే ఏదయినా స్థితిలో ఉంటాడా? వెళ్లే ముందరి స్థితి అయితే, మీకు కావలసిన పరిణామాలేవీ సంభవించవు. కానీ, తరువాతి స్థితిలోకి వస్తాడనుకోవడానికి మనకు ఆ స్థితి గూర్చి ఏమీ తెలియదే?" అన్నాట్ట.

"కాకమ్మ కబుర్లు చెబుతున్నాడు. ఆ మెషీన్లో పడుకోబెట్టి, కొన్నేళ్లు కాలచక్రాన్ని వెనక్కి తిప్పిన తరవాత తిరిగి వచ్చేటప్పుడు రెణ్ణెల్ల క్రిందటి తేదీ దగ్గర ఆపుచేస్తే సరి!"

అన్నాట్ట రాఘవ చెల్లెలి కొడుకు. ఇంజనీరింగ్ ఫస్టియర్ చదువుతున్న ఆ కుర్రాడికి ఇంటెలిజెంట్ అని అప్పటికే బిరుదుండడంచేత, ఆ అయిడియాని మెచ్చి ఆఖరికి శూర్పణఖ కూడా వాణ్ణి ముద్దుపెట్టుకున్నదట కూడా.

సత్యా అంత తేలిగ్గా కుదరనిస్తాడా? "కాలచక్రంలో వెనక్కి వెళ్లి తిరిగి రావచ్చు గానీ మధ్యలో ఆపడానికి వీల్లేదు. అలాకాక మధ్యలో ఆపితే వచ్చే పరిణామాలను ఎదురుగా చూస్తూనే ఉన్నారు. కాలచక్ర మనేది ఎప్పుడూ ముందుకు తిరుగుతూనే ఉంటుంది కాబట్టి, ఈ యంత్రంలోకి వెళ్లిన తరువాత తిరిగి వచ్చేటప్పటి సమయం వెనక్కి వెళ్లేటప్పుడున్న సమయాన్ని దాటి ఉండాలి. అంటే, పదిగంటలప్పుడు ఆ యంత్రంలోకి అడుగుపెట్టే టట్లయితే, తిరిగి వచ్చేటప్పటి సమయం, కనీసం పదిగంటల ఒక్క నిముషం అయివుండాలి. వెనక్కి వెళ్లడానికి ముప్పైసెకన్లు, తిరిగి రావడానికి ముప్పై సెకన్లూ పడతాయి" అన్నాట్ట.

"అయితే ఒక పనిచేద్దామత్తా. ఈ మెషీన్లో తిరిగివచ్చే సమయంక్రింద ఒక ఆరునెలలు కవతలి సమయాన్నెన్నుకుందాం. ఈ మెషీన్వల్ల కాకపోయినా, ఎలాగోలా మామయ్య మామూలు మనిషవుతాడని నాకు నమ్మకముంది" అన్నాట్ట ఆ ఇంటెలిజెంటు.

శూర్పణఖ మురిసిపోయిందట వాడి ఆప్టిమిజానికి. "ఎందుకయినా మంచిది, ఒక సంవత్సరం తరువాత కాలాన్ని సెలెక్టుచేసుకో. మీ మామయ్య నాకు నా వచ్చే పుట్టినరోజుకి రవ్వల నెక్లెస్ కొనిపెడతానన్నారు. కొంటారో లేదో ఈ దెబ్బతో తెలిసిపోతుంది" అన్నదట. లిఫ్టులో ఎక్కిన తరువాత నాలుగో అంతస్తు చేరాలంటే "అది సరిగ్గా పనిచేస్తుందో, లేదో ఎందుకయినా మంచిది, అయిదవ అంతస్తు బటన్ నొక్కితే?" అన్న ఆలోచనని రానివ్వనివాళ్లు ఆమెని సమర్థించారట.

నలుగురు మనుషులు సత్యాని చేతులు విరిచి పట్టుకున్న తరువాత ఆ ఇంటెలిజెంటు కంట్రోల్ పానెల్లో డేట్లని సెలెక్టుచేసుకున్న తరువాత రాఘవని ఆ మెషీన్లోకి పంపించారట. రాఘవ దాన్లోంచీ బయటకు వచ్చిన తరువాత వాళ్లందరినీ – సీతనీ, కూతుర్నే గాక చెల్లెలి మొగుణ్ణీ, వాళ్ల పిల్లలనీ కూడా గుర్తుపట్టి, పేరుపేరునా పలకరించేసరికి అందరూ ఆనంద పడ్డార్ట.

అయితే మరునాడు రాఘవ హాస్పిటల్కి వెళ్లే ప్రయత్నాలేమీ చెయ్యకుండా ఇంట్లో కూర్చునుంటే, కొద్దిగా జంకుతూనే శూర్పణఖ, "ఏమిటీ, ఇవ్వాళ హాస్పిటల్ వెళ్లట్లేదా?" అనడిగిందట. రాఘవ, "నేను రిటయరయ్యాగదే, నన్నెవడు రానిస్తాడు హాస్పిటల్కి?" అన్నాట్ట. ఆ క్రితం రెణ్ణెల్ల హడావిడిలోపడి మర్చిపోయిందిగానీ ఆవిడకి తెలిసినంతవరకూ తరువాత దాదాపు రెండువారాల్లో అతను రిటైరవుతాడు. "అప్పుడే రిటైరయ్యా నంటాడేమిటి?" అని ముందు ఆశ్చర్యపోయినా అప్పటికి రెట్టించకుండా ఊరుకుందట గానీ, ఆవిడకి మతిపోగొట్టిన విషయం మాత్రం, కొడుకు ఈశ్వర్ని చూసినప్పుడు రాఘవ

చేసిన సీను. అమెరికాలో ఉన్న ఈశ్వర్‌కి రాఘవ గొడవ కొద్దిగా చెప్పినా, ఎలాగో రాఘవ రిటరయ్యే సమయానికి తండ్రి పక్కన ఉండేందుకని కొనుక్కున్న ఫ్లైట్ టిక్కెట్టు ఉంది కదా, అప్పుడే రావచ్చులే అని అతనికి నచ్చచెప్పారు. కానీ, రాఘవ మామూలు మనిషయ్యాడని సంబరపడుతున్న వేళలో, కొడుకుని చూసిన రాఘవ ఏడుస్తాడని – అది కూడా, చాలాకాలం తరువాత చూసినందువల్ల కాక దయ్యాన్ని చూసినట్లుగా – ఎవరయినా ఎలా ఊహిస్తారు? సీత తలబాదుకుంటూ ఈశ్వర్‌ని పక్కకు తీసుకెళ్లి అంతకుముందు రెణ్ణెల్లూ జరిగిన భాగోతమంతా వాడికి వివరించిందట.

ఈశ్వర్ అక్కడున్న వారంరోజులూ అతను కనబడితే ఏడిచే రాఘవని భరించలేక, "ఏమిటీ నీ ప్రాబ్లం?" అని గట్టిగా అతణ్ణి గసిరితే, "వీడు దయ్యమయ్యాడే" అని బావురు మన్నాట్ట. "నీ బొంద! వీడు మనిషే. నువ్వే మమ్మల్ని బతికుండగానే పీక్కుతింటున్నావు" అని సీత మొగుణ్ణి తిడితే, వాడుకాస్తా, "వాడు పోయిన తారీకు నీకు ఎందుకు గుర్తులేదో నాకు అర్థం కావట్లేదు" అని తలబాదుకున్నాట్ట.

సీతకి వళ్లుమండిపోయి, "నిక్షేపంలా ఉన్న నా కొడుకుని చంపుతావెందుకు?" అని చేతికందిన వాటిని రాఘవమీదకి విసిరిందట. రాఘవ, "వాడు పోయిన తారీకు" అంటూ దాదాపు ఆర్నెల్ల తరువాత తేదీని చెప్పి, "న్యూస్ పేపర్లో వచ్చిందిగా, వాడుపోయిన విషయమూ చూపిస్తానుండు," అని ఋజువులకోసం ఇంట్లో వెతకడం మొదలుపెట్టేసరికి వాణ్ణి గదిలోపెట్టి తాళం వేశార్ట.

"నెల్లాళ్ల తరువాత రాఘవ పోయేదాకా వాడి మకాం అక్కడే" అన్నాడు సత్యా. ఈశ్వర్ నిష్క్రమణ దినం గూర్చిన రాఘవ మాటలు సత్యాకి చేరాయిగానీ, "తన కాలయంత్రం ద్వారా భవిష్యత్తులోకి వెళ్లడం సాధ్యమా?" అన్న ప్రశ్నకి పెద్దగా తన మైండ్‌లో చోటివ్వకుండా రాఘవతోబాటే దాన్ని పూడ్చిపెట్టాట్ట. అయితే రాఘవ చెప్పిన తారీకునాడే ఈశ్వర్ అమెరికాలో మరణించడం రాఘవ కుటుంబాన్నే కాక సత్యాని కూడా దిగ్భ్రాంతికి లోను చేసింది. ఆ దిగ్భ్రాంతి నుండి ముందు తేరుకున్నది సీత. అదుగో, అప్పుడు – మనుషుల్ని పట్టుకొచ్చి గునపాలతోనూ, గొడ్డళ్లతోనూ వాడి కాలయంత్రాన్ని ధ్వంసం చేయించింది.

ఆ విధ్వంసానికి కారణమేమిటో వాడి చుట్టుపక్కలవాళ్లకి తెలియడానికి ఎంతోకాలం పట్టలేదు. అప్పటినుంచీ వాళ్లల్లో కొంతమంది, సత్యా తన మెషీన్ని ఎప్పుడు బాగుచేస్తాడా అని కాచుక్కూర్చున్నారు. నా రాకపోకలు చూసిన తరువాత ఎంతో కాలం పట్టలేదు వాళ్లు కాలయంత్రంలో ప్రయాణం చేద్దామని క్యూ కట్టడానికి!

"డైనోసార్లుండే గతంలోకి ప్రయాణించడానికి మనిషి పుట్టుక అనేది అడ్డమయినా, బొందితోనే, అదే వయసులోనే ఉంటూ ఎన్నో వేలయేళ్ల వెనక్కి ప్రయాణించడం సాధ్యమేనని నమ్ముతున్నారు ప్రపంచవ్యాప్తంగా! భవిష్యత్తులోకి ప్రయాణించడం గూర్చే

సామూహిక ఒప్పందమేమీ ఇంకా కుదర్లేదు. భవిష్యత్తుని గూర్చి సైన్స్ ఫిక్షన్ అంతా అది క్రీ.శ. 2050 అనో, లేక ఇరవై అయిదవ శతాబ్దమనో మొదలుపెట్టి, అప్పటి సమాజం ఎలా ఉంటుందోనని ఊహాగానాలు చేస్తున్నారు తప్ప, ఈనాటి మనిషి ఆనాటి సమాజంలో తేలడమేగాక మళ్లీ వర్తమానంలోకి రావడం అన్న అంశం గూర్చి ఆలోచించడంలేదు. అంతెందుకూ? నేనే ఇన్నిసార్లు టైం మెషీన్లో 5 నిముషాలతో మొదలుపెట్టి కొన్ని గంటలపాటు ప్రయాణం చేశాగదా, ఆ గంటలు వర్తమానంలోనే కదా నడుస్తున్నాయి? నేను ఆ మెషీన్ని గంటసేపు సెట్ చేస్తే, ఆ గంట తరువాత బతికే ఉండి, దానిలోంచి బయటపడతాను అన్న ధీమాతో ఉండగలగడమే ఆశ్చర్యకరం. దాన్నే ఇంకా కొనసాగించి ఆర్నెల్ల తరువాత కాలానికి వెళ్లి ఓ గంట గడుపుదామనుకుంటే, అది ఒక్క పదినిముషాలైనాగానీ, ఆ భవిష్యత్ కాలంలో ఈ టైం ట్రావెలర్ అసలు బ్రతికి ఉంటాడని గ్యారంటీ ఏమిటి?" అని చెప్పి తన యింటిముందు లైనుకట్టిన వాళ్లందరినీ వాళ్ల ప్రయాణాలు మానుకొమ్మనమని చెబుతూ వాళ్ల ప్రయత్నాలని అడ్డం కొట్టడానికి సత్యా శతవిధాలా ప్రయత్నించాడట.

కొంతమంది రాఘవ, ఈశ్వర్‌ల ఉదంతాన్ని విని వెనక్కి తిరిగినమాట నిజమే! ఇంకొంతమంది, మరునాడో, లేక నెల తరువాతో రాబోయే పదో తరగతి లేక ఇంటర్మీడియెట్ ఫలితాలని తెలుసుకుందామని ప్రయత్నించారటగానీ, సత్యా కావాలనే పెట్టిన ఆకాశన్నంటే ధర విని వెనుదిరిగారట. అయితే, ఎంత ఖర్చయితేనేం, ఒక రాయివేసి చూద్దాం అనుకున్న ఒక రాజకీయ నాయకుడు మాత్రం సత్యాని చేతులు వెనక్కి విరిచికట్టేసి తన భార్యని భవిష్యత్తులోకి ప్రయాణం చేయించాడు. (అప్పుడు ఆ శూర్పణఖచేత, ఇప్పుడీ రాజకీయ నాయకుడిచేత – ఇలా చేతులు వెనక్కి విరిచి కట్టించుకోవడం న్యూసెన్స్‌గా ఉంది. ఇంక ఎవడు తొయ్యమంటే వాణ్ణి ఆ మెషీన్లోకి తోస్తానన్నాడు కథ చెబుతూ సత్యా మధ్యలో. ఇంకా, ఆయనకి ఈ మెషీన్ని చూస్తే భయమేసినట్టుంది, అందుకే భార్యచేత ప్రయాణం చేయించాడు– భార్య డిస్పోజబుల్‌లా ఉంది! అని జోడించాడు) ఎమ్మెల్యే భార్యగా తనను తాను చూసుకున్నానని ఆవిడ తిరిగొచ్చి చెప్పినప్పటికన్నా, అది నిజం కూడా అయిన తరువాత మొదలయ్యాయి సత్యా ఇక్కట్లు.

ఒకావిడ ముప్ఫయ్యేళ్లొస్తున్న వాళ్లమ్మాయికి అసలు పెళ్లియోగం ఉన్నదో లేదో తెలుసుకోవాలని సత్యా పాదాల మీద పడి ఏడిస్తే దయార్ద్రహృదయంతో ఆమెని ప్రయాణం చేయించాడు. రెండేళ్ల తరువాత మనవణ్ణి ఆడిస్తున్న తనని చూసుకొని ఆనందపడ్డది. తరువాత రెణ్ణెల్లలోనే ఆ అమ్మాయికి పెళ్లయ్యిందిట గూడా.

ఇంక చిలకజోస్యాలనీ, కంప్యూటర్ జాతకాలనీ పక్కన పడేసి సత్యాని చుట్టుపక్కల ప్రజలు చుట్టుముట్టారు. తన మెషీన్ వల్ల నిజంగా భవిష్యత్తులోకి ప్రయాణం చెయ్యడం

జరుగుతోందని సత్యాకూడా మెల్లగా నమ్మడం మొదలుపెట్టాడు. దానికి తగ్గట్టుగా, ఆ రాజకీయ నాయకుడిలాగే, ఆ పెళ్లికాని కూతురి తల్లిలాగే ఆ యాత్రలు చేసివచ్చినవాళ్లు తమ జీవితంలో ప్రత్యక్షంగా ఋజువులని చూపించారు. దానితో, సత్యా మెషీన్ పవర్ గొప్పదనం కార్చిచ్చులాగా వ్యాపించింది. "ఆ మెషీన్‌కి దైవత్వాన్ని ఆపాదించి, పూలూ పండ్లూ సమర్పించుకోవడానికీ, కొబ్బరికాయలని కొట్టడానికీ రెడీ అయి వచ్చేవాళ్లని చూస్తే మతిపోయింది" అన్నాడు సత్యా.

ఆ పవర్‌ని ఉపయోగించుకోవాలన్న ఆశ పదవతరగతి చదువుతున్న పిల్లల తల్లి దండ్రులతో మొదలుపెట్టి ఆరవ తరగతి పిల్లల తల్లిదండ్రులదాకా పాకి, చివరికి, ఎల్‌కేజీ చదువుతున్న పిల్లల తల్లిదండ్రులని జేరడంలో వింతేమీలేదు. ఆ తల్లిదండ్రులు, అయిదు, పదీ, పన్నెండేళ్లు భవిష్యత్తులోకి ప్రయాణించి వాళ్ల పిల్లలకి ఐఐటీలో లేక మెడికల్ కాలేజీలో సీటొస్తుందో రాదో తెలుసుకున్నారు. రాదని తెలుసుకున్నవాళ్లే కాక, వస్తుందని తెలుసుకున్న వాళ్లు కూడా వాళ్ల పిల్లలకి కోచింగులు మానిపించేసి డబ్బుని ఆదా చేసుకున్నారు. అమెరికన్లయితే భవిష్యత్తుని మారుద్దాం అని ప్రయత్నించేవారేమో గానీ, రక్తంలో జీర్ణించుకున్న కర్మ సిద్ధాంతం వాళ్లెవరినీ అలా ఆలోచించనివ్వకుండా చేసింది.

ఇది మరి ఈ కోచింగ్ సెంటర్ల, రెసిడెన్షియల్ కాలేజీవాళ్ల నోళ్లల్లో మట్టికొట్టదూ? అలాగే స్పెషాలిటీ హాస్పిటల్స్ పనికూడా. ఆపరేషన్ చేసినా, చేయకపోయినా మనిషి బ్రతికేటట్లయితే, ఆపరేషన్ ఎందుకు చేయిస్తారు? ఆ ఆపరేషన్ అయిన తరువాత పేషెంట్ బ్రతక్కపోతే ఇంక ఆపరేషన్‌కి ఖర్చెందుకు పెట్టాలి? ఆనాడయితే సత్యా ఇంకా ఒక్క కాలయంత్రంతోనే కుస్తీపడుతున్నాడు గానీ అతను అలాంటివాటిని మరికొన్నింటిని మార్కెట్లోకి వదిలితే తప్పనిసరయ్యే సునామీ ఫలితాలని ఆకళింపుచేసుకున్న ఈ కోచింగ్ సెంటర్లవాళ్లకీ, హాస్పిటల్స్ వాళ్లకీ ఎవరికయినా సత్యాని లేపెయ్యడం చిటికెలోపని. అయితే అలాచేసిన తరువాత ఆ మెషీన్‌ని ఎవరు దొరకబుచ్చుకొంటారో తెలుసుకోవాలన్న ఆతృత వాళ్లకుంది. ఆ బంగారు కోడిపెట్టని ఎవరికి వాళ్లే చేజిక్కించుకోవా లనుకోవడం అంత ఆశ్చర్యకరమయిన విషయమేమీ కాదుగదా! అప్పటిదాకా ఒకే మెషీన్‌తో కుస్తీ పడుతున్న సత్యా అలాంటివే ఇంకో రెండో మూడో తయారుచెయ్యబోతున్నాడని అతని దగ్గర కొత్తగా చేరిన ఇద్దరు కుర్రాళ్లు ఇంటి బయట ఉన్న లైన్‌ని కంట్రోల్ చెయ్యడానికి చెప్పారు. ఆ వార్త బయటికి పొక్కిపోయి, అలా జరగడంవల్ల సంభవించే సునామీ ముంపుకి గురయ్యే సంస్థల్లోనూ, వ్యక్తుల్లోనూ ఆందోళనని కలిగించింది.

అలాంటి ఆందోళనకి గురయినవాళ్లల్లో సామంత్ బావమరిది ఒకడు. చట్టం గుర్తించిన సామంత్ భార్యకి తమ్ముడు. రంజనిని కంపేనియన్‌గా ఉంచుకున్నాడని సామంత్ భార్యకి తెలిసికూడా కావలసినవన్నీ అమరుతున్నాయని సర్దుకుని తనకి నచ్చే మార్గాన్ని ఆమె

ఎప్పుడో ఎన్నుకుంది. ఆ మార్గాలేవో తెలిసికూడా ఏమీచెయ్యలేని పరిస్థితి సామంత్‌ది. ఎందుకంటే, అమెరికాలో విడాకులు తీసుకోవాలంటే సామంత్ ఆస్తిలో సగం ఆమెకి సమర్పించుకోక తప్పదు. అతను ఆమె అక్రమసంబంధాలని కారణాలుగా చూపిస్తే రంజనిని వేలెత్తి చూపించడానికి ఆమె లాయర్ ఎప్పుడో సిద్ధంగా ఉన్నాడు. అందుకని స్టేటస్ కో కొనసాగించారు ఆ ముగ్గురూను.

బావమరిది ద్వారా ఆ టైం మెషీన్‌గూర్చి విన్న తరువాత దాన్లో సామంత్ స్వయంగా ప్రయాణాన్ని కోరుకోవడానికి కారణం ఈశ్వర్– అమెరికాలో చనిపోయినవాడు, రాఘవ కొడుకు. అతడు చనిపోయింది కారు యాక్సిడెంట్లో. దాన్లో పేర్కొనబడిన రెండవ కారుని డ్రైవ్ చేస్తున్న సామంత్ తాగివున్నాడనడానికి సాక్ష్యాధారా లున్నాయన్నాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్. ఏక్సిడెంట్ అయినచోట సామంత్ బ్లడ్‌ని పరీక్ష చేసినప్పుడు చట్టపరిమితిని మించి చాలా అధికంగా అతని రక్తంలో ఆల్కహాల్ ఉందని తేలిందన్నాడు. లేదు, ఈశ్వర్ తాగి ఉండడమేగాక నైట్‌క్లబ్‌లో తగాదాపడి బయటకొచ్చి కోపంగా డ్రైవ్‌చేసి రెక్‌లెస్‌గా ఉండడంవల్ల ఫలితాలని అనుభవించాడు, తన క్లయింట్ నిమిత్తమాత్రు దన్నాడు సామంత్ లాయర్. డబ్బున్న వాడవడంచేత కేసు విచారణ అయ్యేదాకా బెయిల్ తీసుకుని సామంత్ మామూలుగానే తనపనులని చేసుకుంటున్నాడు.

ఈ కేసు ఎలా ముగుస్తుందో అతను తెలుసుకోవా లనుకోవడంలో తప్పులేదు. దానికోసం టైం మెషీన్లో ప్రయాణించాలని ఆశపడడంలో కూడా ఆశ్చర్యమేమీ లేదు. అయితే అతనికి దేశం వదిలి బయటకుపోవడానికి అనుమతి లేనందువల్ల రంజనిని పంపించాడు సత్యా దగ్గరికి. సత్యాని కలిసినప్పుడు రంజని కొద్దిగా తొట్రుపడినమాట నిజమేకాని, సత్యామాత్రం పట్టించుకోలేదన్నారు చూసినవాళ్లు. "లైన్లో ముందుకు రావడానికి రంజని తనని నా భార్యగా చెప్పుకుంది!" అని నాతో చెప్పి పడీ పడీ నవ్వాడు సత్యా. "ముందుగా నెల తరువాతి భవిష్యత్తుతో మొదలుపెట్టి, ఆపైన రెణ్ణెల్లకి వెళ్లిందిగానీ ఆమె వచ్చిన పనికిమాత్రం అంతకన్నా ముందుకి వెళ్లవలసిన పనిలేకపోయింది. టైం మెషీన్‌లోంచి బయటికి వచ్చినప్పుడు ఆమెకీ, సామంత్‌కీ నచ్చేలా కోర్టులో తీర్పు వచ్చిందని తెలిసినట్లుగా ఆమె మొహంలో పెద్ద రిలీఫ్ కనిపించింది. అయితే అంతటితో ఆగవలసింది! అనవసరంగా మళ్లీ మెషీన్లో దూరి ఆర్నెల్ల ముందుకెళ్లింది. నచ్చనిదేదో కనిపించింది. బయటి కొచ్చినప్పుడు మొహం మాడిపోయి ఉంది," అన్నాడు సత్యా నాతో.

వాడీ కథ చెప్పినప్పుడు నేను వాడిదగ్గరే ఉన్నాను. ఈ కథా కమామీషూ నాకు కూడా కొద్దిగా భవిష్యత్తులోకి ప్రయాణించాలన్న కోరికని కలిగించడంలో తప్పేంలేదని మీరు ఒప్పుకుంటారు. వాడడిగితే, ఏదో ఉజ్జాయింపుగా భవిష్యత్తులో ఒక తేదీ చెప్పాను. నాకేదో నోబెల్ ప్రైజువస్తుందని గానీ, లాటరీలో వందల మిలియన్ల డాలర్లు

కొట్టేస్తానేమోనని తెలుసుకుందామని గాదు. ఏదో చిన్న కుతూహలంతో అంతే. అయితేనేం ఎదురయిన అనుభవం మాత్రం మళ్లీ హార్ట్‌రేట్‌ని అధికంగా పెంచేసి చెమటలు పోయించేదే!.

వెల్లకిలా మంచంమీద పడుకుని వున్నాను– అమెరికాలోని మాయింట్లో, నా బెడ్డుమీదనే. అయితే, నిద్రపోవడంలేదు. రంజనిగూర్చి, సామంత్‌గూర్చి, రాఘవగూర్చి ఏవో అస్పష్టంగా ఆలోచనలు. ఇంతలో క్రింద కాలింగ్‌బెల్ శబ్దమవడం, మా ఆవిడ తలుపు తియ్యడం లీలగా వినిపించింది. ఆవిడ అడ్డుపడుతున్నా వినకుండా, “రెండు నిముషాలే మేడం” అంటూ హైదరాబాద్ తెలుగు ఏక్సెంటులో వినిపించిన మాటల తరువాత ఆ వచ్చినవాళ్లు పైకి వస్తున్నట్లుగా మెట్లమీద అడుగులచప్పుడు వినిపిస్తుంటే, ఎందుకో గుండె వేగం కొద్దిగా పెరగసాగింది. వాళ్లు బెడ్‌రూంలోకి రావడానికి ఎంతోసేపు పట్టలేదు. వాళ్లు ఇద్దరు. వాళ్లని చూడగానే నాకు కోపమొచ్చింది. “ఆవిడ వద్దంటున్నా వినకుండా ఇక్కడికి రావడానికి మీకు ఎటికేట్ లేదా?” కోపంగా ప్రశ్నించాను.

“కోపం తెచ్చుకోకండి సార్. మేమడిగిన ప్రశ్నలకి సమాధానమిస్తే అందరం ఎవరి దారిన వాళ్లం త్వరగా వెళ్లిపోవచ్చు. మేమిక్కడికొచ్చిన పనికూడా త్వరలోనే అయిపోతుంది,” వాళ్లలో ఒకడన్నాడు.

“నా ఇంట్లోకొచ్చే కోన్‌కిస్కాగాళ్లకి నేనెందుకు జవాబు చెబుతాను?” నాకు కోపం పెరిగిపోతోంది. వాళ్ల మొహాలని అప్పటిదాకా చూడలేదు మరి!

“మీ ఇండియా పోలీసులకి ఇక్కడికొచ్చి ప్రశ్నించడానికి అధికార మెవరిచ్చారు?” మా ఆవిడ కోపంగా ప్రశ్నించింది. యూనిఫాం వేసుకోకపోయినా, ఆమెకి తామెవరో క్రిందనే చెప్పినట్లున్నారు. వాళ్లు పోలీసులన్న మాటను విని నేను స్టన్‌అయ్యాను గానీ, వెంటనే తేరుకున్నాను. “జానకీ, నువ్వు 911కి ఫోన్ చెయ్యి!” ఆమె నాదేశించాను. అమెరికా పోలీసులొచ్చిన తరువాత ఆ వెధవల సంగతి తేలిపోతుంది.

“అలా చేస్తే మీకే నష్టం. మీ అమెరికన్లు దేశసరిహద్దులని దాటనీయరాదని ఆంక్ష విధించిన వస్తువులని మీరు ఇండియాకి చేర్చారని వాళ్లకి సాక్ష్యాధారాలని మేమంద జెయ్యాలని కోరికగా ఉందా? ఆ తరువాత అమెరికాలో కటకటాలు లెక్కపెట్టుకుంటూ కూర్చుంటారు!” వాళ్లలో ఇంకొకడన్నాడు.

వాళ్లు నన్ను బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు క్లియర్‌గా తెలుస్తోంది. నేను ఇండియాకి పట్టుకు వెళ్లిన వాటిలో వేటికీ నేను పర్మిషన్ తీసుకోవాల్సిన అవసరమేమయినా ఉంటుందేమో నన్న ఆలోచన కూడా నాకు రానిమాట నిజమే. కానీ అందరు ఇండియన్లకన్న నేనెక్కువ ఏం పట్టుకెళ్లానని? ప్రతి వస్తువూ ఓపెన్ మార్కెట్లో కొన్నదే! అయినా, నా నుదుటిమీద చెమటలు పట్టడం మొదలయింది. గుండెవేగం పెరగడం తెలుస్తోంది. “నేను ఏ చట్టమూ ఉల్లంఘించ లేదు. ఎవడికి చెప్పుకుంటావో చెప్పుకో, ఫో!” గట్టిగానే అరిచినట్లున్నాను.

చేతికందిన దాన్ని వాళ్లమీదకి విసురుదామని ప్రయత్నించబోయానుగానీ, చెయ్యి కదలనంటోంది. నా వాలకాన్ని చూసిన జానకి "అయ్యో, ఇవాళే హాస్పిటల్ నుంచీ వచ్చింది. ఆయనకి స్పృహతప్పి..." అనడం లీలగా వినిపించింది. టైం మెషీన్లోంచి బయటికొచ్చేటప్పటికి మళ్లీ వంటినిండా చెమటలే. ఈసారి మాత్రం నన్ను చూడగానే సత్యాకి నవ్వేమీ రాలేదు. నా అనుభవాన్ని గూర్చి వాడేమీ అడగలేదు. నేను కూడా బాగా డిస్టర్బయ్యాను. వాడికి కూడా ఏమీ చెప్పాలనిపించక పోవడంవల్ల చెప్పలేదు.

రంజని అమెరికాకి తిరిగివచ్చిన తరువాత రెణ్ణెల్లు కాకుండానే సామంత్‌ని నిర్దోషిగా ప్రకటిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. టైం మెషీన్ సంగతి తేల్చుకోవడానికి సామంత్ ఇండియా వెళ్లాడు. తేల్చుకోవడానికి అని ఎందుకన్నానంటే సత్యా సృష్టించిన కాలయంత్రం ఈ రెణ్ణెల్లల్లో ఎంతమంది సామాన్య ప్రజానీకం చేత విపరీతమయిన ఖర్చులని పిల్లల కోచింగుల కోసం లేక ఖరీదయిన వైద్యాలకోసం భరించవలసిన భారాన్ని తొలగించిందో, దానివల్ల ఎంతమంది అతని సంగతి తేల్చుకోవడానికి రెడీగా కూర్చున్నారో మీరూహించగలరు. ఆ బాధ్యతని సామంత్ తన భుజాలమీద కెక్కించుకున్నాడని అతని బావమరిది ద్వారా విని కష్టకాలం గట్టెక్కే సమయం ఆసన్నమయిందని వాళ్లు కుదుటపడ్డారు.

సామంత్, "అయిందేదో అయింది" అని మొదలుపెటి, "ప్రతీ ఇంట్లోకి ఒక టీవీని చేర్చగలిగినట్లే ఇంటింటికీ ఒక టైం మెషీన్‌ని అమర్చగలిగితే, వెలనిబట్టి భవిష్యత్తులో ఎంతదాకా చూడవచ్చో నిర్దేశించేలా ఎన్నో రకాల మోడల్స్‌ని తయారుచేసి అమ్మితే, వాటివల్ల ప్రపంచంలోని అన్ని మూలలనుండీ వచ్చే లాభాలకి అంతే ఉండదనీ, ఇంత దివ్యమయిన టెక్నాలజీని అప్పటికే అయిదేళ్లపాటు సొమ్ము చేసుకోవడానికి వినియోగించకుండా వృధా చేశాడనీ, తన కంపెనీ వాటి తయారీని, అమ్మకాలనీ చేబడితే యాభై శాతం వాటా సత్యా దేనని," ఇంకా ఎన్నో చెప్పాడు. అయితే సత్యా మాత్రం అవేమీ పాటించడానికి సిద్ధంగా లేడు. ఈ టెక్నాలజీని వినియోగించి, భవిష్యత్తులో సాంకేతిక అభివృద్ధి ఇంకా ఎంత జరుగుతుందో తెలుసుకుందామని అతని ఆశయం. ఈ ప్రజల తాకిడికి అది సాధ్యం కావడంలేదు. పైగా, అప్పటిదాకా ప్రజలకి ఒనగూరుతున్న లాభాలని చూసి అసలు తన మొదటి ఆశయం సమంజసమేనా అన్న మీమాంసలో ఉన్నాడు.

"నీ ఆశయం సమంజసమైనదే. ఈ ప్రజలు నిన్ను అనవసరంగా తప్పుదారి పట్టిస్తున్నారు. ఈ మెషీన్ సంగతీ, ఈ ప్రజల సంగతీ నాకు వదిలెయ్. నువ్వు నీ రీసెర్చ్ సంగతి చూసుకో!" అన్నాడు సామంత్.

"నువ్వు నన్ను సరిగ్గా అర్థం చేసుకోలేదు. ఏ రీసెర్చ్ చేసినా అది ఎంతో కొంత సామాజిక అభివృద్ధిని ఆకాంక్షించే చెయ్యాలి. ఇలాంటి మెషీన్లు ఇంకొన్ని ఉంటే ఇంకా ఎక్కువమందికి ప్రయోజనం ఒనగూరే మాట నిజమే. కానీ, నువ్వు పెట్టే ధరలు వీటిని

ఎక్కువమందికి అందుబాటులో లేకుండా చేస్తాయి. ఇవాళ ఖరీదయిన హాస్పిటళ్లని నడిపే వాళ్లు ప్రస్తుతం వాళ్ల దగ్గరున్న పరికరాలన్నింటినీ చెత్తకుప్పలో పడేసి ఈ కాలయంత్రాలతో డబ్బు చేసుకోవడం మొదలెడతారు. ఒకపక్క నుంచీ సామాన్య ప్రజలకి మేలు చేయాలనుకుంటూ, ఇంకో పక్కనుంచీ ఇలాంటి పరిస్థితిని వాళ్లకి ఎలా కల్పించగలను? ఎడిసన్ కనిపెట్టిన లైట్ బల్బు ఈనాటికీ ప్రపంచమంతటా సామాన్య మానవులకికూడా ఎంతో ఉపయోగపడుతోంది. నా రీసెర్చ్ కూడా అంతటి ప్రయోజనాన్ని చేకూర్చాలనేది నా ఆకాంక్ష. కానీ అది ఎలాంటి రీసెర్చ్ వల్ల సాధ్యమవుతుందన్నదే నాకు అవగాహనకు రాని విషయం. ప్రస్తుతానికి ఇలాంటి వాటిని తయారుచెయ్యడమే నాకు ఉత్తమ మార్గంగా కనిపిస్తోంది. అది కూడా నేను చేస్తే తప్ప నే నాశించినంత ప్రయోజనముండదని కూడా నాకు తెలుసు. అందుకే అలా చెయ్యడానికి చాకులాంటి కుర్రాళ్ల సహాయం తీసుకున్నాను!" అన్నాడు సత్యా.

సామంత్ మెదడులో జరగాల్సిన కార్యక్రమం రూపు దిద్దుకున్నది. పైకి మాత్రం, నిరాశగా మొహం పెట్టి, "నీ సంగతి తెలిసిందేగా, కానీయ్. అయితే నన్ను కూడా కొద్దిగా భవిష్యత్తులోకి తొంగి చూడనిస్తావా?" అన్నాడు. అయితే ఆ మెషీన్లోకి వెళ్లేముందర "ముందు నువ్వెళ్లి రాకూడదూ? ఈ డొక్కు రేకుల్ని చూస్తే భయమేస్తోంది!" అన్నాడు.

సత్యా నవ్వేసి కాలచక్రాన్ని ఒక నెల తరువాతకి (కాలయంత్రంతో పనిలేకుండానే, భవిష్యత్తుని ఊహించడం వల్ల నయ్యుండాలి!) సెట్‌చేసి, ఆ మెషీన్లో పది నిముషా లున్నాట్ట. తరువాత సామంత్ అందులో కెళ్లాట్ట. అతను బయటికొచ్చిన తరువాత గర్వంగా "నువ్వు రెండ్రోజుల్లో ఫినిష్. కేలండర్‌మీద రాసుకో!" అన్నాట్ట. సత్యా నవ్వి, "ఆ తరువాత వారం రోజులకే నువ్వు!" అని తలపక్కకు వాల్చేసి ఏక్షన్ చేశాట్ట. సామంత్ తలనెగరేస్తూ వెళ్లాట్ట.

* * *

ఇదంతా దీర్ఘంగా ఈమెయిల్లో రాశాడు. హఠాత్తుగా హార్ట్ బైపాస్ సర్జరీ చేయించుకోవలసి వచ్చి హాస్పిటల్లో పది రోజులు గడిపి ఇవాళ ఇంటికి వచ్చేటప్పటికి ఈ ఉత్తరం. ఇంకా ఏదో రాశాడు గానీ, ఈ అంతిమ దినాల గూర్చిన సంభాషణ గూర్చి తెలుసుకోగానే స్టన్ అయి చదవడం ఆపాను. ఇంతకుముందు ఇలాంటిది ఒకదానిగూర్చి వినివున్నాను గదా! సత్యా రాసినదాని ప్రకారం సామంత్‌కి నూకలు చెల్లాల్సినది ఈరోజే. నిన్ననే రంజనితో మాట్లాడాను హాస్పిటల్లో ఉన్నానని తెలిసి నన్ను చూడడానికి ఆమె వచ్చినప్పుడు. "రేపే గదా, సామంత్ వస్తానన్నది?" "రావాలి మరి!" ఉదాసీనంగా జవాబిచ్చింది. "ఇస్తాంబుల్‌లో ఆగుతానన్నాడు" అని జోడించింది.

వెల్లకిలా పడుకుని చదువుతున్న ఐపాడ్‌ని పక్కనపెట్టి టీవీ ఆన్‌చేసి సీఎన్ఎన్ పెట్టాను. "ఇస్తాంబుల్ కాల్పుల్లో మరణించినవారి సంఖ్య," అంటూ చెబుతున్నాడు రిపోర్టర్.

అయిదు నిముషాల్లో అప్‌డేట్ చేస్తూ, మరణించిన వారిలో సామంత్ పేరుతో ఒక అమెరికన్ ఉన్నాడని జోడించాడు.

అదిరిపోయాను. అంటే సత్యా? టైం మెషీన్ సునామీలాంటిది. టోర్నడోలాంటిది. ఆ సునామీ, టోర్నడోల గూర్చి వినడం వేరు, వాటి తాకిడి అనుభవంలోకి రావడం వేరు!

రంజనికి ఫోన్ చేశాను. హార్ట్ బైపాస్ ఆపరేషన్ అయి ఇవాళే ఇంటికొచ్చానని గుర్తు చేస్తూ మాట దాటెయ్యబోయింది. సామంత్ గూర్చిన వార్తని విన్నానని చెప్పింది గానీ ఆమె గొంతులో కొద్దిగా కూడా అనుకోనిదేదో జరిగిందన్న షాకు తాలూకు చిహ్నాలేవీ నాకు వినిపించలేదు. "రెణ్ణెల్లు ముందు కెళ్లడంతో ఆగితే బావుండేది. అనవసరంగా ఆర్నెల్లు ముందుకెళ్లింది!" అని ఆమెగూర్చి సత్యా చెప్పడం గుర్తొచ్చింది. "సత్యా ఇంట్లో టైం మెషీన్లో ఇది నువ్వు తెలుసుకున్నావుగదూ?" ప్రశ్నించాను. "ఇవాళ పోతాడని తెలుసు ఎలా పోయాడో మాత్రం ఇప్పుడే తెలుసుకున్నాను," అన్నది. "సత్యా పోతాడన్న రోజేదో సామంత్ నాకు ఫోన్‌చేసి చెప్పాడు. ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని వార్తల్లో వచ్చింది. తెలుగు పత్రికల్లో వచ్చిన వార్తలకి లింకులని ఈమెయిల్లో పంపిస్తాను," అన్నది.

ఆమె పంపేదాకా ఆగకుండా నేనే ఇంటర్నెట్లో సెర్చ్ చేసి పట్టుకున్నాను. "సైంటిస్టునని చెప్పుకుంటూ కొంతకాలంగా భవిష్యత్తుని చూపెడతా నంటూ ప్రజలని మోసంచేస్తున్న ఒక వ్యక్తి ఉదంతం నేడు వెలుగులోకి వచ్చింది. ఇప్పటిదాకా బాబాలూ, సన్యాసులూ ఇలా అమాయకులని మభ్యపెట్టడం గూర్చి విన్నాం కానీ, సైంటిస్టునని చెప్పుకుంటూ మోసం చెయ్యడంగూర్చి మాత్రం ఈనాడు మొదటిసారిగా చూస్తున్నాం. అది గూడా, అమెరికానుండి వచ్చానని చెప్పుకుంటున్న ఒక వ్యక్తి! అసలు సైంటిస్టో కాదో, అమెరికా నుంచీ వచ్చాడో లేదో నిర్ధారించేందుకు పోలీసు బలగాలు అమెరికా వెడుతున్నాయి. కానీ ప్రతీ మనిషిలోనూ అంతరాత్మ అనేది ఉంటుందనీ, అది ఎప్పుడో నాగుపాములా బుసలు కొడుతుందనీ, దానికి ఆ మనిషి తట్టుకోలేడనీ ఈ సత్యా అనే వ్యక్తి నిరూపిస్తున్నారు. తన మరణానికి వేరెవరూ బాధ్యులు కారనీ, ఇంతకాలం తను కొంతమంది విద్యార్థులని కోచింగ్ సెంటర్లలో చేర్చనీక పోవడాని కారణభూతుడై వాళ్ల భవిష్యత్తుని నాశనం చేసినందుకూ, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులకి అత్యవసరమైన ఆపరేషన్లని చేయనీకుండా అడ్డుపడి కొందరిని అల్పాయుష్కులని చేసి వారి కుటుంబాలని తీవ్రమైన మనస్తాపాలకు గురి చేసినందుకూ ఎంతో చింతిస్తున్నాననీ, వారి నందరినీ క్షమించమని వేడుకుంటున్నాననీ ఆయన తన ఉత్తరంలో పేర్కొన్నారని ఎస్పై సయ్యద్ కమ్రుద్దీన్ చెప్పారు. సత్యా జనాలని మోసగించడానికి ఉపయోగించిన మెషీన్ని కోర్టులో ఎవిడెన్స్ కింద ప్రెజెంటు చేసేందుకు చాలా జాగ్రత్తగా ఆ ఇంటినుండీ తరలించారు," ఇవీ వార్తలు!

ఇండియాలో కొన్ని ఆత్మహత్యలు ఎలా సృష్టింపబడతాయో నాకు తెలుసు గనుక సత్యా చివరి నిముషాలనీ, వాటిల్లో సామంత్ భాగాన్నీ, పాత్రనీ ఊహించగలను. లేకపోతే సత్యా ఆత్మహత్య చేసుకోవడమా! వాడి ఈమెయిల్ని మళ్లీ చదవడం మొదలుపెట్టాను.

"సామంత్ నా చివర రోజేదో చెప్పి వెళ్లిన తరువాత ఒకరోజంతా ఆలోచించాను. తరువాతే ఇది నీకు రాయడం మొదలుపెట్టాను. ఈ కాలయంత్రం ద్వారా ప్రజలు భవిష్యత్తులోకి చూడగల్గడం రెండువందల శాతం నిజమని నమ్ముతున్నాను. అలాంటప్పుడు సామంత్ చెప్పిన మాట నిజమవాలి. అయితే, నేను రేపు పోతానని చెప్పాడుగానీ, ఎలా పోతానో వాడు నాకు చెప్పలేదు. నా అనుమానం నిజమయితే వాడికి కూడా ఆ విషయం తెలిసుండదు. అలాగే వాడు పోయే రోజేదో నాకు తెలుసుగానీ ఎలా పోతాడో మాత్రం తెలియదు. సామంత్ పోతాడని రంజనికి కూడా తెలుసుగానీ ఎలా పోతాడో తెలియదు. ఈ విషయాన్ని టైం మెషీన్ దాస్తున్నట్లుగా నాకు అర్థమవుతోంది. ఎలా పోతారన్న వివరాలు గనుక తెలిస్తే అలా జరగ కుండా జాగ్రత్తపడి భవిష్యత్తునే మార్చేస్తే తన అస్తిత్వానికి ముప్పొస్తుందన్న భయం కాబోలు దానికి! (ఆనాడు పరీక్షిత్తు మహారాజుకి తానెలా పోతాడో తెలియలేదు. ఈనాడు మేమెలా పోతామో మాకూ తెలియదు!) దానికి మరీ అంత తెలివితేటలని ఆపాదించక్ఖర్లేదనుకుంటే, మేథమేటిక్స్ టర్మినాలజీని ఉపయోగించి దానికి "సింగులారిటీ" అని నామకరణం చేద్దాం! నువ్వూ ఇంజనీర్‌వే గనుక, నీకున్న విలువల గూర్చి నమ్మకమున్నవాణ్ణి గనుక ఈ యంత్రం గూర్చిన వివరాలని నీకు అందజేసే ఏర్పాట్లు చేశాను. నువ్వే తయారుచేస్తావో, ఇంకొకళ్లచేత చేయిస్తావో, లేక ఇంకా రీసెర్చ్‌చేసి సింగులారిటీని తొలగించడానికి కృషి చేస్తావో నీ ఇష్టం. (నిన్ను నిరాశపరిచేందుకని కాదు గానీ, ఒక్క విషయాన్ని గుర్తుచేస్తాను. మనకి కనిపిస్తున్న విశ్వాంతరాళమంతా బిగ్‌బేంగ్ వల్ల– అదే సింగులారిటీ వల్ల ఏర్పడిందన్న నిర్ణయాని కొచ్చారు గానీ, దాని ముందర సృష్టి ఎలా ఉండేది అన్న విషయాన్ని ఈనాడు కూడా ఎంతగొప్ప సైంటిస్టులు అయినా సరే చెప్పలేక పోతున్నారు!) ఇవాళ రాత్రి కాలయంత్రానికి పవళింపుసేవ చేసే సమయంలో దీనిలోని కీలకమైన రెండుమూడు పార్ట్‌లని తొలగించి ధ్వంసం చేస్తాను. రేపు నేనెలా పోతానో తెలియకపోవచ్చు గానీ, నేను పోగానే సామంత్ ఈ మెషీన్‌ని చేజిక్కించుకుంటాడని నాకు ప్రత్యేకంగా ఏ భవిష్యద్వాణీ తెలియ జెప్పాల్సిన అవసరంలేదు. ఇప్పటికి మాత్రం నీకు తెలిసిన భాషలో – గుడ్‌బై మై ఫ్రెండ్!"

సామంత్ సత్యా ఒకళ్ల చావుదినాలని ఇంకొకళ్లు చెప్పడం సరే – రాఘవ కూడా ఈశ్వర్ విషయంలో ఈ సంగతి చెప్పాడు కదా! అయితే, ఈ రెండు కేసుల్లోనూ సత్యాకి ఆకళింపుకి రానిదీ, నాకు అర్థమవుతున్నదీ ఒక వింత ఉన్నది. ఆ వింతకి నేనివ్వాళ "డెడ్‌మేన్ పేరడాక్స్" అని నామకరణం చేస్తున్నాను. దీనికి వివరణ నిచ్చే ముందర

ప్రపంచ వ్యాప్తంగా తెలిసిన గ్రాండ్‌ఫాదర్ పేరడాక్స్‌ని ఒకసారి గుర్తుకు తెచ్చుకోండి. "ఒకళ్లు గతంలోకి వెళ్లి తమ తాతని చంపితే, ఈనాటి వాళ్ల జీవితం ఉండకూడదు కదా, కానీ ఉన్నది. ఇదెలా సాధ్యం?" అన్నదే కదా గ్రాండ్‌ఫాదర్ పేరడాక్స్?

ఇక్కడ రాఘవ విషయంలోనూ, సత్యా విషయంలోనూ జరిగింది ఒకటే. భవిష్యత్తులోకి వెళ్లి, వాళ్లు ఇంకొకళ్ల మరణం గూర్చి తెలుసుకోగలిగారు. కానీ, అప్పటికి తాము మరణించారన్న సంగతి వాళ్లకి తెలియలేదు. పైగా, మళ్లీ వర్తమానంలోకి వచ్చిన తరువాత కూడా గుర్తుంచుకున్నారు. ఇదెలా సాధ్యం? దీనికీ నేను "డెడ్‌మేన్ పేరడాక్స్" అని నామకరణం చేసింది.

నాగూర్చే నాకిప్పటికీ అర్థం కాని విషయమొకటుంది. అది నేను మొదటిసారి టైం మెషీన్లో కూర్చున్నప్పటి అనుభవం. నేను నిజంగా ఆ పంజాబీ స్త్రీలోకి పరకాయప్రవేశం చేశానా, లేక ఆ కాలంలో ఆమే నేనా? నేనా మెషీన్లో కూర్చునేముందర సత్యా నాకు చెప్పినది తన బాల్యపు అనుభవాలని. ఆ మెషీన్ ద్వారా గతంలో కెళ్లగలిగినా, అది గతంలో ఉన్నప్పటి దృశ్యాలనే, అనుభవాలనే తిరిగి పొందగలగడాన్ని మాత్రమే సాధ్యం చేసిందా లేక తన కాలయాత్రలని సత్యా అలాంటి అనుభవాలకే పరిమితం చేసుకున్నాడా? ఆ కాలంలో ఆమే నేను అయ్యుంటే, మళ్లీ గతంలోకి వెళ్లగలిగితే ఆ క్షణాన బావిలోకి దూకకుండా ఆగగలనా? పరకాయ ప్రవేశమే చేసుంటే, సత్యా మరణించిన క్షణంలోకెళ్లి దానికి కారకులైనవాళ్లని చూడగలను. కాకపోతే మాత్రం, వాడి చావుకి కారకులెవరో ఎప్పటికీ తెలియదు. రెండు శరీరాలూ కాలగమనంలో ఒకే క్షణంతో ముడిపడి ఉంటే పరకాయ ప్రవేశం చెయ్యగలగడం సాధ్యమా? రెండు శరీరాల్లో ఒకేసారి నేనుండగలగడం మాటటుంచి, ఆ రెండో శరీరంలో అప్పటికే తిష్ఠవేసి ఉన్న జీవం సంగతేమిటి? అంటే, సత్యా మరణించే క్షణం ముందు నేను అమెరికాలో ఉన్నాను. కాలయంత్రంలో గతంలోని ఆ క్షణానికి ప్రయాణించగలిగితే, ఇక్కడ హాస్పిటల్ బెడ్‌పైన నా శరీరం, అక్కడ ఇండియాలో చావబోతున్న సత్యా శరీరంలోకి ప్రవేశించబోతూ నేనూ. ఇది సాధ్యమేనా?

ఇంతలో క్రింద కాలింగ్‌బెల్ శబ్దమవడం మా ఆవిడ తలుపు తియ్యడం, లీలగా వినిపించింది. ఆవిడ అడ్డుపడుతున్నా వినకుండా, "రెండు నిముషాలే మేడం" అంటూ హైదరాబాద్ తెలుగు ఏక్సెంటులో వినిపించిన మాటల తరువాత ఆ వచ్చినవాళ్లు పైకి వస్తున్నట్లుగా మెట్లమీద అడుగుల చప్పుడు వినిపిస్తుంటే, ఎందుకో గుండె వేగం కొద్దిగా పెరగసాగింది. వాళ్లు బెడ్‌రూంలోకి రావడానికి ఎంతోసేపు పట్టలేదు. వాళ్లు ఇద్దరు. వాళ్లని చూడగానే నాకు కోపమొచ్చింది. "ఆవిడ వద్దంటున్నా వినకుండా ఇక్కడికి రావడానికి మీకు ఎటికేట్ లేదా?" కోపంగా ప్రశ్నించాను.

"కోపం తెచ్చుకోకండి సార్. మేమడిగిన ప్రశ్నలకి సమాధానమిస్తే అందరం ఎవరి దారిన వాళ్లం త్వరగా వెళ్లిపోవచ్చు. మేమిక్కడికొచ్చిన పనికూడా త్వరలోనే అయిపోతుంది," వాళ్లలో ఒకడన్నాడు.

"నా ఇంట్లోకొచ్చే కోన్‌కిస్కాగాళ్లకి నేనెందుకు జవాబు చెబుతాను?" నాకు కోపం పెరిగిపోతోంది. వాళ్ల మొహాలని అప్పటిదాకా చూడలేదు మరి!

"మీ ఇండియా పోలీసులకి ఇక్కడికొచ్చి ప్రశ్నించడానికి అధికారమెవరిచ్చారు?" మా ఆవిడ కోపంగా ప్రశ్నించింది. యూనిఫాం వేసుకోకపోయినా, ఆమెకి తామెవరో క్రిందనే చెప్పినట్లున్నారు. వాళ్లు పోలీసులన్న మాటని విని నేను స్టన్ అయ్యానుగానీ, వెంటనే తేరుకున్నాను. "జానకీ, నువ్వు 911కి ఫోన్ చెయ్యి!" ఆమెనాదేశించాను. అమెరికా పోలీసులొచ్చిన తరువాత ఆ వెధవల సంగతి తేలిపోతుంది.

ఈ సంభాషణ ఇంతకుముందే జరిగినట్లు– కాదు, ఇంతకుముందే జరగబోతుందని తెలియడం– హఠాత్తుగా గుర్తొచ్చింది. రెండవసారి రాఘవ టైం మెషీన్లో యాత్ర చేసినప్పటి మాటగదూ ఇది? అలాగయితే, ఇలా గుర్తొచ్చిందని అప్పుడు తెలిసిందా? ఇప్పుడు జరుగుతుందని అప్పుడు తెలియడం గూర్చి ఇప్పుడు తెలుస్తుందని...ad infinitem– అంటే, అనంతంగా – అనిగదూ అంటారు ఇలాంటి లంకెలని? అమెరికాలో కటకటాలని లెక్కబెట్టడంగూర్చి వాళ్లేదో అంటున్నారు. నా హార్ట్‌రేట్ పెరగడం తెలుస్తోంది.

"అయ్యో. ఇవాళే హాస్పిటల్ నుంచీ వచ్చింది. ఆయనకి స్పృహతప్పు..."అని జానకి అనడం లీలగా వినిపించింది. కాలయంత్రంలోంచి అప్పుడు చెమటలు కక్కుతూ బయటకొచ్చాను. ఇప్పుడే మవబోతోందో తెలియదు.

(www.vaakili.com, మే 2014)

# దానిమ్మ గింజలు

కలవారై గుణవంతులై లలితులై కల్యాణ పాథోధులై
లలనా మన్మథులై సముజ్జ్వల వచో లాలిత్యులై నిత్యులై
బలవిభ్రాజితులై యశోభరితులై భాసిల్లు భాగ్యోదయుల్
తొలిజన్మంబున మిమ్ముఁ గొల్చిన మహాత్ముల్ వారు సర్వేశ్వరా!

* * *

"దాదాపు ఇరవయ్యేళ్ళుగా ప్రతీ యేటా ఇంట్లో అభిషేకం చేయిస్తున్నాం. అయిదారుగురి దాకా పూజార్లు మాచేత ఈ కార్యక్రమాన్ని చేయించారు గానీ ఇవాళ్టి ప్రత్యేకత ఇంతకు ముందెన్నడూ లేదు."

"డాక్టరుగారికి పూజార్లు నచ్చడం తక్కువ. నచ్చితే ఒక పట్టాన వదల్రు. మామూలుగానే ఆ అభిషేకం జరుగుతున్నంతసేపూ ఆయన లోకం ఆయనది. అలాంటి ఆయన్ని ఇవాళ మరేదో లోకానికి తీసుకెళ్ళారు."

"అలాంటి లోకానికి తీసుకెడతానంటే మటుకు వస్తాననే వాళ్లెంత మందుంటారమ్మా? ఇవాళ ఇక్కడ పూజ చేయించినందుకు నాకూ ఆనందంగా ఉంది. నేను మా నాన్నగారితో కలిసి చేసినప్పటి దానితో సమంగా తులతూగడం దానికి మొదటి కారణం. నాతో ఈ నాలుగ్గంటలూ వారు గొంతు కలపడం రెండవ కారణం. దాన్లో ఆయన తన్మయత్వం జెందడం మూడవది."

"ఆయన ఇంతలా తన్మయత్వం జెందడాన్ని చూసింది దాదాపు పదిహేనేళ్ల క్రితం అనుకుంటాను. విశ్వేశ్వరశాస్త్రి గారని, ఒకాయన చేయించినప్పుడు. అయితే, అది ఒక్కసారే జరిగింది. ఇప్పటికీ ఆయన్ని తల్చుకోని రోజుండదు."

"నేను ఎంత ఏకాగ్రతతో సర్జరీలని చేస్తానో ఆయన అంత ఏకాగ్రతతోనూ, శ్రద్ధగానూ అభిషేకం చేయించారు. నేను సర్జరీలని చేసేటప్పుడు మాన్యువల్స్ చూస్తూ చేస్తానంటే

కుదుర్తుందా? అలాగే, ఆయన కూడా ఏ పుస్తకాన్నీ చూడకుండా మొత్తం కార్యక్రమాన్ని చేయించారు. అదీ ఆయన గొప్ప. మళ్లీ, ఇదిగో, ఇవాళ మీరు. అప్పటి విశ్వేశ్వరశాస్త్రి గారికంటే కనీసం పదేళ్లు చిన్న. నిజం చెబుతాను. మీరు మా యింట్లో అడుగు పెడుతున్నప్పుడు మిక్స్‌డ్ ఫీలింగ్స్ కలిగాయి. ఒక పక్కనేమో ఇంత చిన్న కుర్రాడేం చేయిస్తాడని! రెండో పక్కనించీ, ప్రస్ఫుటంగా కనిపించిన మీ మొహంలోని వర్చస్సు."

"ఇంక ఆయన మిమ్మల్ని వదలరు. ఇక్కడున్నన్నాళ్లూ మీరు మా యింట్లో కార్తీకపౌర్ణమికీ, మహాశివరాత్రికీ బుక్కయిపోయారు."

"ఆవిడ చెప్పింది అక్షరసత్యం. మా బావమరిది మనవడు నాకొక వజ్రాన్ని అందించాడు."

"వాడు ఎంత చెప్పినా ముందీయన వినలేదు. 'నా రూమ్మేట్ తాతయ్యా!' అని మొత్తుకున్నాడు. పైగా, 'వాళ్లింట్లో పూజా పునస్కారాలుంటే వాడికి వీటిగూర్చి సరిగ్గా తెలిసేది!' అన్నారు నాతో. వాణ్ణి గుచ్చి గుచ్చి మరీ అడిగారు. 'ఆయన ఏ గుళ్లో పనిచేస్తున్నార్రా?' అని. వాడు జవాబివ్వకుండా దాటేశాడు. అది ఈయన అపనమ్మకాన్ని ఇంకా పెంచింది. వాడికి మర్చిపోకుండా థాంక్స్ చెప్పండి! ఒరేయ్ రమేషూ, ఇలా రారా! మీ తాతయ్య నీకు థాంక్స్ చెబుతార్ట!"

"నేను చెప్పేదాకా పోరుతూనే ఉంటావు గానీ,... వాడికి వినపడ్డట్టు లేదు. ఎవరితోనో మాట్లాడుతున్నాడు. పంచామృతాలతో అభిషేకం చెయ్యడం తెలుసు. పళ్లరసాలతో గూడా చేశాం. ఈ దానిమ్మగింజలతో చెయ్యడమే ప్రత్యేకంగా ఉంది. ఇది మీ శాఖ ప్రత్యేకతా?"

"మా నాన్నగారి ప్రత్యేకత. దాన్ని వివరించాలంటే ఒక కథ చెప్పాలి. బాగా పొద్దు పోయింది. మిగిలిన గెస్టుల సంగతికూడా చూడాలేమో?"

"శ్రీకృష్ణుడు మథురానగరిలో కంసుడింటికి వెళ్లే దారిలో సుదాముడి ఇంటి ముందాగుతాడు. ఆ సుదాముడు ఎంతకాలంనుండో శ్రీకృష్ణుణ్ణి చూడాలని తపిస్తున్నాడు. అతణ్ణి, నీకేం కావాలో కోరుకొమ్మన్నాడు కృష్ణుడు. సుదాముడు,

"నీ పాదకమలసేవయు
నీ పాదార్చకులతోడి నెయ్యమును నితాం
తాపార భూతదయయును–

"తనకిమ్మంటాడు. మీకీ పోతనపద్యం తెలిసే ఉంటుంది. ఇప్పుడిక్కడ రెండవపాదం వర్తిస్తుంది. అలా కూర్చొని చెప్పండి."

* * *

"ఏమ్మా, బజారంతా వెదుకుతున్నావు? నీక్కావల్సిందేమీ దొరకలేదా?"

"ఎవరండీ మీరు?"

"ఎవరేమిటమ్మా, ఈ సందు చివర్లో ఎప్పట్నించో ఉంటున్నాము, నీకు తెలీదా? అవున్లే, ఈ మధ్యనేగా ఆయింట్లో చేరారు! ఇంకా ఊరూ, వాడా కొత్తగా ఉండడంలో వింతేముంది?"

"మిమ్మల్ని చూస్తుంటేనేమో, ఒకపక్క మా అమ్మమ్మలాగా నిండైన తెల్లని, ఒత్తైన జుట్టుతో, నుదుటేమో రూపాయబిళ్లంత బొట్టుతో కనిపిస్తున్నారు. కానీ, నామీదో కన్నేసి ఉంచినట్లు నా వివరాలని చెబుతుంటేనే భయమేస్తోంది!"

"మీరు అమెరికానించీ తిరిగొచ్చిన వాళ్లు కారూ? ఆ సంగతి ఈ వీధిలో ఎవరిని అడిగినా చెబుతారుగదా! నాకు తెలియడంలో వింతేముంది?"

"అక్కడికి వెళ్లేముందర కూడా ఈ ఊళ్లోనే ఉన్నాం గదా! అది గుర్తుకు రాదేం ఎవరికీ?"

"అప్పుడు మీరీ వీధిలో లేరు గదమ్మా?"

"ఆయనక్కడ రెండేళ్లున్నారు. నేను పట్టుమని పదినెల్లుగూడా లేను. అందరి లాగానే మీరూ నోరు నొక్కుకు నుంటారు. బంగారంలాంటి ఉద్యోగాన్నొదిలేసి వెనక్కి రావడ మేమిటని! పైగా, గ్రీన్‌కార్డ్ కూడా చేతికొచ్చిన తరువాత."

"దానిదేముందమ్మా, మీకు వెనక్కి రావాలనుంది, వచ్చారు. ఆ మల్లికార్జునస్వామే మిమ్మల్ని రప్పించుకున్నారేమో!"

"అలా అని మీరు నమ్ముతారేమో గానీ ఇంకెవరూ నమ్మరు. అంది వచ్చిన అవకాశాన్ని చేతులారా జారవిడుచుకుంటున్నామనే అంటున్నారంతా– మా అమ్మానాన్నలతో సహా! ఆ సోమేశ్వరశాస్త్రి గారయితే సరేసరి. ఆయన నోటిముందు కూడుని తన్నుకుపోయినట్లు వాళ్లావిడ ఎంత ఇదయిపోతోందో తెలుసా? ఆవిడకెన్ని విషయాలు తెలుసో! ఆర్నెల్లపాటు అమెరికాలో లేకపోతే గ్రీన్‌కార్డ్ మురిగిపోతుందట! వాళ్లకే ఇలాంటి అవకాశమొస్తే చచ్చినా వదులుకోమని చెప్పింది."

"మీ ఆయన గుళ్లో సెలవుపెట్టి అమెరికాలో ఉన్నన్నాళ్లూ ఆ పోస్ట్‌లో టెంపరరీగా పనిచేశాడు గదా! మీరు అక్కడే సెటిలయితే ఆ పోస్టులోనే పర్మనెంట్ అవుతానని ఆశపడ్డాడు! ఇప్పుడేమో, వేరే పూజార్లు సెలవు పెట్టినప్పుడు మాత్రం వారానికి ఒకట్రెండు రోజులు గుళ్లో పని. మిగిలిన సమయంలో పెద్దగా వెసులుబాటు కావట్లేదు మరి! మీరు తిరిగొచ్చి అప్పుడే అయిదునెలలు కావట్లేదూ? ఈ నెలరోజుల్లో తన బతుకుబాట ఎటువైపు మళ్లుతుందోనన్న ఆందోళన అతనిది. ఇంతకీ మీ ఆయన మనసు ఎటువైపు మొగ్గుతోంది?"

"మా కాశీనాథ్‌కి రెణ్ణెల్ల క్రితం ఉపనయనమైందని మీకు తెలిసే ఉంటుంది. వాడికి ఎనిమిదవ ఏడు రాగానే ఆ కార్యక్రమం చేద్దామనే అక్కడ ఉద్యోగాన్నొదిలేసి వచ్చింది.

తరువాత ఆయన దారిలోనే వెళ్లి వాణ్ణి వేదపాఠశాలలో చేరుద్దామని సంకల్పం. కానీ, వెనక్కి వచ్చిన తరువాత ఒక నెలనించీ ఆ నిర్ణయం సరైనది కాదేమోనని సందేహం. కానీ, నాతో ఏమీ చెప్పరు. మూడీగా ఉంటున్నారీమధ్య.”

“సందేహమెందుకమ్మా? తండ్రిదారిలోనే కొడుకు వెళ్లడంలో తప్పేముంది? అది మంచిదారి కాకపోతే అనుకోవాలిగానీ!”

“వెనక్కి వచ్చేముందర అక్కడ ఒకళ్లింట్లో అభిషేకం చేయించారు. ఇంటికొచ్చిన దగ్గర్నుంచీ, అదెంత పెద్దయిల్లో, ఆ యింటాయన ఎంత శ్రద్ధగా అభిషేకం చేశాడో, అవుతున్నంతసేపూ తనతో గొంతెట్లా కలిపాడో, అంత పెద్ద ఉద్యోగం అక్కడ చేస్తూ కూడా ఆయనకి వేదమంత్రాలు ఎన్ని కంఠతా వచ్చోనని ఒకటే పొంగిపోవడం!”

“నేను సందేహం దేనికని అడిగితే, ఇది చెబుతున్నావేంటి?”

“అటే వస్తోంది. ఆయన తనని తాను ఒకటే తంత్రం తెలిసిన మాంత్రికుడి లాగానే చూసుకోవడం మొదలుపెట్టారు. అదే, ఆ అమెరికా ఆయన అయితే – గొప్ప ఉద్యోగం చేస్తున్నారు, ఇటు వేదాలూ నేర్చుకున్నారు. కొడుకు కూడా అలానే రెండు రంగాల్లో నిష్ణాతుడయ్యే అవకాశముంటే తను దాన్ని అనవసరంగా చెడగొడుతున్నానేమోనని సంకోచిస్తున్నారని నా నాష్మకం.”

“మరి, బయట బళ్లోవేసి చూడొచ్చుగదా కొన్నాళ్లు?”

“ఆ బడి కెళ్లొచ్చి చివరకు ఈయన ఆశయాలకి విలువ నివ్వడం మానేస్తాడేమోనని భయం. ఇదంతా మీకెందుకు చెబుతున్నానో నాకు అర్థంకావడంలేదు. మా అమ్మా వాళ్లింటి కెళ్లి వచ్చిన దగ్గర్నుంచీ– అదే, అమెరికానించీ వచ్చిన తరువాత– ఆయన పరిస్థితి చూస్తుంటే బెంబేలెత్తుతోంది. ఎవరికి చెప్పుకోవాలో తెలియట్లేదు. అందుకే కాబోలు మీతో ఇలా లొడలొడా వాగేస్తున్నాను!”

“అలా అనకమ్మా! నువ్వేకదా, నన్ను మీ అమ్మమ్మలా ఉన్నానన్నావు? అంటే, అమ్మని గన్న అమ్మని. నాకు చెప్పుకోవడానికి భయమెందుకు? ఆయన నిన్నేమయినా అన్నాడా?”

“అయ్యోరామ! ఆయన నన్నేమయినా అంటే ముందసలు ఆయన నాతో మాట్లాడినట్లు గదా!”

“పోనీ, నువ్వు మీ వాళ్లింటి కెళ్లొచ్చినందు కేమయినా కోపమా?”

“ఛ. ఛ. అదేం లేదండీ! కొవ్వూరునుంచీ వచ్చిన తరువాత అక్కడ విశేషాలు చెబుతూ, మహాశివరాత్రినాడు ఏమయిందనుకున్నారు? అంటూ మొదలుపెట్టాను. అక్కడ గోదావరి ఒడ్డున గోష్పాదలింగేశ్వరస్వామివారి ఆలయముంది కదా! అక్కడికి, మా అమ్మ కాశీని తీసుకుని వెళ్లింది. వాడు, గోదావరిలోంచి బిందెలు బిందెలు నీళ్లు మోసుకొచ్చి శివలింగమ్మీద పొయ్యడం చూశాడు. అట్లా నీళ్లు గుమ్మరిస్తుంటే శివుడికి ఊపిరెట్లా ఆడుతుందని అడిగాట్ట. నీకు మీ నాన్న బుద్ధులొచ్చాయ్‌రా అని ఆవిడ ఒకటే మురిసిపోవడం.”

"మనవడికి ఆవిడ జవాబిచ్చారా, లేదా?"

"మీరూ ఆయనలాగే అడిగారు. ఆ శివుడి నెత్తిన గంగమ్మే ఉండగా, ఈ బిందెల నీళ్లెంతరా? అన్నదిట మా అమ్మ. అవునుగదా, ఆ సంగతే మర్చిపోయాను అన్నాట్ట వాడు."

"మరి మీ ఆయనకి ఆ జవాబు నచ్చిందా?"

"నేనిలా చెప్పానా? ఆయనట్లా గుడ్లప్పగించి చూస్తూ నిలబడిపోయారు– ఎలక్ట్రిక్ షాక్ కొట్టినవాడిలాగా. అప్పట్నించీ ఇంట్లో ఉన్నప్పుడల్లా ఏదో ఆలోచిస్తూనే ఉంటారు. ఆ గుళ్లో ఏం చేస్తుంటారో ఆ దేవుడికే తెలియాలి!"

"ఆయనకి తెలుస్తూనే ఉందమ్మా. ఇంతకీ నువ్వు దేనికోసం బజార్లో వెదుకుతున్నావు?"

"చూశారా, ఎక్కడ మొదలుపెట్టి ఎక్కడికి చేరామో? మిమ్మల్ని చూడగానే హృదయం విప్పి చెప్పుకోవాలన్న ఆతృతతో మర్చేపోయాను. ఆయనకి దానిమ్మపళ్లంటే ఇష్టం. మామూలుగా అయితే, పొద్దున్నపూట వచ్చి కొనుక్కెడుతూంటాను. ఈయన గూర్చిన ఆందోళనలోపడి ఇవాళ చీకటిపడిన తరువాత గానీ ఆ సంగతి గుర్తుకురాలేదు. ఇప్పుడు ఎక్కడా ఒక్కపండూ కనిపించట్లేదు."

"ఓస్ అంతేనా! ఈ సంచీ తీసుకో. దీన్నిండా దానిమ్మపళ్లే."

"అన్నింటినీ నాకిచ్చేస్తే మీరేం తింటారు? ఒక పండు చాలు."

"తీసుకోమ్మా! పిల్లలు కలదానివి. ఓ రెండ్రోజులు తినండి."

"మీరు గుడివైపు నడుస్తున్నారు. గుళ్లోకి తీసుకెడుతున్నారేమో?"

"తనకివ్వడానికి తీసుకెడుతున్నదాన్ని నీలాంటివాళ్లకిస్తే ఆ శివుడేమీ అనుకోడమ్మా. పైగా, ఆనందిస్తాడు కూడాను!"

"ఒకటి, రెండు పళ్లకయితే చేతిలో డబ్బులున్నాయి గానీ, ఇన్ని పళ్లకిలేవు. మీ ఇంటి అడ్రసు చెప్పండి. రేపువచ్చి డబ్బులిస్తాను."

"గుడివీధిలో భ్రమరాంబగారి ఇల్లంటే ఎవరయినా చెబుతారు."

* * *

"విశాలా! ఇవాళ గుళ్లో ఎంత అద్భుతం జరిగిందో తెలుసా?"

"మీ మొహంలో ఇంత ఆనందాన్ని ఈ మధ్యకాలంలో చూళ్లేదు! అంటే, అది అద్భుతమే అయ్యుండాలి. ముందీ నీళ్లు తాగి ఆయాసాన్ని తీర్చుకుని చెప్పండి."

"గుళ్లో ఎవర్ని కలిశానో తెలుసా? మనం ఇండియా తిరిగివచ్చే ముందర డాక్టరు గారింట్లో చేసిన అభిషేకం గూర్చి చెప్పాను, గుర్తుందా? ఆయన్ని!"

"ఆయన మిమ్మల్ని వెనక్కి తీసుకెళ్తానన్నారా?"

"అసలా ప్రసక్తిరానే రాలేదు!"

"మరి?"

"గుళ్లో లింగం దగ్గర కూర్చుని ఆ లింగంమీద అందరూ నీళ్లు పోస్తున్నప్పుడు ఆయన 'నమస్సోమాయ చ' అంటూ గొంతువిప్పగానే తలెత్తిచూసి గుర్తుపట్టాను. ఆయన నా ఎదురుగానే, లింగానికి అవతలపక్క కూర్చున్నారు గానీ నన్ను చూళ్లేదు. ఆయన దోసిలి పడితే వాళ్లావిడ ఒక చిన్న సంచీ విప్పి ఆయన దోసిట్లో ముత్యాలు పోసింది. వాటితో ఆయన ఆ మల్లయ్యకి అభిషేకం చేశారన్నమాట! ఆయన ఎర్ర ఉత్తరీయం, ఆవిడ ఎర్ర పట్టుచీరె రంగులో ఆ ముత్యాలు బలే మెరిసిపోయాయిలే. అక్కడున్న అందరం విస్తుపోయాం. అలాంటి దెప్పుడూ నేనే గాక ఎంతో కాలంగా అక్కడ పనిచేస్తున్నవాళ్లు కూడా ఎవరూ చూళ్లేదట! తరువాత బయటికొచ్చి ఆయన్ని కలిసి మాట్లాడాను. 'మీరు రత్నాల తోటీ, వజ్రాలతోటీ అభిషేకం చేసేలా ఆ శివుడనుగ్రహించుగాక!' అని ఆయన్ని మనసారా ఆశీర్వదించాను. దానికాయన ఏమన్నారో తెలుసా? 'రత్నాలూ, వజ్రాలూ రాళ్లు కదండీ! అవి ఆయనకు గుచ్చుకొని బాధపెడతాయి,' అని ఒక్క క్షణం ఆగి, 'ఈ మల్లికార్జున లింగం చిన్నది కాబట్టి నా దోసిలిలో ముత్యాలు సరిపోయాయి. మీరు ఒక్క అనువాకంతో సరిపెట్టకుండా నమకంలోని పదకొండు అనువాకాలూ చదివితే చాలేవి కాదనుకోండి, అది వేరే సంగతి. ఇంతకు ముందొకసారి ఇక్కడికి వచ్చాను కాబట్టి ఇక్కడ పద్ధతి తెలిసి ఆ ఒక్క అనువాకానికీ తయారయి వచ్చాను. అందుకని ఏ అమరావతిలోనో, అరుణాచలం లోనో, కాళహస్తిలోనో ఒక్క అనువాకానికయినా సరే – ఆ లింగానికి కావలసినన్ని ముత్యాలతో – బిందెలతో నింపిన ముత్యాలతో– అభిషేకం జరపగలిగేలా ఆశీర్వదించండి చాలు,' అన్నారు. అవాక్కై నిలబడిపోయాను."

"మీ నోట వింటుంటే నాక్కూడా ఆశ్చర్యంగానే ఉంది. వాళ్లని మనింటికి రమ్మనమని చెప్పకపోయారా?"

"నోట మాటరాక నిలబడిపోయానని చెప్పాగా! చేత్తో దీవించాను గానీ ఏమన్నానో గుర్తులేదు. మళ్లీ ఈ ప్రపంచంలోకి వచ్చేసరికి వాళ్లక్కడ లేరు."

"పోన్లెండి. ముందు కాళ్లు కడుక్కుని భోజనం చెయ్యండి. ఇవాళ బోల్డు దానిమ్మపళ్లు దొరికాయి. భోజన మయిన తరువాత వలిచిపెడతాను.

* * *

"ఈ దానిమ్మ గింజలు ఎంత మధురంగా ఉన్నాయో! ఇలాంటివి ముందెప్పుడూ తినలే దనిపిస్తుంది."

"ఇవాళ బజారుకి సాయంత్రం వెళ్లాను. దానిమ్మపళ్లెక్కడా కనిపించలేదు. వట్టి చేతులతో తిరిగొస్తుంటే ఒకావిడ ఈ సంచీ యిచ్చింది."

"ఏదో మాట్లాడాలనిపిస్తోంది విశాలా. ఒక పక్కనించీ ఆనందం. ఇంకో పక్కనించీ ఏదో వెలితి."

"ఆనందం దేనికో అర్థమైనట్లు అనిపిస్తోంది గానీ, వెలితి దేనికండీ?"

"ఆ మల్లికార్జునుడి మీద నా నమ్మకం సంపూర్ణం కాదన్న ఎరుకవల్ల."

"మీకు నమ్మకంలో లోటని ఎవరన్నారు?"

"ఎవరో అనాలా? ప్రస్ఫుటంగా కనిపిస్తుంటే! మన కాశీ కొవ్వూర్లో గోష్పాదలింగేశ్వర స్వామిని శివలింగ మనుకోలేదు. సాక్షాత్తూ ఆ శివుడేనని నమ్మాడు. ఇవాళ ఆ డాక్టరుగారూ అంతే. అమెరికా వెళ్లేముందూ, తిరిగొచ్చిన తరువాతా కూడా ఈ శ్రీశైలంలో పూజారిగా ఉండడం అదృష్టమనుకుంటూనే ఉన్నాగానీ, ఆ శివుడి సన్నిధిలో ఉన్నానన్న ఆనందా న్నెప్పుడూ పొందలేదు. అదీ వెలితి."

"ఎక్కువగా ఆలోచించి మిమ్మల్ని మీరు బాధపెట్టుకుంటున్నారు."

"కాదు విశాలా. ఆ శంకరాచార్యులు శివానందలహరిలో, 'నా మనస్సు ఒక కోతి! దాన్ని నీతో తిప్పుతూ భిక్షాటనం చేసుకో; నా మనస్సు ఒక అడవి! అందులో క్రూరమృగాలుంటాయి. అందులో ఉండి వాటిని వేటాడుకో. నా మనస్సు అతి మెత్తనయిన తామరపువ్వు! దానిమీద నీ సున్నితమైన పాదాలనుంచు! అని ఆ శివుణ్ణి కోరతారు. ఆ మొదటి రెండు ఉపమానాలూ నాకు సంపూర్ణంగా వర్తించడం వల్ల ఆ మూడవదాని ప్రసక్తేరాదు. మూడూ కూడా ఆ శివుణ్ణి పూర్తిగా నమ్మినవాళ్లకి! కానీ, నాలాగా ఆయన ఉనికి మీదే కొద్దిగా అపనమ్మకమున్న వాళ్లకికాదు. ఒక పక్కనించీ శివుడున్నాడని నమ్ముతూనే శివలింగాన్ని శివుడిలాగా కాక రాయిలా చూసే నాలాంటి వాళ్లకొక ఉపమానం దొరికితే ఎంత బావుణ్ణు!"

"శంకరాచార్యులవారు ఆ శివానందలహరిని ఇక్కడే రచించారంటారు కదా! ఆ మల్లయ్యే దారి చూపకపోడు."

"అబ్బ!"

"ఏమయిందండీ?"

"దానిమ్మగింజ పిప్పి పళ్లసందులో ఇరుక్కుంది. గింజలు రసాన్నూరుతూ మధురంగా ఉంటేనేం? వాటిని తినాలంటే ఈ పిప్పి బాధ తప్పదు కదా!"

"... ఆ చిరునవ్వేమిటండీ?"

"మల్లయ్య మార్గం చూపించాడు. అందుకు!"

"ఎలా?"

"నా మనస్సుని ఈ దానిమ్మగింజతో పోల్చి!"

"కొంచెం ఈ మట్టి బుర్ర కర్థమయ్యేలా చెప్పండి!"

"నా మనస్సులో ఆ శివయ్యమీద భక్తి లేదని అనగలవా?"

"నేను అమెరికా వెళ్లిరాలేదని అనగలనా?"

“అదే మనస్సులో ఓ మూల ఆ శివయ్య ఉనికిమీదే అపనమ్మక ముందని నాకు తెలుసు. అయితే, భక్తిని మనసునంతా ఆక్రమింపజేసి, ఆ అపనమ్మకాన్ని మనసులోంచి బయటికి పారద్రోలడానికే అహోరాత్రాలూ కృషిచేస్తున్నది. నా మనసుకి ప్రతీక ఈ దానిమ్మగింజ. ఎర్రగా మెరుస్తూ, మధుర రసాల నిముద్చుకుని మురిసిపోతూంటుంది, పిప్పిని బ్రహ్మాండంగా కప్పేస్తూ. వింతేమిటంటే, దానిమ్మపళ్లు విరగకాసేది ఆ పిప్పిని ఆధారం చేసుకుని మొలిచిన చెట్లనుంచే! కొంచెం అపనమ్మకం భక్తిని వేలంవెర్రిగా కాపుకాసేలా ఎలా చేస్తుందో?”

“ఆయన కెవరికో నెత్తిమీద యాపిలుపండు పడితే జ్ఞానోదయ మయిందట! ఈ శాస్త్రిగారికి ఒకావిడ ఇచ్చిన దానిమ్మపళ్లు తింటూ.”

“ఆవిడ అన్ని పళ్లెందుకిచ్చిందో అర్థమయింది. రేపు పొద్దున్న మన ఇంట్లో ఆ గింజలతో అభిషేకం చేద్దాం. కెంపులతో అభిషేకం చెయ్యొచ్చనే ఊహ నాకు రాలేదు ఇవాళ్టిదాకా. కానీ, ఈ గింజలు మెరుపులో వాటికేమీ తీసిపోవు. ఆ కెంపులు మెత్తదనంలో గానీ, మాధుర్యంలోగానీ వీటి దరిదాపులకి కూడా రాలేవు. ఆ శివుడికి ఎర్రటి దానిమ్మగింజలిచ్చే మెరుపుని చూడాలనుంది.

“శ్రీ విద్యుత్కలితాజవంజవ మహాజీమూత పాపాంబుధా
రా వేగంబున మన్మనోబ్జ సముదీర్ణత్వంము గోల్పోయితిన్
దేవా! నీ కరుణా శరత్సమయ మింతేచాలు; చిద్భావనా
సేవన్ దామర తంపరై మనియెదన్ శ్రీశైల మల్లేశ్వరా!

“నీ దయ అనే శరత్కాలం వచ్చి నా మనస్సనే పద్మం వికసించిందయ్యా! ధన్యుణ్ణి!”

“మామయ్యగారు శ్రీకాళహస్తీశ్వరా అని పాడినట్లు గుర్తు.”

“ఇద్దరూ ఒకళ్లే కాకపోతే ఆ మకుటం మార్పిడి అంత చక్కగా ఎలా కుదుర్తుందీ?!”

“ఇంతకీ...”

“ఏమిటి సందేహిస్తున్నావు? అభిషేకం గూర్చా?”

“అహఁ. గ్రీన్‌కార్డ్– అదే, ఆర్నెల్లపాటు అక్కడ లేకపోతే మురిగిపోతుందటగా? తేలిగ్గా వచ్చింది కాబట్టి మీకు దాని విలువ తెలియట్లేదని అందరూ అంటుంటేనూ. ఈ నెలాఖర్లోగా వెడుతున్నారా అని ఆ సోమేశ్వర శాస్త్రిగారి భార్య మరీ మరీ అడుగుతోంది.”

“నీకు వెళ్లాలనుందా?”

“అందరూ అంటున్నారని! అక్కడ మాత్రం నాకు బోర్ కొట్టింది. రోజంతా ఆ గుళ్లో మీరు, దాని పక్కన చిన్న ఇంట్లో ఇంకో రెండు మనలాంటి కుటుంబాలతో నేను. రోజంతా ఆ గుడివాళ్లిచ్చిన చిన్న టీవీ ముందు కూర్చోవడం లేకపోతే గుళ్లోకి పూలదండలని కట్టడానికో లేక కావలసిన వస్తువుల నమర్చడానికో పిలిస్తే వెళ్లడం. గుళ్లో సహాయం

చేసినందుకు నాకు వాళ్లు ముట్టజెప్పిందేమీ లేదు. ఎక్కడికయినా బయటికెళ్లాలంటే కారు లేనిదే వీలుకాని వ్యవహారం. మీరు డ్రైవింగ్ నేర్చుకున్నారు కాబట్టి కొంచెం వారాని కొకసారయినా మమ్మల్ని బయటికి తీసుకువెళ్లగలిగారు. ఆ ఇంగ్లీషా అర్థంకాదు. నాకు మాట్లాడుకోవడానిగ్గానీ పిల్లలకి బయటికి వెళ్లి ఆడుకోవడానిగ్గానీ ఎవరూ లేరు. మూడేళ్లే కాబట్టి ఎప్పుడూ నా వేలు పట్టుకునే తిరగడం వల్ల మీనాక్షికి తెలియలేదు గానీ నాకూ, కాశీకి కూడా ఇక్కడికొచ్చిన తరువాత తెరిపిన పడ్డట్లయింది. అయితే, అక్కడ గ్రీన్‌కార్డ్ పుచ్చుకుని ఐదేళ్లుంటే సిటిజెన్‌షిప్ వస్తుందటగదా, అదేదో ముక్కుమూసుకుని గడిపేస్తే అప్పుడు వెనక్కి రావచ్చు గదా అని."

"నాకు మాత్రం వెళ్లాలని లేదు విశాలా. ఈ మల్లయ్య సన్నిధిలోనే ఉంటే ఎప్పుడో ఒకప్పుడయినా ఆయన తత్త్వాన్ని అర్థం చేసుకునేటంత భక్తి అబ్బకపోతుందా అని ఆశ. మూడేళ్లక్రితం– గ్రీన్‌కార్డ్ మాటటుంచు, అసలు నేను అమెరికా వెడతాననుకున్నానా? అది రాసిపెట్టుంటే ఎలాగూ మళ్లీ రానే వస్తుంది."

"మీరు మళ్లీ వెనక్కి వెళ్లకపోతే, ఆ అమెరికా ఉద్యోగానికి మా ఆయన్ని మీరు రికమెండ్ చేసిపెట్టకూడదా అని ఆ సోమేశ్వరశాస్త్రిగారి భార్య ఒకటే పోరు పెడుతోంది."

"ఎలాగూ వాక్శుద్ధి ఉన్నవాడే. పోనీ అలాగే చేద్దాం."

"మరి కాశీ చదువు – వాడికి వేదపాఠశాలేనా లేక..."

"వాణ్ణి నా మార్గంలోనే నడిపిద్దామనుకున్నది మొదటగా నాకు దొరుకుతున్న ఆనందం వాడు కూడా దక్కించుకుంటాడని. అంతకన్నా కూడా, నన్ను ఇబ్బంది పెడుతున్న ఈ అపనమ్మకం వాడి జోలికి రాకుండా ఉంటుందేమో, చూసి తరిద్దామని. ఈ ఇంగ్లీషు చదువులు ఆ అపనమ్మకానికి అగ్నికి ఆజ్యంలా తోడై మొదటికే మోస మొస్తుందని భయమెలాగూ ఉంది. కానీ, ఆ డాక్టరుగారిని చూసిన తరువాత ఆ చదువులకీ భక్తి లేకపోవడానికీ లంకె పెట్టనక్కరలే దనిపిస్తోంది."

* * *

"నువ్వు విశ్వేశ్వర శాస్త్రి గారబ్బాయివి! ఆయన్ని చివరిసారి కలిసింది శ్రీశైలంలోనే."

"మీ నాన్న చేయించినట్లుగా ఇంకెవరూ చేయించట్లేదని – ఆ సోమేశ్వరశాస్త్రిగారితో కలిపి – దాదాపు పదిహేనేళ్లుగా ఈయనకి అసంతృప్తి."

"మా నాన్నకీ, అమ్మకీ మీరు దైవం. నేను అమెరికా వచ్చేముందు మా అమ్మ ఈ కథని చెప్పి మిమ్మల్నొకసారి కలవమని చెప్పింది. అప్పుడు తెలిసింది, నేనివ్వాళ ఈ మార్గంలో ఉండడానికి కారణం మీరు మా నాన్నకి రోల్‌మోడల్ అవడంవల్ల అని. అది నా అదృష్టమేనని చెప్పాలి. ఎందుకంటే, మా నాన్నకిలాగా శ్రీశైలం ఆలయంలో రోజూ కూర్చోగలిగే అవకాశం నాకు దాదాపు శూన్యం. ఆ ఉద్యోగాలు ప్రభుత్వమిచ్చేవి గానీ

వంశ పారంపర్యంగా సంక్రమించేవి కావు కదా! మీతో కలిసి మీ ఇంట్లో అభిషేకం చేసే అదృష్టాన్ని పొందాలని అప్పుడే అనుకున్నాను. రమేషూ, నేనూ ఒక కంపెనీలోనే పనిజేస్తూ ఇక్కడికి రావడం, అతను నా రూమ్మేటవటం ఈశ్వర కల్పితం. మాటల్లో రమేష్‌కీ మీకూ ఉన్న చుట్టరికం తెలిసింది. మీ ఇంట్లో చేసే అభిషేకాల గూర్చి అందరూ ఎంతగా చెప్పుకుంటారోనని చెప్పాడు. నేను వెంటనే ఫోనెత్తి మీ ఇంట్లో అభిషేకం చేయిస్తానంటే అది అంత తేలిగ్గా జరగదనీ అనుమానమొచ్చింది. ఎందుకంటే, నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ని. అది నా వృత్తి. ఇది నా ప్రవృత్తి మాత్రమే గనుక ఏ గుళ్లోనూ పూజలు చేయించట్లేదు. అయితే, నేను రోజునూ, వారాంతాల్లోనూ చేసే పూజలని చూసిన తరువాత రమేష్ మీకు రికమెండేషన్ ఇస్తాడన్న నమ్మకముంది. నా పూజలు చూసి భయపడి, ముందు ఎపార్ట్‌మెంట్ మారిపోతాడేమోనన్న అనుమానం కూడా వచ్చిందనుకోండి.”

“మా ఇంట్లో అభిషేకం చేయించిన ఒకట్రెండు వారాల్లో మీ నాన్న ఇండియా తిరిగివెళ్లినట్లు గుర్తు. ఆయన నీకు ఉపనయనం చేసిన తరువాత ఆయన గురువుగారి వద్దే చదువుకునేలా నిన్ను వేదపాఠశాలలో చేర్పిస్తానన్నప్పుడు, నీకు ఈ చదువుల ఆప్షన్‌ని అందుబాటులో ఉంచితే బావుండేది కదా అని అనిపించింది. అంటే, ఇంగ్లీషు చదువుల బళ్లో నిన్ను చదివిస్తూనే వేదాలు ఆయనే నీకు చెప్పేలా అన్నమాట. మా నాన్న నా కలాగే చెప్పారు. మీ నాన్నతో అంత చనువు లేకపోవడంవల్ల చెప్పలేకపోయాను. ... నిజం చెబుతావన్న నమ్మకంతో అడుగుతున్నాను. నువ్వు దానిమ్మగింజవా లేక మేలి ముత్యానివా?”

“మీతో నిజం చెప్పకపోతే నన్నా శివుడు క్షమించడు. మా నాన్నకూడా మీలాగే అడగాలా వద్దా అని చాలా సందేహించిన తరువాత నన్నా ప్రశ్నవేసి జవాబు విని నిరాశపడ్డారు.”

“నువ్వలా నిజం చెప్పినందుకు నేను మాత్రం సంతోషిస్తున్నాను. ఎందుకంటే, నేను నీకు ఒక నిజం చెప్పాలి. ఆరోజు శ్రీశైలంలో మీనాన్నతో అలా అన్న తరువాత నన్ను నేను ప్రశ్నించుకున్నాను. నాకు నిజంగా అంత నమ్మకమున్నదా ఆయన ఉనికిమీద అని. నా గుండెమీద చెయ్యివేసి, ‘ఉన్నది’ అని మాత్రం చెప్పలేనని అర్థమైంది. మనసులోలేని నమ్మకం మాటల్లో ఎలా బయటపడ్డదా అని ఇప్పటికీ ఆశ్చర్యపోతాను. దోసెడు ముత్యాలు ఆయనమీద పొయ్యడం నాకు ఆనందాన్నిచ్చిన మాట నిజమే గానీ, దోసెడు వజ్రాలతో అభిషేకం చెయ్యగలగడానికి నేను అంబానీనయ్యే సూచనలేం లేవు అప్పుడూ, ఇప్పుడూ కూడా. అయితే, అభిషేకం చేసేటప్పుడు అక్కడ ఉన్నది శివుడే అని అనుకోలేకపోతే, ఫలితం చేకూరడం మాట అటుంచి, అది ఒక తతంగంగా మాత్రమే మిగిలిపోతుందని నా అభిప్రాయం. అక్కడే నా సర్జరీల అనుభవం నాకు ఊరట కలిగించింది. నేను చేసిన సర్జరీలు అన్నీ సక్సెస్ కాలేదు. కానీ, అన్నింటిలోనూ నా ప్రయత్నం ఒక్కలాగే ఉన్నదని

ఖచ్చితంగా చెప్పగలను. ఫెయిల్ అయిన ప్రతీదానికి తిరుగులేని కారణాలని చూపించగలను. అందుకే, మీ నాన్న మా యింట్లో అభిషేకంలో చూపించిన శ్రద్ధ అన్నా, ఏకాగ్రతన్నా నాకు అంత గౌరవం. ప్రొఫెషనల్ రెస్పెక్ట్ అన్నమాట. ఆయన కూడా ఆ అభిషేకాన్ని ఫలితం కోసం చేయించలేదు. అదెవరు రాసివ్వగలరు? నా సర్జరీల్లోలాగే, అదేదో చేసేవాళ్ల కర్మఫలితా న్ననుసరించి ఉంటుంది. సర్జరీల్లో అయితే ప్రి-ఎక్జిస్టింగ్ కండిషన్లవల్ల అంటాంలే. ... మీ నాన్న మంచి ఉపమానాన్నిచ్చారు. నేనూ ఒక దానిమ్మగింజనేనయ్యా. శంకరాచార్యులవారు శివానందలహరిలో అంటారు-

"ఫలాద్వా పుణ్యానాం మయి కరుణయా వా త్వయి విభో
ప్రసన్నేపి స్వామిన్ భవదమల పాదాబ్జ యుగలం
కథం పశ్యేయం మాం స్థగయతి నమః సంభ్రమ జుషో
నిలింపానాం శ్రేణిర్నిజ కనక మాణిక్య మకుటైః"

"అని. అంటే, నీ కరుణవల్ల నేను కైలాసానికి వచ్చినా, నాకంటే ముందువచ్చి నీకు ప్రణమిల్లే దేవతలు తమ మణిమయ స్వర్ణకిరీటాలతో అడ్డంవచ్చి నీ పాదాలని నాకు కనిపించనియ్యకుండా చేస్తారు, నీ పాదాలనెట్లా చూడగలనయ్యా? అని. ఈ దానిమ్మ గింజలిచ్చే ఆ ప్రభని ఇంకెవరూ అడ్డులేకుండా ఇక్కడే సంపూర్ణంగా తనివిదీరా ఆస్వాదించవచ్చు! మీ నాన్న ఇక్కడికి ఎంత తొందరగా రాగలరో అడుగు. టిక్కెట్టుకొంటాను. ముగ్గురం కలిసి చేద్దాం అభిషేకం దానిమ్మగింజలతో."

"అవునయ్యా, ఇంతకీ మీ అమ్మ ఆ భ్రమరాంబగారిల్లు కనుక్కుని ఆవిడకి డబ్బులిచ్చిందా?"

"ఈ బామ్మగారు లూజ్ ఎండ్స్‌ని కలపకుండా కథని ముగించనీదు."

"మీకు కాబట్టి చెబుతాను. ముందు ప్రయత్నించిందట. ఎంత వెదికినా ఆ ఇల్లు దొరక్కపోయేసరికి, శ్రీశైలంలో గుడివీధిలో అందరికీ తెలిసింది ఒకే భ్రమరాంబ గారిల్లు అని అర్థం చేసుకున్నదట. ఉద్యోగంలో చేరిన తరువాత నా మొదటి నెల జీతమంతా అమ్మ ఆవిడ హుండీలోనే వేయించింది. సగం మల్లికార్జున స్వామివారి హుండీలో వేద్దామని నాన్న అన్నారు గానీ, ఆయన అర్థనారీశ్వరుడు గనుక ఎలానూ సగం పుచ్చుకుంటాడన్నది అమ్మ."

(కౌముది-రచన కథలపోటీలో బహుమతి పొందిన కథ)

(www.koumudi.net, నవంబర్ 2015)

* * *

## అజో-విభొ-కందాళం ఫౌండేషన్ ప్రచురణలు

| | |
|---|---|
| యువ నుంచి యువ దాక | : శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ: (సంపాదకుడు) |
| హంపీ నుంచి హరప్పా దాక | : శ్రీ తిరుమల రామచంద్ర |
| పద్య కవితా పరిచయం | : శ్రీ బేతవోలు రామబ్రహ్మం |
| ఇది కల్పవృక్షం | : శ్రీ వడలి మందేశ్వరరావు |
| కథాయాత్ర | : శ్రీ మధురాంతకం రాజారాం |
| మరపురాని మనీషులు | : శ్రీ తిరుమల రామచంద్ర |
| సాహితీ వైజయంతి | : శ్రీ అక్కిరాజు రమాపతిరావు: (సంపాదకుడు) |
| ఉన్నమాట | : శ్రీ యం.వి.ఆర్.శాస్త్రి |
| ఏది చరిత్ర? | : శ్రీ యం.వి.ఆర్.శాస్త్రి |
| వ్యాసగౌతమి | : శ్రీ బేతవోలు రామబ్రహ్మం |
| నాట్యావధానం | : శ్రీ ధారా రామనాథ శాస్త్రి |
| నేను, ఆంధ్రవిశ్వవిద్యాలయము | : శ్రీ వి.వి.రామనాథం |
| మృచ్ఛకటికం | : శ్రీ బేతవోలు రామబ్రహ్మం |
| మన ఆంధ్రరత్న | : శ్రీ కరణం సుబ్బారావు |
| విశ్వనాథ సౌందర్య దర్శనము | : శ్రీ యు.ఎ.నరసింహమూర్తి |
| భవభూతి ఉత్తర రామచరితమ్ | : శ్రీ బేతవోలు రామబ్రహ్మం |
| 9 సంస్కృత నాటకాలు–కథాపరిచయం | : శ్రీ అద్దంకి శ్రీనివాస్ |
| తప్త హృదయము | : శ్రీ ఓగేటి పశుపతి |
| అమృత వర్షము | : శ్రీ ఉపాధ్యాయుల అప్పల నరసింహమూర్తి |
| మా నాయనగారు | : శ్రీ విశ్వనాథ అచ్యుత దేవరాయలు |
| మన తెలుగు నవలలు | : శ్రీ కడియాల రామమోహనరాయ్ |
| తెలుగు నాటకం ఉద్యమ నేపథ్యం | : శ్రీ కందిమళ్ళ సాంబశివరావు |

*ఇవికాక, అజో–విభొ–కందాళం నాటికల సంపుటాలు, ప్రతిభా వైజయంతి–అభినందన వార్షిక విశేష సంచికలు మొదలగునవి.*





## ఈ సంకలనంలోని కొన్ని కథల గూర్చి సుప్రసిద్ధ రచయితలు శ్రీ "వసుంధర" దంపతుల అభిప్రాయాలు...

**విదేశగమనే -**

"వాతావరణం సమకాలీన, ఇతివృత్తం అపూర్వం, కథనం అద్భుతం, భాష, శైలీ ప్రశంసనీయం, పాత్రలు వాస్తవం... సందేశం ముఖ్యంగా యువతరానికి ప్రయోజనాత్మకం..."

**టెల్గు సినిమా తీద్దాం రా -**

"...ఆద్యంతం నవ్వించే అసలు సిసలైన హాస్యరచన ఇది..."

**ఆ నవ్వు కోసం -**

"తల్లిని మించిన దైవం వేరే లేదనే విషయాన్ని ఎంత విలక్షణంగా చెప్పొచ్చో తెలుసుకుందుకు ఔత్సాహిక కథకులు తప్పక చదవాల్సిన కథ ఇది..."

**23 కిలోలు -**

"భాష, వాతావరణం, సంభాషణా చాతుర్యం, మనో విశ్లేషణ - అద్భుతంగా ఉన్న ఈ కథ చదవడం ఒక అనుభవం..."

**నాకు తెలిసిన టెన్సింగ్ నార్కే-**

"...సామాన్యుల్లోని అసామాన్యతను ప్రదర్శించే ఇటువంటి కథలు తరచుగా చదివినప్పుడే విలువలకు అనుగుణంగా మనని మనం సంస్కరించుకోవడం సాధ్యపడుతుంది. ఇతివృత్తం, కథనం పరంగా ఉన్నత శిఖరాలకు చేరుకున్న కథ ఇది..."